# తెలుగు సినిమాపాట చరిత్ర

డా॥ పైడిపాల

Best
Compliments...
., DC



NEW EDITION

SUNAYANA CREATIONS

# తెలుగు సినిమాపాట చరిత్ర

-డా॥ పైడిపాల

SUNAYANA CREATIONS

సునయన క్రియేషన్స్

40, జె.సి. ఇండస్ట్రియల్ ఏరియా

కనకపుర రోడ్, బెంగుళూరు - 560062

తెలుగు సినిమాపాట చరిత్ర
-డా॥ పైడిపాల

తృతీయ ప్రచురణ : మే 2011

ముఖ చిత్రం : బాపు

ప్రతులకు :

1. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
1-4-435, విజ్ఞాన భవన్
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001
& విశాలాంధ్ర వారి అన్ని శాఖలు

2. నవోదయ పబ్లిషర్స్
కార్ల్‌మార్క్స్ రోడ్
విజయవాడ - 520 002

3. అన్ని ఇతర ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు.

వెల : వెల : 200 రూ.
విదేశాలలో - 15 డాలర్లు.

డి.టి.పి. : ఆర్.కె.ఆఫ్‌సెట్ ప్రింటర్స్, అమలాపురం, ఫోన్ : 231419

ముద్రణ : నవతా ఆర్ట్ ప్రింటర్స్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ - 20.
ఫోన్: 040-65552357

హెచ్చరిక : సర్వహక్కులు రచయితవి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్ని ఎవరు వినియోగించ దలచుకున్నా రచయిత అనుమతి అవసరం!

# మూడవసారి ముస్తాబైన పుస్తకం ముచ్చట్లు..

1. నేను 1992లో అరవయ్యేళ్ల తెలుగు సినిమాపాట పరిణామక్రమాన్ని సమీక్షిస్తూ - 'తెలుగు సినిమాపాట పరిణామాలు, ప్రభావాలు' అనే సిద్ధాంత వ్యాసాన్ని మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించి పి.హెచ్.డి. పట్టాన్ని అందుకొన్నాను. ఆ పరిశోధన గ్రంథం ప్రముఖ నేపథ్యగాయకులు శ్రీ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం దృష్టిలో పడి, ఆయన సౌజన్యంతో ఆ యేడే చిన్న చిన్న మార్పులతో **'తెలుగు సినిమాపాట'** పేరుతో పుస్తక రూపంలో వెలువడింది.

'తెలుగు సినిమాపాట' 'ఆటా' మహాసభల్లో న్యూయార్క్‌లోను (3-5-92), ఘంటసాల విగ్రహావిష్కరణ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన మహాసభలో గానకోకిల లతామంగేష్కర్ అమృతహస్తాలతోను (14-2-93) ఆవిష్కరింపబడే అదృష్టానికి నోచుకొంది. ఆ తర్వాత పాఠకుల, విమర్శకుల అనూహ్యమైన ఆదరాభిమానాలతో ఏడాదికే ఆ పుస్తక ప్రతులు చెల్లిపోయాయి.

2. అయినా, తొందరపడి 'తెలుగు సినిమాపాట'ను పునర్ముద్రించ లేదు. ఎన్ని వుత్తరాలు, ఫోన్లు ప్రలోభపెట్టినా.. కొంతకాలం ఆగి పాఠకులు బ్రహ్మరథం పట్టిన ఆ రచనను మళ్లీ మళ్లీ విమర్శక దృక్పథంతో చదివితే నాకే కొన్ని లోపాలు కనిపించాయి. నాకు కనిపించినవీ, విమర్శకులు సూచించిన దోషాల్లో సమంజసమైనవీ సరిచేయడంతో తృప్తిపడక అప్పటి నుంచి పుష్కర కాలం పాటు సినిమాపాట స్వరూప స్వభావాల్లో వచ్చిన మార్పుల్ని కూడా పరిశీలించి, ఆ సమాచారాన్ని రెండవ భాగంగా చేర్చి 2005 ఆగస్టులో **'తెలుగు సినిమాపాట చరిత్ర'**ను ప్రచురించాను.

3. 'తెలుగు సినిమాపాట చరిత్ర' కూడా విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ప్రతులు కూడా త్వరగానే అయిపోయాయి. వివిధ విశ్వవిద్యాలయాలలో

ప్రామాణికమైన 'రిఫరెన్స్'గా వుపయోగపడుతున్న ఈ పుస్తక ప్రతులు ఎక్కడా లభించిక పోవడంతో మళ్లీ ఫోన్లూ... ఉత్తరాలూ.. ప్రారంభమయ్యాయి. ఈ కొరతను గమనించిన సునయన పబ్లికేషన్స్, బెంగుళూరు వారు అయాచితంగా ఈ గ్రంథాన్ని తిరిగి వెలుగులోకి తీసుకొని రావడానికి ముందుకొచ్చి తమ స్నేహహస్తాలను చాపారు. ఈ నేపథ్యంలో 'తెలుగు సినిమాపాట చరిత్ర'ను లోపరహితమైన సమగ్రమైన గ్రంథంగా పాఠకుల కందించాలనే నా దృఢ సంకల్పం ఈ తృతీయ ప్రచురణకు ప్రేరణ. నిజానికి యిది 2005లో వచ్చిన 'తెలుగు సినిమాపాట చరిత్ర'కు పరిష్కృత పునర్ముద్రణే అయినా - పాఠకులు మొదటి రెండు పుస్తకాలనూ వేర్వేరుగా చూడలేదు గనుక.. దీనిని తృతీయ ప్రచురణగా పేర్కొంటున్నాను.

4. పూర్వ ముద్రణల్లో నా అహాన్ని వెక్కిరిస్తూ చొరబడిన అచ్చు తప్పుల్ని, అసలు తప్పుల్ని సరిదిద్ది, ఈ ప్రతిని మానవసాధ్యమైనంత నిర్దుష్టంగా రూపొందించాను. పాఠకుల మెప్పు పొందినా, మొదటి రెండూ చిత్తుప్రతుల ల్లాంటివనీ, ఇది శుద్ధప్రతి అనీ నా అభిప్రాయం. దీనిలో అకారాది క్రమంలో సినిమాల జాబితాను 2010 వరకు పొడిగించాను. కాని 2005-2010 మధ్యకాలంలో తెలుగు సినీగేయవికాసాన్ని గురించి మరో భాగాన్ని రాయలేదు. కారణం 2010 డిశంబరు 15న విడుదలయిన నా **'తెలుగు సినీగేయకవుల చరిత్ర'** పుస్తకంలో చాల వరకు ఆ సమాచారం చోటుచేసుకోవడమే. దాదాపు రెండు దశాబ్దాల నిర్విరామ పరిశోధనతో రూపు దిద్దుకొన్న ఈ పుస్తకం ఈ రంగానికి సంబంధించి ప్రామాణికంగా నిలిచి తెలుగు సినిమాపాట అభిమానుల హృదయాల్లోనూ, గ్రంథాలయాల్లోనూ శాశ్వతంగా చోటు చేసుకుంటుందని ఆశిస్తూ..

**- పైడిపాల**

అమలాపురం,
4-4-11,
శ్రీ'ఖర'నామ ఉగాది.

ఫోన్ : 08856-232668
సెల్ : 99891-06162





**'తెలుగు సినిమాపాట' ఆవిష్కరణ సందర్భంగా రచయితను లతామంగేష్కర్ సత్కరిస్తున్న దృశ్యం. - 14-2-1993**



**'తెలుగు సినిమాపాట చరిత్ర' ను డాక్టర్ సి.నా.రె. ఆవిష్కరిస్తున్న దృశ్యం. - 25-9-2005**

## కృతజ్ఞతలు -

నా 'తెలుగు సినిమాపాట' నుదుటి మీద అదృష్టతిలకాన్ని దిద్ది దానికింత ఆయువును పోసిన పద్మభూషణ్ శ్రీ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం -

2005లో 'తెలుగు సినిమాపాట చరిత్ర' ప్రచురణకు సహకరించిన శ్రీ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ), రావులపాలెం -

చరిత్రకు అపచారం జరక్కూడదనే నా అభీష్టానికనుగుణంగా 'తెలుగు సినిమాపాట చరిత్ర'లో పొరపాట్లను సవరించి నిర్దుష్టమైన ప్రచురణగా తీసుకొచ్చే అవకాశాన్ని కల్పిస్తున్న సునయన పబ్లికేషన్స్, బెంగుళూరు -

2010 వరకు సినిమా జాబితాలను రూపొందించడానికి సమాచారాన్నిచ్చిన శ్రీ వి.యస్. కేశవరావు (సీనియర్ సబ్ ఎడిటర్, చిత్రప్రభ (ఆంధ్రప్రభ)) -

ఎనభయ్యేళ్ల తెలుగు సినిమాల జాబితా సవరణకు సహకరించిన శ్రీ యం.వి. రాయుడు (బెంగుళూరు), సినీ గేయకవుల జాబితాకు మరికొంత సమాచారాన్నిచ్చిన శ్రీ చంద్రబోస్ (సినీగేయ రచయిత, హైదరాబాద్) -

అచ్చుతప్పుల ఆగడాలను 'సవాల్' గా తీసుకొని వాటి పనిపట్టిన చిరకాల మిత్రుడు ప్రముఖ కవి శ్రీ యస్. అదృష్టదీపక్ -

'తెలుగు సినిమాపాట'కు గీసిన అద్భుతమైన ముఖచిత్రాన్ని చిరు మార్పులతో 'తెలుగు సినిమాపాట చరిత్ర'కు కూడా వినియోగించుకోడానికి అనుమతించిన సహృదయులు శ్రీ 'బాపు' -

నా తృప్తి మేరకు మార్పులు చేర్పులతో ఈ పుస్తకాన్ని రూపొందించిన ఆర్.కె.ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (అమలాపురం) అధిపతి కాళ్ళకూరి నాగవెంకట భూషణం, డి.టి.పి. నిపుణుడు యం.వి.జి. శ్రీనివాస్, సహనంతో సహకరించిన నవతా ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్ - అధిపతి 'సూరి' -

ఈ పరిశోధనకు కారకులైన యు.జి.సి. (ఢిల్లీ), గురుమిత్రులు డా.జి.వి.యస్. ఆర్. కృష్ణమూర్తి (చెన్నై), నిరంతరం సహకరిస్తున్న ప్రముఖ నిర్మాత శ్రీ కె. మురారి (చెన్నై), ప్రముఖ సినీగేయ రచయిత శ్రీ వెన్నెలకంటి-

తమ పాటల సమాచారాన్నిచ్చి సహకరించిన సినీగేయ కవిమిత్రులు-

పూర్వ ముద్రణలకు సముచిత గౌరవమిచ్చిన పత్రికాధిపతులు, ఆయా సమీక్షకులు -

ఇంకా ఎందరో శ్రేయోభిలాషులు.. మిత్రులు..

అందరికీ ధన్యవాదాలు...

**- పైడిపాల**



# ఈ పాట బాటలో సప్తస్వరాలు

## మొదటి భాగం (1931 - 1991)

1. నేపథ్యం (3-20)
ఎందులో తీసికట్టు? 3
పూర్వకృషి 16
ప్రస్తుత పరిశోధనాంశం 17
పరిమితులు 17
తెలుగు సినిమాపాట ప్రయోజనం 19

2. తెలుగు సినిమాపాట-పుట్టుపూర్వోత్తరాలు (21-89)
మూకీల ముచ్చట్లు 21
ప్రపంచంలో ప్రథమ చలనచిత్ర గీతం 23
తొలి భారతీయ చలనచిత్ర గీతం 24
తొలి తెలుగు సినిమా 24
తొలి తెలుగు సినిమాపాట 26
అరవయ్యేళ్ల పాటకు ఆరుదశలు (1931-91) 29
అరుణోదయం (1931-37) 29
భావోదయం (1938-50) 36
రాగోదయం (1951-60) 48
రసోదయం (1961-70) 58
చంద్రోదయం (1971-78) 63
అయోమయం (1979-91) 73
ఆరు కాలాల్లో ఆమని (1931-91) 83

3. సంప్రదాయం-సినీగేయం (90-160)
పురాణాలు - కావ్యాలు 92
(ఎ) సంస్కృత వాఙ్మయం 93
(బి) ఆంధ్ర వాఙ్మయం 107
నాటక సాహిత్యం 118
వాగ్గేయకార సాహిత్యం 133

| | | |
|---|---|---|
| 4. | జానపదం - సినీపదం | (161-208) |
| | వచనశాఖ | 163 |
| | దృశ్యశాఖ | 165 |
| | జానపద గేయాలు | 172 |
| 5. | ఆధునికత - సినీకవిత | (209-286) |
| | భావకవిత్వం | 209 |
| | జాతీయోద్యమం | 229 |
| | ఆంధ్రోద్యమం | 236 |
| | ఎర్రపుటలు | 239 |
| | అన్యభాషలు | 251 |
| | పాత పాటలు | 275 |
| 6. | నేటి పాట - రేపటి బాట | (287-299) |
| | అభిప్రాయ సేకరణ | 287 |
| | నేటి సినిమాపాట | 289 |
| | అనర్థధోరణులు | 290 |
| | పాటలు రాయడమంటే మాటలు కాదు | 298 |
| | ఆశాకిరణాలు | 298 |

## రెండవ భాగం (1992 - 2004...)

| | | |
|---|---|---|
| 7. | చీకటి వాకిట చిరు వెలుతురు | (301-341) |
| | పాట లేని చోటు లేదు | 301 |
| | ఈ దశ తమోమయం! | 313 |
| | అయినా... కొన్ని వెలుగులు ! | 324 |
| | 'గీత'లూ - రాతలూ ! | 337 |

ఇంకా...

| | | |
|---|---|---|
| తెలుగు సినిమాలు | (1931-2004) | 342 |
| సినిమా పాటల రచయితలు | ( " ) | 386 |
| అందరిలో కొందరు | ( " ) | 396 |
| సమీక్షలు-మ(మె)చ్చుతునకలు | | 404 |

# మొదటి భాగం
# (1931-91)

# నేపథ్యం

## సినిమాపాటపై పరిశోధనా !

ఈనాడు లోకం మనీమయమే కాదు - సినీమయం కూడా.

సినిమా ఈ శతాబ్దంలోనే పుట్టి పరిమళించిన సమాహార కళారూపం. సినిమాపాట జనసామాన్యానికి అందుబాటులోవుండి వారిని అమితంగా ఆకర్షిస్తున్న ఏకైక సాహితీరూపం. ఈనాడు తెలుగునాట ఒక పద్యం కూడా నోటికి రాని అక్షరాస్యులు చాలామంది వుండొచ్చు గాని సినిమాపాట ఒకటి రెండు పంక్తుల యినా రాని నిరక్షరాస్యులు అరుదు. ఇంతగా జనంలోకి చొచ్చుకొనిపోయిన సినిమాపాట నేడు వివాదాస్పదంగా మారింది. ఒక పక్క 'సినిమాపాట శాస్త్రీయ సంగీతానికి స్ఫూర్తినిచ్చిన సందర్భాలు కూడా వున్నాయి' అని కొందరు మెచ్చుకొంటుండగా మరోపక్క- 'సినిమాపాట వ్యాపారవస్తువు. అందులో సాహిత్యం నేతిబీరకాయలో నెయ్యిలాంటిది!' అని కొందరు వెక్కిరిస్తున్నారు.

సినిమాపాట వ్యాపార ప్రక్రియ అనేది కాదనలేం. అయినంతమాత్రాన ఏ గొప్ప కవిత్వానికీ తీసిపోని సినిమా పాటలు కొన్నైనా వున్నాయని అంగీకరించకుండా ఆ ప్రక్రియనే కొట్టిపారెయ్యడం అవివేకం. అటు సినిమాపాటల్ని యిటు యితర సాహిత్య ప్రక్రియలను ఏలిన ఎందరో రచయితలకు సినిమా పాటలవల్ల వచ్చిన గుర్తింపు మిగతావాటివల్ల - రాలేదు. అలాగే సినిమా సాహిత్యాన్ని గుర్తించి ప్రభుత్వం, జనసామాన్యం-సినిమా కవుల కిస్తున్న గౌరవసత్కారాలు మిగిలిన కవుల కెంత మందికి దక్కుతున్నాయి? సినిమాపాటకుండే ఆకర్షణతోపాటు అంతోయింతో ప్రతిభ లేనిదే ప్రజలు బ్రహ్మరథం పట్టరు కదా ! అందువల్ల సామాన్యులను సైతం అలరిస్తున్న సినిమాపాటల్ని సాహిత్యపరిధి నుంచి తొలగించడం కూడా అలాంటిదే. సినిమా పాటలకు సంబంధించిన పరిశోధన అనగానే- 'పరిశోధన ప్రమాణాలు యింత పడిపోయాయన్న మాట' అని బాధపడే మేధావులకూ విమర్శకులకూ యిక్కడో విషయం గుర్తుచెయ్యాలి.

బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'సింధుభైరవి' అనే తమిళచిత్రంలో కథానాయకుడు బాలగణపతి (జె.కె.బి.) శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడు. ఒక సభలో అతడు పాడిన త్యాగరాజకృతిని అభినందిస్తూనే అతని అభిమాని సింధు- "ఇతర భాషల్లో వుండే కృతులు గొప్పవే. కానీ అవి జనసామాన్యానికి అర్థం కావుకదా ! అందువల్ల కేవలం ఆ శాస్త్రీయగీతాలే కాకుండా అందరికీ అర్థమయ్యే తమిళ జానపదగీతాల్ని కూడా పాడకూడదా?" అని ప్రశ్నిస్తుంది. దానికి ప్రతిస్పందించి బాలగణపతి- 'నాటుపాటలా?' అని అడుగుతాడు. అప్పుడు సింధు 'పాడరియేన్ పడిప్పరియేన్..' అనే ఒక తమిళ జానపద గీతాన్ని (సంప్రదాయ సిద్ధమైన తమిళ జానపద పల్లవిని తీసుకొని సినిమాపాటగా మలిచారు.) పాడి- సభాసదులు కరతాళ ధ్వనులతో ఆమోదాన్ని తెలియజేయగా- 'ఇది-నాటుపాటా? దీనిలో లేని లక్షణాలేమిటో చెప్పండి' అని నిలదీస్తుంది. బాలగణపతి పశ్చాత్తాపపడతాడు. ఎంత గొప్ప విషయమైనా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగలిగితేనే అది సార్థకం- అనే సత్యాన్ని ఈ సంఘటనలో నిరూపించారు.

పై సంఘటనలో తమిళజానపదగీతం నాసిరకం పాట కానట్టే - ప్రజాసాహిత్య మైన తెలుగు సినిమాపాట కూడా చిన్నచూపు చూడదగినది కాదని శిష్టులు గ్రహించాలి.

## 1. ఎందులో తీసికట్టు ?

తెలుగుసినిమా పాటలో కవితకు గీటురాళ్లనదగిన, భాష, భావుకత, రసం, ధ్వని, అలంకారాలు, ఛందస్సు మొదలైన లక్షణాలు ఎంతవరకు వున్నాయో స్థాలీపులాకంగా సోదాహరణంగా పరిశీలిద్దాం.

**భాష :**

త్రిముఖాత్మక మయిన పాటలో సన్నివేశం-పాత్రలను బట్టి భాష వుంటుంది. ప్రసన్నత సాధారణార్థతగా పరిగణించబడే పాటలో అవసరమైనప్పుడు భాషమీద తగిన అధికారాన్ని కూడా సినిమాకవులు చూపించారనడానికి కొన్ని ఉదాహరణలు-

1. దూకింది దూకింది గంగ
ఉద్రేకాతిరేకాంతరంగ...
హరుని శిరమున పోటులెత్తగా
బ్రహ్మాండ భాండము బీటలెత్తగా
ఉల్లసత్ గంగా మహోర్మికా వీచికా
కల్లోల ధాటి ఒక కంట వీక్షించి
సురగంగ గరువమ్ము విరువంగ నెంచి
సంకీర్ణ పటు జటాచ్ఛటల నుప్పొంగించి
దుర్గమ్ముగా మలచినాడు
గంగ నద్భుతముగా బంధించినాడు...
జడయను అడవిని వడివడి అడుగిడి జాడ యెరుంగనిదై
తడబడి నడచుచు గడగడ వడకుచు సుడివడి పోయినదై
ఒకపరి యిటుచని ఒకపరి అటుచని మొకమే చెల్లనిదై
అగుపించని ఆ గగనగంగకై
ఆక్రందించె భగీరథుడు
ఆ మొరవిని సురధుని చెర విడిపించెను
కరుణాభరణుడు పురహరుడు (సి.నా.రె. - సీతా కల్యాణం)

2. రాగం తానం పల్లవి
నా మదిలోన కదలాడి కడతేరమన్నవి
నాదవర్తులై వేదమూర్తులై రాగకీర్తులై - త్రిమూర్తులై ॥రాగం॥

కృష్ణా తరంగాల సారంగ రాగాలు
కృష్ణలీలా తరంగిణీ భక్తిగీతాలు
సస్యకేదారాల స్వరస గాంధారాలు
సరస హృదయక్షేత్ర విమల గాంధర్వాలు
క్షీరసాగర శయన దేవగాంధారిలో నీపద కీర్తనసేయగా
(వేటూరి సుందరరామమూర్తి - శంకరాభరణం)

3. విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం... ఓం...
ప్రాణనాడులకు స్పందన నొసగిన ఆది ప్రణవ నాదం... ఓం...
కనుల కొలనులో ప్రతిబింబించిన విశ్వరూప విన్యాసం
ఎద కనుమలలో ప్రతిధ్వనించిన విరించి విపంచి గానం
సరసస్వర సురఝరీ గమనమౌ సామవేద సారమిది
నే పాడిన జీవన గీతం... ఈ గీతం...
(సీతారామశాస్త్రి - సిరివెన్నెల)

వ్యాకరణం, భాషాసంపద, ధారాశుద్ధి మొదలైన అంశాలలో సినిమాకవుల ప్రజ్ఞా పాటవాలకు విభిన్న సన్నివేశాలకు రాసిన పై పాటలు నికషోపలాలు. మొదటి ఉదాహరణమైన 'సీతాకల్యాణం' లోని గంగావతరణ ఘట్టంలోని పాట సాంప్రదాయిక రీతిలో శబ్దంలో కూడా గంగనడకను స్ఫురింపజేస్తుంది. ఆనడక పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలో లక్ష్మీదేవి అవస్థను గుర్తుకు తెస్తుంది. అలాగే వేటూరి పాటలో సంగీత శాస్త్ర రహస్యా లెన్నో దాగివున్నాయి.

**భావుకత :**

'అంత్య ప్రాసలు వేసినంత మాత్రాన ప్రొసైక్ భావం పొయెట్రీ అవదు - కవిత్వం ఒక ఆల్కెమీ. దాని రహస్యం కవికే తెలుసును' అని బాలగంగాధర తిలక్ అన్నట్లు - ఏ కవితకైనా హృదయాన్ని స్పందింపజేసే కవితాస్పర్శ ప్రాణం. సినిమా పాటల్లో (ర)సహృదయులను తన్మయులను చేసే భావ చిత్రాలెన్నో. మచ్చుకి రెండు మూడు -

**1. కొమ్మల మీద కోతి కొమ్మచ్చులాడింది**
**తెల్ల తెల్లని ఓ బుల్లి యెండ**
**నేలమీద వాలింది - వాలు మొగ్గ లేసింది**
**నల్ల నల్లని ఓ బుచ్చి నీడ**
**కొంచెంగా యెండ తీసి**
**గోరంత నీడ పూసి**
**గమ్మత్ గమ్మత్ బొమ్మలు చేసి**
**అమ్మాయిగారికి యివ్వనా -**
**(మల్లాది రామకృష్ణశాస్త్రి - కలిమిలేములు)**

ఇద్దరు చిన్నపిల్లలమధ్య సాగే ఈపాట - వాళ్ల ఆలోచనా పరిధిని స్ఫురింపచేస్తూ రూపకల్పన చేసిన అందమైన వెలుగునీడల బొమ్మ.

**2. చందమామా - అందాలమామా**
**నీ ఎదుట నేను - వారెదుట నీవు**
**మా ఎదుట ఓ మామ ఎప్పుడుంటావు**
**పెళ్లిచూపులకు వారొచ్చారు**
**చూడాలని నే ఓరగ చూశా**



**వల్లమాలిన సిగ్గొచ్చింది**
**కన్నులదాకా కన్నులు పోక**
**మగసిరి ఎడదనె చూశాను**
**తలదాచుకొనుటకది చాలన్నాను (ఆత్రేయ - తేనెమనసులు)**

అతి సాధారణమైన మాటల్లో వినవస్తున్న అసాధారణమైన పాటయిది. పరిచితమైన చందమామని ఆప్యాయంగా నువ్వని పిలుస్తూ - కాబోయే శ్రీవారిని గౌరవంగా 'వారు' అంటోంది పెళ్లికూతురు. తెలుగింటి పెళ్లికూతురు స్వభావానికిది అద్దం. పెళ్లిచూపుల్లో కళ్లతో కళ్లు కలపడానికి సిగ్గుతెర అడ్డొస్తే మగసిరిగల వక్షస్థలాన్ని చూపి జీవితాంతం తలదాచుకోవడానికి అది చాలనుకొందట... ప్రతిపదం సార్థకంగా ఎంత ఆచితూచి ప్రయోగించారు ఆత్రేయ !

3. అతడు: **గలగలమని నవ్వకే**
**సొగసు కరిగిపోతుంది**
**చిలిపి కళ్లు మూయకే**
**చీకటిపడిపోతుంది -**

ఆమె : **గుండె తలుపు తట్టకు**
**కోర్కె రేగిపోతుంది**
**కొంగుబట్టి లాగకు**
**వలపు ఒలికి పోతుంది**

అతడు: **నదిలా నువ్వు నడిచినంతమేరా**
**భూదేవికి ఆకుపచ్చ చీర (కోపల్లె శివరాం - గాలివాన)**

ఎంత మధురమైన భావన ! దీన్ని వ్యాఖ్యానిస్తే సొగసు తరిగి పోతుందేమో ! చిత్రం విజయవంతం కాకపోతే ఇలాంటి మాణిక్యాలు మట్టిలో కలిసిపోతాయి.

**రసం :**

అనుభవైకవేద్యమైన రసాన్ని సన్నివేశంలో కంటె మూడు నాలుగు నిమిషాల పాటలో పండించడానికి చాలా ప్రజ్ఞ కావాలి. సినిమా పాటల్లో రసరాజమైన శృంగారమే ఎక్కువ చోటు చేసుకున్నా - తక్కిన రసాలకు కూడా లోటులేదు.

1. ఏటి ఒడ్డున కూచుంటే
ఏరు గలగల మంటుంటే
నీటిలోన మన నీడలు రెండూ
వాటేసుకు పోతూవుంటే
ఓయమ్మా ఓయమ్మా ఈ జానెడు దూరం
ఓపలేకపోతున్నాను ఓయమ్మా (ఆత్రేయ - ఇదా లోకం)

కదులుతున్న అలలవల్ల నీటిలో నీడలు పెనవేసుకొంటుంటే వాటిని చూస్తూ పడుచుజంట రెచ్చిపోవడం... మనోహరమైన భావన ! ఇలా వాటేసుకొంటున్న నీడల్ని ఉద్దీపనవిభావంగా తీసుకొని శృంగారరసాన్ని పండించటం అపూర్వం !

2. ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో...
కన్న మహాపాపానికి ఆడది తల్లిగ మారి
మీ కండలు పెంచినది ఈ గుండెలతో కాదా
ఎర్రని తన రక్తాన్నే తెల్లని నెత్తురు చేసి
పెంచుకొన్న తల్లి ఒక ఆడదని మరిచారా
... ... ... ...
ప్రతి భారతసతి మానం చంద్రమతీ మాంగల్యం
మర్మస్థానం కాదది నీ జన్మస్థానం
మానవతకు మోక్షమిచ్చు పుణ్యక్షేత్రం... (వేటూరి-ప్రతిఘటన)

అధ్యాపకురాల్ని అల్లరి పెట్టబోయిన విద్యార్థులను చిత్రంలోని సన్నివేశంలోనూ - అశ్లీల పదాలను ఆబగా మాటాడుకునే ఆకతాయిలను బయటా నోళ్లు మూయించి గుండెలను పిండిన కరుణ రసార్ద్రగీతం యిది.

3. చెరసాలల శిరసులపై
ఉరికొయ్యల చివరలపై
ఎగురుతుంది తిరుగుబాటు బావుటా
సాయంకాలపు ఉరికంబం
తెల్లవారితే రవిబింబం
(శ్రీశ్రీ - విప్లవశంఖం)



'ఈ పాటకు వివరణలూ వ్యాఖ్యలూ అక్కరలేదు'[1] అని శ్రీశ్రీయే అన్నారు. ఇలా ఆవేశాన్ని రగిలించే వీరరస ప్రధానమైన సినిమా పాటలకు శ్రీశ్రీయే ఒరవడి.

ఇలా మిగతా రసాలకు కూడా సినిమాపాటల్లో మంచి ఉదాహరణలు ఉన్నాయి.

**ధ్వని :**

చెప్పదలచుకొన్నదానిని వాచ్యం చెయ్యకుండా ధ్వని పూర్వకంగా చెప్పడం ఉత్తమ కవితాలక్షణం. సినిమాపాటల్లో ధ్వనిని ఎక్కువగా శృంగారపరంగా వాడారు. వాటిలో ఉదాత్తమైనవి కూడా వున్నాయని చెప్పడానికి ఉదాహరణ -

కల్యాణగంధాలు కౌగిలికి తెలుసు
రసరమ్యబంధాలు రాతిరికి తెలుసు
పారాణి మిసమిసలు పదములకు తెలుసు
పడకింటి గుసగుసలు పానుపుకు తెలుసు
(మల్లెమాల-అంకుశం)

ప్రణయం అనుభవైకవేద్యం అనే దృష్టితో - ఆ తెలిసినవేవో వాచ్యం చెయ్యకుండా గోప్యంగా వుంచాడు కవి.

శబ్దాశ్రయమైన ఉత్తమధ్వనికి మరో ఉదాహరణ -

కొట్టుకొనిపోయెను కొన్ని కోటిలింగాలు
వీరేశ 'లింగ' మొకడు మిగిలెను చాలు. (ఆరుద్ర-ఆంధ్రకేసరి)

రాజమహేంద్రవరాన్ని వర్ణించే ఈ పాటలో - 'లింగం' అనే పదం మీద ధ్వనితో వీరేశలింగం ఎత్తుకు అద్దంపట్టారు ఆరుద్ర.

**అలంకారాలు :**

తెలుగు సినిమాపాటల్లో శబ్దాలంకారాలు - అర్థాలంకారాలు... కోకొల్లలు. ఈ అంశంమీద ప్రత్యేకంగా ఒక సిద్ధాంతగ్రంథమే రాయొచ్చు. ఉపమ, రూపకం, మొదలైన అర్థాలంకారాలు, వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస, అంత్యానుప్రాస మొదలైన

1. పాడవోయి భారతీయుడా. పుట. 95

శబ్దాలంకారాలు సినిమాపాటల్లో సర్వసాధారణం. కొన్ని ప్రత్యేకమైన అలంకారాలు చూద్దాం.

(అ) 1. **అమ్మ వంటిది, అంత మంచిది**
**- అమ్మ ఒక్కటే (ఆత్రేయ - కలసిన మనసులు)**

అమ్మకు సాటి అమ్మేనట ! ఇలా చెప్పడం అనన్వయాలంకారం. ఉపమానోపమేయత్వాలను ఒకే వస్తువుకు ఆరోపించి దానికదే సాటి అనడం ఈ అలంకారలక్షణం.

2. **కనులు కనులతో కలబడితే - ఆ**
**తగవుకు ఫలమేమి ?**
**- కలలే !**
**నా కలలో నీవే కనబడితే ఆ**
**చొరవకు బలమేమి ?**
**- మరులే !**
**మరులు మనసులో స్థిరపబడితే ఆపై**
**జరిగేదేమి ?**
**- మనువు !**
**మనువై ఇద్దరు ఒకటైతే ఆ**
**మనుగడ పేరేమి ?**
**- సంసారం !**

**(ఆత్రేయ - సుమంగళి)**

ఇలా ప్రశ్న జవాబు పద్ధతిలో సాగడం ఉత్తరాలంకార లక్షణం. దీనితో పాటు పైపాటలో ముక్తపదగ్రస్తం (ఒక పాదంలోని చివరిపదంతో తర్వాతి పాదాన్ని ప్రారంభించడం) అనే శబ్దాలంకారం కూడా వుంది.

నిరాడంబరంగా కనిపించే ఆత్రేయ పాటల్లోనే ఇన్ని అలంకారాలుంటే ఇక తక్కిన కవుల పాటల గురించి చెప్పాలా ? - అయినా స్థాలీపులాకంగా కొన్ని.

(ఆ) 1. **నవ్వులా అవి కావు నవపారిజాతాలు**
**రవ్వంత సడిలేని రసరమ్యగీతాలు (సి.నా.రె. - ఏకవీర)**



ఇందులో అపహ్నుతి అనే అలంకారం వుంది -ప్రస్తుత వస్తువులో అన్యవస్తు ధర్మాన్ని ఆరోపించడానికి ప్రస్తుతధర్మాన్ని మరుగుపర్చడం ఈ అలంకార లక్షణమయితే లక్ష్యంలో నవ్వు కాంతినీ శబ్దాన్నీ రెంటినీ చెప్పడం విశేషం.

2. **ఆలుమగలు విడిపోయినంతనే అనురాగాలే మారునా**
**విడిగా బ్రతుకులు గడిపినంతనే వివాహబంధం తీరునా**
... ... ... ... ...
**కోవెల తలుపులు మూసినంతనే దైవము దూరమై పోవునా**
**మనసున చీకటి ముసిరినంతనే మమతల వెలుగులు మాయునా**
**(సి.నా.రె. - వివాహబంధం)**

బింబప్రతిబింబ భావంతో సాగిన ఈ పాటలో దృష్టాంతాలంకారం వుంది. చివరి పంక్తిలో రూపకం కూడా చోటు చేసుకుంది.

2. కైముతిక న్యాయం (ఇదే ఇలా అయితే దాని సంగతి చెప్పాలా అనేది) తో చెప్పిన -
**పలుకరించితేనే ఉలికి ఉలికి పడతావు**
**నిన్ను ప్రేమిస్తే ఏంచేస్తావు**
**మనసు పెనవేస్తే ఏంచేస్తావు? (సి.నా.రె. - జమీందార్)**

అనేది అర్థాపత్తి అలంకారానికి ఉదాహరణం - ఇలా చెప్పుకుంటూ పోతే సి. నారాయణరెడ్డి పాటల నుంచి ప్రతి అలంకారానికి ఒకో లక్ష్యం చూపించవచ్చు.

(ఇ). చిన్నవస్తువులో పెద్ద వస్తువు ఇమిడి వుందని చెప్పడం అధికాలంకారం-

**పిట్ట మనసు పిసరంతైనా**
**ప్రపంచమంతా దాగుంది (దాశరథి-మూగమనసులు)**

దాశరథి పాటలో 'ఏకావళి' అలంకారానికి ఉదాహరణలు -

1. **వెన్నెలలో మల్లియలు**
**మల్లెలలో ఘుమఘుమలు**
**ఘుమఘుమలో గుసగుసలు (మనుషులు-మమతలు)**

2. గోదారి గట్టుంది
గట్టుమీద చెట్టుంది
చెట్టుకొమ్మన పిట్టుంది (మూగమనసులు)

ఇలా గ్రహించిన దానిని విడిచి, మళ్లీ కొత్తదానిని తీసుకొంటూ దానిని కూడా విడుస్తూ... చేసే శబ్దార్థాల ప్రయోగం ఏకావళి. పై ఉదాహరణల్లో ముక్తపదగ్రస్తం కూడా వుంది.

(ఈ) కాళింది మడుగున కాళీయుని పడగల
ఆబాలగోపాల మా బాలగోపాలుని
అచ్చెరువున అచ్చెరువున విచ్చిన కన్నులజూడగ
(వేటూరి-సప్తపది)

ఆబాలగోపాలము ఆ బాలగోపాలుని ఆచెరువులో (కాళింది మడుగు) ఆశ్చర్యంగా చూస్తుంటే అనే అర్థంలో - కవి శబ్ద చాతుర్యం ఎద ఝల్లనిపిస్తుంది. ఇలాంటి యమకాలూ గమకాలూ వేటూరి పాటల్లో ఎన్నెన్నో !

అర్థాలంకారాలలో కూడా వేటూరి ప్రయోగాలు అనేకం. మచ్చుకు రెండు-

1. గజ్జె ఘల్లుమంటుంటే
గుండె ఝల్లుమంటుంది
గుండె ఝల్లుమంటుంటే
కవిత వెల్లువౌతుంది (సిరిసిరిమువ్వ)

ఇలా పూర్వోత్తరస్థానాలను అతిక్రమించిన కారణాలతో కూర్చిన రచనను కారణమాలాలంకారం అంటారు.

2. నడకా హంసధ్వని రాగమా - అది
నడుమా - గగనంలో కుసుమమా (బంగారు కానుక)

అది నడకో హంసధ్వని రాగమో, నడుమో నింగిలోని పువ్వో నిశ్చయం కావడం లేదు. ఇలాంటి వ్యక్తీకరణ సందేహాలంకారం.

(ఉ) లబ్ధప్రతిష్ఠులైన కవులతోపాటు వర్ధిష్ణువులైన సినిమాకవులు కూడా అలంకారభరితమైన రచన పట్ల ఆసక్తి చూపడం ఆనందదాయకం.



1. ఆదిభిక్షువు వాడినేమి కోరేది
బూడిదిచ్చే వాడినేది అడిగేది
... ... ... ...
తీపిరాగాల ఆ కోకిలమ్మకు నల్లరంగు నలదిన వాడినేమి కోరేది
కరకు ఘర్జనల మేఘముల మేనికి
మెరపుహంగు కూర్చిన వాడినేమి అడిగేది (సీతారామశాస్త్రి-సిరివెన్నెల)

నిందచేత స్తుతినికాని స్తుతిచేత నిందకాని చేయడం వ్యాజస్తుతి అలంకారం. ఇందులో శివుని నిందచేత స్తుతిస్తూ పాట పొడవునా అలంకారాన్ని నిర్వహించడం కవి ప్రతిభకు నిదర్శనం.

2. కలలో తెరతియ్యాల - తియ్యగ ఎదవేగాల
వేగాలలో వేడి - వేడింది వెన్నంటి
వెన్నంటి నాసోకు - సోకింది నిన్నంటి
అంటుకున్న తీయని పగలుగ
పగలు రేయి కానీ చల్లగ
చల్లుతుంటె వలపులు జల్లుగ... (వెన్నెలకంటి - తేనెటీగ)

ఇలా మొత్తం పాటని ముక్తపదగ్రస్తాలంకారంలో నడిపిస్తూ - మరో ప్రయోగం కూడా చేశారు. రెండుసార్లు ఆవృత్తమైన పదాలకు అర్థభేదాన్ని పాటించి యమకాలంకారాన్ని కూడా జోడించారు. ఇలా రెండు క్లిష్టమైన శబ్దాలంకారాలను పాట పొడవునా నిర్వహించడం - సినిమా పాటల్లో అరుదైన ప్రయోగం.

3. వనరాణి... కవనవాణి
కలవాలి... కలలతేలి (జొన్నవిత్తుల - హైహై నాయకా)

ఈ పాటలో యమకాన్ని నిర్వహించిన ఈకవి - సభంగశ్లేషతో - సప్తస్వరాలతో ఒక సినిమాపాటనే రాయడం సాహస ప్రయోగం -

ఆమె : సరిగమ పదనిని నీ దానిని
సరిగా సాగని నీ దారిని
అతను : దాగని నిగనిగ ధగధగమని
దామరి మానిని సరిదారిని (స్వరకల్పన)

... ఇలా ఎన్ని చెప్పినా తనివి తీరదు.

## సంక్షిప్తత :

కవిత్వానికి క్లుప్తత, గుప్తత, ఆప్తత - వీటిని ప్రధాన లక్షణాలుగా చెప్పారు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచనకు సినిమా కవులలో ఆత్రేయ పెట్టింది పేరు - మచ్చుకి పెళ్లిని మూడు ముక్కల్లో ఎంత గొప్పగా చెప్పారో చూద్దాం :

**మూడే ముళ్లు ఏడే అడుగులు**
**మొత్తం కలసి నూరేళ్లు** **(త్రిశూలం)**

- ఆ 'మనసుకవే' మనసున్న మనిషి పడే ఆవేదనకు యిలా అద్దం పట్టారు.

**మనసులేని దేవుడు**
**మనిషికెందుకో మనసిచ్చాడు** **(ప్రేమలు - పెళ్లిళ్లు)**

అలాగే వేదాంత సారాన్ని సముద్రాల రెండు మాటల్లో చెప్పారు -

**జగమే మాయ బ్రతుకే మాయ**
**వేదాలలో సారమింతేనయా**
**ఈ వింతేనయా...** **(దేవదాసు)**

కొండని అద్దంలో చూపించినట్టు - ఇంత తేలిగ్గా ప్రజల కర్థమయ్యేలా చెప్పడం వేమన పద్యాల తర్వాత సినిమాపాటలకే సాధ్యమైంది.

## ప్రసన్నత :

తన కవితాలక్షణాలలో ప్రసన్న కథాకలితార్థయుక్తి ఒకటని నన్నయ్యే చెప్పుకొన్నాడు. వినీ వినగానే అర్థమయితే కవితా ప్రయోజనం నెరవేరుతుంది. ఆ ప్రసాదగుణం సినిమాపాటకి వరం. ఈ ప్రసన్నతకు అవగాహన వున్న కవులు రాసిన పాటలన్నీ ఉదాహరణలే. వాటిలో కొన్ని -

1. **బృందావనమది అందరిదీ**
**గోవిందుడు అందరి వాడేలే**
**ఎందుకె రాధా ఈసు నసూయలు**
**అందము లందరి ఆనందములే**
**(పింగళి - మిస్సమ్మ)**



2. **మనసున మనసై బ్రతుకున బ్రతుకై**
**తోడొకరుండిన అదే భాగ్యము, అదే స్వర్గము**
**(శ్రీశ్రీ - డాక్టర్‌చక్రవర్తి)**

3. **అనుకొన్నామని జరుగవు అన్నీ**
**అనుకోలేదని ఆగవు కొన్ని**
**జరిగేవన్నీ మంచికని**
**అనుకోవడమే మనిషి పని** **(ఆత్రేయ - మురళీకృష్ణ)**

విన్నవాడు తల పగలగొట్టుకోవలసిన అవసరం లేకుండా ఎంత హాయిగా వున్నాయి ఈ పాటలు !

## ఛందస్సు :

ఛందస్సు పద్యాలకే కాదు - పాటలకూ వుంది. దానినే సినిమా పరిభాషలో కొలత అంటారు. దానితోపాటు అంతర్లయ లేనిదే పాట గానయోగ్యం కాదు... సినిమాల్లో పద్యాలు రాసిన కవులు ఎక్కువ సంఖ్యలోనే వున్నారు. వారిలో శ్రీశ్రీ రాసిన ఓ సినిమా పద్యం -

**అంహో దుర్భరమాయె భారతము ! గర్వాంధుల్ దురార్భాట సం**
**రంహుల్ స్వార్థపరుల్ చరింతురిట వీరల్‌సేయు ఘోరాలపై**
**సింహంబోయన లేచి నేనిక మహోక్ష్వేళాధ్వనిన్ వీరలన్**
**సంహారంబొనరించు శక్తిని జగన్మాతా ప్రసాదింపుమా**

'పంతులమ్మ' చిత్రంలో శివాజీ నాటకంకోసం రాసిన ఈ పద్యం గురించి శ్రీశ్రీ రాసిన వ్యాఖ్య - సినీకవులకున్న ఛంద: పరిజ్ఞానానికి నిదర్శనం.

"... ఎవరో ఇందులోని తుది పాదంలో యతి భంగమయిందన్నారు. ('సం'తో 'న్మా' కుదరదనుకొని) దానికి ముందు పాదంలోని వీరలన్ లోవున్న నకారపు పొల్లుతో 'న్మా'కు యతి కుదిరిందన్నాను. ఇటువంటి ఛందో రహస్యాలు చాలామందికి తెలియవు. [2]

2. పాడవోయి భారతీయుడా. పుట. 78

ఇంకా - పదలాలిత్యం, సామాజిక స్పృహ, మొదలైన వాటిని ముచ్చటించవచ్చు - కాని - సినిమాపాట కూడా సాహిత్య ప్రక్రియే అని ఒప్పుకోడానికివి చాలు.

## 2. పూర్వకృషి :

విమర్శకుల ఆక్షేపాలను లెక్కచెయ్యకుండా ఈ పరిశోధకుడికి ముందే ముగ్గురు వివిధ విశ్వవిద్యాలయాల్లో సినిమాపాటలకు సంబంధించిన పరిశోధనలు చేశారు. అవి - కె. హెచ్. లక్ష్మణరావు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన (1979) లఘు సిద్ధాంత వ్యాసం - 'తెలుగు సినిమాపాటలపై జానపద వాఙ్మయ ప్రభావం', టి. గౌరీశంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టం కోసం సమర్పించిన - (1985) 'తెలుగు సినిమాపాటల్లో సాహితీ మూల్యాలు' సిద్ధాంత వ్యాసం; చిట్టిబోయిన కోటేశ్వరరావు ఆంధ్ర విశ్వకళా పరిషత్తుకు పిహెచ్.డి. పట్టం నిమిత్తం సమర్పించిన 'సినిమా పాటల్లో సాహిత్యపు విలువలు (సాంఘికాలు 1936-86)'. పైమూడు సిద్ధాంతవ్యాసాలలో మొదటిది సినిమాపాటల మీద జానపదగేయ ప్రభావాన్ని చర్చించింది కాగా - మిగిలిన రెండూ సినిమాపాటల్లో సాహిత్యపు విలువలను అంచనావెయ్యడానికి పరిమితమైనవి. ఇంకా బిరుదవోలు మైథిలి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టం కోసం సమర్పించిన 'తెలుగు నవల - సినీ జీవితచిత్రణ' (1987) సిద్ధాంతవ్యాసం కూడా సినిమాలకు సంబంధించినదే. అయితే అది సినిమా వికాసానికీ సినిమావాళ్ల జీవితాలకూ సంబంధించింది తప్ప - సినిమా సాహిత్యానికి కాదు. సరోజిని అనే మరో పరిశోధక విద్యార్థిని 'తెలుగు సినిమాపాటలపై భావకవితా ప్రభావం' అనే లఘు సిద్ధాంత వ్యాసాన్ని ఎం.ఫిల్ పట్టం కోసం కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించనున్నట్టు తెలిసింది. విద్యాసంస్థలకు బయట సినిమాపాటలపై జరిగిన కృషిలో 'జానపద సాహిత్యం'లో ఎల్లోరా రాసిన - 'సినిమాలలో జానపదగేయాలు' అనే ప్రకరణం, ఆరుద్ర, వి.ఎ.కె.రంగారావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఇంటూరి వెంకటేశ్వరరావు, ఎమ్వీయల్ మొదలైనవారు వివిధ సందర్భాలలో సినిమాలపై రాసిన వ్యాసాలు, ఉప్పులూరి విశ్వేశ్వరయ్య (కర్నూలు) 'సినిమాపాటల్లో అలంకారాలు' అనే అంశంమీద కృషిచేసి రాసిన అముద్రిత వ్యాసం... చెప్పుకోదగినవి.

"నాపూర్వుల భుజాల నధిరోహించడంవల్ల నేనెక్కువ దూరాన్ని చూడగలుగుతున్నాను" అని న్యూటన్ అంతటి విజ్ఞానశాస్త్రవేత్త సవినయంగా



చెప్పాడు. సినిమాపాటలపై యింతవరకూ జరిగిన కృషి తప్పకుండా ఈ పరిశోధకుడికి కొంత ఉపకరించింది.

## 3. ప్రస్తుత పరిశోధనాంశం :

అయితే యింతవరకు తెలుగుసినిమాపై వచ్చిన వ్యాసాలలో నటీ నటులకు దర్శకనిర్మాతలకు ఇచ్చిన ప్రాముఖ్యం రచయితలకు ఇవ్వలేదు. లభ్యమౌతున్న పాత సినిమాపాటల పుస్తకాల్లో కొన్నిటిలో ఇతర సాంకేతిక నిపుణుల పేర్లను యిచ్చి రచయితలను మాత్రం నిర్లక్ష్యం చేశారు. అలాగే యింత వరకు సినిమాపాటలపై వచ్చిన రచనలు, పరిశోధనవ్యాసాలు - పాటల్లోని విలువలను సొగసులను చూపడానికే పరిమితమయ్యాయి. 1931లో పుట్టిన తెలుగు సినిమాపాట ఏఏ దశల్లో ఏఏ ప్రభావాలవల్ల ఏఏ పరిణామాలు చెంది - ప్రస్తుత రూపాన్ని పొందింది అనే చారిత్రకాధ్యయనం మీద ఎవరి దృష్టీ ప్రసరించలేదు. రూపుమాసిపోతున్న ఆ చరిత్రమీద యిప్పుడైనా కృషి జరిగితే తప్ప భావితరాలకు అది మిగలదు. వారికి ఆ ఆసక్తి కలిగినా అప్పటికి ఈ ఆనవాళ్లు కూడా చెరిగిపోయే ప్రమాదముంది. అందువల్లే పరిశోధనకు ఈ అంశాన్ని ఎంచుకోవడం!

## 4. పరిమితులు :

ఏ రెండు గడియారాలు ఖచ్చితంగా ఒకే కాలాన్ని చూపించవనే సామెతలా - ఈ అరవయ్యేళ్ల కాలంలో వచ్చిన తెలుగు సినిమాల వివరాలు కూడా వాటిని భద్రపరిచిన పత్రికలలో, వ్యక్తుల దగ్గర ఒకేలా లేవు. అన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించిన పిమ్మట - 1991 చివరివరకు తెలుగులో వచ్చిన చిత్రాలు - 3550 అనీ, వాటిలో అనువాద చిత్రాలుపోను - నేరుగా తీసిన చిత్రాలు సుమారు - 2700-అనీ తేలింది. వీటిలో 1931 నుంచి 1949 వరకు వచ్చిన చిత్రాలసంఖ్య 149 కాగా, 50ల దశకంలో వచ్చిన చిత్రాల సంఖ్య 223. అప్పటినుంచి చిత్రాల సంఖ్య పెరిగింది. తెలుగు సినిమాలలో 50ల దశకం వరకు కొన్ని సినిమాల్లో 20కి మించిన పాటలు కూడా వున్నాయి. 50ల దశకంలో సరాసరిని పదేసి పాటలున్నాయి. ఇప్పుడా సంఖ్య అయిదారు పాటలకు తగ్గింది. ఇవన్నీ లెక్కవేస్తే ఇంతవరకు నేరుగా తీసిన తెలుగు సినిమాల్లో వచ్చిన పాటలు సుమారు 21వేలు. వీటిలో 15వేల వరకు పాటల్ని సేకరించి వాటి

నుండి పరిశోధన పరిధిలోనికి వచ్చే పాటల్ని ఎంపిక చేసుకోవడం జరిగింది.

ఇది ప్రభావాలకు సంబంధించిన చర్చ గనుక - అనువాద చిత్రాల్లోని పాటలమీద - ఆయా భాషల ప్రభావం అప్పటికే వుంటుంది గనుక ... అవి మౌలికమైన తెలుగు రూపాలు కావనే దృష్టితో వాటిని పరిశోధనకై స్వీకరించలేదు. అలాగే తెలుగు సినిమాపాట పరిణామం మీద అన్యభాషల ప్రభావాన్ని చర్చించడానికి పరిశోధకుడి అల్పజ్ఞానం వల్ల సౌకర్యం కోసం దాన్ని ప్రధానంగా ప్రభావితం చేస్తున్న ఆంగ్ల హిందీ తమిళ కన్నడ భాషలకు ఆ చర్చను పరిమితం చేయవలసి వచ్చింది.

పాటకీ పద్యానికీ కొంత తేడా వున్నప్పటికీ సినిమాలకు సంబంధించినంత వరకు రెండింటికీ అవినాభావ సంబంధం వుంది. నిజానికి ఉత్సాహ, మత్తకోకిల, పంచచామర మొదలైన వృత్తాలు పాటల గమనానికి ఒదిగేవే. యక్షగానాల్లో యిలా ఒదిగే పద్యాలను పాటలుగా పాడేవారుకూడా. సినిమాల్లో కూడా చాలా పద్యాలను పాటలుగా వినియోగించుకొన్నారు. ఈ దృష్టితో పద్యాలను కూడా ఈ పరిశోధన పరిధిలోకి తీసుకోవడం జరిగింది.

సినిమాపాట త్రిముఖాత్మకం. ఆ మూడు ముఖాలు సాహిత్యం, సంగీతం, సన్నివేశం. ఈ మూడు కలిపి పండితేనే ఒక పాట విజయవంతమవుతుంది. కాని ఈ పరిశోధనలో సాహిత్యానికి మాత్రమే ప్రాధాన్యాన్నిస్తూ అవసరమైనప్పుడే సన్నివేశ సంగీతాలను స్పర్శించడం జరిగింది.

మొట్టమొదటి తెలుగుటాకీలో నటించిన ఎల్.వి. ప్రసాద్, సింధే కృష్ణాజీ రావు వంటి పెద్దలతో ప్రారంభించి పాటలతో సంబంధమున్న నేటి చలనచిత్ర ప్రముఖుల వరకు వీలైనంత ఎక్కువమందిని సంప్రదించి, పాత సినిమాపాటల పుస్తకాలను సేకరించి, సాధ్యమైనంతవరకు పాత సినిమాలను చూసి, గ్రామఫోను రికార్డులను విని... బహుముఖంగా సమాచారాన్ని సేకరించడం జరిగింది. అయితే పాటల పుస్తకాలలోని సాహిత్యంలో తప్పులు కోకొల్లలు. ఒకరి పేరుకు బదులుగా మరొకరి పేరు పడిన సందర్భాలు కొన్నికాగా, ఒకే సినిమాకు యిద్దరు ముగ్గురు పాటలు రాసినపుడు ఏ పాట ఎవరిదో తెలుసుకునే అవకాశం లేకుండా పాటల పుస్తకంలో పాటకు ముందో చివరో రచయిత పేరు యివ్వకుండా అందరి పేర్లు అట్టమీద మాత్రం ప్రచురించిన సందర్భాలు ఎన్నో. ఇవన్నీ పరిశీలించి సరైన రూపాల్ని, వాటి రచయితల్ని తెలుసుకోవడానికి ఈ పరిశోధకుడు చాలా



అవస్థలు పడవలసి వచ్చింది. తప్పనిసరి అయినప్పుడు సినిమాపత్రికలు సినిమా సాహిత్యాభిమానులందించిన సమాచారం వంటి ద్వితీయశ్రేణి ఆకరాలమీద కూడా ఆధారపడవలసి వచ్చింది.

## 5. సినిమాపాట ప్రయోజనం :

గృహసంబంధమైన వేడుకలు, సంస్థల ఉత్సవాలు, కష్టజీవుల పనులు... యిలాంటి సందర్భాల్లో తప్ప నిజజీవితంలో పాటలకవకాశంలేదు. కాని సినిమాలలో అనేక సందర్భాలలో - ముఖ్యంగా ప్రణయసన్నివేశాలలో ఆయా పాత్రలు పాడినట్లు చూపిస్తారు. ఈ పాటల ప్రయోజనం ఏమిటి ? అనే సందేహం కలగడం సహజం. మాటల్లో చెప్పలేని ఏ అనుభూతినైనా అందంగా మనసుకు హత్తుకునేలా చెప్పడానికే పాట! దీనినే 'పెళ్లి కానుక' చిత్రంలో 'మనసునే మరపించుగానం' అని ఆత్రేయ అంటే - 'గోరింటాకు' చిత్రంలోని పాటలో వేటూరి తన కవితాపరిభాషలో 'మనసు మాటకందనినాడు మధురమైన పాటవుతుంది' అన్నారు. పని-పాట అనేది అనాదిగా వస్తున్న మాట. పనిలో తమ శ్రమను మర్చిపోవడానికి ఉపశమన సాధనంగా జనంలో ప్రారంభమైన పాట క్రమంగా వినోద సాధనంగా మారింది. అలా జనంలో పుట్టి పెరిగిన పాట నాటకాలద్వారా సినీరంగ ప్రవేశం చేసింది. తొలినాటి సినిమాలలో ఉపశమనం **(relief)**, ఉత్సాహం, పాత్రనిరూపణ, కథా నిర్వహణ-పాటల ప్రయోజనాలు. అయితే వాటిలో అధికశాతం వాచ్యంగా వుండేవి. రానురాను సినిమాపాట ధ్వని, క్లుప్తత, ఆప్తత మొదలైన లక్షణాలను అలవర్చుకొని ప్రేక్షకులకు తలలో నాలుకైంది - సినిమాకు ప్రాణమైంది. సినిమాలవల్ల పాటలకు, పాటలవల్ల సినిమాలకు జనంలో ఆదరణ పెరిగింది. పాటలులేని సినిమాలను ఊహించలేని పరిస్థితి ఏర్పడింది. పాటలు లేకుండా 1950లో ఏ.వి.యం. వారు తీసిన 'ఆందనాళ్' (తమిళం) 1967లో చక్రవర్తిచిత్ర తీసిన 'సుడిగుండాలు' వంటి చిత్రాలు నిర్మాతలను నిరాశపర్చాయి.[3] మరోపక్క కథాబలం లేని అనేక చిత్రాలు కేవలం పాటలవల్ల విజయం సాధించాయి.

కొన్ని సంస్థల చిత్రాలను నటీనటులతో ప్రమేయం లేకుండా కేవలం మంచి పాటలకోసమే జనం చూస్తారు. అటువంటి సంస్థలలో 80ల దశకంలో చెప్పుకోదగింది యువచిత్ర.

3. కె.యస్. ప్రకాశరావుతో ముఖాముఖి. 16.7.'90

తమ సంస్థ పాటకోసం పాట కాకుండా అది కథలో ఒక భాగంగా- అనేక సన్నివేశాల్లో చెప్పవలసిన దాన్ని ఒకే ఒకపాటలో సమర్థంగా చెప్పవచ్చనే అభిప్రాయంతో పాటలను రాయిస్తున్నట్టు ఆ సంస్థ అధినేత మురారి చెప్పారు. అయితే చాలమంది నిర్మాతలు దర్శకులు ఆ దృష్టితో కాకుండా పాటల్ని ముఖ్యంగా యుగళగీతాల్ని వినోదసాధనాలుగానే వినియోగిస్తున్నారు.

బెంగుళూరులో మాతృభాష తెలుగుకాని ఒక ప్రేక్షకుడు 'పునర్జన్మ' సినిమాను 'ఎవరివో నీవెవరివో' అనే పాటకోసం మళ్లీ మళ్లీ చూసి పాట అయిపోగానే వెళ్లిపోయేవాడనే విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీశ్రీ 'పాటలులేని సినిమా అంటే ఉప్పులేని భోజనంగా తయారయిపోయింది' అన్నారు.[4] అన్ని కోణాలనుంచి పరిశీలించి చూస్తే నేడు చెడ్డపాట సినిమా అపజయానికి కారణం కాకపోయినా -మంచిపాట మాత్రం చిత్రవిజయానికి దోహదం చేస్తోంది - అని తెలుస్తోంది.

పాటకు స్థూలంగా సమానార్థకాలైన గేయం, గీతం, పదం, కీర్తన మొదలైన అనేక పదాలున్నా తెలుగునాట పాట అనే మాటే ఎక్కువగా వాడుకలో వుంది. అది తెలుగుమాట గనుక !

* * *

4. ఏడేళ్ళనాటి శ్రీశ్రీ సినిమా ఇంటర్వ్యూ - సితార. 15.6.'89



# తెలుగు సినిమాపాట పుట్టుపూర్వోత్తరాలు

## సాకీ :

ఈనాడు సినిమాపాట జనజీవితంలో ఓ భాగం. ఇంటా బయటా నిత్యం దానిని వినని వాళ్లు అరుదు. వినోదాల్లో వేడుకల్లో సినిమాపాటలు వినిపించడం పరిపాటే. కాని పొలాల్లో, రాజకీయ ప్రచారాల్లో, ఆసుపత్రుల్లో, ఆఖరికి ఆధ్యాత్మిక కూటాల్లో కూడా సినిమాపాటలు వినిపించడం వీటి సర్వవ్యాపకత్వానికి నిదర్శనం.

నిత్య జీవితంలో ప్రేమలో, పెళ్లిలో, విరహంలో, విజయంలో, ఓటమిలో, ఓదార్పులో... ఇలా అనేకానేక సందర్భాల్లో భావప్రకటనకు సినిమాపాట ఓ సాధనమైపోయింది. సినిమాపాటల్లోని ముక్కలు చతురోక్తులుగా సామెతలుగా వేదాంత వాక్యాలుగా కథలకూ, కవితలకూ, నవలలకూ సినిమాలకూ పేర్లుగా బహుధా చలామణీ అవుతున్నాయి. యాచననుంచి భజన వరకూ సినిమాపాటలో వాటి నకళ్లో వినిపిస్తున్నాయి. ఆకాశవాణి, దూరదర్శన్ కార్యక్రమాల్లో సినిమా పాటలకున్న ఆదరణ వేటికుంది?

సినిమాపాట ప్రభావం కూడా తక్కువది కాదనడానికి శ్రీశ్రీ రాసిన ఈ వాక్యమే సాక్ష్యం. "ఎంతవరకు నిజమో నాకు తెలియదు కాని - ఆత్మహత్య చేసుకోబోయిన ఒక వ్యక్తి 'కలకానిది విలువైనది' అన్న పాటను విని ఆ ప్రయత్నం విరమించుకొన్న ఉదంతం ఎవరో చెప్పగా విన్నాను."[1]

'శంకరాభరణం' చిత్రం విడుదలయిన తర్వాత శాస్త్రీయ సంగీత పాఠశాలల్లో రద్దీ పెరగడం సినిమాపాట శక్తికి మరో ప్రసిద్ధ ఉదాహరణం.

ఇంతగా మన బ్రతుకులతో ముడివడిపోయిన సినిమాపాట పుట్టుపూర్వోత్తరాలను టూకీగా తెలుసుకొందాం.

## 1. మూకీల ముచ్చట్లు :

సినిమా అనే పదం 'కినెమా' అనే గ్రీకు పదంనుంచి వచ్చింది. కినెమా అంటే పురోగమనమని అర్థం. 1889 అక్టోబరులో థామస్ అల్వా ఎడిసన్, డికెన్‌సన్

1. పాడవోయి భారతీయుడా. పుట 36

అనే శాస్త్రవేత్తలు సంయుక్తంగా కినెటోస్కోప్ కనుగొనడంతో అంతవరకు వున్న మాజిక్ లాంతర్లు అంతర్ధానమై వాటి స్థానంలో సినిమాలాంటిది ఊపిరి పీల్చుకొంది. అది క్రమంగా మెరుగై యిప్పటి సినిమాలా రూపొంది - 1913 వరకు హ్రస్వ చిత్రయుగం నడిచింది. ఆపైన ఈ మూకీ చిత్రాల నిడివి పెరిగి కథకు ప్రాముఖ్యం హెచ్చింది.

1896లోనే భారతదేశంలో (బొంబాయిలో) చలనచిత్ర ప్రదర్శన ప్రారంభమైనా 1910 వరకు స్వదేశీ చిత్రాలు రాలేదు. 1910లో 'ఆర్.జి.టోర్నే' 'భక్త పుండలీక్' అనే మూగచిత్రాన్ని నిర్మించారు. అయితే విదేశీ సాంకేతిక నిపుణుల సహకారంతో రంగస్థల నాటకాన్ని యథాతథంగా తెరకెక్కించడంచేత - ఆయన భారత చలనచిత్ర పితగా గుర్తింపు పొందలేదు. ఆ తర్వాత 1911లో వచ్చిన 'రాజదర్బారు' భారతదేశంలో మొదటి మూకీగా పరిగణింపబడింది. కాని విదేశీ శాస్త్రజ్ఞుల సహకారం లేకుండా నిర్మించిన పూర్తి నిడివి మూకీ 1913లో వచ్చిన 'రాజా హరిశ్చంద్ర'యే. కాబట్టే ఆ చిత్రనిర్మాత దాదాసాహెబ్ ఫాల్కే భారతీయ చలనచిత్ర పితగా పరిగణింపబడ్డారు.

క్రీస్తు జీవితం (లైఫ్ ఆఫ్ క్రైస్ట్) అనే చిత్రాన్ని చూసి స్ఫూర్తి పొంది ఫాల్కే 'హరిశ్చంద్ర' చిత్రాన్ని నిర్మించారు. ఆ కాలంలో చంద్రమతి పాత్రను ధరించడానికి స్త్రీ లెవరూ సాహసింపలేకపోయారు. ఫాల్కే బొంబాయిలోని వేశ్యావాటికలకు కూడా వెళ్లి అన్వేషించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఫాల్కే 'సాలుంకే' అని పురుషుడిచేత ఆ పాత్రను వేయించారు.

1923లో రఘుపతి వెంకయ్య నిర్మించిన 'భీష్మ' - తెలుగువారు నిర్మించిన తొలి మూకీ. దానిని కొందరు పరిశోధకులు మొదటి తెలుగు మూకీగా పేర్కొనడం సరికాదు.[2] మూకీకి భాష ఏమిటి?

సరికొత్త దృశ్యప్రక్రియ అయిన నిశ్శబ్ద చలనచిత్రం కొత్తలో ఆసక్తిదాయకంగానే వున్నా, రానురాను ప్రేక్షకులకు ఏదో వెలితి అనిపించసాగింది. ప్రేక్షకుల అసంతృప్తిని గమనించిన ప్రదర్శకులు మొదట ప్రదర్శనశాలల్లో వ్యాఖ్యాతలను నియమించారు. ఆ తర్వాత నాటకాల్లోలాగే తెరముందు ప్రేక్షకుల దృష్టికి అవరోధం కాకుండా గొయ్యివంటి భాగంలో వాద్యగోష్ఠిని ఏర్పాటు చేసి సంఘటనలకు అనుగుణమైన శబ్దాలను, సంగీతాన్ని వినిపించి రసానుభూతికి దోహదం చేశారు. అయినా మూకీలు నాటకాల పోటీని తట్టుకుని నిలబడలేకపోయాయి... అప్పుడు

2. తెలుగు సినిమాపాటలపై జానపద వాఙ్మయ ప్రభావం - సినిమా ప్రభావం - పరిణామం



ప్రేక్షకులకు సంతృప్తిని కలిగించడం కోసం మూకీ చిత్రాలలోనే వాద్యగోష్ఠిద్వారా పాటల్ని వినిపించడం ప్రారంభించారు. అలా ఆనాడు ప్రదర్శింపబడిన పాశ్చాత్య చిత్రాల్లో 'బ్యూటిఫుల్ బ్లూ లాగూన్' 'హార్ట్స్ అండ్ ఫ్లవర్స్' 'మై లోన్లీ హార్ట్' వంటి పాటల్ని ఆయా సందర్భాలకు అనుగుణంగా వినిపించారు. 'జల్‌మే చమ్ కె జల్‌కే మచ్చరియా' 'ఉంగ్లీ మారోరి మోరీ' 'మత్ బోలో బహార్‌కే బతియా' వంటి రాగాశ్రయ గీతాలు, జానపదాలు వాద్యగోష్ఠి ద్వారా భారతీయ చిత్రాలలో వినిపించేవారు. ఈ పాటలు ప్రత్యేకంగా ఆ సినిమాలకోసం రాసినవి కావు. ఆయా సందర్భాలకు సరిపోయే ప్రజారంజకమైన పాటలు మాత్రమే. భారతీయ చిత్రాలకు వాద్య సమ్మేళనంలో తబలా, హార్మోనియం ఉపయోగించేవారు. ఈ వాద్య కళాకారులే మూకీ చిత్రాలకు సంగీత దర్శకులన్నమాట. ఈవిధంగా చాలామంది అనుకునే దానికి భిన్నంగా సినిమాల్లో వాద్యగోష్ఠి ద్వారా వినిపించబడిన పాటలు టాకీలతో కాదు - మూకీలతోనే ప్రారంభమయ్యాయి.

## 2. ప్రపంచంలో ప్రథమ చలనచిత్ర గీతం :

అక్టోబరు 6వ తేదీ 1927న వార్నర్ ప్రదర్శన శాలలో 'జాజ్ సింగర్' **(Jazz singer)** అనే కథాకమామీషూ వున్న మొదటి శబ్దచిత్రం ప్రదర్శింపబడింది. పాత కొత్త తరాలకు మధ్య సంఘర్షణ ఇందులోని ఇతివృత్తం. మత సంబంధమైన గీతాలు పాడే యూదుల ప్రార్థనా మందిరం (సినగాగ్)లోని యూదు గాయకుడు తన కొడుకు వృత్తిపరంగా తన వారసుడు కావాలని కోరుకుంటాడు. కాని అతని ఆశయానికి భిన్నంగా కొడుకు జాజ్ సింగర్ అవుతాడు. కొడుకు 'జాకీ రాబినోవిట్జ్'గా ఆల్ జాల్సన్ నటించాడు[3].

ఈ చిత్రంలో బహుళ ప్రచారం పొందిన ఏడు పాటలున్నాయి. వీటిలో చిన్నప్పటి కథానాయకునిగా నటించిన బాబీ గార్టన్ పాడిన 'మై గాల్ సాల్' **(My Gal Sal)** అనే పాట చిత్రంలో వినిపించే మొదటి పాట. ఇదే ప్రపంచంలో మొదటి సినిమాపాట! పాల్ డ్రెస్సర్ ఈ గీతాన్ని రచించి స్వరకల్పన చేశారు. ఇది కూడా జాల్సన్ పాడాడనే కొందరు అభిప్రాయపడుతున్నా -- గొంతు గుర్తు పట్టడానికి వీల్లేకుండా వుండడం వల్ల 'డర్టీ హేండ్స్ డర్టీ ఫేస్' **(Dirty Hands Dirty Face)** అనేది జాల్సన్ పాడిన మొదటి పాటగా పరిగణింపబడుతోంది.

3. The Birth of the Talkies

## 3. తొలి భారతీయ చలనచిత్ర గీతం :

భారతదేశంలో మొట్టమొదటి టాకీ ఆర్దేషిర్ ఇరానీ నిర్మించిన 'ఆలం ఆరా'. 'షో బోట్' అనే పాశ్చాత్య టాకీని చూసి ముగ్ధుడై శబ్ద గ్రహణ యంత్రాన్ని దిగుమతి చేసుకుని ఇరానీ నిర్మించిన 'ఆలం ఆరా' 14.3.31న బొంబాయిలోని మెజెస్టిక్ థియేటర్‌లో విడుదలై సంచలనం కలిగించింది. ఇది పాశ్చాత్య సాంకేతిక నిపుణుల సహాయం లేకుండా నాలుగు నెలల కాలంలో నలభై వేల రూపాయల వ్యయంతో నిర్మింపబడిన 10,500 అడుగుల చిత్రం. ఇదే మొదటి భారతీయ శబ్ద చిత్రం.

ఈ చిత్రంలో ఫకీరు పాత్ర ధరించిన డబ్ల్యు. ఎమ్. ఖాన్ పాడిన

**దేదే ఖుదాకె నామ్ సే**
**ప్యారే! తాఖత్ హై గర్ దేనే కీ**
**కుచ్ చాహే అగర్‌తో మాంగ్‌లే**
**ముఝే హిమ్మత్ హై మగర్ దేనే కీ**

(నీకు ఇవ్వగలిగిన తాహతు వుంటే దేవుడి పేర ఇవ్వు. నీకు ఏదైనా అడగ గలిగిన ధైర్యముంటే -- అప్పుడది కావాలని అడుగు) బాగా ప్రాచుర్యం పొందిన మొదటి పాట. భారతీయ షేక్స్‌పియర్‌గా పేరు పొందిన ఆగా హష్ర్ కాశ్మీరీ ఈ పాటను రచించారు. కాని రచయిత పేరు గాని సంగీత దర్శకుని పేరుగాని తెరమీద వేయక పోవడం -- రచయితల పట్ల చలనచిత్ర పరిశ్రమకుండే చిన్న చూపుకు నిదర్శనమేమో! ప్రముఖ చలనచిత్ర నిర్మాత ఎల్.వి. ప్రసాద్ ఆ పాట చిత్రీకరణ సమయంలో ప్రత్యక్ష సాక్షి కావడం తెలుగువారికి గర్వకారణం[4]. అప్పటికి ముందుగా పాటలను రికార్డు చేసే అవకాశం లేదు గనుక నటీనటులు నటిస్తున్న సమయంలోనే నృత్యగానాదులను నిర్వహింపవలసి వచ్చేది. నేపథ్య గానం 1935లో గాని రాలేదు. 'ఆలం ఆరా' ప్రభావం వల్ల అది విడుదలయిన సంవత్సరంలో 22 హిందీ చిత్రాలు, మూడు బెంగాలీ చిత్రాలు ఒక తమిళ చిత్రం, ఒక తెలుగు చిత్రం విడుదల కావడం -- టాకీ చిత్రాల పట్ల గల ఆదరణకు నిదర్శనం.

## 4. తొలి తెలుగు సినిమా :

'ఆలం ఆరా' విడుదలయ్యే నాటికి దాక్షిణాత్యులనేకులు బొంబాయి కలకత్తాలలోని చలనచిత్ర పరిశ్రమలో అనుభవం గడించారు. రాజా శాండో మూకీ

4. ఎల్.వి.ప్రసాద్‌తో ముఖాముఖి 29.7.89



చిత్రాలలో ప్రాచుర్యం పొందిన కథానాయకుడైతే -- వై.వి. రావు నటునిగా అనుభవం సంపాదించారు. హెచ్.ఎం. రెడ్డి కృష్ణాఫిలిమ్స్‌లో సమర్థుడైన నిర్వాహకునిగా పేరు తెచ్చుకొన్నారు. నేటి తెలుగు చలనచిత్ర పరిశ్రమ మూల స్తంభాలలో ఒకరైన ఎల్.వి. ప్రసాద్ ముంబాయిలోని ఇంపీరియల్ కంపెనీలో నెలసరి జీతంమీద నటునిగా పనిచేసేవారు. ఇంతమంది దాక్షిణాత్యులకు చలనచిత్ర రంగంలో అనుభవం వున్నా -- టాకీ చిత్ర పరిశ్రమ బొంబాయి కలకత్తాల్లోనే నెలకొని వుండడంవల్ల -- తొలి తెలుగు చిత్రం బొంబాయిలో నిర్మింపబడింది. అది ఇంపీరియల్ మూవీటోన్ బొంబాయి వారు నిర్మాతలుగా హెచ్.యం. రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'భక్త ప్రహ్లాద'. దీనికి సుమారు ఒక నెల ముందు హెచ్.యం. రెడ్డి దర్శకత్వంలోనే 'కాళిదాసు' చిత్రం కూడా విడుదలయింది. కాళిదాసు తమిళ చిత్రంగా ముద్ర వేసుకొన్నా, నిజానికి అది పూర్తిగా తమిళ చిత్రం కాదు; ద్విభాషా చిత్రం. ఈ చిత్రంలో కథానాయకునిగా నటించిన పి. శ్రీనివాసరావు తెలుగు భాగవతారు కాగా --కథానాయిక విద్యాధరి పాత్రధారిణి తమిళనటి టి.పి. రాజ్యలక్ష్మి. కారణాలేమైనా ఈ సినిమాలో శ్రీనివాసరావు భాగవతారు పాడిన కొన్ని తెలుగు పాటలున్నాయి. అయినా పూర్తిగా తెలుగు మాటలు పాటలతో విడుదలయిన మొదటి చిత్రం 'భక్త ప్రహ్లాద'యే గనుక దాన్నే తొలి తెలుగు చిత్రంగా పరిగణించడం సమంజసం.

నాటక పితామహ ధర్మవరం రామకృష్ణమాచార్య కృతమైన 'భక్త ప్రహ్లాద' నాటకాన్నే సినిమాగా తీసినట్టు ఆ తరం వారంతా ముక్త కంఠంతో చెపుతున్నారు. సినిమాలోని తారాగణం, సాంకేతిక నిపుణులు కూడా చాలావరకు ఆ నాటకాన్ని ప్రదర్శించిన సురభి నాట్యమండలి సభ్యులే. మునిపల్లె వెంకటసుబ్బయ్య హిరణ్యకశిపుని పాత్రనూ, సురభి కమలాబాయి లీలావతి పాత్రనూ ధరించారు. ఆ చిత్రంలో ప్రహ్లాద పాత్ర ధరించిన సింధే కృష్ణాజీరావు, చండామర్కుల శిష్యుడు, ప్రహ్లాదుని సహాధ్యాయి అయిన మొద్దబ్బాయి పాత్రను ధరించిన ఎల్.వి. ప్రసాద్ ఈనాటి ప్రత్యక్షసాక్షులు. ఇంకా ఆ సినిమా చూసిన జ్ఞాపకం వున్న పెద్దలు కూడా కొందరున్నారు. అయితే వీరెవరూ 'భక్త ప్రహ్లాద' చిత్రంలోని పాటలకు సంబంధించిన వివరాలను మాత్రం చెప్పలేకపోతున్నారు. ఇప్పుడు 'భక్త ప్రహ్లాద' ప్రింటు కూడా అలభ్యమే. ఈ సినిమాకు పాటల పుస్తకం కూడా ప్రచురించినట్టులేదు. ఈ స్థితిలో 'భక్త ప్రహ్లాద' చిత్రం ధర్మవరం వారి నాటకానికి మక్కికి మక్కి కాదనడానికి కొన్ని నిదర్శనాలు దొరికాయి. వాటినుంచే తొలి తెలుగు సినిమాపాటకు సంబంధించిన ఈ క్రింది సమాచారం కూడా లభించింది.

## 5. తొలి తెలుగు సినిమా పాట :

తెలుగు నాటకాల్లో అంతవరకు పద్యాలు మాత్రమే వుండగా పాటల్ని కూడా ధర్మవరం కృష్ణమాచార్యులు ఆయన రచించి ప్రదర్శించిన 'చిత్రనళీయం'తో ప్రవేశ పెట్టినట్లు నాటకరంగ చరిత్ర! రామకృష్ణమాచార్యులకు ముందుగా వచన నాటకాన్ని రచించి, ఆ తర్వాత పద్యాలనూ పాటలనూ అనుబంధంగా కూర్చడం అలవాటు. అలాగే ఆయన తమ 'భక్త ప్రహ్లాద' నాటకానికి కూడా 40 పాటలను సమకూర్చి పద్యాలను మాత్రం పోతన భాగవతం నుంచి తీసుకొన్నారు. పోతన పద్యాలు జనం నోళ్లలో నానుతుండడంవల్ల అవి నాటకవిజయానికి దోహదం చేస్తాయనే అభిప్రాయంతో రచయిత వాటిని గ్రహించి వుండవచ్చు. ఇక 'భక్త ప్రహ్లాద' సినిమా సంగతికి వస్తే -- పోతన పద్యాలూ, ధర్మవరం వారి కొన్ని పాటలతో మరికొన్ని పాటలు కూడా చోటుచేసుకొన్నట్టు ఆధారాలు లభించాయి. ఆ చిత్రంలో లీలావతి పాత్ర ధరించిన సురభి కమలాబాయి ఇంటూరి వెంకటేశ్వరరావు కిచ్చిన ఇంటర్వ్యూలో తను సినిమాలో పాడిన మొట్టమొదటి పాటగా 'భక్త ప్రహ్లాద' చిత్రంలోని 'పరితాప భారంబు...' అనే పాటను పేర్కొన్నారు. ఆమె పల్లవిని మాత్రమే చెప్పిన ఆ పాటకు పూర్తి పాఠం యిది

**పరితాపభారంబు భరియింప తరమా**
**కటకట నేవిధి గడువంగ జాలుదు**
**పతియాజ్ఞను దాటగలనా**
**పుత్రుని కాపాడగలనా**
**ఈ విషము నేనెటులను**
**తనయుని త్రావింపగలను?**
**ధర్మము కాపాడుదునా**
**తనయుని కావగ గలనా?**

ఈ పాట చదవగానే సన్నివేశం అర్థమవుతోంది. లీలావతి భర్త హిరణ్య కశిపుడు ఆమెను ప్రహ్లాదునికి విషాహారాన్ని యివ్వవలసిందిగా ఆజ్ఞాపిస్తే -- ఆమె దు:ఖించడం. ఈ పాటే కాదు; ఇలాంటి ఘట్టమే ధర్మవరం వారి నాటకంలో లేదు. మరి ఈ పాట 'భక్తప్రహ్లాద' సినిమాలోకి ఎలా వచ్చిందోనని పరిశోధిస్తే -- కొన్ని ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి.



ఈ పాటను ఈనాటికీ సురభి నాట్యమండలి వారు ప్రదర్శిస్తున్న 'భక్త ప్రహ్లాద' నాటకంలో పాడుతున్నట్టు -- సురభి నాటకకళా సంఘం నిర్వాహకులు ఎస్.ఏ. బాబారావు తెలియజేస్తూ పాట ప్రతిని పంపించారు. ఈ ప్రతి, 'భక్త ప్రహ్లాద' కోసం తమ తండ్రిగారైన చందాల కేశవదాసు రచించినవిగా పేర్కొంటూ చందాల కృష్ణమూర్తి (ఖమ్మం) పంపిన మూడు పాటలలో ఒకటి -- ఒకేలా వుండడం ఈ పాట 30ల దశకంలో అచ్చయిన నూతన గ్రామఫోను కీర్తనలనే పుస్తకంలో లభించడం[5] -- ఈ పాట రాసిన కవి చందాల కేశవదాసు అనే అభిప్రాయాన్ని కలిగించాయి.

కేశవదాసు 'శ్రీకృష్ణ తులాభారం' మొదలైన ఇతర నాటకాలకు రాసినట్టే 'భక్త ప్రహ్లాద' నాటకానికి కూడా పాటలు రాయగా సరస్వతీ బుక్ డిపో, విజయవాడవారు ప్రచురించారు. కేశవదాసు 'కనకతార', 'లంకాదహనం' చిత్రాలకు రచన చేయడం, శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో మూడు ప్రసిద్ధమైన పాటలు ఆయనవి కావడం, దర్శకులు హెచ్.యం. రెడ్డి కేశవదాసును సినిమా పనులమీద పిలిపిస్తూండేవారని ఆధారాలు లభించడం -- ఇవన్నీ పైపాట కేశవదాసు రచన అనడానికి బలమైన సాక్ష్యాలు. ఈ పాటతోబాటు కృష్ణమూర్తి పంపిన మరో రెండు పాటలు కూడా నూతన గ్రామఫోను కీర్తనల[6] లో లభించాయి.

మొదటిది లీలావతి పాత్ర ధారిణి -- సురభి కమలాబాయి పాడిన పాట. లీలావతి ప్రహ్లాదునికి నచ్చజెపుతూ పాడే ఈపాట నాదనామక్రియ రాగంలో వుంది--

**"తనయా ఇటులన్ తగదుర బలుకా తండ్రిమాట వినకా**
**సకల సద్గుణంబులకు నిధివై శాంతి మార్గావలంబకుడవునై**
**జనకు కంటె గురుదైవ మెవ్వరిల, ప్రేమభరిత ఇటు తగునా**
**శత్రుత్వమున్ జూపగన్"**

ఈ పాటను అనుసరిస్తూ చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో వచ్చిన భక్త ప్రహ్లాద (1942) చిత్రంలో --

**"వినవే నా తనయా నీ జనకుండను మాటలన్**
**మనసులో నితరముగను దలపగనగురా..."** అనే పాట వుంది.

రెండోది లీలావతిని చెరబట్టిన ఇంద్రుని నిందిస్తూ హిరణ్య కశిపుడు పాడేపాట.

5. పుట సంఖ్య; 90
6. పుట ; 88

మునిపల్లె వెంకట సుబ్బయ్య పాడిన ఈ పాట మధ్యమావతి రాగంలో వుంది --

**"భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక ఇటు చేసెదవా**
**భీరుడవై క్రూరుడవై చోరుడవై పారుడవై**
**నాదగు సతినిటులన్ నీవిటు చెరగొనన్ నాదగు సామర్థ్యంబరయగ**
**నెంచితివె ఖండ ఖండములుగ ఖండించెద నిను దుండగీడ"**

ఈ ఆధారాలను పరిశీలిస్తే 'భక్త ప్రహ్లాద' చిత్రంలో కేశవదాసు రచించిన మూడు పాటలున్నాయని స్పష్టమవుతోంది.

తొలినాళ్లలో వచ్చిన సినిమాలు తెరకెక్కిన రంగస్థల నాటకాలు మాత్రమే. ఇప్పటిలా దృశ్యాలను వెనకాముందు కాకుండా ఒక వరుసలో నాటక క్రమంలోనే సినిమా కూడా తీసేవారు గనుక ధర్మవరం వారి 'భక్త ప్రహ్లాద' నాటకంలో ప్రథమాంకం ప్రథమ రంగంలోని --

'వింతాయెన్ వినన్ సంతసమాయెనుగా' అనేది సినిమాలోని మొదటి పాటగా చిత్రీకరింపబడి వుండవచ్చునని పలువురి అభిప్రాయం. ఇప్పటికీ సురభివారి ప్రదర్శనలో ఇదే మొదటి పాట అని ఎస్.ఏ. బాబారావు తెలియజేశారు. హిరణ్యాకశిపునికి తపోభంగం చేయడానికి వెళ్లిన రంభాది అప్సరసలు అతడు తపస్సు చేస్తున్నవాడు చేస్తున్నట్టే మరణించాడని భ్రమించి ఆ విషయం దేవేంద్రునికి నివేదిస్తారు. ఆ సంతోష సమయంలో రంభ గానం చేసిన పాట --

**'వింతాయెన్ వినన్ సంతసమాయెనుగా**
**దేవేంద్రా సంతసమాయెనుగా సురనాథా**
**అడగెను దేవారి బెడిదపు దపమున**
**గూరివడి ప్రాణం బెడబాసి**
**మనసున నానందంబును మిగులుగ**
**నీవొంద దనుజుండు మృతి జెందె'**

ఈ పాట తొలి తెలుగు చిత్రంలో చిత్రీకరించిన మొదటి పాట కావచ్చు. కాని సినిమా కోసం రాసిన పాటమాత్రం కాదు. 'భక్త ప్రహ్లాద' చిత్రం ధర్మవరంవారి నాటకం ఆధారంగా నిర్మించినా -- చిత్ర నిర్మాణ సమయానికి రామకృష్ణమాచార్యులు బ్రతికిలేరు. ఆయన 1912 నవంబరు 30న మరణించారు.[7] పోతన పద్యాలు కాని

7. ధర్మవరం కృష్ణమాచార్యులు. పుట ; 55



ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకం కాని సినిమాకోసం రాసినవి కావు గనుక కేశవదాసు సినిమాకోసం రాసినా అంతకుముందే నాటకం కోసం రాసినా -- ఆయన జీవించి వుండగా ఆయన అనుమతితో, సినిమా అవగాహనతో చేసిన చేర్పులు మార్పులతో ఆ పాటల్ని దర్శకుడు సినిమాలో ఉపయోగించడం వల్ల చందాల కేశవదాసును (1876-1956) తొలి సినీ కవిగా పేర్కొనడం సమంజసం.

## 6. అరవయ్యేళ్ల పాటకు ఆరు దశలు :

సినిమాపాట బాల్యారిష్టాలను దాటి నిలదొక్కుకొని వేసిన అడుగుల్ని నడిచిన నడకల్ని బట్టి ఈ అరవయ్యేళ్ల కాలాన్ని (1931-1991) ఆరు దశలుగా విభజించుకోవచ్చు. సాహిత్యచరిత్రను కొన్ని యుగాలుగా విభజించుకొన్నట్లే సినిమాపాట చరిత్రలో కాలానుగుణంగా సాహిత్యపరంగా వచ్చిన మార్పులను బట్టి పరిశోధన దృష్టితో ఈ విభజన జరిగింది. అరవయ్యేళ్ల చరిత్రలో -- సముద్రాల, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, సి. నారాయణ రెడ్డి వంటి కవులు మూడేసి దశాబ్దాలకు పైగా నిలిచి సినిమా పాటలు రాయడం వల్ల సాహిత్యచరిత్రలోలాగా కవుల పేర్లతో ఈ విభజన చెయ్యడం కష్టం. అందువల్ల ఆయా కాలాల్లో వచ్చిన ప్రధానమైన పరిణామాలను బట్టి ఈ చరిత్రను 1. అరుణోదయం (1931-37) 2. భావోదయం (1938-50) 3. రాగోదయం (1951-60) 4. రసోదయం (1961-70) 5. చంద్రోదయం (1971-78) 6. అయోమయం (1979-91) అనే ఆరు దశలుగా పరిగణింపవచ్చు. సౌకర్యం కోసం పెట్టిన ఈ పేర్ల ఔచిత్యం ఆయా దశలను విశ్లేషించే సందర్భాలలో అర్థమౌతుంది.

### అరుణోదయం (1931-37) :

దీనిని నాటకకవుల శకం అనవచ్చు. ఈ దశలో కవులకు గుర్తింపు తక్కువ. ప్రసిద్ధమైన రంగస్థల నాటకాలనే తెర కనువదించడం వల్ల అప్పటి పాటలకు సినిమా బాణీ అంటూ ఒకటి ఏర్పడలేదు. ఆనాటి సినిమాపాటల పుస్తకాలలో ఇతర సాంకేతిక నిపుణులతోపాటు కవుల పేర్లను ప్రచురించిన సందర్భాలు అరుదు. కేవలం నాటకకర్తల పేరు ప్రఖ్యాతులను బట్టి గాక విజయవంతమైన నాటక సమాజాల ప్రదర్శనలను బట్టి సినిమాలను రూపొందించడం వల్ల -- కవులు సినిమా రచనను వృత్తిగా చేసుకొనే అవకాశం లేకపోయింది.

తొలిదశలో తెలుగు చిత్రాలను నిర్మించడానికి బొంబాయిలోని ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీ, కలకత్తాలోని ఈస్టిండియా ఫిల్మ్ కంపెనీ పోటీ పడ్డాయి. 1933లో

రెండు 'రామదాసు' చిత్రాలు, రెండు 'సావిత్రి' చిత్రాలు విడుదల కావడం దీనికి నిదర్శనం. ఈ కంపెనీలు ఆంధ్రదేశంలో పేరు పొందిన నాటక సమాజాలను కాంట్రాక్టు పద్ధతి మీద బొంబాయి కలకత్తా నగరాలకు పిలిపించి -- నటుల్ని, సాంకేతిక నిపుణుల్ని, సాహిత్యాన్ని వీలైనంతవరకు మార్చకుండా నాటకాలనే తెరకెక్కించేవారు. ఇటువంటి సమాజాల్లో చెప్పుకోదగినవి సురభి నాట్యమండలి, మైలవరం బాలభారతీ సమాజం. సురభిలో మునిపల్లె సుబ్బయ్య, కమలాబాయి మొదలైనవారు, మైలవరం సమాజంలో వేమూరి గగ్గయ్య, నిడుముక్కల సుబ్బారావు, రామతిలకం ప్రభృతులు ప్రధాన పాత్రధారులు. హెచ్.యం. రెడ్డి సురభి నాట్యమండలి వారితోను, సి. పుల్లయ్య మైలవరం సమాజంతోను చిత్రాలు నిర్మించారు. 1932లో అసంపూర్ణంగా మిగిలిన ఘంటసాల రాధాకృష్ణయ్య 'రామదాసు'ను సి. పుల్లయ్య సమర్థంగా పూర్తి చేయడంతో ఆయనకు 'సావిత్రి' చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం కలిగింది.[8] 1934లో ఆయన దర్శకత్వంలో విడుదలయిన 'లవకుశ' ఆర్థికంగా విజయవంతమై ప్రేక్షకులకు సినిమా పట్ల మోజు కలిగించిన మొదటి సినిమా అని చెప్పుకోవచ్చు.

1934లో చిత్రపు నరసింహారావు దర్శకత్వంలో విడుదలయిన 'సీతాకల్యాణం' మద్రాసులో (వేల్ పిక్చర్స్ స్టూడియోలో) నిర్మించిన మొదటి తెలుగు చిత్రం.[9] 1936లో 'సంపూర్ణ రామాయణం' తీసిన నిడమర్తి సూరయ్యగారి దుర్గా సినీటోన్ స్టూడియో (రాజమండ్రి) తెలుగు చిత్రాల కోసం తెలుగునాట ఏర్పాటు చేసిన మొదటి స్టూడియో. ఇలా సినిమాల తొలినాటి చిత్రనిర్మాణ సంస్థలను స్మరించడం -- ఆ సంస్థలు రూపొందించిన పౌరాణిక చిత్రాలనూ, వాటికి మాతృకలైన నాటకాలనూ గురించి తెలుసుకోడానికే.

## ప్రభాత 'కీర్తనలు' :

నిస్సందేహంగా 1938 వరకు వచ్చిన చిత్రాలలోని పాటలూ పద్యాలలో అధికశాతం అప్పటికి బాగా ప్రచారం పొందిన నాటకాలలోనివే. అప్పటి వరకు సినిమాలు నాటకాలతో పోటీ పడుతుండేవి గనుక ప్రజాదరణ కోసం వ్యాప్తిలో వున్న సాహిత్యాన్ని, సంగీత బాణీలను ఉపయోగించుకోవడం తప్ప సినిమాల కోసం ప్రత్యేకంగా పాటల్ని, పద్యాల్ని ఎక్కువగా రాయించేవారు కాదు. ఆనాటి సినిమా పాటల్ని కూడా నాటక పరిభాషలోనే 'కీర్తనలు' అని వ్యవహరించేవారు. పద్యాల్ని చదవడం, కీర్తనలను

8. సి.యస్.రావుతో ముఖాముఖి 5.8.89
9. తెలుగు సినిమా పరిశ్రమ - ఇంటూరి వ్యాసం



పాడడం అనేవారు. సాధారణంగా పద్యాలకు కర్ణాటకసంగీత శాస్త్రీయ రాగాలను, పాటలకు హిందూస్థానీ సంగీత బాణీలనే యిష్టపడేవారు. వర్తమానజీవితాన్ని చిత్రించడానికి హిందుస్థానీ నాటక బాణీలలో వున్న సౌలభ్యం కర్ణాటక రాగాలకు లేకపోవడం వల్ల కీర్తనలకు హిందుస్థానీ బాణీలను ఆనాడు ఆశ్రయించడం విశేషం. అయితే అద్దంకి శ్రీరామమూర్తి, సూరిబాబు మొదలైనవారు కర్ణాటక సంగీత శాస్త్రీయ రాగాలలో పద్యాలను చదివినా -- రఘురామయ్య, సి.యస్.ఆర్, జొన్నవిత్తుల శేషగిరిరావు ప్రభృతులు హిందూస్థానీ బాణీల పట్లే ఎక్కువ మక్కువ చూపించేవారు. మైలవరం నాటక సమాజం కోసం చందాల కేశవదాసు, దైతా గోపాలం మొదలైన కవులు రచించిన కీర్తనలకు పాపట్ల కాంతయ్య ప్రభృతులు కట్టిన బాణీలు ప్రజల నుర్రూతలూపి సినిమాల కెక్కాయి. ఆనాటి పత్రికలలో -- 'ప్రేక్షకుల హర్షధ్వానాల నందుకొన్న రంగస్థల పద్యాలు, కీర్తనలు ఈ చిత్రంలో వినవచ్చు' అని ప్రకటనలివ్వడం రంగస్థలానికి వెండితెరకు వుండే అనుబంధానికి నిదర్శనం. అప్పుడు చిత్రాల్లో నటించడానికి శరీర సౌష్ఠవం కంటె గాత్ర సౌలభ్యానికే ప్రాముఖ్యాన్నిచ్చేవారు. ప్లేబాక్ పద్ధతి తెలుగులో అప్పటికింకా రాలేదు గనుక పాటలు పద్యాలు పాడగలగడం నటీనటులకు ప్రధానార్హతగా పరిగణింపబడేది. చలనచిత్రాల తొలిదశలో రాజ్యం యేలిన యడవల్లి సూర్యనారాయణ, తుంగల చలపతిరావు, కపిలవాయి రామనాథశాస్త్రి, వేమూరి గగ్గయ్య, సురభి కమలాబాయి, రామతిలకం, కన్నాంబ మొదలైన వారంతా రంగస్థల గానానికి ప్రసిద్ధులై సినీరంగ ప్రవేశం చేసినవారే.

## హిందూస్థానీ సంగీత ప్రభావం :

ఆ కాలంలో తెలుగు సినిమాల్లోని కీర్తనలమీదనే కాదు ; భారతీయ భాషల్లోని అన్ని సినిమా పాటలమీద - హిందూస్థానీ సినిమా సంగీత ప్రభావం ఎక్కువగా వుండేది. ఉదాహరణకు 'లవకుశ' (1934)లో సీతారాముల యుగళ గీతం -- 'ముదమాయెగా నాథా' అనే పాట బాణీ -- సైగల్ పాడగా ప్రచారం పొందిన గ్రామఫోన్ రికార్డు -- 'ఝులనా ఝులా ఆవోరీ...' బాణీకి అనుకరణ. అలాగే 'కుచేల' (1935)లో రఘురామయ్య పాడిన 'తెలియగా నా లీల జగతిన్' పాటకు 'మురళికే ధున్ సఖీరె ఆజ్' అనే ప్రసిద్ధమైన మరాఠీ బాణీ ఆధారం.[10]

అలాగే 'సతీసక్కుబాయి' నాటకం (తర్వాత సినిమాల్లో వచ్చింది) లోని --

10. సంగీతరావుతో ముఖాముఖి.

**'కృష్ణా పోబోకుమా**
**పరమాత్మా పరంధామా పోబోకుమా'**

అనే పాటకు 'కిసీ గానే జీ తులా' అనే మరాఠీ పాట బాణీ ఆధారమట.[11]

ఆనాటి పాటల్లోని పదాల కూర్పును గమనిస్తే సహజమైన తెలుగుతనం లోపించడం స్పష్టంగా తెలుస్తోంది --

1. **దీనావనుడ నే జగతిన్**
   **చానలారా సంతాప ముడుగుడీ** (కృష్ణలీలలు)

2. **ఏలా సదయా**
   **మేలా ప్రేమా నిరసన సేయ**
   **ప్రియ కాంతన్ విడువన్**
   **నాథా మనసు ఇటు కఠినంబె**
   **నిజదాసిన్ మఱవన్.** (సతీతులసి)

పై ఉదాహరణల్లో పాదాంతాలలోని ద్రుతాలు, నడక తెలుగులో సహజమైన ధోరణికి విరుద్ధం. ఈ సినిమాల పాటల పుస్తకాలలో రాగతాళాలను పేర్కొన్నారు. వీటిలో ఎక్కువ హిందూస్థానీ రాగాలు కావడం గమనార్హం. ఇలా రాగతాళాలను నిర్దేశించడం నాటకాలలో అమలులో వున్న పద్ధతి. అప్పటి కీర్తనల రచనమీద బాలగంధర్వ, నారాయణరావు వ్యాస్, మాస్టర్ కృష్ణారావు మొదలైన వారి మరాఠీ బాణీల ప్రభావం విస్తృతంగా వుండేది. తెలుగులో సాంఘిక చిత్రాల శకం ప్రారంభమైన తర్వాత సాలూరి రాజేశ్వరరావు, భీమవరపు నరసింహారావు (బి.యన్.ఆర్) ఓగిరాల రామచంద్రరావు మొదలైన సంగీత దర్శకులు చిత్రరంగంలో ప్రవేశించి స్వతంత్ర ప్రయోగాలు చేయడంతో మరాఠీ బాణీల ఉధృతం కొంత తగ్గుముఖం పట్టింది.

## 'అనసూయ' చిత్రంలో అన్నమయ్య లాలిపాట :

30ల దశకంలోని సినిమా పాటల్లో సంగీతానికున్న ప్రాముఖ్యం సాహిత్యానికుండేది కాదు. 1936 లో సి. పుల్లయ్య 'అనసూయ', 'ధ్రువ' అనే రెండు చిత్రాలను తీసి ఒకే ఆటగా ప్రదర్శించేలా విడుదల చేశారు. నిజానికి రెండు చిత్రాలకు ఏమాత్రం సంబంధం లేదు. 'ధ్రువ' ఆయా పాత్రల కనుగుణమైన వయసుగల

11. ఆదినారాయణరావుతో ముఖాముఖి. 7-11.89



నటీనటులతో నిర్మించింది కాగా 'అనసూయ' 6-13 సం॥ వయసుగల బాలబాలికలతో తీసిన చిత్రం.

ఈ చిత్రంలో అనసూయ త్రిమూర్తులను పసిపిల్లలను చేసి ఆడించే సన్నివేశంలో జోలపాటగా 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అనే గీతాన్ని సంగీత దర్శకులైన ప్రభల సత్యనారాయణ సూచన మేరకు దర్శకులు సి. పుల్లయ్య ఉపయోగించారు. బహుశా అప్పటికి అది జానపద గీతంగా తప్ప అన్నమయ్య కీర్తనగా గుర్తింపు పొంది వుండదు.

**'జో అచ్యుతానంద జోజో ముకుందా**
**లాలి పరమానంద రామ గోవిందా**
**తొలుత బ్రహ్మాండమ్ము తొట్టె గావించి**
**నాలుగు వేదాల గొలుసులమరించి**
**బలువైన ఫణిరాజు పానుపమరించి**
**చెలియ డోలిక నిన్ను చేర్చి లాలింప...'**

అనే పాట చిన్ని కృష్ణుణ్ణి యశోద నిద్రపుచ్చే సందర్భంలోనిది. కాని 'అనసూయ' కథ ననుసరించి ఆ సందర్భంలో ఉయ్యాలలో త్రిమూర్తులుండడం వల్ల చివరి పాదాన్ని 'చెలియ డోలిక మిమ్ము చేర్చి లాలింప' అని మార్చి

**'ముల్లోకములనేలు ముమ్మూర్తులారా**
**అడ్డాలలో నేడు బిడ్డలైనారా'**

-- అని ముక్తాయింపు యిచ్చారట! ఈ మార్పు బలిజేపల్లి లక్ష్మీకాంతం చేసినట్టు ప్రముఖ దర్శకులు సి.యస్. రావు జ్ఞాపకం[12]. అయితే మార్పులూ చేర్పులూ పూర్తయిన తర్వాత "పాట మొదటి నుంచీ ఏకవచనంలో నడిచింది కదా, ముగింపులో బహువచనం ఎలా అన్వయిస్తుంది" అని అనుమానం వచ్చిందట. కాని "అందరి నోళ్లలోనూ నానిన ఆ పాటను మార్పు చెయ్యడమెందుకు, అన్వయాలు ఎవరు పట్టించుకుంటారులే" అని అలా కానిచ్చేశారట!

ఇలా తెలియకుండానే ఉపయోగించిన అన్నమయ్య కీర్తనతోపాటు ఆనాటి పౌరాణిక చిత్రాలలో తెలిసి ఉపయోగించిన వాగ్గేయకారుల గీతాలూ వున్నాయి. వీటిలో

12. సి.యస్.రావుతో ముఖాముఖి. 5.8.89

'సతీతులసి' (1936) లో ఉపయోగించిన 'చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ...' 'భక్త కబీరు' (1936)లోఉపయోగించిన

**'రాసే హరిమిహ విహిత విలాసం**
**స్మరతి మనోమమ కృత పరిహాసమ్...'**

అనే జయదేవుని అష్టపదులు ముఖ్యమైనవి. అయితే ఈ రెండు చిత్రాలలోను ఈ అష్టపదులను పూర్తిగా కాకుండా కొన్ని పంక్తులను మాత్రమే ఉపయోగించారు.

## 'శ్రీ కృష్ణలీలలు'లో వందేమాతరం :

స్వాతంత్ర్యానికి పూర్వం సినిమాపాటల మీద కూడా ఇతర సాహిత్య ప్రక్రియల లాగే స్వాతంత్రోద్యమ ప్రభావం పడింది. సాంఘిక చిత్రాల్లో జాతీయతను ప్రబోధించే గీతాలుండడం సమంజసమే కాని 'కృష్ణలీలలు' వంటి పౌరాణిక చిత్రాల్లో కూడా అటువంటి గీతాలు కనిపించడం ఆశ్చర్యం. ఆనాటి దర్శకులు సందర్భశుద్ధి లేకపోయినా స్వాతంత్రోద్యమ గీతాలను చొప్పించడానికి ప్రయత్నించే వారనడానికి 'కృష్ణలీలలు' లో వందేమాతరం గీతమే తార్కాణం.

ఇంద్రాగ్నియమనందులు దేవిని స్తోత్రం చేస్తూ పాడిన వందేమాతరం గీతం ఇలా వుంది -- (దీని రాగం - సారంగ్. తాళం - త్రితాళ్)

**వందేమాతరం**
**తుమి విద్యా తుమి ధర్మ**
**తుమి హృది తుమి మర్మ**
**త్వం హి ప్రాణా: శరీరే**
**బాహుతే తుమి మా శక్తి**
**హృదయే తుమి మా భక్తి**
**తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే... ॥ వందేమాతరం॥**

**త్వం హి దుర్గా దశప్రహరణధారిణీ**
**కమలా కమలదళ విహారిణీ**
**వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం**
**అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం, మాతరం... ॥వందేమాతరం॥**



**శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం**
**ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం**
**సుహాసినీం సుమధురభాషిణీం**
**సుఖదాం వరదాం మాతరం ॥వందేమాతరం॥**

బంకించంద్ర ఛటర్జీ తన వంగనవల ఆనంద్‌మఠ్‌లో జాతీయతను ప్రబోధిస్తూ రాసిన సుదీర్ఘ గీతం వందేమాతరం. ఆ పూర్తి పాఠంలోని కొన్ని పంక్తులు మాత్రమే సినిమాపాటలో వున్నాయి.

(ముందుగా 4,5 చరణాలు, ఆ తర్వాత 2వ చరణం) ఈ భాగానికి భావం యిది -

నువ్వు సమస్త జ్ఞానానివి, ధర్మానివి. సకల జీవకోటిలో చేతనా కేంద్రమైన హృదయస్థానానివి. సకల జ్ఞాన సారానివి. సమస్త జీవుల ప్రాణానివి. మమ్మల్ని దివ్య బల సంపన్నులుగా పెంచి పోషించే వీరమాతవు. అరివీరభయంకరమైన మా భుజాంతర్నిహితమై వున్న శక్తి నువ్వే తల్లీ! మా అందరి హృదయాలలో జన్మించే భక్తి రూపానివి నువ్వే. ప్రతి మందిరంలోను నీ దివ్యమంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొంటాం.

నువ్వు దశవిధ ఆయుధ ధారిణి అయిన దుర్గవు. సకల సంపత్ ప్రదాయని అయిన లక్ష్మీదేవివి. పరాపర విద్యా ప్రదాయని అయిన సరస్వతీ మూర్తివి. తల్లీ! నీకు అభివాదాలు. అనంతైశ్వర్య ప్రదాతవు, అనన్య సామాన్యురాలివి, పుణ్యజలపూర్ణవు, అన్నపూర్ణవు అయిన మాతృమూర్తీ ! నీకు వందనాలు.

స్వచ్ఛమైన తెలివెన్నెల చేత పరవశించిన రాత్రులు కలదానవు. వికసించిన పూరేకులతో శోభించే నిత్య మంగళ రూపానివి, దరహాసవదనవు, మధుర వచస్వినివి. సుఖాలను వరాలను ప్రసాదించే తల్లీ ! నీకు వందనాలు.

వందేమాతర గీతం పూర్తి పాఠంలో కేవలం భరతమాతకు వర్తించే భాగాన్ని విడిచి దేవికీ, దేశమాతకీ సంయుక్తంగా వర్తించే భాగాన్ని మాత్రమే సినిమాలో గ్రహించడం గమనార్హం.

ఏతావతా ఈ ప్రథమ దశలో వచ్చిన చిత్రాలన్నీ దాదాపు నాటక పరివర్తనలే కావడం, ఈ చిత్రాలలోని కీర్తనలు ఏడెనిమిది పంక్తులకు మించకుండా వుండడం,

రాగానికున్న ప్రాధాన్యం భావానికి లేకపోవడం -- ఈ దశలోని విలక్షణమైన లక్షణాలు. ఇలా పూర్తిగా వెలుగురేకలు విచ్చుకోని శైశవదశ గనుక -- దీనిని అరుణోదయంగా భావించడం జరిగింది.

## భావోదయం (1938-50) :

1934లో 'చింతామణి' నాటకం సినిమాగా వచ్చినా, 1936లో 'ప్రేమవిజయం' అనే సాంఘిక చిత్రం విడుదలైనా 1938లో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో వచ్చిన సంచలన చిత్రం 'మాలపిల్ల'తోనే సాంఘిక చిత్రాల శకం ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. ఈ శకారంభానికి ప్రభాత్, న్యూ థియేటర్స్ సంస్థలు తీసిన సంస్కరణాత్మక చిత్రాల విజయం దోహదం చేసింది. కుటుంబంలో ఏకతాభావాన్ని ప్రబోధిస్తూ రాజా శాండో తీసిన 'మేనక' మద్యపానం వల్ల కలిగే అనర్థాలను తెలియజెపుతూ అల్టేకర్ నిర్మించిన 'పతిభక్తి' వంటివి భాషాభేదం లేకుండా ప్రేక్షకులను ఆకర్షించడం చిత్ర పరిశ్రమ గమనించింది. అలాగే హాలీవుడ్ చిత్రాలలోని వినోదం, సాంకేతికపరిజ్ఞానం తెలుగు దర్శకుల కళ్లను జిగేల్ మనిపించాయి. ఈ వేకువలో ఆంధ్రనాటక కళాపరిషత్‌లో ప్రదర్శింపబడిన సాంఘిక నాటకాలలోని నూతన ప్రయోగాలచేత ప్రభావితుడైన గూడవల్లి రామబ్రహ్మం సాంఘికచిత్రనిర్మాణం చేపట్టి 'మాలపిల్ల', 'రైతుబిడ్డ' వంటి సంస్కరణాత్మక చిత్రాలను నిర్మించారు. ఈ వెలుగుబాటలో -- హెచ్.యం. రెడ్డి 'రంగూన్ రౌడీ' నాటకానికి దగ్గరగా మద్యపాన నిషేధాన్ని ప్రబోధించే 'గృహలక్ష్మి', బి.యన్. రెడ్డి - విద్యావంతుల నిరుద్యోగ సమస్యకు అద్దం పడుతూ -- 'వందేమాతరం', వితంతు పునర్వివాహాన్ని ప్రబోధిస్తూ -- వై.వి. రావు 'మళ్లీపెళ్లి', వరకట్న దురాచారాన్ని తూర్పారబట్టిన కాళ్లకూరి వారి నాటకం ఆధారంగా సి. పుల్లయ్య 'వరవిక్రయం' చిత్రాలను నిర్మించారు. ఈ రెండేళ్లలో ఉప్పెనలా వచ్చిన ఈ విప్లవాత్మక చిత్రాలతో తాపీ ధర్మారావు, సముద్రాల వెంకట రాఘవాచార్య, కొసరాజు రాఘవయ్య చౌదరి మొదలైన నవకవులు సినీరంగ ప్రవేశం చేశారు. కొసరాజు 'రైతుబిడ్డ'లో పాట రాయడమే కాకుండా ఓ పాత్రను కూడా ధరించారు.

'మాలపిల్ల' చిత్రంలో సినిమా కోసం రాయించిన పాటల కంటె 1932లోనే చనిపోయిన బసవరాజు అప్పారావు గీతాలే ఎక్కువగా వున్నాయి. గూడవల్లి రామబ్రహ్మం బసవరాజు అప్పారావు గీతాల హక్కులను ముందుగానే పొంది వుండడం వల్ల 'రైతుబిడ్డ', 'అపవాదు' మొదలైన ఆయన ఇతర చిత్రాలలో కూడా వాటిని



వాడుకొన్నారు. 'మాలపిల్ల'లో 'నల్లవాడే గొల్లపిల్లవాడే' గీతాన్ని యథాతథంగా ఉపయోగించగా, 'కొల్లాయి గట్టితే నేమీ మా గాంధి కోమటై పుట్టితేనేమీ' అనే గీతాన్ని కథకనుగుణంగా

**'కొల్లాయి గట్టితేనేమీ**
**మన గాంధి మాలడై తిరిగితే నేమీ'**

అని మార్పు చేశారు.

'చిలిపిచేష్టలు చేయ చెట్టునకు గట్టిరా చిన్ని నా ముద్దు కృష్ణా',[13], 'ఆ మబ్బు ఈ మబ్బు ఆకాశమధ్యాన అద్దుకున్నట్లు మనమైక్యమౌదామె[14] -- అనే రెండు వేరు వేరు గీతాలను ఓ ప్రేమగీతంగా సంధించారు. 'ఆ మబ్బు ఈ మబ్బు' పాటను నాయికా నాయకుల మధ్య యుగళ గీతంగా విభజించి, నాయిక స్నేహితురాలు అనసూయపై 'చిలిపి చేష్టలు చేయ...' గీతాన్ని చిత్రీకరించారు. సినిమాలో ఆ పాట వరస యిది --

**అతడు : ఆ మబ్బు ఈ మబ్బు ఆకాశ మధ్యాన**
**అద్దుకున్నట్లు మనమైక్యమౌదామె**

**అనసూయ : చిలిపిచేష్టలు చేయ చెట్టునకు గట్టిరా**
**చిన్ని నా ముద్దుకృష్ణా, విన్నో చిన్ని నా ముద్దుకృష్ణా**

**ఆమె : ఆ తీగె యీ తీగె అడవి పొదరింటిలో**
**అల్లుకొన్నట్లు మనమైక్యమౌదామె**

**అన : శ్రీకృష్ణ నిను నన్ను చేర్చి చెట్టునకు గట్ట**
**చిలిపిచేష్టలు చేతువా విన్నో చిలిపి చేష్టలు చేతువా**

**అతడు : ఆ వాగు ఈ వాగు అడ్డాలకోనలో**
**ఏకమైనట్లు మనమైక్యమౌదామె**

**అన : చిలిపిచేష్టలు జేయ చెట్టునకుగట్టిరా**
**చిన్ని నా ముద్దుకృష్ణా, విన్నో చిన్నినాముద్దుకృష్ణా.**

ఈ పాటలో 'ఆ మబ్బు ఈ మబ్బు'లోని చివరి చరణమైన

13. బసవరాజు అప్పారావు గీతాలు. పుట. 29
14. ..... పుట 43

'ఆ మాట యీమాట అర్థాంతరములోన
వాక్యమైనట్లు మనమైక్యమౌదామె'

అనే పంక్తులను సినిమాలో ఉపయోగించలేదు. ఈ పాటనిక్కడ వుటంకించడం భావగీతాలను చేర్పులూ మార్పులతో సినిమాల్లో ఉపయోగించుకోవడం 'మాలపిల్ల'తోనే ప్రారంభమైందని చెప్పడానికి. ఇలా గూడవల్లి వారితో అప్పారావుగారి భావగీతాలు సినిమాల్లో ప్రవేశిస్తే ఆమంచర్ల గోపాలరావు 'కాలచక్రం'తో శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం సినీరంగ ప్రవేశం చేసింది.

'కాలచక్రం'లో శ్రీశ్రీ మహాప్రస్థానం గీతంలోని కొంత భాగాన్ని చేర్పులూ మార్పులతో ఉపయోగించుకొన్నారు.

**మరోప్రపంచం మరో ప్రపంచం**
**మరో ప్రపంచం పిలిచింది**
**పదండి ముందుకు పదండి తోసుకు**
**పోదాం పోదాం పైపైకి**

**నాయకుడు : కదం తొక్కుతూ పదం పాడుతూ**
**హృదంతరాళం గర్జిస్తూ**

**నావికులు : పదండి పోదాం - వినబడలేదా**
**మరోప్రపంచపు జలపాతం**

**నాయకుడు : నదీనదాలు అడవులు కొండలు**
**ఎడారులా మన కాటంకం**

**నావికులు : పదండి ముందుకు పదండి తోసుకు**
**పోదాం పోదాం పైపైకి --**

**నాయకుడు, : మరో ప్రపంచం మహా ప్రపంచం**
**బాలురు : ధరిత్రి నిండా నింపండి**

**నాయకుడు : నెత్తురు మండే శక్తులు నిండే**
**నావికులారా రారండీ**
**నడుంకట్టక చూస్తారే? --**



**కనబడలేదా మరో ప్రపంచపు**
**అగ్నికిరీటపు నిగనిగలు**
**హోమజ్వాలల భుగభుగలు**

**అందరు : పదండి ముందుకు పదండి తోసుకు**
**ప్రభంజనంవలె హోరెత్తండీ**

**నావికులు : మరో ప్రపంచపు ఢంకాధ్వానం**
**విరామ మెరుగక మ్రోగింది --**

**అందరు : హరోం హరోం హర హర హర హర**
**హరోం హర యని కదలండి**

**నావికులు : పదండి ముందుకు పదండి తోసుకు**
**పోదాం పోదాం పైపైకి.**

నిజానికి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గీతానికీ దీనికీ చెప్పుకోదగినంత భేదం వుంది. సినిమాకోసం శ్రీశ్రీ పెక్కు మార్పులు చేశారు. అయినా ఆయన 'పాడవోయి భారతీయుడా' సినిమా పాటల సంకలనంలో 'ఆహుతి' అనే డబ్బింగ్ చిత్రంలోని 'ప్రేమయే జనన మరణ లీల' అనేది తన మొదటి సినిమా పాటగా పేర్కొన్నారు. అందులో ఇంకా ఇలా రాశారు --

"చాలాకాలం కిందటనే 'కాలచక్రం' అనే చిత్రంలో నా 'మహాప్రస్థానం' పాట వచ్చింది. కాని అది సినిమాకోసం రాసింది కాదు." [15]

ఈ విషయం యిక్కడ ప్రస్తావించడం శ్రీశ్రీ సినిమాకవిగా ఈ రెండో తరానికి చెందరని స్పష్టం చేయడానికే.

ఈ రెండో దశలో రెండో ప్రపంచయుద్ధ వాతావరణం కారణంగా విడుదలయిన తెలుగు చిత్రాల సంఖ్య తక్కువే. సినిమా రచన వృత్తిగా చేపట్టిన కవుల సంఖ్య తక్కువే. వీరిలో ఎక్కువ పాటలు రాసిన రచయిత సముద్రాల వెంకట రాఘవాచార్య. తర్వాతి స్థానాల్లో బలిజేపల్లి లక్ష్మీకాంతం, తాపీ ధర్మారావు పేర్లను చెప్పుకోవచ్చు. సాంఘిక చిత్రాల తొలిదశలో ఏమాత్రం సాహిత్య సుగంధం లేకుండా

15. పాడవోయి భారతీయుడా. పుట - 6

కేవలం పాడి మాటలతో కొన్ని పాటలు వచ్చాయనడానికి 'కాలచక్రం'లో కథానాయిక మీద చిత్రీకరించిన పాటను ఉదాహరణంగా చెప్పుకోవచ్చు.

నాదనామక్రియ రాగంలో ఆదితాళంలో పాడిన ఆ పాట యిది --

నా ప్రసాదుని నాకు జూపింపనా
నన్నైన ఖైదులో పెట్టించవా
కృపలేదా దయరాదా
దయాళో, కృపాళో....

నాలుగుపంక్తుల ఈ పాటలో వచనరీతికి చెందిన వాక్యాలూ, సమానార్థకాలైన కృప, దయ పదాలూ -- ఈ పాట భావపరంగా ఎంత నిరర్థకమైందో స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి వాటికి భిన్నంగా సముద్రాల రాఘవాచార్య పాటలు ప్రజాభిమానాన్ని పొందాయి. వాహినీ వారి 'దేవత'లో ఆయన రాసిన -

రాదే చెలీ నమ్మరాదే చెలీ
మగవారినిలా నమ్మరాదే చెలీ
వాదే చెలీ అపవాదే చెలీ --

అనే పాట ఆనాడు బాగా ప్రచారం పొందింది[16]. ఓ ప్రసిద్ధమైన హిందీ బాణీ ఆధారంగా రాయడం ఈ ప్రాచుర్యానికి కొంత కారణం కావచ్చు.

'రాదే చెలీ' అంటూ అర్ధోక్తిలో పాటను ప్రారంభించడం త్యాగరాజు బాణీ. (సౌ)మిత్రి భాగ్యము, (త్రిపురసుం)'దరిని తెలుసుకొంటి' ఇటువంటి ప్రయోగాలు.[17]

అంతకుముందే కె.సి.డే అనే అంధ గాయకుడు పాడిన 'మన్‌కి ఆంఖే ఖోల్ బాబా' అనే హిందీ పాటను అనుకరిస్తూ 'గృహలక్ష్మి'లో రాసిన --

లెండు భారతీయులారా
నిదుర లేవండోయ్ -- మీరు నిదుర...

ఇల్లూ వళ్లూ కూలదోసే
కల్లు మానండోయ్ బాబూ
కళ్లు తెరవండోయ్ ॥లెండు॥

16. బాలాంత్రపు రజనీకాంతరావుతో ముఖాముఖి
17. వి.ఎ.కె. రంగారావుతో ముఖాముఖి



కుడువ కూడూ తొడుగ వలువా
లేని పిల్లల గోడు చూచీ
నిలువు నీరౌ సతిని గాంచీ
తాగకండీ -- మీరు తాగే
కల్లది వారి రక్తమె సుండీ ॥లెండు॥

బీదల పీల్చి తినే మహమ్మారీ
ప్రభువులు కొల్చుకునే పింజారీ
దేశ దరిద్రతకే రహదారీ
పాన పిశాచము పారదోలీ
భారత కీర్తిని నిల్పగరండీ

పాటను అలనాటి మేటి నటుడు నాగయ్య పాడగా -- ఆనాడు యింటింటా మారుమ్రోగింది.

ఇలా బాణీలకు సులభమైన పదాలతో రాసే నేర్పుతోపాటు చక్కని భావుకతను కూడా పాటల్లో పలికించడంవల్ల సముద్రాల ఆ తరంలో రాణించగలిగారు. ఆహ్లాదకరమైన యుగళగీతాలకు అంకురార్పణ చేసిన కవిగాకూడా సముద్రాలనే చెప్పుకోవచ్చు. పై లక్షణాలకు లక్ష్యం 'సుమంగళి'లోని ఈ యుగళగీతం

ఆమె : మబ్బు తునకల దోమతెర చాటులోనా
అమృతము చిందు నీ మోము మధురమురా
పోబోకుమా చందమామా,
నిలిచి మాటాడుమా చందమామా

అతడు : మనసులోన దాగి మాటాడగాలేని
చెలివలపు నీకన్న మధుర మధురమురా
నిలబోకుమా చందమామా
నిలకుమా మా నడుమ చందమామా

ఆమె : కనరాని ఏ కోనలోన విరబూసెనో
ఈ మల్లెపూదావి మధురతరమౌరా చందమామా
మనసు పులకించురా చందమామా

అతడు : వెలికి దోచియు లోని మమత కననీని
కలికి మదిలో తలుపు మధురతరమౌర
నిలబోకుమా చందమామా
నిలకుమా మా నడుమ చందమామా

ఈ యుగళ గీతంలో భాష గ్రాంథికవాసన నుంచి పూర్తిగా బయటపడక పోయినా ఈ చిత్రంలో రాసిన మరోపాట కవికి వ్యవహార భాషపట్ల వున్న అవగాహనను తెలియజేస్తుంది --

వస్తాడే మాబావ వస్తాడే రేపోమాపో వస్తాడే
ఢిల్లీనుంచి వస్తాడే -- పరీక్షపాసై వస్తాడే

'బాలరాజు', 'మనదేశం' వంటి చిత్రాలకు ప్రజారంజకమైన పాటలందించిన సముద్రాల కలం 'షావుకారు' (1950) చిత్రంలో మరింత పదనుతేరి కదనుతొక్కి సహృదయుల నుర్రూతలూపింది--

1. ఏమనెనే చిన్నారి ఏమనెనే
వన్నెల సిగపూవా, కనుసన్నలలో భావమేమి? ॥ఏమ॥

ఆమని కోయిల పాటల గోముల చిలికించు
వలపుకిన్నెర తానేమని రవళించెనే ॥ఏమ॥

వనరుగ చనువైన నెనరుగా పలుకె బంగారమై
కులుకె సింగారమై మావాడ రాచిలుక మౌనమౌనముగా

2. పలుకరాదటే చిలుకా పలుక రాదటే
సముఖములో రాయబారమెందులకే ॥పలు॥

ఎరుగని వారమటే మొగమెరుగని వారమటే
పలికిన నేరమటే పలుకాడగ నేరవటే
ఇరుగు పొరుగు వారలకీ అరమరికలు తగునటనే ॥పలు॥

మనసున తొణికే మమకారాలు
కనులను మెరిసే నయగారాలు



తెలుపరాదటే సూటిగా --
తెరలు తీసి పరిపాటిగా ॥పలు॥

ఈ పాటల్లో భావంలోనూ భాషలోనూవున్న సౌకుమార్యం తెలుగు సినిమా పాటను కొత్తమలుపు తిప్పింది. భావకవితా సామగ్రి గుబాళింపు, శబ్దాలంకారాల పోహళింపు ఈ పాటలకు ఒంపుసొంపులను కలిగించి ప్రేక్షకుల నలరింపజేశాయి.
అయితే ఈ పాటలకు స్ఫూర్తి దాసు శ్రీరాముల జావళీలు అనిపిస్తోంది --

1. ఏమనెనే కోమలీ తెలుపవే నీతో
ఏమనెనే కోమలీ

2. రమణిరో సముఖాన రాయబారమేటికో
నిమిషమైన తాళలేనె నేనె వాని రమ్మందునె

అయినా సామ్యం కొంతవరకు పల్లవులలోనే తప్ప చరణాలలో మచ్చుకి కూడా కనిపించడం లేదు. పైగా సముద్రాల పాటల్లోవున్న భాషాలాలిత్యం, అనుప్రాసల అందాలు దాసుగారి జావళీల్లో లేవు.

'షావుకారు'లోనే 'భలేదొరలకు దొరకని సొగసు' అనే చాకలి రామి పాటలో

మెరుగు చెడని సరికొత్తది
ఇంకెయ్యాల అడిగిన ఉత్తది
ఇదిర అదను కదలిరా
భలే దొరలకు దొరకని సొగసు
అనువుగ దొరికెను రంగయ్య

అనే చరణంలోని పాత్రోచితమైన ఒడుపు సహృదయులను 'ఔరా' అనిపించక మానదు.

వాహినీవారి 'భక్తపోతన' లో బెజవాడ రాజరత్నం కల్యాణి రాగంలో పాడిన --

మంచి సమయము రారా ఇది
చలమేల చేసేవౌరా ॥మంచి॥
నిన్నెకోరి నీకై నిలచితిరా
రారా కోరికదీర మనకిది... ॥మంచి॥

అనే పాటను తు.చ. తప్పకుండా జావళీ ఛందస్సులో రచించి మొదటి సినిమా జావళీ కర్త (లభిస్తున్న ఆధారాల మేరకు) అయిన ఖ్యాతికూడా సముద్రాలదే. దీనికి 'రారా సామి' అన్న సారంగపాణి పదం ఆధారమని వి.ఎ.కె. రంగారావు అభిప్రాయం.

ఇంకా -- 'షావుకారు'లో హరికథ, 'స్వర్గసీమ'లో 'మోహినీ రుక్మాంగద' వీథినాటకం వంటి జానపద కళారూపాలనుకూడా రచించి తన బహుముఖ ప్రజ్ఞను నిరూపించుకొన్న సముద్రాలను ఈ శకకర్తగా భావింపవచ్చు.

ఈ శకంలో

నిన్న సాయంత్రమున మిన్నేటి ఛాయలలో
సన్నజేసి నిను బిలిచిన చిన్నదెవరు సామి ॥నిన్న॥

కనుమూసి గంగయనుచు కలువరించినావు రేయి
గంగ యెవరయా సామీ ఆ
క్రమము దెలుపు సామీ ॥నిన్న॥

నిన్నే తావలచినదో నీకే దయ గల్గినదో
నిజము దెల్పకున్న నేడు నిన్ను విడుతునా సామీ
కన్నెలెందరిని నాదు కన్ను బ్రామి జేర్చితివో
ఎన్నగలనొకో సామీ -- ఎన్నగలనొకో
నీ యిచ్చ మెలగు సామి ॥ **(సుమతి 1941)**

(ఈ పాట 'నే(ట)ంది నేరత్తిలే' అన్న తమిళపదానికి వరుసలో అనుకరణ, వస్తువులో అనుసరణ అని వి.ఎ.కె. రంగారావు అన్నారు.)

అతడు : **ఎక్కడున్నావే పిల్లా ఎక్కడున్నావే**
**దిక్కులన్ని వెదికాను ఒక్కసారి కానరావు** ॥ఎ॥

ఆమె : **చందమామ చలువలోన చెంగలువా రంగులోన**
**మల్లెతావి జల్లులోన మంచిపాట మలుపులోన**
**నక్కివున్నానోయ్ బావా దాగి వున్నానోయ్**

అతడు : **చెట్టులన్ని యెక్కినాను గుట్టలన్ని చుట్టినాను**
**చుట్టుపట్ల చూచినాను, పుట్టలన్ని వెదికాను** ॥ఎ॥



ఆమె : **కొండమావి గొంతులోన చిగురుమావి పగరులోన**
**మింటిచుక్క మిణుకులోన కంటిపాప కడుపులోన**
**నక్కివున్నానోయ్ బావా దాగివున్నానోయ్**
**(కృష్ణప్రేమ--1943)**

వంటి అద్భుతమైన భావుకత గల గీతాలను రాసి వరుసగా దైతా గోపాలం, బలిజేపల్లి లక్ష్మీకాంతం, 'స్వర్గసీమ'లో 'ఓహో, పావురమా....' వంటి అత్యధిక ప్రచారం పొందిన పాటను రచించిన బాలాంత్రపు రజనీకాంతరావు తమ ప్రతిభను చూపించినా వ్యాపార చిత్ర గీతాల రచనలో కొంత వెనుకపడ్డారు.

## సినీ పదాలుగా జానపదాలు :

ఈ దశలో ప్రజల నాలుకలమీద నర్తించే జానపదాల్ని సినిమా పాటలుగా వినియోగించుకోవడం ప్రారంభించారు. వాటిలో మొదటిది 'చల్ మోహనరంగా'. 'చల్ మోహనరంగా' జానపదగీతం వినని తెలుగువారుండరు. దానిని టేకు అనసూయ నాటక ప్రదర్శనల్లో విరామ సమయాల్లో కాలక్షేపం కోసం పాడేవారు. 'మాలపిల్ల'తో సాంఘిక చిత్రాల రుచి మరిగిన ప్రేక్షకుల కోసం ఒక సాంఘిక చిత్రాన్ని నిర్మించమని 'స్టార్ బ్రహ్మ'గా పేరు పొందిన సి. పుల్లయ్యకు ముద్దుకృష్ణ సూచించడంతో పుల్లయ్యగారి దృష్టి ఈ పాటమీద పడింది. సుదీర్ఘమైన 'చల్ మోహనరంగా' గీతంలో కొంత భాగాన్ని మాత్రం తీసుకొని పుష్పవల్లి, వాలి నాయికానాయకులుగా సి. పుల్లయ్య రెండువేల అడుగుల నిడివి గల జానపద నృత్యగీత చిత్రాన్ని నిర్మించారు. దీనికి నేపథ్య గీతాన్ని టేకు అనసూయ పాడారు. అప్పటికి ఆ పాట కనుగుణంగా నాయికానాయకులు నటించడం తప్ప పెదవులను కదిపే నేపథ్యగానం రాలేదు. 'చల్ మోహనరంగా' ప్రధానంగా గోదావరీతీర ప్రకృతిసౌందర్యాన్ని చిత్రీకరించడానికి ఉద్దేశించింది. ఈ రెండు రీళ్ల చిత్రాన్ని సి. పుల్లయ్య దర్శకత్వంలోనే వచ్చిన 'శ్రీ సత్యనారాయణ', 'కాసులపేరు' చిత్రాలతో కలిపి ఒకే ఆటగా ప్రదర్శించేవారు. ఇలా రెండు మూడు హ్రస్వ చిత్రాలను కలిపి ప్రదర్శించడం నాటి ఆంగ్ల చిత్రాల ప్రభావం. ఈ విధంగా ఒక జానపదగీతం ఆధారంగా ఒక చిత్రమే నిర్మించిన ఘనత సి. పుల్లయ్యకే దక్కుతుంది.

'చల్ మోహనరంగా' చిత్రం కోసం ధ్వని ముద్రితం చేసిన జానపద గీతం పూర్తి పాఠం (వి.ఎ.కె. రంగారావు రికార్డులు విని రాసింది.)

మోహనరంగా నీకూ నాకూ
జోడు కలిసెను గదరా --

1. కంటికి కాటుక బెట్టి కడవ చంకను బెట్టి
కంటినీరే కడవ నింపితి గదరా ॥చల్॥

2. పదరా చెంగల్వపొదల మధురా వెన్నెలరేయి
నిదురకే రమ్మనంటిని గదరా ॥చల్॥

3. మరుమల్లె తోటలోన మంచినీళ్ల బావికాడ
ఉంగరాలె మరచి వస్తిని గదరా ॥చల్॥

4. చెట్టుదాటి పుట్టదాటి ఘనమైన వనముదాటి
అన్ని దాటి వెతకి అలసితి గదరా ॥చల్॥

5. నీకు నీవారు లేరు, నాకు నావారు లేరు
ఏటి ఒడ్డున యిల్లు కడదాం పదరా ॥చల్॥

6. నీకు నాకు జోడు అయితే మల్లెపూల తెప్పగట్టి
తెప్పమీద తేలిపోదాం పదరా ॥చల్॥

7. పొగడపూలు గట్టి సొగసైన దండచుట్టి
దండ నీ మెడను వేతాను గదరా ॥చల్॥

8. ఒంటరిగా నేను పోతే నీవు నావెంట వస్తే
నీడ చూసి జడుసుకొంటిని గదరా ॥చల్॥

9. నీవు నేను నిలచివుంటే వచ్చి పోయేవారు అంతా
వెర్రి నవ్వు నవ్వి పోయిరి గదరా ॥చల్॥

10. నరులు కన్పడని చోట కురుల జాలరు మీద
అందముగా ఆడుకొందాము పదరా ॥చల్॥

11. అమృత ప్రవాహమైన ఆకాశ గంగలోన
సరిగంగ లాడుదాము పదరా ॥చల్॥



12. నాలోని వలపుతీగ నీలాల పేరులాగ
నీ కంఠమునే చుట్టితి గదరా

॥పదరా చెంగల్వ పొదల॥

కాని పాటల పుస్తకంలో మొదటి ఆరు చరణాలు మాత్రమే వున్నాయి. సి. పుల్లయ్యగారి కుమారులు ప్రముఖ చలన చిత్ర దర్శకులు సి.యస్. రావు కూడా ఆరు చరణాలకు మించి, చిత్రంలో ఉపయోగించలేదనే చెప్పారు[18]. అందువల్ల పన్నెండు చరణాల పాటను రికార్డు చేసి సగం పాటను మాత్రం చిత్రీకరణకు ఉపయోగించినట్టు అభిప్రాయ పడవలసి వస్తోంది. ఇంకా 'రైతు బిడ్డ'లో --

ఓ గుబ్బాల గోపిరెడ్డి
దాచేపల్లికి దానమైతివా
శేరుశేరు యెండి మురుగుల్ చేతులాకు బెట్టుకుని
కట్టవ మీద వస్తావుంటే కలకటేరను కొంటిర కొడకా
వయ్యారి కొడకా, బంగారు కొడకా ॥దాచే॥

వాహినీ వారి 'భక్త పోతన'లో

ఇంటి ముందర సిక్కుడు చెట్టు
ఎట్ల గొస్తవొ సొగసుకాడ

ప్రతిభావారి 'బాలరాజు'లో

ఒకరికి చేతూలిచ్చాన్
ఒకరికి కాళ్లానిచ్చాన్
ఒకరిని చేతాబట్టి
కూకున్నానోయ్ బావా, కూకున్నానోయ్

'మనదేశం'లో

అత్తలేని కోడలుత్తమురాలు
కోడలులేని అత్త గుణవంతురాలు

వంటి జానపద గీతాలను యథాతథంగా ఉపయోగించారు. వీటిని సాంకర్యం చేయకపోవడం ఈ శకంలోని ఆరోగ్యకరమైన లక్షణం.

18. సి.యస్.రావుతో ముఖాముఖి.

ఈ దశలో పౌరాణిక జానపద సాంఘిక చిత్రాలు సమపాళ్లలో వచ్చాయి. పాటలలోని భాషలో గ్రాంథిక చ్ఛాయలు కొంత తగ్గు ముఖం పట్టాయి. పౌరాణికాలతో పోలిస్తే సాంఘిక చిత్రాలలో పాటల సంఖ్య తగ్గింది. సంస్కరణ గీతాలు స్వాతంత్ర్య స్ఫూర్తి గల గేయాలతో పాటు 'మాలపిల్ల', 'వరవిక్రయం' వంటి సాంఘిక చిత్రాలలో అష్టపదులు, త్యాగరాజకృతులు మొదలైన వాగ్గేయకారుల గీతాలు ఉపయోగించబడ్డాయి. రెండవ ప్రపంచయుద్ధం పర్యవసానంగా ప్రబలిన యుద్ధ వైముఖ్యం, శాంతికామన సినిమాపాటల్లో కూడా ప్రతిబింబించాయి. వాహినీ సంస్థ అవతరణ సాహితీ మూల్యాలు కలిగిన సినిమాపాటలకు దోహదం చేసింది. కవులు సినిమా సంస్థలలో నెలసరి జీతాల మీద పనిచేస్తూ సాధారణంగా ఒక చిత్రానికి ఒకరే రచన చేయడం ఈ దశలోని విశిష్ట లక్షణం. సినిమాపాటల్లో అంతవరకు పెద్దగా పట్టించుకోని సాహిత్యానికి చోటిచ్చి భావ ప్రధానమైన పాటలు రాసిన దశ గనుక ఈ శకాన్ని 'భావోదయం'గా భావించడం జరిగింది.

## రాగోదయం (1951 - 60) :

తెలుగు చలనచిత్రచరిత్రలో సాహిత్యపరంగా సువర్ణాక్షరాలతో లిఖించదగిన సంవత్సరం 1951. అది 'పోరా బాబూ పో-- పోయి చూడు ఈ లోకం పోకడ' అంటూ ఆత్రేయ 'దీక్ష'తో సినీరంగంలో అడుగు పెట్టిన సంవత్సరం. నేటికీ మనసున మల్లెల మాలలూపే మల్లీశ్వరి పాటలతో దేవులపల్లి కృష్ణశాస్త్రి చిత్రభువికి దిగివచ్చిన సంవత్సరం. తెలుగులో నేరుగా తీసిన చిత్రానికి (నిర్దోషి) శ్రీశ్రీ తొలిసారిగా పాటలు రాసిన సంవత్సరం. మల్లాది రామకృష్ణశాస్త్రి అజ్ఞాతవాసం పూర్తిచేసి స్వయంగా ప్రకాశించిన సంవత్సరం. ఆరుద్ర 'బీదలపాట్లు'తో 1950లో సినిమాల్లో అడుగుపెట్టి మలిఅడుగు వేసిన సంవత్సరం. విశ్వనాథ సత్యనారాయణ ఏకైకచిత్రం 'ఆకాశరాజు' విడుదలయిన సంవత్సరం. పింగళి 'పాతాళభైరవి'తో సినిమాపాటల అభిమానుల హృదయాల్లో ఘాటుప్రేమ కలిగించిన సంవత్సరం. ఇన్ని వరాల ముత్యాలసరమైన ఈ సంవత్సరం తెలుగు చలనచిత్ర చరిత్రలో స్వర్ణశకానికి నాందీగీతం.

ఈ దశకంలో తెలుగు సినిమాపాటల్లో (అను) రాగానికి ప్రాధాన్యం పెరిగింది. 'పాతాళభైరవి'లో పింగళి రాసిన పాటలు- సినిమాపాట జనం నోళ్లలో నానడానికి ఎంత సరళంగా వుండాలో చెప్పాయి. 'వినవే బాలా నా ప్రేమగోలా', 'ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు - అయ్యో పాపం పసివాడు', 'ఎంత ఘాటు ప్రేమయో', 'కలవరమాయే మదిలో' వంటి పాటలు జనానికి సులభంగా



పట్టుబడి పదేపదే పాడుకొని ఆనందించారు. ప్రజలు విని సంతోషించడంతో పాటు తిరిగి పాడుకొని పరవశించేలా వుండడం సినిమాపాటకు కావాల్సిన ప్రధానమైన యోగ్యత. ఆ లక్షణానికి మచ్చుతునక- పాతాళభైరవిలోని ఈ యుగళగీతం

**ఆమె : కలవరమాయే మదిలో-- నామదిలో**
**కన్నులలోన కలలే ఆయే**
**మనసే ప్రేమమందిరమాయె ॥కల॥**

**అతడు : కలవరమాయే మదిలో నామదిలో**
**కన్నులలోన గారడి ఆయే**
**మనసే పూలమంటపమాయె ॥కల॥**

**ఆమె : నాలో యేమొ నవభావనగా**
**మెల్లన వీణ మ్రోగిందీ**
**అనురాగాలే ఆలాపనగా**
**మనసున కోయిల కూసే ॥కల॥**

**అతడు : నాలో యేమొ నవరసరాగం**
**పిల్లనగ్రోవి ఊదిందీ**
**మోహాలేవో మోసులు వేసీ**
**ఊహాగానము చేసే**
**కలవరమాయే మదిలో నామదిలో**

**ఆమె : కన్నులలోన కలలే ఆయె**
**మనసే ప్రేమమందిరమాయె**
**కలవరమాయే మదిలో నామదిలో**

**అతడు : కలవరమాయే మదిలో నామదిలో**

పాటల్లోని వైవిధ్యం ఈ శకంలోని ప్రత్యేకత. ఈ దశలోని కవులందరూ ఒకమూసలో కాకుండా ఒకరినొకరు అనుకరించకుండా ఎవరి బాణీని వారు ఏర్పరుచుకొన్నారు. 'మల్లీశ్వరి'లో దేవులపల్లి కృష్ణశాస్త్రి --

మనసున మల్లెల మాలలూగెనే కన్నుల వెన్నెలడోల లూగెనే
ఎంత హాయి ఈరేయి నిండెనో ఎన్నినాళ్లకీ బ్రతుకు పండెనో
కొమ్మల గువ్వలు గుసగుసమనినా రెమ్మల గాలులు ఉసురుసురనినా
అలలు కొలనులో గలగల మనినా దవ్వుల వేణువు సవ్వడి వినినా
నీవు వచ్చేవని నీ పిలుపే విని, కన్నుల నీరిడి కలయచూచితిని
గడియయేని యిక విడిచిపోకుమా, ఎగసిన హృదయము పగుల నీకుమా
ఎన్నినాళ్లకీ బ్రతుకు పండెనో, ఎంతహాయి ఈ రేయి నిండెనో...

(పల్లవి పునరావృతం కాకపోవడం దీని ప్రత్యేకత)

అని భావకవిత్వానికి దగ్గరగా లలిత లలితమైన పదజాలంతో ప్రాసలతో పాటకు మృదువైన పూలబాట పరిచారు. 1952లో 'జనవాణి'లో మల్లీశ్వరి పాటలను సమీక్షిస్తూ తాపీ ధర్మారావు "ఈ పాటలతో సినిమా సాహిత్యానికి కావ్యగౌరవం వచ్చింది'' అన్నారు. ఈ పోకడకు దూరంగా కొసరాజు రాఘవయ్య చౌదరి వ్యంగ్యభూయిష్ఠమైన సామాజిక రాజకీయ చిత్రణ గల జానపద బాణీని ఆశ్రయించారు.

'రోజులుమారాయి' (1955)లో

కల్లాకపటం కాననివాడా- లోకంపోకడ తెలియని వాడా
ఏరువాకా సాగారో రన్నో చిన్నన్న
నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్న
నవధాన్యాలను గంపకెత్తుకుని చద్దియన్నమును మూటగట్టుకుని
ముల్లుగర్రను చేతపట్టుకుని ఇల్లాలును నీ వెంటబెట్టుకుని ॥ఏరు॥

పడమటి దిక్కున వరదగుడేసే ఉరుముల మెరుపుల వానల గురిసే
వాగులు వంకలు ఉరవడి జేసే ఎండినబీళ్లు యిగుళ్లువేసే ॥ఏరు॥

కోటేరును సరిజూచి పన్నుకో యెలపట దాపట యెడ్ల దోలుకో
చాలు దప్పక కొండ్ర వేసుకో విత్తనములు విసిరిసిరి చల్లుకో ॥ఏరు॥

పాలాలమ్ముకొని పోయేవారూ టౌనులొ మేడలు కట్టేవారూ
బాంకులొ డబ్బు దాచేవారూ నీ శక్తిని గమనించరు వారూ ॥ఏరు॥

పల్లెటూళ్లలో చెల్లని వాళ్లు పాలిటిక్సుతో బ్రతికేవాళ్లూ
ప్రజాసేవ యని అరిచేవాళ్లు ఒళ్లుమరచి చాకిరికి మళ్లరూ ॥ఏరు॥



పదవులు స్థిరమని భ్రమిసేవాళ్లే ఓట్లు గుంజి నిను మరచేవాళ్లే
నీవే దిక్కని వత్తురు పదవోయ్
రోజులుమారాయ్... రోజులుమారాయ్ ॥ఏరు॥

అంటూ మారుతున్న రోజులకు అద్దం పడుతూ -- రైతుకు కర్తవ్యోపదేశం చేసే పాటను ప్రజల భాషలో రాశారు. వరదగుడి వంటి మాండలిక పదప్రయోగాలు ఇందులో చోటు చేసుకొన్నాయి. యతిప్రాసలు లేకుండా కూడా ప్రజారంజకమైన సినిమాపాటలు రాయొచ్చు అని నిరూపించడానికే కొసరాజు ఈ పాట రాశారట.[19].

సన్నివేశపరమైన పాటలు ఆనాడు ఎక్కువగా వచ్చాయి. 'చిరంజీవులు' (1956)లో -- ప్రేమికుడు ప్రమాదంలో చిక్కుకోగా ప్రియురాలికి మరొకరితో పెళ్లయిపోతే , అది తెలిసి కుమిలిపోయే ప్రేమికుని ఆర్తికి ప్రియురాలి వ్యథకి మల్లాది రామకృష్ణశాస్త్రి గుండెల్ని పిండేలా బొమ్మ కట్టారు.

**అతడు : కనుపాప కరవైన కనులెందుకో**
**తనవారె పరులైన బ్రతుకెందుకో**

**ఆమె : విరజాజి శిల పైన రాలేందుకే**
**మరుమల్లె కెంధూళి కలిసేందుకే**
**మనసైన చినదాని మనసిందుకే రగిలేందుకే**

**అతడు : చిననాటి మురిపాలు కలలాయెనా**
**అలనాటి కలలన్ని కథలాయెనా**
**తలపోసి తలపోసి కుమిలేందుకా తనువిందుకా?**

**ఆమె : తనవారు తనవారె విడిపోరులే**
**కనుమూసి గగనాన కలిసేరులే**
**ఏనాటికైనా నీదాననే నీదాననే**

**అతడు : చిననాటి మనపాట మిగిలేనులే**
**కలకాల మీ గాథ రగిలేనులే...**

జాను తెనుగులో జీవితానికి దగ్గరగా వుండే మల్లాది వారి పాటలు రసికుల గుండెల్లో ప్రవహించి వాటిని రసప్లావితం చేశాయనడానికి ఈ ఉదాహరణ చాలు.

19. ఆరుద్రతో ముఖాముఖి

తెలుగు పాటను మల్లాది రసికజనమనోభిరామంగా తీర్చి దిద్దారనడానికి చిన్నకోడలు లోని పాట ప్రథమోదాహరణం

**పిలిచిన పలికే దాననోయ్**
**తలచిన వలచే జాణనోయ్**
**పిల్లనగ్రోవి పాటగాడ...**

ఇది తెలుగు సినిమాపాటల్లో స్త్రీ తనంత తానుగా శృంగారపరంగా పురుషునికి సమవుజ్జీని అని చెప్పిన మొదటి పాట.[20].

ఈ దశకంలో కొంతకాలం మాత్రమే జీవించినా పలుకు గల పాటరాసి తనదైన శైలిని నిరూపించుకొన్న మరో కవి తోలేటి వెంకటరెడ్డి

ఏ.వి.యమ్.వారి 'సంఘం' (1954)లో

**సుందరాంగ నిను మరువగలేనోయ్ రావేలా**
**నా అందచందములు దాచితి నీకై రావేలా**
**ముద్దునవ్వుల మోహన కృష్ణా రావేలా**
**నా నవ్వులలో రాలు సరాగాలు**
**రాగమయ రతనాలు ॥సుంద॥**

ఏ.వి.యమ్.వారి 'కాళహస్తి మాహాత్మ్యం'లో

**మహేశా పాపవినాశా**
**కైలాసవాసా ఈశా**
**నిన్ను నమ్మినాను రావా**
**నీలకంధరా దేవా**
**భక్తియేదో పూజలేవో తెలియనైతినే**
**పాపమేదో పుణ్యమేదో కాననైతినే- దేవా**
**మంత్రయుక్త పూజసేయ మనసు కరగునా**
**మంత్రమొ తంత్రమొ ఎరుగనైతినే**
**నాదమేదొ వేదమేదో తెలియనైతినే**
**వాదమేల, పేదబాధ తీర్చరావయా స్వామీ ॥మహేశా॥**

---

20. వి.ఎ.కె. రంగారావుతో ముఖాముఖి



మొదలైన పాటల్లో అనురాగాన్నీ మధురభక్తినీ అక్షరనిక్షిప్తం చేశారు తోలేటి.

1. **రాధను రమ్మన్నాడు**
   **రాసక్రీడకు మాధవదేవుడు**
   **రాధను రమ్మన్నాడు**

2. **వద్దురా కన్నయ్యా ఈ పొద్దు--**
   **ఇల్లు వదలి పోవద్దురా అయ్యా**

మొదలైన 'అర్ధాంగి'లోని పాటలతో తన ఉనికి నిరూపించుకొన్న ఆత్రేయ --

'తోడికోడళ్లు'లోని

**'కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడి చాన...'**

పాటతో సంచలనం సృష్టించారు.

'అమర సందేశం' (1954)లో చిక్కని పాటలు రాసిన శ్రీశ్రీ క్రమంగా సినిమా శైలి కలవాటు పడి మాంగల్యబలం (1959) నాటికి

1. **ఆకాశ వీధిలో అందాల జాబిలి**
   **ఒయ్యారి తారను చేరి ఉయ్యాల లూగెనే సయ్యాట లాడెనే**

2. **వాడిన పూలే వికసించెనే**
   **చెరవీడిన హృదయాలు పులకించెనే**

వంటి చక్కని ఆనంద గీతాలను రచించి, ఆలకించిన జనం చేత 'మధురం మధురం' అని పించారు.

**ఎవరు కన్నారు ఎవరు పెంచారు**
**నవనీత చోరుని గోపబాలుని ...'**

అనే 'ముద్దుబిడ్డ'లోని గొప్ప పాటతో మల్లాది రామకృష్ణశాస్త్రి మెప్పు పొందిన ఆరుద్ర అదే చిత్రంలో --

**'చూడాలని వుంది అమ్మా**
**చూడాలని వుంది నిన్ను**

పొరపాటు పసులిక
చేయబోసని నీతో చెప్పాలి
కంటికి నిద్దుర రాదే - నే
తింటే నోటికి పోదే
చేశా చిన్నతప్పు -- నువ్వు
వేశా వెంతో ఒట్టు
ఒకసారి మాత్రం నిన్ను
చూస్తే చాల్లే అమ్మా
కాళ్లు అటే పోయేనే - నా
కళ్లు అటే లాగేనే
చూడకపోతే దిగులు - నిను
చూస్తే ఏమౌతానో
చూడటం మరి కూడదంటే
ఏడుపొస్తుందమ్మా'

అంటూ ఆ పాత్రకు తగిన పసిపలుకులతో పాటను రాసి, అంతవరకు సినిమాపాటల్లో లేని బాలభాషకు శ్రీకారం చుట్టి - పాత్రౌచితిని పాటించారు.

'దేవదాసు' 'విప్రనారాయణ' వంటి చిత్రాలలో ఈనాడు కూడా పాడుకొని ఆనందించే అసామాన్యమైన పాటలను అందించిన సముద్రాల 'దొంగరాముడు' చిత్రంలో జానపద బాణీలో రాసిన పాట --

'రారోయి మా యింటికి
మామో మాటున్నది -- మంచి మాటున్నది
నువ్వు నిలుచుంటె నిమ్మ సెట్టు నీడున్నది
నువ్వు కూసుంటె కురిసీల పీటున్నది
నువ్వు తొంగుంటె పట్టెమంచం పరుపున్నది
ఆకలైతే సన్నబియ్యం కూడున్నది
అందులోకి అరకోడి కూరున్నది
ఆపైన రొయ్యపొట్టు చారున్నది'



ఆనాటి కవులు తమ పరిధికి మించిన విషయాలను కూడా తెలుసుకొని అందరి రుచులకూ అనుగుణంగా పాటలు రాశారనడానికి నిదర్శనం.

కిందటి దశాబ్దిలో ప్రారంభమైన సినిమా జావళీ మారాకు వేసింది-- ఉదాహరణ--

సమయమిది డాయరా సరసుడా
సమయమిది డాయరా
తమిగొని జతగొని సరసాల తేల తగు
సమయమిది డాయరా

- సముద్రాల (జూనియర్) - 'పెళ్లి సందడి'

ప్రజాదరణపొంది పదికాలాల పాటు నిలబడగలగడమే మంచి సినిమాపాటకు ప్రమాణమని యిప్పటికీ వినిపిస్తున్న ఈ దశకంలోని సినిమా పాటలు నిరూపించాయి. సినిమాపాట వినీ వినగానే సామాన్యులకు సైతం అర్థమయ్యేదిగా వుండాలనీ పాండిత్యమూ పాషాణపాకమూ సినిమా పాటకు పనికిరావనీ, 'ఆకాశరాజు' చిత్రంలోని విశ్వనాథ సత్యనారాయణగారి పాటలు రుజువు చేశాయి--

చిత్రంలోని కథానాయకుడు--

'సఖియా మనోహరీ ఇటురా కౌగింటికీ'

అని ఆలపిస్తే -- కథానాయిక అంత బరువుగానూ వలపు తలపుకు లోనవుతుంది.

'ఏ వలపిది బరువే ఎద బరువే
ప్రేమ భరాలస కామిత చిత్తా
దత్తాచ్ఛమతి జలజా ॥ఏ వలపిది॥

మనసు సరీ, ఎద దినును సరీ
పతి కలియని ఎడ మనసు అరే
వృథాయే, వృథాయే ॥ప్రేమ॥

పతి వలపును నమ్మేవా
అదియును బ్రతుకే ॥ప్రేమ॥

వలపు బరువా
లజ్జావతీ రద్దయే సులువనా
క్రమ్మి నమ్మవే నమ్మి నమ్మవే' ॥ప్రేమ॥

భాష బరువు మాట అటుంచి భావంలో కూడా కొత్తదనం కనిపించక పోవడం మహాకవులకు సైతం సినిమాపాట రాయడం సులువు కాదనడానికి నిదర్శనం. దీనికి ఉదాహరణ 'ఆకాశరాజు' లోనే మరోగీతం. ఇది ప్రేయసీ ప్రియుల మధ్య యుగళగీతం --

**అతడు : ఇది నిజమా నా మదిలో**
**వెలదీ నన్నే వలచెదే**

**ఆమె : ఇది నిజమే నా మదిలో**
**ప్రియుడా నిన్నే వలచితీ**

**అతడు : ఇది నిజమా?**

**ఆమె : విను, విను వీడి ప్రియా**
**మరేలయా నే బ్రతికి?**

**అతడు : నిజముగ నీవె సతీ**
**నన్నే మది నెంచితివే?**

**ఇద్దరు : మనసు తనువు కలిసి**
**సతీపతులు వెలయగా**

**ఆమె : ఇది నిజమే**

**అతడు : ఇది నిజమా నీ మదిలో**

**ఇద్దరు : కపురపుగాలి కస్తూరి తావీ**
**నీవును నేను అయితిమి నేడూ**

**ఆమె : నీవు చంద్రుడవే**

**అతడు : నీవు తారవులే చెలియా**



**ఆమె : నాథా**

**అతడు : నవ్వుల కుప్పవే! ఓ నవ్వుల కుప్పవే**

**ఇద్దరు : ఆనందపరిధిలో చరియింతమే**
**గగనాంతాన పోదామే**

**ఆమె : దొరసుత నని లేదూ మరుల గొనిన కాదూ**
**ప్రణయ జలధివి నీవు వలపు కణిక నీవు**

**ఇద్దరు : కమల పవన వీథులలో**
**నిరువురమును తేలుదమే**

ఇలా సినిమాపాట ఎలా వుండాలో, ఎలా వుండకూడదో ఈ దశకంలో మరింత స్పష్టమైంది.

ఈ దశలో బహుముఖంగా సాగిన తెలుగు సినిమాపాట ప్రజలకు సినిమా పట్ల ఆసక్తిని పెంచింది. చిత్రాల సంఖ్య గణనీయంగా పెరిగింది కాని ఒక్కొక్క చిత్రంలో వుండే పాటల సంఖ్య తగ్గింది. డబ్బింగ్ చిత్రాలు ఈ దశలోనే ప్రారంభం కావడంతో పాటల్లో అన్యభాషా వాక్యనిర్మాణ ధోరణులు పెరిగాయి. వ్యవహారభాషకు దగ్గరగా పాట వుండాలనే అభిప్రాయం కూడా ఈ ధోరణులకు కొంతవరకు కారణం. ఈ దశలో విద్య నెరిగిన కవులతోపాటు విద్యార్హతలు గల కవులు కూడా సినిమారంగం పట్ల ఆకర్షితులయ్యారు. సాంఘిక చిత్రాల శాతం పెరిగినా పౌరాణిక, జానపదాలను కూడా ప్రజలు ఆదరించడం వల్ల సంప్రదాయ శ్లోకాలు, పద్యాలు వాటి నకళ్లు కొల్లలుగా సినిమాల్లో చోటుచేసుకొన్నాయి. పౌరాణికాలైనా జానపదాలైనా సాంఘికాలైనా -- అరుదుగా తప్ప పాటల భాషలో చెప్పుకోదగిన తేడా లేకపోవడం ఈ కాలంలోని పాటల్లో విమర్శకులకు కనిపించే లోటు. వస్తుపరంగా రాజకీయ చైతన్యాన్ని రగిలించే పెక్కు పాటలొచ్చాయి. స్వాతంత్ర్యానంతరం ప్రజల అసంతృప్తిని గమనించిన సినిమా కవులు తమ వంతుగా స్వాతంత్ర్యం కొన్ని వర్గాల సొంతమవుతున్న ప్రమాదాన్ని పాటల్లో హెచ్చరించారు. విజయ, అనుపమ సంస్థల చిత్రాలలోని పాటలు ప్రజారంజకమైన పాటలకు ఒరవళ్లు పెడితే భరణీసంస్థ సినిమాల ద్వారా శాస్త్రీయగీతాలను కూడా వినిపింప జేసింది. జానపద గీతాలకూ వాగ్గేయకారుల కీర్తనలకూ ఈ దశకంలో రాజయోగం పట్టింది. సున్నితమైన అనురాగానికి పట్టం గట్టింది కనుకే యిది 'రాగోదయం'!

## రసోదయం (1961-70)

మూడు తరాల కూడలి అయిన ఈ దశకంలో సముద్రాల, తాపీ ధర్మారావు వంటి గురువృద్ధులు ఇంకా పాటలు రాస్తుండగా మల్లాది, పింగళి వంటి మూడోతరం కవులు -- 'కలిమిలేములు', 'జగదేకవీరుని కథ' 'గుండమ్మ కథ' వంటి చిత్రాలలోని పాటలతో విజయ పరంపర కొనసాగిస్తుండగా - ఓ పక్క కొసరాజు జానపద గీతాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండగా కొత్త కవులు వచ్చి నిలదొక్కుకోవడం మాటలు కాదు; అలా నిలబడిన కవులు 'వాగ్దానం'తో వచ్చిన దాశరథి, 'గులేబకావళి కథ' తో ప్రేక్షక హృదయాలను దోచుకొన్న సి. నారాయణరెడ్డి.

అతడు : ఖుషీ ఖుషీగా నవ్వుతూ చలాకీ మాటలు రువ్వుతూ
హుషారు గొలిపే వెందుకే - నిషా కనులదానా

ఆమె : మేనాలోన ప్రియుని జేర వెళ్లింది నా చెలీ మీనా
నింగిదాటి ఆనందసాగరం పొంగిపొరలె నాలోనా
ఖుషీ ఖుషీగా నవ్వుతూ చలాకీ మాటలు రువ్వుతూ
హుషారుగా గొలిపే దిందుకే నిషా కనులవాడా

(ఇద్దరు మిత్రులు)

ఇలా ఉర్దూ పదాల మేళవింపుతో కొత్తగా గమ్మత్తుగా యుగళ గీతాలు రాసి దాశరథి తన ప్రత్యేకతను చూపించారు.

పగలే వెన్నెల జగమే ఊయల
కదలే ఊహలకే కన్నులుంటే ॥పగలే॥

నింగిలోన చందమామ తొంగిచూచె
నీటిలోని కలువభామ పొంగి పూచె
ఈ యనురాగమే జీవనరాగమై
ఎదలో తేనెజల్లు కురిసిపోదా ॥పగలే॥

కడలి పిలువ కన్నెవాగు పరుగుతీసె
మురళిపాట విన్ననాగు శిరసునూపె



ఈ యనుబంధమే మధురానందమై
ఇలపై నందనాలు నిలిపిపోదా ॥పగలే॥

నీలిమబ్బు నీడలేచి నెమలి ఆడె
పూల ఋతువు సైగచూచి పికము పాడె
మనసేవీణగా ఝుణఝుణ మ్రోయగా
బ్రతుకే పున్నమిగా విరిసిపోదా ॥పగలే॥

(పూజాఫలం- సి.నా.రె)

ఇలా అందమైన పద బంధాలతో కూడిన అనుభూతివాద గీతాలతోను,

మబ్బులో ఏముంది నా మనసులో ఏముంది ?
మబ్బులో కన్నీరు నీ మనసులో పన్నీరు
తోటలో ఏముందీ నా మాటలో ఏముందీ
తోటలో మల్లియలు నీ మాటలో తేనియలు (లక్షాధికారి)

వంటి ప్రశ్న జవాబుల మార్కు గీతాలతోను - రవ్వంత సడిలేని రసరమ్య గీతాల కర్తగా నారాయణరెడ్డి సినీరంగంలో స్థిరమైన స్థానాన్ని సంపాదించారు.

ఈ దశకంలో శ్రీశ్రీ రాసిన -

కలకానిది, విలువైనది - బ్రతుకు
కన్నీటి ధారలలోనే బలిచేయకు (వెలుగు నీడలు)

నా హృదయంలో నిదురించే చెలీ
కలలలోనే కవ్వించే సఖీ
మయూరివై ఒయారివై నేడే
నటనమాడి నీవే నన్ను దోచినావే (ఆరాధన)

వంటి సినిమాపాటలు ఎన్నో ప్రాచుర్యం పొందాయి. ఈ రెండోపాట ఓ బెంగాలీ ట్యూన్‌ని అక్షరాలా అనుకరించి రాసిందని శ్రీశ్రీయే చెప్పుకొన్నారు[21]

ఈ దశాబ్దంలోనే 'ఉయ్యాల జంపాల'లోని ఆరుద్ర 'కొండగాలి తిరిగింది' గుండె గుండెను తాకి ఊసులాడించింది. 'రాజమకుటం' లోని 'సడిసేయకే గాలి,

21. పాడవోయి భారతీయుడా - పుట. 43

సడిసేయబోకే బడలి ఒడిలో రాజు పవ్వళించేనే', 'డాక్టర్ ఆనంద్'లోని 'నీలమోహనా రారా, నిన్ను పిలిచె నెమలి నెరజాణ' 'సుఖదు:ఖాలు'లో 'ఇది మల్లెల వేళయనీ' వంటి కృష్ణశాస్త్రి గీతాలు - భావుక హృదయాలను పులకింప చేశాయి. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ దశలో ఆణిముత్యాల్లాంటి సినిమాపాటలు ఎన్నెన్నో...!

అన్నిటి గురించి చెప్పకపోయినా 'ఆత్మబలం'లో ఆత్రేయ రాసిన 'చిటపట చినుకులు' యుగళగీతం గురించి చెప్పితీరాలి.

**ఆమె : చిటపట చినుకులు పడుతూ వుంటే**
**చెలికాడే సరసన వుంటే**
**చెట్టా పట్టగ చేతులు పట్టి**
**చెట్టునీడకై పరుగెడుతుంటే**
**చెప్పలేని ఆ హాయీ**
**ఎంతో వెచ్చగ ఉంటుందోయీ**

**అతడు : ఉరుములు ఫెళఫెళ ఉరుముతు వుంటే**
**మెరుపులు తళతళ మెరుస్తు వుంటే**
**మెరుపు వెలుగులో చెలికన్నులలో**
**బిత్తర చూపులు కనబడుతుంటే**
**చెప్పలేని ఆ హాయీ**
**ఎంతో వెచ్చగ వుంటుందోయీ**

అనన్య సామాన్యమైన ప్రచారం పొందిన ఈ వెచ్చని యుగళగీతం అంతవరకు వచ్చిన యుగళగీతాల్లో ఓ మలుపు, ఓ కుదుపు. యుగళ గీతాల స్వరూప స్వభావాలను మార్చివేసిన ఈ పాట ఓ కొత్త ఒరవడిని సృష్టించింది. ఆత్రేయ మనసు పాటలు, మనసుల పేర్లతో వచ్చిన సినిమాలు ప్రేక్షకుల మనసుల కెక్కాయి. ఆత్రేయ రాసిన మనసు పాటల్లో అధికశాతం ఈ కాలంలో వచ్చినవే.

'ఆత్రేయ మనసు పాటల వెనుక సామాజిక నేపథ్యం' అనే వ్యాసంలో వ్యాసకర్త హరి ఆత్రేయ 'ఆస్తిపరులు' లో రాసిన పాట విశిష్టత గురించి ఇలా రాశారు -- (ఆత్రేయ 1965లో రాసిన పాట)

'మగవాడివలె ఎగరేసుకు పో
పగవాడివలె నసుదోచుకు పో'



"తెలుగు సినిమాపాటల గమనాన్ని వేరే దారి పట్టించింది. త్యాగరాజ స్వామి నుంచి అప్పటి వరకు వచ్చిన గొప్ప, మంచి, చెడ్డ పాటలన్నింటిలో పల్లవి కంటె చరణంలో వస్తుబలం వుంటూ వచ్చింది. ఆత్రేయ రాసిన ఈ పాటలో వస్తువు మొత్తం పల్లవిలోనే వచ్చేసింది. ఎన్ని చరణాలు రాసినా పల్లవికి వివరణలుగానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడిపోయింది. ఆ తర్వాత వచ్చిన తెలుగు సినిమాపాటల్లో ఈ ధోరణి ప్రాధాన్యంలోకి వచ్చింది." [22]

ఇలా ఓ కొత్త ఒరవడికి మార్గదర్శకుడైన ఆత్రేయ రాసిన 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' (మూగ మనసులు) వంటి పంక్తులలోని సంక్షిప్తత, ఆర్ద్రత సినిమాపాట విలువను పెంచాయి.

ఈ దశకంలోనే 'అదృష్టవంతులు' కోసం ఆరుద్ర రాసిన --

**'ము...ము..ము... ము**
**ముద్దంటే చేదా నీకా వుద్దేశం లేదా**
**ఇప్పుడొద్దన్నావంటే కుర్రవాడా రేపు ఇమ్మన్నా ఇస్తానా వెర్రివాడా'....**

యువతరాన్ని వెర్రెక్కించి తెలుగు సినిమా పాటను శృంగార పాకంలో ముంచింది.

ఈ దశకంలో అన్నపూర్ణ, జగపతి సంస్థల నుంచి కమ్మని పాటలు వెలువడ్డాయి. కిందటి దశాబ్దంలో ప్రారంభమైన జావళీలుగా వచ్చిన సినిమా పాటల సంఖ్య ఈ దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా దాశరథి, నారాయణ రెడ్డి, సముద్రాల (జూ) ఇలాంటి పాటలను ఎక్కువగా రాశారు.

1. మదన సుందరా నాదొరా
నామది నిన్ను గని పొంగినదిరా -- వన్నెదొరా
**(గులేబకావళి కథ - సి.నా.రె.)**

2. ఓ మదనా మనసాయెరా
పరువము పొంగె తరుణము నేడె
మరి మరి నీకై రాబోదురా **(పూజాఫలం - సి.నా.రె.)**

22. ఆంధ్రప్రభ దినపత్రిక 2.11.90

3. రారా కౌగిలి చేర రారా దొరా
ఈ రంగేళి ప్రాయమ్ము నీదేనురా
**(పిడుగు రాముడు - సి.నా.రె.)**

4. రారా ప్రియా సుందరా
కౌగిలిలో నిన్ను కరగింతురా
**(భక్తప్రహ్లాద - 1967 - దాశరథి)**

5. అందాల బొమ్మతో ఆటాడవా
పసందైన ఈ రేయి నీదోయి స్వామీ
**(అమరశిల్పి జక్కన - దాశరథి)**

6. అందని సురసీమ నీదేనోయీ
అందరు ఆశించు అందాల హాయి
అందించే నెరజాణలమోయి
**(భక్త ప్రహ్లాద - సముద్రాల (జూ))**

7. మగరాయా వలరాయా
ఈ వయారి నీ సొమ్మురా
**(రహస్యం - మల్లాది రామకృష్ణశాస్త్రి)**

ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. 'ఆత్మగౌరవం'లోను, కొంత మార్పుతో 'లేత మనసులు' లోను క్షేత్రయ్య పదాలను ఉపయోగించుకొన్నారు. 'అనురాగం'లో భానుమతి పాడిన 'విన్నపాలు వినవలె వింత వింతలు' మొదలైన కీర్తనల వల్ల అన్నమయ్య సంకీర్తనల పట్ల చిత్రరంగానికి ఆసక్తి పెరిగింది. జానపదగీతాలను పల్లవుల వరకు ఉపయోగించుకొని పాటలు రాయడం ఈ దశలోనే ఎక్కువైంది.

హలా, లాహిరి, వైళమ వంటి పింగళి ఉపయోగించిన సరికొత్త పాత పదాలు జనాన్ని అబ్బురపరిచాయి. పింగళి, ఆత్రేయ మొదలైనవారి పాటల పంక్తులు కథలకూ సినిమాలకు పేర్లుగా ఉపయోగించుకోవడం ఆరంభమైంది. సాంఘిక చిత్రాల్లో కూడా అడపాతడపా పద్యాలు వినిపించాయి. ఈ కాలంలో నవ్యసంపన్నుల నడమంతరపు ఆధిపత్యానికి కలతపడిన మధ్యతరగతి మేధావుల మనసుల్లోని ఆందోళనకు ఆవేదనకు అక్షరరూపం యిచ్చిన ఆత్రేయ పాటలు మధ్యతరగతిని అమితంగా ఆకట్టుకొన్నాయి. ఈ దశాబ్దంలోని కవులు గతంలో పోలిస్తే గట్టి పోటీ నెదుర్కొని పాటలు పంచుకోవలసి



వచ్చింది. ఆరోగ్యకరమైన స్పర్థలో రసనిర్భరమైన పాటలు ప్రభవించాయి. ఒక మాటలో చెపితే కవులు సినీ రాజ్యాన్ని ఏలిన ఈ దశకం పాటలకు పెళ్లిపందిళ్లు వేసింది. ఇతర దశలతో పోలిస్తే రసబంధురమైన పాటలు ఈనాటికీ ఎక్కువగా నిలిచిన ఈ దశకాన్ని 'రసోదయంగా' అభివర్ణింపవచ్చు.

## చంద్రోదయం (1971-78) :

వెన్నెల వెలుగులతో పాటు చీకటి నీడల జాడలు కూడా వున్న ఈ దశను చంద్రోదయంగా భావింపవచ్చు. వ్యాపార ప్రభావం సినిమాలమీదే కాకుండా సినిమాపాటల మీద కూడా ప్రసరించడం ప్రారంభమయింది. అయినా ఇలాంటి మబ్బుల్ని దాటుకొని చందమామ వెదజల్లిన వెన్నెల్లా ఆహ్లాదాన్ని పంచిపెట్టే పాటల్ని అందించిన కాలం గనుకే ఇది 'చంద్రోదయం'.

ఈ దశలో కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ వంటి 50ల దశకంలో పాటలు ప్రారంభించిన కవులూ, 60ల దశకంలో వచ్చిన దాశరథి, సి. నారాయణ రెడ్డి ప్రభృతులూ ముమ్మరంగా పాటలు రాస్తుండగా కొత్తనీరు కూడా వచ్చి చేరింది. ఇలా కొత్తగా వచ్చిన వారిలో వేటూరి సుందరరామమూర్తి, మల్లెమాల, గోపి మొదలైన వారి పేర్లు చెప్పుకోవచ్చు.

ఈ శకంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి

**చీకటి వెలుగుల కౌగిటిలో**
**చిందే కుంకుమవన్నెలు**
**ఏకమైన హృదయాలలో**
**పాకే బంగరు రంగులు** **(చీకటి వెలుగులు)**

**నాదారి ఎడారి**
**నా పేరు బికారి,**
**మనసైన చోట మజిలీ కాదన్నచాలు బదిలీ**
**(శ్రీ రాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్)**

వంటి పాటలతో తన భావకవితా ముద్రను కొనసాగిస్తే

ఆరుద్ర 'దేవదాసు', 'సంపూర్ణ రామాయణం' సినిమాలకు పాత పాటలతో పోటీ పడే పాటలను రాసినా సామాన్య జనంలో వాటికంత ప్రచారం రాలేదు. 'ముత్యాల

ముగ్గు'లో ఆరుద్ర రాసిన 'ముత్యమంతా పసుపు - ముఖమంత చాయ' విస్తృత ప్రచారం పొందింది.

'దసరా బుల్లోడు', 'ప్రేమనగర్' సినిమాలు సాధించిన అపూర్వ విజయాలు ఆత్రేయకు పెద్దపీట వేశాయి. ఆత్రేయ భావుకత శిఖరాలనందుకోగా భాష సామాన్యుడి గుండె లోయల్లో ప్రవహించింది. రాసి ప్రేక్షకులను, రాయక నిర్మాతలను యేడిపిస్తాడని ఆత్రేయ పేరుపడిన కాలం యిదే. కేవలం ఆత్రేయ పాటల కారణంగానే కొన్నిచిత్రాలు విజయవంతమయ్యాయనడం అతిశయోక్తి కాదు.

**మనసు గతి యింతే**
**మనిషి బ్రతుకింతే**
**మనసున్న మనిషికీ**
**సుఖము లేదంతే**

**ఒకరికిస్తే మరలిరాదు**
**ఓడిపోతే మరచిపోదు**
**గాయమైతే మాసిపోదు**
**పగిలిపోతే అతుకు పడదు**

అంటూ తేలికైన పదాల్లో అంతుపట్టని మనసు గురించి క్లుప్తంగా గుప్తంగా ఆప్తంగా చెప్పిన ఆత్రేయ పాటలు మాటల్లా వుంటాయని విమర్శకుల అభిప్రాయం. ఆత్రేయ మాటల్లా రాసిన పాటలు కూడా మంచి పాటలు అయ్యాయనడానికి వచన కవిత రూపంలో వున్న ఈ పాటే నిదర్శనం --

**మనసైతే మధువు తాగు**
**వీల్లేకుంటే విషం తాగు**
**మధువు మత్తెక్కిస్తుంది**
**విషం గట్టెక్కిస్తుంది** ॥తాగు॥

**నీళ్లు తాగి బ్రతికే పేదవాళ్లు వున్నారు**
**కన్నీళ్లు తాగి చచ్చే పిరికివాళ్లు వున్నారు**
**వాళ్లెవరూ ఎన్నడూ సుఖపడలేదు**
**తామెవ్వరిని సుఖపెట్టనూ లేదు**



**బ్రాందీ విస్కీ జిన్ను రమ్ము రకరకాల మధువులు**
**భార్యాభర్తలు తల్లీపిల్లలు పలురకాల బంధాలు**
**ఏదైనా నిషా తగ్గే వరకే**
**ఎవరైనా ఋణం తీరేవరకే**
**ఆపై మిగిలేదేముంది?**
**ఖాళీ సీసాలు**
**కాలిన బూడిదలు** ॥తాగు॥

**(పుట్టింటి గౌరవం - 1975)**

ఈ పాటను ఉటంకించడం ఓ తత్త్వ రహస్యాన్ని అంత తేలిగ్గా చెప్పినందుకే కాదు - ఆత్రేయ కలం సినిమాపాట స్వరూపాన్ని ఎంతగా మార్చిందో సోదాహరణంగా తెలియడానికి కూడా.

ఈ దశలోనే శ్రీశ్రీ 'అల్లూరి సీతారామరాజు'లో రాసిన పాటకు జాతీయ బహుమతి లభించింది. ఓ తెలుగు సినిమాపాటకు జాతీయ స్థాయిలో బహుమతి లభించడం ఇంతవరకు ఇదే మొదటిసారి - మొదటి సారె!

**తెలుగు వీర లేవరా**
**దీక్ష బూని సాగరా**
**దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా**
**దారుణమారణకాండకు తల్లడిల్లవద్దురా**
**నీతిలేని శాసనాలు నేటినుండి రద్దురా**
**నిదురవద్దు బెదరవద్దు**
**నింగి నీకు హద్దురా** ॥తెలుగు॥

**ఎవడువాడు ఎచటివాడు**
**ఇటువచ్చిన తెల్లవాడు**
**కండబలం గుండెబలం**
**కబళించే దుండగీడు**
**మానధనం ప్రాణధనం**
**దోచుకొనే దొంగవాడు**
**తగినశాస్తి చేయరా**
**తరిమితరిమి కొట్టరా** ॥తెలుగు॥

ఈ దేశం ఈ రాజ్యం నాదే అని చాటించి
ప్రతివ్యక్తి తొడలుగొట్టి శృంఖలాలు పగులగొట్టి
చురకత్తులు పదునుపెట్టి తుదిసమరం మొదలుపెట్టి
సింహాలై గర్జించాలి, సంహారం సాగించాలి ॥తెలుగు॥

ఈ పాట రచన గురించి 'పాడవోయి భారతీయుడా'లో శ్రీశ్రీయే ఇలా ఆత్మవిమర్శ చేసుకొన్నారు.[23]

"తెలుగువీర లేవరా' అనే పాటతో ఈ సంపుటిని మొదలు పెట్టకపోవడానికి చిన్నకారణం వుంది
అందులో

ప్రతిమనిషి తొడలుగొట్టి
సింహాలై గర్జించాలి.

అనడంలో వ్యాకరణ దోషంవుంది. ప్రతిమనిషి (పాటప్రకారం'వ్యక్తి') ఏకవచనం. సింహాలై బహువచనం. సింహంలా గర్జించాలి అంటే సరిపోతుంది. సాహిత్యరీత్యా మాత్రమేగాక సంగీతపరంగాకూడా.''

ఈ పాటను స్మరించడం జాతీయబహుమతి పొందిన ఏకైక ఆంధ్రగీతం అనేకాదు- తర్వాతి దశకంలో విప్లవగీతాలకు దారి వేసినందుకు కూడా.

సినిమాపాటకు ఒక భాష, పరిమితమైన పదాలు వున్నాయి. హిందీలో నౌషద్‌తో పనిచేసిన కవులందరూ డెబ్బై ఎనబై పడికట్టు పదాలతోనే పాటలు రాసేవారని విమర్శకుల అభిప్రాయం. అలాగే తెలుగులో ఆత్రేయరాసిన సుమారు 1400 పాటల్లోని పదాలను లెక్కపెడితే అయిదారువందలకు మించవు. ఈ పరిమితులను దాటి విస్తృతంగా పదాలను, పాండిత్యస్ఫోరకమైన భాషనూ మొదటిసారిగా సి. నారాయణరెడ్డి, ఆ తర్వాతి తరంలో వేటూరి సుందరరామమూర్తి ఉపయోగించారు. ఈ భాష సామాన్యమైన సినిమాపాటలకు భిన్నంగా- ఓ లక్ష్యసిద్ధికోసం అవగాహనతోచేసిన ప్రయోగం.

ఓ సాంఘికచిత్రం (చెల్లెలికాపురం--1971)లోని పాటలో ఇలాంటి భాషనుపయోగించి ఆ తర్వాత ఎన్నోపాటలకు మార్గదర్శకులయ్యారు సి. నారాయణ

23. పుట సంఖ్య.3.



రెడ్డి. సినిమా పాటల్లో భాషాసాహిత్యాల గురించి విమర్శించేవారికి ఈ పాట చక్కని సమాధానం. ఇది ఓ నర్తకి నాట్యప్రావీణ్యాన్ని సవాల్‌చేస్తూ ఓ కవి పాడిన పాటగనుక భాషౌద్ధత్యానికి ఔచిత్యం వుంది.

చరణకింకిణులు ఘల్లుఘల్లుమన
కరకంకణములు గలగలలాడగ
అడుగులందు కలహంసలాడగా
నడుములో తరంగమ్ములూగగా
వినీల కచభర విలాస బంధుర
తనూలతిక చంచలించి పోగా
ఆడవే మయూరీ
నటనమాడవే మయూరీ
నీ కులుకును గని నా పలుకు విరియ
నీ నటనను గని నవకవిత వెలయగా
ఆడవే మయూరీ
... ... ... ...
ఫాలనేత్ర సంప్రభవత్ జ్వాలలు
ప్రసవశరుని దహియించగా
పతిని కోలుపడి రతీదేవి
దు:ఖితమతియై రోదించగా
హిమగిరీంద్ర శిఖరాగ్రతాండవత్
ప్రమథగణము కనిపించగా
ప్రమథనాథ కరపంకజభాంకృత
డమరుధ్వని వినిపించగా
ప్రళయకాల సంకలిత భయంకర
జలధరార్భటుల చలిత దిక్తటుల
చకితదిక్కరుల వికృతఘీంకృతుల
సహస్రఫణసంజనిత ఫూత్కృతుల
కనులలోన కనుబొమలలోన
అధరమ్ములోన వదనమ్ములోన

గళసీమలోన కటిసీమలోన
కరయుగములోన పదయుగములోన
నీ తనువులోని అణువణువులోన
అనంతవిధముల అభినయించి
ఇక ఆడవే ఆడవే ఆడవే...

ఈ పాటలో భాషాగరిమ కవితాపటిమ కలిసి పరుగులుతీసి భావావేశాన్ని కలిగించడం తెరమీద పాత్రకు, తెరవెనుక కవికి గల పాండిత్యాన్ని సూచిస్తోంది. నాట్యమాడే మయూరిగా స్త్రీని అభివర్ణించడం అంతకుముందు అరుదుగా సినిమాపాటల్లో వచ్చినా ఈ పాట తర్వాత నాట్యమయూరి అనే పదచిత్రాన్ని సినిమాకవులు విశృంఖలంగా ఉపయోగించారు. 'మయూరి' పేరుతో ఒక సినిమాయే వచ్చింది. కాని వాస్తవికదృష్టితో చూస్తే ఆడనెమలి ఆడదు. అవాస్తవికమైన కవిసమయాల్లో దీనినికూడా ఒకటిగా పరిగణించాలి.

ఈ దశలో సినీకవిగా తన సొంత చిత్రాలకు పరిమితమై రాసిన నిర్మాత సహజకవి మల్లెమాల. తనకు పరిచితవైన పల్లెపట్టు అందాలను సినిమాపాటల్లో బంధించడంలో నైపుణ్యం ఈ కవి ప్రత్యేకత.

నెల్లూరిచేలలో పిల్లగాలికి వూగే
వరివెన్నులాంటిది మల్లిసొగసు
అదివద్దన్నా దోస్తుంది నామనసు (నాయుడుబావ)

వంటి పల్లెసీమలకు చెందిన పాటలతోపాటు--

సంగమం సంగమం
అనురాగ సంగమం (కోడెనాగు)

వంటి అనుభూతిపరమైన గీతాల్లోకూడా మల్లెమాల కలానికి తనదైన బాణీవుంది.

మైలవరపు గోపి 'పండంటికాపురం'లో రాసిన తత్త్వం కొత్తరంగు, రుచితో-- మూసబాణీనుంచి సినిమాతత్త్వాలకు విముక్తి కలిగించింది.

ఇదిగో దేవుడు చేసినబొమ్మ
ఇది నిలిచేదేమో మూడురోజులు



బంధాలేమో పదివేలూ ॥ఇది॥
నదిలో నావా ఈ బ్రతుకూ
దైవం నడుపును తన బసకూ
అనుబంధాలూ ఆనందాలూ
తప్పవులేరా కడవరకు ॥ఇది॥
రాగం ద్వేషం రంగులురా
భోగం భాగ్యం తళుకేరా
కునికే దీపం తొణికే ప్రాణం
వెలిగే కాలం తెలియదురా

గత దశకంలో 'ఇంతేరా ఈ జీవితం -- తిరిగే రంగుల రాట్నము' (రంగుల రాట్నం) అనే ఒకే ఒకపాట రాసి మెప్పుపొందిన యస్వీ. భుజంగరాయ శర్మలా ఈ దశకంలో ఒకే ఒక సినిమాపాటతో (ఇప్పటివరకూ అదొకటే) గుర్తింపు పొందినకవి గుంటూరు శేషేంద్రశర్మ--

నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది
కన్నుల్లో నీరు తుడిచి కమ్మని కల యిచ్చింది
రమ్యంగా కుటీరాన రంగవల్లులల్లింది
దీనురాలి గూటిలోన దీపంగా వెలిగింది
శూన్యమైన వేణువులో ఒకస్వరం కలిపి నిలిపింది
ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసింది
విఫలమైన నాకోర్కెలు వేలాడే గుమ్మంలో
ఆశల అడుగులు వినబడి అంతలో పోయాయి
కొమ్మల్లో పక్షుల్లారా గగనంలో మబ్బుల్లారా
నది దోచుకుపోతున్న నావను ఆపండి
రేవు బావురుమంటోందని చెప్పండి (ముత్యాలముగ్గు)

ఉత్తరరామాయణానికి సాంఘికరూపమిచ్చిన సన్నివేశానికి అనుగుణమైన ఈ పాట ఒక అపురూపమైన కావ్యఖండిక. సినిమాపాటకు భిన్నమైన వ్యక్తీకరణతో నడిచిన ఈపాట సహృదయులను ముగ్ధులనుచేసే అనుభూతిపరమైన భావచిత్రం.

ఇంకా ఈ తరంలో

తనువా - ఉహు - హరిచందనమే
పలుకా - ఉహు - అది మకరందమే (కథానాయకురాలు)

అని హరిచందనంలా మకరందంలా భావశైలీ సౌకుమార్యంగల పాటతో జి. విజయరత్నం,

ఏతమేసి తోడినా ఏరు ఎండదు
పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు
దేవుడి గుడిలోదైనా పూరిగుడిసెలోదైనా
గాలి యిసిరికొడితే ఆ దీపంవుండదు (ప్రాణం ఖరీదు)

అనే జానపద తత్త్వధోరణిలో సాగిన పాటతో జాలాది,

కురిసింది వాన నా గుండెలోన
నీ చూపులే జల్లుగా (బుల్లెమ్మ-బుల్లోడు)

అనే కొత్తచూపు కలిగిన పాటతో రాజశ్రీ,

జోరు మీదున్నావు తుమ్మెదా
నీ జోరెవరికోసమే తుమ్మెదా (శివరంజని)

అంటూ సరికొత్తపోకడలో రాసిన తుమ్మెదపదంతో దాసం గోపాలకృష్ణ - విభిన్న ధోరణులలో సినిమాపాటను నడిపించారు.

'ఓ సీతకథ' లోని

'భారతనారీ చరితము మధుర కథాభరితము
భావగుణ విస్ఫురితము
పతిసుతానుమతము సతము'

అనే హరికథా గీత రచనతో సినీరంగ ప్రవేశంచేసి, బహుముఖంగా పాటలురాసి, సినిమాపాటకు కొత్త రూపునూ, ఊపునూ యిచ్చి తనదైన ముద్రతో తర్వాతి తరానికి మార్గదర్శకులయ్యారు వేటూరి సుందరరామమూర్తి.

'ఝుమ్మంది నాదం
సై అంది పాదం
తనువూగింది ఈ వేళ



చెలరేగింది ఒక రాసలీల' (సిరిసిరిమువ్వ)

అని అలవోకగా అంత్యప్రాసలను సాధించి--

మా ఱేడు నీవని ఏ రేరితేనా
మారేడు దళములు నీపూజకు (భక్తకన్నప్ప)

అని శ్లేషాలంకారంతో భక్తిగీతాన్ని భూషించి--

ఆరేసుకోబోయి పారేసుకున్నాను
కోకెత్తుకెళ్లింది కొండగాలి (అడవిరాముడు)

అనే సలక్షణమైన సీసపద్య పాదాన్ని సంచలనం కలిగించిన కోటి రూపాయల పాట పల్లవిగా నిరూపించి--

1. పిల్లన గ్రోవికి నిలువెల్ల గాయాలు
అల్లన మోవికి తాకితే గేయాలు (సప్తపది)
2. దొరల నీకు కనులనీరు దొరలదీ లోకం
మగదొరలదీ లోకం (నాలుగు స్తంభాలాట)
3. నువ్వు పట్టుచీర కడితే ఓ పుత్తడి బొమ్మ
ఆ కట్టుబడికి తరించేను పట్టుపురుగు జన్మ (సీతాకోక చిలుక)

వంటి పాటలలో కవితాపరంగా కొత్తకోణాలను ప్రదర్శించి- ఈ దశకంలో సినిమాపాటను సుమసుందరంగా రసబంధురంగా తీర్చిదిద్దారు సుందరరామమూర్తి.

ఈ దశలో పౌరాణికచిత్రాలు కనుమరుగైపోయాయి. సాంఘికచిత్రాల్లో పాటలసంఖ్య ఆరేడింటికి పరిమితమైంది. జానపద పల్లవులను తీసుకొని రాసిన పాటల సంఖ్య విపరీతంగా పెరిగింది.

1. పచ్చగడ్డికోసేటి పడుచుపిల్లోయ్...
నీ పైటకొంగు జారిందే గడుసుపిల్ల (దసరాబుల్లోడు - ఆత్రేయ)
2. ఉంటే ఈ వూళ్లో వుండు
పోతే మీదేశం పోరా
చుట్టుపక్కల వున్నావంటే
చూడకుండా ప్రాణం వుండదురా (ప్రేమనగర్ - ఆత్రేయ)

3. ఆకులు పోకలు యివ్వద్దు
నానోరు ఎర్రగ చేయొద్దు (భార్యాబిడ్డలు - ఆత్రేయ)

4. గోరింటా పూచింది కొమ్మాలేకుండా (గోరింటాకు - కృష్ణశాస్త్రి)

ఇలా ఎన్ని ఉదాహరణలైనా చెప్పుకోవచ్చు.

ఈ దశకంలో శృంగారనృత్యాలకు, క్లబ్బు డాన్సులకు ఉద్దేశించిన పాటలసంఖ్య పెరిగింది. కేవలం ఈ నృత్యాల కోసమే కొందరు శృంగార తారలు రావడంతో-- సినిమాల్లో ఇలాంటి పాటొకటి తప్పనిసరి అంశమైపోయింది.

1. సూదిలో దారం సందులో బేరం
సరిజోడు సిన్నోడు మిరియాల కారం (దేవుడు చేసిన పెళ్లి - దాశరథి)

2. రాయంటి నామగడు రంగమెల్లి
తిరిగి రాలేదు (తాత-మనవడు-సుంకర)

3. ఎత్తుకుంటావా నన్నెత్తమంటావా
నీకత్తిచూస్తే గుండెల్లోనా గుబులౌతుందయ్యో
(కత్తుల రత్తయ్య - దాశరథి)

4. లే లే నారాజా లే లే నారాజా
లేవనంటావా - నన్ను లేపమంటావా - నిద్దుర లేపమంటావా
(ప్రేమనగర్ - ఆత్రేయ)

అలాంటి గీతాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కాలంలోనే బండిపాటలు, సైకిల్‌పాటలూ దండిగా వచ్చాయి. ద్వంద్వార్థాల పట్ల పరిశ్రమ మోజు చూపించింది.

'ఆడించు ఆడించు జోరుగా అందాల పప్పునూనె గానుగ'
'కడవెత్తుకొచ్చింది కన్నెపిల్ల కాడెత్తుకొచ్చాడు గడుసుపిల్లడు'...

వంటి పాటలను ఈకోవకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. వీటిలో బూతు వుందంటే వుంది, లేదంటే లేదు. కాని వీటిలో సూచ్యంగా వున్నది ఆ తర్వాతి కాలంలో విజృంభించి వెర్రితలలు వేసింది.

పాశ్చాత్య సంగీతవాద్యాల హోరు, ఆ బాణీల ప్రయోగం ఎక్కువయ్యాయి. ఘంటసాల ఇద్దరు ముగ్గురు కథానాయకుల పాటలకు మాత్రమే స్వరంలో తేడా



చూపించగా ఈ దశలో యస్.పి. బాలసుబ్రహ్మణ్యం నేపథ్యగాయకునిగా స్థిరపడి అనేక కథానాయకుల గొంతులను అనుకరిస్తూ పాటలు పాడ్డంతో-- గానపరంగా కూడా సినిమాపాటల్లో వైవిధ్యం పెరిగింది.

మొత్తంమీద ఈ శకం సినిమాపాటల స్వర్ణయుగంలో చరమాంకం అని చెప్పుకోవచ్చు.

## అయోమయం (1979-91) :

ఇంతకుముందు దశలన్నిటినీ ఉదయాలుగా అభివర్ణించి ఈ దశకు అయోమయం అని పేరుపెట్టడం వర్తమానాన్ని కించపరచడం కాదు. ఈ దశలో తెలుగు సినిమాపాట నాలుగు రోడ్లకూడలి దగ్గర దిక్కుతోచని స్థితిలో నిల్చుంది. ఒక స్థిరమైన రూపం లేకుండా నానామార్గాలు తొక్కుతున్న తెలుగు సినిమాపాట పరిస్థితిని ఉన్నదున్నట్టు చెప్పడానికి అయోమయం అనే పదం వాడాల్సివచ్చింది.

ఈ దశలో తెలుగు సినిమాపాట కవితా ప్రమాణాల్లో ఆకాశమంత ఎత్తు ఎదిగింది. అపరిపక్వత, అన్వయరాహిత్యం, భాష మొదలైన విషయాల్లో పాతాళపులోతులకు దిగజారింది. ఒపక్క శ్రుతిమించిన శృంగారం వైపు మరోపక్క అంగారం వైపు ఊగుతోంది. పాశ్చాత్య వాద్యాల కసరత్తులు పాట ఏ భాషకు చెందిందో తెలియనంతగా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ స్థితిని చెప్పడానికి 'అయోమయం'కంటె అర్థవమైన పదం కనిపించదు !

'అడవిరాముడు', 'యమగోల' చిత్రాలు సాధించిన విజయాలతో సినిమాపాట స్వరూపం మరోసారి మారిపోయింది గనుక 1978ని ముందుశకానికి సరిహద్దుగా నిర్ణయించడం జరిగింది. ఈ దశలో పాటల్లో వైవిధ్యం పెరిగింది. పాటల రచయితల సంఖ్యకూడా పెరిగింది. దానితో పాటపట్ల అవగాహన తగ్గింది. సినిమాపాట రాయడం అతిసులభం అనే అభిప్రాయం ఏర్పడి ఎవరుపడితే వాళ్లు పాటలు రాసేకాలం వచ్చింది. ద్వంద్వార్థాలు సర్వసాధారణమైపోయి అశ్లీలార్థంతో పాటల రాయడం రచయితలకు అర్హతగా పరిగణించబడుతోంది.

80ల దశకంలో 'డిస్కోడాన్సర్' వంటి చిత్రాల ప్రభావంతో తెలుగులో అలాంటి పేర్లతో కొన్నిచిత్రాలు, చాలా డిస్కోపాటలు వచ్చాయి. ఈ కాలంలో ఈ విశేషణం గల పేరుతో ఒక నటి స్థిరపడిందంటే ఈ ప్రక్రియపట్ల ప్రేక్షకుల వ్యామోహాన్ని

ఊహింపవచ్చు. విద్యుద్దీపాల వింతకాంతులతో కళ్లు మిరుమిట్లుగొలిపే ఈ డిస్కోనృత్యాలకు అనుగుణమైన పాటలబాణీకి యువతరం కొంతకాలం బ్రహ్మరథం పట్టారు.

మచ్చుకి అలాంటి పాటలు

1. **ఒక లైలాకోసం తిరిగాను దేశం**
   **ప్రతి రాత్రి ప్రతి పగలు ఆమెకోసం (రాముడుకాదు కృష్ణుడు)**

2. **డిస్కో నా రాజా...అహ...అహ...**
   **డిస్కో నా రాజా.... (కళారంజని)**

ఇలాంటి పాటలకు క్రమంగా ఆదరణ తగ్గుతున్నకాలంలో 'ఫాస్ట్‌ఫార్వర్డ్' అనే ఆంగ్లచిత్రంలోని పాటబాణీ ఆధారంగా 'పసివాడి ప్రాణం' అనే సినిమాతో 'బ్రేక్ డాన్స్' అనే కొత్తప్రక్రియ ప్రారంభమైంది. ఆపాట

**చక్కని చుక్కల సందిట బ్రేక్‌డాన్స్**
**చక్కిలిగింతల మాటున షేక్‌డాన్స్**
**నా పిట్ట నడుమున పుట్టిన ఫోక్‌డాన్స్**
**నీ బుట్ట అడుగున ఆడిన స్నేక్‌డాన్స్ (వేటూరి)**

తర్వాత ఇలాంటి బ్రేక్ డాన్స్‌పాటలు అనేక చిత్రాల్లో వేలంవెర్రిగా వచ్చాయి. అయితే తొంభయ్యవ దశకంలో బ్రేక్ డాన్స్‌పాటలు వినిపించడం తగ్గిపోయింది.

ఇలా ఒకపక్క శృంగారం శ్రుతి తప్పుతుంటే మరోపక్క అంగారగీతాలుకూడా ఎనభయ్యవ దశకంలోనే ఒక తరంగంలా వచ్చాయి. సినిమాపాట కేవలం వ్యాపారానికీ ప్రజల బలహీనతల్ని రెచ్చగొట్టడానికీ కాదు - జనజాగృతికి దానిని ఉపయోగించాలనే ఆశయంతో అంకితభావంతో నవతరం పిక్చర్స్ చిత్రాలలో దాదాపు అన్నీ విప్లవాత్మకమైన గీతాలనే రాయించిన నిర్మాత రెడ్ స్టార్ మాదాల రంగారావు. అంతకు పూర్వం వచ్చిన సినిమాలలో అడపాతడపా కొన్ని విప్లవాత్మకమైన పాటలు వచ్చినా చిత్రమంతా అటువంటి పాటలతోనే రావడం మాదాల రంగారావు తీసిన 'యువతరం కదిలింది' తోనే ప్రారంభమైంది. ఆ సంస్థ తీసిన 'యువతరం కదిలింది', 'ఎర్రమల్లెలు', 'విప్లవశంఖం', 'నవోదయం', 'ప్రజాశక్తి', మొదలైన చిత్రాలలోని ప్రబోధాత్మకమైన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోడానికి కేవలం శృంగారగీతాలే అవసరంలేదు; ఆలోచింపజేసే పాటలనుకూడా ప్రజలు ఆదరిస్తారు అని రుజువుచేశాయి.



**ఓ.... లగిజిగి జిగిలగి జిగిజిగి లగిజిగి లంబాడీ**
**లజ్జనక జనకరీ తకిటతకిట తక తాళంవేస్తూ**
**తిరగబడర అన్నా ఓహో తిరగబడర అన్నా (ఎర్రమల్లెలు-ధవళసత్యం)**

**జజ్జెనకరి ఝుణారె**
**జెణకు జెణ ఝుణారె (విప్లవశంఖం - వంగపండు)**

**అన్యాయం అక్రమాలు దోపిడీలు దురంతాలు**
**ఎన్నాళ్లని ఎన్నేళ్లని నిలదీసినదీ రోజు**
**అణగారిన శ్రమశక్తిని ఆవేశం ఊపిరిగా**
**కదిలించినదీ రోజు రగిలించినదీ రోజు**
**మేడే... మేడే... నేడే... మేడే (ఎర్రమల్లెలు - అదృష్టదీపక్)**

**అక్కో అక్కో అక్కో మీ సెల్లెల మెచ్చిన మక్కా !**
**(నవోదయం-భానూరి)**

**నాంపల్లి టేశన్‌కాడ రాజాలింగో (ఎర్రమల్లెలు-ప్రభు)**

మొదలైన నవతరంవారి చైతన్య గీతాలన్నీ ఏ యితర సినిమాపాటలకూ తీసిపోని ప్రచారం పొందినవే.

నవతరం పిక్చర్స్ బాటలోనే చిత్రాలు తీసిన ఈతరం పిక్చర్స్, టి. కృష్ణ మెమోరియల్ పిక్చర్స్, స్నేహచిత్రవారి చిత్రాలలోని పాటల్లో-

**అత్తా పోదాంరావే మనవూరి దవాఖానకు...**
**(నేటిభారతం - బండ్ల కిష్టస్వామి)**

**చూడు మల్లేశా చూడు మల్లేశా**
**దేశమెట్ట పోతుందో కనరా మల్లేశా**
**(దేశంలో దొంగలుపడ్డారు-కె. లక్ష్మీనారాయణ)**

**ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతమా - తందనాన తానా**
**ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు పెద్దల బండారమా - తందనాన తానా**
**(సగటు మనిషి - అదృష్టదీపక్)**

మొదలైనవి ప్రజాదరణను పొందాయి.

ఈ సంస్థలు శ్రీశ్రీ విప్లవగీతాల్లో కొన్నిటిని యథాతథంగాను కొన్నిటిని కథానుగుణమైన మార్పులతోను ఉపయోగించుకొన్నాయి. ఈ దశలో గద్దరు పాటలు కూడా సినిమాపాటలుగా రావడం గమనార్హం. ఈ తరహా చిత్రాలలో చైతన్య గీతాలు రాసిన ఎక్కువమంది రచయితలు అంతకుపూర్వం సినిమా ముద్ర లేనివారే. ఈ పాటల్లో ఉత్తరాంధ్ర, తెలంగాణా మాండలికాల యాసలు కూడా ఎక్కువగా చోటుచేసుకొన్నాయి. ఇటువంటి చిత్రాలలోని పాటలకు లభించిన ఆదరణను గమనించి కొన్ని వ్యాపార చిత్రాలలో కూడా ఇలాంటి పాటలను రాయించారు. అయితే ఈ పాటలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.

ఎనభై తర్వాత వచ్చిన మరోపరిణామం శాస్త్రీయ సంగీతాలకు వాగ్గేయకారుల గీతాలకు అపూర్వమైన ఆదరణ అభించడం. ఈ ఖ్యాతి కేవలం 'శంకరాభరణం' దర్శక నిర్మాతలకూ, రచయిత వేటూరి సుందరరామమూర్తి, గాయకుడు యస్.పి. బాలసుబ్రహ్మణ్యంగార్లకే దక్కుతుంది. ఈ చిత్రం తర్వాత - 'సాగర సంగమం', 'ఆనందభైరవి', 'శ్రుతిలయలు', 'స్వర్ణకమలం' మొదలైన సంగీత ప్రధానమైన చిత్రాల్లోనే కాకుండా సాధారణచిత్రాల్లో సైతం శాస్త్రీయ గీతాలు, వాగ్గేయకారుల గీతాలూ అవిచ్ఛిన్నంగా వస్తూనే వున్నాయి. ఈ ధోరణికి విశ్వనాథ్, బాపు, జంధ్యాలవంటి దర్శకులు దోహదం చేస్తున్నారు.

80ల దశకంలో ఒకపక్క అశ్లీల గీతాల శబ్ద కాలుష్యంతో హృదయాలు బ్రద్దలవుతుంటే మరోపక్క సహృదయులకు విందుచేసే పాటలు రాయించిన సంస్థలలో చెప్పుకోదగ్గది యువచిత్ర. 'సీతామాలక్ష్మి', 'గోరింటాకు' వంటి చిత్రాలలోని పాటలతో అభిరుచికి పేరుపడిన ఈ సంస్థ 'అభిమన్యుడు'లో శృంగార నాట్యతార నుద్దేశించి పాట రాయించాల్సి వచ్చినా సంయమనాన్ని కోల్పోకుండా

**శృంగార సీమంతినీ**
**నా జీవన మందాకినీ**
**నీ కనుసన్న సయ్యాటలో**
**నను జీవించనీ - మరణించనీ** **(ఆత్రేయ)**

అని సాహిత్యస్థాయిని దిగజార్చకుండా రాయించారు.

ఈ దశలో పాటల రచన చేపట్టిన దర్శకులలో చెప్పుకోదగినవారు - దాసరి నారాయణరావు, వంశీ. వంశీ (ఇళయరాజా బాణీల కనుగుణమైన పాటల్ని)



పరిమితంగా రాయగా, దాసరి నారాయణరావు విస్తృతంగా రాశారు.

'మనుషులంతా ఒక్కటే' లో ఆ కథానాయకుడు నటించిన సినిమా పేర్లనే--

**నిన్నే పెళ్లాడుతా, నిన్నే పెళ్లాడుతా**
**రాముడు భీముడు, రాముని మించిన రాముడు**
**పిడుగురాముడు, అగ్గిరాముడు**
**టైగర్‌రాముడు, శభాష్‌రాముడు**
**శాంత, రాము, వివాహబంధం**
**సీతారామకల్యాణం, ఇంటికి దీపం యిల్లాలే...**

సినిమాపాటగా కూర్చిన దాసరి నారాయణరావు 'ప్రేమాభిషేకం' చిత్రంలోని పాటలను పాశ్చాత్యవాద్యాల కనువుగా గమన ప్రధానంగానూ--

**తొలిసంజ వేళలో తొలి పొద్దుపొడుపులో**
**తెలవారే తూరుపులో**
**వినిపించే రాగం భూపాలం**
**ఎగిరొచ్చే కెరటం సిందూరం** **(సీతారాములు)**

వంటిపాటను మధురమైన సంగీతబాణీలోను--

**ఏవండోయ్ శ్రీమతిగారు**
**లేవండోయ్ పొద్దెక్కింది**
**ఇల్లు ఊడ్చాలి కళ్లాపి చల్లాలి**
**నీళ్లు తోడాలి ఆపై కాఫీ కాయాలి** **(సీతారాములు)**

వంటి పాటలను వచనరీతిలోను-ఇలా వైవిధ్యంతో రచించి ఆ కలాని కన్నిపాళీలో అనిపించారు.

దీపారాధనలో

'తూరుపుతిరిగి దణ్ణంపెట్టు అన్నారండి మావారు' అనేపాటను--

**అమ్మాయే పుట్టాలి అబ్బాయే పుట్టాలి**

అమ్మాయెందుకు పుట్టాలి  అబ్బాయెందుకు పుట్టాలి
బొంబాయే వెళ్లాలి  తిరుపతే వెళ్లాలి
బొంబాయెందుకు వెళ్లాలి  తిరుపతెందుకు వెళ్లాలి

అని వాచ్యసంవాదంలో నడిపించి 'పాటకు నియమాలేమిటి' అనిపించారు.

ఈ శకంలో సినిమాపాటల్లో వైవిధ్యానికీ, ఉత్తమకవితాప్రమాణాలకూ మారుపేరు వేటూరి సుందరరామమూర్తి. అశ్లీలం రాసినా అందులోనూ 'ఆహా' అనిపించే ప్రయోగాలు, చమత్కారాలు వుండడం ఆయన విశిష్టత. ఆయన ప్రభావం నుంచి తప్పుకొని యుగళగీతాలు రాస్తున్నవాళ్లు ఈ కాలంలో అరుదు. బాణీలకు అవలీలగా పాటలు రాసే సుందరరామమూర్తి సంగీతపరంగా పాట రాయడాన్ని సులభతరం చేశారని యస్.పి. బాల సుబ్రహ్మణ్యం అభిప్రాయం.[24]

అతడు : కిన్నెరసాని వచ్చిందమ్మా వెన్నెల పైటేసి
విశ్వనాథ పలుకై అది విరుల తేనెచినుకై
కూనలమ్మ కులుకై అది కూచిపూడి నడకై

ఆమె : పచ్చనిచేల పావడ గట్టి
కొండ మల్లెలే కొప్పున బెట్టి
వచ్చే దొరసాని  మా వన్నెల కిన్నెరసాని (సితార)

ఏరెల్లి పోతున్నా నీరుండి పోయింది
నీటిమీద రాతరాసి నావెళ్లిపోయింది (ఆశాజ్యోతి)

వంటి అసామాన్యమైన పాటలను అందించిన వేటూరి

మగ : నాటుకొట్టుడు వీరకొట్టుడు కన్నుకొట్టుడు
రెచ్చగొట్టే చంటి పిల్లడు పాలకొచ్చాడే.

ఆడ : నాటుకొట్టుడు వీరకొట్టుడు దంచికొట్టుడు
వద్దంటే చంటి పిల్లడు పండుగిచ్చాడే.

మగ : ఈడు దుప్పట్లో మనజోడు చప్పట్లు

24. ముఖాముఖి 18.12.91



ఆడ : పొద్దుచీకట్లో మన ముద్దుముచ్చట్లు
మగ : కౌగిలిలో సిగ్గు చలిగాలి బలి యమోయమో

చరణం:

మగ : ముట్టడించి కొట్టాల బుగ్గల్లో నాముద్దు.
ఆడ : ముట్టడించి తొక్కాల మంచాలే ఈపొద్దు
మగ : కోకపల్లి రాజ్యంలో కోటగుమ్మం ఏడుందో
ఆనతీసి పట్టేదాకా ఆరాటాలమ్మో
ఆడ : చుట్టిముట్టి పట్టాలా కౌగిట్లో నాసోకు
మగ : కట్టుతప్పి పోవాలా చీరమ్మే కాసేపు
ఆడ : రైకపల్లి రాజ్యంలో ముళ్లుపడ్డ ముంగిట్లో
చిక్కువిప్పదీసే దాకా మోమాటాలమ్మో

మగ : శృంగారానికి  సింగం లాంటి చిన్నాడొస్తుంటే

ఆడ : సిగ్గువిగ్గు పుట్టి ఒళ్లో నుగ్గై పోతుంటే
మగ : తాకిడివేళ చెలి సర్దుకోవాలి
కస్సుబుస్సు పూజలతో కాముడికి నమో నమో. (త్రినేత్రుడు)

మగ : కన్నెపిల్లతోటి పిల్లగాడి కొచ్చెనమ్మ పీకులాట...
ఆడ : ఒంటికి ఒళ్లు దగ్గరగా జరుపుకో
ఒయ్యారంగా ఒకరోజు గడుపుకో

మగ : పాట, చలిపాట, చెలిపాట,  చెలగాటం
ఇది ఎక్కిదిగి  దిగియెక్కే యవ్వారం (యముడికి మొగుడు)

వంటి పచ్చిపాటల్ని రాయడం కారణాలేమైనా - సమర్థనీయం కాదు.

ఎనభయ్యవ దశాబ్దంలో సినీరంగ ప్రవేశం చేసినావారిలో భావుకతకు పట్టం కడుతున్న రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి.

"విరించినై విరచించితిని ఈ కవనం
విపంచినై వినిపించితిని ఈ గీతం
ప్రాగ్దిశవీణియ పైన దినకర మయూఖతంత్రులపైన
జాగృత విహంగ తతులే వినీల గగనపు వేదికపైన
పలికిన కిలకిల స్వనముల స్వరగతి జగతికి శ్రీకారముకాగా
విశ్వకావ్యమునకిది భాష్యముగా -- (సిరివెన్నెల)

సినిమా పడికట్టుకు భిన్నమైన పదాలతో అర్థపరంగా పారవశ్యాన్ని కలిగించే భావచిత్రం యిది.

ఇటువంటి భావగీతాలే కాకుండా ఈ రచయిత విద్యార్థుల పరిభాషలో అనుప్రాసలతో చమత్కారాలతో రాసిన పాట యువతరాన్ని ఆకట్టుకొంది.

**బోటనీ పాఠముంది మేటనీ ఆట వుంది దేనికో ఓటు చెప్పరా**
**హిస్టరీ లెక్చరుంది మిస్టరీ పిక్చరుంది సోదరా ఏది బెస్టురా**
**బోటనీ క్లాసంటే బోరు బోరు హిస్టరీ రొస్టుకన్నా రెస్టుమేలు**
**పాటలు ఫైటులున్న ఫిల్ముచూడు బ్రేకులు, డిస్కోలు చూపుతారు.**
**(శివ)**

అటు ఆత్రేయ, ఇటు వేటూరి - ఇద్దరి పాటల బాటలనూ అధ్యయనం చేసి వాటి సమ్మేళనంతో నూతన శిల్పాన్ని వెదుకుతున్న వర్ధిష్ణువు వెన్నెలకంటి

**ఒక్కటై వచ్చాయి ఎండా వానా ముక్కలైపోతున్న గుండెలోన**
**ఒంటిగా నిద్రించు ఆకసాన చుక్కలే కన్నీటిచుక్కలౌన**
**మౌనమే ధ్వనించునా? (జైత్రయాత్ర)**

అంటూ ఎండవానల కలనేత లాంటి గీతాలకు రూపకల్పన చేస్తున్నారు.

ఇంకా ఈ వర్తమాన దశలో సినిమాపాటల రచనపట్ల అవగాహన కలిగిన జొన్నవిత్తుల, సాహితి, భువనచంద్ర మొదలైనవారు కొత్తబాటలు తొక్కడానికి ప్రయత్నిస్తున్నారు.



పాటల్లోమార్పుకి బాధ్యత వహించవలసినన్ని పాటలు సంఖ్యాపరంగా రాయక పోవడంవల్ల- వారి పాటల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంలేదు.

కానీ, తొంభయ్యవ దశకంలో తెలుగు సినిమా పాట నడుస్తున్న ధోరణి మాత్రం యిది

**1.** **టప్పు టప్పు టప్పోరీ కన్యాకుమారీ**
**టప్పు టప్పు టప్పోరీ నా టక్కుటమారీ**
**కొండవీటి దొంగ - మోగించు వైభవంగ**
**సన్నాయిడోలు సమ్మేళంగా**
**టప్పు టప్పు టప్పోరా వేసేయ్ దండోరా ॥టప్పు॥**

**ఢం ఢమాఢం ఉక్కేసా - ధన్ ధనాధన్ తొక్కేసా**
**ఫట్ ఫటా ఫట్ పట్టేసారో - జం జమాజం ఛమ్మంటూ**
**కస్ కసాకస్ కిస్సెట్టి చమ్ చమాచమ్ ఆటేసారో (గ్యాంగ్‌లీడర్)**

**2.** **అంబలకిడి పంబలకిడి పిల్లరో**
**అక్కడ తడి తగిలి చక్కిలిగిలి పెట్టరో**
**ఆ పట్టే పట్టేసి - ఆంఫట్టే చేసేసి**
**జాకెట్టు లోగుట్టు జోకొట్టరా (యముడన్నకు మొగుడు)**

ఈ శకంలో వస్తున్న సినిమా పాటల్ని సామూహికంగా పరిశీలిస్తే కొన్ని యోగ్యతలు మరికొన్ని అయోగ్యతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంతకుముందు దశల్లో సినిమాపాటల్ని వివిధ సన్నివేశాల కనుగుణంగా రాసేవారు. ఉదాహరణకు భక్తితత్వం, వియోగం, హాస్యం, శృంగారం మొదలైనవి. ఇప్పుడు వైవిధ్యం, సందర్భశుద్ధి సన్నగిల్లి ఎక్కువగా శృంగారపరమైన యుగళగీతాలు మాత్రమే వస్తున్నాయి. ఈ యుగళగీతాల యోగ్యత గురించి వేటూరి సుందరరామమూర్తి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఓ నమ్మలేని నిజసంఘటన చెప్పారు[25]. ఒకసారి ఇద్దరు సంగీత దర్శకులకు ఏకకాలంలో బాణీలకు రెండు యుగళగీతాలు రాయాల్సి వచ్చి హడావుడిలో పొరపాటున ఒకరికివ్వాల్సిన పాట మరొకరికిచ్చి పంపించారట. ఆ తర్వాత జరిగిన పొరపాటు తెలుసుకొని సరిదిద్దుదామని వెళ్లేసరికి రెండుచోట్లా రికార్డింగ్ జరిగిపోయి వాటినే సరిపెట్టుకొన్నారట. దీనినిబట్టి యుగళ గీతాలకు సమయం సందర్భం చూడటంలేదనీ బాణీలకు (ట్యూన్స్) సరిపోవడమే వాటి యోగ్యత అయ్యిందనీ ఆయన వాపోయారు.

25. సితార 19.1.92. సంచిక

పోనీ ఈ యుగళగీతాలు శృంగార రసభరితంగా వుంటున్నాయనుకోవడానికి కూడా వీలులేక పోతోంది. శృంగారానికి అనుగుణమైన లలితమైన పదాలకు బదులుగా దొమ్మీనో, కుస్తీనో, చెడుగుడినో స్ఫురింపజేసే పదాలు, పదబంధాలు యుగళగీతాల్లో చోటుచేసుకొంటున్నాయి.

**1. ఓలమ్మీ తిక్కరేగిందా - ఒళ్లంతా తిమ్మిరెక్కిందా**
**తిక్కరేగి తిమ్మిరెక్కి పైరగాలి పైటతీసి పందిరేసి చిందులేసిందా**
**(యమగోల)**

**2. మామిళ్ల తోటకాడ పళ్లిస్తే - మరుమల్లె తోటకాడ పువ్విస్తే**
**ఏలికేస్తె కాలికేసి కాలికేస్తే ఏలికేసి**
**ఎత్తి కుదేశాడే అబ్బాడిదెబ్బ - చిత్తు చిత్తు చేశాడే**
**(డ్రైవర్ రాముడు)**

ఇలాంటి ఉదాహరణలు చూస్తే వీటిలో రసాభాసం తప్ప రసస్ఫూర్తి కనిపించదు. రసపోషణకి యోగ్యమైన శైలి గురించి రసగంగాధరకర్త జగన్నాథ పండితరాయలు చెప్పిన లక్షణం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అవసరం.

**మధుర రసేషు దీర్ఘ సమాసం ఝయ్ఘటిత**
**సంయోగపర హ్రస్వస్య... అసకృత్**
**ప్రయోగం నైకట్యేన వర్జయేత్ (ప్రథమాననం, రసగంగాధరం)**

(శృంగారం మొదలైన మధుర రసాలలో దీర్ఘ సమాసాలు, వత్తు అక్షరాలు, విసర్గలతో కూడిన పదాలు మొదలైన కర్ణకఠోరాలైన అక్షరాలను విడిచిపెట్టాలి.)

సినిమాపాటలకూ లక్షణ గ్రంథాలకూ సంబంధమేమిటని ప్రశ్నించాల్సిన అవసరం లేదు. ప్రక్రియ మారినా రసస్వభావం మారదు కదా !

ఈనాటి సినిమాపాటల్లో పాత్రోచితమైన భాష లేదు. ఉంటే సంస్కృత భూయిష్ఠమైన బరువైన భాషో లేకపోతే దిగజారుడు భాషో ఉపయోగిస్తున్నారు. బాణీ కోసం అసందర్భంగా ఇతర భాషాపదాలను చొప్పిస్తున్నారు. అర్థంపర్థంలేని పదాలను ఉపయోగిస్తున్నారు. ఈ అభియోగాలకు వరుసగా ఈ కింది దృష్టాంతాలను గమనింపవచ్చు.



**1. నీ కరాలు హిమశీకరాలు, నీపదాలు ప్రణయాస్పదాలు**
**2. యమకొట్టుడు కొట్టుగురూ, యెంటబడి**
**3. ఏక్ దో తీన్ సఖీ ప్రియా, నిన్నే మైనేప్యార్‌కియా**
**4. లబోలబోలబ్జనక - కసాపిసా జాంజనక**

భాషమీద రచయితలకి తగినంత అధికారం లేకపోవడం, నిర్లక్ష్యం కారణాలుగా భానోదయం, సుగంధబుగ్గ, సుగంధముద్దు, పాలాభిషేకం, మందారచిందు, అంగనాలి, పడుచాహారం వంటి ఘోరమైన పదబంధాలను విశృంఖలంగా ఉపయోగిస్తున్నారు. సినిమాపాటకు వ్యాకరణం తప్పనిసరి కాదు. కనీసం వ్యవహారభాషైనా తెలియాలి కదా -

నేటి సినిమా పాటల్లో కవిత్వస్థాయి, పదవిస్తృతి పెరిగాయి. కాని వ్యాపార ప్రభంజనంలో ఆ సాహితీసుగంధం కొట్టుకుపోతోంది. పాశ్చాత్య సంగీతపు హోరులో శబ్దాల గలగలలు మాత్రం వినిపిస్తున్నాయి. ఒకమాటలో చెపితే నేటి సినిమాపాటల్లో చెవికి తప్ప మనసుకెక్కేవి తక్కువ. అందుకే అవి ఎక్కువకాలం నిలబడ్డంలేదు.

## 7. ఆరు కాలాల్లో ఆమని :

ఇంతవరకు సినిమాపాట పరిణామంలో పరిశీలించిన విషయాలకు దృష్టాంతంగా - ఒక సామాన్యాంశాన్ని తీసుకొని అది వివిధదశల్లో ఎలావుందో పరిశీలిద్దాం. కవిత్వానికి సర్వసామాన్యమైన వస్తువుల్లో వసంతం ఒకటి గనుక - ఆరు శకాల్లోనూ ఆమని వర్ణనలను అవలోకిద్దాం.

### అరుణోదయం :

'సీతాకల్యాణము' (1934) చిత్రంలో సీత చెలికత్తెలతో పూదోటలో విహరించే సన్నివేశంలో వారణాసి సీతారామశాస్త్రి రాసిన పాట--

పల్లవి : **ఆనందమె యలరారుచుండెన్**
**ఘనతరులపై కోకిల గూయు చుండెన్**

అనుపల్లవి : **మృదు మధురమౌ సుధలొలుకుచుండెన్**
**మదవతులకెంతో మది ఝల్లుమనగన్**

చ1 : **వన సుమములు పరిమళ మిళితములై**
**వనితల మనసుల కానందములై**

**వన విహారులకు కడు మోదములై**
**వినుతింపగా తరమె సుమవనమున....**

వసంతం అనగానే - వనం, కోకిలలు, చిలుకలు, పువ్వులు, తుమ్మెదలు... ఇవీ సామగ్రి. వీటిని తీసుకొని కనీస కవితాస్పర్శ కూడా లేకుండా వాచ్యంగా రాసినపాట. పేరుకు పాటేగాని వచన వర్ణనలు కూడా యింతకంటె నయమేనేమో. అంటే ఆనాటి పాటల్లో సంగీతానికి తప్ప సాహిత్యానికి అంత ప్రాముఖ్యాన్నిచ్చేవారు కాదనిపిస్తుంది.

## భావోదయం :

'భూకైలాస్' (1940)లో బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి రాసిన పాట--

**సుమడోళీ కేళీ హోళీ**
**ఉయ్యాలో జంపాలో**
**కమ్మని పూతెమ్మెర తేరె**
**కొమ్మరో మాధవుడే తేరె**
**కైకోరే పూతలంబ్రాలు**
**వనలక్ష్మీ మాధవలీలా**
**పరిణయమే సఖులారా**
**రారే మల్లియలారా**
**వేతేరే పూసరాలా**
**పాడగదే కోయిలరో**
**ప్రీతి మంగళగీతి**
**కీరకుమారీ శారికా**
**హారతి గైకొనరే --**

**శ్రుతియీరే తుమ్మెదలారా**
**చైత్ర శుభాగమ సంభ్రమలీలా**
**కేళీ నాట్యములాడి**
**తామర తూడుల చిమ్మనగ్రోవి**
**ప్రేమ వసంతములాడీ**

వస్తు స్వీకారంలోనే గడుసుదనం చూపిన ఈ పాటల్లో భాష, భావం - రెండూ పరిమళించాయి. భాషలో గ్రాంథిక వాసనవున్నా -- కవితాకల్పన మాత్రం



గగుర్పాటు కలిగిస్తుంది. తామరతూడుల చిమ్మనగ్రోవితో ప్రేమ వసంతాలాడి చైత్ర శుభాగమ సంభ్రమంలో తుమ్మెదను శ్రుతి చేయమనడం మనోహరమైన వ్యక్తీకరణ!

## రాగోదయం :

"పాతాళభైరవి'లో (1951) రాజకుమారి, చెలికత్తెలు - వనవిహారం చేసే సందర్భంగా పింగళి రాసిన పాట -

పల్లవి : **తీయని ఊహలు హాయిని గొలిపే**
**వసంత గానమె హాయీ**
**వసంత నాట్యమె హాయ్ హాయ్** ॥తీయ॥

చరణం : **చివురుల దాగి తీవెలనూగి**
**పూవులు ఘుమఘుమ నవ్వగా**
**వనియంతా పరిమళించెనే**
**మనసెంతో పరవశించెనే** ॥తీయ॥

చ: 2 : **గిలిగింతలు చెరలాడి**
**చిరుగాలి సరాగము చేయగా**
**వనియంతా ఝుల్ ఝులించెనే**
**తనువెంతో పులకరించెనే** ॥తీయ॥

చ: 3 : **క్రొత్త రాగమున కుహూ కుహూయని**
**మత్తిలి కోయిల కూయగా**
**వనియంతా రవళించెనే**
**నన్నెంతో మురిపించెనే** ॥తీయ॥

సినిమా పాటకు సౌకుమార్యం ఎంత అవసరమో ఈ పాట రుజువు చేస్తోంది. సరళమైన భాష, లలితమైన శైలి - వసంతమంత హాయిగా వున్నాయి మరి !

## రసోదయం :

'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' లో పద్మావతి చెలికత్తెల వసంతోత్సవానికి ఆత్రేయ రాసిన పాట

బృందం : ఝుమ ఝుమ ఝుం ఝుం
ఝుమ ఝుమ ఝుం ఝుం
వసంత శోభే మధురం
నవవసంత శోభే మధురం

పద్మావతి : గిలిగింతల మలయానిలము
పులకింతల మాలతి సుమమూ
చిగురాకుల మేసిన కోయిల గానము
చెలరేగెను, రావే వలరాజుతో పందెము లేలే !

చెలి : ఆడుదమా పాడుదమా
ఆటలు పాటలు మన విందులుగా
ఉందము లోకపు కనువిందులుగా

బృందం : రావె - చెలిరావె - అనురాగవతి రావె
విరి కన్నెలకు వంకలిడే వన్నెలాడి రావె
కలలూగె మానసము కవ్వించే జవ్వనము
ఏలుకునే రేడు నేడు కాచుకొని యున్నాడు

చెలి : రావె సఖి రావె, అనురాగవతి రావె,
మన ఆమోదము ఈ వనిగ చెలువారెనె రావే

పద్మావతి : ఊహల ఊయల ఊగుదమా
తీయని తమకము తేలుదమా
తొలిరేకులలో విరితేనియలా
తనివి తీరగా హాయిగ గ్రోలుదమా

బృందం : ఆడుదమా - పాడుదమా

చెలి : మనసులు సొగసులు మంతనమాడ
మన్మథ పూజలు సేయుదమా

ముందు మూడు పాటల్లో లేని తమకం ఈపాటలో వుండడం ఈ యుగధర్మం. ఈ యెల్లల్ని దాటి యెల్లకాలం నిలిచే పాటలు 'రత్నమాల'లో ఉన్నాయి.



1. ఝుమ్ ఝుమ్ ఝుమ్ ఝుమ్
ఝుమ ఝుమ ఝుమ్ ఝుమ్ ఝుమ్ ఝుమ్ ॥ఝుమ॥
కమ్మనీ తీయని కమ్మవిలుతు సమ్ముఖమే
మాయని సౌదామిని ఎలమావి నీడ మెరిసెనే
ఆమనికి ఈవని ఆమోదములు విరిసెనే
కొమ్మ కొమ్మకో కోయిల
రెమ్మ రెమ్మకో తుమ్మెద
కోరకాల ముసిముసిలో
కోటివేల మన్మథులే

2. మదనా, నవమదనా స్వాగతమోయి
చిగురాకులివే బాకులివే
చిలుక హుమాయి వజీరా
వలపులతో కులకులతో
రాజ్యమేల రావోయి, రసరాజ్యమేల రావోయి ॥స్వాగ॥
కన్నెల వాల్గనుల చూపులే
కలువ పూల హారాలు
మనసిజ మా మనసులె నీకు
మంగళహారతులు, మంగళహారతులు - గొనుమా ॥స్వాగ॥

## చంద్రోదయం :

ఈ శకం వచ్చేసరికి కథానాయికలు చెలికత్తెలతో వనవిహారాలు మానేశారు. ప్రియుడితో విహారంలో వసంతాన్ని ఊహించుకోవడం ప్రారంభించారు. అలాంటి సందర్భంలో 'అడవిరాముడు' లో వేటూరి సుందరరామమూర్తి రచన-

అతడు : కుహూ.. కుహూ.. కోకిలమ్మ పెళ్లికి కోనంతా పందిరి
చిగురాకులు తోరణాలు - చిరుగాలి సన్నాయి

ఆమె : డుడుం - డుడుం
వసంతుడే పెళ్లి కొడుకు వనమంతా సందడి
పూలన్నీ తలంబ్రాలు పున్నమీ తొలిరేయా

అతడు : తుళ్లి తుళ్లి నిన్నమొన్న తూనీగల్లే ఎగిరిన
పిల్లదాని కొచ్చిందీ - కళా, పెళ్లి కళా

ఆమె : తలపులన్ని వలపులైన చూపులు విరితూపులైన
పెళ్లి కొడుకు నవ్వితే కళ - తళతళ
అతడు : పూలగాలితో రేగిన పుప్పొడి పారాణిగా
ఆమె : చిలకపాట నెమలిఆట కలసి మేజువాణిగా
అతడు : అందమైన పెళ్లికి అందరు పేరంటాలే
ఆమె : అడవిలోని వాగులన్ని ఆనందపు కెరటాలే ॥కోకి॥

కథాసందర్భంతో అన్వయిస్తూ సాగిన ఈ వసంతం సరికొత్తది. పదచిత్రాలూ, భావచిత్రాలూ, రూపకాలూ అన్నీ అపూర్వాలు, అద్భుతాలు !

ఈ కాలంలో సంగీతం మాష్టారు కథానాయికకు నేర్పే భావగీతం ఎలా వుంటుందో 'సీతామహాలక్ష్మి' లో కృష్ణశాస్త్రి రచన చెపుతుంది

మావిచిగురు తినగానే కోవిల పలికేనా
కోవిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా
ఏమో - ఏమనునోగాని ఆమని ఈవని
తెమ్మెరతో తారాటాలా ...
తుమ్మెదతో సయ్యాటలా ...

అంటూ కథాస్ఫూర్తితో వసంతగీతం తెమ్మెరలా సాగుతుంది. చెప్పొచ్చిందేమిటంటే - ఈ కాలం వచ్చేసరికి పాటలో శిల్పం పెరిగిందని.

## అయోమయం :

ఈ శకంలో సినిమా పాట కవితాస్థాయి పెరిగి అపూర్వమైన శిల్పంతో ఎక్కడెక్కడి కోణాలనో స్పృశిస్తోందనడానికి 'గీతాంజలి'లో వేటూరి రాసిన పాట ఉదాహరణం

పల్లవి : ఆమనీ పాడవే హాయిగా
మూగవైపోకు ఈ వేళ
రాలేటి పూల రాగాలతో
పూసేటి పూల గంధాలతో
మంచు తాకి కోయిల మౌనమైన వేళలా
చరణం : వయస్సులో వసంతమే ఉషస్సులా జ్వలించగా
మనస్సులో నిరాశలే రచించెలే మరీచికా



పదాల నా యెదా స్వరాల సంపదా
తరాల నాకథా క్షణాలదే కదా
గతించిపోవు గాథ నేననీ...
చరణం : శుకాలతో పికాలతో ధ్వనించినా మధూదయం
దివీ భువీ కలా నిజం స్పృశించినా మహోదయం
మరో ప్రపంచమే మరింత చేరువై
నివాళి కోరిన ఉగాది వేళలో
గతించు పోవు గాథ నేననీ...

ఈ పాటలో తొంగిచూసే అస్పష్టత కథతో అన్వయించుకొంటే మంచులా విడిపోతుంది. ఇలాంటి పాటలను వింటున్నపుడు మాత్రం ఈ శకం అయోమయం కాదు -- 'మధూదయం' అనిపిస్తుంది.

## సింహావలోకనం :

ఒకసారి వెనక్కు తిరిగి ఆరుకాలాల వసంత వర్ణనలనూ పరిశీలిస్తే చివరిది తప్ప, తక్కిన కాలాలకు పెట్టిన పేర్లు సార్థకంగానే వున్నట్టు రుజువవుతోంది. వసంతవర్ణన కవితాపరమైన అంశం గనుక తుదిదశలో దాని పెడదారులు చూపడానికి ఆస్కారం లేదు. అయినంత మాత్రాన మిగతా కోణాలనుంచి చూస్తే అయోమయం అన్వర్థం కాకపోదు.

అరుణోదయంలో వసంతవర్ణన వాచ్యంగా వున్నా, బాల్యావస్థలో తప్పటడుగులు కూడా ముచ్చటే కదా! రెండో దశలో 'భూకైలాస్'లోని వసంతవర్ణన స్థాయిమేరకు ఆ దశలోని మిగతా పాటలు వుండవనిపిస్తుంది. రాగోదయ, రసోదయ కాలాల్లోని వర్ణనల్లో పదలాలిత్యం వుంటే - చంద్రోదయంలో చిక్కని కవిత్వం చక్కిలిగిలి పెడుతుంది. ఏతావతా ఏ శకలక్షణాలైనా కొంచెం అటూ - ఇటూగా వుంటాయనీ ఖచ్చితమైన సరిహద్దులకు అవి లోబడవనీ తెలుస్తోంది.

## నిలువుకోత - అడ్డుకోత :

కాలానుపూర్విగా సినిమాపాటలో వచ్చిన పరిణామాన్ని పరిశీలించడానికి పై విభజన నిలువుకోత లాంటి ఉపరిశోధన. ఈ పరిణామాలకు ఏఏ ప్రభావాలు కారణమో ఆ ప్రక్రియల పరంగా అడ్డుకోత లాంటి పరిశీలన అవసరం!

❊ ❊ ❊

# సంప్రదాయం - సినీగేయం

## ప్రభావ స్వభావం :

ప్రభావం అంటే ప్రకృష్టమైన భావం లేదా ప్రధానమైన భావం అని నిఘంటువుల్లోని అర్థం. నేడు ప్రభావం అనే పదం ఆంగ్లంలోని **Impact, Influence** అనే పదాలకు సమానార్థకంగా వాడబడుతోంది.

ఒకరి ప్రభావానికి మరొకరు లోనుకావడం జీవస్వభావం. ఆ ప్రభావ ముద్ర అనుకార్యుని శక్తిమీద అనుకర్త రక్తిమీద ఆధారపడి వుంటుంది. ప్రభావం అనేది ఎవరిలోనైనా లేదా దేనిలోనైనా తనకు బాగా నచ్చిన గుణం వుండి, దాన్నుండి తను తప్పించుకోలేకపోవడంవల్ల పడుతుంది. ఈ తప్పించుకోలేకపోవడమన్నది ఇతర రంగాలతోపాటు సాహిత్యంలో కూడా తప్పలేదు. నిజానికది తప్పుకూడా కాదు.

అనాదిగా వస్తున్న అనుకరణాన్ని ఆలంకారికులు కూడా చర్చించారు. వారిలో రాజశేఖరుడు ముఖ్యుడు. రాజశేఖరుడు కావ్యమీమాంస ఏకాదశ ద్వాదశ అధ్యాయాల్లో శబ్దహరణ, అర్థహరణాలను చర్చించి--అనుకరణను ప్రతిబింబాకార సంవాదం, ఆలేఖ్యాకార సంవాదం, దేహాంతర తుల్య సంవాదం అని మూడుగా విభజించాడు.

అద్దంలో బింబానికి ప్రతిబింబం కనిపించినట్లు చేసే రచన ప్రతిబింబాకార సంవాదం. ఒక చిత్రకారుడు వేసిన బొమ్మను చూసి సరిగా అలాగే మరో బొమ్మను గీయడం ఆలేఖ్యాకార సంవాదం. చేతులు, కాళ్ల మొదలైన అవయవాల్లో పోలికలున్నా ఆత్మలూ శరీరాలూ వేర్వేరుగా వుండడంవల్ల ఇద్దరు వ్యక్తులు ఒకరు కానట్టే ఆశ్వాసాలు, వర్ణనలు, నాయికానాయకులు మొదలైన రచనాసామాగ్రి అంతా ఒకేలా వున్నా రెండు కావ్యాల్లో కల్పనలు వేరుకావడంవల్ల దేనికది స్వతంత్ర కావ్యం కావడం దేహాంతరతుల్య సంవాదం. వీటిలో మొదటిది విడిచిపెట్టదగినదనీ, రెండోది మధ్యమమనీ, మూడోది స్వీకరింపదగినదనీ - రాజశేఖరుని అభిప్రాయం.

టి.యస్. ఇలియట్ అనుకరణలో కుకవులకూ సుకవులకూ వుండే తేడాని ఇలా చెప్పాడు

**"Bad Poets deface what they take and good Poets make it into something better or at least something different"**[1]

1. **Selected prose Edition - Page 153**

(కుకవులు తాము తీసుకొన్న వస్తువును చెడగొడతారు. సుకవులు దానిని మెరుగు పరచడమో - కనీసం వేరుగా అనిపించేలాగో చేస్తారు.)

ఇలియట్ చెప్పిన సుకవి లక్షణం రాజశేఖరుని దేహాంతర తుల్య సంవాదానికి దగ్గరగా వుంది.

గుడ్డిగా అనుకరించడాన్ని కట్టమంచి రామలింగారెడ్డి ఇలా నిరసించారు

"...బింబములకు ప్రతిబింబముల నుత్పాదించుట కవి చేయవలసిన పనికాదు. మరి ఫొటోగ్రాఫరుది. తన మనస్సుకు దగినట్టు తన కన్నులకు గోచరించునట్లును వ్రాయవలయునే కాని యింకెవరికో తోచినట్లు వ్రాయజూచుట మూఢ మతము."[2]

ఈ కాలానికి చెందిన సాహిత్య విమర్శకులు జి.వి. సుబ్రహ్మణ్యం రాజశేఖరుడు చెప్పిన మూడు విభాగాల్ని రెండుగా (అనుకరణ, అనుసృజన) మాత్రమే గుర్తించి ప్రభావ స్వభావాన్ని యిలా చెప్పారు-

"ఒక ప్రవాహంలో పూర్తిగా మునిగిపోవడం కాదు ప్రభావం. ఒక బాటలో తలయెత్తుకుని నడవడం ప్రభావం." [3]

ఈయన చెప్పిన ప్రభావం అనుసృజనకే వర్తిస్తుంది. పై అభిప్రాయాలన్నిటినీ పరిశీలించి యథాతథాలు, అనువాదాలు కాని ప్రభావిత రచనల్ని ఈ పరిశోధనలో అనుకరణ, అనుసరణ, అనుసృజన అని మూడుగా విభజించడం జరిగింది. అనుకరణ యథాతథ రూపానికి ప్రతిబింబంకాగా - అనుసరణ మూలానికి దగ్గరగావున్న ఛాయ. అనుసృజన మాతృకస్ఫూర్తితో చేసే స్వతంత్ర రచన. ఇది వాడుకకు అనువైన పేర్లతో రాజశేఖరుని మతానికి దగ్గరగా చేసిన విభజనే.

## ప్రధాన ఆదానాలు :

అరవయ్యేళ్లలో సినిమాపాట స్వరూపం ఎంతగా మారిందో గతప్రకరణంలో తెలిసింది. ఈ మార్పులకు కారణమైన వివిధ ప్రభావాలను ప్రసరించిన ప్రక్రియ లేమిటో ముందుగా తెలుసుకోవాలి. ఈ ప్రక్రియలను ప్రాథమికంగా రెండుగా వర్గీకరింపవచ్చు. మొదటిది సంప్రదాయం. రెండోది ఆధునికం.

2. కవిత్వ తత్త్వవిచారము. పుట 33.
3. ఆంగ్ల సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం. పుట 18

## సంప్రదాయ ధోరణులు :

సంప్రదాయమంటే ఆచారం, పరాంపరాగతజ్ఞానం మొదలైనవి నైఘంటికార్థాలు.[4] గురు పరంపరగా లేదా శిష్య పరంపరగా - ప్రదానం చేయబడ్డది సంప్రదాయమని అమరకోశార్థం. వీటినిబట్టి వర్తమానానికి సంక్రమిస్తున్న గతంలోని ఆచారవ్యవహారాల ఒరవడే సంప్రదాయమని నిర్వచించుకోవచ్చు. దీనినే సి. నారాయణరెడ్డి కవితా రూపంలో --

**'అంత కడివెడు పాలపై ఒ**
**క్కింత మీగడ పేరినట్లుగ**
**మనకు మిగులును గతములోపలి**
**మంచి; అదియే సంప్రదాయము'** అన్నారు.

వర్తమానానికి సంప్రదాయం పైతృకంగా సంక్రమించిన ఆస్తి లాంటిది. తండ్రి ఆస్తిని కొంత కాలమైనా కొడుకు అనుభవించినట్లే సంప్రదాయ నిధుల్ని సినిమా పాట కూడా వినియోగించుకొంది. అలా సినిమాపాటకు ఉపయోగపడి దానిని ప్రభావితం చేసిన సాంప్రదాయిక ధోరణులలో పురాణాలు, కావ్యాలు, నాటకాలు, వాగ్గేయకారుల సాహిత్యం, జానపద సాహిత్యం ముఖ్యమైనవి.

## 1. పురాణాలు - కావ్యాలు :

వేదమంత్రాల నుంచి ఆధునిక కావ్యాలలోని పద్యాల వరకు ఎన్నింటినో నిత్యజీవితంలో శిష్టులు ఉపయోగిస్తున్నారు. ఈ శ్లోకాలనూ పద్యాలనూ కథాసందర్భాల ననుసరించి పౌరాణిక, జానపద, సాంఘికాలనే భేదం లేకుండా సినిమాల్లో విస్తృతంగా వినియోగించారు. అయితే వీటిలో కొన్నిటిని యథాతథంగాను కొన్నిటిని పాక్షికంగానూ ఉపయోగించుకొన్నారు. కొన్నిటిని భావాలమేరకు, కొన్నిటిని మార్పులు చేర్పులతోను, మరికొన్నిటిని ప్రేరణతోను సినిమాపాటలను రచించి అమూల్యమైన సంప్రదాయ విజ్ఞానాన్ని చక్కెరగుళికల్లా రుచి చూపించారు. ఇలా ఉపయోగించిన సంప్రదాయ సాహిత్యాన్ని సంస్కృతం, ఆంధ్రం అని రెండుగా విభజింపవచ్చు. ఈ విభాగాల్లో పైన చెప్పిన అయిదేసి శాఖలను సోదాహరణంగా చూడవచ్చు.

4. సూర్యరాయాంధ్ర నిఘంటువు -8వ సంపుటి. పుట 132



## (ఎ) సంస్కృత వాఙ్మయం :

(అ) యథాతథాలు:

వీటిలో వేదమంత్రాలు, సంస్కృత రామాయణ, భారతాల్లోని శ్లోకాలు, భగవద్గీతలోని శ్లోకాలు, కాళిదాసు ఆదిశంకరుడు లీలాశుకుడు మొదలైనవారి రచనలు, మరికొన్ని సంప్రదాయ స్తోత్రాలు వున్నాయి. ఒకే శ్లోకాన్ని అనేక చిత్రాలలో ఉపయోగించిన సందర్భాలూ వున్నాయి. స్థాలీపులాకన్యాయంగా కొన్ని ఉదాహరణలు-

సారథీవారి 'పత్ని' (1942)లో ఇంద్రోత్సవ సందర్భంగా గంధర్వ నాట్యం జరిగే సన్నివేశంలో ఋగ్వేదంలోని వేదమంత్రాన్ని ఉపయోగించారు -

**'ఇంద్రంవో విశ్వతస్పతిం హవామహే జనేభ్య:**
**అస్మాకమస్తుకేవలమ్..**

'వాల్మీకి రామాయణం'లోని 'బాలకాండ'లోని శ్లోకాలు 'వాల్మీకి' (63), 'సీతా రామకల్యాణం' (61) మొదలైన చిత్రాల్లో వున్నాయి.

1. **మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమా:**
   **యత్క్రౌంచ మిథునాదేక మవధీ: కామమోహితమ్ (వాల్మీకి)**
2. **కౌసల్యా సుప్రజారామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే**
   **ఉత్తిష్ఠ నరశార్దూల! - కర్తవ్యం దైవమాహ్నికమ్**
   **(సీతారామకల్యాణం, సంపూర్ణరామాయణం)**

భగవద్గీతా శ్లోకాలు 'శ్రీకృష్ణ గారడి', 'రాధిక', 'తెనాలి రామకృష్ణ', 'శ్రీ సత్య నారాయణ మాహాత్మ్యం', 'భీష్మ', 'వీరాభిమాన్యు', 'దేవాంతకుడు', 'శ్రీషిర్డీ సాయిబాబా' మొదలైన చిత్రాల్లో ఉపయోగించారు. ఒకే చిత్రంలో ఒకటి కంటె ఎక్కువ శ్లోకాలను ఉపయోగించినపుడు ఒక క్రమంలోనే కాకుండా ఒకోసారి వివిధ యోగాలనుంచి కూడా తీసుకొన్నారు. ఉదాహరణకు రెండు ప్రసిద్ధ శ్లోకాలు.

1. **యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత**
   **అభ్యుత్థానమధర్మస్య తదాஉ త్మానం సృజాஉమ్యహమ్**[5]
   **(తెనాలి రామకృష్ణ, భీష్మ, శ్రీసత్యనారాయణ మాహాత్మ్యం)**

5. శ్రీ మద్భగవద్గీత - జ్ఞానయోగము. 105 వ పుట

2. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే[6]
(టైగర్ రాముడు, మహారథికర్ణ, వీరాభిమన్యు,
దేవాంతకుడు, శ్రీ సత్యనారాయణ మాహాత్మ్యం)

'సంపూర్ణ రామాయణం', 'సీతారామ కల్యాణం' మొ॥ చిత్రాల్లో వచ్చిన రావణబ్రహ్మకృత శివస్తోత్రం - జటిల సమాన భూయిష్ఠమైనా ఆ గమనం జనానికి యిష్టమై నోళ్లకు పట్టుబడింది --

జటాకటాహ సంభ్రమ భ్రమన్నిలింప నిర్ఝరీ
విలోల వీచి వల్లరీ విరాజమాన మూర్ధనీ
ధగద్ధగద్ధగ జ్వలల్లలాట పట్ట పావకే
కిశోర చంద్రశేఖరే రతి: ప్రతిక్షణం మమ
జయత్వదభ్రవిభ్రమ భ్రమద్భుజంగమస్ఫుర
ద్ధగ ద్ధగ ద్వినిర్గమత్కరాళ ఫాలహవ్యవాట్
ద్ధిమి ద్ధిమి ద్ధిమి ధ్వనన్ మృదంగ తుంగ మంగళ
ధ్వనిక్రమ ప్రవర్తిత ప్రచండతాండవశ్శివ:
ఓం నమశ్శివాయ
అఖర్వ సర్వ మంగళా కళా కదంబ మంజరీ
రస ప్రవాహ మాధురీ విజృంభణా మధువ్రతం
స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం
గజాంతకాంధకాంతకం తమంతకాంతకం భజే
ఓం నమశ్శివాయ
ప్రఫుల్లనీల పంకజ ప్రపంచ కావిమచ్చటా
విడంబి కంధ కంధరా రుచి ప్రబంధ కంధరం
స్మరచ్ఛిదం పురచ్ఛిదం భవచ్ఛిదం మఖచ్ఛిదం
గజచ్ఛిదాంధకచ్ఛిదం తమంతకచ్ఛిదం భజే
ఓం నమశ్శివాయ

సినిమాల్లో రావడంవల్ల ఈ శ్లోకం బహుళ ప్రచారం పొందింది. వ్యాసుని విశ్వనాథాష్టకాన్ని - 'సోమవారవ్రత మాహాత్మ్యం'లో ఉపయోగించారు.

---

6. శ్రీ మద్భగవద్గీత - జ్ఞానయోగము. 106 వ పుట



గంగాతరంగ కమనీయ జటాకలాపమ్
గౌరీనిరంతర విభూషిత వామభాగమ్
నారాయణప్రియ మనంగ మదాపహారమ్
వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్

వాచామగోచర మనేక గుణస్వరూపం
వాగీశ విష్ణు సురసేవిత పాదపీఠమ్
వామేన విగ్రహవరేణ కళత్రవంతం
వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్

విష్ణుసహస్రనామ స్తోత్రంలోని భాగాలను 'భక్తఅంబరీష,' 'దేవాంతకుడు', 'మైరావణ' మొ॥ చిత్రాల్లో ఉపయోగించారు --

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం
లక్ష్మీకాంతం కమల నయనం యోగి హృద్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథం

ఆదిశంకరాచార్యుని మీనాక్షిస్తోత్రము, మోహముద్గరము అను భజగోవింద స్తోత్రములు, అర్ధనారీశ్వర స్తోత్రము, మృత్యుంజయ స్తోత్రము, శివ స్తోత్రము, శ్రీరామకర్ణామృత శ్లోకాలు -- 'కోడలు దిద్దిన కాపురం', 'గురువుని మించిన శిష్యుడు', 'సోమవార వ్రతమాహాత్మ్యం', 'పాండవ వనవాసము', 'సంపూర్ణరామాయణము', 'సతీసుమతి' (41) మొదలైన చిత్రాలలో విరివిగా వినియోగింపబడ్డాయి.

ఉదాహరణలు -

1. 'గురువుని మించిన శిష్యుడు'లో
శ్రీవిద్యాం శివవామభాగ నిలయాం
హ్రీంకార మంత్రోజ్వలాం
శ్రీచక్రాంకిత బిందుమధ్య వసతీం
శ్రీ మత్సభానాయకీం
శ్రీమత్ షణ్ముఖ విఘ్నరాజ జననీం
శ్రీమజ్జగన్మోహినీం
మీనాక్షీం ప్రణతోస్మి సంతత మహం
కారుణ్య వారాన్నిధిమ్ (మీనాక్షీ పంచరత్నం - 3వ శ్లోకం)

2. 'కోడలుదిద్దినకాపురం'లో

**పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీజఠరే శయనం**
**ఇహ సంసారే బహుదుస్తారే**
**కృపయాపారే పాహి మురారే** **(భజగోవింద స్తోత్రం)**

3. 'సీతారామకల్యాణం', 'లవకుశ'లలో

**శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం.**[7]

కాళిదాసు శ్యామలాదండకంలోని భాగాలు, అభిజ్ఞాన శాకుంతలంలోని శ్లోకాలు, రఘువంశంలోని శ్లోకాలు 'కాళిదాసు', 'చంద్రహాస' శంకరాభరణం మొ॥ చిత్రాల్లో వచ్చాయి. మచ్చుకి శ్యామలాదండకం నుంచి

1. **మాణిక్యవీణా ముపలాలయంతీం**
   **మదాలసాం మంజుల వాగ్విలాసాం**
   **మాహేంద్ర నీలద్యుతి కోమలాంగీం**
   **మాతంగకన్యాం మనసా స్మరామి**
2. **చతుర్భుజే చంద్రకళావతంసే**
   **కుచోన్నతే కుంకుమరాగశోణే**
   **పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ**
   **హస్తే నమస్తే జగదేక మాత:**

పరాశరభట్ట కృతమైన ఈక్రింది శ్లోకం - 'సువర్ణసుందరి', 'భక్తాంబరీష', 'సీతారామ కల్యాణం', 'మహారథి కర్ణ', 'పాపం పసివాడు' మొదలైన చిత్రాల్లో వుంది -

**లక్ష్మీం క్షీరసముద్ర రాజతనయాం శ్రీరంగధామేశ్వరీం**
**దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురామ్**
**శ్రీమన్మంద కటాక్షలబ్ధ విభవద్బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్.**

అనుశ్రుతంగా వస్తున్న ఆదిత్య స్తోత్రాలు -- 'వినాయకచవితి', 'లవకుశ',

7. శ్రీ రామ కర్ణామృతం - ప్రథమాశ్వాసం - 2వ శ్లోకం



'పాండవ వనవాసము' మొదలైన చిత్రాల్లో వినిపించాయి.

ఉదాహరణకు :

**సప్తాశ్వరథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం**
**శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్** **(లవకుశ)**

ఇంకా సంప్రదాయంగా వస్తున్న 'శుక్లాంబరధరం.. అగజానన పద్మార్కం' వినాయక స్తోత్రాలు -- 'వినాయకచవితి', 'ఒకతల్లి పిల్లలు' వంటి చిత్రాల్లో వచ్చాయి. అలాగే వెంకటేశ్వర సుప్రభాతం, ఆంజనేయ దండకాలు వినిపించే సినిమాలు అసంఖ్యాకం

లీలాశుక కృతమైన శ్రీకృష్ణకర్ణామృతంలోని

**కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షస్థలే కౌస్తుభం**
**నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం**
**సర్వాంగే హరిచందనం చ కలయన్ కంఠే చ ముక్తావళీం**
**గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణి:**

శ్లోకం -- 'పాండురంగ మాహాత్మ్యం', 'చింతామణి', 'సప్తస్వరాలు' మొ॥ చిత్రాల్లో ఉపయోగింపబడింది. వీటిలో 'పాండురంగ మాహాత్మ్యం'లో మాత్రం 'జయ కృష్ణా ముకుందా మురారీ' అనే పాటలో అంతర్భాగంగా ఉపయోగింపబడింది.

శ్రీ కులశేఖర కృతమైన 'శ్రీ ముకుందమాల'లోని

1. **బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః ...**
2. **నమామి నారాయణ పాదపంకజం...**

శ్లోకాలు 'విప్రనారాయణ' లో ఉపయోగింపబడ్డాయి.

పై ఉదాహరణల్లో అనేకం చాలమందికి పరిచితాలే అయినా ఎక్కడివో ఎవరివో తెలియవుగనుక ప్రత్యేకంగా పేర్కొనవలసి వచ్చింది. ఈ శ్లోకాలు పౌరాణిక చిత్రాలలో సందర్భానుసారంగా ఉపయోగించగా చాలా సాంఘిక చిత్రాలలో శ్లోకాల కోసం సందర్భాలను సృష్టించారు.

## (ఆ) పాక్షికాలు :

ప్రారంభంలోకాని మధ్యలోకాని శ్లోకాలను కలిపి రాసిన సినిమా పాటలు తెలుగులో ఎక్కువగానే వచ్చాయి. ఉదాహరణలు --

1 ఆమె : అలలు కదిలినా పాటే - ఆకు మెదిలినా పాటే
కలలు చెదిరినా పాటే - కలత చెందినా పాటే

అబ్బాయి : ఏపాట నే పాడను బ్రతుకే
పాటైన పసివాడను - ఏపాట నే పాడను?
ఏలుకుంటే పాట
మేలుకుంటే పాట
పాడుకొంటే పాట, మా దేవుడు

ఆమె : శ్రీమన్నభీష్ట వరదాఖిలలోకబంధో
శ్రీ శ్రీనివాస జగదేక దయైకసింధో
శ్రీ దేవతాగృహ భుజాంతర దివ్యమూర్తే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్

అబ్బాయి : ఆ సుప్రభాతాలు ఆ భక్తిగీతాలు
పాడకుంటే మేలుకోడు మమ్మేలుకోడు ॥ఏ పాట॥
(సీతామాలక్ష్మి-వేటూరి)

2. పల్లవి : శ్రీ ఆంజనేయా ప్రసన్నాంజనేయా
శ్రీరామపదపద్మ సేవాప్రమేయా
మాం పాహి పాహి మాం పాహి పాహి
తతో రావణ నీతాయాస్సీతాయా శత్రుకర్శణ:
ఇయేష పదమన్వేష్టుం చారణా చరితే పథి

చరణం : సుందరమైనది సుందరకాండ
సుందరకాండకు నీవే అండ
వారధి దాటి సీతను చూచి
అంగుళి నొసగి లంకను కాల్చిన
నీ కథ వింటే మాకు కొండంత బలమంట
(సూపర్‌మేన్ -ఆత్రేయ)

## (ఇ) భావానువాదాలు :

సంస్కృత శ్లోకాల్లోని భావాలను తీసుకొని రాసిన అనువాద ప్రాయాలు అనదగ్గ సినిమాపాటలు తెలుగులో విరివిగానే వచ్చాయి. ఒకే శ్లోకాన్ని వివిధకవులు



పాటలుగా మలిచిన సందర్భాలు, ఒకే కవి రెండుమూడు పాటలుగా రాసిన సందర్భాలు కూడా వున్నాయి. ఉదాహరణకు శ్రీరామకర్ణామృతంలోని ఈ దిగువ శ్లోకాన్ని సినిమాల్లో దాదాపు సీతాకల్యాణం ఘట్టం వచ్చినపుడల్లా వినియోగించుకొన్నారు.

జానక్యా: కమలామలాంజలిపుటే యా: పద్మరాగాయితా:
న్యస్తా రాఘవ మస్తకే చ విలసత్కుంద ప్రసూనాయితా:
స్రస్తా శ్శ్యామల కాయకాంతికలితా: యా ఇంద్రనీలాయితా:
ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతాం శ్రీరామవైవాహికా:[8]

దీనిని 'సీతారామ కల్యాణం' (61)లో సముద్రాల

కల్యాణము చూతము రారండి
శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి...

అనే పాటలో

జానకి దోసిట కెంపులప్రోవై
రాముని దోసిట నీలపురాశై
ఆణిముత్యాలు తలంబ్రాలుగా
శిరమున మెరిసిన సీతారాముల ॥కల్యా॥

అని అనువదించగా ఆ పాట ఇంటింటా మార్మోగింది.

ఈ శ్లోకాన్నే 'సంపూర్ణ రామాయణం' (72)లో ఆరుద్ర

ఎర్రన్ని దోసిట తెల్లని ముత్యాలు
సీత తలంబ్రాలకై తీసింది
తీసిన ముత్యాలు దోసిలి రంగుతో
ఇంపుగా కెంపులై తోచాయి
కెంపులనుకొన్నవి రామయ్య మై ఛాయ
సోకగా నీలమ్ములైనాయి
ఇన్ని రంగులు చూసి ఇంతి తెలబోయింది
ఇనకులుడు చిరునవ్వు నవ్వాడు

అనే పాటగా కొత్తగ చెప్పడానికి ప్రయత్నించారు. తిరిగి 'సీతాకల్యాణం'లో

8. శ్రీరామకర్ణామృతం - ప్రథమాశ్వాసము - శ్లోకం : 83 : పుట : 36

ఆరుద్ర -

కల్యాణము చూతము రారండి
శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి...

అనే పాటలో

తెల్లని ముత్యము లెర్రగమారి ఎర్రనివేమో నీలములవుతూ
తడ తడవకో రంగును దాల్చే తలంబ్రాలు మది భ్రమింపజేసే --

అని పై శ్లోకాన్ని సంక్షిప్తీకరించారు.

కార్యేషు దాసీ కరణేషు మంత్రీ
భోజ్యేషు మాతా శయనేషు రంభా
రూపేచ లక్ష్మీః క్షమయా ధరిత్రీ
షట్కర్మయుక్తా కులధర్మపత్నీ

అనే 'చాణక్య నీతిదర్పణం'లోని శ్లోకాన్ని వివిధ కవులు తమతమ బాణీల్లో పాటలుగా మలిచారు.

'గృహలక్ష్మి'లో సి. నారాయణ రెడ్డి ఓ యుగళ గీతంలో ఇలా పొందుపరిచారు.

మగ : వినవే ఓ ప్రియురాలా
వివరాలన్నీ ఈ వేళా
మగువలు ఏం చేయాలి?

ఆడ : ఏం చేయాలేం...?

మగ : ఏం చేయాలా? మగనికి సేవ చేయాలి

సాకీ : కార్యేషు దాసీ కరణేషు మంత్రీ
భోజ్యేషు మాతా శయనేషు రంభా

ఆడ : ఏమిటో ఆ వివరాలు?

మగ : తెల్లవారగనే లేవాలి, నన్ను
మెల్లగ నిద్దురలేపాలి
లేత నవ్వులే రువ్వాలి నా
చేతికి కాఫీ యివ్వాలి



రెండు ఝాములు దాటక ముందే
నిండైన విందులు చేయాలి

ఆడ : ఊ తర్వాత --

మగ : ఇహ సాయంత్రం
నీటుగ ముస్తాబు కావాలి -- ప
న్నీటి జల్లులా రావాలి
మల్లెల పానుపు వేయాలి చల్ల
చల్లగ గంధం పూయాలి....

ఈ పాటలో శ్లోకంలోని లక్షణాలను ఆధునికీకరించారు.

'మన సంసారం' (68)లో దాశరథి అత్తింటికి కొత్తగా వెళ్లే అమ్మాయికి హితోపదేశం చేసే పాటలో ఈ శ్లోకాన్ని యిమిడ్చారు.

పతియే నీదైవమమ్మా నీ
గృహమే స్వర్గసీమా ॥పతి॥
... ... ...
అడిగిన వారికి లేదనకుండా
అన్నం పెట్టాలీ, ఆకలి తీర్చాలీ
ఉన్న దానిలో యిల్లు గడుపుకొని
మన్ననలందాలీ, నీ పతి మన్ననలందాలీ ॥పతి॥
దాసివై సేవచేసి మంత్రివై తోడుగ నిలచీ
అందంలో లక్ష్మిని మించీ
అనురాగాలే చిలికించాలీ పతినే మురిపించాలీ ॥పతి॥

'ఇల్లు-ఇల్లాలు' (1972)లో ఆరుద్ర రాసిన 'ఆలుమగల అన్యోన్యం అంతులేని ఆనందం' అనే పాటలో

సేవలందున దాసిగా భావమెరిగిన మంత్రిగా
వలపులందున రంభగా వనిత మెలగాలి
జీవితమ్మున చెలుడుగా చేయి వీడని సఖుడుగా
మరులు గొలిపే మరుడుగా మగడు మెలగాలి

శ్లోకంలో లేని భావాన్ని కూడా నాణేనికి రెండువైపులా భావించి రాశారు.

'కోకిల' (1990) లో వేటూరి - ఈ శ్లోకంలోని మొదటి రెండు పంక్తులతో ఆరంభించి -

తళుక్కు - బెళుక్కు - కుళుక్కు అందాలు
తరుక్కు - తరుక్కు - కొరుక్కు తింటుంటె....
నన్నెత్తు కెళ్లొద్దు, నన్నెత్తుకోవద్దు గోపాలా

అని అంతగా అతకని పాట రాశారు.

'నిరాశ్రయా న శోభన్తే పండితా వనితా లతాః'

అనే సంప్రదాయ శ్లోకం 'కాంచన గంగ' చిత్రంలో పాటగా పరివర్తన చెంది విస్తరించింది.

వనితా లతా కవితా మనలేవు లేక జత
ఇవ్వాలి చేయూత, మనసివ్వడమే మమత
పూలురాలి నేలకూలి తీగబాల సాగలేదు
చెట్టులేక అల్లుకోక పూలబాల నవ్వలేదు
మోడు మోడని తిట్టుకొన్న తోడు విడిచేనా
తొలకరించే కొత్త ఆశ తొలగిపోయేనా
ఆదరించే ప్రభువులేక కావ్యబాల నిలువలేదు
కవితయైనా వనితయైనా ప్రేమలేక పెరుగలేవు

'శిశుర్వేత్తి పశుర్వేత్తి
వేత్తి గాన రసం ఫణిః'

అనే శ్లోక భాగం 'అమర సందేశం' (1954)లోని

మానసలాలస సంగీతం
మధుమయ జీవన సంతోషం

అనే పాటలో --

'రాగభావమున పశువులు శిశువులు
పాములు పరవశమొందాలి'...

అనే పంక్తులుగా అవతరించింది.



భగవద్గీతలోని సాంఖ్య జ్ఞాన యోగాలనుండి ఎంపిక చేసిన కొన్ని శ్లోకాలను తీసుకొని 'శ్రీ కృష్ణావతారం'లో గీత బోధగా సముద్రాల, 'దానవీరశూరకర్ణ'లో సి. నారాయణరెడ్డి తెనిగించారు. ఉదాహరణగా 'దానవీరశూరకర్ణ'లోని స్వేచ్ఛానువాదాన్ని పరిశీలింపవచ్చు.

ఏల సంతాపమ్ము మరి నీకేల సందేహమ్ము పార్థ
మృతులకై జీవితులు పండితులు దుఃఖితులౌదురా
కర్మముల యందె కల దధికారమ్ము;
లేదు కర్మఫలము నందు
కాన కర్మమ్ములు విడువరాదు
పుట్టినందుకు చావు తప్పదు
గిట్టినపుడు పుట్టక తప్పదు
పరిహరింపగలేనిదానికి పరితపింపకుమా పరంతప
ఆత్మ నిత్యము ఆత్మ సత్యము అది అచింత్యము అది అగమ్యము
చీల్చలేనిది కాల్చలేనిది చిరంతనమది సర్వగతమది
చంపెడి వాడవు నీవ, చంపబడెడివారు వార?
చేసెడి వాడను నేనే చేయించెడివాడను నేనే
ఎన్నడు ధర్మము తరుగునో ఎన్నడు అధర్మము పెరుగునో
అప్పుడు సృష్టించుకొందు అర్జునా నన్ను నేనే
సద్ధర్మ స్థాపనకై సంభవింతు యుగ యుగమున
అన్ని ధర్మములు త్యజించి నన్నే శరణము పొందుము
సర్వపాప విమోచనము జరిపి మోక్ష మొసంగెద....

సాంఖ్య యోగంలో 'అశోచ్యానన్వశోచః' అనే శ్లోక భావంతో ప్రారంభమై జ్ఞానయోగంలోని 'పరిత్రాణాయ సాధూనాం....' శ్లోక భావంతో అంతమైన ఈ గీతా సారాంశంలో మధ్యలో శ్లోకాలు ఒక వరుసలో గాక భావానుగుణంగా గ్రహింపబడ్డాయి. ఇంకా -- 'మహాకవి క్షేత్రయ్య', చిత్రంలో సి. నారాయణరెడ్డి ఒక పాటలో కూర్చిన అష్టవిధనాయికా లక్షణాలు కూడా ఆలంకారిక సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొన్నవే. ఈ వర్ణనలో ముందు లక్ష్యాన్ని, తర్వాత క్షేత్రయ్య పాత్ర ముఖంగా లక్షణాన్ని చెప్పారు. ఉదాహరణకు వాసకసజ్జిక వర్ణన

ప : ఎంత ముచ్చటైన వాడే
నా ప్రియుడు ఈ క్షణమే రానున్నాడే

చ : ఇదుగో పైట చెంగు తొందరపడెనే
అదుగదుగో పూలపాన్పు గుసగుస లిడెనే
అతని మెత్తని అడుగుల సడి
లేత గాలిలో వినబడి
అరరే నా ఒడలంతా అలజడి -- అలజడి --
అలజడి

క్షేత్రయ్య : పడకిల్లు సరిచేసి
పతి కొరకు వేచేటి పడతి
వాసక సజ్జిక, వాసక సజ్జిక

ఇలా మిగిలిన నాయికల లక్షణాలను కూడా అందరికీ అర్థమయ్యేలా పాటగా మలిచారు.

## (ఈ) ప్రతిధ్వనులు :

శ్లోకంలోని పాదాలనుగాని పదాలనుగాని మార్చి పాటల్లో ప్రతిధ్వనుల్ని వినిపించే ప్రయోగాలు వేటూరి చేశారు.

ఉదా : 'సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి'

అనే సూక్తిని స్ఫురింపచేస్తూ 'పసివాడి ప్రాణం'లో ప్రణయగీతం రాశారు -

అందం శరణం గచ్ఛామి
అధరం శరణం గచ్ఛామి
ఈ సాయంత్రవేళ ఈ ఏకాంతవేళ

ప్రణయం శరణం గచ్ఛామి
హృదయం శరణం గచ్ఛామి
ఈ సిందూరవేళ నీ శృంగారలీల



సుఖ శిఖరం శుభయోగం అది నా సంగీతం

ఇందులో 'అందం' సంస్కృత పదం కాకపోయినా ధ్వనికోసం వాడింది. అందుకే ఇలాంటి చమత్కారాలను ప్రతికృతులు అనకుండా ప్రతిధ్వనులు అనడం. ఇవి దాదాపు అనుకరణలే.

## (ఉ) స్ఫూర్తులు - దీప్తులు :

కనిపిస్తున్న కాంతికి కనిపించని అగ్ని కారణమైనట్లు వినిపించే గీతాలలో కొన్నిటికి స్ఫూర్తి ఎక్కడో ఏదో వుంటుంది. ఇలా కొన్ని శ్లోకాలు ప్రేరణగా రాసిన కొన్ని సినిమా పాటలూ వున్నాయి.

ఉదాహరణకు 'గాజుల కిష్టయ్య' లో ఆత్రేయ రచన

రారయ్యా పోయిన వాళ్లు
ఎవరయ్యా ఉండేవాళ్లు
నవ్వు మరచి నన్ను మరచి
ఎందుకు కన్నీళ్లు - ఈలా ఎన్నాళ్లు?

భగవద్గీత సాంఖ్యయోగంలోని
జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాద పరిహార్యే ఽ ర్థే న త్వం శోచితు మర్హసి[9]

అనే శ్లోకం నుంచి వెలిగిందే!
'మగమహారాజు'లోని

సీతే రాముడి కట్నం
ఆ సీతకు రాముడు దైవం

అనే పాటకు -- వ్యాస భారతం, శ్రీమదాంధ్ర మహాభాగవతంతో సహా అనేక కావ్యాల్లోని అలాంటి ఘట్టాలకు ప్రేరణ అయిన వాల్మీకి రామాయణంలోని -

తుల్యశీల వయోవృత్తాం
తుల్యాభిజన లక్షణాం

9. శ్లోకం 27 భగవద్గీత. పుట 49.

రాఘవో ఉర్హతి వైదేహీం
తం చేయ మసితేక్షణా [10]

(సమానమైన వయస్సు, నడత, శీలము, ఉత్తమ లక్షణాలు కలిగిన సీతకు రాముడే భర్తగా అర్హుడు. రాముడికి తగిన భార్య సీతే.)

అనే శ్లోకం ఊపిరి అనిపించడం యాదృచ్ఛికమైనా ఆశ్చర్యకరం !

'శిలా శాసనం'లో జొన్నవిత్తుల రాసిన

నీడనిచ్చి పళ్లనిచ్చి ఒదుగుతోంది చెట్టు
కడలిలోని నీరు తెచ్చి కురుస్తోంది మేఘం
పాలిచ్చి దుక్కిదున్ని సాగుతోంది పశువు
ఇంటింటికి కట్టడమై నిలుస్తోంది రాయి
మనసులేని మాటరాని ఆ మబ్బుకి ఆ పశువుకి
రాళ్లకీ చెట్లకీ మొక్కుతారు అందుకే

ఈ పాటకు స్ఫూర్తి నీతిశ్లోక రత్నాకరం లోని ఓ రత్నం

భవన్తి నమ్రాస్తరవః ఫలోద్గమైః
నవాంబు భిర్దూర విలంబినో ఘనాః
అనుద్ధతాస్సత్పురుషాస్సమృద్ధిభిః
స్వభావ ఏవైష పరోపకారిణామ్ ॥

కాళిదాసు మేఘసందేశం ప్రేరణగా 'మల్లీశ్వరి', 'మేఘసందేశం', 'నవ్వితే నవరత్నాలు' చిత్రాలలో రాసిన పాటలు ఈ కోవకే చెందుతాయి. ఇవన్నీ అనుసృజనల విభాగానికి చెందుతాయి.

ఇంకా-

1. ఆనందదాయినీ భవానీ
నటరాజ మనోవిలాసినీ -'రత్నమాల', సముద్రాల
2. జయజయ శ్రీరామా - రఘువరా
శుభకర శ్రీరామా - 'జయసింహ', సముద్రాల (జూ)
3. జయజయజయజయ భారత జనయిత్రీ -'రాక్షసుడు', కృష్ణశాస్త్రి
4. అఖిలాండేశ్వరి చాముండేశ్వరి -'సప్తపది', వేటూరి

10. వాల్మీకి రామాయణం, సుందరకాండ 26వ సర్గ, 5వ శ్లోకం



5. ధన్యోస్మి ప్రభూ శ్రీరామ -'జేగంటలు', వేటూరి
6. ప్రేయసీ, గ్లౌ భా -'మహర్షి', జొన్నవిత్తుల

మొదలైన శుద్ధ సంస్కృత గీతాలు కూడా తెలుగు చిత్రాలలో వచ్చాయి.

## (బి) ఆంధ్ర వాఙ్మయం :

### (అ) యథాతథాలు :

ఏ సౌకర్యం లేకుండా అచ్చంగా పురాణాలనుంచీ కావ్యాలనుంచీ తీసుకొని సినిమాలలో ఉపయోగించిన పద్యాలలో ప్రథమ స్థానం పోతన భాగవత పద్యాలదే. ఆ మాటకొస్తే మొట్టమొదటి తెలుగు టాకీలోనే పోతన పద్యాలున్నాయి. ఇంకా భారతం, మొల్లరామాయణం, ఉత్తరరామాయణం, మనుచరిత్ర, పారిజాతాపహరణం, కృష్ణశతకం, వేమనశతకం మొదలైన కావ్యశతకవాఙ్మయాలనుండి సినిమాలలో పద్యాలను ఎక్కువగా వాడుకొన్నారు. ఆధునికులలో జాషువా, కరుణశ్రీ, దువ్వూరి రామిరెడ్డి ప్రభృతుల పద్యాలను ఎక్కువగా ఉపయోగించారు.

'భక్తపోతన', 'శ్రీకృష్ణలీలలు', 'సవతికొడుకు' మొ॥ చిత్రాలలో భాగవతంలోని అనేక ప్రసిద్ధ పద్యాలను ఉపయోగించగా - 'శ్రీకృష్ణపాండవీయం'లో రుక్మిణీకల్యాణ ఘట్టం నుంచీ, 'మోహినీ భస్మాసుర'లో బలిచరిత్ర నుంచీ భాగవత పద్యాలను తీసుకొన్నారు. గజేంద్రమోక్షం ఘట్టంలోని పద్యాలు కూడా చాలా సినిమాల్లో వచ్చాయి. మొత్తంమీద సినిమాల్లో వచ్చిన భాగవతపద్యాల్లో అవతారిక, అష్టమ దశమస్కంధాలలోని పద్యాలు అధికంగా వచ్చాయి. వివిధ చిత్రాల్లో వినియోగించిన భాగవత పద్యాలు అరవై వరకు వున్నాయి.

సినిమాల్లో వాడిన భారతపద్యాల్లో ఎక్కువ కవిత్రయ భారతంలోనివి కావు -- తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయాలు నాటకాల్లోనివి. 'ద్రౌపదీవస్త్రాపహరణం', 'వీరాభిమన్యు', 'పాండవవనవాసం', 'రాముడు-భీముడు' వంటి కొద్ది చిత్రాల్లో మాత్రం కవిత్రయ పద్యాలను ఉపయోగించారు.

ఉ : 'పాండవవనవాసం'లో నన్నయపద్యాలు[11]

1. కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచుచుండన్...
2. ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁజూచి...

11. సభాపర్వం ద్వితీయాశ్వాసం లోని 232, 249 పద్యాలు

రామాయణాల్లో సరళమైన భాషలో వున్న మొల్ల రామాయణం వైపు సినీరంగం మొగ్గు చూపించింది. 'సంపూర్ణ రామాయణం' (1936)లోనే మొల్ల రామాయణంలోని పద్యాలను ఉపయోగించారు.[12]

1. **ఉన్నాఁడు లెస్స రాఘవుడు**
2. **నీలమేఘచ్ఛాయఁబోలు దేహమువాడు...**

'సీతారామకల్యాణం', 'భార్య' చిత్రాలలో కంకంటి పాపరాజు రచించిన-- ఉత్తర రామాయణంలోని పద్యాలను 'శ్రీకృష్ణమాయ', 'శ్రీకృష్ణతులాభారం' (మూడుసార్లు) వంటి చిత్రాలలో నంది తిమ్మన కృతమైన పారిజాతాపహరణంలోని పద్యాలను, 'తోబుట్టువులు', 'మనుషుల్లో దేవుడు', టైగర్ రాముడు' మొదలైన చిత్రాలలో మనుచరిత్రలోని వరూథినీప్రవరుల ఘట్టంలోని పద్యాలను, 'బొబ్బిలి యుద్ధం'లో అడిదము సూరకవి పద్యాన్నీ, 'ప్రేమనగర్'లో దువ్వూరి రామిరెడ్డి పద్యాన్నీ, దాదాపు హరిశ్చంద్ర వృత్తాంతం వున్న అన్ని చిత్రాలలోను, 'సతీసక్కుబాయి' (1954) లోను జాషువా 'శ్మశానవాటిక' పద్యాలను... ఇలా ప్రసిద్ధమైన పద్యాలనెన్నిటినో యథాతథంగా సినిమాల్లో ఉపయోగించారు.

**(ఆ) పాక్షికాలు :**

ప్రాచీన కవిత్వంలో చంపూ రచనకు దగ్గరగా పాటల మధ్యలో పద్యాలను యిరికించిన రచనలు తెలుగు సినిమాపాటల్లో చాలా వున్నాయి. ఇలాంటి బాణీలో అంతర్నాటకాలు కూడా సినిమాల్లో ఎక్కువగా వచ్చాయి. గద్యం, పద్యం, పాట -- మూడు ప్రక్రియలను కలగలిపి 'వరూథినీ ప్రవరాఖ్యం' అంతర్నాటకంగా 'టైగర్ రాముడు'లో సముద్రాల(జూ), 'మనుషుల్లో దేవుడు'లో సి.నారాయణరెడ్డి రాశారు. మచ్చుకి 'మనుషుల్లో దేవుడు'లో కొంతభాగం--

వచనం: ఆంధ్రకవితా పితామహ అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర తెలుగుప్రబంధాలలో మొదటిది. ఆ మహాకావ్యంలోని సుమధుర ఘట్టమే-- వరూథినీ ప్రవరుల వృత్తాంతము... రివ్వున గగనానికి ఎగిరాడు ప్రవరాఖ్యుడు. ఎన్నెన్నో తీర్థాలను దర్శించి చివరికి చేరుకొన్నాడు ఉత్తుంగతుంగ హిమాలయ సన్నిధిని.

**పాట : అహో హిమవన్నగము, భరతావనికే తలమానికము**
**అంబరచుంబి శిఖరాలు, సరఝ్ఝరీ తరంగాలు**

12. మొల్ల రామాయణం, సుందరకాండ - 91, 102 పద్యాలు



**ఆ అభంగ తరంగ మృదంగ రవములు**
**అభినయమాడు మయూరాలు**

**భగీరథుడు తపియించిన చోటు**
**గగనగంగనే దింపిన చోటు**
**పరమేశుని ప్రాణేశుగ బడసి**
**గిరినందన తరియించిన చోటు...**

వచనం: ప్రవరాఖ్యుడు : అహో ... సిద్ధుడిచ్చిన కాలి పసరుతో సిద్ధించెను వాంఛితమ్ము. పుణ్యతీర్థ సందర్శనమ్ముతో పునీతమాయెను జీవితమ్ము. అయ్యహో ... కాలి పసరు కరిగిపోయెనే... ఇంటికేగుటే ఎరుగనైతినే. ఎక్కడి మా యరుణాస్పదపురము? ఎక్కడి ఈ హిమవన్నగవరము? కోరి వచ్చినాను. దారి కోలుపోయినాను. ఎగిరిపోదామన్న నాకు రెక్కలైన లేవే? ఏ దిక్కు కానరాదే? ఏ దిక్కు కానరాదే?

**వరూథిని : ఎక్కడివాడు యక్షతనయేందు జయంత వసంత కంతులన్**
**జక్కదనంబునన్ గెలువజాలెడు వాడు మహీసురాన్వయం**
**బెక్కడ? యీ తనూవిభవ మెక్కడ? యేలనిబంటుగామరున్**
**డక్కగొనంగరాదె యకటా నను వీడు పరిగ్రహించివన్**

ఇలా సాగిన రచన మనుచరిత్రలోని పద్యాలను కరిగించి పోసిందే !

'వాగ్దానం'లో శ్రీశ్రీ రాసిన హరికథలో కూడా పాటచివరిలో పోతన, కరుణశ్రీ పద్యాలను వాడుకొన్నారు

శ్రీ నగజాతనయం సహృదయం
చింతయామి సదయం

**పాట : ఇనకుల తిలకుడు నిలకడగల క్రొ**
**క్కారు మెరుపువలె నిల్చి**
**తన గురువగు విశ్వామిత్రుని ఆ**
**శీర్వాదము తలదాల్చి**

**సదమల మదగజ గమనము తోడ స్వ**
**యంవర వేదికచెంత**
**మదన విరోధి శరాసనమును తన**
**కరమున బూనిన యంత**

**తే.గీ.** : **ఫెళ్ళుమనె విల్లు గంటలు ఘల్లుమనె గు**
**భిల్లుమనె గుండె నృపులకు ఝల్లుమనియె**
**జానకీ దేహమున్ నిమేషంబునందె**
**నయము జయమును భయము విస్మయము గదుర!**

ఆ విధంగా శ్రీరామచంద్రమూర్తి శివధనుర్భంగము కావించినాడు. అంతట

**భూతల నాథుడు రాముడు**
**ప్రీతుండై పెండ్లియాడె పృథుగుణమణి సం**
**ఘాతన్ భాగ్యోపేతన్**
**సీతన్...**

దీనిలో తేటగీతిని కరుణశ్రీ రచించిన ఉదయశ్రీలోని శివధనుర్భంగము నుండి, కందపద్యాన్ని పోతన భాగవతంలోని నవమస్కంధం నుండీ శ్రీశ్రీ గ్రహించారు. దీనికి 'పాడవోయి భారతీయుడా'లో వివరణ యిచ్చారు కూడా[13]

ఇలా మధ్యమధ్య పద్యాలే కాకుండా పద్యపాదాలను మాత్రమే తీసుకొన్న పాటలుకూడా వున్నాయి.

ఉ: 'నారీ నారీ నడుమ మురారి' చిత్రంలో (1990) పాట

**ఇరువురు భామల కౌగిలిలో స్వామీ**
**ఇరుకున పడి నీవు నలిగితివా**
**వలపుల వానల జల్లులలో స్వామీ**
**తలమునకలుగా తడిసితివా**
**... ... ... ...**

13. పాడవోయి భారతీయుడా - 21వ పుట.



ఇంటిలోన పోరంటే ఇంతింత కాదయా అన్నాడు ఆ యోగి వేమన
నాతరమా భవ సాగర మీదను అన్నాడు కంచెర్లగోపన్న
పరమేశా గంగవిడుము పార్వతి చాలున్

ఇందులో వేమన పద్యపాదాన్ని స్వల్పంగా మార్చి, రామదాసు కీర్తననూ, శ్రీనాథుని చాటుపద్య పాదాన్నీ యథాతథంగానూ పాటలో యిమిడ్చారు వేటూరి. (పల్లవి మాత్రమే ఆత్రేయ రాసిన ఈపాట సినిమాలో ఆయన పేరుతో వచ్చింది.)

ఇలాంటి వాటిని లక్షణపరిభాషలో వృత్తగ్రంథులు అంటారు. ఛందోనియమంలేని వాక్యాల్లోకాని పదాల్లోకాని ఛందోబద్ధమైన వాక్యముంటే అది వృత్తగ్రంథి అని వామనుని కావ్యాలంకార సూత్రం.

'బొబ్బిలియుద్ధం' (64)లో శ్రీశ్రీ రాసిన

**మురిపించే అందాలే**
**అవి నన్నే చేరాలే**

అనే పాట సాకీ యిది

**సొగసుకీల్జడదాన సోగ కన్నులదాన**
**వజ్రాలవంటి పల్వరుస దాన**
**బంగారుజిగి దాన సింగారముల దాన**
**నయమైన ఒయ్యారి నడలదాన**
**తోరంపుకటిదాన తొణకు సిగ్గులదాన**
**పిడికిట నడగు నెన్నడుముదాన...**

ఇది చదవగానే శ్రీనాథుడి పద్యం స్ఫురించకమానదు

**సొగసు కీల్జడదాన సోగకన్నులదాన**
**వజ్రాలవంటి పల్వరుసదాన**
**బంగారుజిగిదాన పటువుగుబ్బలదాన**
**నయమైన యొయ్యారి నడలదాన**
**తోరంపుఁ గటిదాన తొడల నిగ్గులదాన**
**పిడికిటనడఁగు నెన్నడుముదాన**

తళుకు జెక్కులదాన బెళుకు ముక్కరదాన
సింగాణి కనుబొమ చెలువుదాన

మేలిమి పసిండి రవ కడియాలదాన
మించి పోవేల రత్నాల మించుదాన
తిరిగి చూడవే ముత్యాలసరులదాన
చేరి మాటాడు చెంగావి చీరదాన [14].

సీసమే కదా అని శ్రీశ్రీ సరిగా కరిగించకుండానే సాకీగా పోత పోశారు.

**(ఇ) భావానువాదాలు :**

పద్యాల్ని పాటలుగా మాటలుగా మలచడం వరూథినీప్రవరాఖ్యం అంతర్నాటకంలో గమనించాం. విడిగా వచ్చిన సినిమా పాటల్లో కూడా పద్యభావాన్ని ఉపయోగించుకొన్న సందర్భాలున్నాయి.

'జీవనతరంగాలు'లో సి. నారాయణరెడ్డి రచన
'నందామయా... గురుడ నందామయా' పాటలో చివరిచరణం

1. **పుట్టినప్పుడూ బట్టకట్టలేదు**
   **పోయేటప్పుడు అది వెంటరాదు**
   **నడుమ బట్టకడితే నగుబాటు**
   **వేదాంతసారం యింతేనయా...**
2. **కంటిలో నలకయు, ఇంటిలో పోరును**
   **తంటాలు ఇవిపెట్టునోరన్న, చాల తంటాలు పెట్టునోరన్నా**

**(కోపల్లె వేంకటరమణరావు - ఇద్దరు పెళ్లాలు)**

కొంచెం అటూ యిటుగా వేమన పద్యాలే.

**(ఈ) ప్రతిధ్వనులు :**

ప్రసిద్ధమైన పద్యాలకు అక్కడక్కడా చేర్పులూ మార్పులూ చేసి కొన్ని సందర్భాలలో నకళ్లురాసి సినిమాల్లో ఉపయోగించిన వైనాలు అనేకం.

---

14. వీథి నాటకము - చివరిపుట



'సంతానం' (1955)లో

లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితః పరంబెఱుఁగ, మన్నింపం దగున్ దీనునిన్,
రావా శారద కావవా తరుణి సంరక్షించవా భక్తునిన్

అని భాగవతంలో గజేంద్రమోక్షంలోని పద్యంలో చివరి పాదాన్ని సినిమాలో కథానాయిక శారద పరంగా మార్చారు.

'శాంతినివాసం'లో కూడా ఇలాగే చివరి పాదాన్ని ప్రేయసీపరంగా మార్చారు--

**'రావే ప్రేయసి కావవే సఖియ సంరక్షించు ప్రాణేశ్వరీ'** అని.

'తల్లిప్రేమ'లో 'తల్లీ నిన్నుదలంచి పుస్తకము చేతన్‌బూనితిన్..' అనే సాంప్రదాయికమైన సరస్వతీ స్తోత్రానికి పరీక్ష కనుగుణమైన పేరడీపద్యం ఇలా వుంది

తల్లీ నిన్నుదలంచి పేపరును చేతన్ బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి ఆన్సరులనెంతో సూటిగా నేర్పు శో
భిల్లన్ వ్రాయగజేసి క్లాసునిడి సంప్రీతిన్ దయన్ చూడుమా
ఫుల్లాబ్జాక్షి గుణాలయా భగవతీ పుణ్యంబు నీదే సుమా...

నిజజీవితంలో కూడా విద్యార్థులకు యిలాంటి పేరడీ పద్యాలనల్లి ఆనందించడం అలవాటు గనుక దాన్ని చిత్రంలో చూపించి వుంటారు. 'గోపాలుడు-భూపాలుడు'లో పాలగుమ్మి పద్మరాజు రాసిన పద్యం 'మనుచరిత్ర'ను గుర్తుచేయడానికే !

ఎక్కడివాడొ అట్టె కనుపించి తటాలున మాయమైనయా
చక్కనివాడు, వెన్నెల పసందులు చిందెడు కొంటె చూపులున్
చక్కిలిగింతలెట్టు చిరునవ్వుల పువ్వుల రాచఠీవి, కై
పెక్కిన జవ్వనంబు మరియెన్నడు నా కనువిందు సేయునో

కంకంటి పాపరాజు రచించిన ఉత్తర రామాయణంలో రంభారావణ సంవాదం లోని పద్యాన్ని 'సీతారామకల్యాణం'లో ఉపయోగించి స్వల్పంగా మార్పులు చేశారు

**జనకుడు సుతుడును జన్నంబుఁ జేసిన**
**వనిత వారేమిఁ గావలయునీకు**
**అన్నదమ్ములు సోమయాజులై వెలసిన**
**వనిత వారేమిఁ గావలయునీకు**
**బావయు మరదియు బవరానఁ గూలిన**
**వనిత వారేమిఁగావలయు నీకు...**
**అల్లుండు మామయు నని త్రెళ్లి వచ్చిన**
**వనిత వారేమిఁగావలయు నీకు...**

అనే రావణుని పద్యంలో నాలుగు పాదాల్లోనూ 'వనిత' అనే పదం రావడంవలన దానిని సినిమాలో మిగతా మూడు పాదాల్లోనూ లలన, చెలువ, పొలతి అని ప్రాసయతులకు అనుకూలంగా మార్చారు. ఇలా చెప్పుకొంటూపోతే చాలావుంటాయి.

**(ఉ) స్ఫూర్తులూ-దీప్తులూ :**

పౌరాణిక కాలంలోని వస్తు, శిల్పాల ప్రేరణతో సినిమా కవులు అద్భుతమైన పద్యాలూ, పాటలూ రాశారు. ఈ తెగకు ఉత్తమోదాహరణం 'భక్త కన్నప్ప' చిత్రంలో వేటూరి రచించిన కిరాతార్జునీయ గీతం. శ్రీనాథకృతమైన హరవిలాస సప్తమాశ్వాసంలోని ఇతివృత్తాన్ని తీసుకొని సినిమా పాటగా వేటూరి మలిచిన తీరు అనితర సాధ్యం.

ఆద్యంతం అనుప్రాసలతో అందమైన గమకాలతో మనోహరమైన కల్పనలతో సాగిన సుదీర్ఘమైన సినిమాపాటలో శివుడు కిరాతుడిగా మారే ఘట్టాన్ని మూలంతో పోల్చి చూస్తే -- పాటగా అది ఎంత యెత్తున వుందో తెలుస్తుంది.

**వికట పాటల జటా మకుటికా భారంబు**
**కఱుకైన జుంజుఱు నెఱులు గాఁగఁ**
**జారు సుధాధామ శకలావతంసంబు**
**పెడకొప్పు పైనుండు పీఁకె గాఁగ**
**ఘన లలాటంబునఁ గనుపట్టు కనుచిచ్చు**
**గైరిక ద్రవతిలకంబు గాఁగ**
**భుజ మధ్యమునఁ గ్రాలు భుజగహారంబులు**
**గురిజ పూసల గుబ్బసరులు గాఁగ**



**శంకరుండు కిరాత వేషంబు దాల్చి**
**యగజ చెంచెతయై తోడ నరుగు దేరఁ**
**బాణి నోంకార దివ్యచాపము ధరించి**
**వచ్చె వివ్వచ్చు వర తపోవనము కడకు** [15]

ఈ పద్యాని కేమాత్రం సంబంధం లేనట్టు--మూలంలో ముట్టుకోని శివుడి సామగ్రి కిరాత వేషంలో ఎలా మారిందో సినిమా పాటలో ఊహించారు వేటూరి.

**నెలవంక తలపాగ నెమలి ఈకగ మారె**
**తలపైన గంగమ్మ తలపు లోనికి జారె**
**నిప్పులుమిసే కన్ను నిదురోయి బొట్టాయె**
**బూదిపూతకు మారు పులితోలు వలువాయె**
**ఎఱుక గల్గిన శివుడు ఎరుకగా మారగా**
**తల్లిపార్వతి మారె తాను ఎరుకతగా**
**ఓంకార ధనువుగా ఒదిగె త్రిశూలమ్ము**
**కైలాసమును వీడి కదలి వచ్చెను శివుడు --'**

కిరాతార్జున సంవాదం హరవిలాసంలో ముప్పై పద్యాల్లో వుంటే-- సినిమా పాటలో ముప్పై పంక్తుల్లో ముచ్చటగా ఒదిగింది. నిజానికి మూలంలోని

'తాటియంత విల్లు ధరియించినాడవు' 'ఓంకార గాండీవ జ్యాటంకారంబులు నభ: కటాహము నిండెన్' వంటి పంక్తుల ఛాయలు సినిమాపాటలో లేకపోతే సినిమా కవి మూలాన్ని చదివి వుండక పోవచ్చు అన్నంత దూరంగా సినిమాపాట వుంది. సినిమా పాట శబ్దార్థాలలో ఎంత సాధికారంగా సాగిందో చూద్దాం

**కొట్టితినేనని అర్జునుడు పడగొట్టితినేనని శివుడు**
**పట్టినపట్టు వదలకనే తొడ కొట్టిన బీరముతో అపుడు**
**'వేటవాది, వేటునాది వేటాడే చోటునాది**
**ఏటి తగవు పొమ్మ'ని విలుమీటి పలికె శివుడు**
**'చేవనాది చేతనాది చేటెరుగని ఈటెనాది**
**చేవుంటే రమ్మ'ని కనుసైగ చేసె అర్జునుడు**
**గాండీవ పాండిత్య కళలుగా బాణాలు**
**కురిపించె అర్జునుడు కానీ అపుడతడు**

15. హరవిలాసము - సప్తమాశ్వాసము - 41వ పద్యం. పుట 142

వేయి చేతుల కార్తవీర్యార్జునుడు
ఓంకార ఘన ధనుష్టంకారముల తోడ
శరపరంపర కురిసె హరుడు అయినా
నరునికాతడు మనోహరుడు
చిత్రమేమొ గురిపెట్టిన బాణమ్ములు మాయమాయె
విధి విలాసమేము పెట్టిన గురి వట్టిదాయె
అస్త్రములే విఫలమాయె శస్త్రములే వికలమాయె
సవ్యసాచి కుడి ఎడమై సంధించుట మరచిపోయె
జగతికి సుగతిని సాధించిన తల
దిగంతాల కవతల వెలిగే తల
గంగకు నెలవై కళకాదరువై
హరిబ్రహ్మలకు తరగని పరువై
అతి పవిత్రమై అఘలవిత్రమై
శ్రీకరమై శుభమైన శివుని తల
అదరగా సృష్టి చెదరగా
తాడి ఎత్తు గాండీవముతో ము
త్తాడి ఎత్తుగా ఎదిగి అర్జునుడు
చండ కోపమున కొట్టినంతనే
తల్లిదండ్రుల చలువ తనువైన దేవుడు
కోరిన వరాలిచ్చు కొండంత దేవుడు
ఎదుట నిలిచెను శివుడు ఎదలోని దేవుడు
పదములంటెను నరుడు భక్తితో అపుడు

ఇలా సార్థక ప్రతిపదంగా సాగిన ఈ పాట సినిమాపాటంటేనే చిన్న చూపు చూసే ఛాందసులకు సమాధానం.

ప్రాచీనకవులు చిత్రకవిత్వంలో చేసిన చమత్కారాల వంటివి సినిమాకవులు కూడా సాధించారనడానికి 'అమర సందేశం'లో (1954) ఆరుద్ర పద్యం చక్కని నిదర్శనం.

కవి, సంగీత విద్వాంసుడూ అయిన విద్యానాథుడు ఇతరులకు సాధ్యం కాని శారదా పీఠాన్ని -- ఒక్కొక్క మెట్టుమీద ఒక్కొక్క సంగీత స్వరం గల పాదాన్ని



చెపుతూ ఎనిమిది మెట్ల మీదుగా అధిరోహించే సందర్భంలో.... కథకనువుగా ప్రతి పాదానికి ఆద్యంతాలలో ఒక్కొక్క సంగీత స్వరం వచ్చేటట్టు కూర్చిన పద్యం యిది

సద సత్కళా క్షీరజల విభాగ క్రియా
నిపుణ హంసీ తరంగిత విలాస
రి పువదజ్ఞాన పరిభ్రాంతి హారి పు
స్తక హస్త వారిజాత సుకుమారి
గ గనాపగా సమాన గభీర గాన భా
క్క ప్రవీణా గీతికా తరంగ
మధు మాధురీ మంజు మంజుల గేయ స
మ్యక్పరిగణన సదక్షదామ
పరభృత కిశోర పంచమస్వర కలాప
దరహసన మధురారవింద మకరంద
నిరుపమాన ఘృణా వరణీయ జనని
సరస శారదా, అందు మస్మత్ప్రశంస

ఇలా సరిగమలతో ఆరుద్ర చేసిన ప్రయోగం సినీకవుల ఛంద: పరిజ్ఞానానికి దర్పణం.

ఈ ప్రయోగానికి స్ఫూర్తి తెలుగులో (సంస్కృతంలో ప్రసన్న రాఘవం వంటివి వున్నాయి) కొఱవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశికలో పాదాల మొదటి అక్షరాలు కలిపితే ఆశీర్వచనం స్ఫురించు మహారాజు నాశీర్వదించే పద్యం కావచ్చు.

పౌరాణిక చిత్రాల్లోనే కాకుండా సాంఘికాల్లో కూడా సముద్రాల, సదాశివ బ్రహ్మం, శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ మొదలైన కవులంతా పద్యాలు రాశారు. సినిమాకు పద్యాలు రాయడం తనకు చాలా యిష్టమని శ్రీశ్రీ చెప్పుకొన్నారు కూడా.[16]. అంతేకాదు 'కుమ్మరి మొల్ల'లో ఆయన రాసిన

అప్పుడు మిథిలకు జని నే
నిప్పుడు కావించు వింత నిచ్చటి ప్రజ తా
మెప్పుడును కాంచబోరని
చెప్పుచు రాఘవుడు విరిచె శివకార్ముకమున్

16. పాడవోయి భారతీయుడా - 78వ పుట

అనే దత్తపదికి వివరణ యిచ్చారు కూడా. మొల్ల కవితా పాటవాన్ని పరీక్షించడానికి వచ్చిన రామలింగడు అప్పు, నిప్పు, మెప్పు, చెప్పు, అనే నాలుగు మాటలిచ్చి వరసగా వాటి అర్థాలైన ఋణం, అగ్ని, ప్రశంస, పాదరక్ష అనే అర్థాలు రాకుండా రామాయణార్థంలో చెప్పమంటే కవయిత్రి మొల్ల చెప్పినట్లుగా రాసిన పద్యమట యిది.

ఇలా ఛందఃపరిజ్ఞానంలో ఆరితేరిన కవులు ఆ తరంలో వున్నారు. ఆ అవసరం యిప్పుడు తగ్గిపోయింది - ఈనాటి ప్రేక్షకులకు అంత జీర్ణశక్తి లేదు గనుక ! మొదటి మూడు దశల్లోనూ ఉధృతంగా ఉపయోగపడిన పౌరాణికవాఙ్మయం నాలుగో దశలో నడక కుంటుపడి అయిదారు దశల్లో అపురూపమై పోయింది. అయితే అది సినిమాపాటకు పెట్టిన అక్షరభిక్ష మాత్రం నిత్య స్మరణీయం!

## 2. నాటక సాహిత్యం :

అరవయ్యేళ్ల తెలుగు సినిమా చరిత్రలో మూడు నాలుగు సార్లు సినిమాలుగా వచ్చిన ఘనత కేవలం నాటకాలదే. 'భక్త ప్రహ్లాద', 'రామదాసు', 'సావిత్రి', 'హరిశ్చంద్ర', 'సతీ సక్కుబాయి', 'బాలనాగమ్మ', 'శ్రీకృష్ణ తులాభారం' మొదలైనవన్నీ ఇలా మళ్లీ మళ్లీ సినిమాలుగా వచ్చిన నాటకాలే. నాటకేతరమైన యితివృత్తాలు ఇలాంటి గౌరవానికి నోచుకోవడం అరుదు. 'దేవత', 'ఆరాధన' మొదలైనవాటి పేర్లు రెండు మూడుసార్లు వినిపించినా వాటి పోలిక పేర్ల వరకు మాత్రమే. నాటకాలు ఆధారంగా నిర్మించిన చిత్రాల్లో యితివృత్తాలే కాదు పాటల, పద్యాల బాణీలు కూడా అవే. అలా వుండాలని ప్రేక్షకులే కోరుకొన్నారు. అందుకే సినిమాలుగా తీసిన భారతకథల్లో అధిక శాతం తిరుపతివెంకటకవుల 'పాండవోద్యోగ విజయాలు' నాటకాన్ని కొంచెం అటూ యిటూగా చేసుకొనే రూపొందాయి. అలాగే సినిమాలుగా వచ్చిన రామాయణ కథల్లో అధికభాగం 'లవకుశ', 'మైరావణ', 'రామాంజనేయ యుద్ధం' నాటకాల చుట్టూనే తిరిగాయి. అంతెందుకు? 1933లోనే రెండు 'సావిత్రి' సినిమాలు, రెండు 'రామదాసు' సినిమాలు పోటీ పడ్డాయి. అంటే ఆనాటి నాటకాలకు సినిమాలమీద వున్న అధికారం, ఆ నాటకాలంటే ప్రజలకున్న మమకారం అర్థమౌతున్నాయి.

**మరల నిదేల రామాయణంబన్నచో**
**నీ ప్రపంచక మెల్ల నెల్లవేళ**
**దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్లు**



**తన రుచి బ్రతుకులు తనవి గాన...**
**(శ్రీమద్రామాయణ కల్పవృక్షము - అవతారిక)**

అని విశ్వనాథవారన్నట్లు ఎన్నిసార్లు అదే నాటకేతివృత్తాన్ని సినిమాలుగా తీసినా ప్రేక్షకులు సంగీత సాహిత్యాలమేరకు ఆ నాటక ఛాయలనే ఆశించడానికి వెనకవున్న నాటకముద్ర గురించి తెలుసుకోవడం అవసరం.

సినిమాకు పూర్వరూపమైన దృశ్యకావ్యప్రక్రియ నాటకం. వీధినాటకాలు, యక్షగానాలు మొదలైన దేశిరూపక లక్షణాలు కొన్ని సినిమాల్లో కనిపించినా సినిమాకు మాతృక అని చెప్పదగ్గది ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చిన ఆధునిక నాటకమే. అయితే ఆధునిక నాటకాల్లో కూడా మొదట్లో పద్యాలూ, పాటలూ లేవు. వాటి వికాసం గురించి ముందుగా తెలుసుకోవాలి.

### నాటక పద్యాలూ - కీర్తనలు :

1860లో కోరాడ రామచంద్రశాస్త్రి రచించిన 'మంజరీ మధుకరీయం' తెలుగులో మొదటి స్వతంత్ర రూపకంగా పరిగణింపబడినా అది ప్రదర్శనయోగ్యం కాదు. స్వతంత్ర రూపకాల్లో రెండవదీ తొలి సాంఘిక నాటకమూ అయిన 'నందక రాజ్యం' కూడా అలాంటిదే. అది పూర్తిగా తేటగీతుల్లో రచింపబడింది. 1880-81 ప్రాంతంలో ధార్వాడ నాటక సమాజం (అసలు పేరు అల్టేకర్ హిందూ డ్రమెటిక్ కంపెనీ) ఆంధ్ర దేశంలో పర్యటించి వెళ్లిన తర్వాతగాని తెలుగునాటకం ప్రదర్శనకు నోచుకోలేదు. ధార్వాడ నాటక సమాజం వారి హిందూస్థానీ ప్రదర్శనలచేత ప్రభావితులైన కందుకూరి వీరేశలింగం (రాజమండ్రి), కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి (గుంటూరు), నాదెండ్ల పురుషోత్తమకవి (బందరు) మొదలైనవారు నాటకాలను రచించి తమ నాటకసమాజాల చేత ప్రదర్శింపజేశారు. ఈ నాటకాలను వచననాటకాలు అన్నారు.

వసురాయ కవిగా ప్రసిద్ధులైన వడ్డాది సుబ్బారాయుడు రాసిన 'వేణీసంహారం' నాటకంతో తెలుగునాటకంలో పద్యపఠనం ప్రారంభమైంది[17]. 1883లో వేగాయమ్మ పేటలో ప్రదర్శింపబడిన ఈ నాటకం తెలుగు నాటకాల్లో రాగయుక్తంగా పద్యాలు చదివే ఒరవడిని సృష్టించింది. ఆ తర్వాత ధర్మవరం రామకృష్ణమాచార్యులు

17. మా తెలుగు తల్లికి మల్లెపూదండ - నటరత్నాలు
ఎ.ఆర్. కృష్ణ వ్యాసం

29.1.1887న బళ్లారిలో సరస వినోదినీసభ ఆధ్వర్యవంలో ప్రదర్శించిన 'చిత్రనళీయం'తో తెలుగు నాటకాల్లో పద్యాలతోపాటు పాటలు కూడా చోటుచేసుకొన్నాయి. ఆయన ఆ నాటకంలో నలపాత్రను ధరించడమే కాకుండా సంగీతజ్ఞుడు కావడం వల్ల పద్యాలకూ పాటలకూ రాగ నిర్దేశం కూడా చేశారు.

ధర్మవరం వారితో నాటకకవులకు, గాయక నటీనటులకు ఆదరణ పెరిగి వృత్తి నాటక సమాజాలు ప్రారంభమయ్యాయి. నాటకాల్లో సంగీతానికి ప్రాధాన్యం పెరిగి తంబురాలు మూలపడి వాటి స్థానంలో గానంలోని లోటుపాట్లను పూరించగల హార్మోనియం, తబలా రంగప్రవేశం చేశాయి.

రాగాలాపనకు అనువైన సరళమైన భాషలో రచింపబడిన పద్యాలూ, పాటలూ గల పౌరాణిక నాటకాలు ఎక్కువగా వెలువడ్డాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం 'గయోపాఖ్యానం', తిరుపతి వెంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు', పానుగంటి లక్ష్మీనరసింహం 'విప్రనారాయణ', 'రాధాకృష్ణ', బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'హరిశ్చంద్ర', ధర్మవరం గోపాలాచార్యుల 'రామదాసు', ముత్తరాజు సుబ్బారావు 'కృష్ణతులాభారము', శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి 'సావిత్రి', మల్లాది అచ్యుతరామశాస్త్రి 'సతీసక్కుబాయి' మొదలైనవి ప్రామాణిక నాటకాలుగా ప్రసిద్ధమయ్యాయి. ఆంధ్రదేశ మంతా పర్యటించిన సురభి నాటకసమాజం, మైలవరం బాలభారతీ సమాజం, రాజమండ్రిలోని హిందూ నాటకసమాజం, తెనాలిలో రామవిలాస సభ, విశాఖలో జగన్మిత్ర సమాజం, బళ్లారిలో సరస వినోదినీసభ మొదలైన సమాజాలు పై నాటకాలకు ప్రజల్లో ఆదరణ కలిగించాయి. పౌరాణికాలతో పాటు వేదం వారి 'ప్రతాపరుద్రీయం', సోమరాజు రామానుజరావు 'రంగూన్ రౌడీ', కాళ్లకూరి నారాయణరావు 'చింతామణి', 'వరవిక్రయం' వంటి నాటకాలు కూడా పోటీపడేవి. ఆ పోటీలో నిలబడ్డానికి సాంఘిక నాటకాలలో కూడా పాటలు తప్పనిసరి అయ్యాయి.

నాటకరచనలో వేదం వెంకటరాయశాస్త్రి, తిరుపతి వెంకటకవులు మొదలైనవారు సంస్కృత నాటక పద్ధతిలో గద్య పద్యాలతో సరిపెట్టగా, ధర్మవరం కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు వంటివారు పార్శీ, మరాఠీ నాటకాలలో తాము విన్న బాణీలలో పాటలను కూడా కూర్చి నాటకాలను రచించి ప్రదర్శింపచేశారు. పానుగంటివారు తమ నాటకాలను ఎక్కువగా పద్యాలు, కొద్ది పాటలతో రాయగా, ధర్మవరం సోదరులు తమ నాటకాలను **25**కు మించిన పాటలతో కూడా రాశారు. ఆనాటి నాటకాలలో పాటలవల్ల ప్రాచుర్యాన్ని పొంది, అర్వాచీన నాటకకర్తలకు



పాటలమీద ఆసక్తిని కలిగించిన నాటకం 'సతీసక్కుబాయి'. అయితే ఆ పాటలను సమకూర్చిన వారు నాటకకర్త కాదు- దైతా గోపాలం. ఆ నాటకంలో సక్కుబాయి పాత్రను తుంగల చలపతిరావు, కృష్ణ పాత్రను దాసరి కోటిరత్నం పోషించి ఆ పాత్రలకు వారే సాటి అనిపించుకోవడం విశేషం.

పాటలవల్ల బహుళ ప్రచారాన్ని పొందిన మరో నాటకం 'కృష్ణ తులాభారం'. దీనికి కూడా నాటకకర్త కాకుండా చందాల కేశవదాసు పాటలను సమకూర్చారు. అవి పాపట్ల కాంతయ్య శిష్యుడు అలుగులపాటి రామానుజుల స్వరకల్పనలో విశేష ప్రజాదరణను పొందాయి. 'పాపట్ల కాంతయ్య యవనాంధ్ర సంగీత లక్షణాలను జోడించి నాటకాలకు పార్శీ పద్ధతి కీర్తనలు రచించి నటులకు నేర్పేవార'ని పసుమర్తి యజ్ఞ నారాయణశాస్త్రి తమ 'ఆంధ్ర నట ప్రకాశిక'లో పేర్కొన్నారు. పాటల పట్ల ప్రజల మోజును గమనించి దైతా గోపాలం, చందాల కేశవదాసు మొదలైనవారు ఇతర కవుల నాటకాలకు కూడా పాటలను సమకూర్చి వాటిని ఆయా సందర్భాలలో చొప్పించి నాటకాలను రక్తి కట్టించేవారని తెలుస్తోంది. ఆనాడు పాటల పుస్తకాల్ని అనుబంధాలుగా ప్రచురించేవారు.

ఈ పాటలకూ పద్యాలకూ లభించిన ఆదరణ వల్లనే యడవల్లి సూర్యనారాయణ, జొన్నవిత్తుల శేషగిరిరావు, కపిలవాయి రామనాథ శాస్త్రి, తుంగల చలపతిరావు మొదలైన నటగాయకులు ఆంధ్ర నాటక రంగస్థలాన్ని ఏళ్ల తరబడి ఏలగలిగారు. ఇలా గానానికి, నటనకి ప్రసిద్ధి పొందిన నటులు ప్రసిద్ధ నాటకాలలో కొన్ని పాత్రలకు బాణీలు రూపొందించి ఆ పాత్రలకు తమకు తామే సాటి అనిపించుకొన్నారు. అదిగో -- అలా హిరణ్యకశిపుని పాత్రకు పేరు పొందిన మునిపల్లె వెంకట సుబ్బయ్య, లీలావతి పాత్రకు ప్రసిద్ధి చెందిన సురభి కమలాబాయి మొదలైన నటవర్గం వున్న సురభివారి 'భక్త ప్రహ్లాద' నాటక ప్రదర్శనని ఆధారంగా చేసుకొనే మొదటి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'ను హెచ్.యమ్. రెడ్డి రూపొందించారు.

## సినిమా పాటల్లో నాటకాల బాణీలు :

నాటకేతివృత్తాలను సినిమాలుగా తీసినపుడు ఆయా నాటకాల్లోని ప్రసిద్ధమైన పాటలు, పద్యాలూ సినిమాల్లో వుంటే తప్ప ప్రేక్షకులు వాటిని తిరస్కరిస్తారని పరిశ్రమకి అనుభవంమీద రూఢి అయింది. తిరుపతి వెంకటకవుల పద్యాలు లేకుండా భారత కథల్ని, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, జాషువాల పద్యాలు లేకుండా 'హరిశ్చంద్ర'ను,

చిలకమర్తి పద్యాలు లేకుండా 'గయోపాఖ్యానా'న్ని, ముత్తరాజు సుబ్బారావు పద్యాలు, చందాల కేశవదాసు, స్థానం నరసింహారావుల పాటలు లేకుండా 'కృష్ణ తులాభారా'న్ని, దైతా గోపాలం పాటలు లేకుండా 'సతీ సక్కుబాయి'ని..... ఇలాగే ఇతర చిత్రాలను ప్రేక్షకులు చూడరని తెలిసి కూడా వాటి హక్కులు లభించని కొన్ని సందర్భాలలో చిత్రనిర్మాతలు, దర్శకులు, అడ్డదారుల్ని ఆశ్రయించారు. బాణీలకు కాపీరైటు లేకపోవడంవల్ల ప్రజాదరణ పొందిన ఆ నాటక పద్యాలకూ పాటలకూ సినిమాకవుల చేత అనుకరణల్ని రాయించారు.

ఇలా ప్రత్యామ్నాయాలను రాయించడం 'సతీసక్కుబాయి' (1935)తో ప్రారంభమైంది. 'సతీసక్కుబాయి' నాటకానికి విశేష ప్రచారం తీసుకొచ్చిన జంట తుంగల చలపతిరావు, దాసరి కోటి రత్నం ఈ సినిమాలో కూడా నటించారు. అయితే స్త్రీ పురుష పాత్రనూ, పురుషుడు స్త్రీ పాత్రనూ ధరిస్తే సినిమాల్లో చూడరని నాటకానికి భిన్నంగా చలపతిరావు కృష్ణ పాత్రనూ, కోటిరత్నం సక్కుబాయి పాత్రనూ ధరించారు. తారాగణం దాదాపు అదే అయినా చిత్ర నిర్మాతలకు ఆ నాటక విజయానికి కారణమైన దైతా గోపాలం రచించిన పాటల హక్కులు లభించలేదు. అందువల్ల ఆ చిత్రనిర్మాత చౌఖాని చిలకమర్తి వారిచేత ఆ నాటకంలోని పాటలకు దగ్గరగా వుండేలా పాటలను రాయించారని వి.ఎ.కె. రంగారావు చెప్పారు.

ఉదాహరణకు :

1. 'గజ్జెలందియలు ఘల్లు ఘల్లుమన
గంతులు వేయర గోపాలా' స్థానంలో-
**ఘల్లు ఘల్లున గజ్జెలందియలు...**

2. 'రాదేలా - కరుణా
ఈ దాసిపై కృష్ణా' బదులుగా -
**జాగేలా నాపై...**

మొదలైన వాటిని చెప్పుకోవచ్చు.

1954లో 'సతీ సక్కుబాయి'ని నిర్మించిన రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ వారికి దైతా గోపాలమే కవి కావడం వల్ల చిక్కురాలేదు కాని తిరిగి 1965లో ఆ చిత్రాన్ని నిర్మించిన చిన్ని బ్రదర్స్ వారికి ఆ సమస్య ఎదురైంది. అప్పుడు సముద్రాల



చేత దైతా గోపాలం పాటలకు అనుకరణలను రాయించారు.[18].

ఉ : **కృష్ణా - పోబోకుమా
పరమాత్మా - పరంధామా - పోబోకుమా ॥కృష్ణా॥**

**పద యుగమును నేనమ్మితిరా
వదలి చనుట అన్యాయమురా ॥కృష్ణా॥**

**అగుపించితివని మురిసితిరా
ఆశలన్నీ వృథాసేయకురా ॥కృష్ణా॥
(దైతా గోపాలం)**

**నిలుమా మధుసూదనా
నను విడి పోబోకుమా ॥నిలుమా॥**

**కనుపించి కనరావిదేలా
స్వామీ ! ఇది న్యాయమా ॥నిలుమా॥**

**జగమేలే పరంధామా
కృష్ణా పోబోకుమురా ॥నిలుమా॥**

**నను వీడకుమా కృష్ణా పోవకుమా
నిను చూడనిదే మనలేను సుమా ॥నిలుమా॥
(సముద్రాల)**

'శ్రీకృష్ణ తులాభారం' నాటకానికి చందాల కేశవదాసు రాసిన పాటల్లో 'బలేమంచి చౌకబేరమూ ఇది సమయమూ', 'మునివరా, తుదకిట్లు ననున్ మోసగింతువా', 'కొట్టు కొట్టండి కొట్టండి బుఱ్ఱ పగల' అనేవి విశేష ప్రచారాన్ని పొందాయి. వీటిని, స్థానం నరసింహారావు 'మీరజాలగలడా - నా యానతి' పాటను, ముత్తరాజు సుబ్బారావు 'ఎన్నడు వేడరాని వనజేక్షణ రుక్మిణి వచ్చి....', 'మెట్టిన దినమని సత్యయు' మొదలైన పద్యాల్ని - శ్రీకృష్ణతులాభారం సినిమాలు మూడింటిలోనూ ఉపయోగించారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'శ్రీకృష్ణసత్య' లో మాత్రం సముద్రాల (జూ) చేత ప్రత్యామ్నాయాలను రాయించారు.

18. ఆదినారాయణ రావుతో ముఖాముఖి

స్థానం నరసింహారావు స్వయంగా రచించి సత్యభామ పాత్ర ధరించి గానం చేసిన పాట యిది

**మీరజాల గలడా - నా యానతి**
**వ్రత విధాన మహిమన్ - సత్యాపతి ॥మీర॥**

**నటన సూత్రధారీ - మురారి**
**ఎటుల దాటగలడో - నా యానతి**
**వ్రత విధాన మహిమన్ ॥మీర॥**

**సుధా ప్రణయజలధిన్ - వైదర్భికి**
**ఈద తావుగలదే - నాతో నిక**
**వాదులాడ గలడా సత్యాపతి ॥మీర॥**

**మధుర మధుర మురళీ గాన రసాస్వాదనమున**
**అధర సుధారసమది నే గ్రోలగ ॥మీర॥**

**(శ్రీకృష్ణ తులాభారం)**

దీనికి నకలుగా 'శ్రీకృష్ణసత్య' లో రాసిన పాట

**మాట మీరగలడా**
**నే గీచిన గీటు దాటగలడా, సత్యాపతి ॥మాట॥**
**పతి వలపంతా నావంతేనని**
**సవతుల వంతు రవంత లేదని**
**రాగ సరాగ వైభోగలీలల**
**సరసకేళి తేల్చు సాత్రాజితి ॥మాట॥**

**నారీలోకము ఔరాయనగా**
**నా సవతులు గని తలలు వంచగా**
**వ్రతము నెరపుదాన - ఆ మీదట ॥మాట॥**

నారద పాత్రలో కపిలవాయి రామనాథశాస్త్రి పాడగా ప్రాచుర్యంపొందిన కేశవదాసు రచన -



**బలే మంచి చౌక బేరము - ఇది సమయము**
**మించినన్ దొరకదూ -- త్వరంగొనుడు సుజనులారా**
**... ... ... ... ॥బలే॥**
**ధనధనేతరముల చేతగాని**
**సాధన శమదమ నియమములకు గాని**
**లభియింపబోదు సుండి**
**కాదనుకొను డౌననుకొను డొకమనసు**
**నిష్కళంకముగా నొనరించి తృణం బొసగినన్**
**వెనువెంటనె నడచుచుండు ॥బలే॥**

**ఓ యాదవులార కనుచు నూరక నిలుచున్నారు**
**మీ యజమానిని గొనుడు సుమీ**
**తరి చెడుగా - పిదప నాయీ పలుకులు - మీ**
**మానసములందు నిడి దూరంబరయుడు**
**సరగున తడయక..... ॥బలే॥**

ఇలా సాగితే 'శ్రీకృష్ణసత్య' లో పాట

**బలే వింత వింత బేరము - ఈ**
**తరుణము దాటినన్ దొరుకదు - త్వరితముగా రండు రండు॥బలే॥**

**ధన ధనేతరములకైన - అలవిగాని బేరము**
**చిత్తశుద్ధి కలవారికి సిద్ధించెడి బేరము**
**ఫలాపేక్ష రహితము - పరమార్థమైనదీ బేరము... ॥బలే॥**

**ఓ యాదవులారా రండు చూచుచు నిలుచుందురేల**
**యదునాథుని మీ స్వామిని కొనుడీ త్వరపడుడీ**
**కనులముందు బేరము - కైవల్యమునకు మార్గము**
**ఈ తరుణము చేజారిన మరిరాదు - రాదు - రాదు ॥బలే॥**

**(సముద్రాల - జూనియర్)**

మూలంలోని కొంత భాగాన్ని మాత్రమే తీసుకొని ఈ అనుకరణ గీతాన్ని రాశారు.

నాటకకర్త రచించిన పద్యాలను కూడా మార్చారనడానికి ఓ ఉదాహరణం -

మెట్టిన దినమని సత్యయు
బుట్టిన దినమనుచు భీష్మపుత్రియు నన్ని
ప్పట్టున బిలుతురు విందున
కిట్టి యెడల నెచటికేగ హితవో చెపుమా
(కృష్ణ తులాభారము-ముత్తరాజు)

మెట్టిన దినమీ సత్యకు
పుట్టిన దినమీ విదర్భ పుత్రికి మరి ఈ
పట్టున నేనెటు పోవలె
దిట్టముగా తెలుపుమయ్య - దేవమునీంద్రా
- శ్రీకృష్ణసత్య-సముద్రాల (జూనియర్)

ఇలాంటి కట్టుదిట్టమైన అనుకరణల యేర్పాటు కె.వి. రెడ్డి దర్శకత్వంలోనే వచ్చిన మరో సినిమా 'శ్రీకృష్ణార్జున యుద్ధం' విషయంలో కూడా తప్పలేదు. చిలకమర్తివారి 'గయోపాఖ్యానం'లోని పద్యాల హక్కులు లభింపకపోవడంవల్ల వాటిననుకరిస్తూ పింగళి చేత పద్యాలను రాయించారు.

మచ్చుకి అర్జునుడు గయుడికి అభయమిచ్చే సందర్భంలో ఈ రెంటిలో వున్న పద్యాల సామ్యాన్ని పరిశీలింపవచ్చు -

నిటలాక్షుండిపుడెత్తి వచ్చినను రానీ, యన్నదమ్ముల్ననున్
విట తాటంబుగ బాసిపోయినను బోనీ కృష్ణుడే వచ్చి వ
ద్దిటు పార్థయనినీ, మరేమయినగానీ లోకముల్బెగ్గిలం
పటు దర్పంబున నిల్చి యీ గయుని ప్రాణంబేను రక్షించెదన్ [19]

స్థాణుండే హరిపక్షమున్ మఱి మహౌద్ధత్యంబునన్ వచ్చినన్
రానీ, బంధులు మిత్రులున్ తుదకు సామ్రాజ్యప్రభల్ పోయినన్
పోనీ, కృష్ణుడె పోరు తప్పదనినీ ముల్లోకముల్ సాక్షిగా
ఏ నీ ప్రాణముకాచి తీరెద భయం బింకేల వర్జింపుమా
(శ్రీకృష్ణార్జున యుద్ధం-పింగళి)

అలాగే 'లవకుశ' నాటకంలో చాకలి పాత్ర పాడే

19. గయోపాఖ్యానము - తృతీయాంకము, పుట. 54



ఎల్లెల్లెనంజా, నీ వాటము నాకెరుకనేదే పింజారినంజా
సూరిగాడు నీకేసి సూసిన సూపు
నీ కొల్లు పులకరింపులతో ఎత్తించె కైపు

పాట మొదటి 'లవకుశ' (1934)లో వుంది. రెండవ 'లవకుశ'లో దానికి దగ్గరగా రాయించిన సదాశివ బ్రహ్మం రచన -

ఒల్లనోరి మామా నీ పిల్లని
అబ్బా నీపిల్ల, దీని మాటలెల్ల కల్ల
సంసారమంత గుల్ల...

అది విడుదలయిన కాలంలో అందరూ హుషారుగా పాడుకొన్న పాట.

చందాల కేశవదాసు రచించిన - 'కనకతార' నాటకాన్ని సినిమాగా తీసినపుడు (1937) ఇతర పద్యాలూ పాటలూ కొన్ని పెట్టినా, నాటకం ద్వారా ప్రాచుర్యం పొందిన

1. దప్పిచే నాలుక తడిపొడిలేక (పద్యం)
2. ఎంత బాగుందది - ఎంతాన గుండది (పాట)
3. సక్కని గుంటా రాయె నా యెంటా (పాట)
4. అబ్బో నా వొల్లు మంటెత్తుతాది (పాట)

మొదలైన వాటిని వదులుకొనే సాహసం చెయ్యలేదు.

ఇలా సుప్రసిద్ధమైన పాటను వదులుకోలేక దర్శకుణ్ణే వదులుకొన్న నిర్మాతలు కూడా వున్నారట. 'శ్రీకృష్ణలీలలు' (1935) చిత్రంలో వున్న నాటక కీర్తన -

తాండవ కృష్ణుడు కాళీయాహిపై
తాండవ కృష్ణుడు కాళీయాహి పై
అడుగో... అడుగో... అడుగో

దగ్గరగా రెండో 'శ్రీకృష్ణలీలలు' (1959)లో పాట వుండాలని నిర్మాత లక్ష్మీరాజ్యం పట్టుపడితే - దర్శకుడు సి. పుల్లయ్య అది భాగవత సన్నివేశానికి దూరంగా వుంటుందని తిరస్కరించి దర్శకునిగా తప్పుకొన్నారట. ఆయన స్థానంలో వచ్చిన జంపన - ఆరుద్ర చేత పూర్వగీతం స్ఫురించేలా రాయించారట[20].

20. ఆరుద్ర చెప్పిన ఉదంతం. 26.12.91

ఇన్ని ఉదాహరణలూ ప్రేక్షకులు మెచ్చిన నాటక కీర్తనలు, పద్యాలు లేకుండా ఆ చిత్రాలు తియ్యడానికి నిర్మాతలు భయపడేవారని చెప్పడానికే. ఆ భయాలకు నిజమైన అనుభవాలు కూడా లేకపోలేదు. బలిజేపల్లి లక్ష్మీకాంతం, జాషువాల పద్యాలున్న రాజ్యం పిక్చర్స్‌వారి 'హరిశ్చంద్ర' (1956) విజయవంతమయితే ఆ పద్యాలకు పింగళివారి చేత నకళ్లు రాయించిన విజయా వారి 'సత్యహరిశ్చంద్ర' (1965) మొదటి దానితో తూగలేకపోయింది. అలాగే తిరుపతి వెంకటకవుల పద్యాలున్న 'దానవీరశూరకర్ణ' తో పోటీపడి తీసిన - ఆ పద్యాలు లేని 'కురుక్షేత్రం' దీటుగా నిలబడలేకపోయింది. ఈ సంఘటనలు ఓ చిత్ర విజయంలో పాటల పద్యాల పాత్రను నిరూపిస్తున్నాయి.

### పాటలు - నటుల బాణీలు :

నాటక ప్రదర్శనల ప్రారంభంలో కొన్ని పాత్రలను సమర్థంగా పోషించిన నటీనటులవల్ల పాత్రలకే కాకుండా పాటలకు కూడా బాణీలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు 'శ్రీకృష్ణలీలలు'లో కంసుడు, 'సతీసావిత్రి'లో యముడు పాత్రలను అద్వితీయంగా పోషించిన వేమూరి గగ్గయ్య ఆ పాత్రల పాటలకు ఒక ఒరవడిని పెట్టారు. 'శ్రీకృష్ణలీలలు' నాటకంలోను అది ఆధారంగా తీసిన సినిమాలోను (1935) వేమూరి గగ్గయ్య పాడిన -

**ధిక్కారమున్ సైతునా**
**కుటిల జన ధిక్కారమున్ సైతునా?**
**అభిమాన హీనుడే - అటు నాదు జనకుడే**
**సభికులారడి పడన్**
**సలిపి శిక్షించునే** ॥ధి॥

**జగము కంపింపగా జనము క్షోభింపగా**
**ఘనకార్య మేపారగా విజృంభింపనా**
**ధిక్కార ధిక్కార ధిక్కారమున్ సైతునా**

పాట బాణీకి అలవాటుపడిన ప్రేక్షకులకు అసంతృప్తి కలగకుండా తర్వాత వచ్చిన సినిమాల్లో అలాంటి పాటలే రాయవలసి వచ్చింది. 1959లో రెండవసారి తీసిన 'శ్రీకృష్ణలీలలు' లో ఆ సందర్భానికి ఆరుద్ర.



**ధిక్కారమును చేయుడీ**
**వేదముల ధిక్కారమును చేయుడీ**
**ఎక్కడెక్కడ నీతి చక్కగా నున్నదో**
**అక్కడక్కడి కేగి - ధిక్కార ధిక్కార**
**ధిక్కారమును చేయుడీ**

అని రాయడమే కాదు; డెబ్బయ్యవ దశకంలో వచ్చిన 'యశోదాకృష్ణ'లో కూడా 'ధిక్కారమున్ సేయుడీ' అనే ప్రారంభించారు.

అలాగే 'సతీసావిత్రి' నాటకంలోను - దానికి ప్రతిరూపమైన ఈస్టిండియా వారి సినిమాలోను యముడి పాత్రను ధరించిన గగ్గయ్య

**'పో బాల పా మ్మికన్ - ఈ యుగ్రారణ్యమున రావలదు రాతగదు.**
**నీకుగ దురాశ వీడి'.......** ॥పో బాల॥

అనే పాటకు పెట్టిన ఒరవడిని 1957లో తీసిన 'సావిత్రి' చిత్రంలోనే కాదు 'వాల్మీకి'లోను, 'ఉమ్మడి కుటుంబం'లోని అంతర్నాటకంలోనూ కూడా విడిచిపెట్టలేదు. 'వాల్మీకి'లో పాతాళ (పాత్రపేరు) తనకు మాంగల్య భిక్ష పెట్టమని యముడి వెంటపడే సన్నివేశంలో సముద్రాల ఇలా రాశారు -

**యముడు : పో బాల పామ్మికన్, పో పో బాల పా మ్మికన్**
**నీదు మది దురాశవీడి**
**పో బాల పామ్మికన్, పో పో బాల పామ్మికన్**
**ఎవరే రీతిని ఎంత ఏడ్చినను**
**వీడీవేళను చావక తప్పదు....** ॥పో బాల॥

'ఉమ్మడి కుటుంబం'లోని - 'సతీసావిత్రి' అంతర్నాటకంలో - సముద్రాల (జూ) తండ్రి చూపిన దారిలోనే నడిచారు.

**పో బాల పామ్మికన్ - పో పో బాల - పో పామ్మికన్**
**నావెంట రాతగదు, రావలదు రాతగదు; రావలదు**
**చీమలు దూరని చిట్టడవులలో**
**కాకులు దూరని కారడవులలో**

లబోదిబోమని అఘోరించినా
ఫలితము సున్న మరలుము మెదలక ॥పో॥

చెప్పిన వినవు చెముడా గిముడా
పట్టిన పంతము విడువవుగా
ఏమనుకొంటివి ఎవడనుకొంటివి
సముండను, పాశధరుండను, కాలయముండను ॥పో॥

ఈ పాటకు వరసనూ వాద్యగోష్ఠినీ కూడా రంగస్థల బాణీలోనే అందించారు.

ఇంతకీ సారాంశం - ఇప్పుడు పై సినిమాలు తీసినా ఆ పాత్రలకు పై బాణీల్లో పాటలు రాయడం తప్పనిసరి అని. ఇంకా రావణాది రాక్షస పాత్రలకు బళ్లారి రాఘవ, దుర్యోధన పాత్రకు యడవల్లి సూర్యనారాయణ, హరిశ్చంద్ర వీరబాహుల పాత్రలకు - అద్దంకి శ్రీరామమూర్తి మొదలైనవారు రంగస్థలం మీద కొన్ని బాణీలు సృష్టించి సినిమాల్లో ఆ పాత్రలకు అలాంటి పద్యాలను పాటలను రాయవలసిన అవసరాన్ని కల్పించారు.

## నాటక పద్యాలూ - సినిమా సేద్యాలూ :

ప్రసిద్ధమైన నాటకపద్యాలకు అనుకరణలనూ, పేరడీలనూ రాసి వేరే సినిమాల్లో ఉపయోగించుకొని పంట పండించుకొన్న సందర్భాలు - సామాన్యులలో నాటక పద్యాలకున్న ప్రాచుర్యానికి గుర్తులు.

తిరుపతివెంకటకవులు 'పాండవోద్యోగ విజయాలు' లో రాసిన పద్యానికి - 'కూతురు కాపురం'లో బాధర్ (మహారథి) రాసిన పేరడీ

అలుగుటయే యెరుంగని మహామహితాత్మపు ప్రేమరాణివే
అలిగిననాడు సాగరములన్నియు ఏకము గాకపోవు ఓ
అలికులవేణి నీ పెదవులార్దరు చేసిన చాలు నీకు చీ
రలు పదివేలనైన కొని తెచ్చెద నిచ్చెద నీవు మెచ్చగన్

దీనికి మూలమైన కృష్ణరాయబార ఘట్టంలోని తిరుపతి వెంకటకవుల పద్యం-

అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముడజాత శత్రుడే



యలిగిననాఁడు సాగరములన్నియు నేకము గాకపోవు - క
ర్ణులు పదివేవురైన నని నొత్తురు చత్తురు రాజరాజ నా
పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకుల గావు మెల్లరన్

'లక్ష్మీ నివాసం' (1967)లో - నాటకాల పిచ్చి వున్న యువకుడి పాత్రకు ఆరుద్ర రాసిన పేరడీ

కాలేజి జీతమ్ము కట్టమంటే మాని
పెను కళాసేవలో పెట్టినాను
తల్లిదండ్రులనుండి తస్కరించిన సొమ్ము
దోసిళ్లతో తెచ్చి పోసినాను
ఆస్తి ఆర్నెల్లలో నాస్తి క్లోజనిపించి
చేబదుళ్లెన్నియో చేసినాను
ఎంత వడ్డీకైన యిసుమంత జంకక
బరబరా ప్రోనోట్లు బరికినాను

కటిక మార్వాడి కాబూలు కత్తులందు
తుదకు గతిలేక నా తల దూర్చినాను
కాని మునిగి పోవక ముందె కనులు తెరచి
కోలు కొంటిని కాబట్టి కొంత నయము

దీనికి 'చింతామణి' నాటకంలో భవానీ శంకరుని పద్యం మూలం -

తాతలనాటి క్షేత్రము లెల్ల తెగనమ్మి
దోసిళ్లతోఁ దెచ్చి పోసినాను
తండ్రి కట్టిన యిల్లు దాయాదులకు విక్ర
యించి వస్తువులు చేయించినాను
అత్తవారిచ్చిన అంటు మామిడి తోఁట
యీవు కోరఁగ వ్రాసి యిచ్చినాను
కులసతి మేని సొమ్ములు పుస్తెతోఁగూడ
గొనివచ్చి నీయింట గుప్పినాను

కులము వారెల్ల నీకిది కూడదన్న
భార్య నాతికి గోతికి బరుగులిడిన

**లెక్క సేయక నీయిల్లు కుక్క వోలె**
**గాంచి కొని యిట్టులున్నాను కలికి నేను.**[21]

'మంచిరోజులు వస్తాయి' (63)లో ఆరుద్ర రాసిన మూడు అనుకరణ పద్యాల్లో ఒకటి

**దళమౌ పయ్యెదలో వెలుంగుటకు నుద్వాహంబు సద్వేళమం**
**గళ సూత్రమ్మును కట్టినట్టి పతి తా గండంబులో చిక్కగా**
**తళుకుల్ జూసి పరాయి వాడి వెనకన్ తందాన తానంటివే**
**మలినంబైనది శీలమంత, వెలదీ, మాంగల్య మింకేటికే!**

ఇది బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన 'సత్యహరిశ్చంద్రీయం' నాటకంలో శ్మశానవాటికలో హరిశ్చంద్రుడు చంద్రమతి నుద్దేశించి పాడే పద్యానికనుకరణ ఆ మాతృక

**దళమౌ పయ్యెదలో నడంగియు సముద్యత్కాంతులీరెండలన్**
**మలియింపన్ దిశలన్ ద్వదీయ గళసీమన్ బాలసూర్య ప్రభా**
**కలితంబై వెలుగొందు చున్నదది మాంగల్యంబు కాబోలు ! నే**
**వెలకైనన్ దెగనమ్మి నీ సుతునికై వెచ్చించినన్ జెల్లదే**[22]

ఇంకా 'మంచిరోజులు వస్తాయి' లోనే ఆరుద్ర రాసిన

1. **చెల్లియో చెల్లకో మునుపు చేసిన మోసము సైచినాడు....**
2. **తాతలనాటి క్షేత్రములు తావక హస్తగతంబు చేయుదు....**

'భూలోకంలో యమలోకం'లో పాలగుమ్మి పద్మరాజు రాసిన

**బలవంతుడు గుర్రముపై నిలబడి**

'కూతురు కాపురం'లో - బాధర్ రాసిన

**నీ రూపుకై గాదె ఆరాటపడి నేను**
**కాలేజికి సలాము గొట్టినాను...**

---

21. చింతామణి - తృతీయాంకము. పుట . 24
22. సత్యహరిశ్చంద్రీయము - షష్ఠాంకము-పుట 97



మొదలైన పద్యాలన్నీ సుప్రసిద్ధ నాటక పద్యాలను స్ఫురింపజేసేవే... అలా చేస్తే ప్రజల్లో ప్రచారం లభిస్తుందనే కవుల ఆశ కూడా. అందుకే సరిగ్గా ఆ మొదళ్లతోనే నకళ్లను కూడా రాశారు.

ఈ విధంగా పరిశోధన దృష్టితో చూస్తే తెలుగు సినిమా పాటలపై మొదటి దశలో రంగస్థలప్రభావం మొత్తంగానూ ఆ తర్వాతి మూడు దశల్లోనూ అవరోహణ క్రమంలోనూ వుందని తెలుస్తోంది. నాటకాల్లోని పద్యాల పాటల ప్రభావం సాహిత్యపరంగా కంటె సంగీతపరంగా సినిమాసాహిత్యం మీద అధికంగా వుంది. నాటకాలను సినిమాలుగా రూపొందించినప్పుడు పద్యాల నెక్కువగా యథాతథంగా గ్రహిస్తే పాటలను మాత్రం ఎక్కువగా అనుకరించి రాయించారు. వర్తమాన కాలంలో తెలుగుకవిత్వంలో లాగే తెలుగుసినిమాల్లో కూడా పద్యం అరుదైపోయింది. నాటకాలను సినిమాలుగా తీసే రోజులు వెళ్లిపోయాయి గనుక సినిమాపాట నాటకాల రంగును చెరిపేసుకొంది.

## 3. వాగ్గేయకార సాహిత్యం :

సంగీత సాహిత్య విద్వాంసులు వాగ్గేయకారులు. వీరినే ఉభయకారులు, బయకారులు అని కూడా అన్నారు. బయకారులు అనేది భ్రష్టరూపం.

శారఙ్గదేవుడు తన సంగీతరత్నాకరంలోని ప్రకీర్ణకాధ్యాయంలో వాగ్గేయకారుని లక్షణాలను పన్నెండుశ్లోకాల్లో చెపుతూ - వాగ్గేయకారులు అనే పదాన్ని యిలా నిర్వచించాడు.

**'వాఙ్మాతు రుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే**
**వాచం గేయం చ కురుతే య: స వాగ్గేయకార:'**

పాటలోని మాటల కూర్పును మాతువు అనీ, సంగీతపు కూర్పును ధాతువు అనీ అంటారు. మాటల కూర్పునూ సంగీతపు వరసనూ తానే చేయగలిగినవాడు వాగ్గేయకారుడు.

ధాతుమాతు కల్పనాదక్షులై ప్రసిద్ధులైన వాగ్గేయకారు లెందరో వున్నారు. వారిలో కొందరి రచనల్ని తెలుగు సినిమాల్లో పుష్కలంగా వినియోగించుకొన్నారు. జయదేవుడు, నారాయణ తీర్థులు, సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి - వీరి సంస్కృత రచనలు; అన్నమయ్య, సిద్ధేంద్రయోగి, రామదాసు, క్షేత్రయ్య, మునిపల్లె సుబ్రహ్మణ్య

కవి, ఘనం శీనయ్య, సారంగపాణి, త్యాగరాజు, పోతులూరి వీరబ్రహ్మం, ఎడ్ల రామదాసు, నిట్టల ప్రకాశదాసు, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై మొదలైన వారి తెలుగు రచనలు, అష్టపదులు, తరంగాలు, కీర్తనలు, పదములు, కృతులు, జావళీలు మొదలైన పేర్లతో తెలుగు సినిమా సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. అయితే మిగతా ప్రక్రియల్లాగే వాగ్గేయకార సాహిత్యాన్ని కూడా యథాతథంగా ఉపయోగించుకోవడంతోపాటు పల్లవి వరకు తీసుకొని కథానుగుణంగా చరణాలు రాయడం, కొన్ని పంక్తులను తీసుకొని మిశ్రమ పద్ధతిలో పాటలు రాయడం, ఈ సాహిత్య స్ఫూర్తితో సినిమాపాటలు రాయడం వంటి అనేక పద్ధతుల్ని అవలంబించారు. వాగ్గేయకార సాహిత్యం తెలుగు సినిమాపాటల్ని ఎలా ప్రభావితం చేసిందో తెలుసుకోడానికి ఆయా వాగ్గేయకారుల ధోరణులూ సినిమావినియోగాలూ పరిశీలించడం అవసరం.

## జయదేవుని అష్టపదులు :

12వ శతాబ్దానికి చెందిన జయదేవుడు గీతగోవింద కర్త. గీతగోవిందం గోవిందుని గూర్చిన 24 అష్టపదులతో, 78 శ్లోకాలతో కూర్చిన 12 సర్గల గేయ ప్రబంధం. సాహిత్యరీత్యా గీతగోవిందం అలంకారికులకు ప్రామాణికం. రాధాగోవిందుల ప్రణయావస్థల ద్వారా జీవబ్రహ్మైక్య సంధాన వేదాంతాన్ని సూచించడం గీతగోవింద పరమార్థం అని పెద్దలంటారు. జయదేవుడు గీతగోవిందాన్ని గానంచేస్తూ రచించాడనీ అప్పుడతని భార్య పద్మావతి నాట్యం చేస్తూ అతని గానానికి అనుగుణంగా అభినయించేదనీ చెపుతారు. జయదేవుడు తనను పద్మావతీ చరణ చారణ చక్రవర్తిగా అభివర్ణించుకొన్నాడు.

1938లో హిరేన్ బోస్ దర్శకత్వంలో ఆంధ్రా సినీటోన్‌వారు, 1961లో పి. రామారావు దర్శకత్వంలో లలితకళానికేతన్‌వారు 'భక్త జయదేవ' చిత్రాలను నిర్మించారు. వీటిలో 'జయజగదీశ హరే', 'రతి సుఖసారే గతమభిసారే...' 'అనిల తరళ కువలయ నయనేన'..., 'ప్రియే చారుశీలే' మొదలైన అనేక అష్టపదులను ఉపయోగించారు. అయితే అష్టపదులను పూర్తిగా కాకుండా కొంత కొంత భాగాలను మాత్రమే వాడుకొన్నారు. ఉదాహరణకు 1961లో తీసిన చిత్రంలో 'జయజగదీశహరే' అనే అష్టపదిలోవున్న దశావతార వర్ణనల్లో మత్స్య, కూర్మ, పరశురామ, రామ, కల్క్యవతారాలకు చెందిన పంక్తులు మాత్రమే వున్నాయి.



లభిస్తున్న ఆధారాలమేరకు 1936లో విడుదలయిన 'భక్త కబీరు', 'సతీసుమతి', సినిమాలలో మొదటిసారిగా అష్టపదులను ఉపయోగించినట్టు తెలుస్తోంది. అయితే ఆ కాలంలోని మిగతా పాటల లాగే నిడివి తక్కువగా వుండడం కోసం అష్టపదుల నుంచి కూడా అయిదారేసి పంక్తులనే తీసుకొన్నారు.

'భక్త కబీరు'లో అష్టపది

**సంచరదధర సుధామధుర ధ్వని ముఖరిత మోహన వంశమ్**
**చలిత దృగంచల చంచల మౌళి కపోల విలోల వతంసమ్**
**రాసే హరిమిహ విహిత విలాసం**
**స్మరతి మనోమమ కృత పరిహాసమ్ (అష్టపది : 5)**

'సతీసుమతి'లో అష్టపది

**చందనచర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ**
**కేళి చలన్మణి కుండల మండిత గండయుగస్మితశాలీ**
**హరి రిహ ముగ్ధ వధూనికరే విలాసిని విలసతి కేళి పరే... (అష్టపది : 4)**

సాంఘికచిత్రాల మనుగడకు ఊపిరిపోసిన 'మాలపిల్ల' (1938) సినిమాలో కూడా అష్టపది వుంది -

**సా విరహే తవ దీనా రాధా - సావిరహే తవదీనా**
**అవిరళ నిపతిత మదనశరా దివ భవదవనాయ విశాలమ్**
**స్వహృదయ మర్మణి వర్మకరోతి సజల నళినీదళజాలమ్ ॥సా॥**
**కుసుమ విశిఖ శరతల్ప మనల్ప విలాస కలాకమనీయమ్**
**వ్రతమివ తవ పరిరంభ సుఖాయ కరోతి కుసుమ శయనీయం**

అష్టపదులను పాలువాయి భానుమతి విస్తృతంగానూ - వేటూరి సుందరరామమూర్తి విశృంఖలంగానూ సినిమాలలో వినియోగించారు.

ఇతర చిత్రాల్లో వచ్చిన అష్టపదుల వివరాలు -

**1. రాధికా కృష్ణా....రాధికా,**
**తవ విరహే కేశవ...**
**(అమ్మాయి పెళ్లి, త్యాగయ్య (1946), మేఘసందేశం చిత్రాలలో....)**

2. సా విరహే తవ దీనా రాధా... (విప్రనారాయణ)

3. ధీర సమీరే యమునా తీరే వసతివనే వనమాలీ.. (జగన్నాటకం)

4. ప్రియే చారుశీలే... (మేఘ సందేశం)

5. చందన చర్చిత నీలకళేబర... (తెనాలి రామకృష్ణ, శ్రీకృష్ణసత్య)

వేటూరి అనేక చిత్రాలలో అష్టపదులతో ప్రారంభించి పాటలు రాశారనడానికి రెండు ఉదాహరణలు -

1. 'జాకీ' -

సావిరహే తవదీనా రాధా
నా సలహా నీకుచితమే కదా...

2. 'నేరం నాదికాదు' - (డిస్కోసాంగ్)

'సావిరహే తవదీనా
ఎవరో నాకు మెడోనా
జవరాలి స్వరాల ఘరానా, జత కలిపానా....'

## అనువాదం:

మేఘసందేశం చిత్రంలో 'ప్రియే చారుశీలే' అనే అష్టపదికి పాలగుమ్మి పద్మరాజు స్వేచ్ఛానువాదం వుంది -

వదసి యది కించిదపి దంతరుచి కౌముదీ
హరతి దర తిమిర మతి ఘోరమ్

పలికితే చాలు నీ పలువరుస వెన్నెలలు
కలికి నాయెడద చీకటుల పోద్రోలు

స్ఫురదధర శీధవే తవ వదన చంద్రమా
రోచయతు లోచన చకోరమ్

నీమోము జాబిల్లి మోవి తేనియలు
నానయనములు చకోరమ్ములై గ్రోలు
ప్రియే చారుశీలే... ప్రియే చారుశీలే...



ముంచమయి మాన మనిదానం
సపది మదనానలో దహతి మమ మానసం

నాపైన అలుకేమి ఓ కామినీ
నామేన నఖముద్ర కెంపులే వెలుగనీ

కౌగిలిని నలుగనీ పలుగాట్ల సిలుగనీ
గాటంపు సుఖము నాకటులైన కలుగనీ

ఈ పాటలో మూలానువాదాలు రెండూ కలసి వుండడం విశేషం. అనువాదానికి కూడా అష్టపదికున్న సున్నితమైన సంగీత బాణీ అవసరం కావడం వల్లనేమో - ఇంత శృంగారం వున్నా మళ్లీ అష్టపదుల అనువాదాల జోలికి తెలుగుచిత్ర పరిశ్రమ వెళ్లలేదు.

## స్ఫూర్తి :

అష్టపదుల స్ఫూర్తితో ఇష్టపదులు రాసుకొన్న సినీకవులూ - వున్నారనడానికి ఓ ఉదాహరణ -

ముక్కున ముక్కెర అందంకానీ
ముచ్చటకది ప్రతి బంధం
ఆనందానికి అడ్డయ్యే
ఏ అందమైనా ఎందులకూ? (వీరాభిమన్యు- ఆత్రేయ)

దీనికి - 'ధీరసమీరే యమునా తీరే' అనే అష్టపదిలోని -

"ముఖర మధీరం త్యజ మంజీరం
రిపుమివ కేళిషులోలం చలసఖి!"

పంక్తులు స్ఫూర్తి అనిపిస్తాయి. చెలికత్తె రాధతో - 'నీ కాలికి వున్న అందెలను ముందే తీసెయ్యి. అవి మదనకేళిలో కదిలి రొద చేస్తాయి' అనడం వీటి భావం.

ఇది ఆత్రేయ దృష్టికి తీసుకువస్తే - "నేను ఈపాట కణ్ణదాసన్ పాట విన్న ప్రేరణతో రాశాను. అయితే కణ్ణదాసన్‌కు ప్రేరణ ఈ అష్టపది అన్నమాట" అన్నారు[23]

23. ఆత్రేయతో బాతాఖానీ. 16.7.89

ఇలా అష్టపదులు చాలామందికి ఆలంబనమయ్యాయి.

జయదేవుని అష్టపదుల్లో ప్రధానేతివృత్తమైన రాధాకృష్ణ ప్రణయానికి నేపథ్యాన్నీ, ఈ తత్త్వం తెలుగు సినిమాపాటల మీద చూపించిన ప్రభావాన్నీ కూడా తెలుసుకోవాలి.

**రాధాకృష్ణుల రాసలీల :**

కృష్ణుని పేరు వినగానే గుర్తొచ్చే 'రాధ' అనే పాత్రే కృష్ణకథకు మూలాలైన హరివంశ భారత భాగవతాల్లో లేదని చాలామందికి తెలియదు.

రాధాకృష్ణుల ప్రణయతత్త్వానికి మూలగ్రంథం బ్రహ్మవైవర్త పురాణం. దానిలో గోలోక ధామంలో స్త్రీపురుషులైన రాధాకృష్ణుల ప్రణయౌన్నత్యాన్ని నారాయణుడనే ఋషిచేత వ్యాసమహర్షి యిలా చెప్పించాడు -

**రాధా రాసేశ్వరీ రాసవాసినీ రసికేశ్వరీ**
**కృష్ణ ప్రాణాధికా సా చ కృష్ణేన పరికీర్తితా**

(రాసము అనే స్త్రీ పురుషానంద క్రీడకు రాధ అధిదేవత. ఆమె రాసక్రీడ లోనే జీవిస్తుంది. రసిక హృదయాలన్నీ ఏలుకుంటుంది. కృష్ణునికి ఆమె ప్రాణం కంటె ఎక్కువ. కృష్ణుడే ఆమెను భక్తితో కీర్తిస్తాడు)

ఇంకా యిలా అన్నాడా మహర్షి -

**'యే యం రాధాయశ్చ కృష్ణోరసాబ్ధిః'**
**(రాధాకృష్ణులు కలసి ఓ రస సాగరం)**[24]

ఈ రససాగరం నుంచి శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు, చింతలపూడి ఎల్లన మొదలైన తెలుగు కవులెందరో చేతికందినంత చేదుకొన్నారు. రాధామాధవ సంవాదాలు, సమాగమాలు కావ్యాలుగా వచ్చాయి. ఆఖరికి ముద్దుపళని ఈనాటి సినిమాపాటలు చాలనంత పచ్చిగా రాధికాసాంత్వనం రచించింది. ఆధునిక కాలంలో కూడా రాధాకృష్ణ ప్రణయానికి సంబంధించిన అనేకరచనలు వచ్చాయి. కాని సినిమాల్లో రాధాకృష్ణుల ప్రణయానికి సంబంధించిన పాటలు పుంఖానుపుంఖాలుగా రావడానికి ఈ తెలుగు రచనలు దోహదం చేసినట్టు కనిపించదు. గీతగోవిందం ప్రభావం ఈ కోవకు చెందిన సినిమా పాటలమీద స్పష్టంగా కనిపిస్తోంది. ఈ యితివృత్తంతో తెలుగు సినిమాల్లో ఎన్నో నృత్యగీతాలు, అంతర్నాటికలూ కూడా వచ్చాయి. తెలుగు

24. దీపమాలిక. 40, 41 పుటలు



సినిమాల్లో వచ్చిన మొదటి రాధాకృష్ణ నృత్యగీతం తెనాలి రామకృష్ణ (1941)లో సదాశివ బ్రహ్మం రచనే -

**రాధ : మాలిదుగోనోయీ, వనమాలీ రావోయీ**
**కృష్ణ : రాధా యీవే, రాధా యీవే**
**రాధ : ఈ మాలిక గావలెనంటె**
**నటియింపుము ఆనందముగ**
**కృష్ణ : సరి, ఈయవుగా పోనీలే**
**మాటాడే వలదిక నాతో....**

50-70 మధ్య తెలుగు సినిమాల్లో రాధాకృష్ణ తత్త్వానికి సంబంధించిన గొప్ప పాటలెన్నో వచ్చాయి. ఉదాహరణకు 'జయభేరి'లో ఆరుద్ర రచన చాలు:

**రాధ : రావోయీ రాసవిహారి, యిటు రావోయీ వనమాలీ**

**కృష్ణ : యమునా తీరమున సంధ్యా సమయమున**
**వేయి కన్నులతో రాధ వేచియున్నది కాద**

**రా : బాస చేసి రావేల మదనగోపాల**
**నీవులేని జీవితము తావిలేని పూవుకద**
**పూపొదలో దాగనేల పోపోరా సామీ**
**ఇంతసేపు ఏయింతికి వంతపాడినావో - దాని**
**చెంతకె పోరాదో?**

**కృ : రానంతసేపూ విరహమా - నేను రాగానే కలహమా**
**రా : నీమేన సరసాల చిన్నెలు - అవి ఏ కొమ్మ కొనగోటి**
**ఆనవాలు**
**కృ : దోబూచులాడితి నీతోనే - ఇవి ఈ కొమ్మ**
**గురుతులు కాబోలు**
**రా : నేను నమ్మనులే నీ మాటలు - అవి కమ్మని**
**పన్నీటి మూటలు**
**కృ : నామాట నమ్మవే రాధికా - ఈ మాధవుడు నీవాడేగా**
**రాధికా... మాధవా....**

గీతగోవింద సుగంధాలు యిక్కడా పరిమళించాయని చెప్పడానికే ఈపాటను పూర్తిగా ఉటంకించడం.

## నారాయణతీర్థుల కృష్ణలీలాతరంగాలు :

17వ శతాబ్దానికి చెందిన నారాయణతీర్థులు సంస్కృతంలో 12 అంకాల శ్రీకృష్ణలీలాతరంగిణి అనే యక్షగానాన్ని రచించారు. ఈ యక్షగానంలోని కొన్ని తరంగాల ప్రదర్శన కూచిపూడిలో 200 ఏళ్ల నుంచీ సంప్రదాయంగా వుంది. తెలుగులో కూడా పారిజాతాపహరణం మొదలైన యక్షగానాల్ని రచించిన నారాయణ తీర్థులు కృష్ణాతీర నివాసియైన ఆంధ్రుడే అంటారు. నారాయణతీర్థుల కృతుల్ని తరంగాలుగా వ్యవహరిస్తారు.

అనేక చిత్రాల్లో నారాయణతీర్థుల తరంగాలను ఉపయోగించారు.

1. **బాలగోపాల మా ముద్దరా కృష్ణా**
   **పరమ కల్యాణ గుణాకరా...**
   **(దొంగరాముడు, ఒకతల్లి పిల్లలు)**
2. **శరణం భవ కరుణామయ... (అనురాగం)**
3. **ఆలోకయే శ్రీబాలకృష్ణం - సఖీ**
   **ఆనంద సుందర తాండవకృష్ణం - (శ్రుతిలయలు)**
4. **కృష్ణం కలయసఖీ సుందరం - (పెళ్లి పుస్తకం)**
5. **పూరయ మమకామం... (దేవాంతకుడు)**

ఏ చిత్రంలోనూ ఏ తరంగాన్నీ పూర్తిగా వినియోగించలేదు-తరంగాలు పొడవైనవి గనుక. ఇలాంటి తరంగాలను సినిమాల్లో ఉపయోగించడానికి కొంత అభిరుచి అవసరం గనుక ఎక్కువ మంది ఎగబడలేదు. అందుకే ఇవి సాంకర్యం కాలేదు కూడా.

## సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు :

కావేరీతీరాన గల నెరూరు ప్రాంతంలో సంచరించిన సదాశివ బ్రహ్మేంద్రస్వామి సర్వసంగ పరిత్యాగి. 19వ శతాబ్దానికి చెందిన ఈయోగి తాను రచించిన కీర్తనల చివర 'పరమహంస గురు' అని గురునామాన్ని కీర్తిస్తూ గానం చేశారు. 'ఆత్మవిలాసం' అనే ఆధ్యాత్మిక గ్రంథం ఈయన మరో రచన.



స్వామి కీర్తనలు సంస్కృతంలో వున్నా, అవి ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధాత్మకాలు అయినా - శాస్త్రీయ సంగీత కీర్తనలుగా ప్రసిద్ధం కావడంవల్ల- సినిమాల్లో స్వీకరించారు.

స్వామి కీర్తనలు ఉపయోగించిన చిత్రాలు

1. **'మానస సంచరరే బ్రహ్మణి**
   **మానస సంచరరే' (అంతా మన మంచికే, శంకరాభరణం)**
2. **'పిబరే రామరసం... రసనే**
   **పిబరే రామరసం' (పడమటి సంధ్యారాగం)**

'కథానాయిక మొల్ల'లో 'పిబరే రామరసం' స్ఫూర్తితో అదే బాణీలో రాసిన పాట -

**జగమే రామమయం**
**మనసే అగణిత తారక నామమయం**
**ఆ చిరునవ్వే అమృతపుజల్లు**
**అతని నామమున అలరారు కావ్యం**
**అన్ని యుగాలకు నవ్యాతినవ్యం.**

'విచిత్రప్రేమ' లో 'మానస సంచరరే' కీర్తనకు పేరడీగా - 'ప్రేమకు సంచలమే' అనే పాట వచ్చింది.

## అన్నమయ్య కీర్తనలు :

15వ శతాబ్దానికి చెందిన అన్నమయ్య సంకీర్తనలు ఈ శతాబ్దంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు బయటకు తీయించి ముద్రించేవరకు వెలుగు చూడలేదు. అందువల్ల 50ల దశకం వరకు అన్నమయ్య సంకీర్తనలు తెలిసి సినిమాల్లో ఉపయోగించుకోలేదు. 'జో అచ్యుతానంద,' 'చందమామరావే' వంటి వాటిని జానపదాలనుకొన్నారు తప్ప అన్నమయ్య రచనలుగా గుర్తించలేదు. ఈ మూడు దశాబ్దాల్లో అన్నమయ్య రచనలు, వాటి అనుకరణలు సినిమాల్లో అధికసంఖ్యలో వచ్చాయి.

అన్నమయ్య కాలంలో సంకీర్తనలూ, పదాలూ పర్యాయపదాలుగా వాడబడినా రెంటికీ భేదం కనిపిస్తోంది.

**'ఏటువంటి మోహమో**
**ఎట్టి తమకమోగాని**
**చటుకునను దేహమంతయు ముంచె చెలియా'**

వంటివి పదాని కుదాహరణ గానూ,

'అదివో అల్లదివో హరివాసమూ' వంటివి భగవత్పరంగా చెప్పబడిన సంకీర్తన కుదాహరణంగానూ చెప్పవచ్చు.

కానీ యస్వీ. జోగారావు - 'సంకీర్తనలకు ఆ పేరు భగవన్నామ గుణాదికములు కీర్తింపబడుటచే కలిగినను - ఇది పదవాచకమునకు పర్యాయ పదమే'[25] - అనే అభిప్రాయపడ్డారు.

పదలక్షణం భరతుని నాట్యశాస్త్రంలో యిలా నిర్వచింపబడింది.

**గాంధర్వం యన్మయాప్రోక్తం స్వరతాళ పదాత్మకమ్**
**పదం తస్య భవేద్వస్తు స్వరతాళాను భావకమ్**
**యత్కించి దక్షరకృతమ్ తత్సర్వం పదసంజ్ఞితమ్**

పదం పైఅర్థంలో శివకవుల నాటికే ప్రచారంలో వుంది. పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్రము'లో - తుమ్మెద పదములు, ప్రభాత పదములు, వెన్నెల పదములు శంకర పదములు మొదలైనవి - పేర్కొనబడ్డాయి. అలతి అలతి - తెలుగు పదాలతో అధికంగా లఘువులతో నడిచిన విశిష్టమైన శైలి గల వేంకటేశ్వర స్వామి సంకీర్తనలు కావడం వల్ల సినిమాల్లో అన్నమయ్య రచనలకు తక్కువ కాలంలో ఎక్కువ ప్రాచుర్యం వచ్చింది. ఆ మాటకొస్తే యిప్పుడు సినిమాల గుత్త సొత్తయిన యుగళగీత ప్రక్రియకు శ్రీకారం చుట్టిన కవి అన్నమయ్యే.

అన్నమయ్య సంకీర్తనలు యథాతథంగా వున్న కొన్ని సినిమాలు

1. **ఇచ్చుకాలు నీకు నాకు ఇంక చాలు (తెనాలి రామకృష్ణ -1956)**

25. ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర. పుట. 220



2. **విన్నపాలు వినవలె వింత వింతలు (అనురాగం)**
3. **అదివో అల్లదివో హరివాసమూ (కలియుగం)**
4. **నెయ్యములల్లో నేరేళ్లో (కలియుగం)**
5. **ముద్దుగారే యశోద ముంగిట ముత్యము (పడమటి సంధ్యారాగం)**
6. **తందనాన ఆహి తందనాన పురె**
   **తందనాన భళా తందనాన (శ్రుతిలయలు)**
7. **ఇన్నిరాశుల యునికి ఇంతి చెలువపు రాశి**
   **కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి (శ్రుతిలయలు)**

'అల్లుడుగారు' చిత్రంలో

'కొండలలో నెలకొన్న కోనేటి రాయఁడు వాడు...' అనే కీర్తనలో చివరి చరణానికి బదులుగా కథానుగుణంగా కొత్త చరణం రాయించారు.

జొన్నవిత్తుల రాసిన ఆ భాగం యిది -

**ఎదలోని శ్రీసతి ఎపుడో యెడబాటు కాగా**
**ఎనలేని వేదనలో రగిలిన వాడు**
**మనసిచ్చి పరిణయమాడిన పద్మావతీ సతి**
**మమతల కోవెలలో మసలనివాడు**
**నీతికి నిలిచినవాడు దోషిగ మారెను నేడు**
**ప్రేమకే ప్రాణం వాడు శిక్షకు పాత్రుడుకాడు**
**ఆర్తరక్షక శ్రీవెంకటేశ్వర కరుణతో**
**తోడునీడయి వాని కాపాడు నేడు...**

వస్తుపరంగానూ శైలీ పరంగానూ ఈ పూరణను ముందుతరాల వారు అన్నమయ్యదని భ్రమించే ప్రమాదం లేదు.

'సీతారామ కల్యాణం' (యువచిత్ర)లో ఆత్రేయ రాసిన - 'రాళ్లలో ఇసకల్లో రాశాము యిద్దరి పేర్లు' - 'కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు' బాణీకి రాయించిందే[26]

26. మురారితో ముఖాముఖి. 3.6.90

'జో అచ్యుతానంద జోజో ముకుందా' జోలపాట - 'సతీ అనసూయ,' 'స్వర్గసీమ,' 'వారసత్వం,' 'చిన్నమ్మకథ' సినిమాలలో చేర్పులూ మార్పులతో వచ్చింది.

ఇంతకీ అందరికీ తెలిసిన -

'చందమామ రావే - జాబిల్లి రావే' పల్లవి అన్నమయ్య రచనని చాలా మందికి తెలియదు.

అది 'దేవత' (41) నుంచి నేటివరకూ ఎన్నో సినిమాల్లో ఎన్నో రూపాలతో వచ్చింది.

ఆ చందమామల్లో కొన్ని -

1. 'దేవత' (1941)- సముద్రాల

వెండి కంచాలలో వేడి బువ్వుందోయి
పమిడి కంచాలలో పాల బువ్వుందోయి
తిందాము రావోయి జాబిల్లీ
ఆడుకొందాము రావోయి జాబిల్లీ
గిరులెక్కి తరులెక్కి తిరిగి చూసేవేల
మరులెక్కి మబ్బులో మాయమయ్యేవేల
పరుగునా పోవోయి జాబిల్లీ
పోవోయి గునగునా జాబిల్లీ
కొండెక్కి పోవోయి - కురువేరు తేవోయి
పండు వెన్నెల పిండి - పానకం తేవోయి
తిన్నంగ పోవోయి జాబిల్లీ - అన్ననూ తేవోయి జాబిల్లీ

పల్లవిని తీసుకోకపోయినా ఆ ఛాయలు కనిపిస్తున్నాయి.

1. 'మనోరమ' (59) - సముద్రాల (జూ)

చందమామ రావే - జాబిల్లి రావే
కొండెక్కిరావే -గోగుపూలు తేవే
వెండి గిన్నెలో వేడిబువ్వ తేవే
పైడి గిన్నెలో పాల బువ్వ తేవే
అందాల పాపకు అందించి పోవే ॥చం॥

3. 'కాంచన'- (1952)-తోలేటి

చందమామ రావే, అందాల రాశి రావే
కొండమీద రావే, కోటివేలు తేవే
పాలబువ్వ, పాయసమే,
పట్టిన పాపతో కలిసి ఆటలాడగదే

4. 'సిరివెన్నెల' (1984)- సీతారామశాస్త్రి

చందమామ రావే జాబిల్లిరావే
కొండెక్కిరావే గోగుపూలు తేవే
చలువ చందనములు పూయ చందమామ రావే
జాజిపూల తావినీయ జాబిల్లిరావే
కలువ చెలువ కలలు విరియ కొండనెక్కిరావే
గగనపు విరితోట లోని గోగుపూలు తేవే

5. 'కాంచనసీత' - (1988)

చందమామ రారా - జాబిల్లి రారా
కొండనెక్కి రారా - గోగుపూలు తేరా
నా కళ్లలోన వాకిళ్లలోన
వెలుగై వుండి పోరా

మొత్తానికి చందమామలాంటి అన్నమయ్య వెలుగు అందరిమీదా పడింది. అన్నమయ్య శైలీప్రభావం సినిమాపాటల మీద వుందనడానికి ప్రబల నిదర్శనం 'శ్రుతిలయలు'లో - సీతారామశాస్త్రి రచన. ఇది ప్రత్యేకంగా ఫలానా అన్నమయ్య పాట బాణీ అని చెప్పడానికి వీల్లేదు కాని పద రచనలో అన్నమయ్య వాసనలు వున్నాయి.

తెలవారదేమో స్వామి - నీ
తలపుల మునకలో అలసిన
దేవేరి అలమేలుమంగకు ॥తెల॥

చెలువము నేలగ చెంగట లేవని
కలతకు నెలవై నిలిచిన నెలతకు
కలల అలజడికి నిద్దురకరవై
అలసిన దేవేరి అలమేలుమంగకు ॥తెల॥

మక్కువ మీరగ అక్కున జేరిచి
అంగజుకేళిని పొంగుచు తేల్చగ
ఆ మత్తునే మది మరిమరి తలచగ
అలసిన దేవేరి అలమేలుమంగకు

రెండో చరణంలో ముద్ర కొంత సడలినా ఎత్తుగడ, పల్లవి, మొదటి చరణం అన్నమయ్యను తలపింప చేసినందుకు రచయితను అభినందించాలి.

## రామదాసు కీర్తనలు :

రామదాసు కథ తెలియని తెలుగువాడుండడు. 1620 ప్రాంతంలో గోలకొండ రాజ్యం నేలకొండపల్లెలో పుట్టిన కంచెర్ల గోపన్న రామదాసుగా మారి తన జీవితంలోని వివిధ ఘట్టాలలో రచించిన కీర్తనలు మొదట భజనల ద్వారాను, నాటకాల ద్వారాను ప్రచారం పొంది - ఈ శతాబ్దంలో సినిమాలకెక్కాయి. ఆనందభైరవి రాగంలో కీర్తనలు రూపొందించిన మొదటి వాగ్గేయకారుడు రామదాసు.

రామదాసు చిత్రాన్ని 1933లో రెండుసార్లు - 1964లో మరోసారి నిర్మించారు. మొదటి రెండు చిత్రాల్లో పాటలు లభ్యం కా(వడం) లేదు. 60ల దశకంలో నిర్మించిన రామదాసులో ఈ కీర్తనలు వున్నాయి -

1. **కోదండరామా, పాహి కోదండరామా,**
2. **నరహరిని నమ్మక, నరులను నమ్మిన నరజన్మ మీడేరునా**
3. **దశరథరామ గోవిందా, మమ్ముదయజూడు పాహి ముకుందా**
4. **రామరామ రఘురామ పరాత్పర రావణ సంహార రణధీరా...**
5. **శుద్ధ బ్రహ్మ పరాత్పరమ్..**
6. **రామ రామ రామా అనరాదా... రఘురామా అనరాదా**
7. **ఏ తీరుగ నను దయజూచెదవో...**
8. **కొలిచిన బత్తెమా - కిందబెట్టరా కోదండరామా....**



9. **నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ....**
10. **ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవే...**
11. **రాఘవ, ధరణి సుతాధవ....**

ఇంకా ఈ చిత్రంలో -

**'భద్రాద్రి రఘురామ భజనకు జనుచుండ**
**బంధుమిత్రుల యాజ్ఞ బడయనేల'**

వంటి ప్రసిద్ధమైన రామదాసు పద్యాలు కూడా వున్నాయి. రామదాసు పాత్రమీద చిత్రించిన పద్యాలూ, పాటలూ మొత్తం ఆయన రచనలే కావడం ఔచిత్యం.

ఇతర చిత్రాలలో రామదాసు కీర్తనలు విరివిగా ఉపయోగింపబడినా యథాతథంగా ఉపయోగించిన వాటికంటె అనుకరణలే ఎక్కువున్నాయి.

దేవత (1941) - **1. క్రూర కర్మములు నేరక చేసితి...**
**2. చరణములే నమ్మితి.**
**3. గరుడ గమన రారా**
ఆస్తిపరులు - ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవు...
శంకరాభరణం - **1. ఏ తీరుగ నను దయజూచెదవో...**
**2. పలుకే బంగార మాయెనా**
**(కొంత భాగం)**

చిత్రాల్లో రామదాసు కీర్తనలు స్వచ్ఛంగా ఉపయోగించగా -

'అందాల రాముడు'లో - 'పలుకే బంగారమాయెనా', 'ననుబ్రోవమని చెప్పవే' కీర్తనలను పల్లవుల వరకు ఉపయోగించి ఆరుద్ర కథానుగుణంగా చరణాలు రాశారు.

'వివాహ భోజనంబు' చిత్రంలో 'సీతారామస్వామీ, నే చేసిన నేరములేమీ' అనే పల్లవిని తీసుకొని ముళ్లపూడి శాస్త్రి చరణాలు రాశారు -

'ఎందుకయ్యా ఉంచినావు బందిఖానాలో...' అనే పాటకు దగ్గరగా 'టింగ్‌రంగా'లో తాపీ, 'సి.ఐ.డి' లో పింగళి పాటలు రాశారు.

'ఇద్దరు మిత్రులు'లో కొసరాజు

**'శ్రీరామ నీనామమెంతో రుచిరా**
**ఓరామ నీనామమెంతో రుచిరా**

పాలు మీగడలకన్న - పంచదార చిలకలకన్న'

అనే పాటను 'శ్రీ రామ నీనామ మేమి రుచిరా.. !' అనే రామదాసు కీర్తనను అనుసరించే రాశారు.

కొన్ని సినిమాపాటలమీద రామదాసు కీర్తనల ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది -

1. 'విధి విలాసం'లో

**గాంధికి పెద్ద గుడి కడతాం కడతాం**
**కాన్కలు చందాలు పడతాం పడతాం**
**ప్రజల సేవకె మేం పుడతాం గిడతాం**
**బహు తెల్లటోపీలు పెడతాం పెడతాం**
**శ్రీ గాంధి నామాలు మరువాం మరువాం**
**చందాలు యివ్వంది వదలాం కదలాం**

పాట వినగానే రామదాసు కీర్తన -

**'శ్రీరామ నామం మరువాం మరువాం**
**సిద్ధము యమునకు వెరువాం వెరువాం'**

స్ఫురిస్తుంది.

2. 'రంగులరాట్నం'లో దాశరథి రచన -

**నడిరేయి ఏ జాములో**
**స్వామి నినుజేర దిగివచ్చునో**
**పతిదేవు ఒడిలోన మురిసేటి వేళ**
**స్వామి చిరునవ్వు వెన్నెలలు కురిసేటి వేళ**
**విభునకు మా మాట వినిపించవమ్మా**
**ప్రభువుకు మా మనవి వినిపించవమ్మా -**

రామదాసు 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మరో' - ను గుర్తుకు తెస్తుంది.

3. 'కృష్ణార్జునులు'లో -



**అతడు : ఎవడబ్బ సొమ్మని కులుకుతు తిరిగేవు రామచిలుకా**
**అందాలు నీ సొంతమా**
**అవి నాకు చెందాలంటే పంతమా**

**ఆమె : ఎవడబ్బ సొమ్మని ఎనకెనకే తిరిగేవు రామచంద్రా**
**అందాలు నీ సొంతమా**
**అవి నీకే చెందాలంటే న్యాయమా?**

అనే యుగళ గీతం - రామదాసు కీర్తన - 'ఎవడబ్బ సొమ్మని కులుకుచూ తిరిగేవు..' అనే పాటను గుర్తుచేస్తుందని చెప్పనక్కర లేదు. అయితే మూలంలో కరుణ రసానికి సంబంధించిన బాణీని ఇక్కడ శృంగార రసానికి ఉపయోగించడం గమనించాలి.

అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయం - ఆనాడు విస్తృత ప్రచారం పొందిన కొసరాజు పాట - 'జేబులో బొమ్మ - జేజేల బొమ్మా' రామదాసు కీర్తన - 'ఏమిరా రామా, నావల్ల నేర...' అనే బాణీకి రాసిందట.[27].

## క్షేత్రయ్య పదాలు :

1595 - 1660 మధ్య జీవించిన క్షేత్రయ్య అసలు పేరు వరదయ్య. కృష్ణాజిల్లా మొవ్వలో పుట్టిన (కాదని వివాదం కూడా వుంది) వరదయ్య క్షేత్రాటనం వల్ల క్షేత్రయ్య అయ్యాడు. అంతవరకు మాతుప్రధానంగావున్న పదంలో అనుపల్లవికి ప్రత్యేకతను కూర్చి ధాతువుకి ప్రాధాన్యం కల్పించిన వాగ్గేయకారుడు క్షేత్రయ్య. భావ విస్తృతికి అనువైన రాగ ప్రస్తారంతో సంగీత సాహిత్య అభినయాలకు సముచిత ప్రాధాన్యమున్న పదకవితల సృష్టి క్షేత్రయ్య ప్రత్యేకత. క్షేత్రయ్యతో పదం - శృంగారరస ప్రధానమైనది అనే అర్థంలో స్థిరపడింది. క్షేత్రయ్య మువ్వగోపాలుని నాయకునిగా - తనను నాయికగా భావించాడు.

'మహాకవి క్షేత్రయ్య' (1976) పేరుతో వచ్చిన సినిమాలో --

1. **శ్రీపతిసుతు బారికి నేనోపలేక నిను వేడితె**
**కోపాలా --మా మువ్వగోపాలా**

27. ఆరుద్ర చెప్పిన విషయం.

2. **ఇన్నాళ్లవలె గాదమ్మా - మువ్వగోపాలుడూ**
**ఎన్నెన్నో నేర్చినాడమ్మా**

3. **అదరీనె మోవి తనకు తానే - వదలీనె నీవి...**

4. **ఇద్దరి సందున పవ్వళించియున్న ఆయింతి పేరేమిరా**

5. **మగువ తన కేళికా మందిరము వెడలె...**

6. **వదరక పోపోవె-వాడేల వచ్చీని - వద్దు రావద్దనవే**

క్షేత్రయ్య పదాలను ఉపయోగించారు. ఇతర చిత్రాలలో -

దేవదాసు (1953) - **ఇంత తెలిసివుండి ఈ గుణమేలరా**

విప్రనారాయణ - **రారా నా స్వామి రారా..**
**(చరణాలు వేరే క్షేత్రయ్యపదంలోనివి)**

ఆత్మగౌరవం - **ముందటివలె నాపై నెనరున్నదా నా సామి?**
**ముచ్చటలిక నేలరా..**

'లేతమనసులు' లో **మక్కువ దీర్చరా మువ్వగోపాలా...** అనే అనుపల్లవితో పాట ప్రారంభమైంది. 'ఒక్కసారికే ఇలాగయితే ఇదేటి రతిరా' అనేది పల్లవి. సినిమాలో అనుపల్లవితో ఆరంభించి 'ఒక్కసారికే..' అనేచోట ఆపివేయడం జరిగింది - బహుశా సెన్సారువారు అభ్యంతరం చెపుతారనే భయంతోనేమో !

ఇంకా 'సతీతులసి'లో ఆరుద్ర రాసిన 'నన్నే పెండ్లాడవలె' వంటి అనుకరణలూ, 'స్వర్గసీమ'లో క్షేత్రయ్య పదంగా భ్రాంతి కలిగించే (గిడుగు వేంకట సీతాపతి సంకలనం (1952) లో మాత్రం క్షేత్రయ్య పదంగానే పేర్కొనబడింది) 'మంచి దినము నేడే - మహరాజుగా రమ్మనవే...' మూవనూరు సభాపతయ్య రచనని బాలాంత్రపు రజనీకాంతారావు అభిప్రాయం.

## ఘనం శీనయ్య శివదీక్షాపదం :

1704 - 31 మధ్యకాలంలోవున్న ఘనం శీనయ్య అసలుపేరు వంగల శీనయ్య. ఇతడు మధుర రాజైన విజయరంగ చొక్కనాథుని మంత్రులలో ఒకడు. ఇతని రచన 'శివదీక్షాపరురాలనురా' సంగీతసభల్లో బాగా వ్యాప్తిపొందింది. ఇందులో వ్యాజస్తుతి వుండడంవల్ల ఇటు శైవుల అటు వైష్ణవుల మెప్పునూ పొందింది.

---

28. వి.ఎ.కె. రంగారావుతో ముఖాముఖి.



'సీతాకల్యాణం' (1934) చిత్రంలో ఈ గీతాన్ని ఉపయోగించగా, 'పూజాఫలం'లో మొదటి చరణం వరకూ, 'ప్రేమ' సినిమాలోని హాస్యగీతంలో పల్లవి వరకూ ఉపయోగించారు. 'సీతాకల్యాణం'లో - రావణుని కొలువులో రంభచేత అభినయం పట్టించిన ఈ గీతం రావణుడు వైష్ణవద్వేషి కావడంవల్ల సందర్భోచితంగా రాణించిందని మల్లాది రామకృష్ణశాస్త్రి అభిప్రాయం.[28]

అందరూ మెచ్చే ఆ పదం--

**శివదీక్షాపరురాలనురా--నే**
**శీలమింతైనా విడువజాలనురా నే** ॥శివ॥
**శివశివ గురునాజ్ఞ మీరనురా నే - శ్రీ**
**వైష్ణవుండంటే చేరనురా - నే** ॥శివ॥

**వడిగవచ్చి మఠము చొరవకురా శి**
**వార్చనవేళ తలుపు తెరవకురా నా**
**మడుగు కావి చెరగు తీయకురా**
**మాటి మాటికి నోరుమూయకురా** ॥శివ॥

## సారంగపాణి పదాలు :

1680 - 1710 మధ్య జీవించిన సారంగపాణి కార్వేటినగర వాస్తవ్యుడు. శృంగార పదాలతోపాటు తన కాలంలో సంఘంలోవున్న దురాచారాలను ఖండించి భక్తి వైరాగ్యాలను ప్రబోధించాడు. సారంగపాణి రచించిన రెండు వందల పైచిలుకు పదాలు శృంగార పదాలు, దేశీయపదాలు,జాతీయపదాలు, కీర్తనలు- అని నాలుగు భాగాలుగా వర్గీకరింపబడ్డాయి.

సారంగపాణి పదప్రభావం సినిమాపాటల మీద ఎక్కువగాలేదు. 'ఎమ్.ఎల్.ఏ. ఏడుకొండలు'లో--'ఎంత పేదవాడే వేణుగోపాలుడెంత పేదవాడే' అనే నిందాస్తుతి పదం ఉపయోగపడింది.

### సిద్ధేంద్రయోగి యక్షగానాలు :

17వ శతాబ్దం ప్రారంభంలోవున్న సిద్ధేంద్రయోగి భాగవతకథల్ని పారిజాతము, గొల్లకలాపము మొదలైన పేర్లతో యక్షగానాలుగా రచించి కూచిపూడి కుటుంబాలచేత ప్రదర్శింప జేశారు. 'భామనే సత్యభామనే' అనే ప్రసిద్ధరీతికి రూపకల్పన చేసిన సిద్ధేంద్రయోగి భామాకలాప ధోరణి సినిమాల్లోని యక్షగానాల్లో అక్కడక్కడా కనిపిస్తుంది.

'ఏకవీర' చిత్రంలో 'భామాకలాపం' సంక్షిప్తంగా ఉపయోగింపబడింది. సి. నారాయణరెడ్డి మలిచిన దాని ధోరణి యిలా నడిచింది--

**శ్రీరాజగోపబాలా, క్షీరాంభోరాశిలోలా**
**శ్రితజన పాలా**
**నీరద రూపా, నిగమాకారా**
**వరకూచిపూడి కల్యాణనిలయా**

**భామనే సత్యభామనే**
**వయ్యారి ముద్దుల సత్యభామనే**
**భామనే పదియారువేల కోమలు లందరిలోన...**

'మాయలమారి'లో వీధినాటకంలోను, 'పాతాళభైరవి'లో ఓ హాస్య సన్నివేశంలోనూ-- 'నే తాళలేనే ఓయమ్మా' పంక్తుల ఆలాపన వుంది.

మొత్తంమీద సిద్ధేంద్రయోగి ప్రభావం సినిమాపాటల మీద తక్కువే.

## మునిపల్లె సుబ్రహ్మణ్యకవి అధ్యాత్మ రామాయణ కీర్తనలు :

1730-80 మధ్య తిరుపతి ప్రాంతంలో వున్న మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రామాయణ కథనంతా 104 కీర్తనలలో చెప్పాడు. రాముడు పరబ్రహ్మస్వరూపునిగా, సీత ఆదిమాయగా భావించబడిన ఈ రామాయణకథలో శివుడు పార్వతిని సంబోధించి వినిపిస్తున్నట్టుండే పల్లవితో-- అన్ని కీర్తనలూ ప్రారంభమౌతాయి.

'సౌదామిని' సినిమాలో వచ్చిన ఆరుద్ర

**'కుందరదనా వినవే రామకథ**
**రాకేందువదనా వినవే లోకాభిరామకథ'**

పాటకు అధ్యాత్మ రామాయణ కీర్తన మాతృక.

## త్యాగరాజ కృతులు :

త్యాగరాజకృతులను ఉపయోగించినంత విస్తృతంగా తెలుగు సినిమాలలో ఏ యితర వాగ్గేయకార రచనలనూ వాడుకోలేదు. ఆమాటకొస్తే దక్షిణాది భాషా చిత్రాలన్నిటిలోనూ త్యాగరాజ కీర్తనలను ఉపయోగించారు.



1767 మే 4 న తిరువారూరులో జన్మించిన త్యాగరాజస్వామి సంగీత రత్నత్రయంలో ఒకరు. త్యాగరాజు దివ్యనామసంకీర్తనలు ఉత్సవ సంప్రదాయ కీర్తనలు సులభమైన సంగీత సాహిత్యాలతో జనసామాన్యానికి అందుబాటులో వుండడంవల్ల - అధికప్రచారాన్ని పొందాయి. వాగ్గేయకారులలో సంగీతపరంగా అనుపల్లవికి సొగసు తీసుకొచ్చిన ఖ్యాతి త్యాగయ్యదే. సంగీత శాస్త్ర మహిమను గురించి 30 కృతుల వరకు రచించి గానంచేసిన వాగ్గేయ కారుడు త్యాగయ్య మాత్రమే. ఈయన కృతులు ఇప్పటికి 711 లభ్యమయ్యాయి.

కీర్తన మాతుప్రధానమైనది. కృతి ధాతుప్రధానమైనది-త్యాగరాజ కృతులకు నిర్దిష్టమైన పద్ధతివున్నా, సినిమాలలో కొంత సరళం చేశారు.

'త్యాగయ్య' చిత్రాన్ని 1946లో రేణుకా, 1981లో నవతా సినీఆర్ట్స్ - సంస్థలు నిర్మించాయి. మొదటి చిత్రంలో ముప్పై వరకు--రెండవ చిత్రంలో 60 వరకు త్యాగరాజు కృతులను పాక్షికంగా ఉపయోగించారు.

లభ్యమౌతున్న ఆధారాల మేరకు 'సారంగధర' (1937)లో 'రాగసుధారస పానము జేసి రంజిల్లవే ఓ మనసా' సినిమాల్లో వచ్చిన మొదటి త్యాగరాజకృతి. ఆ తర్వాత ఇదే కృతి 'మిస్సమ్మ'లో (1955) కూడా వచ్చింది.

ఇతర చిత్రాలలో వచ్చిన కొన్ని త్యాగరాజ కృతులు.

1. **మరుగేలరా ఓ రాఘవా--** **(బాలయోగిని, సప్తపది)**
2. **పలుకవేమి నా దైవమా--** **(వరవిక్రయం )**
3. **నగుమోము గనలేని నా జాలి తెలిసి-** **(వివాహబంధం, అల్లుడుగారు)**
4. **పక్కల నిలబడి--** **(చక్రపాణి)**
5. **ఏతావునరా నిలకడ నీకు--** **(వరుడుకావాలి)**
6. **రామా నన్ను బ్రోవరా ప్రేమతో లోకాభిరామా** **(ఆప్తమిత్రులు)**
7. **మా జానకి చెట్టబట్టగా మహరాజు వైతివి. --** **(సీతాకల్యాణం)**
8. **గంధము పూయరుగా**
   **పన్నీటి గంధము పూయరుగా --** **(శుభోదయం)**
9. **బాల కనకమయచేల --** **(సాగరసంగమం)**
10. **శ్రీ గణనాథం భజామ్యహం --** **(శ్రుతిలయలు)**
11. **జగదానంద కారక... --** **(పెళ్లిపుస్తకం)**

త్యాగరాజ కృతుల పల్లవులను తీసుకొని వేరే చరణాలు రాసిన సినిమాపాటలు అనేకం. మచ్చుకు-

కొన్ని పల్లవులు - చరణాలు రాసిన కవులు:

1. నను పాలింపగ నడచి వచ్చితివా - బుద్ధిమంతుడు (దాశరథి)
2. రారా మాయింటి దాకా -- మాధవయ్యగారి మనవడు (వేటూరి)
3. పట్టివిడువరాదు నాచేయి పట్టి విడువరాదు -- భక్తపోతన (ఆరుద్ర)
4. సామజ వరగమనా -- శంకరాభరణం (వేటూరి)
5. దొరకునా యిటువంటి సేవ -- శంకరాభరణం (వేటూరి)
6. కోరివచ్చితినయ్యా కోదండపాణి --శ్రుతిలయలు (సీతారామశాస్త్రి)
7. ఎంతనేర్చినా ఎంతచూచినా --
   సీతారామకల్యాణం (ఆత్రేయ) - స్టూవర్టుపురం పోలీస్ స్టేషన్ (వేటూరి)

త్యాగరాజ కృతులచేత ప్రభావితం చెయ్యబడిన సినిమాపాటలకు ఉదాహరణగా 'అగ్గిరాముడు'లో ఆత్రేయ రచనను పేర్కొనవచ్చు.

ఎవరురా నీవెవరురా
ఎవరు గాని ఎరుగ రాని
దొరవీవని వింటిని ॥ఎ॥

ఎన్నో రూపములను కన్నాను నిన్నునేను
ఏది నిజమని యెంచి ఆరాధించేదిరా ॥ఎ॥

ఈ పాటకు స్ఫూర్తి...

ఎవరని నిర్ణయించిరి రా
నీ వెవరని నిర్ణయించిరిరా
శివుడవో ధవుడవో మాధవుడవో (త్యాగరాజ కృతి)

పేరడీలు తప్ప, త్యాగరాజ కృతులు పల్లవులుగా వచ్చిన సినిమాపాటలే జనసామాన్యానికి ఆద్యంతం త్యాగరాజ కృతులేనేమో ననే భ్రమకలిగించే ప్రమాదం వుండగా-- 'నారీ నారీ నడుమ మురారి'లో సామాన్యులను తికమకపెట్టే మరోప్రయోగం చేశారు. త్యాగరాజ కృతిని అమ్మాయి పరంగా తీసుకొని దానికి బదులిచ్చే అబ్బాయి పంక్తులను సీతారామశాస్త్రి చేత రాయించి ఓ యుగళ గీతంగా రూపొందించారు.



హిందోళ రాగంలో ఆ యుగళ గీతం ఇలా నడిచింది.

ఆమె : మనసులోని మర్మమును తెలుసుకో--నా
మనసులోని మర్మమును తెలుసుకో--
మానరక్షకా--మరకతాంగ--నా
మనసులోని మర్మమును తెలుసుకో త్యాగయ్య

అతడు : మనసులోని మర్మమును తెలుసుకో
మదనకేలిగా మరిగిపోక-- నా
మనసులోని మర్మమును తెలుసుకో శాస్త్రి

ఆమె : ఇనకులాప్త నీవె గాని వేరెవరు లేరు
దిక్కెవరు లేరు ఆనందహృదయా
మనసులోని మర్మమును తెలుసుకో త్యాగయ్య

అతడు : అనువుగాని ఏకాంతాన ఏకాంతకైనా
ఆకాంక్ష తగునా రాకేందు వదనా
మనసులోని మర్మమును తెలుసుకో శాస్త్రి

బదులులో కూడా త్యాగరాజ స్వామి పంక్తులుండడం వల్ల ఇలాంటి ప్రయోగాలు సామాన్యులను సందిగ్ధంలో పెట్టే ప్రమాదముంది.

ఏమైనా త్యాగయ్య సినీరంగం పాలిటి త్యాగయ్యే !

## పోతులూరి వీరబ్రహ్మం తత్త్వాలు :

కాలజ్ఞానానికి ప్రసిద్ధిచెందిన పోతులూరి వీరబ్రహ్మం కాలం 17వ శతాబ్దం. జనసామాన్యంలో బ్రహ్మంగారి తత్త్వాలుగా వ్యాప్తిలోవున్న పాటల్లో కొన్ని ఆయనవైతే మరికొన్ని ప్రక్షిప్తాలు. వాటి నాధారంగా జేసుకొని- 'శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి' సినిమాలోను - ఇతర సినిమాలలోను పాటలు వచ్చాయి.

'చిల్లర రాళ్లకు మొక్కుచునుంటే
చిత్తము చెడిపోను ఒరే ఒరే !

అనే తత్త్వం ఆధారంగా 'పరమానందయ్య శిష్యులు' లో తాపీ ధర్మారావు, 'పూలరంగడు' చిత్రంలో కొసరాజు సినిమాపాటలు రాశారు. 'నందామయా గురుడ

నందామయా' -- అనే మకుటం ఆధారంగా 'పెద్ద మనుషులు'లో - కొసరాజు, 'జీవనతరంగాలు'లో - సి. నారాయణరెడ్డి - 'నందారే లోకమెంతో చిత్రమురా' అని మార్చి 'పరివర్తన'లో రావూరు పాటలను రాశారు. 'వెలుగునీడలు'లో కొసరాజు రచన - 'శివగోవింద గోవింద' బ్రహ్మంగారి తత్త్వం ధోరణే !

ఇటీవలి సినిమాలలో తత్త్వాలకు కాలంచెల్లిపోయింది గనుక పేరడీలుగా తప్ప వీరబ్రహ్మం తత్త్వాలు వినిపించడం లేదు.

## నిట్టల ప్రకాశదాసు తత్త్వాలు :

19వ శతాబ్దం ప్రారంభంలో తూర్పుగోదావరిజిల్లా కాకినాడ ప్రాంతానికి చెందిన తత్త్వకారుడు. తేలికైన మాటల్లో వుండే ఈయన తత్త్వాలు బహుళ ప్రచారం పొంది తొలినాళ్లలోనే సినిమాల్లో కూడా ప్రవేశించాయి.

సినిమాల్లో వచ్చిన ప్రకాశదాసు తత్త్వాలకుదాహరణ 'బాల రాజు'లోని--

**'గూటిలో చిలకేదిరా అన్నా గూడు చినబోయెరా' అనే పాట.**

## ఎడ్లరామదాసు తత్త్వాలు :

19వ శతాబ్ది చివరి భాగంలో కాకినాడలోనే వున్న మరో తత్త్వ కర్త ఎడ్లరామదాసు. 'సాంఖ్యతారకామనస్కయోగం' అనే సుజ్ఞాన చంద్రికను రచించారు. అందులో తత్త్వాలు, సంకీర్తనలు, జోలపాటలు, మేలుకొలుపులు మొదలైన రూపాల్లో పాటలున్నాయి.

'మాయాపురంబున నున్నది జాడ -- మనసు కింపగునట్టి చిన్నది' అనే ఎడ్లరామదాసు తత్త్వం 'ఆడబిడ్డ'లోను, 'ఏమి జన్మంబేమి జీవనము' అనే తత్త్వం 'శ్రీమంతుడు'లోను ఉపయోగించారు. 'ఏమిజన్మంబేమి--జీవనము'ను కొంత మార్చి 'జై జవాన్' చిత్రంలోను,'ఈశ్వరా జగదీశ్వరా' అనే కీర్తన అనుకరణ రూపాన్ని విజయావారి 'సత్యహరిశ్చంద్ర' లోను ఉపయోగించారు.

## పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ కీర్తనలు :

అయ్యర్ త్యాగరాజస్వామి ప్రియశిష్యులు. ఈయన కృతులను, వర్ణనలను, జావళీలను, తిల్లానాలను కూడా రచించారు.



**సుదతి నీకు తగిన చిన్నది రా**
**సురత కేళి కది బల్ సూటిరా**
**సదయుడైన శ్రీ వేంకటేశ్వరా**
**నిను సరగున రమ్మనెరా, సమయమురా**

అనే ఈయన తిల్లానాను మొదట లక్ష్మమ్మ (కృష్ణవేణి) లోనూ, విజయావారి 'సి.ఐ.డి.' సినిమాలోనూ యథాతథంగా ఉపయోగించారు.

'శ్రీవారికి ప్రేమలేఖ' -- సినిమాలో

**'రఘువంశ సుధాంబుధి చంద్ర'**

అనే కీర్తనను పల్లవి వరకు తీసుకొని చరణాలను వరకట్న పరంగా రాశారు వేటూరి.

## మధురానగరిలో.. జావళీ :

**మధురానగరిలో చల్లనమ్మబోను**
**దారివిడువుము కృష్ణా కృష్ణా**
**మాపటి వేళకు తప్పక వచ్చెద**
**పట్టకు కొంగు గట్టిగాను కృష్ణా**
**కొసరి కొసరి నాతో సరసము లాడకు**
**రాజమార్గమిది- కృష్ణా కృష్ణా**
**వ్రజవనితలు నను చేరవత్తురిదె**
**విడువిడు నా చెయ్యి కృష్ణా కృష్ణా ॥ మధు ॥**

**అత్తజూచితే ఆరడిచేయును**
**ఆతురపడకు అందగాడ కృష్ణా కృష్ణా ॥ మధు ॥**

అందరికీ సుపరిచితమైన ఈ జావళీ కర్తృత్వం విషయంలో వివాదముంది. ఇది త్రిభువనం స్వామినాథయ్యర్ జావళీగా సంగీత కళా ప్రదర్శిని[29] రచయిత అరిపిరాల సత్యనారాయణమూర్తి పేర్కొనగా-- వి.ఎ.కె. రంగారావు, చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై కుమార్తె రేవతీ రత్నస్వామి చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై రచనగా పేర్కొంటున్నారు.

29. 4వ భాగం. పుట. 1177

ఇది చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై రచన అనడానికి-- వి.ఎ.కె. రంగారావు చూపిస్తున్న ఆధారాలు ఇవి--

నాగయ్య నటించిన త్యాగయ్యలో కూచిపూడి భాగవతులు 'మధురానగరి'లో జావళీని పాడుతూ అభినయిస్తారు. ఆ జట్టుకు నాయకుడు త్రిభువనం స్వామి నాథయ్యర్ (చారిత్రాత్మక పాత్ర). త్యాగయ్య ఆ భాగవతుల అభినయానికి ఆనందించి-- 'ఏం కావాలో కోరుకొండంటే వారు 'ఆనందభైరవిని మాత్రం తమకు విడిచిపెట్ట'మంటారు. అందువల్ల అరిపిరాల అది త్రిభువనం స్వామినాథ అయ్యర్ రచన అని భ్రమపడి వుంటారు. ఈ పాటను ఆ చిత్రంలో ఉపయోగించిన నాగయ్య కూడా ఈ పాట సుబ్రహ్మణ్యం పిళ్లైదే అని చెప్పారు. సుబ్రహ్మణ్యం పిళ్లై కూడా తనదేనని ధ్రువీకరించారు. ఆపైన ఇది మద్రాసు కళాక్షేత్రంలో -- మూడుతరాలుగా సుబ్రహ్మణ్యం పిళ్లై రచనగానే బోధింపబడుతోంది.

ఈ సమాచారానికి రేవతీ రత్నస్వామి చెప్పిన సమాచారం బలాన్నిచ్చింది. చిత్తూరు సుబ్రహ్మణ్యం (1900-1975) చిత్తూరుజిల్లా పుంగనూరు తాలూకా కొలమాచినేనిపల్లె వాస్తవ్యులు. అసలుపేరు సుబ్రహ్మణ్యం కాగా సంగీతం నేర్పిన గురువు కంచి నివాసులైన నాయనా పిళ్లై ఆదేశం మేరకు తనపేరు చివర పిళ్లై చేర్చుకొన్నారు. చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై 'మధురానగరి'తో పాటు మరోపది జావళీలు రాశారు.

వాటిలో కొన్ని--

1. **మావల్ల కాదమ్మా దేవీ యశోద...**
2. **కులములోన గొల్లదాన, వయసులోన చిన్నదాన...**
3. **అమ్మ యశోద, నీ కొడుకు దుడుకు...**

ఈ ఆధారాల దృష్ట్యా పై జావళీ చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లైదే అనడంలో సందేహం లేదు. 'ఒట్టుపెట్టెదరా' అనే సారంగపాణి పదాన్ని దీనికి వస్తువులో రాగంలో మాతృకగా గ్రహించాలి. [30]

ఇంతకీ పై జావళీలో చివరి రెండు పంక్తులూ వ్యవహారంలో లేవు. పోగా ఉన్నదానికి కృష్ణుని పరంగా కొన్ని పంక్తులను చేర్చి యుగళ గీతంగా సినిమాలలో ఉపయోగించారు.

---

30. వి.ఎ.కె. రంగారావు అభిప్రాయం.



ఈ జావళీ త్యాగయ్య రెండు చిత్రాలలోను, పల్లవి వరకు 'అభిమానం'లోను, భరణీవారి 'ప్రేమ'లోని హాస్య గీతంలోను, 'పతిభక్తి'లో పల్లవి మినహా మిగతా పాట, 'సిరిమువ్వల సింహనాదం'లో రేఖామాత్రంగానూ ఉపయోగింపబడింది.

'జీవితనౌక'(1977) లో 'మధురానగరి'... స్ఫూర్తితో - సి.నా.రె.

**చల్లలమ్మే భామనోయి**
**పల్లెపట్టు లేమనోయి**
**అత్తచాటు పిల్లనోయి**
**ఆకుమాటు పిందెనోయి**
**దారి విడువు కృష్ణయ్యా - నా**
**దారికి అడ్డు రాకయ్యా....** ॥చల్ల॥

**అడుగడుగున నీవెదురైతే**
**అడుగు సాగదోయి**
**కొసరి కొసరి నువ్వు చూస్తుంటే - నా**
**కొంగు నిలువదోయి...'**

అనే పాట రాశారు.

ఇంకా ఈ పాటవల్ల ప్రభావితమైన సినిమా పాటలెన్నో అనడానికి 'ఆకాశరాజు'లో విశ్వనాథ సత్యనారాయణ పాటే నిదర్శనం -

**చిలుక చూడరా మిన్నులలో**
**ఎగిరిపోయె బాలా**
**జాణతనాన... గడుసుందనాన**
**... ... ... ...**
**మధురానగరిలో చల్లనమ్మబోదు**
**దారి విడుము కృష్ణా కృష్ణా...**

ఇంకా తచ్చూరి సోదరులు, ఊత్తుకాడు వెంకట సుబ్బయ్యర్ మొదలైన వాగ్గేయకారుల రచనలు సినిమాల కుపయోగపడ్డాయి.

వాగ్గేయకారుల రచనలు - వ్యాపార ధోరణి ఎక్కువవుతున్న సినీ రంగంలో - సహృదయులకు ఎండలో చలివేంద్రాల్లాంటివి.

### సంప్రదాయ సాహిత్య పథ్యం :

రానురాను వ్యాపారమే ధ్యేయమైపోయిన సినీరంగానికి సంప్రదాయ సాహిత్యం పథ్యపదార్థం లాంటిది. సినిమాలు చూసేవాళ్లలో అధికశాతం సామాన్యులే అయినా అంతో యింతో ధీమాన్యులశాతం కూడా లేకపోలేదు. ఈ రెండో తరగతి వాళ్లకి సంప్రదాయచ్ఛాయలు కొంత ఊరట కలిగించి - 'సినిమా పాటలు కూడా ఫర్వాలేదే' అనిపించడం అవసరం. అలా అనిపించిన గౌరవం ఈ మధ్య వచ్చిన సినిమాల్లో 'శంకరాభరణా'నికి దక్కుతుంది.

సంప్రదాయం ఒక బడి. ఆ బడిలో సినిమా రంగానికి చెందిన పాతతరం చదువుకొన్నంతగా కొత్తతరం చదువుకోవడం లేదు. సాంప్రదాయిక పరిజ్ఞానం ఆ తరహా రచనలు చేయడానికి అవసరం. సినిమాపాటలు వ్యాకరణబద్ధంగా వుండాలనడం చాదస్తమేగాని అలాంటి పాత్రలనూ సందర్భాలనూ ఎన్నుకొన్నప్పుడు మాత్రం ఆ ఔచిత్యాన్ని పాటించాలి. ఉదాహరణకు 'స్వాతికిరణం' చిత్రంలో ఒక పీఠాధిపతి ఆమోదముద్రతో ఒక శాస్త్రీయ సంగీతజ్ఞునికి స్వరకల్పన చేయడం కోసం పంపిన తాళపత్రకృతిలో 'సరసిజా రజనీకరమ్' (కువలయ/కైరవ రజనీకరమ్ అనడానికి బదులుగా) అనే అపప్రయోగం వుంది. అది ఆ పాట రాసిన కవి తొందరపాటువల్ల దొర్లినా, సినిమాలో తాళపత్ర కృతి ప్రమాణాన్ని, పీఠాధిపతి పాండిత్యాన్ని ప్రశ్నిస్తుంది కదా! అలాగే 'మహర్షి' చిత్రంలో శాస్త్రీయ సంస్కృత డిస్కోగీతంగా చెప్పబడిన 'ప్రేయసీ.. గ్లా..భా..' అనే రచన ఒక ప్రయోగమే తప్ప, సంస్కృతవ్యాకరణానికి పూర్తిగా ఒదగదు. అదే విధంగా వాగ్గేయకారుల పల్లవులను తీసుకొని రాస్తున్న పాటల్లో ఆ అవసరం, ఔచిత్యం స్పష్టంకావాలి.

'ఏగతి రచియించిరేని..' అన్నట్టు యిది సమకాలికులను విమర్శించడం కాదు-- సినిమాపాట పరిధికి మించిన సాముగరిడీలు తగవనీ, అవసరమైన సందర్భాలలో మాత్రం నిర్దుష్టమైన పాండితీపటిమను చూపించమనీ వారికి విన్నవించడం. నిష్ఠురమైనా ఒక నిజం చెప్పక తప్పదు - సాంప్రదాయికమైన సినిమాలూ పాటలూ ఎలా తగ్గాయో - అలాగే ఆ పరిజ్ఞానంవున్న సినిమాకవుల శాతం కూడా తగ్గింది.

సాంప్రదాయిక సాహిత్యప్రక్రియల్లో పురాణ కావ్య, నాటక సాహిత్య ప్రభావం సినిమాలమీద తగ్గినా ఇటీవల వాగ్గేయకార సాహిత్యం మాత్రం ఇతోధికమైన ఆదరణకు నోచుకోవడం ఆనందదాయకం. సినిమా ప్రేక్షకులు మంచిని కూడా ఆదరిస్తారనడానికీ, మార్పును ఆహ్వానిస్తా రనడానికీ, వాగ్గేయకారుల రచనల పట్ల, శాస్త్రీయ సంగీత ధోరణి పట్ల నేడు పెరుగుతున్న మక్కువే ప్రబల నిదర్శనం.

* * *



# జానపదం - సినీపదం

### జానపద సాహిత్యం !

జనపదం అంటే ! 1. దేశము. 2 గ్రామము, పల్లె అని నైఘంటికార్థాలు జనపదులు లేక జానపదులంటే పల్లెటూరివాళ్లనీ జానపదం అంటే పల్లెకు సంబంధించింది- అనీ అర్థాలు. జానపద గేయాలు రాతకోతలతో సంబంధం లేకుండా పల్లెజనులు పాడుకొని ఆనందించే పాటలు. జానపదాలకు (జానపద గేయాలు) సినీపదాలకు (సినిమాపాటలు) ప్రధానమైన పోలిక రెండూ ప్రజల పాటలు కావడమే. అయితే జానపదాలు అమూల్యమైనవి కాగా సినీపదాలు ఖరీదైనవి. 30ల దశకం నుంచీ ఎన్నో జానపదాలు సినీపదాలుగా మలచబడి విస్తృత ప్రచారాన్ని పొందాయి. వీటిలో కొన్ని గ్రహించినవి - మరికొన్ని సంగ్రహించినవి.

నిజానికి జానపదసాహిత్యం కూడా సంప్రదాయంలో ఒక భాగమే. కాని నిన్న మొన్నటి వరకు దానికి గుర్తింపు లేక అనాదృతవాఙ్మయంగా పరిగణింపబడ్డం వల్ల - మౌలికంగా అది భావుకుడైన కవి ప్రయత్నం గాక జానపదుని అప్రయత్న సృష్టి కావడం వల్ల - ప్రత్యేకంగా పేర్కొనవలసి వస్తోంది. తరతరాలుగా గ్రంథస్థం కాకుండా మౌఖిక సంప్రదాయంగా వస్తూ ప్రాచీన ఆచారవ్యవహారాలనీ కళల్నీ సాహిత్యాన్నీ సంప్రదాయాల్నీ ప్రతిబింబించే సామగ్రి జానపదవిజ్ఞానంగా పరిగణింపబడింది[2]. దీనికి ఆంగ్లంలో Folklore అనే పదాన్ని 1864లో మొదటిసారిగా సూచించిన ఆంగ్లేయుడు జాన్ థామ్స్. థామ్స్ చెప్పిన ప్రకారం Folk అంటే నిరక్షరకుక్షులైన Unlettered Peasants కర్షకులు అనీ, lore అంటే పాండిత్యం లేక విజ్ఞానం అనీ అర్థాలు. జానపదవిజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక భాగం. ఆచారాలు, వస్తు సంస్కృతి, కళలు వగైరా మిగతావి. ఈ జానపద సాహిత్యాన్ని తిరిగి వచన శాఖ, గేయశాఖ, దృశ్యశాఖ అని మూడు ప్రధాన భాగాలుగా విభజింపవచ్చు. కొంతమంది శేషశాఖను పేర్కొన్నా, దానితో సినిమాపాటలకు పనిలేదు.

---

1. సూర్యరాయాంధ్ర నిఘంటువు-తృతీయసంపుటము పుట. 339
2. జానపద విజ్ఞానవ్యాసావళి. పుట. 1

చిరకాలంగా అనాదృతంగా వుండి పోయిన తెలుగు జానపదవిజ్ఞానం కల్నల్ మెకంజీ, సి.పి. బ్రౌన్, జె.ఎ. బోయల్‌వంటి ఆంగ్లేయులు ప్రారంభించిన ప్రాచీన సంస్కృతీ పరిశోధనం వల్ల గుర్తింపుకు నోచుకొంది. క్రమంగా సాహిత్య విమర్శకుల దృష్టి నాకర్షించిన జానపదసాహిత్యం 1952లో - బి. రామరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దానిమీద పరిశోధనకు పూనుకోవడంతో విశ్వవిద్యాలయాల మెట్లెక్కింది. జానపదసాహిత్యంపై విశ్వవిద్యాలయాల్లోని పరిశోధకుల దృష్టి పడకముందే సినీరంగం దృష్టి పడిందనడానికి 'చల్ మోహనరంగా' (1939) మొదలుకొని ఇప్పటివరకు వచ్చిన పెక్కు పల్లె బాణీలే నిదర్శనం.

జానపదసాహిత్యం గురించి టేకుమళ్ల అచ్యుతరావు, నందిరాజు చలపతిరావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేదునూరి గంగాధరం, హరి ఆదిశేషువు, కృష్ణశ్రీ ప్రభృతులు విశేష పరిశ్రమ చేసి జానపద సంకలనాలను వెలువరించారు. విశ్వవిద్యాలయాల్లో బి. రామరాజు, నాయని కృష్ణ కుమారి, తూమాటి దొణప్ప, తంగిరాల వెంకట సుబ్బారావు, ఆర్వీయస్. సుందరం, జి.యస్. మోహన్ మొదలైనవారు జానపదసాహిత్యంపై కృషిచేసి - జానపద సాహిత్యాధ్యయనాన్ని ప్రోత్సహించారు. ఎల్లోరా, వింజమూరి సీత, అవసరాల అనసూయ ప్రభృతులు కూడా జానపదసాహిత్యంలో కృషి చేసి సంకలనాలు ప్రచురించారు. వీరిలో చాలామంది జానపదగేయ లక్షణాలను పేర్కొన్నారు. అజ్ఞాతకర్తృత్వం లేదా సామూహికకర్తృత్వం, కాలం తెలయకపోవడం, మౌఖిక ప్రచారం, ఒకే గేయం భిన్నరూపాలను పొందడం, నిరాడంబరమైన శైలి, గానయోగ్యత, భావరస ప్రధానమైన ఆశురచన, జన సామాన్యానికి పరిచితమైన వస్తువు జానపదగేయాలకు ముఖ్యలక్షణాలు. ఈ లక్షణాల దృష్ట్యా ఈ బాణీలో రాసిన బసవరాజు అప్పారావు 'గుత్తొంకాయ్ కూరోయ్ బావా' పాటనూ, కొనకళ్ల బంగారిమామ పాటల్నీ, నండూరి సుబ్బారావు ఎంకి పాటల్నీ - పల్లెబాణీలుగా తప్ప పల్లెపాటలుగా పరిగణించడానికి అవకాశం లేదు. జానపదసాహిత్య పరిశోధకులు పల్లెపాటల్ని వారి వారి అభిమతాల్ని బట్టి అనేక వర్గాలుగా విభజించారు. వాటిని పరిశీలించి, సినిమాపాటలుగా రూపాంతరం చెందిన పాటల్ని బట్టి - ఇక్కడ కొన్ని వర్గాలుగా విభజించడం జరిగింది.

సినిమాపాటల్ని జానపదసాహిత్యంలో గేయశాఖ ప్రభావితం చేసినంతగా వచన, దృశ్యశాఖలు చేయలేదు. ముందుగా స్వల్పప్రభావం గల ఈ శాఖల్ని పరిశీలించి అనంతరం గేయశాఖకు వెళదాం.



## (1) వచన శాఖ :

పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు మొదలైనవి ఈ శాఖలో అంతర్భాగాలు. సినిమాల్లో ఇవన్నీ మాటల్లో చోటుచేసుకోవడం అప్రస్తుతం గనుక పాటలుగా మలచబడ్డ పొడుపుకథల్ని మాత్రం ఈ పరిధిలోకి తీసుకోవడం సమంజసం.

పొడుపు కథలు పిల్లలకోసం వుద్దేశించినవి. కొన్ని చిత్రాల్లో ఆ కథల్ని వాళ్లకోసమే పాటల్లో పొదిగారు. ఉదాహరణకు 'మనోరమ' చిత్రంలో పాట :

చిన్నారి నాచిట్టి పిల్లల్లారా
నే వేసే కట్టు కథ విప్పుతారా

గోడమీద బొమ్మ గొలుసుల బొమ్మ
వచ్చేపోయేవారికి వడ్డించే బొమ్మ
గొలుసుల బొమ్మ - గోడమీద బొమ్మ ॥చి॥

చింపిరి చింపిరి గుడ్డలు
ముత్యాలవంటి బిడ్డలు
తండ్రి గరగర తల్లి పీచు పీచు
బిడ్డలు రత్నాలు - మనుమలు మాణిక్యాలు ॥చి॥

ఆ తర్వాత సినిమాల్లో బాలపాత్రల్ని మరీ తెలివైన వాళ్లుగా చిత్రించడంతో ఇంత సాదాగా కాకుండా ఆలోచింపజేసే కొత్త కొత్త పొడుపు కథలు పాటలుగా వచ్చాయి. మరికొంత కాలానికి ఈ పొడుపు కథలు ప్రేయసీ ప్రియులమధ్య యుగళ గీతాలుగా మారాయి. ఈ తరహా పాటలు 60ల దశకంలో ఎక్కువగా వచ్చాయి. మచ్చుకి 'జమీందార్' లో ఆరుద్ర రచన

చుక్కలు పొడిచేవేళ
అహ మక్కువ తీరే వేళ
ఆడపిల్లే పొడుపుకథ పొడవాలి
అందగాడే తెలుసుకొని విప్పాలి

కిట కిట తలుపులు కిటారి తలుపులు
వేసిన తీసిన చప్పుడు కావు

ఏమిటి ? ఏమిటి ?

కిట కిట తలుపులా ? కిటారి తలుపులా
కిట కిట తలుపులు కిటారి తలుపులు
గడుసరి చూపుల కన్నుల రెప్పలు, కన్నుల రెప్పలు

దిబ దిబ లాడేవి రెండూ
దిబ్బెక్కి చూసేవి రెండూ
ఆలకించేవి రెండూ
అందుకునేవి రెండూ - ఏమిటి ?

దిబదిబలాడేవి రెండా ? ఆహా
దిబ్బెక్కి చూసేవి రెండా
దిబదిబలాడేవి కాళ్లు
దిబ్బెక్కి చూసేవి కళ్లు
ఆలకించేవి చెవులు
అందుకోబోయేవి చేతులు, చేతులు ... !

ఇలా పాత పొడుపుకథల్నే గడుసుగా పడుచుజంటల కన్వయించిన పాటలు కొన్నయితే ప్రేమికులకు సంబంధించిన విషయాలను తీసుకొని కొత్తగా పొడుపు కథలుగా మలిచినవి మరికొన్ని. 'చిన్ననాటి స్నేహితులు' లో సి.నారె. రచన- ఈ కోవకు ఉదాహరణ

అతడు : అడగాలని వుంది - ఒక
టడగాలని వుంది ...
ఎదురుగా నిలుచుంటే
ఎంతోముద్దుగ మెరిసేదేదీ
అందీ అందకుంటే
ఇంకెంతో అందం చిందేదేది ?

ఆమె : చేప, చూపు, సిగ్గు, మొగ్గ

అతడు : మొగ్గకాదు, కన్నెపిల్ల బుగ్గ !

ఆమె : కొత్తగా రుచి చూస్తుంటే
మత్తుగా వుండేదేది ?
మళ్లీ తలుచుకొంటే
మరికొంత రుచిగా వుండేదేది ?

అతడు : వెన్న, జున్ను, తీపి, పులుపు

ఆమె : పులుపు కాదు, తొలివలపు !

ఇంకా 'ఇల్లరికం', 'తల్లీ కూతుళ్లు' 'పాడవోయి భారతీయుడా' వంటి అనేక చిత్రాల్లో ఇలా పొడుపు కథలు పాటల రూపంలో వచ్చాయి. వీటికి కొంత ఆలంబన మహారాష్ట్రదేశపు జానపద కళ 'తమాషా'లో వినవచ్చిన పాటలు.

## (2) దృశ్య శాఖ :

యక్షగానం, వీధి నాటకం, హరికథ, బుర్రకథ, జముకుల కథ మొదలైన కళారూపాలు ఈ విభాగం కిందకు వస్తాయి.

'కీర్తింతురెడ్డాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరళి'

అనే భీమేశ్వర పురాణంలోని పంక్తుల్ని బట్టి యక్షగానం ప్రాచీనమైన దేశి కళారూపం అని తెలుస్తోంది. మధుర కవితాశాఖకు చెందిన యక్షగానం నృత్య సంగీత ప్రధానమైన ప్రక్రియ. జనవ్యవహారంలో దీనిని 'జక్కుల పాట' అంటారు. తంజావూరు నాయకరాజుల యుగంలో యక్షగానం రాజాదరణను,విశేషవ్యాప్తిని పొంది 'యక్షగాన నాటకం' గా రూపొందింది.

రగడలు,ద్విపదలు, దరువులు,కీర్తనలు, రేకులు, ఏలలు మొదలైనవి యక్షగానాలలో ప్రధాన రచనావిశేషాలు. జంపె, త్రిపుట మొదలైన తాళాలకు అనుగుణంగా వీటిలో గేయరచన సాగుతుంది. తాళ్లపాక అన్నమయ్య - "యక్షగాన పదంబులు నవ్విధమున సముచితానేకవిధ తాళసంగతులను నవరసాలంక్రియా సవర్ణంబులగుచు నలరునని".. [3]అన్నారు.

ఇంత శాస్త్రోక్తంగా కాకపోయినా, కాలానికి సినిమాప్రక్రియకి అనుగుణమైన సవరణలతో సినిమాల్లో శ్రవ్య దృశ్యాత్మకమైన యక్షగానాలు ఎక్కువగానే వచ్చాయి - ఉదాహరణకు 'స్త్రీ జన్మ'లో కొసరాజు రచించిన కీచకవధ యక్షగానం -

కీచ : వెడలె సింహబలుడు

3. 'సంకీర్తన లక్షణమ'నే అన్నమయ్య సంస్కృత గ్రంథానికి మనవడు చిన్నన్న తెనిగింపు.

అరివీర భయంకరుడు
మచ్చెకంటులెల్ల పొగిడి
మెచ్చెడు నవమన్మథుడు ...

సైరంధ్రి : రమణీ సైరంధ్రి వచ్చెను
మదిరమ్మ గొని తేగ
రాజ వీథికి వచ్చెను
కాలి అందియలు ఘల్లని మ్రోయ
కన్నుల మిలమిల కాంతులు మెరయ
చూపులే మరుని తూపులౌచు
తన రూపు జూచి జను లౌరా భళా యన ...

ఇలాంటి యక్షగానాలు 'మల్లీశ్వరి' 'కన్యాశుల్కం', 'ఉమాసుందరి', 'రాజువెడలె', 'రహస్యం' మొదలైన చిత్రాల్లో వచ్చాయి. 'ఆనందభైరవి' చిత్రంలో ఉపయోగించిన 'కొలువైతివా రంగశాయి' దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన 'విప్రనారాయణ' యక్షగానం లోనిది. దీనిని కృష్ణశాస్త్రి జన్మదిన సందర్భంగా వెంపటి చినసత్యం దర్శకత్వంలో రత్నపాప అభినయించగా - బాలమురళి, శ్రీరంగం గోపాలరత్నం నేపథ్యగానం చేశారు. క్రమంగా అది కూచిపూడి నాట్యాంశంగా ప్రచారమై వెండితెర కెక్కింది. [4]

ఈ యక్షగానాల ప్రభావం సినిమాపాటల మీద ఎంతగా పడిందో చెప్పడానికి 'పరివర్తన' లో పేకాటమీద అనిసెట్టి రాసిన గీతమే తార్కాణం !

రాజువెడలె చూడరే
భూకంపము లెగయగ - రాజువెడలె చూడరే
చిరకాలముగా చీట్లపేకలో
చిందులు వేసిన గందర గోళపు
రాజువెడలె చూడరే
చతుర్ముఖ పారాయణ చక్రవర్తీ బహుపరాక్ ..

## వీథి నాటకాలు :

భరతుడు, ధనికుడు రాసిన వీథినాటక లక్షణాలు మారి - కాలక్రమేణా పల్లెల్లో ఎత్తైన ప్రదేశాల్లో నూనె కాగడాలు, కర్రదీపాలు ఆధారంగా తెల్లవార్లూ

4. దేవులపల్లి కృష్ణశాస్త్రి కుమారుడు బుజ్జాయితో ముఖాముఖి 1.9.90



జరిగే ప్రదర్శనలే వీథినాటకాలుగా రూఢమయ్యాయి. సినిమాల్లో ఆ స్వరూపం కూడా కొంతమారి వీథుల్లో వేసే రంగస్థల నాటకాలే వీథినాటకాలుగా పరిగణింపబడ్డాయి. ఉదాహరణకు 'చిట్టిచెల్లెలు' లో కొసరాజురచించిన 'శ్రీరామ వనవాసం' డ్రామా -

శ్రీరా : ఆహోహో ఈ వనమూ
చూడచూడ మనోహరమూ
నా మనసుకెంతో పరమానందము
నా మనసుకెంతో బ్రహ్మానందము
ఆ అయోధ్యలో కన్నా
ఇచ్చటనే మనమున్నా
చింతలన్నీ మరువవచ్చు
ఓ అన్నులమిన్నా

సీత : నాథా యిటు వినుమా
ఏమందును నాభాగ్యమూ
మీ సేవా ధర్మముచే
కలిగె జన్మ పావనమూ
నాథా ! ఓహో నాథా ! ప్రాణనాథా
అదిగో శూర్పణఖ వచ్చుచున్నది

శూర్ప : రామయ్యా వస్తావయ్యా
ఏమయ్యా వస్తావయ్యా...

ఇలా నడిచిన ఈ వీథినాటకాలలో కొన్ని రంగస్థల నాటకాలకు పేరడీలు కాగా మరికొన్ని పాతనాటకాల ధోరణులను అనుకరించేవి. మొత్తం మీద సినిమాల్లో వీథినాటకాలు హాస్యంకోసమే, 'ఉమ్మడి కుటుంబం' లో - సతీసావిత్రి; 'అగ్ని పరీక్ష' లో చెంచునాటకం; 'స్వర్గసీమ' లో మోహినీ రుక్మాంగద ; 'నేరము-శిక్ష' లో సీతాన్వేషణ మొదలైనవి ఇలాంటి వీథినాటకాలే.

## వీథి భాగవతాలు :

ఆరె వారు ప్రదర్శించినవి వీథి భాగవతాలు. కూచిపూడి భాగవతులు శాస్త్రీయంగా భాగవతకథలను ప్రదర్శించి భాగవతులయితే - మిగతా కులాలవారు

వారికి వచ్చిన భాషలో ఈ భాగవత కథలను ప్రదర్శించారు. [5]

ఈ భాగవత ప్రదర్శనల్లో కొన్ని సందర్భాలలో ఇతర కథలను కూడా చొప్పించడం వల్ల సినిమారంగంలో చాలా మందికి వీధి భాగవతం అంటే నిర్దిష్టమైన అవగాహన లేక - వీధినాటకాలకూ వీధి భాగవతాలకు మధ్య తేడాలేకుండా పేర్లను తారుమారుగా వ్యవహరించారు.

ఉదాహరణకు 'మెరుపు వీరుడు' లో నల్ల రామ్మూర్తి రచనగా చెప్పబడిన చెంచులక్ష్మి బాణీ ఇలావుంది -

**సూత్రదారి : శ్రీ మహావిష్ణువు అయినటువంటి**
**వారి భార్యగారయినటువంటి**
**ఆదిలక్ష్మి గారయినటువంటి**
**వారి సవితి గారయినటువంటి**
**సెంచులక్ష్మిగారు ఏవిధంగా**
**ప్రవేశిస్తున్నారయ్యా అంటే ...**

**రాజువెడలె సభకు**
**రవితేజము లలరంగ**
**కుడి యెడమల డాల్ కత్తుల మెరయగ**
**రాజు వెడలె సభకు ...**

దీనిని వీధినాటకంగా పేర్కొన్నారు. కానీ ఇది వీధి భాగవతం ధోరణే !

**'రాజు వెడలివచ్చె సభకు**
**రవితేజము లలరంగ...'**

అంటూ భాగవతుల కీర్తనతో ప్రారంభమైన వీధి భాగవతం 'మాయలమారి' చిత్రంలో వుంది. తాపీ ధర్మారావు రచించిన ఈ వీధి భాగవతం లభ్యమౌతున్న సినిమా వీధిభాగవతాల్లో మొదటిది. ఇంకా 'ఒకతల్లి పిల్లలు' లో ఆత్రేయ రచించిన భామా విజయం, 'మావారి మంచితనం' లో సి. నారాయణరెడ్డి రచించిన చెంచులక్ష్మి, 'సంక్రాంతి' చిత్రంలో వీధి భాగవతం మొదలైనవి ఈ ప్రక్రియకు ఉదాహరణలు.

5. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తితో ముఖాముఖి



## హరికథలు :

సంగీత సాహిత్యాలకు సమ ప్రాధాన్యం వున్న జానపద కళారూపాల్లో హరికథ చెప్పుకోదగింది. కథాప్రాధాన్యం వున్న సినిమాపాటల మీద హరికథ ప్రభావం పుష్కలంగా వుంది. సినిమాల్లో ఆదిభట్ల నారాయణదాసుగారి బాణీలో కంటె పెద్దింటి భాగవతారు బాణీలో హరికథలు ఎక్కువగా వచ్చాయి.

'షావుకారు' లో సముద్రాల రచించిన హరికథ సినిమాల్లో మొదటి హరికథ. ఆ కథ నడక యిలా వుంది -

**శ్రీలు చెలంగే భారతభూమిని పాలించిన భూపాలురలో**
**సునీరమంబను దేశమునేలే శిబి రాజేంద్రుడు ఘనుడు**
**అడిగిన లేదనలేని వుదారుడు శరణార్థుల**
**విడనాడని ధీరుడు, శిబికి సాటిదొరా, లేడు ధరా ...**

'వాగ్దానం' చిత్రంలో శ్రీశ్రీ రచించిన 'సీతాకల్యాణం' హరికథ ప్రాచుర్యం పొందిన మొదటి హరికథ. 'కలెక్టరు జానకి'లో సి. నారాయణరెడ్డి రచన 'కుచేలోపాఖ్యానం' కుటుంబ నియంత్రణ పరంగా ముగిసి - బాగా ప్రచారం పొందింది. ఇంకా 'బంగారుపాప', 'ఓ సీతకథ', 'అందాలరాముడు', 'ఇంటింటి రామాయణం', 'స్వాతిముత్యం' మొదలైన చిత్రాల్లో వచ్చిన హరికథలు చెప్పుకోదగినవి.

## బుర్రకథలు :

బుర్రకథ, తందానతానకథ, జంగంకథ - ఈ మూడు సమానార్థకాలే. బుర్రకథ ఆహార్యం మేరకు మరాఠీ భాషనుంచి వచ్చిందని కొందరి అభిప్రాయం. కాని తెలుగు బుర్రకథ గుంటూరు మండలంలోనే ఆవిర్భవించింది. ఈ ప్రక్రియ సామాజికచైతన్యం ధ్యేయమైన ప్రజానాట్యమండలి ద్వారా కొత్తరూపం పొందింది. బుర్రకథకు ఆద్యులు సుంకర సత్యనారాయణ, కాకుమాను సుబ్బారావులు. ప్రజానాట్యమండలి యువజన వైజ్ఞానికదళం కోసం కోగంటి గోపాలకృష్ణయ్య 'స్వతంత్రభారతం', సుంకర 'కష్టజీవి' మొదలైన బుర్రకథలు రాశారు. 'మాయలోకం' సినిమాలో వచ్చిన తందానతాన పాట సినిమాల్లో కనిపిస్తున్న మొదటి బుర్రకథ కాగా - 'అగ్గిరాముడు'లో నాజర్ స్వయంగా రచించి తన దళంతో ప్రదర్శించిన 'సీతారామరాజు' బుర్రకథ బాగా ప్రాచుర్యం పొందింది. 'యువతరం కదిలింది' చిత్రంలో కొసరాజు రచించిన 18 నిమిషాల సుదీర్ఘమైన బుర్రకథ వుంది.

'అత్తను దిద్దిన కోడలు' చిత్రంలో సి. నారాయణరెడ్డి కుటుంబ నియంత్రణ ప్రచారం గలబుర్రకథను రాశారు-

తందాన తందానా తానే తందానా
తమాషైన లోకంరా యిది దేవనందనానా
కంటారెందుకు తల్లులూ
గంపెడు గంపెడు పిల్లలూ
పిల్లలా కోడిపిల్లలా ...

ఇంకా 'మనుషులంతా ఒక్కటే', 'నిలువుదోపిడీ', 'బంగారు సంకెళ్లు', 'శాంతి', 'మీనా', 'సర్దార్ పాపారాయుడు' మొదలైన చిత్రాల్లో బుర్రకథలు వున్నాయి.

సినిమాపాటల మీద బుర్రకథల ప్రభావానికి ప్రబల నిదర్శనం టి. కృష్ణ మెమోరియల్ పిక్చర్స్ వారి 'సగటు మనిషి' చిత్రంలో 'ఎన్నాళ్లీకాపురాలు? ఏసెరో సురోబడి చేద్దామన్నా - ఎన్నాళ్లీ కాపురాలు?' అనే పల్లవితో వచ్చిన పాట. ఈ పాటను ప్రముఖ బుర్రకథ కళాకారులు నాజర్ రచించిన తన బుర్రకథల్లో పాడగా విశేషమైన ప్రచారం పొందింది. ఆ మాతృక ఇది -

ఎన్నాళ్లీకాపురాలు - ఏసెరో సురోబడి
చేద్దామన్నా - ఎన్నాళ్లీకాపురాలు
కాపురమంతా - కరువుల సంత
జీవితమంతా - చిరుగులబొంత
గాలికొంపలు - ఖాళీ కుండలు
చాలీ చాలని - కూలి గింజలు ॥ఎన్నా॥

పారపనుల్లో పొరకలాడి
సత్తువకొద్ది కత్తువదొక్కి
సతమతమై నే - మెతుకులకెళ్తే
కుండడుగున - కూడుండదురన్నా

చేలన్నీ నా చెమటను తడిపి
నీలా బురద - నాటులు నాటి
కళ్ల ప్రాణముతో - ఇల్లు జేరితే
పిల్లలు తింటే - తల్లులుపస్తు ॥ఎన్నా॥

పంటకోసి - కళ్లాపేసి
నిద్రలు కాసి - నూర్పిడిచేసి



వీపున మోపి - పొతర బోసి
కూలిమ్మంటే - తాలుస్తుంటే ॥ఎన్నా॥
రాజనాలు పండించే రైతుకు
భోజనానికి బొత్తిగ లేదు
పేదలకష్టం ప్రభుత్వం పాలు
బాధలన్నీ మన పల్లెలపాలు ॥ఎన్నా॥

సినిమాలో పాట ఇదే సంగీత బాణీలో కథానుగుణమైన మార్పులూ చేర్పులతో వచ్చింది. నాజర్ హైదరాబాద్ దూరదర్శన్‌లో వచ్చిన పరిచయ కార్యక్రమంలో బుర్రకథ యక్షగానంలో ఓ ప్రక్రియ అనీ, జంగాలు, వీధి భాగవతులు పాడే యక్షగానాల ప్రేరణతో బుర్రకథకు తనబాణీని ఏర్పరచుకొని 1943 నుంచి బుర్రకథలను ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు.

**జముకుల కథలు :**

జముకుల కథలో కూడా బుర్రకథలోలా ముగ్గురే వుంటారు. దీనిలో కథకుడి చేతిలో తంబుర వుండదు. వంతలు డక్కీలకు బదులుగా జముకుల నుపయోగిస్తారు. కాకతీయుల కాలంలో ఈ కథల్ని బవరివాళ్లు చెప్పేవారు. జముకుల కథలు అటు ఉత్తరాంధ్రలో యిటు తెలంగాణాలో ఎక్కువ ఆదరణను పొందాయి. సినిమాలలో జముకుల కథలు తక్కువ. నవతరంవారి 'ఎర్రమట్టి' చిత్రంలో కొసరాజు రాసిన 20 నిమిషాల జముకుల కథ వుంది. ఆ కథ యిలా నడిచింది.

తందాన తాన తందానా రాజనందానా
అందైనా ఇందైన ఎందైన జరిగేది
తెలుసుకోరాదా నందానా
కళ్లుంటే కనరయ్యా చెవులుంటే వినరయ్యా
ఆషామాషీ కాదు భూస్వామి కథరయ్యా...

ఇంకా 'పెద్దమనుషులు', 'ఇద్దరు మిత్రులు', 'సిరిసిరిమువ్వ' మొదలైన చిత్రాల్లో కోలాటాలు, భజనపాటలు,, 'సితార'లో పగటివేషగాళ్ల పాటలు మొదలైన జానపద కళారూపాల సాహిత్యం చోటు చేసుకొంది.

## (3) జానపద గేయాలు :

సినిమాపాటల మీద జానపద గేయాలకున్నంత బలమైన ముద్ర మరే యితర ప్రక్రియకూ లేదనే చెప్పాలి. అలాగే యథాతథంగానో పాక్షికంగానో సినిమాల్లో జానపదాలంత విరివిగా ఉపయోగించిన ఇతర ప్రక్రియలు లేవు. కీర్తికోసం ఆశించని జానపదకవుల గీతాలు కొన్ని సినిమాల్లో కవుల సొంతమయితే కొన్నిటిలో మాత్రం నిజాయితీగా 'పాత జానపద గీతాలు' అని స్పష్టంగా పేర్కొన్నారు.

### యథాతథాలు :

నాటకాలలో పాటలూ పద్యాల్లా జానపదగీతాలకు ఎవరినుంచీ హక్కులు పొందాల్సిన అవసరం లేదు గనుక--కథనుబట్టి చేర్పులూ మార్పులూ చేయాల్సిన అవసరం లేకపోతే జానపద గేయాలను తెలిసిన నిర్మాతలు యథాతథంగానే ఉపయోగించుకొన్నారు. ఇలా ఎక్కువ జానపద గీతాలను వినియోగించుకొన్న చిత్రం కాకతీయ పిక్చర్స్‌వారి 'చిల్లరదేవుళ్లు'. ఇవన్నీ తెలంగాణా మాండలికానికి చెందిన సుప్రసిద్ధ గీతాలు :

1. గుడిసెనక గుడిసెదాన
   గుండీల రైకదాన
   నీ గునం నాకు తెలుసునే
   జారుగోసి లచ్చిమీ...

2. లచ్చిబొమ్మా, జరా చూసుకొని తిరుగమ్మా
   నీమొగుడు కుంటోడు, ఎడమచేయి తొంటోడు

3. శ్రీలక్ష్మి నీ మహిమలూ
   గౌరమ్మ చిత్రమై తోచునమ్మా

4. ఏటికేతంబట్టి ఎయిపుట్లు పండించి
   ఎన్నడూ మెతుకెరగనన్నా--నేను
   గంజిలో మెతుకెరగనన్నా.

వీటిలో మొదటి రెండూ వలపు పాటలకూ మూడోది భక్తిపాటలకూ, నాలుగోది శ్రామిక గీతాలకూ చెందినవి. ఇంకా-



1. ఈదరి రా పిల్లా
   మాట యిని పోదువులే మళ్లా (శ్రీ సత్యనారాయణ)

2. తిన్నెమీద సిన్నోడ--వన్నెకాడ
   తేనె తుట్టెలాంటి ఓ సిన్నవాడ (భాగ్యలక్ష్మి)

3. ఇంటిముందర సిక్కుడు సెట్టు
   ఎట్లగొస్తవో సొగసుకాడ (భక్త పోతన)

4. ఒకరిని నానవేశాన్ ఒకరిని చిదుగ గొట్టేన్
   ఒకరిని చేతబట్టి--నేనొస్తినోయ్ మామ -- నేనొస్తినోయ్
   (బాలరాజు)

5. అత్తలేని కోడలుత్తమురాలు ఓలమ్మా
   కోడలులేని అత్త గుణవంతురాలు (మనదేశం)

6. శ్రీ జానకీదేవి సీమంతమునకు
   శ్రీ శారదా గిరిజ చేరి దీవించిరి (మాయలోకం)

7. వల్లారి బాబోయ్ కావురోరయ్యా
   జరుగు జరుగుమన్నా నే జరగలేనన్నా... (విధి విలాసం)

మొదలైనవన్నీ సినిమాల్లో మార్పులు లేకుండా పూర్తిగా వాడుకొన్న జానపదగేయాలు.

### పాక్షికాలు :

జానపద గీతాల్లో కొంత భాగాన్ని కాని, పల్లవి వరకుగాని తీసుకొని రాసిన సినిమాపాటలే ఎక్కువ. ఇలా రాయడానికి కారణాలు అన్నిటి కంటె ముఖ్యమైన కారణం - జనానికి సుపరిచితమైన బాణీలో పాటవుంటే దాన్ని ప్రజలు ఆదరిస్తారనే ఆశ. కొన్ని సందర్భాలలో నిర్మాత అలాంటి పల్లవితో ప్రారంభించమని కవిని కోరడం; మరికొన్ని సందర్భాలలో దర్శకుడే ఆ రెండు పంక్తులనూ యిచ్చి రాయమనడం; కొన్ని చోట్ల సంప్రదాయాన్ని సూచించడానికి తప్పనిసరిగా పల్లెపాటల పంక్తులతో ప్రారంభించవలసి రావడం కూడా కారణాలు. మరికొన్ని యాదృచ్ఛిక సామ్యాలు. అంతే కాని సినిమాకవులు భావదారిద్ర్యంతో జానపదగీతాలను 'కాపీ' చేశారని

అభిప్రాయపడవలసిన అవసరంలేదు. అయితే అలాంటి ప్రలోభం కూడా కొన్నిచోట్ల లేకపోలేదు.

సినిమాపాటలో ఓ భాగమై మిగతా భాగంమీద కూడా ప్రభావం చూపించిన జానపదగీతాలను మేలుకొలుపులు, తత్త్వాలు, సంవాదాలు, నవ్వులపువ్వులు, పనిపాటలు, సరదాలు-సరసాలు, పిల్లల పాటలు, స్త్రీల పాటలు, వలపు పాటలు, పెళ్లి పాటలు అని కొన్ని వర్గాలుగా విభజించుకొనవచ్చును. ఈ పాటలకు సినిమాపాటలు పరిస్థితులను బట్టి అనుకరణలు, అనుసరణలు అనుసృజనలుగా అవతరించాయి.

## (అ) మేలుకొలుపులు :

మేలుకొలుపులు పేరు చెప్పగానే గుర్తొచ్చే సినిమాపాట 'చిరంజీవులు'లో మల్లాది రామకృష్ణశాస్త్రి రచన. పాత సినిమాపాటల్లో చాలామంది యిష్టపడే ఈ పాట ఒక పల్లెపాట లోని పల్లవినే కాదు - చరణాలను కూడా పోలివుందంటే చాలామందికి నమ్మకం చాలదు. సినిమాపాటనూ, జానపదమాతృకనూ ఒకేసారి చదివితే పోలికలు స్పష్టమౌతాయి -

**తెల్లవారవచ్చె - తెలియక నా సామి**
**మళ్లీ పరుండేవు లేరా**
**మళ్లీ పరుండేవు - మసలుచు నుండేవు**
**మారాము చాలింక లేరా** ॥తెల్ల॥

**కలకలమని పక్షిగణములు చెదిరెను**
**కల్యాణ గుణధామ లేరా**
**తరుణులందరు దధిచిలికే వేళాయె**
**దైవరాయా నిదురలేరా** ॥తెల్ల॥

**నల్లనయ్యా రారా, నను గన్నవాడా**
**బుల్లితండ్రి రారా, బుజ్జాయి రారా**
**నాన్నా, మీ అమ్మ గోపెమ్మ పిలిచేను**
**వెన్న తిందువు గాని రారా,**
॥తెల్ల॥
**(చిరంజీవులు)**



జానపద మాతృక[6] -

**తెల్లవారెనమ్మ, చెల్లనేమందు**
**నల్లని నా సామి లేరా**
**మరల పడుకునేవు మసలుచున్నావు**
**మర్యాద గాదిక పోరా** ॥తెల్ల॥

**కలకలమని పక్షి గణములు కూసెను**
**కాంతుడ యిక నిద్రలేరా**
**జలజారి కాంతులు వెలవెల బారెను**
**తలుపుదీసి చూడు లేరా** ॥తెల్ల॥

**తరుణులందరు లేచి దధి చిల్కువేళాయె**
**తడవుండ రాదింక లేరా**
**అరగంటి చూపుతో నట్టిట్టు చూచేవు**
**నెరజాణ వౌదువులేరా** ॥తెల్ల॥

ఈ పాటలో మరో అయిదు చరణాలున్నాయి. కాని వాటికి సినిమా పాటకూ పోలికల్లేవు గనుక అవి అప్రస్తుతం. సినిమాపాట లోని మూడవ చరణం తప్ప, పల్లవి మొదటిచరణం దాదాపు జానపదగీతం లోని పంక్తులే. ఎన్నో అద్భుతమైన సినిమాపాటలు రాసిన మల్లాది రామకృష్ణశాస్త్రి యిక్కడ జానపదాన్ని విడిచి సాము చెయ్యక పోవడం- మరేం రాసినా ఆ సందర్భానికి జానపదానికొచ్చే ప్రచారం రాదనే అభిప్రాయమే కావచ్చు. మల్లాదివారి పాటలో పండిన వాత్సల్యం గమనార్హం.

కొన్ని సందర్భాలలో సినిమా పాటే జనం నోళ్లలో జానపదంగా రూపొందే అవకాశమున్నా అది ఈ పాటలో అలా జరగలేదనడానికి జానపద మాతృక పూర్తి పాఠం, అదీ యిద్దరి ముగ్గురి సేకరణల్లో కనిపించడం నిదర్శనాలు.

పల్లవి వరకు తీసుకొన్న మేలుకొలుపులకు ఉదాహరణలు -

1. **ఎల్లమంద కోటయ్యా ఏలుకో ఏలుకో**
   **చెయ్యి కాస్త అందించి చేదుకో చేదుకో** **(కన్నెవయసు)**

---

6. మిన్నేరు. పుట. 281.

మాతృక : మేలుకో కోటయ్య మేలుకో
జగమెల్ల ఏకచక్రముగాను ఏలుకో (మిన్నేరు - పుట 284)

2. శ్రీ సూర్యనారాయణా మేలుకో - మా
చిలకమ్మ బులపాటమూ చూసిపో
(మంగమ్మగారి మనవడు)

మాతృక : శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరిసూర్యనారాయణా మేలుకో
(జానపద సాహిత్యం - పుట 145)

## (ఆ) తత్త్వాలు :

ఐహిక జీవితం పట్ల విరక్తి కలిగించి మనుషుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచేవి తత్త్వాలు. పాత సినిమాల్లో బైరాగులు, సాధువులు మొదలైన పాత్రల ద్వారా ఈ తత్త్వగీతాలను విరివిగా వినిపించేవారు. ఇప్పుడు వాటికి కాలం చెల్లిపోయిందనే చెప్పాలి. తత్త్వాలలో పోతులూరి వీరబ్రహ్మం, ఎడ్ల రామదాసు మొదలైన వాగ్గేయకారుల రచనలు కూడా జానపద వ్యవహారంలో వున్నాయి. వాటిని మినహాయించి సినిమాపాటలుగా వచ్చిన కొన్ని తత్త్వాలను చూద్దాం.

గురజాడ రచించిన 'కన్యాశుల్కం'లో ఓ తత్త్వం వుంది. అది గురజాడ రచన కాదు. జానపద గీతమే. దానిని యథాతథంగా 'కన్యాశుల్కం' చిత్రంలో నాటకంలో లాగే బైరాగి పాత్రమీద చిత్రీకరించారు.

ఇల్లు ఇల్లనియేవు - ఇల్లు నాదని యేవు
నీ యిల్లు యెక్కడే చిలుకా

ఊరికి ఉత్తరాన సామాధి పురములో
కట్టె యిల్లున్నదే చిలుకా
ఎన్నాళ్లు బ్రతికినా ఏమి సామ్రాజ్యమే
కొన్నాళ్లకే రామచిలుకా ॥ఇల్లు॥

ముణ్ణాళ్ల బ్రతుకునకు మురిసేవు తుళ్లేవు
ముందుగతి కానవే చిలుకా
కట్టెలే చుట్టాలు కట్టెలే బంధువులు
కన్న తల్లెవ్వరే చిలుకా ॥ఇల్లు॥

మోసేరు నలుగురు - వెంబడిని పదిమంది
వెంటనెవరూ రామచిలుకా
కాలిపోయేదాక కావలుందురు గాని
కడకు తొలగొత్తురే చిలుకా
వెంటనెవరూ రామచిలుకా - రామచిలుకా...

ఈ పాట పల్లవికి దగ్గరగా 'కృష్ణప్రేమ' చిత్రంలో ఆరుద్ర ఇలా రాశారు.

ఇల్లనియేవు ఇల్లాలు అనియేవు
ఇల్లేదిరా వెర్రినరుడా
నీపాలి యిల్లాలు ముల్లాయె గదరా

పల్లవిలో తప్ప చరణాల్లో ఏమాత్రం సామ్యంలేని ఈ రచన ... ఆరుద్ర అనుసృజనే. కాని 'విజయగౌరి'లో కనిపిస్తున్న తత్త్వం 'కన్యాశుల్కం'లోని తత్త్వానికి దగ్గరగా వుంది.

ఇల్లు వాకిలి నాది - ఇల్లాలు నాదనుచు
ఏల భ్రమిసితివే మనసా
కాలుని వలలోన చావకను చిక్కితివి
కడతేరుటే త్రోవ మనసా

తనయులూ చుట్టాలు తన వారలని నమ్మి
తల పోయకే వెర్రి మనసా
తనువు విడిచి వెళ్లు సమయంబు లోపల
తన వెంట రారైరి మనసా

శాబ్దికమైన భేదం తప్ప అర్థపరంగా దీనికీ కన్యాశుల్కంలోని తత్త్వానికీ పెద్ద తేడాలేదు. ఆ మాటకొస్తే అప్పటి తత్త్వాల్లో అధికశాతం ఇదే ధోరణిలో సాగాయి. కారణం తత్త్వమంటే ప్రధానంగా తనువు మిథ్య జగం మిథ్య అని ప్రబోధించేది - అనే అభిప్రాయమే.

## (ఇ) సంవాదాలు :

సంవాదం అనే పేరు వినగానే రాధామాధవసంవాదం, లక్ష్మీనారాయణ సంవాదం, సీతారామాంజనేయ సంవాదం మొదలైన కావ్యాలు గుర్తొస్తాయి. వేదకాలం

నుంచీ సాహిత్యంలో వున్న ఈ సంవాద ప్రక్రియ జానపదుల్లో పరిమళించింది. బావామరదళ్లు, వదినా ఆడపడుచులు మొదలైన వరసైన వాళ్లు వాదులాడుకొంటుంటే పైకి ఎంత మొరటుగా వుంటుందో లోపల అంత ఆప్యాయతా తొణికిసలాడుతుంది. ఇలాంటి మనోజ్ఞమైన జానపద సంవాదాలు ఎన్నో సినిమాపాటలకు స్ఫూర్తినిచ్చాయి. అలాంటి కొన్ని పాటలు -

1. 'మానవుడు - దానవుడు'లో ఉషఃశ్రీ రచన -

**ఆడ : కొప్పు చూడు కొప్పందం చూడు...**
**కొప్పున వున్న పూలను చూడు**
**మగడా, నే మునుపటివలెనే లేనా?**

**మగ : ఆహా! అలాగా!**
**కొప్పులో పూలెక్కడివే?**
**నీ కొప్పులో పూలెక్కడివే?**

**ఆడ : అదా? - కట్టెల కోసమెళితే, నే కట్టెల కోసమెళితే**
**కొమ్మతగిలి కొప్పు నిండింది మావా**
**ముక్కు చూడు ముక్కందం చూడు**
**ముక్కున వున్న ముక్కెర చూడు**
**మగడా, నే మునుపటి వలెనే లేనా?**

**మగ : ఆ - ఆహా! బుగ్గమీద గాటెక్కడిదే?**
**నీ బుగ్గమీద గాటెక్కడిదే?**

**ఆడ : అదా! కోమటింటికెళితే నే బెల్లం తూయమంటే**
**తక్కెట్లో రాయొచ్చి తగిలింది మావా**
**నడుము చూడు నడుమందం చూడు**
**నడుముకు వున్న బిగువును చూడు**
**మగడా, నే మునుపటి వలెనే లేనా?**

**మగ : ఆ - అది సరే..**
**గంపకింద వాడెవడే, ఈ గంపకింద వాడెవడే**

**ఆడ : ఆహా - వాడా? పక్కింటి పోరగాడు**
**పెట్టను పట్టబోయి, కోడి పెట్టను పట్టబోయి**



**గంప కింద నక్కి నక్కి కూకున్నాడు మావ...**

ఈ పాట చూడగానే మరో మూడు సినిమాపాటలు - ముందు సంవత్సరాలలో రాసినవి గుర్తుకొస్తాయి. వాటిలో మొదటిది బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచించిన - 'మాయారంభ' (1950)లోని ఉద్దండచంపకల యుగళగీతం - 'రాత్రి పగలనక నీవు రంగు రింగు చేసుకుని' - పాట...

**చంప : మొగుడా, నే మునుపటి వలెనే లేనా?**
**ఓ మొగుడా, నా మొగుడా, నీ ముద్దులభార్యను కానా?**
**కళ్లు చూడు కళ్లందము చూడు...**
**కళ్లకువున్న కాటుక చూడు...**
**కాళ్లు చూడు కాళ్లందము చూడు**
**కాళ్లకు వున్న గజ్జెలు చూడు ॥మొగుడా॥**

**ఉ : కళ్లు చూస్తి కనుసైగలు చూస్తి**
**కాళ్లు చూస్తి నీ గంతులు చూస్తి**
**గంతులు నేర్పిన కంతుని చూస్తి**
**గెంతులలో నాకంతయు తెలిసె...**

రెండో సినిమా పాట 'హరిశ్చంద్ర' (1956)లో కొసరాజు రచించిన కలహకంఠి, కాలకౌశికుల మధ్య యుగళగీతం -

**కాల : ఏమంటావ్ - ఏమంటావ్**
**ఔనంటావా - కాదంటావా**

**కల : ముక్కుజూడు ముక్కందం జూడు**
**ముక్కున నున్న ముక్కెర జూడు**
**మొగుడా నే మునుపటి వలె మున్నానా? నే**
**వెనుకటి వలె మున్నానా-**

**కాల : ముక్కు జూస్తి ముక్కందం జూస్తీ**
**ముక్కున నున్న ముక్కెర జూస్తీ**
**చెలియా నువు కులుకుల బావిగ నున్నావే - అహ**
**వలపుల దీవిగ నున్నావే**

**కల : కళ్లు జూడు కళ్లందం జూడు**

కళ్లకు బెట్టిన కాటుక జూడు...
మొగుడా, నా మొగుడా నే
ముద్దుల గుమ్మగ సున్నానా -నీ
ముచ్చట దీరగ సున్నానా?

కల : కళ్లు జూస్తి కళ్లందంజూస్తీ
కళ్లకు బెట్టిన కాటుక జూస్తీ
ఓ కాంతా నువు కసర వచ్చినట్లున్నావే - నను
కరవ వచ్చినట్లున్నావే...

మూడో సినిమా పాట 'జగదేక వీరుని కథ'లో (1961) పింగళి రచన

మామ : కొప్పునిండా పూవులేమే కోడల కోడల
నీకెవరు ముడిచినారే కోడల కోడల

కోడ : ఎదురింటి మల్లెచెట్టు మామయ్యా మామయ్యా
నీళ్లుపోసి పెంచానయ్యో మామయ్యా మామయ్యా

మామ : ఆ... ఆహా - అట్టాగే; మరిగైతే -
చెంపంతా గాట్లేమే కోడల కోడల
నిన్నెవరు కొరికినారే కోడల కోడల

కోడ : ఎదురింటి రామచిలుక మామయ్యా మామయ్యా
ముద్దుపెడితే కొరికిందయ్యో మామయ్యా మామయ్యా

70వ దశకంలో వచ్చిన 'మానవుడు - దానవుడు'లోని పాటలో - అంతకు ముందే వచ్చిన మూడు సినిమాల్లోని పాటల పంక్తులూ వున్నాయి. ముఖ్యంగా ఈ పాటలో రెండు ధోరణులు కనిపిస్తున్నాయి. ఒకటి - 'కొప్పునిండా పూలెక్కడివి'? అనేది, రెండోది - 'నే మునుపటి వలెనే లేనా'? అనేది. ఈ రెండు ధోరణులకు రెండు జానపద మాతృకలున్నాయి. అవే ఈ నాలుగు సినిమా పాటలకూ స్ఫూర్తి. మొదటి జానపదమాతృకకు రెండు మూడు పాఠాంతరాలు వున్నాయి. వాటిలో సినిమా పాటలకు దగ్గరగా వున్న మాతృక యిది.

మగ : అంతా మంచిది కాని -
అంతా సారే కాని



కొప్పునిండా పూలు ఎక్కడివె భామా?
ఎక్కడివె లేమా?

ఆడ : కారడవికి నేను కట్టేల కని పోతే
గాలొచ్చి దూలొచ్చి గంపంత మొగులాయె
కొమ్మనున్నపూలు కొప్పెక్కె మొగుడా
కొప్పెక్కె మొగుడా

మగ : అంతా మంచిదె కాని అంతా సారే కాని
చెంపమీద గాటు ఎక్కడిదె భామా? ఎక్కడిది లేమా

ఆడ : కోమటోల్లా యింటికి కొబ్బర కనిపోతే
తక్కెట్ల గుండొచ్చి తగిలింది మొగుడా... తగిలింది
మొగుడా...

మగ : అంతా మంచిదె కాని అంతా సారే కాని
గంప కిందున్నోడు ఎవ్వడె భామా? ఎవ్వడె లేమా?

ఆడ : పొరుగింటి పోరగాడు పెట్టాను పట్టొచ్చి
కోళ్ల గంపా కింద కూకుంటె మొగుడా; కూకుంటె
మొగుడా

రెండోది - జనశ్రుతిలోవున్న - 'ముక్కుచూడు ముక్కందం చూడు'... అనే జానపద గీతం. ఒకే జానపదగీతం రెండు మూడు సినిమాపాటలకు కూడా మూలం అవుతుందని పై వుదాహరణలు రుజువు చేశాయి. పై నాలుగు సినిమాపాటల్లో మిగతా మూడూ ఏదో ఒక జానపద గీతాన్ని అనుకరించగా 'మానవుడు - దానవుడు'లోని ఉషశ్రీ రచన దాదాపు రెండు జానపదాల్నీ జోడించిన రూపం మాత్రమే.

ఇలా మగవాళ్లు కొప్పులో పూల గురించి అడిగితే వాళ్ల చెవుల్లో పూలు పెట్టే ఆడవాళ్లు వున్న పాటలు ఆ తర్వాత కూడా కొన్ని సినిమాల్లో వచ్చాయి. ఇవన్నీ అనుకరణ గీతాలే.

2. సంవాదాలు తరగతికి చెందిన మరోపాట - 'మా బంగారక్క' లోని సి. నారాయణరెడ్డి రచన

మగ : సంతకెళ్లి వచ్చేతలికి

ఇంత మారిపోతివి మల్లా
ఏం పిల్లా? కత ఏందే పిల్లా?

ఆడ : ఇంతలోనే యింట్లోనే
ఎంతపని జరిగిందో
ఓమామా - చెప్పేదెట్టా మామా?

మగ : ఎట్టెట్టా - ఏందా కత? చెప్పు చెప్పు
ఏం జరిగిందో చెప్పవే

ఆడ : ఒకరిమీద కన్నేస్తిని; ఒకరిమీద చేయేస్తిని

మగ : ఎవరిమీద కన్నేస్తివి? ఎవరిమీద చేయేస్తివి?

ఆడ : అద్దంమీద కన్నేస్తిరా, కొప్పుమీద చెయ్యేస్తిరా
ఒకరికి చెంపలానిస్తిని; ఒకరికి పెదవులందిస్తిని

మగ : ఎవరికి చెంపలానిస్తివే; ఎవరికి పెదవులందిస్తివే?

ఆడ : దిండుకు చెంపలానిస్తిరా; పండుకు పెదవులానిస్తిరా
... ... ... ...

మగ : అన్నిటికి అన్నిస్తినీ, మరి నాకేమి మిగిలిస్తివీ?

ఆడ : అన్నిటినీ కలబోసి, కన్నెవలపు జతచేసి
నన్నే నీకిచ్చుకున్నానురా - ఒక
నాడైనా నిన్నిడిచి వుండలేనురా

ఈ సినిమా పాటకు స్ఫూర్తి 'బాలరాజు' సినిమాలో కూడా ఉపయోగించిన జానపద గీతం[7].

ఆడ : ఒకరీకి చేతులిచ్చాన్ ఒకరీకి కాళ్లానిచ్చాన్
ఒకరిని చేతబట్టి కూకున్నానోయ్ బావా,
కూకున్నానోయ్:

మగ : ఎవరీకి చేతూలిచ్చావ్? ఎవరీకి కాళ్లానిచ్చావ్?
ఎవరీని చేతబట్టీ కూకున్నావే పిల్లా కూకున్నావే?

7. పల్లెపదాలు. పుట 93



ఆడ : గాజుల్కీ చేతులిచ్చాన్, కడియాలకి కాళ్లానిచ్చాన్
డబ్బుల్నీ చేతబట్టీ కూకున్నానోయ్ బావా -
కూకున్నానోయ్
ఒకరీని నానవేశాన్ ఒకరీని చితకాకొట్టాన్
ఒకరీని చుట్టచుట్టీ కూకున్నానోయ్ బావా,
కూకున్నానోయ్

మగ : ఎవరినీ చుట్టాచుట్టీ కూకున్నావే పిల్లా కూకున్నావే?

ఆడ : సున్నాన్ని నానవేశాన్ వక్కల్నీ చితకాగొట్టాన్
ఆకుల్ని చుట్టాచుట్టీ కూకున్నానోయ్ బావా
కూకున్నానోయ్...

అశ్లీలాభాసాన్ని తొలగించే ధోరణిలో మూలాన్ని అనుసరించినా 'మా బంగారక్క' సినిమాపాటలో మూలంలో లేని క్రమం, సమగ్రత వున్నాయి. మాతృకకు సమాంతరంగా సాగిన ఈ పాటలో చివరి చరణం ఒక కొసమెరుపు.

3. అత్తాకోడళ్ల సంవాదం అనగానే -

'అత్తలేని కోడలుత్తమురాలు ఓలమ్మో
కోడలులేని అత్త గుణవంతురాలు'

పాట గుర్తొస్తుంది. ఈ దంపుళ్ల పాటను 'మనదేశం' చిత్రంలో ఉపయోగించారు. దానికో పాఠాంతరం యిది -

అత్త : కోడలా కోడలా కొడుకు పెళ్లామా
పచ్చిపాల మీద మీగడ యేదీ
ఆ - వేడి పాలమీద వెన్నలు యేవీ?
నూనె ముంతలమీద నురుగులు యేవీ?

కోడలు : అత్తరో ఓ అత్త - ఆరళ్ల అత్త
పచ్చి పాలమీద మీగడుంటుందా
వేడి పాలమీద వెన్నలుంటాయా
నూనె ముంతలమీద నురుగులుంటాయా
ఇరుగు పొరుగులార ఓ చెలియలారా

అత్తగారారళ్లు చిత్తగించండి
పెత్తనం లాగేస్తే - పేచీలు పోను.[8]

దీనికే 'కోడలా కోడలా కలికి ముత్యమా' అనే పాఠాంతరం కూడా వుంది.[9] ఈ అత్త కోడలిని పెట్టే ఆరళ్లపాటకు నాంది అన్నమయ్య రచన-'రావే కోడలా, రట్టడి కోడలా'.

ఈ ఛాయలో 'వరకట్నం' సినిమాలో సి. నారాయణరెడ్డి వదినా మరదళ్ల సంవాదాన్ని యిలా రాశారు.

వది : మరదలా మరదలా తమ్ముని పెళ్లామా
ఏమమ్మా వైనమేమమ్మా

ఆడ : వదినమ్మ వదినమ్మ అన్నయ్య పెళ్లామా
ఏమమ్మా వైనమేంటమ్మా

వది : చక్కని తిలకమ్ము ముక్కున జారింది
ఏమమ్మా, అది ఏమమ్మా

ఆడ : వల్లమాలిన చెమట గల్లంతు చేసింది
లేవమ్మా - ఇంతే లేవమ్మా...

వరస తప్ప వస్తు సంబంధం లేని అనుసరణ యిది

ఇదే బాణీలో పద్మావతి ఫిలింస్ వారి 'అన్నా చెల్లెలు'లో వెన్నెలకంటి ఓపాట రాశారు

అందాల మరదలా ఆడపడుచు కట్న మడుగమ్మా - అన్ననడుగమ్మా
ప్రాణమైనా యిచ్చి ముద్దు తీర్చేనమ్మా - చెప్పమ్మా - చిట్టి చెల్లెమ్మా
కూతుర్నీ కంటేను కోడల్ని చేస్తేను చాలమ్మా - ఓ వదినమ్మా
చెల్లెమ్మ చెప్పింది చెయ్యాలి మనమింక - పదవమ్మా పక్క సర్దమ్మా

అన్నా - వదినలు, ఆడపడుచుల మధ్య సాగే ఈ పాట దారి కూడా అదే అయినా తీరు వేరు.

4. ఆలుమగల మధ్య జగడం అర గడియదే కావచ్చు. అయినా మాట పట్టింపులతో ఎడమొగం పెడమొగం పెట్టి ఎవరు ముందు మాట్లాడతారా అని

8. పల్లెపదాలు. పుట 47.
9. త్రివేణి. పుట 114.



చూస్తుంటారు. వాళ్లమధ్య ఓ పట్టాన రాజీ కుదరకపోతే ఎవరిమీదో వంక పెట్టో ఎవర్నో అడ్డం పెట్టుకొనో అన్యాపదేశంగా మాట్లాడతారు. ఎవరూ దొరక్కపోతే తడికే గతి... ఇలాంటి జానపద జీవితాన్ని ప్రతిబింబించే తడిక రాయబారాలు పల్లెపాటల నుంచే సినిమాలకెక్కాయి. ఇలాంటి సినిమాపాట - 'అత్తా ఒకింటి కోడలే' లో ఆరుద్ర రచన

మగ : మాయదారి కీచులాట మా మధ్య వచ్చింది.
రాయబారం సేయవే తడికో తడికో

ఆడ : ఆడి వగలమారి మాటలకు ఒళ్లంతా మండుతూంది
రాయబారమెందుకో తడికో తడికో

మగ : నేను ముక్కుపుడక తెచ్చాను
ముంత గూట్లో పెట్టాను
పెట్కోమని దాన్ని పెట్కోమని
బేగి పెట్కోమని సెప్పవే తడికో తడికో

ఆడ : ఆడి ముక్కుపుడక ముక్కలవా
చూడబోతె రాళ్లు లేవు
తిప్పబోతె సిన్నమెత్తు సీలలేదు
ఆడి పోసుకోలు మాటలకు
మోసపోను నేనింక - పొమ్మని
సెప్పవే తడికో తడిక

మగ : నేను పట్టుచీర తెచ్చాను
పెట్టెలోన పెట్టాను
కట్కోమని దాన్ని కట్కోమని
బేగి కట్కోమని సెప్పవే తడికో తడికో

ఆడ : ఆడి పట్టుచీర కంచులేదు
కట్టబోతె చెంగులేదు
తెచ్చినాడి తెలివి తెల్లారి పోను
ఆడి యిచ్చకాల మాటలకు యిరిగింది నా మనసు -
పొమ్మని సెప్పవే తడికో తడిక...

మరింత పొడవు వున్న ఈ సినిమా పాట వస్తువు, నడక రెంటిలోనూ ఓ జానపద గీతానికి చాలా దగ్గరగా వుందని చెప్పడానికి ఆ పాటను పరిశీలించాలి కదా

మగ : **ముక్కుపుడక తెచ్చి ముంతగూట్లో పెట్టాను**
**పెట్టుకోమని చెప్పు తడికా**

ఆడ : **పొడికి కాంతీలేదు, పుడక మెరుగూలేదు**
**వద్దని చెప్పవే తడికమ్మా**

మగ : **పట్టుచీర తెచ్చాను... పెట్టెలో పెట్టాను...**
**కట్టుకోమని చెప్పు తడికా**

ఆడ : **చీరకంచులు లేవు, చుట్టు చెంగులు లేవు**
**వద్దని చెప్పవే తడికమ్మా...**[10].

పోలికల కిది చాలు. సినిమాపాటలో దాదాపు జానపదగీతాన్నే తీసుకొని పాత్రల సాంఘిక స్థాయి కనుగుణంగా భాషను మార్చారు.

ఇంకా 'పల్లెటూరి పిల్ల'లో -

**చిటపట చినుకుల దుప్పటి తడిసెను**
**తలుపు తీయవే భామా...**

అని కృష్ణుడికీ భామకూ మధ్య జరిగిన సంవాదం కూడా జానపద గేయమే.[11].

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ సంవాదాల కంతుండదు.

## (ఈ) సరదాలు - సరసాలు :

పడుచుపిల్లలతో వరసయిన వాళ్లు సరసాలాడ్డం పరిపాటి. అలా నాయుడు ఓ పిల్లతో సరసమాడ్డం తెలుగునాట పాటగా బాగా వ్యాప్తి చెందింది. సుదీర్ఘమైన ఆ పాటలో కొంతభాగం.[12]

---

10. మున్నీరు. పుట 215
11. మున్నీరు. పుట 183
12. పల్లె పదాలు. పుట 220



**నాయుడోళ్లింటికాడ నల్లతుమ్మ చెట్టుకాడ**
**నాయుడేమన్నాడే పిల్లా? అబ్బ ఎంత వింతగున్నావే పిల్లా**
**నాయుడోళ్లింటికాడ నల్లతుమ్మ చెట్టుకాడ**
**నాలుగు రూపాయలిస్తానన్నాడమ్మా**
**అబ్బ ! నా గుండెఝల్లు మన్నదేలమ్మా**
**కోమటోరింటికాడ గున్నమావి చెట్టుకాడ**
**కోరి కోరేమన్నాడే పిల్లా?**
**కోమటోరింటికాడ కొట్టుబజారుకాడ**
**కోరి కోరి రమ్మన్నాడమ్మా**
**కరణం గారింటికాడ కన్నెమామిడి చెట్టుక్రింద**
**కాసుల పేరిస్తా నన్నాడమ్మా**
**మునసబు గారింటికాడ ముందల దరవాజు కాడ**
**అతడేమన్నాడే పిల్లా?**
**మునసబు గారింటికాడ-- ముందల దరవాజులోన**
**ముక్కుపుడక లిస్తానన్నాడమ్మా...**

ఈపాట రోహిణీవారి 'నిర్దోషి'లో కొండముది గోపాలరాయ శర్మ చేతిలో రూప విక్రియ పొందింది.

**నాగుమల్లె చెట్టుకాడ నాడెమైన సీరగట్టి**
**నన్నెసూడమన్నది పిల్ల...అహ నన్నె సూడమన్నాది పిల్ల**
**ఆపిల్ల - ఆపిల్ల - ఆపిల్ల -- పిల్లా**
**ఆ వన్నెలన్నీ సూసినాది కన్నుగీటి పోయినాది**
**అహ ఒళ్లు జల్లుమన్నాది పిల్లా**
**అయ్యో... నా ఒళ్లు జల్లుమన్నాది ...**

మూలం ప్రతిబింబించేలా 'కుటుంబ గౌరవం' (1957)లో అనిసెట్టి యిలా రాశారు

మగ : **రాయుడోరింటికాడ నల్లతుమ్మ చెట్టుకాడ**
**రాయుడేమన్నాడే ఓ బుల్లీ రాయుడేమిచ్చాడే**

ఆడ : **వంకే వడ్డాణమిస్తా రంగైన చీరలిస్తా**
**మంచిపిల్ల నీవన్నాడు ఓ అబ్బీ,**

పెళ్లిచేసుకోమన్నాడు

మగ : పిల్ల నాతోరావే పెళ్లిచేసుకోవే
పెళ్లిలేక నాకే పిచ్చిపట్టేనే

ఆడ : నీ పిచ్చి పోయినపుడే నే పెళ్లి చేసుకుంటాలే
ఈ కల్లమాటలేలయ్యా నిన్నొల్లబోనయ్యా.. ॥మంచి॥

'అందరూ దొంగలే' (1974) చిత్రంలో జానపద గేయంలోని పల్లవిని తీసుకొని చరణాలు కథానుగుణంగా రాశారు.

ఏమైనా--ఈ సరదాలన్నీ అనుకరణలే !

2. 'చిట్టితమ్ముడు'లో ఆరుద్ర పాట నడక విలక్షణంగా వుండడంవల్ల అది గుర్తుండని వాళ్లుండరు--

ఏస్కో నారాజా ఏస్కో
అహ, ఏస్కో నారాజా ఏస్కో
ఆకేస్కో వక్కేస్కో ఆపైన చూస్కో
పక్కాన వున్నది సక్కాని సుక్క
ఆ సుక్కమనసు కలకండ ముక్క

ఈ పాటకు నెల్లూరులో యానాది స్త్రీలు పాడే--

'ఆకేస్కో పోకేస్కో
లవంగాల మొగ్గేస్కో
సాలకుంటె వన్నేస్కో

అనే మోటు సరసపుపాట మూలమట[13].

3. అలాగే తెలుగు సినిమా పాటల్లో కొండగాలిలాంటి పాట--

'కొండగాలి తిరిగింది. గుండె వూసులాడింది
గోదావరి వరదలాగ కోరిక చెలరేగింది' (ఉయ్యాల - జంపాల)

అనే పాటకు ఉత్తరాంధ్ర ప్రాంతంలో పశువులను కాసే ఒక కుర్రాడు పాడిన

13. ఆరుద్రతో ముఖాముఖి 11.1.92



'కొండగాలి తిరిగింది-- కొడుకుకేమొ లేచింది.
కోడల్ని పంపరో ఇయ్యంకుడో

అనే గాలిపాట ప్రేరణ అట! ఇది ఏ పరిశోధకుడు చెప్పిందికాదు. ఆ పాట రాసిన ఆరుద్ర స్వయంగా చెప్పిన సత్యం.[14]

4. పల్లెల్లో అన్నివృత్తుల వారితోనూ వరసలు కలుపుకొని సరసాలాడ్డం కోడెకారు కుర్రాళ్లకు సరదా. అలాంటి వాళ్లను కవ్వించడం పడుచులకు యిష్టం. అలాంటి చాకిరేవు దగ్గర పడుచును చూసి ముచ్చటపడిన సోగ్గాడిపాట.[15].

మంగమ్మా, సాకిరేవు బల్లకాడ సంగతీ
నీ సక్కదనము కాలిపోను సుక్కలాంటి మంగమ్మో
నున్నని బల్లమీద సాగతీసి కొడుతుంటే
బట్టలు సాగతీసి కొడుతుంటే
నీ కష్టముసూసి మనసు యిష్టపడ్డది మంగమ్మో
తాజాగా తాటికల్లు మజాగా మాపటికి
మాయవరం సంతలోన మారిపోదాం మంగమ్మో -

ఈ జానపదగీతం ఒరవడిగా 'బాబీ' హిందీ చిత్రంలో - 'హమ్ తుమ్ ఏక్ కమరే మె బంద్ హై' అనే పాట సంగీత బాణీలో కొసరాజు - 'జమిందారుగారి అమ్మాయి' చిత్రంలో ఉధృతమైన ప్రచారం పొందిన ఈ పాటను రాశారు. -

మగ : చాకిరేవుకాడ నీసోకు
చూడగానే జిల్లంది నాకు
రాసిపెట్టి వున్నాది మనకు
ఇలా రాసి పెట్టివున్నాది మనకు
మంగమ్మ నువ్వు ఉతుకుతుంటె అందం
అబ్బ ! వేశావె బంధం...

మూలంలో కేవలం మగాడి పరంగానేవున్న ఈ పాటను 'యుగళగీతంగా' అనుసృజించారు కొసరాజు. మూలంలోను, సినిమా పాటలోనూ కూడా వినీ వినబడనంత అశ్లీలధ్వని లేకపోలేదు.

14. 15.6.89న పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో ఉపన్యాసం
15. జానపద సాహిత్యం. పుట. 224

ఇంకా :-- 1. నిరనిర నిరబండి
నిలుపర బండోడా (కీలుగుర్రం, మంచికుటుంబం)
2. మందులోడో ఓరిమాయలోడా
మావ రారో గోపసిన్నవాడా (దశతిరిగింది)

మొదలైన ఎన్నో సినిమా పాటల్ని ఇలాంటి సరదాలకూ సరసాలకూ ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

## (ఉ) నవ్వుల పువ్వులు :

భేషజాలు లేకుండా మనసు నిండుగా నవ్వగలగడం జానపదులు చేసుకొన్న అదృష్టం. వినోదాలూ వేడుకలూ, తిరునాళ్లూ తీర్థాలూ, పల్లెజనుల నవ్వులకూ తుళ్లింతలకూ ఆటపట్టులు. అలాంటిచోట్ల తారసపడే కాశీకావళ్లూ, బైస్కోపులూ గారడీలూ... వాళ్లకు హాస్యాన్ని పంచే సాధనాలు. నాగరికత పెరిగినకొద్దీ అవి అంతర్ధాన మౌతున్నా ఒకప్పుడు వాటికి సంబంధించిన పాటలు జానపదుల్లో వ్యాప్తి పొంది ఆ తర్వాత సినిమాల కెక్కాయి. సినిమాల్లో మొదటి దశల్లో వచ్చిన హాస్యగీతాల్లో కొయ్యోడిపాట, గోంగూరపాట చెప్పుకోదగినవి కాగా తర్వాతి పాటల్లో అందరినీ అలరించింది 'అప్పుచేసి పప్పుకూడు'లో పింగళి రచన-

భజ : కాశీకి పోయాను రామాహరే
గంగ తీర్థంబు తెచ్చాను రామాహరే

ఉష : కాశీకి పోలేదు రామాహరే
ఊరి కాల్వలో నీళ్లండి రామాహరే
మురుగు కాల్వలో నీళ్లండి రామాహరే

భజ : శ్రీశైలమెళ్లాను రామాహరే
శివుని విభూతి తెచ్చాను రామాహరే

ఉష : శ్రీశైలం పోలేదు రామాహరే
శివుని విభూతి తేలేదు రామాహరే
ఇది కాష్ఠంలో బూడిద రామాహరే

భజ : అన్నమక్కరలేదు రామాహరే
నేను గాలి భోంచేస్తాను రామాహరే
ఉత్తగాలి భోంచేస్తాను రామాహరే



ఉష : గాలితోపాటుగా రామాహరే
వీరు గారెలే తింటారు రామాహరే
నేతి గారెలే తింటారు రామాహరే

ఇలా సాగిన సినిమాపాటకు మూలమైన జానపదం గీతం - యిది.

కాశీకి పోయాను రామాహరే
కాశి తీర్థమూ తెచ్చాను రామాహరే
కాశీకి పోలేదు రామాహరే--పూరి
కాలువలో నీళ్లండి రామాహరే

కాశీకి పోయాను రామాహరే
కాశీ విభూతి తెచ్చాను రామాహరే
కాశీకి పోలేదు రామాహరే--వీడి
కాష్ఠంబులో బూడిదండి రామాహరే

పంచేంద్రియములూ రామాహరీ--నేను
బంధించి వున్నాను రామాహరీ
కొంచెము నమ్మినా రామాహరీ
కొంపముంచి వేస్తాడండి రామాహరీ[16].

ఇది కాశీకావడి ప్రదర్శకుల పాట కాగా సినిమాలో హాస్యాన్ని అందించడానికి వుద్దేశించిన జంటకు తగినట్టు ఈ పాటను మలిచారు.

ఇంకా 'ఖైదీబాబాయ్'లో సి.నారె. రచన

ఓ బాబూ బయస్కోప్ పిల్లొచ్చింది
భలే తమాషా చూపిస్తుంది
పైసా ఒకటి పారేస్తే ప్రపంచమంతా కనిపిస్తుంది
కాశీపట్నం చూడరబాబూ--చూడరబాబూ
కాళహస్తి చూడరబాబూ, చూడరబాబూ
(స్ఫూర్తి-జానపదగీతం-జానపద సాహిత్యం-పుట-410)

'టింగ్‌రంగా'లో మోళీచేసే జంటమీద చిత్రీకరించడానికి తాపీ ధర్మారావు రచించిన

---

16. జానపద సాహిత్యం. పుట. 408

**నే రంగమెల్లి పోతానే నారాయణమ్మ**
**నే రంగూను సూసివత్తనే నారాయణమ్మ**
**నే ఎల్లి ఎంటనొత్తనే నారాయణమ్మ (మూలం-పల్లెపదాలు-పుట 152)**

వంటి ఎన్నో హాస్యగీతాలు సినిమాల్లో జానపద గీతాల చలువతో వచ్చాయి. రానురాను హాస్యం ముసుగులో అశ్లీలగీతాలు రావడం దురదృష్టకరం.

**(ఊ) పనిపాటలు :**

పని చేస్తున్నప్పుడు శ్రమను మర్చిపోడానికి పాట ఓ సాధనం. పొలాల్లో దుక్కి దున్నేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, కోత కోసేటప్పుడు, కుప్ప నూర్చేటప్పుడు... ఈ పాటల చప్పుడు అవసరం. తుమ్మెద, చందమామ, వెన్నెల, పొలి, జాజర, కోలుకోలో, ఉయ్యాలా మొదలైన పదాలు ఈ చెమట నుంచి పుట్టినవే. అలాగే జంబయిలే జోరులంగరు, హైలెస్సా మొదలైనవి లాగుతున్న బరువుని మర్చిపోడానికి పాడేపాటలు. పండిన పంట చేతికొచ్చిన ఆనందంలో స్త్రీలు పాడే పాట 'పాండవులు పాండవులు తుమ్మెదా'

ఇలాంటి పల్లవితో 'అక్కాచెల్లెలు' చిత్రంలో ఆత్రేయ ఓ పాట రాశారు

**'పాండవులు పాండవులు తుమ్మెదా**
**పంచ పాండవులోయమ్మ తుమ్మెదా**
**కన్నెగానె బతుకు గడిచిపోతుంది**
**నన్నెవరేలు కుంటారు అనుకొన్నది**
**జానకి అనుకొన్నది'...**

ఈ పాట పల్లవివరకు తప్ప చరణాల్లో జానపద గీతాన్ని పోలిలేదు. బాహ్యదృష్టికి - పల్లవికీ పాటకీ సంబంధం లేదనిపించినా కథాపరంగా ఆలోచిస్తే వయసు పచ్చదనం పండిపోతున్న స్త్రీ పండిన పంటకు సంబంధించిన జానపద గీతం పల్లవిని తీసుకోడం సముచితంగా వుంది. ఇంతకీ జానపదమూలం యిది

**పాండవులు పాండవులు తుమ్మెదా**
**పంచ పాండవులె తుమ్మెదా**
**ఓయి భామల్లాల తుమ్మెదా, భామల్లాల తుమ్మెదా**
**పండిన వరిచేలు తుమ్మెదా, పాయల్లు తొక్కింది తుమ్మెదా..**



'రోజులు మారాయి'లోని ఒలియోపాట కూడా పల్లవి వరకు మాత్రమే పల్లెపాటను తీసుకొన్నది. కొసరాజు రాసిన ఈ పాట--

**ఒలియో ఒలియో ఒలియో--రావేలు గలవాడ రారా పొలిగాడ**
**ఒలియోఒలీ పొలియోపొలీ--వెయివేలు గలవాడ రారా పొలీ**
**వేగుచుక్కపొడిచి వినువీధి కెక్కెరా**
**కొక్కొరోయని కోడిపుంజు కూతేసెరా...**

ఈ పాటకు మూలమైన జానపదగీతం పల్లవి--

**వలియొ, వలియొ, వలియొ--రాగాల వలియొ**
**రావేలు గలవాడ--రారా పొలికాడ[17].**

ఈ పొలిపాట కుప్పనూర్పుల్లో పాడేది. పొలిగాడంటే పంటలను సిద్ధంచేసే దేవుడనీ, వాయుదేవుడనీ రైతుల విశ్వాసం.

పనిపాటల వంకపెట్టి ఓ జాణ పాడే శ్రుతిమించిన శృంగార ధ్వనిగల గీతం 'రాయంటి నా మొగుడు రంగమెల్లి తిరిగి రాలేదు'... మూలంలోనే పచ్చిగావున్న ఈ పాటను 'తాత-మనవడు' (1973) సినిమాలో దాదాపు అలాగే వుంచారు సుంకర.

**1వ ఆమె : వచ్చేది పుల్లమ్మ మొగుడు**
**ఎల్లేది ఎల్లమ్మ మొగుడు**
**అడుగడుగో ఆదెమ్మమొగుడు**
**ఇడిగిడిగో ఈదెమ్మమొగుడు**

**2వ ఆమె : మరి నీ మొగుడు ?**

**1వ ఆమె : రాయంటి నామొగుడు**
**రంగమెల్లి తిరిగి రాలేదు**
**నా చేను దున్నాలి--**
**మంచి రైతు కావాలి**

**చ: 1 : బీటుచేను మాది వాటంగా దున్నాలి**
**రాటుకు పోటుకు ఆగాలి**
**ఆరైతు మోతుబరై వుండాలి**

17. పల్లెపదాలు-20వ పుట.

మాయ చెంగలితుంగ మత్తుగా పెరిగింది.
తీయలేక వదులుకొన్నాను
నాకు దిక్కులేక మొక్కుతున్నాను.

చ: 2 : మెరకవున్నచోట మేడి బాగానొక్కి
మెరక పల్లంచేసి మెత్తగా దున్నాలి
కదలకుండా నీరు చెరువులాగుండాలి
ఈవలావల గట్టు--ఇరుకుపుంతల దారి
ఇవరించి చూపితే - ఎదర మోడున్నాది
నాచేను - ఇష్టమైతేకౌలుకిస్తాను.(తాత-మనవడు-సుంకర)

జానపద మాతృక--

రాయంటి నామొగుడు రంగమెల్లి తిరిగి రాలేదు
నా చేను దున్నాలి నాకు రైతు మంచివాడు కావాలి
మాయ చెంగలి తుంగ మత్తుగా బెరిగింది ॥రా॥

తీయలేకను వదులుకున్నాను - దిక్కులేకను మ్రొక్కుచున్నాను
కాని మేఘములట్టి కమ్ముతూ నెలనెలకు
మానకుండా వాన కురిసేను - లోమాన్యములో తొలకరించేను ॥రా॥

బీటుచేను నాది వాటముగ దున్నాలి
రాటుకూ పోటుకూ ఆగాలి - ఆరైతు మోతుబర్రై వుండాలి ॥రా॥
... ... ... ...
గుంఢ్ర దిబ్బలపైన రెండు చేతులుతోటి
గంఢ్ర నాగలి మేడి కదలకుండా నిలిపి
కొంఢ్రోసి నొక్కితే నాగాలీ--పణత రేగడిలోన మునగాలి ॥రా॥

మెరక పల్లంజేసపి మెత్తగా దున్నాలి
తరగ కుండా నీరు చెరువులాగుండాలి
ఇరుగు తరుగూ లేక పండాలి - మా యెగసాయమే బాగుచెయ్యాలి॥రా॥

ఎవరైన చేయగలిగితెల్లి చూసుకోండి
ఈవలావల గట్టు - తోవ లోపల గాడి



యిరుకు పుంతల దారి--వివరించి చూపితే
ఎదర మోడున్నాదె మాచేను-ఇష్టమైతే కవులకిస్తాము.[18].

పొలం వంకతో స్త్రీ రహస్యభాగాలను స్ఫురింపజేసే ఈ మోటుపాటను సినిమాలో కు'దించడం' తప్ప కవి సొంతమేమీ కనిపించదు.

ఇంకా--'అనురాగం' చిత్రంలో--

సెనగచేలో నిలబడి చేయిజాపే ఓ పూసలోళ్ల రాజమ్మ
కందిచేలో నిలబడి కన్నుగీటే ఓ పూసలోళ్ల రోశయ్య

'ముత్యాలముగ్గు' చిత్రంలో--

గోగులుపూచే గోగులుపూచే--ఓ లచ్చగుమ్మడి
గోగులు దులిపే వారెవరమ్మ ఓ లచ్చగుమ్మడి'

మొదలైన సి.నా.రె. సినిమా గీతాలకు తెలంగాణా పల్లెపాటల బాణీలే ఊపిరి.

## (ఋ) పిల్లల పాటలు :

1. కాళ్ల గజ్జె కంకాలమ్మ--వేగుచుక్క వెలగమొగ్గ
   ముత్యం బియ్యం మునగచారు
   ముత్యాల్లాంటి పిల్లలు మీరు... (ఆదర్శకుటుంబం-ఆత్రేయ)

2. పువ్వు పువ్వు ఏంపువ్వు-పగలే వెలిగే జాబిలిపువ్వు
   జాబిలి జాబిలి ఏం జాబిలి ? నవ్వుల పువ్వుల నవ్వే జాబిలి
   (శభాష్ సూరి - ఆత్రేయ)

3. దాగుడుమూతా దండాకోర్
   పిల్లీవచ్చే ఎలుకా కోర్ (బండరాముడు - ఆత్రేయ)

4. ఆకేసి పప్పేసి నెయ్యేసి బువ్వేసి
   నీకోముద్ద - నాకోముద్ద (అభిమన్యుడు - ఆత్రేయ)

5. తప్పెట్లోయ్ తాళాలోయ్ దేవుని గుళ్లో బాజాలోయ్

---

18. తెలుగు జానపదగేయ సాహిత్యం. పుట 509

చప్పట్లోయ్ సరదాలోయ్ - పిల్లలె బళ్లో రాజాలోయ్
(వాగ్దానం - నార్లచిరంజీవి)

6. ఏదయా మీదయా - మా మీదలేదు
ఇంత నిర్లక్ష్యమా - ఇది మీకు తగదు(వందేమాతరం-అదృష్టదీపక్)

...ఇంకా ఇలాంటి పల్లవులెన్నో జానపదుల బాలగేయ సాహిత్యానికి సంబంధించినవని మూలాలు చెప్పాల్సిన అవసరం లేకుండానే అందరికీ తెలుసు... అయితే సినిమాల్లో పై పల్లవులన్నీ పిల్లల పాటలుగానే రాలేదు. కొన్నిటి రూపాలు మారాయి. ఇలా మారిన వాటిలో ప్రణయగీతాలే ఎక్కువ. అలాంటి ప్రణయగీతాల స్వభావాన్ని పరిశీలిద్దాం--

1. వైకుంఠపాళి'లో ఆత్రేయ రచన--

ఆడ : ఓలమ్మో - నారాయణ నారాయణ నక్కతోక
నా మొగుడు తెచ్చాడు కొత్తకోక
నేనెందుకుంటాను - కట్టుకోక

మగ : ఓరయ్యో నారాయణ నారాయణ నక్కతోక
నా పెళ్లాం కట్టింది కొత్తకోక
నేనెందుకుంటాను ముద్దెట్టుకోక - ముద్దెట్టుకోక

ఆడ : పట్టుకోక పట్టుకోక పట్టుకోక
పదిమందిలో నన్ను ముద్దెట్టుకోక

మగ : కట్టుకున్న వాడుండడు పట్టుకోక
కాదంటే ఇప్పుడే ఇప్పు కోక...

ఇలా అంత్యప్రాసలతో సభంగశ్లేషలతో నడిచిన పాటకు పిల్లలు తమాషాగా పాడుకునేపాట ఆధారం కావడం తమాషా. పల్లవిలోనే కాక - నడకకూడా ఆ పోకడే.

నారాయణ నారాయణ నక్కతోక
నారాయణ పెండ్లాం కుక్కతోక
నన్నెందుకుంచినావు తీస్కుపోక
వోళి గల్లి గంపకాడ వుంచిరాక



మంచినీళ్ల బాయి కాడ ముంచిరాక

నారాయణ నారాయణ నక్కతోక
నా మొగుడు తెచ్చింది కొత్తకోక
నేనేలుండేను కట్టుకోక
అదేలుండేను చినిగిపోక
వాడేలుండేను కొట్టుకోక
నేనేలుండేను మొత్తుకోక
వాడేలుండేను పారిపోక[19].

ఇది బాలసాహిత్యంగా వ్యాప్తి పొందినా--భావం చూస్తే అలా అనిపించడంలేదు.

2. 'శుభోదయం'లో వేటూరి సుందర రామమూర్తి పాట--

కంచికి పోతావా కృష్ణమ్మా
ఆ కంచి వార్తలేమి కృష్ణమ్మా
కంచిలో వున్నది బొమ్మ
అది బొమ్మకాదు; ముద్దుగుమ్మ ॥కం॥

త్యాగరాజు కీర్తనల్లె వున్నాదీ బొమ్మ
రాగమేదో తీర్చినట్లు వుందమ్మా ॥త్యాగ॥

ముసిముసినవ్వుల పువ్వుల పూచిందీ బొమ్మ
మువ్వగోపాల-మువ్వగోపాల-మువ్వగోపాలా అన్నట్టుందమ్మా
అడుగుల సవ్వళ్లు కాదమ్మా - అవి ఎడదల్లో సందళ్లు లేవమ్మా ॥కం॥

ఈ సినిమా పాటకు ఓ పిల్లల పాట మూలం

కంచికి పోతావా కృష్ణమ్మా
ఆ కంచి వార్తలేమి కృష్ణమ్మా
కంచిలో వున్నది అవ్వ
కంచిలో వున్నది అవ్వ
ఆ అవ్వ నీకు పెట్టు బువ్వ

19. త్రివేణి. పుట. 10

బువ్వ ఉన్నది గాని కృష్ణమ్మా
నీకు పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మా
కోమటి యింటిది అప్పు
ఆ అప్పు నాకు పెట్టు పప్పు[20].

ఇలా ప్రశ్న - జవాబు రూపంలోవున్న బాలగేయం వేటూరి చేతిలో ఆబాల గోపాల గీతమైంది. దానిలో పల్లవి సవ్వడి తప్ప చరణాల సవ్వళ్ల లేవు.

**(ఋ) స్త్రీల పాటలు :**

'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని వేదకాలంలోనే ముద్ర వేయబడిన స్త్రీ తన మనసు విప్పుకోడానికీ, వేదననో, వేడుకనో చెప్పుకోడానికీ మాటకంటె పాట మేలనుకొంది. అందుకే వివిధ సందర్భాలకు సంబంధించిన స్త్రీలపాటల పుస్తకాలు పుంఖాను పుంఖాలుగా వచ్చాయి. సినిమాలకు తగిన ప్రచారం వచ్చినప్పటినుండీ వాటికి మహారాణీ పోషకులు స్త్రీలే గనుక సినిమాల్లో స్త్రీల పాటలు వుండడం సహజం. అలా సినిమాల్లో, అసాధారణమైన ప్రాచుర్యం పొందిన స్త్రీలపాటల్లో అధికశాతం జానపద సాహిత్యం నుండి ఊపిరి పోసుకున్నవే. మచ్చుకి మూడు ఉదాహరణలు:-

1. ఒక జానపదగీతం రెండుమూడు సినిమాపాటలకు ప్రేరణ అయినట్టే ఒకే సినిమాపాటకు రెండుమూడు జానపదాలు కూడా ప్రేరణ అయిన సందర్భాలున్నాయి. ఈ రెండోతరగతికి చెందిన పాట 70ల దశకంలో 'సూపర్‌హిట్స్' అనిపించుకొన్న పాటల్లో ఒకటయిన 'ముత్యాలముగ్గు'లోని ఆరుద్ర రచన

ముత్యమంతా పసుపు ముఖమంత చాయ
ముత్తయిదు కుంకుమ బతుకంత చాయ
ముద్దు మురిపాలొలుకు ముంగిళ్లలోన
మూడు పువ్వులు ఆరు కాయల్లు కాయ ॥ముత్య॥

ఆరనయిదోతనము ఏచోటనుండు
అరుగులలికేవారి అరచేతనుండు
తీరైన సంపద ఎవరింట నుండు ?
దినదినము ముగ్గున్న లోగిళ్లనుండు ॥ముత్య॥

20. మున్నీరు - పుట. 347



కోటలో తులసమ్మ కొలువున్న తీరు
కోరి కొలిచేవారి కొంగుబంగారు
గోవుమాలక్ష్మికి కోటిదండాలు
కోరినంతా పాడి నిండు కడవల్లు ॥ముత్య॥

మగడు మెచ్చిన చాన కాపురంలోన
మొగలిపూలా గాలి ముత్యాలవాన
ఇంటి ఇల్లాలికి ఎంత సౌభాగ్యం
ఇంటిల్లిపాదికి అంత వైభోగం ॥ముత్య॥

దీనిలో కొన్ని పంక్తులు యథాతథంగావున్న ఓ పల్లెపాట యిలా వుంది

ముత్యమంతా పసుపు ముఖమంత చాయ
ముత్తయిదు నినుజూడ ముచ్చటా అగును
ఆరనయిదోతనము ఎవరొద్దనుండు
అరుగులలికేవారి అరచేతనుండు
నాణెమైనా కురులు నడినెత్తి నుండు
నాతి కయిదోతనము నాసికానుండు.[21].

ఈ పాటలోని మొదటి నాలుగుపంక్తులూ సినిమాపాటలో చోటుచేసుకొన్నాయి. ఈ సినిమాపాటలోని చివరి చరణంలోని మరో అందమైన పంక్తికూడా టేకుమళ్ల అచ్యుతరావు సేకరణలో (పాతపాటలు) వుంది.

వీథినెందరు వున్న విసరదే గాలి
రచ్చనెందరు వున్న రాదమ్మ వాన
నా చిన్ని అబ్బాయి వీథి నిలుచుంటే
మొగలిపువ్వుల గాలి ముత్యాలవాన

ఓ తల్లి తన పాపణ్ణి చూస్తూ మురిసిపోయి పాడే ఈ పాటలోని పంక్తిని సినిమాపాటలో ఇల్లాలివరంగా మార్చి చక్కగా అనుసంధించారు ఆరుద్ర. సినిమాపాటలోని మూలంలోని భాగంపోగా మిగిలింది అనుసరణే. తెలతెలవారుతుండగా యింటి ముంగిలిలో ముగ్గులు తీర్చే చిన్నది పాడుకొనేపాట

21. మున్నీరు. పుట. 307

అప్పటికే తెలుగునాట సంప్రదాయ సిద్ధంగా స్త్రీలు పాడుకొనేపాట అయితే సబబుగా వుంటుందని ఆరుద్ర మూలంనుంచి అన్ని పంక్తులు తీసుకొన్నారట. జానపదాలనుంచి సినిమా కవులు ఏం తీసుకొన్నారన్నదికాదు - ఎలా ఆ బాణీని సుసంపన్నంచేసి ప్రజల్లోకి తీసుకెళ్లారనేదే ముఖ్యం. ఈ పాట యింకా పరిమళిస్తోందనడానికి 'యముడన్నకు మొగుడు' లో(1992) వచ్చిన 'ముద్దులొలికే భార్య ఉద్యోగమే సేయ...' అనే పేరడీయే నిదర్శనం.

2. ఇంత ప్రచారం పొందిన మరో మహిళల పాట 'గోరింటాకు' చిత్రంలో - దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన--

గోరింట పూచింది కొమ్మలేకుండా
మురిపాల అరచేత మొగ్గతొడిగింది
ఎంచక్కా పండిన ఎర్రనిచుక్క
చిట్టి పేరంటాలకి శ్రీరామరక్ష
కన్నె పేరంటాలకి కలకాలం రక్ష ॥గోరిం॥

మామిడి చిగురెరుపు మంకెన పువ్వెరుపు
మణులన్నింటిలోన మాణిక్యం ఎరుపు
సందె వన్నెల్లోన సాగే మొగ్గెరుపు
తాయెరుపు అమ్మాయి తనవారిలోన ॥గోరిం॥

మందారంలా పూస్తే మంచి మొగుడొస్తాడు
గన్నేరులా పూస్తే కలవాడొస్తాడు
సిందూరంలాపూస్తే చిట్టి చేయంతా
అందాల చందమామ అతనే దిగివస్తాడు ॥గోరిం॥

పడకూడదమ్మా పాపాయిమీద
పాపిష్టికళ్లు, కోపిష్టికళ్లు
పాపిష్టికళ్లల్లో పచ్చకామెర్లు
కోపిష్టికళ్లల్లో కొరివి మంటల్లు ॥గోరిం॥

ఈ పాటలోని కొన్ని పంక్తులు, కొన్నిటి గుర్తులు రెండు జానపద గేయాల్లో కనిపిస్తున్నాయి.



గోపాలకృష్ణమ్మ పెళ్లయ్యేనాడు
గోరింట పూచింది కొమ్మలేకుండా
మాయింట అబ్బాయి పెళ్లయ్యేనాడు
మల్లెల్లు పూచాయి మొగ్గలేకుండ

**(సాంప్రదాయిక విజ్ఞానం--పాతపాటలు)**

పొత్తిళ్లలో బిడ్డ పెళ్లి గురించి కలలుగనే తల్లిమనసు, పై పాటలో కనిపిస్తుంటే ఎర్రగా బుర్రగావున్న తన పాపాయిని చూసి సంబరపడుతున్న తల్లిమనసు మరోపాటలో కనిపిస్తుంది.--

చిక్కుడు పువ్వెరుపు చిలక ముక్కెరుపు
చిగురెరుపు చింతల్లి దోరపండెరుపు
రక్కిస పండెరుపు రాగిచెంబెరుపు
రాచవారిళ్లలో మాణిక్యమెరుపు
తా యెరుపు అమ్మాయి--తనవారిలోన[22]...

సినిమాపాటలో రెండవ చరణానికి ఈ పాట స్ఫూర్తికాగా, మొదటి పాటలోని రెండవ పంక్తి పల్లవిగా అవతరించింది. పిల్లలకు తల్లి గోరింటాకు పెట్టే ఈ సన్నివేశానికి కూడా ఒక మలయాళ చిత్రంలోని సన్నివేశం ప్రేరణ.[23] తనదైన బాణీలో భావకవితాపరిమళంతో పాటలు రాసిన కృష్ణశాస్త్రి పాటమీదే యింత జానపద ప్రభావముండడం ఆశ్చర్యం !

అన్నట్టు ఈ ఎరుపు పై పాటతో చెరిగిపోలేదు. 'శ్రీవారు' చిత్రంలో జాలాది రాసిన పాటలో కూడా ఈ ఎర్రదనం వుంది--

చిక్కుళ్ల పువ్వెరుపు చిలక ముక్కెరుపు
పగడాల చినదాని సొగసంత ఎరుపు
పసుపంటినా రోజు పారాణి ఎరుపు
మనువాడు తనవాడు మాణిక్యమెరుపు

ఇంకా ఎన్ని పాటల్లో ఈ మాణిక్యం ఎరుపు ప్రతిబింబించిందో !

22. తెలుగు జానపద గేయసాహిత్యం. పుట. 474
23. కె. మురారితో గోష్ఠి.

3. 'శ్రీ జానకీదేవి సీమంతమునకు' అనే పల్లవితో రెండూ, దానికి దగ్గరగా పల్లవి గల పాట మరోటి - మొత్తం మూడు సీమంతపు పాటలు పదేళ్ల వ్యవధిలో మూడు చిత్రాలలో వచ్చాయి. వాటిలో 'ఆడబిడ్డ' - చిత్రం (1955)లోని పాటను 'స్త్రీల పాటలనుండి' అని స్పష్టంగా పేర్కొన్నారు.

ఆ పాట యిది--

శ్రీ జానకీదేవి సీమంతమునకు
శ్రీశారదాగిరిజ చేరి దీవించిరి
వంకులా నెరికురులు దువ్వి
పాపటను చెలువారదీసి
మొగలిరేకుల వాలుజడలో
పారిజాతపు విరులు తురిమిరి ॥శ్రీ జానకీ॥

జిలుగు చీనాంబరముగట్టి
సరిగపూవుల రవిక తొడిగి
పొంకముగ నీలాలగాజులు
కంకణంబు లలంకరించిరి ॥శ్రీ జానకీ॥

అందముగ చూలాలి నుదుటను
చందిరిక తిలకంబు తీర్చి
కడుపు చలువకు చలిమిడిని
సీమంతములు చెలి వొడిని నింపిరి ॥శ్రీ జానకీ॥

ఇదే పాట 'మాయలోకం' (1945)లో చరణాల్ని ముందు వెనకా మార్చి ఉపయోగించారు. ఈ పాటను గిడుగు వేంకటసీతాపతి (మాయ లోకంలో కాంభోజరాజు మంత్రి పాత్రధారి) ఆశువుగా రాసినట్టు ఇంటూరి వెంకటేశ్వర్రావు రాయడం భ్రమ కావచ్చు.[24] కారణం 'ఆడబిడ్డ' చిత్రంలోని పాటవరుస సహజంగావుంటే--మాయలోకం లోది గుర్తుతెచ్చుకొని రాసినట్టే వుంది. అంతే కాకుండా ఇలాంటి పల్లవితోనే 'మిస్సమ్మ'లో పింగళి కూడా ఓ పాట రాశారు. సాధారణంగా ఆయన జానపదాన్ని తప్ప మరోకవి పల్లవిని ఆధారం చేసుకొని పాటరాసి వుండరు. ఆ పాట యిది.

24. తెలుగు సినిమా జిలుగు వెలుగులు-సితార 22.12.91



శ్రీ జానకీదేవి సీమంత మలరె
మహలక్ష్మి సుందర వదనము గనరె
పన్నీరు గంధాలు సఖిపైన చిలికించి
కానుకలు కట్నాలు చదివించరమ్మా
మల్లె మొల్లలు సరులు సతి జడను సవరించి
ఎల్లవేడుకలిపుడు చేయించరమ్మా ॥శ్రీ॥

కులుకుచు కూర్చున్న కలికిని తిలకించి
అలుక చెందగనీక అలరించరమ్మా
కులమెల్ల దీపించు కొమరుని గనుమంచు
ఎల్ల ముత్తైదువలు దీవించరమ్మ ॥శ్రీ॥

ఇది జానపదాన్ని అనుసరించి రాసిన పాట. ఇంకా 'రామలాలీ - మేఘశ్యామలాలీ', 'ఏడవకు ఏడవకు వెర్రి నాగన్న, ఏడిస్తే నీకళ్లు నీలాలు కారు'... (చక్రపాణి) వంటి స్త్రీల పాటలు ఎన్ని సినిమాలలో వచ్చాయో! లాలిపాటల్ని ఏ భాషలోనైనా నీలాంబరి రాగంలోనే పాడ్డం విశేషం.

## (ఎ) వలపు పాటలు :

1. చింతచెట్టు చిగురు చూడు
   చిన్నదాని పొగరుచూడు (అదృష్టవంతులు-ఆరుద్ర)
   **(మూలం : జానపద సాహిత్యం - పుట - 399)**

2. రాతిరి రాతిరి వస్తానన్నావు - మామా
   రాతిగంధం తీసి వుంచాను (జడ్జిగారి కోడలు-ఆత్రేయ)
   (ఇదెక్కడి న్యాయం - కొసరాజు)
   **(మూలం : జానపద సాహిత్యం - పుట - 570)**

3. వలచీనానమ్మా వలచీనానమ్మా
   వలచినానని తెలిసికూడ... (భార్యబిడ్డలు-ఆత్రేయ)
   **(మూలం : పల్లెపదాలు - పుట - 204)**

4. నీకు నీవారు లేరు నాకు నావారు లేరు
   ఏకంగా ఎగిరిపోదాము -

ఏటి ఒడ్డున యిల్లే కడదాము (బంట్రోతుభార్య - సి.నా.రె.)
(మూలం : చల్ మోహనరంగా పాట)

5. పదరా ఈనాటి రేయి -
మధుర వెన్నెల రేయి
ఇదియే నేకోరుకొంటిని గదరా - ఓ చిన్నవాడా
(పల్లెపడుచు - ఆరుద్ర)
(మూలం : చల్ మోహనరంగా పాట)

6. బంగారు చినదాన బాజాబందూల దాన
బాజాబందూల మీద బంతిపూలు సోకే ఓ చిన్నదాన
(రక్తాభిషేకం - వేటూరి)
(ప్రేరణ : తెలంగాణా పల్లెపాటలు - 188 పుట)

... ఇలా జానపదాల బాణీలో రాసిన వలపుపాటల జాబితాను ఎంతైనా యివ్వొచ్చు. తెలుగువాళ్లకి వలపు తప్ప మరో పదం తెలియదు. గనుక ప్రేమ,కామం, శృంగారం - అన్నీ దానికిందకే వస్తాయి. రసరాజమైన శృంగారానికి జానపదులెంత ప్రాముఖ్యమిచ్చారో సినిమారంగం అంతకంటె ఎక్కువ వ్యామోహం చూపించింది. అందుకే జానపదుల ముద్దుముచ్చట్లకూ, తీరని కోరికలకూ ప్రతిరూపమైన ప్రేమ, శృంగార గీతాలు సినిమాల్లోకి వరదలా వచ్చాయి.

ఉదాహరణ : 1. (ఎ) 'ఆశాజీవులు' (62)లో సముద్రాల (జూ) పాట-

ఆమె : రారా నాయింటికి - ఒంటిగ
నిదురరాదు నాకంటికి
బోటిమీద నాది యిల్లు - బొంగరాల బోలు తలుపు
వంగి రార వన్నెకాడ, బందు తగిలి చిన్నపోయేవు॥రా॥

అతడు : ఇంటి వెనుక బావి ముందు
ఒంటిజామి చెట్టునీడ
జంటచిలుక కంటబడితే
జాతరొతది నన్నుపోనీవే
రానే - నీ జంటకి, తోడుగ రానుపోవే నీయింటికి



ఆమె : రాలుగాయి సిన్నవోడ రంగులన్ని ఎరుకలేరా
రాసకొడకా నిన్నుదలచి రాతిరంతా వేగిపోయారా॥రా॥

అతడు : ఆకు లేని అడవిలోన మేకలేల మేపెదమ్మ
ఆస లేని వానివద్ద బాసలేల ఓసీ నల్లమ్మ

ఆమె : నల్లదాన్నని ఒల్లవేమొ - నాణెమెంతని నమ్మవేమొ
నల్లరేగడి దున్నిచూడు - తెల్లజొన్నలు పండవేమొ॥రా॥

(బి) 'దొరబాబు' చిత్రంలో - సి. నారాయణరెడ్డి

ఆమె : రారా పడకింటికి
నిదురరాదు నాకంటికి
తగిన మందుందిలే రగిలే నాఒంటికి

అతడు : ఎందుకు పడకింటికి
పోదాములే పొదరింటికి
తగిన ముందుందిలే రగిలే నీవొంటికి...
... ... ... ...

(సి) 'ప్రజానాయకుడు' లో ఆత్రేయ

ఓ దొరా, లే దొరా, రా దొరా !
ఊరకే చూస్తుంటే రాదురా పడుచుపిల్ల రాదురా
వయసు మళ్లీ రాదురా
నల్లగున్నావని నన్ను ఒల్లకున్నావేమొరా
నల్లరేగడి దున్ని చూడు, తెల్లజొన్నలు పండుతాయి
ఎర్రమన్ను బిర్రుగుండదురా-
మా ఎండబడితే - నల్లబడతావురా

ఈ మూడు పాటలలో మొదటి పాట పల్లవికీ, రెండవపాట పల్లవికీ, మొదటిపాట చివరి చరణానికీ మూడోపాట చివరి చరణానికీ పోలికలు కనిపిస్తున్నాయి. ఈ సామ్యానికి కారణం వాటికి స్ఫూర్తి అయిన ఓ జానపద శృంగారగీతం -

రారా నా యింటికి, ఒంటిగ నిదురరాదు నా కంటికి
బోటిమీద నాది యిల్లు బొంగరాల బోలు తలుపు

తమలపాకు ద్వారబంధము
వంగిరారా వన్నెకాడా, చింగుదగిలి చిన్నబోయేవు ॥రా॥

చక్కని సిరిచాప లోన - ఒక్కదాన్ని పన్నరారా
వద్ద పన్నోడిన కుండ - వద్దమాను కదలకుండ
గాజులు గల్లుమనకుంట - గంధము వేడెత్తకుంట
పొట్టిదాన్ననుకున్నవేమొ - పొందదేదొ నీదు మనసు
పొట్టిదాని గట్టితనము - పట్టెమంచం ఎక్కిచూడు
నల్లదాన్ననుకొన్నవేమొ - నమ్మదేమొ నీదు మనసు
నల్లరేగడి దున్నిచూడు - తెల్లజొన్నలు పండవేమొ[25] ॥రా॥

ఈ పాటను చదివాక - పై మూడు పాటల్లో ఈ పాట నుంచి ఎవరేమి తీసుకొన్నారో ఎవరు అనుకరించారో, ఎవరు అనుసృజించారో వ్యాఖ్యానించాల్సిన అవసరం లేకుండానే స్పష్టమవుతోంది.

ఉదాహరణ : 2

'ఆశాజీవులు' లో సముద్రాల (జూ) రాసిన మరోపాట -

వేళ చూడ వెన్నెలాయె, వెండికట్ల కిన్నెరాయె
మల్లెపూల పందిరాయె, ఒయ్యారి రాజా
నవ్వులోనే తెల్లవారిందోయ్ ॥వేళ॥
... ... ... ...

ఇలాంటి పాట - 'నాటకాలరాయుడు'లో కూడా వుంది; ఆత్రేయ రచన:

వేళ చూడ వెన్నెలాయె
లోన చూడ వెచ్చానాయె
ఎందుకోమరి తెలియదాయె
రేయిమాత్రం గడిచిపోయె
కొమ్మ కొమ్మకు చిగుళ్లాయె
గుండెనిండా గుబుల్లాయె
పువ్వుపువ్వున తుమ్మెదాయె
పొంగు వయసుతో పోరులాయె ॥ఎందుకో॥

25. తెలంగాణా పల్లెపాటలు. పుట. 127



ఈ రెండు పాటలకూ స్ఫూర్తి ఓ జానపదగేయం -

వేళజూడ వెన్నెలాయె, వెండికట్ల కిన్నెరాయె
మల్లెపూల పందిరాయె, వయ్యారిరావె, నవ్వులోనె తెల్లవారును[26]...

పల్లవి మేరకయినా మొదటి సినిమాపాటలో వున్నంతగా రెండోదానిలో జానపదగీతం ఛాయలులేవు.

ఇలా ఎన్ని చెప్పినా వలపు మాటల్లాగే ఇవీ తరగవు.

## (ఏ) పెళ్లిపాటలు :

కాలం ఎంత మారినా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న - వివాహాల్లో ముహూర్త సమయంలో ఇప్పటికీ రెండుపాటలు వాద్యమేళంలో వినిపిస్తాయి. అవి. 1. ఆనందమానంద మాయెనే... 2. కల్యాణము చూతము రారమ్మా... శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారమ్మా... ఈ రెండుపాటలూ సంప్రదాయంగా వస్తున్న జానపదాలే అని చెప్పాల్సిన అవసరం లేదు. వాటిలో మొదటిపాట స్ఫూర్తితో సినిమాల్లో ఎన్నోపాటలు వచ్చాయి.

ఉదాహరణకు - 'పంతులమ్మ'లో సముద్రాల రచన -

ఆనందమానంద మాయెనే
మా అన్నయ్య పెండ్లికొడుకాయెనే
మా సూరన్న పెండ్లికొడుకాయెనే.

రెండవపాట పల్లవిగా సీతారామకల్యాణం, సంపూర్ణ రామాయణం మొదలైన చిత్రాల్లో వచ్చిన పాటల్ని గమనించాం.

## సరికొత్త జానపదాలు :

ఇటీవల వస్తున్న విప్లవ చిత్రాలలో ఎక్కువగా గిరిజన గీతాలను, వివిధ మాండలికాల జానపదగీతాలను తీసుకొని ఆ బాణీల్లో పాటలను రాయిస్తున్నారు.

'అర్థరాత్రి స్వతంత్రం'లో

(1) 'నీ అమ్మ చచ్చినా దమ్మిడొగ్గను
నీయయ్య చచ్చినా దమ్మిడొగ్గను..

26. పల్లెపదాలు. పుట. 173

ఘంటవాద్యం ఆధారంగా వచ్చిన జానపదగీతం బాణీలో రాసినపాట -

**(2) నోము నోమన్నాల-నోమన్నలాలో - చందమామా**
**నోరూవాయిలేని లోకం చూడర్రో - చందమామా**

ఊడ్పులపాట పల్లవిని ఆధారం చేసుకొని రాసినపాట

**(3) 'జుంబారే జుంబిక జుంబి జుంబారే'**

'రేలారే...'అనే గిరిజనుల పల్లవిని అనుకరించిన పాట.

'భూపోరాటం'లో వంగపండు రచన -

**ఆలింక బాలింక చంద్రా నెలవంక**
**మబ్బులు ఎనకెల్ల - కరువులు ముసుగెల్ల**
**చావుకీ మమ్మొదలి - అయ్యలు వలసెల్లి..** అనే పాటకు -
**'ఆలింక బాలింకో చంద్రా నెలవంక'**

అనే చిన్నపిల్లల వెన్నెలకుప్పలాట లోని పాట ప్రేరణ:

'భారతనారి'లో - 'బంగారుతల్లిరో' అనే జాలాది రచనకు -

**'మదనసుందరిరో' -**
**నీలావారి కోడలు నీళ్లాడిందన్నయ్యో'**

అనే జానపద సంగీతబాణీ ఆధారం.

ఇవి ఈ తరహా సినిమాపాటలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే !

## విశిష్ట సాహిత్యం :

కొందరి దృష్టిలో జానపద సాహిత్యం శిష్టసాహిత్యం కాకపోవచ్చు; కాని సహృదయులకది విశిష్టసాహిత్యం. కల్మషమంటని జీవనదిలాంటి జానపద సాహిత్యం సినిమా సాహిత్యానికెంత దోహదం చేసిందో - అంత కాకపోయినా జానపదాల వ్యాప్తికి సినిమాపాటలూ కొంత ఉపకరించాయి. అనామకులైన జానపదకవుల గీతాల్ని తమపేర ప్రకటించుకొన్న కొందరు సినీకవుల (చాలాతక్కువ) ప్రలోభం మాత్రం గర్హనీయం. అలాగే జానపదాల్ని కేవలం స్ఫూర్తిగా తీసుకొని సినిమాపాటల్ని రాసిన సి. నారాయణరెడ్డి, వేటూరి ప్రభృతుల అనుసృజనలు అభినందనీయం. నాగరికులకు జానపదుల శ్రమ ఉపయోగపడుతున్నట్టే - సినిమా పరిశ్రమకు జానపదసాహిత్యమూ ఉపకరిస్తోంది.

***



# ఆధునికత - సినీకవిత

## ఆధునిక కవితా ధోరణులు :

1910లో గురజాడ 'ముత్యాలసరాలు' రాకతో అప్పటికే అవసానదశలోవున్న సంప్రదాయ సాహిత్యాన్ని త్రోసిరాజని ఆధునిక కవిత్వం అవతరించింది. భావకవిత్వంతో ప్రారంభమైన ఆధునికకవిత్వంలో ఆ తర్వాత ఎన్నో ఉద్యమాలు తలెత్తాయి. ఈ చారిత్రక కవితాపరిణామాలలో భావ, అభ్యుదయ, విప్లవ కవితోద్యమాలు తప్ప మిగతావాటి ప్రభావం సినిమాపాటల మీద అంతగాలేదు. వీటితోపాటు తొలితెలుగు టాకీ పుట్టేనాటికే ఊపందుకొన్న స్వాతంత్ర్యోద్యమం, ఆ తర్వాత వచ్చిన ఆంధ్రోద్యమాల ముద్ర కూడా సినిమాపాటల మీద స్పష్టంగా వుంది. భాషాపరంగా వ్యవహారభాషోద్యమం విజయవంతం కావడంతో ఇతర ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కంటె ఎక్కువ మోతాదులోనే సినిమాపాటల్లో అన్యభాషాపదాలు చోటుచేసుకొన్నాయి. సాహిత్యపరంగా కూడా ఈ ప్రభావం కొద్దో గొప్పో లేకపోలేదు. అనుకరణ మిగతారంగాల కంటె సినిమాల్లో అధికం గనుక ఆదరణ పొందిన ముందుపాటల ముద్రలు కూడా సినిమాపాటల మీద పడ్డం పరిపాటి... ఇలా సినిమాపాటల మీద పడిన వివిధ ఆధునిక ప్రభావాలను స్థూలంగా భావకవిత్వం, జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, ఎర్రపుటలు, అన్యభాషలు, పాతపాటలు అని ఆరు విధాలుగా విభజింపవచ్చు.

### 1. భావకవిత్వం :

భావకవిత్వం పేరు చెప్పగానే కోయిలలు, తుమ్మెదలు, మలయపవనం, మావిచిగుళ్లు, మన్మథలీల, రాధామాధవుల రాసకేళి, వెన్నెల, మల్లెలు... వగైరా గుర్తొస్తాయి. అలాగే భావకవి అనే పదం వినగానే కృష్ణశాస్త్రి స్ఫురిస్తారు. 'కృష్ణశాస్త్రి కవితలా కృష్ణవేణి పొంగులా...' (దాసరి-భాగ్యలక్ష్మి) 'బాపూగీసిన బొమ్మల్లే దేవులపల్లి కవితల్లే' (గోపి-గోపాలరావుగారి అమ్మాయి) అనే సినిమాపాటల్లో ఆ ప్రత్యేకతను పేర్కొన్నారు కూడా. భావకవిత్వాన్నే కాల్పనిక కవిత్వమనీ, భావగీతాలనీ, భావపదాలనీ కూడా వ్యవహరించారు. భావపదము అనే పదాన్ని రాయప్రోలు సుబ్బారావు, భావగీతము

అనే పదాన్ని విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి - తమ కవితల్లో ఉపయోగించారు. ఆంగ్ల సాహిత్యంలో 19వ శతాబ్ది ప్రారంభంలో వచ్చిన షెల్లీ, కీట్స్, కాల్రెడ్జ్, వర్డ్స్‌వర్త్ మొదలైన రొమాంటిక్ కవుల ధోరణిలో కవిత్వం సాగడంవల్ల - దీనిని కాల్పనికకవిత్వం అనికూడా అన్నారు.

భావకవిత్వాన్ని విశ్వనాథ సత్యనారాయణ - 'నీ హృదిలో ఏదో తారాడుతుంది. అది బాధగా వుంటుంది. అది జీవుణ్ణి కదిలిస్తుంది. ఇదమిత్థమని మనం చెప్పలేంది - అదే భావకవిత్వమంటే'... అని నిర్వచించగా[1] -

'భావకవిత్వం ఒక అనుభవం. దీన్ని ఒకడు మరొకడికి బోధపరచడానికి వీల్లేదు - పరిమళం ఇలా వుంటుందని ఎలా చెప్పగలం?[2] అన్నారు శ్రీశ్రీ.

మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం రాస్తూ చెలం - 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ; ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ'[3] అన్నారు కృష్ణశాస్త్రి బాధను భావకవిత్వానికి - శ్రీశ్రీ బాధను అభ్యుదయ కవిత్వానికీ ప్రతీకలుగా భావిస్తూ, ఎందరో సాహితీవేత్తలు, పరిశోధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిశీలిస్తే కవిత్వంలోగల వస్తువు, భావం, శిల్పం అనే మూడు అంశాలలో భావ ప్రధానమైనదాన్ని భావకవిత్వంగా భావించారని అర్థమవుతోంది. భావంలేని కవిత్వం వుండదు గనుక భావకవిత్వమనే ప్రక్రియ అర్థరహితమని 'నేటికాలపు కవిత్వం'లో అక్కిరాజు ఉమాకాంతం, 'చాకిరేవు'లో కొల్లూరి ధర్మారావు, 'శుక్లపక్షం'లో అనంతపంతుల రామలింగశాస్త్రి 'దూదేకుడు'లో ఆలపాటి కామేశ్వరరాయ కవి ప్రభృతులు ఆక్షేపించినా ఆ ఆటుపోటులను తట్టుకొని నేటికీ ఏదో రూపంలో కనిపిస్తున్న భావకవిత్వం తన ప్రాముఖ్యాన్ని రుజువు చేసుకొంది. ఇంతకీ భావకవిత్వానికి ఆ పేరు పెట్టింది గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

సినిమాలలో భావగీతాలు రాకముందే - గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బసవరాజు అప్పారావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, నండూరి సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి ప్రభృతులు వాసిగల భావకవిత్వాన్ని రాసి లబ్ధప్రతిష్ఠు లయ్యారు. వీరిలో శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి విస్తృతంగానూ, తల్లావఝుల, దువ్వూరి, వేదుల, విశ్వనాథ పరిమితంగానూ - నేరుగా సినిమాపాటలు రాయగా, గురజాడ, రాయప్రోలు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు మొదలైనవారి భావగీతాలను సినిమాలలో

1. ఆతిథ్యము - భారతి 1962
2. విశ్వం ప్రేమగీతాల సమీక్ష-భారతి-1931
3. మహాప్రస్థానం. పుట. 10



ఉపయోగించుకొన్నారు. 'బంగారుమామ పాటలు' రాసిన కొనకళ్ల వెంకటరత్నం, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' రచించిన శంకరంబాడి సుందరాచారి - పాటలు కొన్ని సినిమాలలో వాడుకోగా ఒకటి రెండు సినిమాలకు వీరిద్దరూ పాటలు రాశారు కూడా. సినిమాల్లో భావగీతాల శకం బసవరాజు అప్పారావు పాటలతోనే ప్రారంభమైంది.

## లలిత గీతాలు :

లలితగీతమనే పదం లలితసంగీతం ద్వారాను, లలితసంగీతం అనే పదం ఆకాశవాణి ద్వారాను వ్యాప్తిలోకి వచ్చాయి. 1942లో ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుంచి 'గీతావళి' పేరుతో లలితగీతాల ప్రసారం ప్రారంభమైంది. 1950 తర్వాత గీతావళికి హిందీలోని 'సుగమ్ సంగీత్' ప్రభావంవల్ల లలితసంగీతం పేరు స్థిరపడింది. మద్రాసు కేంద్రంలో లలితసంగీత కార్యనిర్వాహకునిగా పనిచేసిన బాలాంత్రపు రజనీకాంతరావు నాటి ప్రసిద్ధకవుల భావగీతికలకు స్వరకల్పన చేసి గీతావళి కార్యక్రమంలో ప్రసారం చేసేవారు[4]. టంగుటూరి సూర్యకుమారి, శాంతకుమారి, యస్. వరలక్ష్మి, భానుమతి, సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల, యం.యస్. రామారావు, జె.వి. రాఘవులు మొదలైన సినిమారంగంలో సుప్రసిద్ధులైన గాయనీ గాయకులంతా ఆనాడు ఆకాశవాణిలో లలిత సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నవారే ! టంగుటూరి సూర్యకుమారి, 'మామిడి చెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటీ', 'ఒంటిగానుయ్యాల లూగితివా? నాముద్దుకృష్ణా...' మొదలైన గీతాలనూ, బందా కనకలింగేశ్వరరావు - 'గుత్తొంకాయ కూరోయ్ బావా', 'పన్నెండేళ్ల చిన్నాడే పైట కొల్లగొన్నాడే', 'ఎల్లాగెక్కువా ఇంకెల్లాగెక్కువా' మొదలైన గీతాలనూ పాడి బసవరాజు అప్పారావు గీతాలకు గ్రామఫోనురికార్డుల ద్వారా విశేష ప్రచారాన్ని కల్పించారు. కృష్ణశాస్త్రి తన గేయాలనేకాకుండా గురజాడ నుంచి శ్రీశ్రీ వరకూ ప్రసిద్ధులైన అనేక అధునికకవుల భావగీతాలను బరంపురం నుంచి బళ్లారి వరకు ఆంధ్రదేశమంతటా అనేక సభల్లో తనకు లొంగిన నాలుగైదు రాగాల్లో గానం చేశారు.[5]

దేవులపల్లి కృష్ణశాస్త్రి సినిమాపాటల్లో అనేకం ముందుగా ఆకాశవాణిలో లలితగీతాలుగా ప్రసారమైనవే! వీటిలో కొన్ని ఆయన బ్రతికివుండగా వస్తే ఎక్కువగా మరణానంతరం వచ్చాయి.

'ఏమి రామకథ శబరీ శబరీ...' (భక్తశబరి)
'పదములె చాలును రామా (బంగారు పంజరం)

4. బాలాంత్రపు రజనీకాంతరావుతో ముఖాముఖి 25.8.89
5. తెలుగులో లలితసంగీతం-రజని అముద్రిత వ్యాసం

**‘గట్టుకాడ ఎవరో సెట్టునీడ ఎవరో’**
**‘పాటుపోటు సూసుకొని ఏరుదాటి రావాలా’ (బంగారు పంజరం)**
**‘పువ్వునమ్మా పువ్వును - గడ్డిపువ్వును’**
**(‘బంగారు పంజరం’లో రికార్డు చేయబడి చిత్రంలో రాలేదు)**

కృష్ణశాస్త్రి జీవితకాలంలో సినిమాపాటలుగా వచ్చిన లలితగీతాలు. వీటిలో మొదటి రెండిటినీ పాలగుమ్మి విశ్వనాథం కూర్చిన రేడియో బాణీల్లోనే సినిమాలో ఉపయోగించారు. ఈ పాటను ఉపయోగించడం కోసం కథానాయకుడి తల్లి పూజామందిరం ముందు కూర్చొని పాట పాడే సన్నివేశాన్ని దర్శకులు బి.యన్. రెడ్డి కల్పించారు. ‘గట్టుకాడ ఎవరో - సెట్టునీడ ఎవరో’ ‘వేణునికుంజము’ అనే ఆకాశవాణి సంగీత రూపకం కోసం రాసిన పాట !

‘కొలువైతివా రంగశాయి’ (ఆనందభైరవి), ‘జయ జయ జయ జయ భారత జనయిత్రీ దివ్యధాత్రి’ (రాక్షసుడు)‘వెన్నెలల వేళలోనే వేణువూదేనా, వేణువూదిన వేళలోనే వెన్నెలాయేనా’ (ఒక అమ్మాయి కథ) ‘మురళీ, మధుమురళీ మురళీ మృదుమురళీ’ (పెళ్లి మీకు అక్షింతలు నాకు) మొదలైనవి కృష్ణశాస్త్రి మరణానంతరం సినిమాల్లో వచ్చిన కొన్ని లలితగీతాలు. వాటిలో - ‘జయ జయ జయ జయ భారత జనయిత్రీ’ 1933లో - కృష్ణశాస్త్రి తెలుగుశాఖలో అధ్యాపకునిగా పనిచేస్తూ - పి.ఆర్. కళాశాల (కాకినాడ) విద్యార్థుల కోసం రాయగా ఆ తర్వాత సీత, అనసూయ పాడగా ఆకాశవాణిలో - విస్తృత ప్రచారం పొందింది.[6] గూడవల్లి రామబ్రహ్మం చిత్రాల తర్వాత మళ్లీ ఒకే కవి రాసిన నాలుగు భావగీతాలను ఒక చిత్రంలో ఉపయోగించిన ఘనత ప్రముఖ దర్శకులు దాసరి నారాయణరావుకు దక్కుతుంది. ఆ చిత్రం ‘మేఘసందేశం’ (1982). అది కృష్ణశాస్త్రికి అంకితం యివ్వడం తెలుగు సినీకవులకు మొదటిసారి దక్కిన గౌరవం. అందుకు దాసరి నారాయణరావును అభినందించాలి. ‘మేఘసందేశం’లో ‘ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై’ ‘సిగలో అవి విరులో ఉపయోగించగా ‘ముందు తెలిసెనా ప్రభూ’ రెండు పాఠాంతరాలను పాలగుమ్మి పద్మరాజు కథానుగుణంగా సమన్వయించగా ఉపయోగించారు. ‘శీతవేళ రానీయకు’... రికార్డయి సినిమాలో రాలేదు. 1938లోనే కృష్ణశాస్త్రి బ్రహ్మసమాజం కోసం రాసిన - ‘నానోట నీమాట గానమయ్యేవేళ’కు ఆత్రేయకు చాలా యిష్టమైన స్వీయరచన ‘నాపాట నీనోట పలకాలి’ యాదృచ్ఛిక సామ్యం కావచ్చు. ఒకవేళ కృష్ణశాస్త్రి పాట ప్రభావం ఆత్రేయ పల్లవిమీద

6. బుజ్జాయితో ముఖాముఖి



వుంటే - అది ఒక లలితగీతం ఒక గొప్ప సినిమాపాట పుట్టుకకు చేసిన దోహదానికి గుర్తవుతుంది.

ఆరుద్ర పాటలు - ‘పడుచుదనం రైలుబండి పోతున్నది - వయసువాళ్ల కందులో చోటున్నది’ (పెంకిపెళ్లాం), ‘సిగ్గులు చిగురించెనే బుగ్గలు ఎరుపెక్కెనే[7] (వీరకంకణం) ఈ రెండూ ముందుగా ఆకాశవాణి మద్రాసు కేంద్రంవారి ‘తమాషాలూ - తారాజువ్వలూ’ (1955) కార్యక్రమంలో ప్రసారమైన లలితగీతాలు. జగ్గయ్య, జానకి, రమణారెడ్డి, కృష్ణకుమారి, రామశర్మ, వల్లం నరసింహారావు ప్రభృతులు పాల్గొన్న ఆ కార్యక్రమంలో వున్న అయిదారు పాటల్లో పై రెండూ సినిమాపాటలుగా వచ్చాయి.[8]

సి. నారాయణరెడ్డి పాట ‘మబ్బులో ఏముంది’ (లక్షాధికారి) ‘కలువపూల చెంతచేరి కైమోడుపు సేతును’ (ఏకవీర) ముందుగా లలితగీతాలుగా ప్రసారమైనవే. ‘తెలుగు జాతి మనది - నిండుగ వెలుగు జాతి మనది’ (తల్లా-పెళ్లామా) ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సమయంలో సమైక్యతను ప్రబోధిస్తూ రాసిన గేయం.

**‘తరం మారుతున్నది ఆ**
**స్వరం మారుతున్నది**
**‘వందేమాతరం’ గీతం**
**వరస మారుతున్నది’**

అంటూ బంకించంద్ర ‘వందేమాతరం’ జాతీయగీతంలోని ఆశయాలు 1985 కు ఎలాంటి వికృత స్థితికి చేరుకొన్నాయో వివరిస్తూ సి.నా.రె. కొన్నేళ్లు ముందుగానే అధిక్షేపాత్మకగీతంగా రాయగా, ప్రజానాట్యమండలి వారు స్వరపర్చగా, దీనిని శ్రీనివాస్ అనే గాయకుడు అనేక సభల్లో పాడి ప్రజాదరణను పొందాడు. ఆ పాటే వందేమాతరం (1985) చిత్రంలో చక్రవర్తి సంగీత దర్శకత్వంలో శ్రీనివాస్ స్వరంలోనే సినీతీర్థాన్ని సేవించి ఆ గాయకుణ్ణి ‘వందేమాతరం శ్రీనివాస్’ గా చిత్రసీమలో నిలిపింది.[9]

‘మంచుకన్న చల్లనైన మనసులెవరికున్నవి - మంచిని ప్రేమించి - పెంచు మమతలెవరికున్నవి’ ముందుగా యస్వీ. భజంగరాయశర్మ తమ విద్యార్థుల కోసం రాయగా లలితగీతంగా ప్రచారం పొంది - ఆకాశవాణిలో ప్రసారమైందే.’

7. హైదరాబాద్ దూరదర్శన్‌లో మరొకరి పేరుతో ప్రసారమయింది.
8. ఆరుద్రతో ఇష్టాగోష్ఠి 14.1.92
9. పాటలో ఏముంది - నామాటలో ఏముంది రెండోభాగం - పుట 392

‘గోరింటాకు’ చిత్రంలో వేటూరి రాసిన ‘కొమ్మ కొమ్మకో సన్నాయి - కోటిరాగాలు వున్నాయి’ గీతానికి కృష్ణశాస్త్రి లలిత గీతం -

**1. మధూదయంలో మంచి ముహూర్తం**
**మాధవీలతకు పెళ్లి** పాటలోని

**కొమ్మకొమ్మకొక సన్నాయి**
**రెమ్మ రెమ్మకొక గవాయి** పంక్తులు ప్రేరణ

‘ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారతము; ఉదయమ్మాయెనొహో’, ‘మాదీ స్వతంత్ర దేశం, మాదీ స్వతంత్ర జాతి, మొదలైన రజని లలితగేయాలు, ఇతర కవుల లలితగీతాలు - అనేక చలనచిత్ర గీతాలకు స్ఫూర్తినిచ్చాయి. ఆకాశవాణిలో పనిచేసిన రజని వంటివారు చలనచిత్రాలకు సంగీత దర్శకత్వం వహించడంవల్ల - ‘ఓ నా సఖీ, పో నా సఖీ, ‘ఓ మలయపవనమా’ (మానవతి) వంటి సినిమాపాటలకు అపురూపరాగాలతో స్వరకల్పన జరిగింది.

ఇంతగా సినిమాపాటల్ని ప్రభావితం చేసిన లలితగీతాలు - భావకవిత్వంలో అంతర్భాగం అని చెప్పడానికి పై ఉదాహరణలు చాలు.

## బసవరాజు అప్పారావు గీతాలు :

ఎక్కువ భావగీతాలు సినిమాపాటలుగా వచ్చిన ఖ్యాతికూడా బసవరాజు అప్పారావుదే! గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వం వహించిన ఏడు చిత్రాల్లో అయిదు చిత్రాల్లో బసవరాజు పాటలున్నాయి. వాటి వివరాలు -

1. మాలపిల్ల (1938)

**(1) నల్లవాడే గొల్లపిల్లవాడే**
**(2) చిలిపిచేష్టలు జేయ చెట్టునకు గట్టిరా**
**(3) ఆ మబ్బు ఈ మబ్బు ఆకాశమధ్యాన**
**(4) కొల్లాయి గట్టితేనేమి**



2. రైతుబిడ్డ (1939)

**(1) వాయింపుమా మురళి వాయింపు కృష్ణ**
**(2) రాబోకు రాబోకురా చందమామ.**

3. ఇల్లాలు (1940)

**(1) వాడిన పువ్వున కేటికి మరలను పరిమళ మొసగెదు దేవా**
**(2) కావ్య పానము జేసి కైపెక్కినానే**
**(3) దినదినము పాపణ్ణి దీవించిపొండి.**
**(4) కోయిలొకసారొచ్చి కూసిపోయింది.**

4. అపవాదు (1941)

**(1) ఈ మావి పైనుండి ఈవు కూకూయంచు**
**(2) రావాలంటే త్రోవేలేదా దేవదేవుడా నా నాథునకు**
**(3) పానకమ్ములో పుడక నేటికిటు పడవేసితివో దేవా**
**(4) పదిమందిలోన పాట పాడుమని బలవంతము చేయకు నాథా**
**(5) వీణె చేజారి పడిపోవు (పద్యం)**
**(6) హాయిలో మున్గి మాయమై పోయినావొ (పద్యం)**

5. పంతులమ్మ (1943)

**కూయకే కోయిలా కూయబోకే...**

గూడవల్లి రామబ్రహ్మం పత్ని, (42) మాయలోకం (45) సినిమాలలో బసవరాజు పాటలులేవు. ‘దాసిగా నుంటకైన తగనా ప్రాణేశ’ అనే పాట ‘మాయలోకం’ కోసం రికార్డయింది. కాని చిత్రంలో లేదు. రామబ్రహ్మం మరణానంతరం ఇతరుల చిత్రాల్లోకూడా బసవరాజు గీతాలు వచ్చాయి.

**(1) ఏదినిజం--గుత్తొంకాయ కూరోయ్ బావా**
**కోరివండినానోయ్ బావా**
**(2) కన్యాశుల్కం--నీపుట్టదరికి నాపాపలొచ్చేరు.**

పై పాటలలో ఒక్క ‘పంతులమ్మ’లో పాట తప్ప మిగతావి యథాతథంగా సినిమాల్లో ఉపయోగించినవే. అది కూడా స్వల్పమైన మార్పులకే లోనైంది.

మాతృక : కోయిలా కోయిలా కూయబోకే
గుండెలూ బద్దలూ చేయబోకే
తీయనీ రాగాలు తీయబోకే
తీపితో నా మనసు కోయబోకే
చిట్టినీ జ్ఞాపకం చేయబోకే
చింతతో ప్రాణాలు తీయబోకే

పంతులమ్మ'లో పాట : కోయిలా కోయిలా కూయబోకే
కూసి నా గుండియలు కోయబోకే
కోయిలా కోయిలా కూయబోకే
తీయనీ రాగాలు తీయబోకే
కోయిలా రాగాలు తీయబోకే

చివరి రెండు పాదాలు కథకు అతకవనే అభిప్రాయంతో తొలగించారు. మూలంలో వున్న ద్విత్వాక్షరాన్ని తొలగించడం కోసం మిగతా పాటను అటూఇటూగా ఆ సినిమాకు కవి అయిన సముద్రాల మార్పుచేసి వుంటారు.

అంతో యింతో లబ్ధప్రతిష్ఠులైన కవుల పాటలు కూడా కొన్ని యిప్పుడు రికార్డింగ్‌లో దర్శకనిర్మాతల అభీష్టాల కనుగుణంగా మారిపోతుండగా కీర్తిశేషుడైన కవి రాసి వుంచిన పాటల్ని కూడా మార్పు చెయ్యకుండా అవసరమైతే ఆ పాటలకు తగిన సందర్భాలు సృష్టించుకోవడం ఆనాడు దర్శకులకు కవుల పట్లవున్న గౌరవాన్ని సూచిస్తోంది.

ఉదాహరణకు 'రైతుబిడ్డ'లోని పాట--

**రాబోకు రాబోకురా చందమామ**
**రాహువు పొంచున్నాడురా తోవలోన**

**ఆకొక్కటైనాను అల్లాడకున్నాది**
**మబ్బుల్ల పైనేదో మాయకప్పేసింది**
**తెల్లన్ని నీకాంతి నల్లనయ్యేనురా**
**చల్లన్ని నీమోము సన్నగిల్లేనురా... ॥రాబోకు॥**



ఇది ఏ ప్రేమగీతంలాగో అన్నిచోట్లా సరిపోయేది కాదు. దీనికోసం కథలో ఓ సన్నివేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

అలాగే అప్పటికి సముద్రాల వంటి వృత్తికవులు వ్యవహార భాషలో సినిమా పాటలు రాస్తుండగా గ్రాంథికంలో నడిచిన లలితగీతాన్ని సినిమాల్లో ఉపయోగించడం సాహసం.

ఉదాహరణకు 'అపవాదు'లోని

**పానకమ్ములో పుడక నేటికిటు**
**పడవేసితివో దేవా**

**ముద్దుగులాబిని ముట్టబోవగా**
**ముల్లు విరిగెనో దేవా**
**తీయని పూవుం దేనె లానబో**
**తేటి గుట్టెనో దేవా.**

పూవుందేనియలు, ఆనబోవుటవంటి పదజాలం అప్పటికే వాడుకలో లేనివి. అయినా సినిమాలో ఆ పాటను వినియోగించడం--భావకవిత్వం పట్ల సినీరంగానికి, ప్రేక్షకులకు వున్న మక్కువను, గౌరవాన్ని తెలియజేస్తోంది.

## శ్రీశ్రీ 'అద్వైతం'

'కన్యాశుల్కం' (1955) సినిమాలో బసవరాజు 'నాగులచవితి' గేయంతో పాటు గురజాడ 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' కవిత, 'ఇల్లు ఇల్లనియేవు' తత్త్వం, 'మహాప్రస్థానం'లోని శ్రీశ్రీ 'అద్వైతం' కవిత - యథాతథంగా ఉపయోగింపబడ్డాయి. అయితే 'మరదలుపెళ్లి' (1952) లో మాత్రం అద్వైతం పల్లవితో సహా మారింది.

మహాప్రస్థానంలోని

**ఆనందం అర్ణవమైతే--అనురాగం అంబరమైతే**
**అనురాగపుటంచులు చూస్తాం--ఆనందపు లోతులు తీస్తాం**

ఈ సినిమా పాటలో

**అనురాగం అంబరమైతే**
**ఆనందం సాగరమైతే**

స్వర్గానికి నిచ్చెన వేస్తాం
మరణానికి ప్రాణంపోస్తాం--

అనే పల్లవిగా మారింది. ఈ పల్లవిలో చివరి రెండుపంక్తులు ఆద్వైతంలోని మరో చరణంలోనివి. అద్వైతం కవితలోని మిగతా పంక్తులలోని కొన్ని మాటలతో సినిమాపాటలో కొత్త చరణాలు అవతరించాయి. సినిమాపాటకి అప్పటికే ఓ నిర్దిష్టమైన స్వరూపం ఏర్పడింది గనుక అలా కనిపించడానికి శ్రీశ్రీయే మార్పులు చేసి వుంటారు. మహాప్రస్థానంలో లేని, సినిమాలోవున్న రెండు చరణాలు యివి

**విడిపోవని వలపుల జంట**
**విరితావుల వెన్నెలపంట**
**కలగానం వినిపించాలి**
**కలకాలం వికసించాలి**
**నీమోవికి తావిని నేనై**
**నాజీవిత దేవత నీవై**
**మదిలో మధురాశల తోట**
**హృదయంలో సుఖాలపాట**

'మహాప్రస్థానం', 'ఖడ్గసృష్టి' మొదలైన అభ్యుదయ గేయాలను కూడా శ్రీశ్రీ కొన్ని సినిమాల్లో ఉపయోగించడానికి ఇలా మార్పులు చేర్పులు చేయడానికి అంగీకరించారు. వాటిని ప్రత్యేకంగా పరిశీలిద్దాం.

## గురజాడ తదితరులు :

అడుగుజాడ గురజాడదిగా సినిమాల్లో ఎన్నో దేశభక్తిగీతాలు రావడమేకాదు ఆయన రచించిన 'దేశమును ప్రేమించుమన్నా..' గీతాన్ని నవయుగ వారి 'జ్యోతి'లో- 'సొంతలాభం కొంతమానుకు పొరుగువాడికి తోడుపడవోయ్' అనే చరణం వరకు ఉపయోగించుకొన్నారు. రాయప్రోలు 'జన్మభూమి'లోని కొన్ని భాగాల్ని 'కాలచక్రం' (1940), 'అమెరికా అబ్బాయి' (1987) ల్లో ఉపయోగించారు.

**'ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురయిన**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీజాతి నిండు గౌరవము'**



పంక్తులను అనుకరిస్తూ -- 'సంసారం' (1950)లో జోలపాటలో

**'నిలుపరా నీజాతి పూర్వ శౌర్యాన్ని**
**తెలుపరా నీజాతి దివ్యతేజాన్ని'**

మొదలైన పంక్తులున్నాయి.

ఎన్నో సినిమాపాటలకు ఊపిరి అయిన 'ఎంకి పాటలు' లోని

**'ఈరేయి నన్నొల్లనేరవా రాజా --**
**ఎన్నెలల సొగసంత యేటిపాలేనటరా'**

అనే పాట 'తాసిల్దారు'లోను, కొనకళ్ల వెంకటరత్నం 'లాగరా ఐలేసా లాగరా రోడ్డు రోలరు ముందడుగై సాగరా' 'ఆడబిడ్డ'లోనూ, 'మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో మంచెకాడ కలుసుకో మరువకు మామయ్య' 'సిపాయికూతురు' (1959) లోనూ, 'అదృష్టవంతులు' (1968)లో మార్పులతోనూ (ఆరుద్ర పేరుతో) వచ్చాయి.

## భావకవితా శాఖలు :

సి. నారాయణరెడ్డి సిద్ధాంతవ్యాసం 'ఆధునికాంధ్ర కవిత్వము-- సంప్రదాయములు, ప్రయోగములు'లో భావకవిత్వాన్ని స్థూలంగా ప్రణయకవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, స్మృతికవిత్వం అని ఆరు శాఖలుగా విభజించారు. కొంతమంది అర్వాచీన విమర్శకులు దేశభక్తికవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, భావకవిత్వంలో చేరవని వాదించినా, ఈ విభజనను అధికశాతం ఆమోదించారు. అయితే ఈ సిద్ధాంతవ్యాసంలో దేశభక్తికి సంబంధించిన స్వాతంత్రోద్యమాన్ని, ఆంధ్రోద్యమాన్ని ప్రత్యేకంగా చర్చించడంవల్ల దేశభక్తి కవిత్వాన్ని ఈ శాఖల్లో చేర్చలేదు.

అలాగే 'మాలపిల్ల' వంటి చిత్రాలలో అస్పృశ్యతా నివారణం, 'వరవిక్రయం', 'పుట్టిల్లు' వంటి చిత్రాల్లో స్త్రీ జనోద్ధరణం--వీటికి సంబంధించిన సంస్కరణాత్మక గీతాలు ప్రత్యేకంగా వచ్చినా--దేశభక్తి సంస్కరణలను కలిపి ప్రబోధించిన పాటలే సినిమాలలో ఎక్కువగా వచ్చాయి.

ఉ : 'కోడలు దిద్దిన కాపురం'లో

**నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు**
**జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు (సి.నా.రె.)**

అందువల్ల సంఘసంస్కరణను కూడా దేశభక్తిలో అంతర్భాగంగా భావించి సినిమాపాటలమీద మిగిలిన నాలుగు శాఖల ప్రభావాన్ని పరిశీలిద్దాం !

## (అ) ప్రణయ కవిత్వం :

ప్రణయానికి స్నేహమనే మరోఅర్థం వున్నా, భావకవితలో అది స్త్రీ పురుషుల మధ్య ప్రేమ అనే అర్థంలోనే ఉపయోగింపబడింది. రాయప్రోలు సుబ్బారావు 'అమలిన శృంగార తత్త్వాన్ని' ఆశ్రయించినా తర్వాతి కవులు దానినంతగా అనుసరించలేదు. ప్రబంధకవుల శృంగారవర్ణనలతో మొహం మొత్తిన భావకవులు స్వేచ్ఛాప్రణయానికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చారు. దీనికి సంస్కరణోద్యమాల వల్ల ఆంగ్ల విద్యాభ్యాసంవల్ల మెరుగుపడిన యువత ప్రణయావకాశాలు కూడా దోహదం చేశాయి. ప్రణయవృత్తాంతాల్లో భావకవులు వియోగంలో వుండే వింత మాధుర్యాన్ని, పరిపాకాన్ని గ్రహించి దానికి సంయోగశృంగారం కంటె అధిక ప్రాధాన్యాన్నిచ్చారు. ఈ ప్రభావంతోనే చలన చిత్రాల్లో కూడా 60ల దశకం వరకు వియోగ విరహాలకు చెందిన పాటలు పుంఖానుపుంఖాలుగా వచ్చాయి.

ఉదాహరణకు 'వందే మాతరం' (1939) లో నాయికావియోగంతో నాయకుడు పరితపించే ఘట్టంలో--

**తరపి వెన్నెలలోన చిరునవ్వులేలా**
**పూదావిలో మత్తుమందేలా**
**మాలయమారుతంలో గిలిగింతలేలా**
**సెలయేటికి ముద్దునడలేలా?**
**జానకిలేని ఈ సౌందర్యశోభ**
**ఈ పాడు లోకమీ బ్రతుకు నాకేల?**

అనే పాట మీద దేవులపల్లి కృష్ణశాస్త్రి--

**కన్నీటి కెరటాల వెన్నెలేల**
**నిట్టూర్పు వెన్నెల్లా నెత్తావి యేల**

అనే భావగీత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అప్పటికే కృష్ణశాస్త్రి గీతం స్థానం గ్రామఫోను రికార్డుగా బహుళ ప్రచారాన్ని పొందడమే ఈ అనుసరణకు కారణం కావచ్చు. ఇలా భావకవితల్లో కనిపించే విషాదం, వియోగం, విలాపం,



పలాయనవాదం తొలినాటి సాంఘిక చిత్రాల్లోని పాటల్లో ప్రతిబింబించి, మంచి ప్రాచుర్యాన్ని పొందాయనడానికి మరికొన్ని ఉదాహరణలు

**(ఏ) పోదువో - ఓ ప్రియతమా, పయనమయే ప్రియతమా**
**నను మరిచిపోకుమా**
**కరగునులే తారకలూ, మోముదాచే రేరాజా**
**రగులునే నామదిలో**
**ఏదో తీరనిబాధ ప్రియతమా (లైలామజ్ను)**

**(బి) ప్రేమే నేరమౌనా మాపై యీ పగేలా**
**వేదనగానే మా వలపంత వేసారునా (లైలామజ్ను)**

**(సి) ఔనా నిజమేనా**
**మరతునన్న మరవలేని మమతలన్ని కలలేనా**
**రాణివాసమేగేవా, బావమాట మరచేవా... (మల్లీశ్వరి)**

**(డి) ఎవ్వరేమని విందురు ఎవ్వరేమనికందురు**
**ఈ జాలిగాథ ! ఈ విషాదగాథ ! (మల్లీశ్వరి)**

**(ఇ) అంతా భ్రాంతియేనా? జీవితాన వెలుగింతేనా?**
**ఆశా నిరాశేనా ? మిగిలేది చింతేనా (దేవదాసు)**

**'వలపెరుంగక బ్రతికి మురిసే కంటె**
**వలచి విఫలమ్మొంది విలవింప మేలురా'**

అనే బసవరాజు ప్రేమతత్త్వానికి 'ప్రేమనగర్'లో ఆత్రేయ బాణీలో రూపుదిద్దుకొన్న--

**'తెలిసీ వలచీ విలపించుటలో**
**తీయదనం ఎవరికి తెలుసు'**

పంక్తుల్ని యాదృచ్ఛికసామ్యమో, అనుసృజనమో అని భావింపవచ్చు. సంయోగ శృంగార గీతాలు భావకవిత్వంలో పరిమితంగా వస్తే సినిమాల్లో అపరిమితం.

'సుమంగళి' (1940) చిత్రంలోని 'ప్రేమమయమీ జీవనమూ' అనే పాటలో--

**ప్రేమేదైవము, దైవమె ప్రేమా**

ప్రేమయె సుఖసాధనమౌగా
కామరహితమౌ ప్రేమసాధనే
జీవన్ముక్తి మార్గమూ...

అనే పంక్తులు బసవరాజు అప్పారావు ప్రేమ తత్త్వములోని..

'ప్రేమించు సుఖముకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై'

అనే పంక్తులను గుర్తు తెస్తాయి. గుర్తింపు పొందిన సాంఘిక చిత్రాలలో మొదటి యుగళ గీతమనదగిన

| | | |
|---|---|---|
| ఆమె | : | వేణు మనోహరగానము నేనీవేళను నోచగలేదా |
| అతడు | : | చూడని నిముసము ఏడుగ తోచును - |
| | | సుదతీమణి ఏమో |
| ఆమె | : | వేణు మనోహరగానము నేనీవేళను నోచగలేదా |
| ఆమె | : | జగము సర్వమును వెగటుగదోచును |
| | | చానలేని క్షణమైనా |
| | | మనోభావములు మనము లయమై మాటలు |
| | | నోటను రావూ |
| ఆమె | : | ఆ సుధారసము ఆనగలేని ఆరటమూ బ్రతుకేనా |
| అతడు | : | ఆరటమన్నది నీకా లేక అటమట గూకెడు నాకా |
| ఇద్దరు | : | వేణు మనోహర గానము మేమీవేళను |
| | | నోచితిమాహా, ఆహా - (మాలపిల్ల-1938) |

అనే బసవరాజు రచించిన పాటలో సరళమైన భావకవితాధోరణి ద్యోతకమౌతూనే వుంది. ఇప్పటికీ భావకవితా ఛాయలు వున్న యుగళ గీతాలు వస్తూనే వున్నాయనడానికి ఓ ఉదాహరణ.

నా గొంతు శ్రుతిలోన
నా గుండె లయలోన
పాడవే పాడవే కోయిలా
పాడుతూ పరవశించు జన్మజన్మలా ... (జానకిరాముడు-ఆత్రేయ)



## ఎంకిపాటల బాణీ :

ప్రణయగీతాల్లో ఎంకి పాటలకున్న ప్రత్యేకతను గమనించిన సినిమాకవులు వీలున్న చోటల్లా ఆ బాణీలను ఉపయోగించారు. 'ఎంకి నాయుడుబావ' పేరుతో ఒక చిత్రమే వచ్చింది. 'ప్రేమనగర్' 'మయూరి' మొదలైన చిత్రాల్లోని పాటల్లో ఎంకి వైశిష్ట్యం చెప్పబడింది.

'ఎంకివంటి పిల్లలేదోయ్ లేదోయ్
ఎంకి నా వంకింక రాదోయ్ రాదోయ్'

అని నండూరి రాసిన పాటకు - 'పల్లెటూరిపిల్ల' (1950) సినిమాలో -

శాంతవంటి పిల్లలేదోయ్ లేదోయ్
జగమంత వెదికిన లేదోయి లేదోయి
మనసు మెత్తని వెన్న గుణములన్నిట మిన్న
గర్వమన్న సున్న కలికి రూపముగన్న

అనే తాపీ ధర్మారావు అనుకరణ రచన, పైపాట ప్రాచుర్యాన్ని దృష్టిలో పెట్టుకొని కావాలని చేసినట్టు అనిపిస్తోంది.

అలాగే -

దూరాన నారాజు కే రాయిడౌనో
ఈరోజు నారాత లేరాల పాలో

అనే ఎంకిపాటకు 'పల్లెపడుచు' చిత్రంలోని -

నను చేరడేలనే నారాజు
గడువేల మీరెనో ఈ రోజు - అందమైన అనుసరణ.

'రాజమకుటం' లో కృష్ణశాస్త్రి పాట -

'సడిసేయకేగాలి సడిసేయబోకే
బడలి ఒడిలో రాజు పవళించేనే
సడి సేయకే'.... - లో కూడా

'లేపకే నా యెంకి లేపకే నిదరా
ఈ పాటి సుకము నేనింతవరకెరగనే'

అనే ఎంకిపాట ఛాయ కనిపిస్తుంది

ఇంకా 'దాగుడుమూతలు' చిత్రంలో - 'ఎంకొచ్చిందోయ్ మామా' 'ఏది నిజం'లో 'నారాజు రాడాయెనే' మొదలైన పాటలు ఎంకిపాటల స్ఫూర్తితో రాసినవే.

## (ఆ) ప్రకృతి కవిత్వం :

భావకవితలో ప్రకృతిసౌందర్యానికి పరవశించడం, ప్రకృతితో సుఖదుఃఖాలు నివేదించుకొనడం, ప్రకృతిని దేవతగా పరిగణించడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రకృతి భావకవులకు అనేక రూపాల్లో సాక్షాత్కరించి వారి కవితాశక్తికి పదును పెట్టింది. గ్రామీణ ప్రకృతి చిత్రణం, పర్వదిన వర్ణనం - ఈ శాఖలోని అంతర్భాగాలే.

మల్లవరపు విశ్వేశ్వరరావు 'వచ్చె చైత్రమాసము వాసంత విలాసనము' బసవరాజు అప్పారావు - 'మామిడి చెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటి' బాపిరాజు 'ఉప్పొంగిపోయింది గోదావరి' మొదలైనవి ప్రకృతివర్ణనతో కూడిన ప్రసిద్ధమైన భావకవితలు. చలనచిత్రాల్లో కూడా ప్రకృతికవిత్వం అత్యున్నత శిఖరాల నధిరోహించిందనడానికి ప్రాచీన వర్తమాన దశలనుంచి రెండు ఉదాహరణలు -

**మాధవిని పున్నాగమెంతో**
**మన్ననల పెండ్లాడ వచ్చెను**
**వీణమీటవె మల్లికా**
**పాటపాడవె మాలతీ** **(పత్ని-1942)**

2. **తెలిమంచు కరిగింది తలుపుతీయనా ప్రభూ...**
**ఇలగొంతు వణికింది పిలుపు నీయనా ... ప్రభూ**
**నీదోవ పొడవునా కువకువల స్వాగతము**
**నీకాలి అలికిడికి మెలకువల వందనము**

**ఈపూల రాగాల పులకింత గమకాలు**
**గారాబు కవనాల గాలి సంగతులు**
**నీచరణ కిరణాలు పలుకరించినా చాలు**



**పల్లవించును ప్రభూ పవళించు భువనాలు**
**(సీతారామశాస్త్రి-స్వాతికిరణం 1992)**

భావకవులు ఉగాది, దీపావళి, సంక్రాంతి మొదలైన పండుగలమీద గేయాలు రాసినట్టే - సినిమాకవులు కూడా వాటి మీద దండిగానే పాటలను రాశారు.

'పక్కింటి అమ్మాయి' (53)లో ముద్దుకృష్ణ- 'వసంతకాలం వచ్చింది, వరుడికి వధువును కూర్చింది' 'విచిత్రబంధం'లో ఆత్రేయ - 'చీకటివెలుగుల రంగేళి, జీవితమే ఒక దీపావళి' మొదలైన పాటలు పైవాటికి ఉదాహరణలు.

పల్లెపట్టుల అందచందాలు భావకవితల్లో కంటె సినిమా పాటల్లోనే, ఎక్కువగా ప్రతిబించాయి. చలన చిత్రాల్లో పల్లెకుగల ప్రాధాన్యాన్ని నిరూపించే ఇతివృత్తాలతో 'పల్లెటూరు', 'పల్లెటూరిపిల్ల', 'పాడి పంటలు', మొదలైన సినిమాలే రాగా, పాటల్లో గ్రామీణ వాతావరణం చోటుచేసు కోకుండా వుంటుందా ?

**ఆనందమౌగా పల్లెసీమ, మా పల్లెసీమ** **(జీవితం)**

**పల్లెసీమలు అందమోయీ, ఆనందమోయి** **(పల్లెటూరి పిల్ల)**

మొదలైన పాటల్లో నాటి పల్లెలసొగసులు తొంగిచూస్తే ఇటీవలి చిత్రాల్లో మల్లెమాల పల్లె అందాలకు చాలా పాటల్లో బొమ్మకట్టారు.

ఉ : **గోరంతదీపం తుమ్మెదా**
**కొండకే ఎలుగంట తుమ్మెదా**
**పచ్చపచ్చని చేలు తుమ్మెదా**
**పల్లెకే ఎలుగంట తుమ్మెదా**
**మెళ్లోన ఏలాడు నల్లపూసల తాడు**
**ఇల్లాలి కెలుగంట తుమ్మెదా**

ప్రకృతి పేరు చెపితే పులకించే కవులు ప్రణయాన్ని ప్రకృతిని మేళవించి పాటలతోపాటు పద్యాలు కూడా రాశాలు. భావకవితా పరిమళం పద్యాల్లో కూడా ఎలా గుబాళించిందో తెలియడానికి మచ్చుకి ఒక పద్యం -

**లలిత శరదిందు రేఖల పలుకరించి**
**కన్నెవిరజాజి తావుల కలలు పండి**

వలపు సెలయేటి కెరటాల జలకమాడి
ఎగిరి వచ్చిన వనకన్యవేమో నీవు...

(కొంగర జగ్గయ్య - కన్నకొడుకు)

పై ఉదాహరణలను పరిశీలిస్తే ఇలాంటి సందర్భాలలో ఆధునికుల భావనల్లో వున్నంత వైవిధ్యం పాతతరం తలపోతల్లో లేదనిపిస్తోంది. పాశ్చాత్య సంగీత వ్యామోహం వల్ల ఆధునికకవుల మనోహరమైన కల్పనలు వినిపించని కాలంలో కూడా అప్పుడప్పుడూ-

కొండా కోనల్లో లోయల్లో
గోదారి గంగమ్మ పాయల్లో
కోరికోరి కూసింది కోయిలమ్మా... ఈ కోయిలమ్మా..

ఝుమ్మని తుమ్మెద తియ్యంగా కమ్మనిరాగం తీయంగా
జాజిమల్లె సంపెంగ - జానపదాలే నింపంగ
చెట్టూ పుట్టా నెయ్యంగ - చెట్టాపట్టా లెయ్యంగ
చిలకా పలుకులు చిత్రంగా - చిలికే తేనెలు చిక్కంగా

ఏటిపాట లాలించంగా
తోటతల్లి లాలించంగా
స్వరాలన్నీ దీవించంగా... సావాసంగా

(వెన్నెలకంటి - స్వాతికిరణం)

అంటూ హాయిగా కొన్ని పాటలైనా వినిపించడం.. ప్రకృతి కవిత్వం చిత్ర పరిశ్రమమీద వేసిన బలమైన ముద్రకు నిదర్శనం.

### (ఇ) భక్తి కవిత్వం :

భావకవులలో భక్తికవితల మీద దృష్టి సారించినవారు తక్కువ. వెంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంతసేవ' కృష్ణశాస్త్రి 'అన్వేషణము', బసవరాజు 'రాధికాగీతము', వేదుల 'రాధ' మొదలైనవి మధురభక్తి శాఖకు చెందిన ప్రసిద్ధ రచనలు.

నీ పుట్ట దరికి నా పాపలొచ్చేరు
పాపపుణ్యముల వాసనేలేని
బ్రహ్మస్వరూపులౌ పసికూన లోయి



కోపించి బుస్సలు కొట్టబోకోయి
నాగుల చవితికి నాగేంద్ర నీకు
పొట్టనిండా పాలుపోసేము తండ్రి

అని 'బసవరాజు' నాగేంద్రుని ప్రార్థించే పాట - 'కన్యాశుల్కం' లో వచ్చింది.

భక్తిగీతాలు భావకవిత్వంలో కంటె - సినిమాల్లోనే అధికంగా వచ్చాయి. తులసీగౌరీలక్ష్మీస్తోత్రాలు, వేంకటేశ్వర వేణుగోపాల ప్రార్థనలు ప్రథమార్ధంలో చలన చిత్రాల్లో ఒకే మూసలో అసంఖ్యాకంగా వచ్చాయి.

శ్రీ తులసీ జయతులసీ
జయము నీయవే (పింగళి-'గుణసుందరికథ' 49)

శ్రీతులసీ అమ్మా శ్రీతులసీ
నీదె గాదా ఈ దయయంతా (తాపీధర్మారావు- 'ప్రజాసేవ' 52)

తల్లీ తులసీ, దయగనుమ్మా
కొల్లగ నిన్నే కొలిచెదమమ్మా
(ద్రైతాగోపాలం 'శ్రీకృష్ణతులాభారం' 55)

తల్లీ తులసీ, ఓ కల్పవల్లీ (అనిసెట్టి, వదినగారి గాజులు' 55)

కాపాడవమ్మా తులసీ
మాపైన జాలివెలసీ
కరుణింపవమ్మా కల్పవల్లీ
(సముద్రాల (జూ) 'బాలసన్యాసమ్మ కథ' 56)

అమ్మా తులసీ, నీ కృప తెలిసీ
నిను నే కొలిచితినమ్మా (శ్రీశ్రీ-'అక్కాచెల్లెళ్ళు' 57)

మాతా తులసీ, మహిమను వెలసి
ఈరేడు లోకాలు కాపాడవే (ఆరుద్ర, 'సతీతులసి' 59)

ఇంకా మిగిలిపోయిన తులసీదళాలు ఎన్నో... !

ఉత్తరార్ధంలో వచ్చిన సినిమాల్లో భక్తిగీతాల్లో వైవిధ్యం కోసం ప్రయత్నించారు. కేవలం స్తోత్రపాఠాలు కాకుండా కవిత్వానికి చోటు కల్పించారు.

ఉదాహరణకు -

1. **రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా**
**(ఆరుద్ర, గోరంతదీపం)**

2. **పాడెద నీ నామమే గోపాలా (దాశరథి, అమాయకురాలు)**

3. **ఓం నమశ్శివాయ, చంద్రకళాధర సహృదయా..**
**(వేటూరి, సాగర సంగమం)**

ఇంకా - **కరుణించు మేరిమాతా, శరణింక మేరిమాతా... (మిస్సమ్మ)**

వంటి క్రైస్తవ భక్తిగీతాలు సినిమాపాటలు కావడంవల్లే విశేష ప్రచారాన్ని పొందాయి.

## (ఈ) స్మృతి కవిత్వం :

ఆంగ్లంలో 'ఎలిజీ'ల ప్రేరణతో తెలుగులో భావకవితాయుగంలోనే ఈ స్మృతికవిత్వం ఆవిర్భవించింది. ఆప్తస్మృతి, గతవైభవ సంస్మరణ, గతకాల స్ఫురణ- స్మృతి కవిత్వంలోని వివిధాంశాలు...

భావకవితలలో తలమానికమైన స్మృతి కవిత బసవరాజు పుత్రవియోగ గీతం-

1. **వేదాద్రి శిఖరాన వెలిగున్న జ్యోతి**
**మినుకు మినుకుమని కాసేపు కునికి పోయింది**

ప్రపంచ కావ్య భాండారంలోని గొప్పపంక్తుల్లో నిలుస్తుందని కృష్ణశాస్త్రి అభిప్రాయం.

సినిమాల్లో ఈ రకమైన స్మృతి గీతాలకు అవకాశం తక్కువ. వాహినీవారి 'వందేమాతరం' లో సముద్రాల పద్యం -

**'ఇట తెల్గు కవికోటి నృపుల కైదండతో**
**ఏనుగులెక్కి యూరేగినారు...'**

విశ్వనాథ 'వేంగీ క్షేత్రాన్ని' గుర్తుతెచ్చే గతవైభవ స్మృతి గీతం.

**శిలలపై శిల్పాలు చెక్కినారు (మంచి మనసులు- ఆత్రేయ)**
**మహాబలిపురం మహాబలిపురం... (బాలరాజు కథ - ఆరుద్ర)**

మొదలైనవి సినిమాల్లో ప్రాచుర్యం పొందిన స్మృతి గీతాలే.



సినిమాల్లో స్మృతిగీతాలు మరో రూపంలో ఎక్కువగా వచ్చాయి. నాయికా నాయకులు ఆనందంగా గడిపిన పర్వమో, ఆ సందర్భమో తిరిగి విషాద పరిస్థితులలో వస్తే వాళ్ళెలా స్పందిస్తారో భావిస్తూ రాసిన స్మృతిగీతాలు సినిమాల్లో కోకొల్లలుగా ఒకే మూసలో వచ్చాయి. అలాంటి బొమ్మా బొరుసూ పాటల్లో 'షావుకారు'లో సముద్రాల రచన మొదటిది. అందరికీ తెలిసిన మరో ఉదాహరణ - 'దసరాబుల్లోడు'లో ఆత్రేయ రచన

**చేతిలో చెయ్యేసి చెప్పుబావా**
**చేసుకున్న బాసలు చెరిగిపోవనీ**
**మరచిపోవనీ...**

అని బాస చేయించుకొన్న అమ్మాయి - విధి ప్రతికూలించడంతో అతను దూరం కాగా -

**చేతిలో చెయ్యేసి చెప్పు బావా**
**చేసుకున్న బాసలు**
**చెప్పుకున్న ఊసులు**
**చెరిపి వేస్తానని, మరచిపోతానని...**

అని తొలినాటి బాసలను గుర్తుచేస్తూ - కుమిలిపోవడం...

ఏతావతా ఫలానా సినిమాపాట మీద ఫలానా భావగీత ప్రభావముంది అని మాత్రమే కాకుండా, స్థూలంగా చూస్తే భావకవిత్వం సినిమాసాహిత్యాన్ని బహుధా ప్రభావితం చేసినట్టు స్పష్టమవుతోంది.

సాహిత్యపరంగా సినిమాపాటను సుసంపన్నం చేసి మళ్ళీమళ్ళీ పాడుకొనే పాటలకు కారణభూతమైన భావకవిత వ్యాపారభూతానికి భయపడి తెరచాటుకి వెళ్లిపోయింది. అభిరుచివున్న ఏ కొద్దిమంది దర్శక నిర్మాతలకో తప్ప - మిగతా వాళ్లకి సినిమాపాటల్లో శబ్దాల గలగలలు తప్ప సాహిత్యం అక్కరలేని కాలంలో చైత్రవనంలో అరుదుగా తప్ప కోయిల కూజితాలు వినిపించడంలేదు.

## 2. జాతీయోద్యమం :

సినిమా కేవలం వ్యాపారప్రక్రియే కాదు - అది కూడా ఇతర సాంస్కృతిక కళలతోపాటు కొంత నైతికబాధ్యత వహించిందని చెప్పడానికి జాతీయతా స్ఫూర్తిగల సినిమాపాటలే నిదర్శనం. ఆ మాటకొస్తే జాతీయ సమైక్యతకు భాషాభేదాలు లేకుండా

సర్వులూ ఆదరించే సినిమాకంటె గొప్ప సాధన మేముంది? స్వాతంత్ర్యం రాకపూర్వం దేశంలో అందరి ధ్యేయం అదొక్కటే. ఆ తర్వాత ఆ పేరు చెప్పి ఎవరి స్వార్థం వాళ్లు చూసుకొనే వాళ్లెక్కువయ్యారు. సినిమాలు కూడా దీనికి అపవాదం కాదు- స్వాతంత్ర్యానికి ముందు సాంఘిక చిత్రాలతో పాటు జానపద పౌరాణిక చిత్రాలలో కూడా కావాలని ఏదో సన్నివేశం కల్పించి స్వాతంత్ర్యస్ఫూర్తి గల గీతాలను రాయించారు. స్వాతంత్ర్యానంతరం ఆ స్ఫూర్తిగల పాటలు సినిమాల్లో ఎక్కువగా వచ్చినా, అప్పటి నిబద్ధత, నిజాయితీ కనిపించవు. ఇప్పటి ప్రయోజనం, దృష్టి కోణం వేరు.

జాతీయోద్యమకాలంలో తెలుగునాట అసామాన్యమైన ప్రచారాన్ని పొందిన దేశభక్తి గేయాల ప్రభావం స్వాతంత్ర్యానికి ముందూ వెనకా వచ్చిన సినిమా పాటల మీద వుంది. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాన్ని విని ఉత్తేజితులై చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన పద్యం -

**భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి -**

ఆంధ్రదేశమంతటా సంచలనం కలిగించింది. ఆ పద్యస్ఫూర్తి- చాలాకాలం తర్వాత 'ప్రజానాయకుడు' చిత్రంలో కొసరాజు రాసిన -

**'భరతదేశం సక్కని పాడియావురా**
**అడిగినన్ని పాలిచ్చే అమ్మతల్లిరా'**

అనే పాటలో కనిపించింది.

కొసరాజు రాసిన మరో సినిమాపాట -

**వీరగంధము తెచ్చినామయా**
**వీరులెవరో లేచిరండయా**
**శూరు లెవరో లేచిరండయా**
**వీరగంధము పూసుకొంటాం**
**వీర రక్తము ధారపోస్తాం**
**ప్రతాపరుద్రులు బాలచంద్రులు**



**ఖడ్గతిక్కనలు కాటం రాజులు**
**పటు పరాక్రములు పాపారావులు**
**జన్మించిన యీ జాతివీరులం ... (జయం మనదే)**

త్రిపురనేని రామస్వామిచౌదరి ఉప్పుసత్యాగ్రహ సందర్భంగా రచించి మొదటిసారి గుంటూరులో నాలుగురోడ్ల కూడలిలో వినిపించిన పాట స్ఫూర్తితో రాసింది! ఆ పాట -

**వీరగంధము దెచ్చినారము**
**వీరుడెవ్వడో దెల్పుడీ**
**పూసిపోదుము, మెడను వైతుము**
**పూలదండలు భక్తితో**

**తెలుగుబావుట కన్ను చెదరగ**
**కొండవీటను నెగిరి నప్పుడు**
**తెలుగు వారల కత్తిదెబ్బలు**
**గండి కోటను కాచినప్పుడు**
**... ... ... ...**
**ఇదిగోయున్నది వీరగంధము**
**మైనలందుము మైనలందుము**
**శాంతిపర్వము జదువ వచ్చును**
**శాంతి సమరంబైన పిమ్మట**
**తెలుగునాటిని వీరమాతను**
**జేసి మాత్రము తిరిగి రమ్మిక**
**పలుతుపాకులు పలుఫిరంగులు**
**దారికడ్డము రాకతప్పవు ॥వీర॥**

'మాలపిల్ల' చిత్రంలో స్వల్పమైన మార్పుతో వచ్చిన బసవరాజు అప్పారావు గీతం ఆనాడు యింటింటా వినిపించింది.

**కొల్లాయి గట్టితేనేమి - మా గాంధి**
**కోమటై పుట్టితేనేమి**
**వెన్నపూసా మనసు కన్నతల్లి ప్రేమ**

**పండంటి మోముపై బ్రహ్మతేజస్సు** ॥కొల్లాయి॥

**నాల్గుపరకల పిలక నాట్యమాడే పిలక**
**నాలుగూ వేదాల నాణ్యమెరిగిన పిలక** ॥కొల్లాయి॥

**బోసినోర్విప్పితే ముత్యాల తొలకరే**
**చిరునవ్వు నవ్వితే వరహాల వర్షమే** ॥కొల్లాయి॥

**చకచక నడిస్తేమ జగతి కంపించేను**
**పలుకు పలికితేను - బ్రహ్మవాక్కేను** ॥కొల్లాయి॥

ఆనాటి కవులు స్వాతంత్రోద్యమాన్ని, గాంధీని వేరుగా చూడలేదనడానికి పైపాట నిదర్శనం.

జాతీయోద్యమానికి సంబంధించిన సినిమాపాటల్లో నాలుగు అంశాలు చోటు చేసుకొన్నాయి - దేశభక్తి, స్వాతంత్ర్యం, గాంధీ, చరఖా. కొన్ని సినిమా పాటలు ఒక్కొక్క అంశానికే పరిమితమైతే మరికొన్ని రెండు మూడు విషయాల్ని అనుసంధించాయి.

'బాలయోగిని' లో -

**వందే వందే భారతమాతా**
**భారతమాతా భాగ్యోపేతా**
**ధర్మసమేతా నిర్మలచరితా**
**స్వర్గవిలాసం భారతదేశం**
**అమృతకుధరం ఆర్య వితరణం**
**భళిభళి మా భారతమాత -**

కేవలం దేశభక్తికి సంబంధించిన గీతానికి ఉదాహరణ.

'మదాలస' అనే పౌరాణిక చిత్రంలో స్వాతంత్ర్యకాంక్షను తెలియజేసే పాట వుంది. మదాలస సఖి అయిన కుండల పాతాళలోకంలో బంధింపబడిన సన్నివేశం కోసం ఈ పాటను రాయించారు.

**స్వాతంత్ర్యము కన్న స్వర్గలోకము లేదు**
**పారతంత్ర్యము కన్న నరకంబు మరిలేదు**
**పరుని యింట భుజియించు పాయసాన్నముకన్న**



**తన యింటనే యింత గంజియైనను మేలు**

'మనదేశం'లో -

**జయహో జయహో మహాత్మాగాంధీ**
**జయ విజయీభవ భారత ధాత్రీ ...**

మహాత్మునిపై రాసిన మరోపాట కాగా - 'ద్రోహి'లో కథానాయిక మరణం మీద చిత్రీకరించిన పాటకు గాంధీ నిర్యాణం స్ఫూర్తి.

**ధన్యవహో ధన్యవహో మాతాసీతా**
**మరణించినమూ చిరంజీవివహో**
**సత్యమహింసయే శాశ్వత సుఖమని**
**స్వాతంత్ర్యానికి రాజమార్గమని**
**సకల లోకముల శాంతిమూలమని**
**చావున కూడా చాటి చెప్పితివే**

అనే ఈ పాటలో గాంధీ సిద్ధాంతాలు, త్యాగం ప్రతిబింబిస్తున్నాయి.

'ముగ్గురు మరాఠీలు' చిత్రంలో గొల్లపిల్లపాత్ర కోసం రాయించిన పాట-

**వడకుమా రాట్నమూ భారతనారి కవచమూ**
**యదుపతి చే ధరియించే సుదర్శన మీరాట్నమూ**

'జయప్రద' చిత్రంలో చరఖా తిప్పే స్త్రీలతో కలిసి జయప్రదాపురూరవులు పాడే పాట -

**మనుజాళికి నీధరణీపథానా కల్పనాభూరూహమే**
**హైందవ జాతికి జీవనమార్గము**
**రాట్నరమాసతి రహి క్షుధ నార్చును...**
**రాట్నము కాదు - సుదర్శన చక్రము**
**రాట్నము త్రిప్పుడు జనులారా ...**

జానపద పౌరాణిక చిత్రాలలో కావాలని పెట్టిన రాట్నంమీద పాటలు.

అయితే స్వాతంత్ర్యానికి పూర్వం జాతీయతాభావాన్ని ప్రబోధించిన పై

సినిమాపాటల్లో అధికశాతం సందేశాత్మకాలూ, నినాదప్రాయాలూ కావడం వల్ల - అవి ఎక్కువ ప్రచారాన్ని పొందలేదు.

స్వాతంత్ర్యానంతరం ఏడాది తిరక్కుండా వచ్చిన 'మనదేశం' (1949) పూర్తిగా జాతీయోద్యమ స్ఫూర్తితో తీసిన చిత్రం.

ఇందులో సముద్రాల రాసిన 16 పాటలలో- 'బొబ్బిలి పౌరుషం' బుర్రకథతో సహా

**1. వెడలిపో తెల్లదొర మాదేశము**
**యెల్లదాటి వెడలిపో**

**2. జడియకురా ధీరా సాత్త్విక రణవిజయము నీదేరా**

**3. నిర్వేదమేలా కన్నీరదేలా**
**భరత జాతి కపూర్వమౌ ఈ వేళ**

**4. జయజననీ పరమ పావనీ**
**జయజయ భారత జననీ**

**5. ఓహో భారతయువక, భారతయువకా కదలరా**

**6. జయహో జయహో మహాత్మగాంధీ**

మొదలైన పాటలన్నీ జాతీయతాభావ సంబంధులే -

'వాలిసుగ్రీవ' (1950) పౌరాణిక చిత్రంలో దేశభక్తులకు తగిన గుర్తింపులేదని సమకాలీన సాంఘిక పరిస్థితులను ప్రతిబింబించే పాటవుండడం ఆశ్చర్యం. అది ఆనాటి జాతీయతా స్ఫూర్తికి చిహ్నం.

**ఇదేనా ఫలితమిదేనా**
**ప్రజాసేవకు ఫలితమిదేనా**
**పరాభవించెదరా, మహాత్ముని బంధించెదరా**
**కన్నీళ్ల ముళ్ల కిరీటం - తెన్నులు తెలియని ఎడారి దారులు**
**ఇవేనా - దేశభక్తులకు దివ్యాభరణాలివేనా ?**
**నిత్యసత్యము నిర్మలధర్మము**
**కాలవాహినిలో కలసిపోయెనా ?** **(రచన : జంపన)**



గాంధీజీ నాయకత్వంలో దేశమంతటా శాసనోల్లంఘనోద్యమం పెల్లుబికిన నాటి సాంఘిక రాజకీయపరిస్థితుల కద్దంపట్టిన ఏకైక తెలుగుచిత్రం కొంగర జగ్గయ్య సమర్పించిన జాగృతీ చిత్ర వారి 'పదండి ముందుకు' (1962) ఆ సినిమాలో 'మార్చింగ్ సాంగ్స్' రాసిన శ్రీశ్రీ, దాశరథి స్వాతంత్రోద్యమానికి ప్రత్యక్షసాక్షులు గనుక 1930 నాటి ఆవేశపూరిత వాతావరణాన్ని ఆ పాటల్లో కళ్లకు కట్టినట్లు చిత్రించారు -

**పదండి ముందుకు పదండి తోసుకు**
**కదం తొక్కుతూ కదలండి**
**స్వరాజ్యమే మన జన్మహక్కనీ**
**సమస్త జగతికి చాటండి**
**భారత వీర ప్రజలారా, భారత వీర ప్రజలారా !**
**స్వరాజ్యవాదీ ధరించు ఖాదీ - పరాయి సరుకులు మనకేలా**
**రాటమున వడకేవారే పోరాటమున వడకరులే** **॥పదండి॥**

అని తిలక్, గాంధీల సిద్ధాంతాలను శబ్దాలంకారాలతో మేళవించి శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాన్ని గుర్తుచేసే పాటరాస్తే -

**మేలుకో సాగిపో - బంధనాలు తెంచుకో**
**బరువులూ, బాధలూ - అందరితో పంచుకో**
**పల్లనకా పట్నమనక - అందరమూ కలిసి**
**కులమనకా మతమనకా - మనం కలసిమెలసి**
**దేశాన్ని దోచుకునే తెల్లవాణ్ణి తరిమి**
**జైళ్లలోని వీరులను నేడే విడిపించుకో ...**

అంటూ దాశరథి తేటతెల్లంగా తెల్లవాడు వెళ్లేవరకు విశ్రమించవద్దని బోధించే చైతన్యగీతాన్ని రాశారు.

స్వాతంత్ర్యానంతరం అనేక సినిమాల్లో వచ్చిన దేశభక్తి గీతాలు భాషాపరంగా భావపరంగా ఉన్నత ప్రమాణాలు కలిగి - చిత్రీకరణలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం కూడా తోడుకావడంతో ఎక్కువ ప్రచారాన్ని పొందాయి.

**నమో నమో బాపు - మాకు న్యాయమార్గమే చూపు**
**(ఆరుద్ర, ఎం.ఎల్.ఏ)**

**మహాత్ముడే కలలుగన్న మరోప్రపంచం (శ్రీశ్రీ, మరోప్రపంచం)**
**మన స్వతంత్ర భారతం మహామహుల త్యాగఫలం**
**(మల్లాది - దేశద్రోహులు)**
**గాంధీ పుట్టిన దేశం, రఘురాముడు ఏలినరాజ్యం...**
**ఇది మమతకు సమతకు సంకేతం (గోపి-గాంధీ పుట్టినదేశం)**

**భారతభూమికి జేజేలు - బంగారు భూమికి జేజేలు**
**(ఆత్రేయ - బడిపంతులు)**

వంటి ఎన్నో మంచి పాటల్ని పైకోవకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు -

**'పాడవోయి భారతీయుడా - ఆడి**
**పాడవోయి విజయగీతిక**
**నేడే స్వాతంత్ర్య దినం - వీరుల త్యాగఫలం**
**నేడే నవోదయం - నీదే ఆనందం**
**పాడవోయి భారతీయుడా '**

అని 'వెలుగునీడలు' లో శ్రీశ్రీ రచించిన గీతం సినిమాల్లో వచ్చిన దేశభక్తి గీతాలలో మకుటాయమానమైంది. కానీ యుగళగీతాల వ్యామోహం ఎక్కువైన ఈ కాలంలో ఇలాంటి పాటల్ని ఎవరూ పాడించడం లేదు ; వినిపించడంలేదు!

## 3. ఆంధ్రోద్యమం :

జాతీయోద్యమం తర్వాత తెలుగు కవులు అంతగాను శివమెత్తి ఒక లక్ష్య సిద్ధికోసం కవిత్వాన్ని రాసిన సందర్భం - ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సమరమే. భాషపేరు చెపితే పరవశించే భావ కవులు -

**గోదావరీ పావనోదార వాఃపూర**
**మఖిల భారతము మాదన్న నాడు ... (విశ్వనాథ)**

**అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు**
**(రాయప్రోలు)**

వంటి పద్యాలతో అప్పటికే ఆంధ్ర పౌరుషాన్ని రేకెత్తించి వున్నారు.

శంకరంబాడి సుందరాచారి -



**'మా తెలుగు తల్లికి మల్లెపూదండ,**
**మా కన్నతల్లికి మంగళారతులు' -**

వేములపల్లి శ్రీకృష్ణ -

**చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా**
**గతమెంతో ఘనకీర్తి గలవాడా**

(ఇది పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టుపార్టీ తరపున నిర్వహించిన దేశభక్తిగీతాలలో ద్వితీయబహుమతిని పొంది, ప్రజానాట్యమండలి ప్రదర్శనల విరామసమయాల్లో ఉద్బోధగీతంగా ఆలపించబడేది)

వంటి పాటలు తెలుగు 'వాడి' ని వేడెక్కించాయి.

సినిమాలలో కూడా ఆంధ్ర రాష్ట్రావతరణానికి ముందూ వెనకా - తెలుగు తేజాన్ని ఉద్దీపింపజేసే పాటల్ని రాయించారు. అంతకు ముందే రాసిన పాటల్ని కొన్ని చిత్రాల్లో ఉపయోగించుకొన్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే ఆంధ్రసామ్రాజ్య పునర్నిర్మాణం ఇతివృత్తంగా 'కాలచక్రం' అనే సినిమాయే వచ్చింది. ఇది తెలుగుతేజాన్ని ప్రస్తరింపచేయడానికి ప్రయత్నించిన మొదటి చలనచిత్రం. దీనిలో తెలుగుజాతి అభిమానాన్ని తెలిపే ఓ పద్యం, తెలుగు పౌరుషాన్ని తెలియజేసే ఓ బృందగానం వున్నాయి. పతాక సన్నివేశంలోని ఆ పాట ఇలా సాగింది.

**రారేలా రారేలా - ఆంధ్రులింకరారేలా స్వతంత్రలోకం గనరేలా**

అతడు/ఆమె : **జననీ దాస్యపు శృంఖల యుగళము భేదింపని మనబ్రతుకేలా**
అతడు : **కాకతి వీరుల కత్తుల తళ తళ తెలుగు గుండెలే మరచినవా**
ఆమె : **తెలుగు సింగముల తీవ్ర గర్జనల్ దిగంతములు మార్మ్రోగినవే**
అతడు : **గణగణమను ఘంటారవములు దేవతలను మేల్కొల్పినవే**
అతడు/ఆమె : **త్రిలింగజననీ దివ్యపతాకం తెలుగుకోటలో నిల్పుటకే**
**తెలుగు పౌరుషం చూపుటకే తెల్గు జాతి నిర్మించుటకే**
అందరు : **రండీ ఆంధ్రులు లెండీ వీరులు...**

ఇలా తెలుగు చిత్రసీమలో 'కాలచక్రం' వేసిన వెలుగుబాటలో 'పంతులమ్మ' (1943), జీవితం (1950) మొదలైన చిత్రాల్లో కూడా ఆంధ్రజననిని స్తుతించే పాటలను రాయించారు.

1952 నాటికి ఆంధ్రోద్యమం తీవ్రరూపం ధరించింది. ఆ సంవత్సరం వచ్చిన 'పల్లెటూరు' సినిమాలో వేములపల్లి శ్రీ కృష్ణ - 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' పాటను ఉపయోగించారు. బి. గోపాలం కట్టిన చక్కని బాణీవల్ల, సినిమాలో రావడం వల్ల ఆ పాటకు అంతవరకు రాని ప్రాచుర్యం వచ్చింది. ఆ పాటతో పాటు కేవలం ఉద్యమాన్ని సమర్థిస్తూ సినిమాకోసం రాయించిన - సుంకర - వాసిరెడ్డి - పాటకూడా ఆ సినిమాలో వుంది -

**ఆంధ్రుడా లేవరా, ఆంధ్రుడా, బిరాన లేవరా**
**ఆంధ్రమాత వీరమాత యనెడిపేరు నిల్పరా ॥ఆం॥**

**శాంతిదూత అన్నదాత పల్లెటూరి రైతురా**
**జాతి గౌరవమ్ము నిలుపు సాటిలేని మేటిరా ॥ఆం॥**

**ఆంధ్ర ప్రజలు మూడుకోట్లు ఐక్యమై ఎదిర్చినా**
**బంధములను త్రెంచి, విశాలంధ్ర నిల్పగలముగరా ॥ఆం॥**

ఈ పాట మధ్యలో కథాపరమైన రైతుప్రసక్తి వచ్చిన చరణానికీ మిగతా భాగానికీ పొంతనలేదు. అందువల్ల ఆంధ్రోద్యమస్ఫూర్తిని కావాలనే ఈ పాటలో అతికించినట్లు స్పష్టమౌతుంది.

ఆంధ్ర రాష్ట్రం వచ్చిన తర్వాత -

**అమరమౌగాధా ఆంధ్రుల చరితా**
**వినవోయ్ సోదరా, తనువే పులకించేనురా (ప్రజారాజ్యం-1954)**

**పాడరా ఓ తెలుగువాడా పాడరా ఓ కలిమిరేడా**
**పాడరా మన తెలుగుదేశపు భవ్యచరితల దివ్యగీతం**
**(అంతా మనవాళ్లే-1954)**

వంటి అనేక గీతాలలో ఆంధ్ర వైభవ ప్రశస్తి వుంది.

'కన్యాదానం' (1955) చిత్రంలో కొసరాజు రాసిన నృత్యగీతంలో పొట్టి శ్రీరాముల ఆత్మార్పణ ప్రసక్తి, విశాలాంధ్ర సూచన వున్నాయి.

**ఓరి ఓరి తెలుగువాడ ఒయ్యారి తెలుగువాడ**
**దేశమంటే తెలుసుకోరా ఓ చిన్నవాడ**



**తెలివి గల్గి మేలుకోరా**
**... ... ... ...**
**ఒక్కత్రాటి మీద నడిచి ఒక్కమాట మీద నిలిచి**
**అమరజీవి శ్రీరాములు త్యాగమ్మును మదితలచి**
**విశాలాంధ్ర సాధించరా ఓ చిన్నవాడ**
**విజయభేరి మ్రోగించరా ! ఓరి ఓరి చిన్నవాడ**

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' పాటను 'పరాశక్తి' సినిమాలో ముందుగా ఉపయోగించారు. 80వ దశకంలో వచ్చిన 'బులెట్', 'తెలుగువైభవం' చిత్రాలలో కూడా ఆ పాట వచ్చింది.

అప్పట్లో 'మూడుకోట్ల ఆంధ్రులతో ముందడుగే వేయరా' అనడం పరిపాటయితే - ఆంధ్రుల జనాభా ఆరుకోట్ల పైబడిన తర్వాత వచ్చిన చిత్రాలలో

**తెలుగుజాతి మనది - నిండుగ వెలుగుజాతి మనది**
**తెలంగాణా నాది రాయలసీమ నాది**
**సర్కారునాది - నెల్లూరు నాది**
**అన్నీ కలిపిన తెలుగువాడు మనదే మనదే మనదేరా**
**(తల్లా? పెళ్లామా)**

వంటి సమైక్యతా ప్రబోధగీతాలు..

**కలసి పాడుదాం తెలుగుపాట**
**కలసి సాగుదాం వెలుగుబాట (బలిపీఠం)**

వంటి తెలుగు వెలుగుల ఘనతను చాటే పాటలు ఎన్నో వచ్చాయి.

## 4. ఎర్రపుటలు :

తెలుగు సినిమాపాటల చరిత్రలో అభ్యుదయ విప్లవ కవితోద్యమాలు ప్రేరణగా వచ్చిన ప్రగతిగీతాల అధ్యాయాన్ని ఎర్రపుటలుగా పరిగణింపవచ్చు. తెలుగు సినిమాల్లో మొట్ట మొదటిసారి ప్రభుత్వ నిషేధాజ్ఞలకు గురయిన 'రైతుబిడ్డ' ఆనాటికి విప్లవాత్మకమే అయినా అందులో ఉపయోగించిన పాటల్లో ఎక్కువ బసవరాజు అప్పారావు తదితరులు రాసిన భావగీతాలే. పాటలకు సంబంధించినంతవరకు తెలుగు సినిమాల్లో ఉపయోగించిన మొదటి విప్లవాత్మకగీతం 'కాలచక్రం'లోని శ్రీశ్రీ

మహాప్రస్థానగేయమే. 50ల దశకంలో సామ్యవాద సిద్ధాంతాల ఛాయలుగల కొన్ని పాటలు వచ్చాయి.

**మనదేనోయ్ ఈ భూమి మనదేనోయీ**
**దున్నేవాడిది భూమీ నిజమేనోయీ**
**ఎండనక వాననక పండించాలోయ్**
**పంట పండించాలోయ్**
**తిండీగుడ్డల కొరత తొలగించాలోయ్**
**కరువు తరిమేయాలోయ్**
**సమిష్టిగా వ్యవసాయం సాగించాలోయ్**
**సామ్యవాద బీజాలే వెదజల్లాలోయ్**
**(కొప్పరపు సుబ్బారావు - పేదరైతు)**

**కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడిచాన**
**బుగ్గమీద గులాబీరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా -**
**నిన్నుమించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే**
**వారిబుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరెను తెలుసుకో...**
**... ... ... ...**
**గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నదానా**
**జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా ?**
**చిరుగుపాతల బరువు బతుకుల నేతగాళ్లే నేసినారు**
**చాకిరొకరిది సౌఖ్యమొకరిది - సాగదింక తెలుసుకో**
**(ఆత్రేయ - తోడికోడళ్లు)**

... మొదలైన పాటల్ని పైన చెప్పిన తెగకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. అలాగే 50ల దశకంలోనే 'పల్లెటూరు', 'పుట్టిల్లు' వంటి అభ్యుదయచిత్రాలు కూడా వచ్చాయి. అయితే అభ్యుదయ చిత్రాలలో కూడా ప్రగతిగీతాల కంటె ప్రణయ గీతాలు ఎక్కువగా వుండడం, అలాగే అడపాతడపా ప్రగతిగీతాలు వచ్చిన చిత్రాలు అభ్యుదయ చిత్రాలు కాకపోవడం విశేషం. సినిమా కేవలం వినోదసాధనం, అది కొన్ని వ్యాపార సూత్రాలకు లోబడి వుంటుందనే అభిప్రాయంతో అప్పటి అభ్యుదయవాదులు వామపక్ష సానుభూతిపరులు పాటల్లో మార్పుకోసం పూర్తిగా సాహసించలేకపోయారు. విప్లవాత్మకచిత్రాలలో అన్నీ ఆ బాణీకి తగిన పాటల్ని రాయించడం ఎనభయ్యవ



దశకంలో నవతరం పిక్చర్స్‌తోనే ప్రారంభమైనది. ఆ ధోరణికి దోహదం చేసిన చారిత్రక నేపథ్యాన్ని సినిమాపాటలుగా వచ్చిన శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఖడ్గసృష్టి' కవితా సంకలనాల్లోని కవితల్ని ముందుగా పరిశీలించాలి.

## నిప్పురవ్వల నేపథ్యం :

తెలుగు సినిమాపాటల్లో చైతన్యగీతాలు రావడానికి మొదట అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి దోహదం చేశాయి. ఆంధ్ర అభ్యుదయ రచయితల సంస్థ చతుర్థ మహాసభల సందర్భంగా మద్రాసులో, వాణీమహల్‌లో 16.1.47 న ఆత్రేయ 'పరివర్తన' నాటకాన్ని ప్రదర్శించడానికి ఆంధ్ర ప్రజానాట్యమండలివారు మద్రాసు వచ్చారు. ఆ తర్వాత మద్రాసులో వారు 'ముందడుగు' నాటకం, 'బెంగాలు కరువు' బుర్రకథ (నాజరు దళం) వీరేశలింగం పంతులు జీవితచరిత్ర (మిక్కిలినేని దళం) కోగంటి రాసిన 'హిట్లరుభాగోతం' (వీధినాటకం) మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ప్రజల్లో మూఢాచారాలను రూపుమాపి చైతన్యవంతులను చేయడం, రెండవ ప్రపంచయుద్ధ దుష్పరిణామాలను తెలియజేయడం ఆ సాంస్కృతిక ప్రదర్శనల ముఖ్యోద్దేశం. వాటిని చూసి ఎల్.వి. ప్రసాద్, కె.యస్. ప్రకాశరావు మొదలైన సినీప్రముఖులు ప్రజానాట్యమండలి వారిని సినిమారంగానికి రావలసిందిగా ఆహ్వానించారు.

1948లో పళనియప్పన్ అనే పోలీసు అధికారి కమ్యూనిష్టులపై దాడులను జరిపి కాటూరు ఎలమర్రులలో కమ్యూనిష్టుల్ని, వారి సానుభూతిపరుల్ని నగ్నంగా ఊరేగించారు. ఇలా దేశమంతటా కమ్యూనిష్టులు బాధింపబడ్డం వల్ల ప్రదర్శనలు యిచ్చే అవకాశంలేక ప్రజానాట్యమండలిని రద్దుచేశారు. అప్పుడు ప్రజానాట్యమండలి సామగ్రిమీద దాడులు జరిగాయి. కళాకారులు చెల్లాచెదురయ్యారు. ఆ వుధృతం తగ్గిన తర్వాత తిరిగి ప్రజానాట్యమండలి సభ్యులు విజయవాడలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో 'ఆంధ్రా ఆర్ట్ థియేటర్స్' పేరుతో ప్రదర్శనలు యివ్వడం ప్రారంభించారు.

ఈ ప్రదర్శనలు ప్రజల ఆదరణకు నోచుకొన్నా, పోలీసు నిఘావల్ల, ప్రతి ప్రదర్శనకు జిల్లా కలెక్టరు అనుమతి తీసుకోవాలనే ఆంక్ష వుండి అది సకాలంలో రాకపోవడం వల్ల పోలీసులు కళాకారుల్ని హింసించడంవల్ల ప్రదర్శనలు నిలిచిపోయాయి.

ఈ నేపథ్యంలో ప్రజానాట్యమండలి కళాకారులు మద్రాసు వచ్చి సినీ రంగంలో అడుగుపెట్టారు. అలా చలనచిత్ర రంగానికి తరలివచ్చిన కళాకారులలో గరికపాటి రాజారావు, తాతినేని ప్రకాశరావు, తాతినేని చలపతిరావు, చదలవాడ కుటుంబరావు, పెరుమాళ్లు, వీరమాచినేని మధుసూదనరావు, మిక్కిలినేని, సుంకర, వాసిరెడ్డి, సి. మోహనదాసు మొదలైనవారు చెప్పుకోదగినవారు. వీరంతా వామపక్ష భావాలు కలిగినవాళ్లు కావడంవల్ల - అభ్యుదయ చిత్రాలు, ప్రగతిశీల గీతాలు చలన చిత్రరంగంలో ప్రారంభమయ్యాయి.

1952లో ఢిల్లీలో జరిగిన మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శింపబడిన రష్యను చిత్రాలు, తెలంగాణా పోరాటం-ఇవికూడా ఆనాటి అభ్యుదయ చిత్రాలకు, ప్రగతి గీతాలకు ప్రేరణ నిచ్చాయి.

అయితే 'పుట్టిల్లు', 'పిచ్చిపుల్లయ్య' వంటి చిత్రాలు విజయవంతం కాకపోవడంతో ఆ తర్వాత అభ్యుదయం పేరుతో మిగిలిన వాళ్లు సినిమారంగంలో చేతులు కాల్చుకోవడానికి సిద్ధపడలేదు.

## ఎర్రపాటల వేగుచుక్క :

50ల దశకంలో మద్రాసు వచ్చిన వామపక్ష సభ్యుల ప్రయత్నాలకంటె శ్రీశ్రీ అభ్యుదయ గీతాలే 80వ దశకంలో వచ్చిన ఎర్రపాటలకు ఎక్కువ స్ఫూర్తినిచ్చాయి. 'కాలచక్రం'తో సినిమా పాటలుగా రావడం ప్రారంభమైన శ్రీశ్రీ కవితలు ఆ తర్వాత 'పల్లెటూరు', 'రణభేరి', 'పదండి ముందుకు', 'నేటి భారతం', 'భారతనారి', 'మహాప్రస్థానం', 'విప్లవశంఖం', 'సత్యాగ్రహం', 'స్వరాజ్యం' మొదలైన చిత్రాల్లో సినిమా పాటలుగా వచ్చాయి. వీటిలో కొన్నిటిని యథాతథంగా సినిమాల్లో తీసుకొంటే - కొన్నిటికి శ్రీశ్రీయే మార్పులు చేర్పులూ చేసి యిచ్చారు. ఇలా ముందుగా అచ్చయిన కవితల్ని మార్చి సినిమాపాటలుగా చేసిన కవులలో శ్రీశ్రీదే అగ్రస్థానం. 'పల్లెటూరు' లో 'పొలాలనన్నీ హలాలదున్నీ' (ప్రతిజ్ఞ-మహాప్రస్థానం) అనే గీతాన్ని, 'నేటి భారతం', 'భారతనారి' చిత్రాలలో - 'యముని మహిషపు లోహఘంటలు', (అవతారం-మహాప్రస్థానం); 'స్వరాజ్యం' చిత్రంలో 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' (జయభేరి-మహాప్రస్థానం), 'సత్యాగ్రహం'లో - 'పాపంపుణ్యం ప్రపంచమార్గం (శైశవగీతి-మహాప్రస్థానం మొదటి రెండు చరణాలు మాత్రం) గేయాలను యథాతథంగా ఉపయోగించారు.



'మహాప్రస్థానం' సినిమాలో 'శక్తికోసమే నడు, ముక్తికోసమే మను' (విశాలాంధ్రలో ప్రజారాజ్యం - ఖడ్గసృష్టి) గీతంలో చిన్న మార్పు చేసి (ముక్తిని-విముక్తిగా) వినియోగించారు.

'తెలుగు స్వతంత్ర' 15-1-1954 సంచికలో ప్రచురితమైన శ్రీశ్రీ 'కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు' గీతాన్ని కొంతమార్చి 'విప్లవశంఖం' సినిమాలో ఉపయోగించారు.

'స్వరాజ్యం'లో - 'జయభేరి' కవితను అనుకరిస్తూ విప్లవపరంగా ఇలా రాశారు-

**నేను సైతం ఎర్ర బాటకు**
**వేగు చుక్కగ సాగిపోతాను**
**నేను సైతం భువన భవనపు**
**బావుటానై పైకిలేస్తాను...**

'నీడలు' (మహాప్రస్థానం) కవితను మార్చి 'స్వరాజ్యం'లో ఇలా రాశారు.

**చూడు చూడు నీడలు - నీడలు... పొగమేడలు**
**యుగయుగాల దోపిడిలో తరతరాల రాపిడిలో**
**వినిపించని కనిపించని గాలిలోని కేకలు, రాలిపడిన ఆకులు**
**చూడు చూడు నీడలు.. నీడలతో క్రీడలు**

**నరనరాల వేదనలో నలిగిపోవు రోదనలో**
**బక్కచిక్కి బిక్క చచ్చి**
**పడిన బ్రతుకు గోడలు పాడుబడిన వాడలు**
**చూడు చూడు నీడలు... పూలులేని కాడలు**
**రకరకాల చెఱసాలల... రకరకాల తెరచాటుల**
**పొదిగిటిలో ఒదిగిలపడు**
**నిర్భాగ్యపు నీడలు... ఎడారిలో ఓడలు**

ఇందులో అనేక పదాలు 'నీడలు' కవితలోనివే !

'రణభేరి' అనే జానపద చిత్రంలో 'మహాప్రస్థానం' కవితను బుర్రకథగా

మార్చగా, 'దేశచరిత్రలు' కవితను కూడా కథానుగుణంగా మార్పు చేశారు. దాని స్వరూపం యిలావుంది

**ఏ దేశ చరిత్ర చూసినా**
**ఇంతేలే వీరులగాథ**
**ఇంతేలే త్యాగుల గాథ**
**కష్టం చాలక కడుపు మంటచే**
**తెగించి సమ్మెలు చేసేవాళ్లు**
**నిరపరాధులై నిరాధారులై చెరసాలల్లో చిక్కేవాళ్లు**
**చదివిన చదువులన్నీ గుదిబండలుగా**
**అనేకులంతా అభాగ్యులంతా**
**నిరుద్యోగులై కుమిలేవాళ్లూ -**
**అనాథలంతా అశాంతులంతా -**
**అక్రమాలపై సవాలు చేస్తూ -**
**విప్లవశంఖం వినిపిస్తారోయ్...**

శ్రీశ్రీ కవితల ప్రభావంతో సినిమాలలో కొన్ని పాటలు వచ్చాయి.

(1) 'జయంమనదే' చిత్రంలో కొసరాజు పాట

'వీరగంధము తెచ్చినామయా' లో - చివరి పంక్తులు...

**పిరికి పందలై తిరిగే వారూ**
**చావంటే అడలెత్తేవారూ**
**ముసుగులేసుకొని మూలకొరుగుడీ**
**గాజులు దాల్చి కదలకుండుడీ**

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితలోని

**ఎముకలు క్రుళ్లిన వయస్సు మళ్లిన**
**సోమరులారా ! చావండి !**
**నెత్తురు మండే, శక్తులు నిండే**
**సైనికులారా ! రారండి !**

పంక్తులను గుర్తుచేస్తాయి.



(2) 'సిపాయి కూతురు'లో సముద్రాల (జూ) రచన

**పదం పాడుతూ కదం తొక్కుతూ...**
**నిరంకుశత్వం సాగదు ! నీతికి విజయం తప్పదూ**

అనే పాట ప్రారంభం -

**కదం త్రొక్కుతూ పదం పాడుతూ**
**హృదంతరాళం గర్జిస్తూ...** **(మహాప్రస్థానం)**

కవితను స్ఫురింపజేస్తుంది

(3) **ఏవి తల్లీ నీదు ఆశల పసిడి స్వప్నాలు**
**ఏవి తల్లీ నీవు తలచిన భావిస్వర్గాలు**
**ఏవి తల్లీ ? ఏవి తల్లీ ! ఏవి తల్లీ !**

**మనుషులంతా ఒక్కటేనని మమత నింపిన జీవమంత్రం**
**నీవు నమ్మిన సామ్యవేదం ఎక్కడుందమ్మా**
**ఎక్కడమ్మా ఎక్కడమ్మా నీవు నమ్మిన**
**నీతి సూత్రాలెక్కడమ్మా ?** **(ప్రజాస్వామ్యం)**

అని ప్రశ్నించే అదృష్ట దీపక్ పాట

**చక్రవర్తి అశోకు డెచ్చట**
**జగద్గురు శంకరుండెచ్చట**
**ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు ?**
**(ఏవి తల్లీ-ఖడ్గసృష్టి)**

అనే శ్రీశ్రీ కవితకు అనుకరణ అని తెలుస్తూనే వుంది. అలా తెలియాలనే ఈ పాట రాయించారట[10].

అలాగే 'నవయుగం' చిత్రంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి రచన -

**ఎంతకాలం ఇంత ఘోరం**
**న్యాయ భారతి గొంతుచీల్చిన కుటిలద్రోహం**
**ధర్మదేవత గుడిని కాల్చిన అగ్నిదాహం...**

10. నిర్మాత పోకూరి బాబూరావుతో ముఖాముఖి 24.12.91

ప్రజానాట్యమండలి ప్రచారం చేసిన శ్రీశ్రీ - 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు...' ట్యూన్‌ని అనుసరించి రాయించిన పాట !

ఇంతగా సినిమాలలో ప్రగతిశీలదృక్పథం గల పాటలకు మార్గదర్శకుడైన శ్రీశ్రీ చివరిపాట -

**అర్ధరాత్రి స్వతంత్రం - అంధకారబంధురం**
**అంగాంగం దోచుకున్న కన్నతల్లి జీవితం**
**ఇదే నేటి భారతం - భరతమాత జీవితం (నేటి భారతం)**

శ్రీశ్రీ పాటల ప్రభావం - యువతరం ఎర్రపాటలమీద నేటికీ కనిపిస్తోంది.

## చైతన్యగీతాల శకం :

మునుపెన్నడూ లేనన్ని 'చైతన్యగీతాలు' 80ల దశకంలోనే వచ్చాయి. వీటిలో ఎక్కువ పాటలు సంగీత పరంగానో, సాహిత్యపరంగానో జనానికి పరిచితమైన ధ్వని గలిగివుండడం విశేషం. ఇలా వచ్చిన పాటల్లో మూడుదశలు కనిపిస్తున్నాయి. జానపదగీతాలనో గిరిజనగీతాలనో విని ఆ బాణీల్లో ప్రజానాట్యమండలి, జన నాట్యమండలి వంటి వామపక్ష సాంస్కృతిక సంస్థల కవులు పాటలు రాయగా - వాటిని చేర్పులూ మార్పులతోకాని వాటి బాణీల్లోకాని - సినిమాల్లో పాటలు రాయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఆంధ్ర ప్రజానాట్యమండలి, జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, నవోదయ నాట్యమండలి వంటి వామపక్ష సాంస్కృతిక సంస్థల ద్వారా ప్రచారమైన పాటలు ఇలా ఎన్నో సినిమాల కెక్కాయి.

ఉదాహరణకు -
**'ఓ లగిజిగి లగిజిగి...**
**లంబాడీ లజ్జనకిడి... తకధిమి తాళమేయి మామా'**

అనే పల్లవిగల పాట చిరకాలంగా ప్రచారంలోవున్న గిరిజన గీతం. ఈ పల్లవిని తీసుకొని 'సిపాయికూతురు' (1959) చిత్రంలో ఓ కోయపాటను రాయించారు.

**ఓ... లగిజిగి...లగిజిగి...లగిజిగి...లగిజిగి లగిజిగి**
**జిగిలగి...జిగిలగి...లగిజిగి**
**లంబాడీ లజ్జనకిడి తకధిమి తాళమేయిమామా ...**



**ఆటచూడు పాటచూడు తాళమేయి మామా**
**చినదాని జోరు చూడు హో! హో! హో!**
**అయారే ! వయారీ ! అందాల తళుకు చూడు**
**-సముద్రాల (జూనియర్)**

గిరిజనుల పల్లవి ఆధారంగా 50ల దశకంలో సినిమాలో ఇలాంటి శృంగార గీతం వస్తే - అదే పల్లవితో ప్రజానాట్యమండలికి ధవళ సత్యం విప్లవగీతం రాశారు.

**ఓ లగిజిగి జిగిలగి జిగిలగి లగిజిగి**
**లంబాడీ లజ్జనక జనకరే**
**తకిట తకిట తక తాళంవేస్తూ తిరగబడర అన్నా**
**ఓహో తిరగబడర అన్నా -**

**ఎండనకా వాననకా రేయనకా పగలనకా**
**పొలమూ పుట్రాయెంట పస్జేసే కూలన్నా**
**ఎంతకాలం నీవు ఏడుస్తూ బతికేవు ॥లగి॥**

**భూస్వామికి బానిసనై ఎగసాయం జేసేవా**
**బంగారం పండించి ఆసామికి పోసేవా**
**ఓ చిన్నా రైతన్నా -**
**ఊకాపొల్లూ మిగిలి కుములుతూ వున్నావా ? ॥లగి॥**

ఇలా నడచిన 5 చరణాల పాటను రచయితే 'ఎర్రమల్లెలు' సినిమా కోసం ఇలా మలిచారు.

**ఓ... లగిజిగి జిగిలగి... జిగిలగి లగిజిగి లంబాడీ**
**లజ్జనక జనకరీ తకిట తకిట తక తాళం ఏత్తూ**
**తిరగబడర అన్నా - ఓహో... తిరగబడర అన్నా**
**నువ్వు తిరగబడర అన్నా - ఆహా తిరగబడర అన్నా**

**ఎండనకా వాననకా - రేయనకా పగలనకా**
**పొలం పుట్రా యెంటా పస్జేసే కూలన్నా**
**ఓరైతు కూలన్నా -**
**కష్టానికి ఫలితంగా కన్నీళ్లే మిగిలేనా ॥లగిజిగి॥**

**గుంటనక్క మాటలు నమ్మి నేల తల్లి నొదిలావా**
**కామందుల పీడన నొదిగీ - పాలేరుగ మారేవా?**
**కన్నీటి ఓ చిన్నా -**
**ఎన్నాళ్లూ నీకోసం - నీ తల్లికి కన్నీళ్లు** ॥లగిజిగి॥

**బానిసగ నీ బతుకూ బండబారి పోవాలా**
**బాధలతో గుండెబలం దండగై పోవాలా**
**అన్నా, ఓ చిన్నన్నా**
**ఈ తీరూ... ఎన్నాళ్లు... ఇకనైనా కళ్లుతెరు...** ॥లగిజిగి॥

మూలాల్లోనూ సంస్థల ప్రచార గీతాలగానూ దీర్ఘంగావున్న పాటలు... సినిమాలకెక్కేసరికి కాలపరిమితి దృష్ట్యా రెండుమూడు చరణాలకు పరిమితం కావడం జరిగింది. వీటికి అపవాదాలు లేక పోలేదు. 'విప్లవశంఖం' లోని - 'జజ్జనకరి-జనారే', 'నవోదయం' లోని - 'అక్కో అక్కో అక్కో' ఈ పరిమితిని మించిన సుదీర్ఘమైన గీతాలే ! అయినా యివి ప్రజల్ని అమితంగా ఆకర్షించడానికి కారణం పరిచితమైన బాణీలు, వస్తువు.

ఈ జనచైతన్య గీతాలలో వస్తువు - నిత్యజీవిత సమస్యలను పరామర్శిస్తుంది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వకార్యాలయాలు... వీటిలో జరిగే అన్యాయాలను అక్రమాలనూ బయటపెట్టేవి, కర్షకులు, కార్మికులు, మధ్యతరగతి మర్యాదస్థులు, సన్నకారు ఉద్యోగులు... వీళ్ల సమస్యలకు అద్దంపట్టేవి, పతితులూ, భ్రష్టులూ, తాడితులూ, పీడితులూ... మొదలైన అధోజగత్సహోదరులను భుజంతట్టి ఓదార్చేవి, రాక్షస రాజకీయాల, అధికారుల అక్రమాలు... ఈ గుట్టులను రట్టుచేసేవి కావడంతో ఈ పాటలలోని ఆప్తత ప్రజలను ఆకట్టుకొంది.

మచ్చుకి 'నవోదయం' సినిమాలో భానూరి సత్యనారాయణ రచించిన పాటనుంచి కొన్ని చరణాలు - ఇది ముగ్గురు కాలేజీ అమ్మాయిలు పాడినట్టు చిత్రీకరించిన ప్రబోధ గీతం -

**సెమటలు గక్కుతు అక్కో**
**నువు సాకిరి సేత్తే అక్కో**
**చారెడు గింజలు అక్కో**



**నీచాటన బడవే అక్కో**
**పాయికిందకు వుంటే అక్కో**
**పాయిమీదకు వుండదు అక్కో**
**వరకట్నం సంతలో అక్కో**
**వేలం పసువే అక్కో**
**కట్టిన తాళీ అక్కో**
**ఉరితాడై పోయెను అక్కో**
**కట్నం ఏదని అక్కో**
**వాడు కిరసను పోసే అక్కో**
**నిను కాల్చి సంపెనే అక్కా**

**పల్లెపడుసుకు అక్కో**
**మాయమాటలు సెప్పేరక్కా**
**అరెపట్నం సేర్చేరక్కో**
**వెలయాలిని జేసేరక్కో...**

ఈ పాట కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కోసం పై రచయిత రాయగా ప్రచారమైనదే ! వెండితెర కెక్కని పూర్వరూపం ఇలా వుంది.

**అక్కో అక్కో అక్కో మీతమ్ముల మొచ్చిన మక్కా**
**సీరలు తేలేదక్కా - మరి సారెలు తేలేదక్కా**
**కాంగ్రెసుపాలన అక్కో - కరువును పెంచిందక్కో**
**కమ్యూనిష్టులమక్కా - పోరాటం మాపేరక్కో**
**బాటెర్రని బాటక్కా - బతుకుపాట మాదక్కో**
**ఇగ బావల నిలుపుండక్కో - మా బాటకు పంపుండ్రక్కా**
**అనుమానం యిడిసి అక్కా - ఆలోచన సెయ్యరె అక్కా**
**మన కట్నం తీరుట కక్కా - మేం మార్గం సెపుతామక్కా.** [11]

సాంస్కృతిక సంస్థల ద్వారా ప్రచారమై - అవి ప్రచురించిన పాటలు సంపుటాలకెక్కి అనంతరం చేర్పులూ మార్పులతో సినిమాలలో వచ్చిన మరికొన్ని ప్రసిద్ధ గీతాలు -

11. 'ఎర్రకిరణం' లో ప్రచురితం

1. **'మారిపోతుందోయ్ కాలం**
   **మారి పోతుందీ'** **(గజ్జెల మల్లారెడ్డి - ప్రజాశక్తి)**

2. **మానవత్వమున్న మహనీయులారా** **(మల్లిక్-జనం-మనం)**

3. **అక్షరాలీవేళ అగ్నివిరజిమ్మాలి**
   **భావాలు పదునెక్కి భాష ఎరుపెక్కాలి(అదృష్టదీపక్ - నవోదయం)**

4. **భద్రంకొడుకో - నాకొడుకో కొమరన్నజెర**
   **కొడుకో - నాకొడుకో కొమరన్న** **(అంజయ్య-రంగులకల)**

సాంస్కృతిక సంస్థల గీతాల ప్రభావంతో వచ్చిన పాటలు ప్రచారంపొంది సవరణలతో సినిమాలలో ప్రవేశించిన సందర్భాలు కూడా వున్నాయి.

ఉదాహరణకు -

**కాలేజీ కుర్రవాడ కులాసగ తిరిగినోడ**
**విలాసాల మాట మరువరో - ఓ విద్యార్థి**
**విప్లవాలబాట నడవరో - ఓ విద్యార్థి...**
**(గుండవరపు సుబ్బారావు - స్వరాజ్యం)**

అనే పాటకు ప్రేరణ -

**'జగమెరిగినవాడ - ఓ అనమల్లా రెడ్డన్న**
**జగమీడి వెళ్లినవయ్యో - ఓ మల్లారెడ్డో**
**మమ్మిడిసీ వెళ్లినవయ్యో - ఓ మల్లారెడ్డి'**

అనే గీతం. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ద్వారా బహుళ ప్రచారం పొందిన పాట. మల్లారెడ్డి ప్రముఖులైన కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. మల్లారెడ్డి రాజకీయహత్య కారణంగా ఈ పాట ప్రచారంలోకి వచ్చింది. ఈ బాణీ ఆధారంగా ఒంగోలులో ఒక కళాశాల ఎన్నికల ప్రచార నిమిత్తం గుండవరపు సుబ్బారావు 'కాలేజీ కుర్రవాడ' అనే పాట రాశారు. అది వందేమాతరం శ్రీనివాస్ పాడగా ప్రచారం పొందింది. ఆ పాటను విని మాదాల రంగారావు కొన్ని మార్పులతో 'స్వరాజ్యం' చిత్రంలో ఆ రచయితచేతే పాటను రాయించారు.

ఈ ఎర్రబాటలో వచ్చిన పాటలు సినిమాపాటకు అంతవరకూ వస్తుపరంగానూ భాషాపరంగానూ వున్న పరిధుల్ని చెరిపివేశాయి. జనంలోకి వెళ్లడానికి కొన్ని జానపద బాణీల నాశ్రయించినా - జనాన్ని జాగృతం చేసే వస్తువును మాత్రమే



అందించాయి. కొత్త రచయితలను, గాయనీగాయకులను సినిమా రంగానికి పరిచయం చేశాయి. అందుకు ఈ బాటవేసిన మాదాల రంగారావు, ఆ బాట ననుసరించిన వేజెళ్ల, టి.కృష్ణ, పోకూరి బాబూరావు, ఆర్.నారాయణమూర్తి మొదలైన వారిని అభినందించాలి.

## 5. అన్యభాషలు :

**'ఏదేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు.**
**నైక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు.'**

అని తిలక్ అన్నట్టు - సంస్కృతి, ఆచారాలు, జాతి, మతం మొదలైనవి మడికట్టుకొని వుంటాయని, వుండాలని ఎవరైనా అనుకొంటే అది భ్రాంతి. కాలంతో అన్నిటా సాంకర్యం తప్పనిసరి. అలాగే భాషకూడా. ఒకనాటి తెలుగు తత్సమ తద్భవాలతో కలిసి సంపన్నమైనట్టే నాగరకత, విజ్ఞానం పెరుగుతున్నకొద్దీ ఈనాటి తెలుగు ఆంగ్లం, హిందీ మొదలైన ఇతర భాషాపదాలను, సజాతీయ ద్రవిడ భాషాపదాలను ఎక్కువగా విలీనం చేసుకొంటోంది. రాజకీయ కారణాలవల్ల ఆంగ్లం, హిందీ, ఉర్దూ పదాలు వ్యవహారభాషలో అనునిత్యం వినిపిస్తున్నాయి. అనువాద చిత్రాలు వచ్చిన తర్వాత - సినిమాతెలుగు మీద తమిళ, కన్నడ, మలయాళ భాషల ప్రభావం కూడా కనిపిస్తోంది. పాత్రౌచిత్యాన్ని పాటించడానికి తెలుగు సినిమాపాటల్లో ఇతరభాషా పదాలను వాడుతున్నారు. పూర్తిగా అన్యభాషా గీతాలను ఉపయోగించిన సందర్భాలు కూడా వున్నాయి. 'మంగళసూత్రం', 'అపూర్వ సహోదరులు', 'వచ్చిన కోడలు నచ్చింది', వంటి పాత సినిమాలలోనే బహుభాషా మిశ్రమాలైన పాటలున్నాయి. ఇటీవల కొందరు సినిమా రచయితలు పాశ్చాత్య సంగీత ధోరణుల కనువుగా వేగం కోసం ఇంగ్లీషు, హిందీ పదాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అన్యభాషాపదాలతో పాటు - అన్యభాషాసాహిత్యాన్ని సంగీతపు బాణీలను కూడా తెలుగు సినిమాపాటల్లో వినియోగించు కొంటున్నారు.

ఈ వినియోగాలను సౌకర్యంకోసం, ఇంగ్లీషు, హిందీ, తమిళ, కన్నడ భాషలకు పరిమితం చేస్తూ వాటి ప్రభావాన్ని పరిశీలిద్దాం.

### ఆంగ్లభాష :

నిత్య వ్యవహారభాషలో ఆంగ్ల ప్రభావం ఎంత ఎక్కువగా వుందో - అది సినిమాపాటల్లో అంతకంటె అధికంగా కనిపిస్తోంది. ముందుగా ఆంగ్ల కవితాప్రభావాన్ని

చూద్దాం.

'కార్తవరాయనికథ' లో కృష్ణశాస్త్రి రాసిన పాట -

**గాజులమ్మా గాజులు**
**కన్నియ చేతుల గాజులు**
**కాబోయే మా పెళ్లి కూతురు**
**కన్నులలో విరజాజులు**

**ముత్తయిదువులకు గాజులు**
**కొత్తపడుచులకు గాజులు**
**బిత్తరచూపుల పుత్తడిబొమ్మకు**
**పెదవులపై విరజాజులు...**

**తామర తూడులె కోమలి చేతులు**
**పూలమాలలె బాలిక చేతులు**
**ఏడురంగుల ఇంద్రధనుస్సులు**
**వాడని వన్నెల గాజులు**

**నచ్చిన మగడె కావాలా**
**నే యిచ్చిన గాజులు వేసుకో**
**పచ్చని గాజులు వేయనా**
**మనసు మెచ్చిన వరుడే వస్తాడు.**

ఈ పాటలో సరోజినీ నాయుడు రాసిన **Bangle Sellers** (గాజుల బేహారులు) ఛాయలు కనిపిస్తున్నాయి.

**Bangle-Sellers are we who bear**
**Our shining loads to the temple fair...**
**Who will buy these delicate, bright**
**Rainbow-tinted circles of light ?**
**Lustrous tokens of radiant lives,**
**For happy daughters and happy wives.**

**Some are meet for a maiden's wrist,**
**Silver and blue as the mountain-mist,**
**Some are flushed like the buds that dream.**



**On the tranquil brow of a woodland stream;**
**Some are aglow with the bloom that cleaves**
**To the limpid glory of new-born leaves.**

**Some are like field of sunlit corn,**
**Meet for a bride on her bridal morn,**
**Some, like the flame of her marriage fire,**
**Or, rich with the hue of her heart's desire**
**Tinkling, luminous, tender, and clear,**
**Like her bridal laughter and bridal tear.**

ఆంగ్లకవితలో కొన్ని పంక్తులతో మాత్రం సినిమాపాటకు పోలికలు కనిపిస్తున్నాయి. వాటిని కూడా ఒక క్రమంలో అనుసరించలేదు. అలాగే ఏ పంక్తికి ఆ పంక్తిని మూలంగా తీసుకోకుండా రెండుమూడు పంక్తుల సారాంశాన్ని సినిమా పాటలో ఒకో పంక్తిలో యిమిడ్చారు. మూలంలో వున్న ఉపమానాలను పూర్తిగా విడిచిపెట్టి - 'తామర తూడులె కోమలిచేతులు; పూలమాలలె బాలికచేతులు' వంటి రూపకాలను సినిమాపాటలో అదనంగా తీసుకొచ్చారు. మొత్తానికి స్థూలంగా చూస్తే సందర్భం ఒకటే గనుక రెంటి ధోరణి ఒకేలా వుంది.

1. 'బ్రతుకు తెరువు' లో సముద్రాల జూనియర్ రచన -
   **"అందమె ఆనందం - ఆనందమె జీవితమకరందం"**

అనే పల్లవికి ప్రేరణ -

**'A thing of beauty is a joy for ever'** **(John Keats)**

అనే ఆంగ్ల కవితా సూక్తియే !

2. దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రసిద్ధ రచన -
   **"ఆకులో ఆకునై పూవులో పూవునై" -**

గీతానికి ప్రేరణ - నెహ్రూ అభిమానించి ప్రసారం చేసిన - **Robert Frost** రచించిన **Stopping by Woods on a Snowy Evening'** అనే కవిత.

3. 'వెలుగునీడలు' లో శ్రీశ్రీ రాసిన 'కలకానిది - విలువైనది' పాటలో 'అగాధమౌ జలనిధిలోన ఆణిముత్య మున్నటులే' అనే పంక్తికి **Elegy written in a Country Churchyard'** (**Thomas Gray**) కవితలోని **Full many a gem of purest ray serene The dark unfathomed caves of the ocean bear.** అనే పంక్తులు స్ఫూర్తి కావచ్చు. శ్రీశ్రీమాత్రం'అగాధమౌజలనిధిలోన ఆణిముత్యమున్నటులే'

అన్న అయిడియా తమిళంలో తీసిన వెలుగునీడలు(ద్విభాషా చిత్రం) కు పాటలు రాసిన ఉడుమలై నారాయణ కవిది అన్నారు.[12]

**4. 'మానూ మాకును కాను-**
**రాయీ రప్పను కానే కాను**
**నీ మనిషిని నేను'** **(మూగమనసులు)**

అని ఆత్రేయ రాయడానికి షేక్స్పియర్ ప్రభావం వుండాల్సిన అవసరం లేకపోవచ్చు. కాని యాదృచ్ఛికమైనా - సామ్యం వుంది.

'జూలియస్ సీజర్' నాటకంలోని పంక్తులు -

'You are not wood
You are not stones but men [13],

'సీతారామకల్యాణం' (యువచిత్ర) లో వేటూరి రాసిన -

**"ఏమని పాడను ఏమని పాడను రెండు మనసులా మూగగీతం**
**ఏదని చెప్పను ఏదని చెప్పను నాలుగు పెదవుల ఏకతాళం.**
**అది చెబుతున్నప్పుడు లయ పుడుతున్నప్పుడు**
**నా గుండెల్లో చప్పుడే ప్రేమా - నీ పెదవుల్లో చప్పుడే ముద్దు**

అనే పాట పల్లవి 'Khalil Gibran' రచన 'Of the first kiss' ను గుర్తుతెస్తుంది.

'It is a word uttered by four lips
Proclaiming the heart of a throne
Love a king and fidelity a Crown
It is the beginning of the song of life'.

'చిరంజీవి' చిత్రంలో రాసిన గోపి మొదటి పాట -

**'జీవితమెంతో తీయనిది**
**అందుకనే అతి స్వల్పమది**
**నవ్వు పువ్వు క్షణికములే**
**గడువు వీడితే నిలువవులే**

అనే పంక్తులకు H.W. Longfellow రచన 'A Psalm of Life' లోని -

12. పాడవోయి భారతీయుడా - పుట 34
13. Antony's funeral oration (Act-3-Scene-2)



'Life is sweet but it is short' అనే పంక్తులు ఊపిరి.

పుట్టినరోజు వేడుకలు ఆంగ్ల సంప్రదాయం. అలాంటి సందర్భానికి రాసే పాటలో - ఆ సంప్రదాయమే ప్రతిబింబించడం సహజం. 'మట్టిలో మాణిక్యం' చిత్రంలో-

**"మళ్లీ మళ్లీ పాడాలి ఈ పాట**
**నీ బ్రతుకంతా కావాలి పూలబాట'**

అనే పాట ప్రారంభానికి "Many happy returns of the day" అనే శుభాకాంక్షే స్ఫూర్తి.

ఆంగ్ల కవితలే కాకుండా వచనంకూడా సినిమాపాటలను ప్రభావితం చేసిన సందర్భాలున్నాయి.

Ernest Hemingway నవల- 'The Oldman and the Sea' లోని ముగింపు వాక్యం.

'The time can destroy a man, but cannot defeat him' బాగానచ్చి ఆ భావాన్ని భువనచంద్ర 'దొంగకోళ్లు' చిత్రంలో రాసినపాటలో పొదిగారు. [14]

**'ఏమని వివరించనూ ? నా బాధ ఎవరికి**
**వినిపించను'**

అని దుఃఖపడుతున్న కథానాయికను ఆమెతల్లి ఓదార్చే సన్నివేశంలోని పంక్తులు -

**'విధి ఎంత వంచించి కవ్వించినా**
**ఎన్ని కష్టాల సుడిరేపి శోధించినా**
**ధైర్యాన్ని కోల్పోని ఏ మనిషినీ -**
**విధి ఓడించలేదమ్మా ఏనాటికీ -**

ఆరుద్ర రచన -

**ఏస్కో కోకోకోలా**
**తీస్కో రమ్ముసోడా'**

ఆండ్రూస్ సిస్టర్స్ (అమెరికన్ పాప్ సింగర్స్) 1940 ప్రాంతంలో పాడిన -

'Drinking rum and Coca-Cola

14. భువనచంద్రతో ముఖాముఖి. 27-12-91.

**Working for the yankee dollar'** అనే పాట స్ఫూర్తి అట. [15]

'ఉపాయంలో అపాయం' (1967) అనే సినిమాలో ఆత్రేయ రాసిన యుగళ గీతం -

**అతడు :** **పదారుగడిచి పదేడులోకి**
**పాదం మోపే అమ్మాయి**
**నిన్నదుపున పెట్టి పొదుపుగ చూచే**
**అతగాడొకడు కావాలీ**
**జతగాడొకడు కావాలీ**

**ఆమె :** **ఇరవైదాటి ఇరవై ఒకటి**
**పైబడుతున్న అబ్బాయి**
**నిన్నదుపునపెట్టి పొదుపుగ చూచే**
**ఆడది ఒకతె కావాలి**
**ఆవిడ ఒకతె కావాలి...**

ఈ పంక్తులకు - **'The Sound of Music'** లో - **Oscar Hammer stein II** రచన **'Sixteen going on Seventeen'** ప్రేరణ.

Boy : You are sixteen going on seventeen
Baby, it's time to think
Better beware
Be canny and careful
Baby you are on the brink
You are sixteen going on seventeen
Fellows fall in line
Eager young lads

And rogues and lads
Will offer you food and wine
Totally unprepared are you
To face a world of men
Timid and shy and scared are you

15. ఆరుద్రతో ఇష్టాగోష్ఠి 11.1.92



Of things beyond your ken
You need someone older and wiser
Telling you what to do
I am seventeen going on eighteen
I will take care of you...

Girl : I am sixteen going on seventeen
I know that I am naive
Fellows I meet
May tell me I am believe
I am sixteen going on seventeen
Innocent as a rose
Bachelor, dandies
Drinkers of brandies
What do I know of those
Totally unprepared am I
To face the world of men
Timid and shy and scared am I
Of things beyond my ken
I need some one older and wiser
Telling me what to do
You are seventeen going on eighteen
I will depend on you.

మూలంలోని ఇన్ని పంక్తుల భావాన్ని 'అదుపున పెట్టడం' అనే అక్షరాల్లో ఆత్రేయ సాధించారు.

తెలుగు సినిమా కథానాయకుని వయసు మరీ 18 అనడం బావుండదని 21 చేసి నాయికను కేవలం ఆధారపడే ఆడదానిగా కాక - బదులు చెప్పే - రాలుగాయిగా ఆత్రేయ తనదైన బాణీలో మూలంలో వున్నదాన్నే సంక్షిప్తంగా చెప్పారు.

ఇవన్నీ సాహిత్యపరమైన ప్రేరణకు ఉదాహరణలయితే - 'మాయాబజార్' చిత్రంలోని 'వివాహభోజనంబు వింతైన వంటకంబు - వియ్యాలవారి విందు' అనే పాటకు **Mexican Merry - Go Round** అనే ఎడ్మండో రాస్ పాడిన పాట బాణీ

ఆధారం కావడం [16] - ఆంగ్లగీతాల బాణీలు ఎప్పుడో తెలుగు సినిమాపాటను ప్రభావితం చేశాయనడానికి ఉదాహరణం.

సాలూరి రాజేశ్వరరావు స్వరకల్పనలో 'ఆరాధన' చిత్రంలో వచ్చిన -

1. **నీ చెలిమి నేడె కోరితినీ ...**
2. **ఆడదాని ఓరచూపుతో, జగాన ఓడిపోని ధీరుడెవ్వడోయ్ ?**

అనే పాటకు కూడా ఆంగ్ల బాణీలే ఆధారమట !

ఇంకా -

1. **ఓ అందమైన బావా.. వహ్వా ఆవుపాల కోవా**
2. **ఈ రేయి తీయనిది, ఈ చిరుగాలి మనసైనది..**

మొదలైన ఎన్నో తెలుగుపాటలకు ఆంగ్లబాణీలే మూలం !

సాంఘికచిత్రాల ప్రారంభం నాటికి ఆంగ్ల భాషను అభ్యసించడం - అరుదైన విషయం గనుక - పట్నంలో చదువుకొన్న విద్యావంతుల పాత్రలకూ, విదేశాలు వెళ్లి వచ్చిన వారికీ మాత్రం పాటల్లో ఆంగ్లపదాలను అరుదుగా వుపయోగించారు. ఉదాహరణకు 'గృహప్రవేశం' లో -రమణారావు అనే పాత్రమీద చిత్రించిన పాటల్లో పంక్తులు -

1. **ధన్యుడనైతిని తులశమ్మక్క**
   **జానకి ఈజ్ మై క్వీన్ ఆఫ్ హార్ట్.**
2. **బ్యూటిఫుల్ గర్ల్ అట జానకి బ్రైడ్ అట -**
   **పూర్వపుణ్యమున పొందానట !**

50ల దశకంలో ఆంగ్లపదాలను హాస్యసృష్టికోసం ఎక్కువగా ఉపయోగించారు.

ఉ. **ఐయామ్ కమ్ ఫ్రమ్ లండన్, నీపై మోహము నిండెన్**
**మై నేమ్ ఈజ్ డన్‌డన్...** (తోలేటి - ఆడజన్మ)

**లైఫ్ మైనస్ వైఫ్**
**ఎ నైఫ్ ఇన్ ది లైఫ్**
**లైక్ ఎ కాక్ అండ్ హెన్**

16. వి.ఎ.కె. రంగారావు చెప్పిన సమాచారం



**ఉయ్ డాన్స్, ఉయ్ డాన్స్** **(బలిజేపల్లి - సంక్రాంతి)**

'ఇద్దరు పెళ్లాలు' (54) మొదలైన చిత్రాలలో పాత్రోచితంగా కూడా ఇంగ్లీషు పాటలను ఉపయోగించారు.

60ల దశకం వచ్చేసరికి పూర్తిగా ఆంగ్లగీతాలను సినిమాలలో ఉపయోగించిన సందర్భాలు కనిపిస్తున్నాయి.

'మామకు తగ్గ కోడలు' (60) చిత్రంలో దర్శకులు సి.యస్.రావు పేరుతో వచ్చిన పాప్ గీతం -

One and two and I love you
You love me Let's play the game of love
Three and four
I want you more and want you more
Let's play the game of love

'తోడూనీడా' (65) లో భానుమతి పాడిన పాప్ గీతం -

When I was just a little girl
I asked my mother
What will I be
Will I be pretty
Will I be rich
This's what she said to me
Que Sara Sara

మొదలైనవి సంపూర్ణ ఆంగ్ల గీతాలకు ఉదాహరణలు.

డెబ్బయ్యవ దశకంలో ఎక్కువగా తెలుగుపదాలలో ఇంగ్లీషు పదాలను మేళవించి - మణిప్రవాళ శైలిలో పాటలు రాశారు.

ఆమె : **హల్లో హల్లో డాక్టర్, టెల్‌మి టెల్‌మి డాక్టర్**
**బేజారవుతున్నది మనసు, చూడండి సార్ పల్స్**

అతడు : **ప్రేమ ప్రేమని అవర్స్ అవర్స్ కొట్టుకొంటోంది. పల్స్**
**వెనకా ముందు ఆలోచించక వెయ్యాలి పెద్దడోస్**

ఆమె : **వాట్ యు సే మై పేషంట్, టెల్ టెల్ మి పేషంట్ ...**

**వెరీ హాట్‌గా వున్నది బ్రీజ్, రైజరవుతున్నది**
**టెంపరేచర్**
**అయోమంగా వున్నది నేచర్, ఏమవుతుందో**
**ఫ్యూచర్ (కుల గౌరవం)**

వంటి పాటలు ఇటువంటి భాషకు ఉదాహరణలు.

ఎనభయ్యవ దశకంలో ఆంగ్లంలోని అక్షరాలతో చమత్కారాలను చేసే మేరకు తెలుగు పాటలమీద ఆంగ్ల ప్రభావం పడింది.

**'L' అంటే 'O' అంటే 'V' అంటే 'E' అంటే**
**లవ్వు లవ్వు లవ్వులే**
**'K' అంటే 'I' అంటే 'S' అంటే 'S' అంటే**
**కిస్సు కిస్సు కిస్సులే (రుద్రనేత్ర - వేటూరి)**

మొత్తంమీద తెలుగు సినిమాపాటల్లో ఆంగ్ల సాహిత్యానికి సంబంధించిన ఛాయలు పరిమితంగానూ, పదాల వినియోగం అపరిమితం గానూ - కనిపిస్తున్నాయి. నిత్య జీవితంలో వాడుకభాషలో వున్న ఆంగ్లపదాల కంటె సినిమాపాటల్లో వాడుతున్న పదాల శాతం ఎక్కువగా వుంది. ఇప్పుడు అమలులోవున్న ట్యూనుకు సాహిత్యం రాసే పద్ధతిలో సౌకర్యం కోసం కూడా - రచయితలు ఎక్కువగా ఆంగ్ల పదాలను ఉపయోగిస్తున్నారు.

**హిందీ :**

హిందీ ప్రభావం పడని భారతీయభాషా చిత్రాలు లేవు. ఆ ప్రభావం తెలుగు సినిమా మీద కూడా యితర భాషల ప్రభావంకంటె ఎక్కువగానే వుంది. తెలుగు సినిమాపాట పుట్టినప్పటి నుండీ బాణీలపై హిందీ ప్రభావం వుంది. అనువాద చిత్రాల రాకతో సాహిత్యపరమైన ప్రభావం కూడా పడింది. తెలుగులో వచ్చిన మొదటి అనువాద చిత్రం 'ఆహుతి' (1950) 'నీరా ఔర్ నందా' అనే హిందీ చిత్రం తర్జుమాయే.

తమిళం, మలయాళం మొదలైన భాషల్లో కర్ణాటకసంగీతం తప్ప లలితగీతాలు ఎక్కువగాలేని కాలంలో బెంగాలీ, హిందీ భాషలనుంచి తెలుగులోకి వచ్చిన బాణీలు తక్కిన దక్షిణాది భాషలకు వ్యాపించాయి. తెలుగు సినిమాపాటపై హిందీ ప్రభావాన్ని బాణీ, భాష అనే రెండు దృక్కోణాల నుంచి చూడవచ్చు.



బాణీల ప్రభావాన్ని తిరిగి రెండుగా చెప్పుకోవచ్చు. మొదటిది కేవలం బాణీకి మాత్రమే పరిమితం. రెండోది బాణీతోపాటు కొంతవరకు భావాన్ని కూడా తీసుకోవడం.

**(అ) మట్లు (Tunes) మాత్రమే :**

**1. నిను వీడని నీడను నేను... (అంతస్తులు)**
**మూలం : కహీఁదీప్ జలే, కహీఁ దిల్ (బీస్ సాల్ బాద్)**

హిందీపాట పల్లవికి 'దీపాలు వెలిగాయి; గుండెలు మండాయి' అని అర్థం. దీనికి తెలుగు పల్లవికి బాణీలోతప్ప అర్థంలో పోలికలేదు. అయితే రెండు పాటలూ చనిపోయిన మనిషి ఆత్మ వెంటాడే భ్రాంతి కలిగే సందర్భంలోనే గనుక హిందీబాణీని తెలుగు సినిమాలో అనుసరించారు.

'తోడూనీడ'లో - 'ఎందుకిలా వున్నారు.?' అనే పాటను మినహాయిస్తే - తర్వాత తెలుగు సినిమాలలో వచ్చిన దయ్యాల పాటలన్నీ దాదాపు ఇదే బాణీలో వచ్చాయి.

**(2). నా షోలాపూర్ చెప్పులు పోయాయి (ముద్దమందారం)**
**మూలం :హమ్ కాలేహై తో క్యాహువా?- దిల్‌వాలే హై(గుమ్‌నామ్)**

హిందీ పల్లవికి 'మేము నల్లనివాళ్లమైతేనేమి - హృదయం వున్నవాళ్లం' అని అర్థం. దీనికీ తెలుగుపాటకూ అర్థంలోకాని, సందర్భంలోకాని - సంబంధం లేదు. హిందీలో బాగా ప్రచారమైన బాణీని అనుసరిస్తూ హాస్యాన్ని పండించడమే తెలుగుపాట ఉద్దేశం.

**(3).ముత్యాలూ వస్తావా ! అడిగింది ఇస్తావా ? (మనుషులంతా ఒక్కటే)**
**మూలం : రూప్ తేరా మస్తానా ప్యార్‌మేరా దీవానా (ఆరాధన)**

ఆరాధనలో పాటకు 'నీరూపం మత్తెక్కించేది - నాదేమో పిచ్చిప్రేమ' అని భావం. దానితో సంబంధం లేకుండా పాటబాణీని మాత్రం తెలుగులో - హాస్య యుగళగీతానికి ఉపయోగించుకొన్నారు.

**(4).కల నిజమాయెగా - కోరిక తీరెగా (సంసారం)**
**మూలం : జియా బేకరార్ హై (బరసాత్)**

'బరసాత్'లో 'శంకర్ జైకిషన్' బాణీని మక్కికిమక్కిగా తెలుగులో

దక్షిణామూర్తి అనుకరించడం తప్ప - భావంలోనూ సందర్భంలోనూ సంబంధం లేదు. 'జీవితం సవ్యంగా లేదు' అని పల్లవి అర్థం. తెలుగు పాటలో - అది సవ్యంగా వుండడం వల్లేకదా - కలలు నిజం కావడం; కోరికలు తీరడం!

**(5).ఓహో బస్తీదొరసానీ బాగా ముస్తాబయ్యిందీ**
**అందచందాల వన్నెలాడి ఎంతో బాగుంది (అభిమానం)**
**మూలం : లేకే పహలా పహలా ప్యార్ (సి.ఐ.డి.)**

తొలిప్రేమను పొందడమనే అర్థం గలిగిన హిందీ పాటకూ బస్తీ దొరసాని ముస్తాబు కావడానికీ పొంతనలేదు. హిందీ బాణీలో తెలుగుపాట ముస్తాబై ప్రజాదరణ పొందింది - అంతే !

**(6).పగలే వెన్నెల జగమే వూయల**
**కదలే వూహలకే కన్నులుంటే (పూజాఫలం)**
**మూలం : ఆధాహై చంద్రమా రాత్ ఆధీ**
**రహ నజాయ్ తేరీ మేరీ బాత్**
**ఆధీ ములాకత్ .... (నవరంగ్)**

'అర్ధచంద్రుడు, అర్ధరాత్రి - ఈ వాతావరణంలా మన కలయిక మాత్రం అర్ధాంతరంగా మిగిలి పోనీకే' అనే అర్థంగల హిందీ పాటను ఎంత అర్థవంతమైన అనుభూతిపరమైన బాణీలో సి. రామచంద్ర స్వరకల్పన చేశారో ! తెలుగులో ఆ అర్థంలో కాకపోయినా అదే విధమైన అనుభూతిని మిగిల్చారు సాలూరి రాజేశ్వరరావు.

ఇలా ఎన్ని ఉదాహరణలు చెప్పుకొన్నా - తరగవు. అర్థం, సందర్భం వేరయినా- హిందీ బాణీల ననుకరించిన తెలుగు పాటలన్నీ దాదాపు విజయవంతమయ్యాయి.

ఈ సందర్భంలో ఇలాంటి పాటలకు ఒరవడి పెట్టిన విజయావారి చిత్రాల గురించి ప్రస్తావించాలి. ఆ చిత్రాలలో హిందీ బాణీల ననుసరించిన పాటలు ఎక్కువగా రావడానికి కారణం దర్శక నిర్మాతల అభిరుచి. దర్శకులు కె.వి.రెడ్డి హిందీ మట్లకు దగ్గరగా తెలుగు మట్లు వుండేలా చూడమని సంగీత దర్శకులను కోరేవారట. గీత రచయితకు మాత్రం స్వేచ్ఛ నిచ్చి ముందుగా సాహిత్యం సమకూర్చిన తర్వాతే - వాటిని హిందీ బాణీల కనుగుణంగా స్వరకల్పన చేసే బాధ్యత సంగీత దర్శకులు ఘంటసాలకు అప్పగించేవారట.[17] అలా వచ్చిన విజయావారి చిత్రాలలో కొన్ని

17. జె.వి.రాఘవులుతో ముఖాముఖి 28.7.92



పాటలూ వాటికి మూలమైన హిందీ బాణీలు -

'పాతాళభైరవి'

**(1) కలవరమాయె మదిలో నామదిలో...**
**తూ మేరాచాంద్ - మై తేరీ చాందినీ (దిల్లగీ)**

**(2) ఎంత ఘాటు ప్రేమయో...**
**ఆవాజ్‌దే కహాహై - దునియా మేరీ జలాహై (అన్‌మోల్ ఘడీ)**

**(3) ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు...**
**సునో సునో మేరీ దునియావాలో (బాపూజీకీ అమర్ కహానీ)**
**(బాపూజీ నిర్యాణానంతరం మహ్మద్ రఫీ ఇచ్చిన ప్రైవేట్ గ్రామఫోన్‌రికార్డ్)**

'పెళ్లిచేసి చూడు' :

**పెళ్లిచేసి చూపిస్తాం.. మేమే పెళ్లి పెద్దలనిపిస్తాం**
**తేరా ఖిలోనా టూటా బాలక్ (మేలా)**

తెలుగు పాటకి ఈ మాతృక భావం పూర్తిగా వ్యతిరేకం. హిందీపాటలో 'నీ ఆట బొమ్మ విరిగింది' అనే విషాదభావం వుంటే తెలుగులో 'పెళ్లిచేసి చూపిస్తాం' అనే మంగళప్రదమైన భావంతో పాట ప్రారంభమైంది.

'మాయాబజార్' :

**ఒకటే మా వయసు**
**ఓ రాజా - ఒకటే మా సొగసు**
**అపచలం చపలం ... (నృత్యగీతం - ఆజాద్)**

తెలుగు సినిమాపాటలపై హిందీ బాణీల ప్రభావం గురించి తెలుసుకోవడానికి మచ్చుకి సి.నారాయణరెడ్డి సత్యం అనే సంగీత దర్శకుని గురించి చెప్పింది చాలు ! - 'సంగీత దర్శకుడు సత్యం స్వరరచనాశైలి విలక్షణమైంది. వినూతనమైంది. అతని స్మృతి పేటికలో పట్టలేనన్ని హిందీగాత్రాల ట్యూన్‌లుండేవి. ఒక సన్నివేశం ముందుంచగానే దానికి ఉచితంగా వున్న ఏ హిందీ సినీగీతమో అతని గొంతులో కువకువ లాడేది' [18]

18. పాటలో ఏముంది - నా మాటలో ఏముంది - పుట-88

## (ఆ) బాణీ, భావం - రెండూ :

(1) 'విప్రనారాయణ' (1937)లో కస్తూరి నరసింహారావు, కాంచనమాల పాడిన - 'ప్రేమనగరమున'... అనే పాట..

'చండీదాసు' (1934)లో సైగల్, ఉమాదేవి పాడిన 'ప్రేమనగర్ మే...' పాటకు సంగీతంలో నకలు, సాహిత్యంలో ఛాయ [19]

**(2) మెరిసే మేఘమాలికా, ఉరుములు చాలు చాలిక**
**చెలితో మాటలాడనీ, వలపే పాటపాడనీ — దీక్ష (1974)**
**బహారోం ఫూల్ బర్సావో మేరా మెహబూబ్ ఆయాహై(సూరజ్)**

'ఓ వసంతాల్లారా, నా ప్రియురాలు వచ్చింది, పూలను వర్షించండి' అనే భావం గల మూలాన్ని ఎన్నుకొని తెలుగులో అలాంటి సందర్భంలోని పాట రూపకల్పనలో సంగీతదర్శకుడు పెండ్యాల, కవి సి.నా.రె. తమ సత్తాను చూపించారు.

**(3) 'పయనించే ఓ చిలుకా — (కులదైవం)**
**ఎగిరిపో పాడైపోయెను గూడు' - అనే పాటకు**
**'చల్ ఉడ్ జారే పంఛీ' — మూలం (భాభీ)**
**'పద పదవే వయ్యారి గాలిపటమా'... — (కులదైవం)**
**చల్ చల్‌రే పతంగ్ చల్ చల్‌రే — (భాభీ)**

భాభీ చిత్రానికి కులదైవం తెలుగులో 'రీమేక్' కనుక ఈ ఛాయలుండడంలో ఆశ్చర్యం లేదు.

**(4) ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక**
**ఏదారెటు పోతుందో ఎవరినీ అడుగక -**

అనే 'సిరిసిరిమువ్వ' లో వేటూరి రచన-

**ఒహోరే తాల్ మిలే నదీకె జల్‌మే**
**నదీమిలే సాగర్‌మే**
**సాగర్ మిలే కౌన్‌సే జల్‌మే కోయీ జానేన — (అనోఖీ రాత్)**

పాటకు బాణీలో నకలు - భావంలో అనుసృజన.

హిందీ పాటకు భావం యిది - 'లయ నది నీటిలో కలుస్తుంది; నది సముద్రంలో కలుస్తుంది; సముద్రం ఏ నీటిలో కలుస్తుందో ఎవరికీ తెలియదు.'

19. రజత కమలం - తెలుగు సంగీతం. వి.ఎ.కె. రంగారావు



(5) 'నిప్పులాంటి మనిషి' చిత్రంలో సత్యం స్వరకల్పన చేసిన -

**'స్నేహమే నా జీవితం**
**స్నేహమేరా శాశ్వతం**

కల్యాణ్‌జీ - ఆనంద్‌జీ దర్శకత్వంలో వచ్చిన -

**యారీహై ఇమాన్ మేరా యార్ మేరీ జిందగీ — (జంజీర్)**

పాటకు సంగీత సాహిత్యాలలో దగ్గరగా వుంది.

(6) 'స్వప్న' చిత్రంలో రాజశ్రీ రచన -

**ఇదే నామొదటి ప్రేమలేఖ**
**రాశాను నీకు చెప్పలేక**
**ఎదుటపడి మనసు తెలుపలేక**
**తెలుపుటకు భాష చేతకాక**
**పూవనీ పిలవాలంటే - ఆసొగసు ఒక్కదినం**
**మెరుపనీ పిలవాలంటే - ఆ వెలుగు ఒక్క క్షణం**
**ఏరీతిగా నిన్ను పిలవాలో తెలియదు నాకు**
**తెలిసింది ఒక్కటే - నువ్వు నాప్రాణమనీ..**

అనే పాట - 'సంగం' చిత్రంలో హస్రత్ జైపూరీ రచనకు అనుసరణ. బాణీ ఒక్కటే.

**ఏ మేరా ప్రేమ పత్ర పఢ్‌కర్**
**కె తుమ్ నారాజ్ న హోనా**
**కె తుమ్ మేరీ జిందగీహో**
**కె తుమ్ మేరీ బందగీ హో**
**తుఝే సూరజ్ న సముఝుంగా**
**ఇసీమే భీ ఆగ్ హై**
**తుఝే చందా మై సమ్‌ఝూంగా**
**మగర్ ఇసీ మే దాగ్ హై...**

'నా ప్రేమలేఖ చదివి నువ్వు కోపించకు. నువ్వు నాజీవితానివి. నా చుట్టానివి.

నిన్ను సూర్యబింబంతో పోల్చను - ఎందుకంటే అందులో నిప్పు వుంది; నిన్ను చందమామతోనూ పోల్చను; ఎందుకంటే అందులో మచ్చ వుంది' అనే పైపాటలోని భావాన్ని ప్రేరణగా తీసుకొని సూర్యచంద్రుల పోలికలకు - బదులుగా పువ్వునూ మెరుపునూ తీసుకొని తన ప్రతిభను ప్రదర్శించారు. రాజశ్రీ.

(7) బాగా ప్రాచుర్యం పొందిన ఒకే హిందీపాట బాణీకి తెలుగులో రెండు మూడు నకళ్లు వచ్చిన సందర్భాలు కూడా వున్నాయి.

సి. రామచంద్ర సంగీత దర్శకత్వంలో వచ్చిన 'ఆల్‌బేలా' చిత్రంలో -

**'ధీరే సే ఆజారే అఖియన్ మే నిందియా ఆజారే'**

అనే బాణీని, కొంతవరకు, భావాన్ని -

'నీలాల కన్నుల్లో నిదుర రావమ్మా' (ఆత్రేయ) అని అనుసరించిన పాట 'నాటకాల రాయుడు'లో వచ్చింది.

ఇదే హిందీ పాటను బాణీ వరకు - 'పెద్ద మనుషులు' చిత్రంలో -

'నీమీద ప్రాణాలు నిలిపింది రాధ' అనే పాటలో అనుసరించారు.

(8) సి. రామచంద్ర సంగీత దర్శకత్వంలో 'షెహనాయ్' చిత్రంలో పి.యల్. సంతోషి రచించిన -

'జవానీకీ రేల్ చలీ జాయ్'... అనే పాట భావాన్ని మాత్రం అనుసరించి 'ఆరుద్ర' ఆకాశవాణి కోసం -

'పడుచుదనం రైలుబండి పోతున్నది' అనే పాట రాయగా మాధవపెద్ది సత్యం పాడారు. ఆ తర్వాత ఆ సాహిత్యాన్ని 'పెంకిపెళ్లాం' చిత్రంలో వుపయోగించారు.

పైన పేర్కొన్న తెలుగుపాటలు - ఆ పాట(లు) వున్న చిత్రంతో ఏ రకంగానూ సంబంధంలేని హిందీ చిత్రాలలోని పాట(ల) ననుసరించినవిగానీ, పునర్నిర్మిత చిత్రాలలోని పాటలు కానీ కాగా - ఒకేసారి రెండు భాషల్లోనూ అదే చిత్రాన్ని నిర్మించగా పోలికలున్న పాటలు కూడా వున్నాయి. రాజ్‌కపూర్ హిందీలో తీసిన 'ఆహ్' తెలుగులో తీసిన 'ప్రేమలేఖలు' అలాంటి జమిలి సినిమాలు. రెండింటికీ శంకర్ జైకిషన్ సంగీతం సమకూర్చగా - 'ప్రేమలేఖలు' చిత్రంలో పాటల్ని ఆరుద్ర రాశారు. ఇవన్నీ సాహిత్యంలోనూ బాణీల్లోనూ మూలానుసరణలే -



**(1) పందిట్లో పెళ్లవుతున్నాది**
**కనువిందవుతున్నాది**
**మూలం : రాజాకీ ఆయేగీ బారాత్**

'అవుతున్నాది' వంటి పదప్రయోగం తెలుగు నుడికారానికి దూరంగా వున్నా ఉత్తరాంధ్ర మాండలికానికి దగ్గరగా వుంది.

**(2) ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం**
**మూలం : ఝనన ఝనన ఝనన ఘుంఘుర్వా బాజే**

**(3) పాడు జీవితము, యవ్వనం..**
**మూలం : ఛోటీ సీ యే జిందగానీ**

**(4) ఏకాంతమూ, సాయంత్రమూ ఎదనీకై వేచేను.**
**మూలం : ఏ శ్యామ్ కీ తన్‌హాయీయాఁ**

**(5) నీ వెవ్వరో చిరునవ్వులతో...**
**మూలం : జానే నజర్**

**(6) నీపేరు విన్నా నీరూపు కన్నా**
**ఉయ్యాలలూగు మది సై సై సై**
**మూలం : సున్తే థే నామ్ హమ్...**

**(7) రారాదా, మది నిన్నె పిలిచె కాదా**
**మూలం : ఆజారే అబ్ మేరా దిల్ పుకారే..**

ఈ పాటల్లో పదాలకూర్పు తెలుగుదనానికి కొంతదూరం కావడం -గమనార్హం. అయినా ఇవన్నీ తెలుగులో 'హిట్' అయి - ఇంటింటా వినిపించాయి.

## భాషాభేషజం :

తెలుగులో సాంఘిక చిత్రాల శకం ప్రారంభం కాక మునుపే హిందీపదాలను తప్పనిసరిగా ఉపయోగించవలసిన 'రామదాసు', 'కబీరు', 'తుకారాం' వంటి చిత్రాలు వచ్చాయి. సాంఘికచిత్రాలలో హిందీపదాలను ఉపయోగించిన తొలిచిత్రం 'కాలచక్రం'.

అందులో త్రాగుబోతు పాడిన పాట -

**'మిఠారీ, తేనె కఠారీ, నారీ మిఠారీ**
**చిటికలో రావే, మేరీ ప్యారీ,**

మోతాదు మించిన హిందీపదాలతో వచ్చిన పాట 'పంతులమ్మ' (1943) లో వుంది.

**లేవ్ దొరా - లేలేవ్ దొరా**
**ఫర్మాయిషీ మై బతావూంగీ...**

50ల దశకంలో - జట్కావాలా, కాబూలీవాలా మొదలైన పాత్రల పాటల్లో హిందీపదాలు ఎక్కువగా దొర్లాయి -

**నా రాజా ఘోడా, హవాకె ఘోడా జల్దీ చలో**
**ఘర్ మె దానా గరమ్ గరమ్ హై**
**ఖానా పీనా జల్దీ చలో ...**

'నా యిల్లు' చిత్రం వచ్చేసరికే తెలుగుసినిమాలో పూర్తి హిందీపాటలు రావడం కూడా ప్రారంభమైంది. ఆ చిత్రంలో అయిదుభాషల్లో ప్రావీణ్యం వున్న నర్తకి - 'మై హస్తీ గాతీ ఆయీ' అనే పాటను పూర్తిగా హిందీలో పాడుతుంది. అదే చిత్రంలో - 'మేనకా విశ్వామిత్ర'ల నృత్యం కూడా -

'పుష్పపరి - పుష్పభరి-పుష్పఝరి...' అనే ప్రారంభంతో - పూర్తిగా హిందీలోనే నడిచింది.

60ల, 70ల దశకాల్లో 'కవాలీ' పాటల్లో ఎక్కువ హిందీ పంక్తులు చోటు చేసుకొన్నాయి -

ఉదాహరణ : **ఓం ప్రేమాయనమః ఓం మనసాయనమః**
**లవ్ ఈజ్ ఆమెన్ .....**
**అల్లాహో మొహబత్ ప్యార్ హో ....**
**జై బోలో జిందాబాద్ ప్యార్‌కో**
**ప్యార్ హై మేరీ జాన్ ప్యార్‌హీహై భగవాన్ (ప్రేమ ఖైదీ)**

ఇప్పుడు వస్తున్న 'స్పీడ్ ట్యూన్స్'లో ఏది హిందీపదమో, ఏది ఆంగ్లపదమో, ఏది తెలుగుపదమో తెలియడం లేదు.

అలాగే పౌరాణిక చిత్రాలకు ఓ ప్రామాణికమైన భాషను పాటించనప్పుడు ఓ పౌరాణిక చిత్రంలో వచ్చిన -



**'మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా**
**ఆ మత్తులోన పడితే గమ్మత్తుగ చిత్తౌదువురా'**

పాటలో 'గమ్మత్తు' అనే పదం దొర్లినందుకు కాలవ్యతిక్రమం అనే ఘోరం జరిగిపోయిందని గుండెలు బాదుకోవలసిన అవసరం లేదు.

## తమిళం :

సినిమాపాటలకు సంబంధించినంతవరకు యిచ్చిపుచ్చుకోవడంలో తెలుగుకు తమిళమంత సన్నిహితమైన భాష మరొకటిలేదు - ఈ రెండు భాషల చిత్రాల నిర్మాణానికి ఒకే కేంద్రం (మద్రాసు), రెండింటికీ పనిచేస్తున్న ఎమ్మెస్. విశ్వనాథన్, కె.వి. మహదేవన్, ఇళయరాజా వంటి సంగీత దర్శకులు, జానకి, వాణీజయరాం, చిత్ర, యస్.పి. బాలసుబ్రహ్మణ్యం వంటి గాయనీ గాయకులు, కణ్ణదాసన్, ఆత్రేయ వంటి పరస్పర అవగాహన కలిగిన గేయ రచయితలు, అనువాద చిత్రాలు, దగ్గరగా వున్న ఆచార వ్యవహారాలు... ఇవన్నీ ఈ ఆదాన ప్రదానాలకు కారణాలు... తెలుగులో చొరబడిన తమిళ మట్లు (Tunes) కోకొల్లలు. అలాగే కణ్ణదాసన్ వంటివారి పాటల ప్రభావం వున్న తెలుగు సినిమాపాటలు కూడ ఎన్నో. వాటి నుంచి మచ్చుకి కొన్ని -

(1) ఎమ్మెస్. విశ్వనాథన్ సంగీత నిర్వహణలో వచ్చిన - 'వాళ్కై పడగు' (జీవననావ) తమిళచిత్రం, 'ఆడబ్రతుకు' తెలుగు చిత్రాలలో భావసారూప్యం వున్న పాటలు ఇలా వున్నాయి.

**'నేట్రు వరై నీయారో నాన్‌యారో**
**ఇన్ఱు ముదల్ నీ వేఱో నాన్ వేఱో**
**ఉన్నై నాన్ పార్కుంబోదు**
**మణ్ణై నీ పార్కిన్‌రాయి**
**ఎన్నై నాన్ పార్కుంబోదు**
**ఎన్నైనీ పార్కిన్‌రాయి** **(కణ్ణదాసన్ - వాళ్కై పడగు)**

'నిన్నటి వరకు నీవెవరో - నేనెవరో. నేటి నుంచి మనం వేఱువేఱు కాదు. నేను నిన్ను చూస్తుంటే - నువ్వు నేలవైపు చూస్తున్నావు. నేను నింగికేసి చూస్తుంటే నువు నాకేసి చూస్తున్నావు' - అనే భావంగల ఈ పాట చరణాన్ని మాత్రం ఆడబ్రతుకు చిత్రంలో ఆధారంగా తీసుకొన్నారు సి. నారాయణరెడ్డి. పల్లవి వేరు.

ప॥ కనులు పలకరించెను
పెదవులు పులకించెను
బుగ్గలపై లేత లేత
సిగ్గులు చిగురించెను

చ॥ నేను నిన్ను చూసేవేళా
నీవు నన్ను చూడవేలా (ఆడబ్రతుకు)

(ii) కణ్ణదాసన్ పల్లవిని 'పెళ్లిరోజు' చిత్రంలో చరణంగా మార్చుకొన్నారు రాజశ్రీ.

జీవితాన మరువలేము ఒకేరోజు
ఇరు జీవితాలు ఒకటిగా ముడివేసేరోజు
... ... ... ...
నిన్నచూడ నీవు నేను ఎవరికెవరమో
నేడు చూడ ఒకరికొకరమే ...

(2) 'నెంజిల్ ఓర్ ఆలయం' - తెలుగులో 'మనసే మందిరం' గా పునర్నిర్మింపబడింది. ఆ చిత్రంలో కణ్ణదాసన్ రాసిన ఓ పాటను చిన్నమార్పుతో తెలుగుచేశారు ఆత్రేయ.

నినైప్పదెల్లాం నడందునిట్టాల్
దెయ్వం ఏదుమిల్లై (నెంజిల్ ఓర్ ఆలయం)

(అనుకొన్నదంతా జరిగిందా - దైవమనేదే లేదు)

'తలచినదే జరిగినదా
దైవం ఎందులకు' (మనసే మందిరం)

(3) 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాన్ని తెలుగులో - 'ప్రేమించిచూడు' పేరుతో పునర్నిర్మించారు - ఆ చిత్రంలో ముళ్లపూడి వెంకటరమణ రాసిన పాట మాతృక బాణీలోనే వుంది. భావం కూడా ప్రారంభంలో ఒకేలా వుంది -

మాడిమేలె మాడిగట్టి కోడి కోడి సేర్తునిట్ట సీమానే (కాదలిక్క నేరమిల్లై)
మేడమీద మేడగట్టి కోట్లుకూడ బెట్టినట్టి కామందూ (ప్రేమించి చూడు)



(4) మణప్పందల్ (పెళ్లిపందిరి) చిత్రానికి కణ్ణదాసన్ రాసిన పాట -

"ఉడలుక్కు ఉయిర్ కావల్
ఉలగుక్కు ఒళి కావల్
కణ్ణుక్కు ఇమై కావల్
కడలుక్కు కరై కావల్

(దేహానికి ప్రాణం కాపలా, లోకానికి వెలుగు కాపలా, కంటికి రెప్ప కాపలా, కడలికి ఒడ్డు కాపలా)

(ii) ఈ భావాన్ని తీసుకొని 'ఇంటికి దీపం ఇల్లాలే' చిత్రంలో ఆత్రేయ ఇలా రాశారు.

'ఎవరికి ఎవరు కాపలా
ఈ బంధాలన్నీ నీకేలా'

ఆత్రేయకు ప్రాణమైన సంక్షిప్తత ఈ ప్రభావిత గీతాల్లోకూడా కనిపిస్తుంది.

(5) 'కుడిఇరుంద కోవిల్' అనే చిత్రంలో కణ్ణదాసన్ రచన -

'కుమరిప్పెణ్ణిన్ ఉళ్లత్తిలే
కుడి ఇరుక్క నాన్ వరవేణ్డుం
కుడి ఇరుక్క నాన్ వరువదెన్రాల్
వాడగై ఎన్న తరవేణ్డుం

(నాకు కన్నెపిల్ల మనసులో కాపురముండాలని వుంది. అలా వుండడానికి అద్దె యెంత చెల్లించాలి)

పైపాట స్ఫూర్తితో యస్పీ. కోదండపాణి సంగీత సారథ్యంలో వచ్చిన 'జగజ్జెంత్రీలు' చిత్రంలో జి.విజయరత్నం రాసిన పాట -

'నీ మనసులోకి రావాలి కాపురానికి
నేనద్దె యెంత యివ్వాలి మాసానికి'

(6) 'పడిత్తాల్ మట్టుమ్ పోదుమా' చిత్రం కోసం కణ్ణదాసన్ రాసిన -

తొట్టాల్ సుడువదు నెరుప్పాగుమ్
తొడామల్ సుడువదు సిరిప్పాగుమ్'

(తాకితే కాలేది నిప్పు - తాకకుండానే కాలేది చిరునవ్వు)

పాట పంక్తుల స్ఫూర్తితో - 'స్వామిద్రోహులు' చిత్రంలో జి. విజయరత్నం రాసిన చరణం -

**తాకితే కాలేది నిప్పురా**
**తాకకనే కాలేది నవ్వురా**
**నిప్పులాంటి కన్నెపిల్ల నేను.**

ఇలా భావాన్ని తీసుకోకుండా కేవలం బాణీని మాత్రమే అనుకరించినవి అనేకం -

ఉదాహరణకి ఒకటి -

'పోలీస్‌కారన్ మగళ్' చిత్రాన్ని 'కానిస్టేబుల్ కూతురు' పేరుతో తెలుగులో పునర్నిర్మించారు - ఈ సినిమాలో -

**'చిగురాకుల ఊయలలో ఇల మరచిన ఓ చిలుకా**
**మధురాశలు పలికేవో - నా మనసును చిలికేవో'**

అనే పాట నేటికీ వినిపిస్తోంది. తమిళంలో ఈ పాటను కణ్ణదాసన్ రాశారు.

**'ఇంద మన్రత్తిల్ ఓడివరుం**
**ఇళమ్ తెన్రలై కేట్కిన్రేన్**

'ఈ మండపానికి పరుగెత్తి వస్తున్న చిరుగాలిని అడుగుతున్నా' అని ఈ పంక్తుల భావం. దీనికీ తెలుగు పాటకూ భావసారూప్యం లేదు. తమిళ చిత్రానికి ఎమ్మెస్. విశ్వనాథన్ సంగీత దర్శకులు కాగా తెలుగు చిత్రానికి సంగీత దర్శకులు మాస్టర్ వేణు.

ఇంకా ఆత్రేయ రాసిన -

**'రేపంటి రూపం కంటి**
**పూవింటి తూపులవంటి**
**నీకంటి చూపులవెంటా**
**నా పరుగంటీ' - (మంచీ - చెడు)**



**మౌనమె నీ భాష**
**ఓ మూగ మనసా (గుప్పెడు మనసు)**

**గాలి కదుపు లేదు - కడలి కంతులేదు ...**
**తుళ్ళి తుళ్లి గంతులు వేసే లేగకేది కట్టుబాటు**
**మళ్లీ మళ్లీ వసంతమొస్తే మల్లెకేల ఆకుచాటు (ఇది కథ కాదు)**

వంటి ఎన్నో పాటలకు, ఇతర కవుల పాటలకు సాహిత్యపరంగా కణ్ణదాసన్ పాటల ప్రేరణ వుంది. ఇంతెందుకు -

**నేలతో నీడ అన్నది నను తాకరాదని... (మంచిరోజులొచ్చాయి)**

అనే కృష్ణశాస్త్రి పాటకు కూడా

**నిలవై పార్తు వానం చొన్నదు**
**ఎన్నై తొడాదే... (సవాలే సమాళి)**

అనే కణ్ణదాసన్ పాటే ప్రేరణ !!

'విప్రనారాయణ' చిత్రంలో సముద్రాల రచించిన - 'మేలుకో శ్రీ రంగ మమ్మేలుకోవయ్యా' పాట -తొండరడిప్పొడి ఆళ్వార్ (విప్రనారాయణునికి తమిళుల వ్యవహారం) రచించిన మూడు పాశురాల సారాంశమే

ఇలా తమిళం నుంచి వచ్చిన బాణీలకు భావాలకు తెలుగుకూడా బదులిచ్చింది. అయితే తమిళగీతాల్లోవున్న భావగాంభీర్యాన్ని చూస్తుంటే ఇప్పుడెక్కువగా శబ్దాడంబరంతో తెలుగువాళ్లకే అర్థంకాని అన్వయంతో వస్తున్న తెలుగు పాటల్ని అనుసరించడానికి తమిళకవులు ఎంత అవస్థపడతారో అనిపిస్తుంది.

## కన్నడం :

'కన్నడ కస్తూరి - తెనుగు తేట' అన్నారు. తెలుగు సినిమాపాటల్లో బాణీల వరకు మాత్రమే కన్నడ కస్తూరి గుబాళించింది. తెలుగు కన్నడ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన రాజన్ - నాగేంద్ర, జి.కె. వెంకటేష్ మొదలైన వారివల్ల తెలుగు కన్నడ చిత్రాల పాటలు పరస్పరం ప్రభావితమయ్యాయి. కొన్ని మచ్చుతునకులు.

(1) 'బయలుదారి' (బహిరంగ ప్రదేశం) కన్నడ చిత్రంలోని -

**బానల్లో నీనె - భువియల్లా నీనె**
**నన్నల్లు నీనె - ఎల్లెల్లు నీనె**

(నింగిలో నీవే - నేలమీదా నీవే - నాలోనూ నీవే.. ఎక్కడ చూసినా నీవే)

అనే పాట బాణీని అనుసరిస్తూ - 'పంతులమ్మ' చిత్రంలో - వేటూరి సుందరరామమూర్తి రాసిన పాట -

**'సిరిమల్లె నీవే - విరిజల్లుకావే**
**వరదల్లె రావే - వలపంటి నీవే**

(2) 'బయలుదారి' చిత్రంలో -

**కనసలూ నీనె - మనసలూ నీనె**
**నన్నాణె - నిన్నాణె**

(కలలో నీవే - మనసులో నీవె ; నీమీద ఒట్టు - నామీద ఒట్టు) పాట బాణీని తీసుకొని వేటూరి ' నాలుగుస్తంభాలాట' లో -

**'చినుకులా రాలి నదులుగా సాగి**
**వరదలై పొంగె నీప్రేమా నాప్రేమా'**

అనే పాట రాశారు.

ఈ రెండు చిత్రాలకూ రెండుభాషల్లోనూ రాజన్-నాగేంద్రలే సంగీత దర్శకులు

(3) 'తాయిదేవర' (మాతృదేవత) అనే కన్నడ చిత్రంలో 'హాయాగిదే' అనే యుగళగీతం బాణీని అనుసరించి - 'జమీందారుగారి అమ్మాయి' తెలుగు చిత్రంలో-

**'మ్రోగింది వీణా పదే పదే...'**

అనే 'సోలో' దాశరథి రాశారు.

(4) 'దారి తప్పిద మగ' (దారి తప్పిన కొడుకు) అనే కన్నడ చిత్రంలో ఒకదొంగ ఒక కంఠహారాన్ని దొంగిలించే సందర్భంలో 'కణ్ణంచిన' అనే పాట వుంది. ఆ బాణీని తీసుకొని - 'అమెరికా అమ్మాయి' సినిమాలో-'ఒక వేణువు వినిపించెను అనురాగ గీతిక' అని ప్రేయసిని ప్రియుడు ఆరాధిస్తూ పాడే సందర్భంతో పాటను రాయించారు.

---

20. భగవద్గీత - కర్మయోగము. 21 శ్లోకం



(5) 'సొసెయిద సౌభాగ్య' (కోడలి సౌభాగ్యం) అనే చిత్రంలో 'రవివర్మన' పాట బాణీని తీసుకొని "రావణుడే రాముడైతే" చిత్రంలో -

**'రవివర్మకే అందని ఒకే ఒక అందానివే'**

అనే పాటను రాయించారు. రెండుభాషల్లోని పాటలు ఆనందమయమైన సందర్భం కోసం రాసినవే. పై మూడు తెలుగు చిత్రాలకూ - ఆ పాటలకు ఊపిరిపోసిన పాటలుగల కన్నడ చిత్రాలకూ సంగీత దర్శకులు ఒకరే - జి.కె. వెంకటేష్.

కన్నడబాణీల ననుసరించిన తెలుగుపాటలు కృతకంగా లేవు సరికదా పదే పదే వినే పాటలుగా మిగిలాయి.

ఏతావతా అన్యభాషలు సాహిత్యపరంగా తెలుగు సినిమాపాటను సుసంపన్నం చేస్తే; కొన్ని బాణీలు మాత్రం తెలుగు నుడికారానికి దూరం చేశాయి.

## 6. పాత పాటలు :

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరోజనః**
**సయత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే** [20]

శ్రేష్ఠులు ఎలా ప్రవర్తిస్తే - ఇతరులూ అలాగే ప్రవర్తిస్తారు. శ్రేష్ఠులు చూపిన మార్గంలో నడవడం లోకసహజం. ఈ ఆనవాయితీని సినిమా కవులు కూడా పాటించారు. ప్రాచీన కవులంతా ముందుతరం కవులను అనుసరించినట్టే - సినిమా కవులు కూడా పాత సినిమాపాటల బాటలోనే కొన్ని పోతపాటల్ని రాశారు.

ఈ మూసపోతపాటల్లో బాణీల అనుకరణలకంటె భాషాభావాల అనుకరణలే ముఖ్యమైనవి. నిజానికి ఈ బాణీల వ్యామోహం దర్శకనిర్మాతలది. మిగతా రెండు అంశాలలో వచ్చిన అనుకరణలను మూడు రకాలుగా విభజించవచ్చు (1) పూర్వానుకరణలు (2) సమకాలీన అనుకరణలు (3) స్వీయగీతానుకరణలు. ఇక్కడ కేవలం అనుకరణ అనే పదాన్ని మాత్రమే వాడ్డానికి కారణాన్ని కింది ఉదాహరణలు తెలియ జేస్తాయి.

### (i) పూర్వానుకరణలు :

'నల్లవాడే' అనే పదం వినగానే చాలామందికి 'దసరాబుల్లోడు' చిత్రంలోని ఆత్రేయ పాటే గుర్తొస్తుంది. కాని అలాంటి పాటలు ఆ పాటకు ముందు

మూడున్నాయనీ-వాటిలో మొదటిది బసవరాజు అప్పారావు 'రాధికాగీతమ'ని, అది-'మాలపిల్ల' సినిమాలో పాటగా ఉపయోగింపబడిందనీ తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

(i) మాలపిల్ల' (1938) సినిమాలో పాటను కొండమీద పాతగుడిలో చిన్ని కృష్ణుణ్ణి పూజిస్తూ కథానాయికా, ఆమె నెచ్చెలి పాడతారు.

**ఆమె : నల్లవాడే గొల్ల పిల్లవాడే**
**చెలియ, కల్లగాదే వానివల్లో జిక్కితినే**

**సఖి : వచ్చినాడే తోటజొచ్చినాడే, సకియ**
**చొచ్చినాడే మనసు ముచ్చిలించాడే**

**ఆమె : ఆగినాడే పొదల దాగినాడే**
**మనసు రాగబంధమువేసి లాగుకొన్నాడే**

**సఖి : చూచినాడే మోము దాచినాడే - నాదు**
**దాచుకొన్న వలపు దోచుకున్నాడే**

**ఆమె : ఊదినాడే మురళి చేదినాడే వలపు**
**నాదు మది తన రూపు మీదు నిలిపినాడే ...**

**ఇద్దరు : పాడుకొంటా మాటలాడుకొంటా నన్ను**
**చూడవా దయనుచు వేడుకొంటా**

(చివరి రెండు పంక్తులు సినిమాకోసం చేర్చినవి - బసవరాజు అప్పారావు రాసినవి కావు)

(ii) పై పాట ప్రేరణగా - 'చిరంజీవులు' లో (1956) మల్లాది రామకృష్ణ శాస్త్రి అదే కొలతకు యిలా రాశారు -

**'అల్లవాడే రేపల్లెవాడే**
**అల్లిబిల్లి పిల్లంగోవి పాటకాడే, సయ్యాట కాడే ॥అల్లి॥**

**నీలాల కన్నుల నీటుకాడే - తెరచాటు వాడే**
**వాలారు చూపుల వన్నెకాడే - వన్నె చిన్నెవాడే**
**నీలాంటిరేవులు ఏలేవాడే - కన్నార నినుజూచి కవ్వించినాడే ॥అల్లి॥**



(iii) 'పెళ్లిసందడి' (1959) లో అక్క చెల్లెళ్లు పాడే నృత్య గీతంగా సముద్రాల (జూ)పై బాణీలోనే ఇలా రాశారు -

**అక్క : నల్లని చల్లనివాడే**
**పిల్లనిగ్రోవి గోపాలుడే - రేపల్లెకు వెలుగే గోపాలుడే**

**చెల్లెలు : చల్లనమ్మే పిల్లల నాపే**
**అల్లరి చిల్లరి గోపాలుడే - కడునల్ల చల్లదనాల గోపాలుడే**

ఇలా సముద్రాల కూడా పల్లవి వరకు "ల్ల" వృత్త్యనుప్రాసను విడిచి పెట్టలేదు.

(iv) పై ముగ్గురూ 'నల్లవాడు' నచ్చి ఒక్కొక్క పాటరాస్తే- మరీ మరీ నచ్చిన ఆత్రేయ ఒకే చిత్రంలో (దసరాబుల్లోడు) రెండు పాటలు రాశారు. మొదటిది కథానాయకుడు ప్రేయసులిద్దరితో కలిసి పాడేది. రెండోది ప్రేయసులిద్దరూ పంచుకోనేది. ఈ సందర్భంలో పై మూడు పాటలకూ సంబంధంవున్న ఆత్రేయ రాసిన రెండోపాట పరిశీలిద్దాం !

**ఆమె 1 : నల్లవాడే... అమ్మమ్మా... అల్లరి పిల్లవాడే**
**ఆమె 2 : చిన్నవాడే... ఓయమ్మా రాధకే చిక్కినాడే**
**ఆమె 1 : లేదమ్మాలేదు... రుక్మిణికే దక్కినాడే...**
**ఆమె 2 : వెన్నవంటి మనసున్న చిన్నవాడే**
**ఆమె 1 : చిన్ననాటినుండి నువ్వుకోరుకొన్నవాడే**
**ఆమె 2 : ప్రేమకే బానిసై వుంటాడే**
**ఆమె 1 : కాదమ్మా... భక్తికే దాసుడై వుంటాడే...**

రచనలో ఎవరి శైలి వారిదయినా... ఈ నాలుగు పాటలూ దాదాపు ఒకేలా వున్నాయి. మిగతా మూడు పాటలు మొదటి పాటకు అనుకరణలే. అయితే ఆత్రేయ పాటకు వచ్చినంత ప్రచారం మిగతా పాటలకు రాలేదు.

(ఆ) 'అపవాదు' (1941) చిత్రంలో ఉపయోగించిన బసవరాజు అప్పారావు గీతం -

**'పదిమందిలో పాటబాడుమని**
**బలవంతము జేయకు నాథా'**

ఈ పల్లవిముద్ర ఆత్రేయ 'డాక్టర్ చక్రవర్తి (1964) చిత్రంలో రాసిన రెండు పాటల పల్లవుల మీద కనిపిస్తుంది -

1. పాడమని నన్నడుగతగునా
పదుగురెదుటా పాడనా
కృష్ణా పదుగురెదుటా పాడనా ?

2. పాడమని నన్నడగవలెనా
పరవశించి పాడనా
నేనే పరవశించి పాడనా !

'ఆనంద నిలయం' (68)లో ఆరుద్ర రాసిన పాట పల్లవికూడా బసవరాజు పాటకు దగ్గరగానే వుంది -

**"పదిమందిలో పాట పాడినా - అది**
**అంకితమెవరో ఒకరికే**
**విరితోటలో పూలెన్ని పూచినా - గుడికి**
**చేరేది నూటికి ఒకటే"**

ఈ మూడుపాటలూ పల్లవులమేరకు మొదటిపాటను స్ఫురింపజేసినా చరణాల్లో యివి అనుసృజనలే - ఈ పాటలు మూలాన్ని మించిన ప్రచారాన్ని పొందాయి.

(ఇ) పై పాటల్లో ఆత్రేయపాటలను గుర్తుకు తెచ్చే మరోపాట 'అమెరికా అమ్మాయి'లో దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన -

**"పాడనా తెలుగుపాట**
**పరవశమై నీపాట నానోట**
**ఒళ్లంతా ఒయ్యారికోక**
**కళ్లకు కాటుకరేఖ"**

ఈపాట వినగానే ఒకవేళ 'డాక్టర్ చక్రవర్తి'లో పాటలు వెంటనే స్ఫురించక పోయినా - స్మరించవలసిన మరోపాట 'పల్లెటూరిపిల్ల'లో తాపీ ధర్మారావు రచన -

**'పల్లెసీమలె అందమోయి ఆనందమోయి...**
**నుదుట కుంకుమరేఖ**
**చుట్టూ చెంగావికోక**
**నీటి కడవతో రాకపోక**



**పల్లెపడుచుల కందమోయి"...**

(ఈ) చెంగావికోక అనగానే - చెంగున జ్ఞాపకాల్లో చొరబడే రెండు మూడు పాటలు -

రాజ్యం పిక్చర్స్ 'శకుంతల' (66)లో కొసరాజు-పల్లెవాడి పాటను ఇలా ప్రారంభించారు.

**'సెంగాయి కట్టిన సిన్నదీ సేరడేసి కళ్లువున్నదీ**
**మనసులోన అది ఏమో అణిసిపెట్టు కొంటున్నదీ'**

'బంగారు బాబు' (73)లో ఆత్రేయ పాట అందరికే తెలిసిందే !

**"చెంగావి రంగుచీర కట్టుకొన్న చిన్నది**
**దాని జిమ్మడియ్య అందమంతా చీరలోనే వున్నదీ"**

అంత అందమైన చీరని ఎవరు మాత్రం విడిచిపెడతారు ?
'తూర్పువెళ్లే రైలు'లో ఆరుద్ర

**"చుట్టూ చెంగావి చీర కట్టాలే చిలకమ్మా"** అన్నారు.

-ఇంకా పొడిగిస్తే ఇది 'అంత్యాక్షరి' అయ్యే ప్రమాదముంది.

(ఉ) 'మూగమనసులు'లో కొసరాజు పాట వినని తెలుగువారుండరు అంటే అతిశయోక్తి కాదేమో !

**"గౌరమ్మా నీ మొగుడెవరమ్మా**
**ఎవరమ్మా వాడెవరమ్మా"...**
**సెప్పాలంటే సిగ్గుకదయ్యా**
**ఆనవాళ్లు నేసెబుతానయ్యా**
**సిగలో నెలవంక మెడలో నాగరాజు**
**ఆతేడు నావాడు - సరిరారు వేరెవరు**
**మావయ్యా నామొగుడెవరయ్యా**
**ఎవరయ్యా... వేరెవరయ్యా ?**

ఈ ఆనవాళ్లు 'జీవితం' (1951) లో 'తోలేటి' పాటవి -

**"చక్కనైన కోయరాజును ఎక్కడైన చూశారా ?**
**మీరెక్కడైన చూశారా" ?**

అని నాయిక అడిగితే చెలి - అతని ఆనవాళ్లను చెప్పమని అడిగింది -

**"అతను ఎవరో చెప్పమ్మా**
**ఆనవాళ్లు చెప్పమ్మానీవు...**

దానికి నాయిక సమాధానం -

**అతడేనయ్యా, నాజతగాడయ్యా**
**నిజమేనయ్యా, ఒకచేతిలో అమ్ము**
**ఒక చేత విల్లయ్యా**
**సిగపట్టున చుట్టుతాడయ్యా**
**అతి సోకైనవాడయ్యా**

ఈ రెండు పాటలకూ వివరణ యివ్వాల్సిన అవసరం లేనంత స్పష్టంగా వుంది - సామ్యం.

(ఊ) తోలేటి పేరు చెప్పగానే గుర్తొచ్చే సినిమా 'కాళహస్తి మాహాత్మ్యం'. దీనిలో తిన్నడు తన మూఢభక్తిని శివుడికి నివేదించుకొన్న ఘట్టంలో -

**"భక్తియేదో పూజలేవో తెలియనైతినే**
**పాపమేదో పుణ్యమేదో కాననైతినే"**

అన్న పంక్తుల ప్రభావం 'భక్త కన్నప్ప'లో అదే సందర్భంలో వేటూరి రాసిన పాటలో కనిపిస్తుంది.

**"పుణ్యము పాపము ఎరుగనినేను**
**పూజలు సేవలు తెలియనినేను**
**ఏ పూలుతేవాలి నీపూజకు**
**ఏ లీల చేయాలి నీసేవలు...**

(ఋ) 'అనురాగం' (63)లో మల్లాది రామకృష్ణశాస్త్రి పాటల్ని



సన్నజాజులతోను, సంపెంగలతోనూ పోలిస్తే - 'అమాయకురాలు' లో ఆరుద్ర - పాప నవ్వుల్ని అలాంటి వాటితోనే పోల్చారు.

**"సన్నజాజి తీవలోయ్**
**సంపెంగి పూవులోయ్**
**చిలిపి సింగారులోయ్ -**
**పాపలు సిరులొలికే సింగారులోయ్ - (అనురాగం-మల్లాది)**

**"సన్నజాజి పువ్వులు - చందమామ కాంతులు**
**చిన్నారి పాప నవ్వులు - " (అమాయకురాలు-ఆరుద్ర)**

(ౠ) 'పదండిముందుకు' (62)లో శ్రీశ్రీరాసిన పాటలో -

**"కల్లు మానండోయ్ బాబయ్యా**
**కళ్లు తెరచీ సాగిరారయ్యా బాబయ్యా**
**కాపురాలనుకూల్చు రాకాసిరా**
**కన్నీళ్లు కష్టాలు కొనితెచ్చురా -"**

పంక్తులకు "గృహలక్ష్మి" (38) లో నాగయ్య పాడిన పాట స్ఫూర్తి అని అందరికీ తెలుసు.

**(ఎ) "ఆకాశవీథిలో హాయిగా ఎగిరేవు**
**దేశ దేశాలన్నీ తిరిగి చూసేవు**
**ఏడ తానున్నాడో బావ, జాడతెలిసిన పోయిరావా**
**అందాల ఓ మేఘమాలా ! నీలాల ఓ మేఘమాలా ! (మల్లీశ్వరి-దేవులపల్లి)**

**నీలాల నింగిలో పయనాలు చేసి**
**నాజాడ తెలియని స్వామినిచూసి**
**తెలుపుమా చల్లని చందమామా -**
**తెలుపుమా చల్లని చందమామా" (వీరాంజనేయ-సముద్రాల)**

వియోగంతో సీత పరితపించే ఘట్టంలోని ఈ పాట-బాణీలో కూడా- 'మల్లీశ్వరి' పాటకు దగ్గరగావుంది - సముద్రాల కృష్ణశాస్త్రికి పూర్వుడయినా ఈ పాట రాసింది చివరికాలంలో !

(ఏ) ఒక ప్రత్యేకమైన సన్నివేశంలో రాసిన పాటను ఒక కవి అద్భుతంగా పండించినపుడు - మళ్లీ అటువంటి సన్నివేశంలో మరోకవి పాట రాయవలసి వచ్చినప్పుడు... ముఖ్యంగా ముందుపాట రాసిన కవి తనకు నచ్చిన వాడయితే - రెండోపాట మొదటి పాటనే అనుసరిస్తుంది.

**మీ నగుమోము నా కనులారా కడదాకా కననిండు**
**ఈ సూత్రముతో యీ కుంకుమతో నను కడతేరి పోనిండు**
**(బడిపంతులు-ఆత్రేయ)**

అని ముత్తైదువ పుణ్యస్త్రీగా మరణించాలని కోరుకునే పాట రచనకు ఆత్రేయ బడిపంతులయితే - ఆ ఒరవడినే దిద్దుకొన్నారు వేటూరి !

**"ఈ కుంకుమతో ఈ గాజులతో**
**కడతేరి పోనీ స్వామీ**
**కనుమూయనీ నన్ను స్వామీ (పల్నాటి సింహం)**

వేటూరి పూర్వ కవుల రచనల స్ఫూర్తితో చేసిన అందమైన అనుసృజనలకు మరో ఉదాహరణం -

**గోపాలకృష్ణుడు నల్లన, గోకులములో పాలు తెల్లన**
**కాళిందిలో నీళ్లు చల్లన, పాట పాడెద నీగుండె ఝల్లన**
**(రాధిక- సదాశివబ్రహ్మం)**

**గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన**
**గోధూళి ఎర్రన - ఎందువలన ? (సప్తపది-వేటూరి)**

ఇలా చెబితే చాలావుంటాయి.

## సమకాలీన అనుకరణలు :

సాధారణంగా ఒకపాట విజయాన్ని సాధిస్తే వెనువెంటనే దానికి ప్రతిధ్వనులు వినిపిస్తాయి. వీటికి చాలా వరకు దర్శక నిర్మాతల ప్రేరణ వుంటుంది. ఇలా రెండు మూడేళ్ల వ్యవధిలో ప్రయోగాలకు వినిపించిన ప్రతిధ్వనులను పరిశీలిద్దాం -

(అ) 'బ్రతుకుతెరువు' (1953)లో బహుళ ప్రచారం పొందిన పాట -

**"అందమె ఆనందం - ఆనందమె జీవిత మకరందం**
**పడమట సంధ్యారాగం - కుడిఎడమల కుసుమపరాగం**



**ఒడిలో చెలిమోహనరాగం - జీవితమే - మధురానురాగం ॥అంద॥**
**పడిలేచే కడలితరంగం - వడిలో జడిసిన సారంగం..**
**సుడిగాలిలో ఎగిరే పతంగం - జీవితమే ఒక నాటకరంగం**
**ఒడిలో చెలి తీయనిరాగం జీవితమే మధురానురాగం**
**చల్లని సాగరతీరం మది ఝల్లను మలయసమీరం**
**మదిలో కదిలే సరాగం - జీవితమే అనురాగయోగం (సముద్రాల జూనియర్)**

దీనికి నకలు 'మేనరికం' (1954)లో జంపన పాట -

**ఆనందం ఆనందం ఆనందమె జీవిత పరమార్థం**
**ముసిముసినవ్వుల మోహనరాగం-కొసరే కోకిల వసంతరాగం -**
**శరన్మల్లికా మధురనికుంజం-ప్రేమదృగంచల బాలకురంగం ॥ఆనం॥**

**చల్లగాలిలో గగనవిహారం - సాగే ఊయల స్వైరవిహారం**
**సెలయేటిలో స్వేచ్ఛాయానం-కలిసే మనసుల ప్రణయకలాపం ॥ఆనం॥**

రెండోపాటలో భాషకాని, శైలికాని ఆఖరికి అంత్యప్రాసలు గాని... అన్నీ ఎగుడు దిగుడే ! అందుకే వ్రతం చెడినా ఫలం దక్కలేదు.

(ఆ) దీనికి విరుద్ధంగా అసలుకంటె అనుకరణకే పేరొచ్చిన సందర్భాలకు ఉదాహరణ-

**ఓ అందమైన బావా.. వహ్ వా**
**ఆవుపాల కోవా... వారెవా**
**విందుగా పసందుగా ప్రేమనందుకోవా (రుణానుబంధం-60)**

సముద్రాల (జూ) రాసిన పాట అందరికీ తెలిసిందే! దీనికి స్ఫూర్తినిచ్చిన గోరాశర్మ పాట

**'ఆవుపాల కోవా బావా**
**ఆరగించరావా బావా (బలేబావ 57)**

(కె.జి.శర్మ పాట చాలా మందికి తెలియదు. దేనికేది ఋణానుబంధమో!)

(ఇ) 'పాతాళభైరవి', 'రూపవతి'-రెండూ ఒకే సంవత్సరం (1951)లో వచ్చాయి. వాటిలో మరీ దగ్గరగావున్న రెండు పాటలు -

**(i) కలవరమాయే మదిలో నామదిలో (పింగళి-పాతాళభైరవి)**

**(ii) కలవరమాయె నా మదిలోనా**

**ఇదేమిటో ఈవేళా, ఓ ఇదేమిటో ఈ వేళా**
**ఆనందమాయె మరి హేతువేమొ నాలో ఈవేళా (కె.జి.శర్మ-రూపవతి)**

రెండోపాట చిరునామా చాలామందికి తెలియకపోవడానికి 'హేతువు' తెలుస్తూనే వుంది.

(ఈ) కృష్ణశాస్త్రి 'మల్లీశ్వరి' పాటల ప్రభావంనుంచి, ఆత్రేయ అంతటి కవికూడా తప్పించుకోలేక పోయారనడానికి ఓ ఉదాహరణ.

**ఔనా కలలేనా !**
**నాటి కథలు వ్యథలేనా, నీటిపైని అలలేనా ! (మల్లీశ్వరి)**

**"ఔనా! తుది యౌనా**
**ఎడబాటే యిక గతియౌనా" (బొమ్మల పెళ్లి - ఆత్రేయ)**

**(ఉ) 'నీ చూపు సుప్రభాతం**
**నీ నవ్వు పారిజాతం... ఆత్రేయ ప్రేమగీతం'**
**(మాధవయ్యగారి మనువడు)**

అని ప్రేమగీత రచనలో ఆత్రేయకు అగ్రతాంబూల మిచ్చిన వేటూరి మీద ఆత్రేయ ప్రేమముద్రను కూడ గమనిద్దాం -

**ప్రియతమా, నను పలకరించు ప్రణయమా**
**అతిథిలా... నను చేరుకున్న హృదయమా**
**బ్రతుకులోని బంధమా**
**పలుకలేని భావమా**
**మరువలేని స్నేహమా**
**మరలిరాని నేస్తమా..**
**(వేటూరి-జగదేకవీరుడు-అతిలోకసుందరి 1990)**

**ప్రియతమా... నాహృదయమా**
**ప్రేమకే ప్రతిరూపమా**
**నాగుండెలో నిండిన గాయమా**
**నను మనిషిగా చేసిన త్యాగమా (ఆత్రేయ-ప్రేమ-1988)**



**3. స్వీయానుకరణలు :**

**వెన్నెల వేళలోనే వేణుపూదేనా**
**వేణుపూదిన వేళలోనే వెన్నెలాయేనా ?**

అనే లలితగీతం కృష్ణశాస్త్రి ముందుగానే రచించగా అది ఆయన మరణానంతరం 'ఒక అమ్మాయి కథ'లో సినిమాపాటగా వచ్చింది.

ఆ పల్లవి స్ఫూర్తితోనే ఆయన

**మావిచిగురు తినగానే కోకిల పలికేనా**
**కోకిల గొంతు వినగానే మావిచిగురు తొడిగేనా ? (సీతామాలక్ష్మి)**

అనే పల్లవిని రూపొందించారు

ఈ బాణీ ఆత్రేయను కూడా వెంటాడి నట్టుంది -

ఆమె : **మంచుకురిసే వేళలో మల్లె విరిసేదెందుకో**
అతడు : **మల్లె విరిసే మంచులో మనసు మురిసేదెందుకో (అభినందన)**

అనకుండా వుండలేకపోయారు.

**(ii)** అన్నట్టు ఆత్రేయ కూడా నచ్చిన వాటిని వదలని శ్రీనాథుడే !

**"ఎక్కడమ్మా చంద్రుడు? చుక్కల్లారా, అక్కల్లారా**
**నిక్కినిక్కి చూతురేల ఎక్కడమ్మా చంద్రుడూ**
**చక్కనైన చంద్రుడు-ఎక్కడమ్మా కానరాడు... (అర్ధాంగి (58))**

**చక్కనయ్యా చందమామా ఎక్కడున్నావు ?**
**నీవులేక దిక్కులేని పక్షులయ్యాము (భార్యాబిడ్డలు)**

**(iii)** కల్యాణాన్ని వర్ణించే పాటలను 'స్వర్ణమంజరి', 'సీతారామకల్యాణం', 'లవకుశ'లలో సముద్రాల పోలికల్ని గుర్తుపట్టేలాగే రాశారు.

## పేరడీలు :

పాతపాటల పేరడీలు కూడా కొత్తసినిమాలలో ఎక్కువగానే వస్తున్నాయి. ఉదాహరణకు 'మాయాబజార్'లో పాటలను గుర్తుచేస్తూ 'చూపులుకలిసిన శుభవేళ' (సినిమాపేరుకూడా ఆ పాటలో భాగమే) లో ఇద్దరు మగాళ్లమీద చిత్రీకరించిన హాస్య గీతం-

**ఖైదీ అయినది నామనసు**
**అందుకె నాకీ కలవరము - అంతేలేని పరవశము**

అలాగే 'సీతారామయ్యగారి మనుమరాలు'లో 'మాయాబజార్'లోని పాటను గుర్తుచేస్తూ-వేటూరి రాసిన పాట కూడా పేరడీయే.

**చెలీ ఓ సీతా నీవంటి దివ్య స్వరూపము**
**వేర్ వేర్ సెర్చిన నోయే కదా**
**ఊరంతా సెర్చిన మాయేగదా...**

ఇంకా తామరతంపరగా వచ్చిన-వాన పాటలు, వీణపాటలు, విజయవంతమైన పాటల పల్లవులతో కూర్చిన హాస్యగీతమాలికలు ఇవన్నీ అనుకరణ కోవలోకే వస్తాయి. ఇలా వచ్చిన అనుకరణగీతాల్లో అధికశాతం మూలాలకంటె ఎక్కువ ప్రచారాన్ని పొందాయి.

### ఉపశ్రుతి :

'గాంధారీ గర్వభంగం' అనే అనువాద చిత్రంలో శ్రీశ్రీ రాసిన 'మనుష్యుడిల మహానుభావుడే' స్ఫూర్తితో 'బాలభారతం' సినిమాలో ఆరుద్ర 'మానవుడే మహనీయుడు' అనే పాట రాశారు. ఆ తర్వాత శ్రీశ్రీ మరోచిత్రానికి పాట రాయవలసినప్పుడు ఆ నిర్మాత - 'అదిగో అలాంటిపాట (మానవుడే మహనీయుడు) నాకు మీరు రాసిపెట్టండీ!' అన్నాడట !

***



# నేటిపాట - రేపటిబాట

### పాతా-కొత్తా :

**పురాణ మిత్యేవ న సాధు సర్వం**
**న చాపి కావ్యం నవమిత్యవద్యం**
**సంతః పరీక్షాన్యతరద్భజంతే**
**మూఢః పరప్రత్యయ నేయ బుద్ధిః**

(ప్రాచీనమంతా సాధువూకాదు; నవీనమంతా అధమమూకాదు; సజ్జనుడు పరీక్షించి ఏదో ఒక మార్గాన్ని అనుసరిస్తాడు. మూర్ఖుడు పరుల నమ్మకంచేత నడిపింపబడతాడు.)

ఏనాడో కాళిదాసు చెప్పిన ఈ శ్లోకం-సినిమాపాటలకు కూడా చక్కగా అన్వయిస్తుంది. 'నేటి సినిమాపాట భ్రష్టమైపోయింది' అనే విమర్శ ఈనాడు ప్రబలంగా వినిపిస్తోంది. 'పాతసినిమాపాటల్లాంటి పాటలిప్పుడెక్కడ వినిపిస్తున్నాయి-అవి ఆణిముత్యాలు' అని పాతపాటలతో కొత్తపాటలను పోల్చి పెదవి విరవడం తరచుగా కనిపిస్తోంది. ఆకాశవాణిలో పాతపాటలను ప్రత్యేకంగా ప్రసారం చేస్తున్నారు. సినిమా సాహిత్యం అంటే మక్కువ వున్నవాళ్లు ఎక్కువగా ఆ పాతపాటలనే రికార్డు చేయించుకొని పదిలంగా దాచుకొని పదేపదే వింటున్నారు. నిప్పులేనిదే పొగరాదన్నట్టు పాత పాటలకు పెద్ద పీటవేసి కొత్త సినిమాపాటల్ని నిరసించడానికి కారణాలూ లేకపోవు. అవి ఏమిటి ? పాతపాటలంటే ఎప్పటివరకు వచ్చినవి? పాతపాటలలో లోపాలు లేవా? ఈ అంశాల గురించి, తెలుగు సినిమాపాట ప్రస్తుత పరిస్థితి గురించి నిశితంగా పరిశీలించడం అవసరం.

### 1. అభిప్రాయ సేకరణ :

సినిమాపాటల్లో వేటిని ఎందుకు యిష్టపడుతున్నారో తెలుసుకోవడం కోసం ఈ రచయిత అమలాపురం (తూ.గో.జిల్లా) కేంద్రాన్ని యెంచుకొని నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పై ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభించాయి.

నిరక్షరాస్యులు మొదలుకొని వివిధశ్రేణుల విద్యావంతుల వరకూ వివిధ కులాలకూ మతాలకూ అభిమతాలకూ వృత్తులకూ చెందిన ఆడా-మగా, చిన్నాపెద్దా అందరూ వుండేలా వందమందిని యెంచుకొని చేసిన ఈ అభిప్రాయసేకరణలో ఎనభైఅయిదు శాతం పాతవే బావున్నాయని చెప్పారు. ఎందుకు అనే ప్రశ్నకు దాదాపు అందరూ 'బాగా అర్థమవుతాయి' అనే సమాధానమే చెప్పారు. వాళ్లు విశ్లేషించలేక పోయినా పాతపాటల్లోని సారళ్యం, భావైక్యం-వాళ్ల నాకట్టుకున్నట్టు అర్థమైంది.

పాతపాటల పేరుతో వాళ్లు తమకు నచ్చినట్లుగా చెప్పిన పాటల్నిబట్టి దాదాపు 1975 వరకు వచ్చిన పాటలు వాళ్ల దృష్టిలో పాతవని తేలింది. నచ్చిన పాట ఒకటి చెప్పమంటే । 'ఒకటి అని చెప్పలేను; చాలా వున్నాయి' అని చెప్పినవాళ్లూ వున్నారు. వాళ్లు చెప్పిన పాటలు ఎక్కువగా 'పాతాళభైరవి', 'దేవదాసు', 'జగదేకవీరుని కథ', 'మూగమనసులు', 'ఆత్మబలం', 'పూజాఫలం', 'ఉయ్యాల-జంపాల', 'ప్రేమనగర్', మొదలైన చిత్రాల్లోనివి. యాభై పైబడిన వయస్సు కలిగిన వాళ్లెక్కువమంది యాభయ్యవ దశకంలోని పాటల్నే ఎక్కువగా యిష్టపడ్డారు. అంటే వాళ్ల చిన్నతనంలో వచ్చిన పాటలన్నమాట ! మొత్తంమీద రాగోదయ, రసోదయ దశల్లో (1950-70) వచ్చిన పాటల్ని ఎక్కువగానూ చంద్రోదయం (70-78)లో వచ్చిన పాటల్ని కొంతవరకు వీళ్లంతా యిష్టపడినట్టు స్పష్టమైంది. కొత్తపాటల్లో కొన్ని తెలుగు మాటల్లాంటివి వినిపించడం మినహా అర్థమైచావడంలేదని వీరి అభియోగం.

కొత్తపాటల్ని మెచ్చుకొన్న పదిహేను శాతంలో విద్యార్థులు, శ్రామికులు ఎక్కువ. కొత్తపాటలు ఎందుకు నచ్చుతున్నాయనే ప్రశ్నకు హుషారుగా వుంటున్నాయని ఈ వర్గాల సమాధానం. అంటే సాహిత్యం కంటే బాణీల (ట్యూన్‌లు) పట్ల వీళ్లు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని అర్థమవుతోంది. ఇలా యువతరం మెచ్చుకొన్న పాటలు 'గీతాంజలి', 'జగదేకవీరుడు-అతిలోక సుందరి', 'శివ', 'బొబ్బిలిరాజా', 'జానకి రాముడు', 'ప్రేమఖైదీ' మొదలైన చిత్రాల్లోనివి. ఇవన్నీ యిటీవల విడుదలైనవే. అందువల్ల కొత్తపాటల్ని కొంతకాలం మాత్రమే గుర్తుపెట్టుకొంటున్నారనీ, పాతపాటల్ని మెచ్చుకొనేవాళ్లు మాత్రం వేమన పద్యాలో, సుమతీ శతకంలోని పద్యాలో గుర్తు పెట్టుకొన్నట్టు శాశ్వతంగా జ్ఞాపకముంచుకొంటున్నారనీ అభిప్రాయ పడవలసివస్తోంది.

వేటూరి సుందరరామమూర్తి పాతపాటలను మంచినీళ్లతోను, కొత్తపాటలను మధువుతోను పోలుస్తూ-వాటి తేడాని యిలా చెప్పారు. "మంచినీళ్లు మళ్లీ తాగగలం. దాహం తీర్చుకోగలం. కాని మధువు తాగగలమా? మంచినీళ్లకంటె



తేనె చాలా రుచిగా వుంటుంది-కానీ దాహం తీర్చలేదు; దాహం పెంచుతుంది. [1]

## 2. నేటి సినిమాపాట :

వేటూరి తన వ్యాఖ్యలో కొత్తపాటలకు ఎత్తుపీట వేసినట్టు అనిపించ వచ్చునుగాని-సాహిత్య ప్రమాణాల దృష్ట్యా అది నిజం.

**1. మనసు పలికే మౌనగీతం నీవే**
**మమత లొలికే స్వాతిముత్యం నీవే**
**అణువు అణువు ప్రణయమధువు**
**తనువు సుమధనువు... (సి.నా.రె.- స్వాతిముత్యం)**

**2. వెలుగు దుస్తులేసుకొని సూరీడు**
**తూర్పు తలుపుతోసుకొని వచ్చాడు**
**పాడు చీకటి కెంత భయమేసిందో**
**పక్కదులుపుకొని ఒకే పరుగుతీసింది**
**(మల్లెమాల-ముత్యాలపల్లకి)**

**3. కొమ్మల తాకిన ఆమనికే కోయిల పుట్టెనులే**
**గ్రహములు పాడిన పల్లవికే జాబిలి ఊగెనులే**
**(వేటూరి-జగదేకవీరుడు-అతిలోకసుందరి)**

**4. పున్నమిలాగ వచ్చి పొమ్మని జాబిల్లడిగింది**
**పుష్కరమల్లె వచ్చిపొమ్మని గోదారడిగింది**
**(వేటూరి-జడగంటలు)**

**5. చెమట బొట్టు చమురుగా సూరీణ్ణి వెలిగిద్దాం**
**వెలుగుచెట్టు కొమ్మల్లో అగ్గిపూలు పూయిద్దాం**
**(సీతారామశాస్త్రి-కళ్లు)**

ఇలాంటి రసగుళికలను చూస్తుంటే కొత్త సినిమాపాట జుంటి తేనెలా లేదని ఎవరుమాత్రం అనగలరు? ఎటొచ్చీ వాద్యాల తేనెటీగల రొద ఎక్కువై-ఆ తేనె సహృదయులకు దక్కడంలేదు.

---

1. వేటూరితో పైడిపాల ముఖాముఖి - విజయచిత్ర-డిసెంబర్-91

### 3. అనర్థ ధోరణులు :

వాద్యసంగీతం జోరుకీ హోరుకీ తోడు బాణీలకు వేగంగా మాటల్ని పొదగడం అర్హతగా పరిగణింపబడ్డంవల్ల-పాటల్లో అర్థంలేని పదాలు, అన్వయం లేని పాదాలు చొరబడి శ్రోతలను తికమకపెడుతున్నాయి. వీటిలో అర్థంకాని పదాలకంటె అర్థంలేని పదాలు ఎక్కువ. వెరసి అర్థమవుతున్న పంక్తులు తక్కువ.

ఈ వాక్యలోని నిజానిజాలను మూడు తరగతులకు చెందిన కవుల పాటల పంక్తులను తీసుకొని పరిశీలిద్దాం -

**1. (అ) అజన సుజన విజన భజన జానకి రమణా**
**(ఆ) బంగరు బైలా సింగరుడోలా లంగరులైలా - వేటూరి**

**2. (అ) భద్రాచలం కొండ సీతమ్మవారి దండ కావాలా నీ కండాదండా**
**టప్పు టప్పు టప్పోరీ కన్యాకుమారీ**
**టప్పు టప్పు టప్పోరీ నా టక్కుటమారీ**
**(ఆ) హే లటక్ పటక్ చిలిపి మొగుడ్స్**
**ఝూం జటక్ పడుచు పెళ్లామ్స్ - భువనచంద్ర**

**3. సుమం ప్రతిసుమం... వనం ప్రతివనం...**
**వేణువా వీణియా ఏమిటీ రాగము**
**అచంచలం సుఖం మధుర మధురం**
**మయం హృదంతరం దివిజసురతం**
**ఈవేళ నాలో రాగోల్లసాలు, కాదు మనసా ప్రేమ మహిమ**
**నాదు హృదయం-భానోదయాన చంద్రోదయాలు...**
**-నాయుని కృష్ణమూర్తి**

పెద్ద-చిన్న ఎవరు రాసినా పై పంక్తుల్లో శబ్దవిన్యాసం తప్ప అర్థస్ఫూర్తి కనిపించదు. మొదటి రెండు ఉదాహరణల్లో అనుప్రాసల ఆర్భాటం, మూడో దానిలో అపరిపక్వత-అవగతమౌతూనే వున్నాయి. మూడో పాటలోని 'మయం హృదంతరం దివిజ సురతం' వంటి పంక్తులు, భానోదయం (భానూదయాని కొచ్చిన పాట్లు) వంటి ప్రయోగాలు ఏమాత్రం భాష తెలిసిన వాళ్లనైనా భయపెడతాయి. (ఇలాంటి ప్రయోగాల్ని ఆదర్శంగా తీసుకొని రాసిన 'యువతరం ప్రచండమై భానోదయమై పోనీ' అనే లలితగీతాన్ని దూరదర్శన్‌వారు ప్రసారం చేస్తున్నారు.) ఇలా అస్పష్టత, అయోమయం,



నేయార్థాలూ (ప్రయోగించిన కవికి మాత్రమే తెలిసే అర్థం గలవి) అపుష్టార్థాలూ (అర్థపుష్టి లేనివి) ఆధునిక కవితల్లోలాగే ఆధునిక చిత్రగీతాల్లో కూడా మోతాదు మించడంవల్ల కొత్త సినిమాపాటలు కొంతవరకు నిరాదరణకు గురవుతున్నాయి. అయితే బాణీలు వినసొంపుగావుంటే నేటి ప్రేక్షకుల్లో అధికశాతం అర్థం గురించి, అన్వయం గురించి పట్టించుకోవడం లేదనడానికి పై పాటలన్నీ పొందిన ప్రచారమే నిదర్శనం. కాని ఆ మోజు ఆ సినిమాలు ఆడుతున్న కాలానికి మాత్రమే పరిమితమైన తాటాకుమంట లాంటిది మాత్రమే

అన్వయరాహిత్యం,అస్పష్టత మొదలైన లోపాలు సుప్రసిద్ధమైన పాత పాటల్లో కూడా లేకపోలేదు.

**(i)** 'దేవదాసు'లో -

**మేడపైన అల పైడిబొమ్మ**
**నీడనే చిలకమ్మ... - సముద్రాల**

అనే పాట నేటికీ చెవి కోసుకొని వింటున్నాం. ఆ మాధుర్యంలో ఆలోచించం గాని, ఆలోచిస్తే పై పంక్తుల అర్థం బోధపడదు. (పైడిబొమ్మ అంటే 'పార్వతి' అనీ చిలకమ్మ అంటే 'చంద్రముఖి' అనీ కవి వుద్దేశమని ఆరుద్ర చెప్పారు. కాని శ్రోతలకది అందుతుందా?)

**(ii)** 'లైలా మజ్ను' లో -

**ప్రేమే నేరమౌనా ?, మాపై యీ పగేలా?**
**వేదనగానే మా వలపంతా వేసారునా?**
**ఏ కారనోమూ నోచుకొన్నానో నేనూ... - సముద్రాల**

ఈ 'హిట్ సాంగ్' లో కారనోము పదం గురించి 'అరబ్బీ పిల్లకు నోములూ, వ్రతాలూ వుంటాయా' అనే సంప్రదాయానికి సంబంధించిన విమర్శ వచ్చింది. ఆచార్యుల వారు 'అసలు అరబ్బీ పిల్ల తెలుగు మాట్లాడుతుందా?' అని చాకచక్యంగా సమర్థించుకొన్నా, విమర్శ సహేతుకమే.

**(iii)** 'ప్రజానాయకుడు'లో - ఆత్రేయ

**'ఏరువాకమ్మా మాకెదురురావమ్మా'**

అని రాయడంలో - ఆ పదం పట్ల కవికిఅంతగా అవగాహన వున్నట్టనిపించదు.

(iv) 'సుఖ దుఃఖాలు'లో -

**ఇది మల్లెల వేళయనీ**
**ఇది వెన్నెల మాసమనీ**
**తొందరపడి ఒక కోయిల**
**ముందే కూసింది - విందులు చేసింది (కృష్ణశాస్త్రి)**

కవిసమయాల ప్రకారం వెన్నెలకోసం వేగిర పడేది చకోరం కాని కోయిల కాదు. కోయిల ఆరాటపడేది వసంతం కోసమేకాని - శరత్తుకోసం కాదు. ఈ మాత్రం కవికి తెలియదని ఎవరనగలరు ? బహుశా సన్నివేశం దృష్ట్యా కవిసమయాన్ని పాటించి వుండరు.

ఇంకా -

**వసంత గాలికి వలపులు రేగ**
**వరించు బాలిక మయూరి కాగా ... (పింగళి)**

**ఆకాశపందిరిలోన నీకు నాకు పెళ్ళంట (దాశరథి)**

**(అ) శ్రీరామ నామాలు శతకోటి, ఒక్కొక్క పేరే బహుతీపి**
**(ఆ) స్వాగతం సుస్వాగతం - అధికచక్కని దొరగారూ (ఆరుద్ర)**

మొదలైన పంక్తుల్లో ఆతరం కవులు ప్రజల పలుకుబడినిబట్టి వాళ్లకు అర్థం కావడం కోసం వైరిసమాసాల నుపయోగించారు. ఇలాంటివి విమర్శకుల దృష్టికి వచ్చేవే తప్ప ఆ కవులు తెలియక ప్రయోగించినవి కావు; ఆ పాటల వ్యాప్తికి ఆటంకాలూ కానే కావు.

పాతతరం కవులు చూపిన బాధ్యతకీ, నిదానానికీ ఈ వేగంలో అవకాశం లేదు. ఆత్రేయ 'శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యం'లో 'ఎవరో అతనెవరో' అనే పాటలో 'కబురు తెలిపి రమ్మనవా' అని రాసి తీరా పాట రికార్డయిన తర్వాత పౌరాణిక చిత్రంలో 'కబురు' అనే ఉర్దూ పదం ప్రయోగించినందుకు విపరీతంగా కలత పడ్డారట. మల్లాది రామకృష్ణశాస్త్రి దగ్గరకు వెళ్లి పొరపాటు జరిగిపోయిందని బాధపడితే - ఆయన 'బీబీనాంచారి వుందికదా-తప్పులేదు' అని సర్దిచెప్పిన తర్వాత కాని ఆత్రేయకు నిద్రపట్టలేదు. అలాంటి బాధ్యతను యిప్పటి కవులు ఎంతమంది తీసుకొంటున్నారు? ఆపైన దర్శక నిర్మాతలు 'ఏదో ఒకటి రాసెయ్యండి-సినిమాపాటకు నియమాలేమిటి? అని చెప్పుల్లో కాళ్లు పెట్టుకొని పాటలవంట కోసం తొందరపడుతున్నారు. ఈ తొందర,



సినిమా పాటంటే చిన్నచూపు-ఇన్ని అనర్థాలకు దారితీస్తున్నాయి.

**జతకుదరని సంగీతం :**

**జగడ జగడ జగడం**
**చేసేస్తాం-రగడ రగడ రగడం**
**దున్నేస్తాం - ఎగుడు దిగుడు గగనం**

ఇలాంటి పాటలు యువతరానికి హుషారుగా వుండొచ్చేమోకాని- అందర్నీ ఆకట్టుకోవు. ప్రాచీన కావ్యాల్లో శబ్దంతో సన్నివేశాన్ని, రసాన్ని స్ఫురింపచేయడానికి రచించిన పద్యాల దృష్టితో యిలాంటి పాటలు రాసినా అక్కడి సందర్భౌచిత్యం ఈ పాటలకు లేదు. ఉదాహరణకు నర్తనశాలలో ఉపయోగించిన తిక్కన పద్యం.

**'దుర్వారోద్యమ బాహువిక్రమ రసోస్తోక ప్రతాప స్ఫురత్.** [2]

ఎప్పటికీ ప్రేక్షకులకు వీరరసస్ఫూర్తిని కలిగిస్తుంది. అలాంటి రసావేశాన్ని అర్థాంతరంగా వస్తున్న 'రగడ జగడాల' కబాడీ పాటలు కలిగించవు. ఇది సందర్భానికి మించిన సంగీత శ్రుతి !

సంగీతానికనుగుణమైన పదలాలిత్యం పాతపాటల్లో వుంది. 'మనసు మాంగల్యం'లో ఆవేశాన్ని ప్రకటించే పాట కూడా పెండ్యాల స్వరకల్పనలో -

**'ఆవేశం రావాలి ఆవేదన కావాలి**
**ప్రతిమనిషి క్రాంతి కొఱకు రుద్రమూర్తి కావాలి' (దాశరథి)**

మాధుర్యాన్ని కోల్పోకుండా సుతిమెత్తగానే సాగింది. విషాదాన్ని వియోగాన్ని ప్రకటించవలసిన సందర్భాలలో కూడా ఆ పాటలు మాధుర్యాన్ని కోల్పోలేదు.

**ఉదా: 'ఎక్కడవున్నా ఏమైనా మనమెవరికి వారే వేరైనా**
**నీ సుఖమే నే కోరుతున్నా'**
**(ఆత్రేయ-మురళీకృష్ణ)**

'ప్రేమనగర్' వచ్చేసరికి బాణీలో వేగం పెరిగి -

**'ఎవరికోసం ఈ ప్రేమమందిరం- ఈ హృదయనందనం'**

అని కొంచెం తీవ్రంగా చెప్పడం జరిగింది.

---

2. ఆంధ్రమహాభారతం-విరాటపర్వం-ద్వితీయాశ్వాసం 172వ పద్యం

ఇప్పుడు కరుణ, వీరం మొదలైన రసాలనే కాకుండా - శృంగారరసాన్ని ప్రకటించవలసి వచ్చినా-తీవ్రతను గమనిస్తున్నాం. దీనికి సంగీత సాహిత్యాలు రెండూ బాధ్యత వహించక తప్పదు. పాటలో సంగీతం భరించలేనంత సాహిత్యభారం, సాహిత్యం వినిపించనంత సంగీత భారం కనిపిస్తున్నాయి.

సినిమాపాట సంగీత సాహిత్యాల సమప్రాధాన్యంతో జోడుగుర్రాల స్వారీలా సాగాలి. కాని ఇప్పుడా అవగాహన లోపించి, పాట పదికాలాలపాటు గుర్తుండే గుణాన్ని కోల్పోతోంది. ఇలా బాణీవల్ల సాహిత్యగౌరవాన్ని కోల్పోయిన పాటకు ఉదాహరణ -

**'అరె-ఏమైంది ఒక మనసుకు రెక్కలొచ్చి ఎక్కడికో ఎగిరింది**
**అది-ఏమైందీ! తన మనిషిని వెతుకుతు యిక్కడొచ్చి వాలింది**
**(ఆరాధన-ఆత్రేయ)**

పాతపాటల్లో సంగీత సాహిత్యాల మధ్యవున్న పొందికవల్ల 'ఇల్లరికంలో వున్న మజా-అది అనుభవించితే తెలియునులే' వంటి సాదా వాక్యాలు కూడా పాటలుగా గౌరవాన్ని పొందితే-ఇప్పుడు ఉత్తమ సాహిత్యం కూడా సమన్వయ లోపం వల్ల రాణించడం లేదు. సంగీతాన్ని జోడించకుండా కేవలం సాహిత్యాన్ని చదివితే బావుండే పాటలు కొత్త పాటల్లో ఎన్నో వున్నాయి.

## శ్రుతి తప్పిన శృంగారం :

సినిమా మాటల్లోనూ పాటల్లోనూ నేడు వస్తున్న అశ్లీలం హృదయమున్న వాళ్లందర్నీ కలవర పెడుతున్న సమస్య. హాస్యం ముసుగులో వస్తున్న అశ్లీలంకూడా జుగుప్స కలిగిస్తోంది.

**'చుభ్రం చెయ్యనా, నీ గది చుభ్రం చెయ్యనా' (సర్పయాగం)**

పాటను ఈ రెండో కోవకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. తెలుగు సినిమాల్లో అరవయ్యో దశకం వరకు అరుదుగా వున్న శృంగారం క్రమక్రమంగా తామరలా వ్యాపించింది. ఒకనాడు సూచ్యంగావున్న శృంగారం నేడు వాచ్యమైపోయింది.

'వీరాభిమన్యు'లో - 'రంభా ఊర్వశి తలదన్నే' అనే పాటలో -

**'తనివి తీరా వనిత పరువం**
**తాకజాలని కరమేలా**



**కలికి ఒడిలో పులకరించీ**
**కరిగి పోవని తనువేలా'**

అనే పంక్తులను 'సెన్సారు' వారి అభ్యంతరం మీద-తెరమీది పాటలో తొలగించారంటే-ఈతరానికి ఆశ్చర్యం కలుగుతుంది.

అలాగే, 'దాగుడుమూతలు' చిత్రంలో - 'అడగకయిచ్చిన మనసే ముద్దు' అనే పాటలో -

'నువ్వు నేనూ ముద్దుకుముద్దు' అనే చివరి పంక్తి సెన్సారువారు వద్దంటే రద్దయ్యింది.

నేటి సినిమాలలో విశృంఖలంగా ఉపయోగిస్తున్న అశ్లీల పదాలవల్ల (ఏకార్థంలోనే ద్వంద్వార్థాలు పాతబడిపోయాయి) కొన్ని పదాలకు కొన్ని శృంగార సంకేతార్థాలు ఏర్పడి - ఏది అశ్లీలమో-ఏది కాదో తెలియని అయోమయ పరిస్థితిలో సెన్సారు అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. అలాంటి స్థితిలో 'త్రినేత్రుడు' లో వివాహ సంప్రదాయాన్ని సూచించే -

**'బిందెలోతుల్లో ఉంగరాలు**
**అందుకొనే సందడెప్పుడో'**

అనే పాటలోని పంక్తుల్ని అశ్లీలమని అపోహపడి తొలగించారు. ఇలా ఓ పక్క ప్రమాదంలేని పంక్తులు బలవుతుంటే, మరోపక్క -

**'మొక్కజొన్న పొత్తు విచ్చుకుంటె గుచ్చుకుంటె**
**గిల గిల గిల గిల**
**పిడత కింద పప్పు మెచ్చుకొంటె పుచ్చుకొంటె**
**గల గల గల గల**
**ఇంతదాక వచ్చాక యవ్వారం**
**చూస్కో చేస్కో ఏదో తీసేస్కో**
**అంతదాక వచ్చాక యవ్వారం**
**తీస్కో ఏదో చేస్కో.... (టు టౌన్ రౌడి)**

వంటి పాటలకు సెన్సారు కత్తెర పదును చాలడంలేదు. కాలంతో మార్పు రావడం కాదనలేని సత్యం.

**'కసిగావుంది కసి కసిగా వుంది**
**కలవక కలవక కలిసినందుకు కస్సుమంటోంది**
**కసుక్కుమంటూ కాటెయ్ మంటుంది'** **(ఎదురులేని మనిషి-1976)**

అనే పాట ఆత్రేయరాస్తే 'అయ్యో' అన్నారు.

మరో రెండుళ్ళ గడిచాక -

**'చిలకకొట్టుడు కొడితే చిన్నదానా**
**పలకమారి పోతావే పడుచుదానా'** **(యమగోల-1977)**

అని వేటూరి రాస్తే - 'ఇంకేముంద'న్నారు.

మరో పదేళ్ళ గడిచాక

**'అబ్బనీ తియ్యనీ దెబ్బ**
**ఎంత కమ్మగా వుందిరోయబ్బ'**
**(జగదేకవీరుడు-అతిలోకసుందరి-1990)**

అని వేటూరి రాస్తే 'ఆహా' అన్నారు

అదే దారిలో మరి కొంచెం ముందుకు వెళ్ళి -

**ప్రియరతిలో రాగం జతలో తాళం**
**ఎదలో బంధం పాదసంబంధం-లామీ** **(ధర్మక్షేత్రం)**

అని ఆయన రాసినా -

**జాం జబ్బా జర్కులిచ్చి**
**అందాలన్నీ లెగ్గొట్టి కొట్టెయ్ అల్లం పెసరట్టు**
**పాం పప్పా హారన్ కొట్టి మా నట్టింట్లో కాలెట్టు**
**ఇస్తా బెల్లం బొబ్బట్టు**
**డిక్కీ డిక్కీ డీడిక్కీ డప్పులు వాయించెయ్-లక్కీ**
**ఎక్కీ ఎక్కీ కైపెక్కీ ఏదోలాగిస్తే - లక్కీ**
**లంగాబాడీ లంబాడీ, ఆడించేస్తా కబ్బాడీ**
**ఎక్కానంటే అమ్మాడీ, అదరాలే ఆటోబాడీ** **(రౌడీ ఇన్స్పెక్టర్)**

అని భువనచంద్ర విజృంభించి రాసినా సెన్సారు వారు ఆమోదిస్తున్నారు. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇంత ఘాటు చూశాక ముందు పాటలు ఏ పాటివనిపిస్తోంది.



అందరూ కావాలనుకొంటున్న దాన్ని 'అశ్లీలం' అనడంలో అర్థంలేదేమో అనిపిస్తోంది.

అన్ని రంగాల్లోలాగే సినిమాపాటలో కూడా కాలంతో వచ్చే మార్పు అనివార్యం. అయితే ఆ మార్పు తీవ్రశ్రుతిలో వుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇలా కోరికల్ని, బలహీనతల్ని రెచ్చగొడుతున్న పాటలు సమాజాన్ని కలుషితం చేస్తున్నమాట నిజం. అయితే ఈ పరిస్థితికి కేవలం కవులే బాధ్యులుకారు. చిత్ర విజయం కోసం నిర్మాతలూ, దర్శకులూ, తాత్కాలికమైన వినోదం కోసం ప్రేక్షకులూ, వ్యాపారం కోసం జిల్లాలవారీ పంపిణీ దారులూ ఇలా యింతమంది ప్రోత్సహిస్తుంటే, ఆ పైన ఆదేశిస్తుంటే, శాసిస్తుంటే కవిమాత్రం కాదనగలడా ? ఈ దుస్థితికి వేటూరి యిలా సమాధానం చెప్పారు -

'నేనుకూడా నిరంకుశుడైన కవిని కాను. ఇవాళ ఈ సన్నివేశం నాదికాదు. సాహిత్యం మాత్రం నాది. ఆ సాహిత్యం అనేకమైనటువంటి దిద్దుబాట్లకి సర్దుబాట్లకి లోనై బయటికి వస్తుంటుంది. ఇది కృత్రిమ సాహిత్యమనే చెప్పుకోవాలి. లేకపోతే ఆత్మవంచన అవుతుంది. సందర్భం వచ్చింది గనుక చెపుతున్నాను. పాటల్లో అశ్లీలం వ్యంగ్యంగానూ చాటుమాటుగానూ వుంటోంది. కాని యిప్పుడది మాటల్లో సూటిగా నాటుకొనేటట్టు సిగ్గు లేకుండా వుంటోంది. దీనికంటే అది ప్రమాదకరం.[3]

వేటూరి చెప్పినట్టు బయటకొస్తున్న పాటలన్నీ పూర్తిగా ఆ కవులవి కావు. వాటిలో కొన్ని పాదాలో పంక్తులో.. దర్శక నిర్మాతల తెలివితేటల వల్ల రావడం సాధారణమైపోయింది. అలాగని కవికి బాధ్యత లేకపోలేదు. ఈ అతివేలశృంగారం విషయంలో అందరూ ద్వంద్వవైఖరి అవలంబిస్తూ తప్పు ఇతరుల మీదకు నెట్టి తప్పుకోవడం ధర్మంకాదు. ఎవరికి వాళ్ళ నైతిక బాధ్యత వహించడం అవసరం. ఈ శ్రుతి మించిన శృంగారం గురించి ప్రస్తావిస్తూ యస్పీ. బాలసుబ్రహ్మణ్యం- 'నేను కూడా కొన్ని పాటల విషయంలో గట్టిగా కాదనలేక మొహమాటపడుతున్న మాట నిజమే కాని - మరీ పచ్చిగావున్న పాటలు పాడ్డానికి తిరస్కరిస్తున్నాను. అటువంటి ఉదాహరణ -

**'ఎత్తుకో పట్టుకో పెట్టుకో**
**మిట్టపల్లాల కొలతలు తీసుకో'**

ఆమాత్రం నైతికబాధ్యత అందరికీవుంటే, ఆపైన సెన్సారువారి నిఘావుంటే 'కుటుంబ సమేతంగా సినిమాలు చూడలేక పోతున్నాం' అనే పరిస్థితి రాదు.

---

3.వేటూరితో పైడిపాల ఇంటర్వ్యూ విజయచిత్ర - డిశంబరు 91

## 4. పాటలు రాయడమంటే మాటలుకాదు :

నేటి సినిమాపాటల్నిచూసి చాలమందికి-'ఇంతేకదా పాట ఎవరైనా రాయొచ్చు' అనిపిస్తోంది. ఆ భావంతోనే అవకాశమున్నవాళ్లంతా పాటలురాసి సినిమాపాట ప్రమాణాల్ని దిగజారుస్తున్నారు. వీళ్లంతా సాదాసీదా పాటల్ని ప్రమాణంగా తీసుకోవడం వల్ల ఈ ప్రమాదం ఏర్పడుతోంది. కాని మంచి సినిమాపాట రాయడమంటే మాటలు కాదు... "సినిమాకు పాటలు రాయడం చాలామంది అజ్ఞానులనుకొనేటంత సులభం కాదు" అన్నారు. శ్రీశ్రీ

సినిమాపాటకు అభినవవేమన అనదగ్గ ఆత్రేయ 'ఒక మహాకావ్యం రాయొచ్చు కాని సినిమాపాట రాయడం కష్టం-సినిమా అనేది (సామాన్యుడికి) పుస్తకంలా తిరగేసి మళ్లీ చదువుకోడానికి వీల్లేదు. ఆ క్షణంలో ప్రేక్షకుడి మనస్సులోకి, మెదడులోకి ఎక్కిపోవాలి; అర్థమైపోవాలి. అందువల్ల సామాన్య జనానికి చప్పున అందేలా పాటరాయడం కష్టమైన విషయం" అన్నారు. "పాట రాయడానికి కొన్ని ప్రత్యేకమైన యోగ్యతలు వున్నాయి. ట్యుమ్రీ పాటలు రాయడంవేరు. ఒక డైనమిక్ సన్నివేశానికి పాటలు రాయడంవేరు. పురాణాలు చరిత్ర గ్రంథాల పరిచయంతో అలంకార శాస్త్రం తెలిసివుండి, వ్యాకరణ ఛందశ్శాస్త్రాలను జీర్ణంచేసుకొని ఏ తరహా పాట యిచ్చినా రాయగలిగే సామర్థ్యం వుండడం వేరు. ఇప్పుడెవరయినా రాస్తున్నారూ అంటే - ఎవరు రాసినా చెల్లే సినిమాలు వస్తున్నాయి" అని సినిమాపాట రాసేటప్పుడు చాలమంది ప్రాథమిక సూత్రాలు పాటించడంలేదని వాపోయారు - సినిమా పాటల రచనకు శ్రీనాథుడి వంటి వేటూరి సుందరరామమూర్తి [4]. కవిత్వంలో ఆశుకవితలా - పాటల్లో సినిమాపాట ప్రత్యేకమైనదనీ అది ప్రసన్నంగా ఆపాతమధురంగా అందర్నీ అలరించాలనే అవగాహన లేనివాళ్లుకూడా పాటల రచనకు పూనుకోవడం వల్లనే సినిమాపాట విమర్శలకు గురవుతోంది. సినిమాపాటలో కేవలం చిక్కని కవిత్వాన్ని కాని సశాస్త్రీయ సంగీతాన్ని కాని జనం ఆశించరు. సినిమాపాట పరమ ప్రయోజనం ఆనందమే !

## 5. ఆశాకిరణాలు :

ఇలా పైన చేసిన విశ్లేషణతోపాటు - మారుతున్నకాలంలో అన్నిరంగాలతో పాటు సినిమాపాటల్లోకూడా మార్పు సహజం అనే విశాల దృక్పథంతో చూడకపోవడం వల్ల, కొత్త సినిమాపాటల సంఖ్య పెరిగి గుర్తుపెట్టుకోదగిన వ్యవధిలేకపోవడం వల్ల, కొన్ని పాటల్లో చిక్కని కవిత్వం, బరువైన భాష సామాన్యుడికి జీర్ణంకాకపోవడం వల్ల,

4. వేటూరితో వినాయకరావు ముఖాముఖి సితార 19.1.92



అర్హత లేనివాళ్లు కూడా సినిమా రంగంలో ప్రవేశించి అశ్లీలంవల్లే సినిమాలు విజయవంతం అవుతాయని దురాశను పెంచుకోవడంవల్ల, ముఖ్యంగా తెలుగు సినిమాపాటలో తెలుగుదనం లోపించడంవల్ల... ఇంకా అనేకానేకమైన కారణాలవల్ల- నేటి తెలుగు సినిమాపాట జ్ఞాపకానికి దూరమవుతోంది; నిరాదరణకు విమర్శకు గురవుతోంది. కాని-అది అంత అధ్వాన్నంగా లేదు. నేటి సినిమా పాట ఆశావహంగానే వుందనడానికి కొందరు కొత్తకవుల పాటల నుంచి ఉదాహరణలు -

**1. రాసలీలవేళ రాయబారమేల**
**మాటే మౌనమై మాయజేయనేల (వెన్నెలకంటి-ఆదిత్య 369)**

**2. జాబిలికీ వెన్నెలకి పుట్టిన పున్నమిలే**
**గంగలలో తేనెలలో కడిగిన ముత్యములే**
**కన్నతల్లి ప్రేమకన్న అన్నమేది పాపలకి**
**అమ్మ ముద్దుకన్న వేరే ముద్దలేదు ఆకలికి**
**దేవతంటి అమ్మనీడే కోవెలే బిడ్డలకి**
**చెమ్మగిల్లు బిడ్డకన్నే ఏడుపే అమ్మలకి (సాహితి-చంటి)**

**3. ముద్దబంతిపువ్వులో మూగబాసలు**
**మూసివున్న రెప్పలపై ప్రేమలేఖలు**
**చదువుకొనే మనసుంటే ఓ కోయిలా**
**మధుమాసమే అవుతుంది అన్నివేళలా (గురుచరణ్-అల్లుడుగారు)**

**4. అందమైన వెన్నెలలోన అచ్చతెలుగుపడుచు వలె**
**మల్లెపూల పందిరిలోకి - నడచిరావే సరిగమలా**
**మనసునిండ మరులు పండ పసిడి పల్లకి ఎక్కాల**
**రాగాలే ఊగాల - శివరంజనవ్వాల (రసరాజు-అసెంబ్లీరౌడి)**

వరసగా అవగాహన, అనుభూతి, ధ్వని, శైలి... ఇవి సరికొత్త తెలుగుపాటల్లో సలక్షణంగా వున్నాయని చెప్పడానికి పై పంక్తులు చాలు.

సినిమాపాట గొప్ప మాధ్యమం (మీడియం). దాన్ని సరిగ్గా వినియోగించు కోకపోతే-ఆ తప్పు ఆరంగానికి చెందిన అందరిదీ తప్ప - ఆ ప్రక్రియది కాదు. ఈతరం కవులు, చలనచిత్రరంగంలోని ప్రముఖులు నిజాయితీగా ప్రయత్నిస్తే-ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలి దగ్గర వున్న సినిమాపాట రేపటి బాటవుతుంది. లేకపోతే చేటవుతుంది.

***

రెండవ భాగం

(1992-2005...)

# చీకటి వాకిట చిరు వెలుతురు

దృశ్యం మారింది.. దృశ్యశ్రావ్య మాధ్యమానికి ఆదరణ పెరిగింది. ఎలక్ట్రానిక్ మీడియం విజృంభించడంతో సినిమాపాట 'ఇందుగలదందులేదని సందేహము వలదు' అన్నట్టుగా వ్యాప్తి చెందింది. బుల్లితెర పుణ్యమా అని ఇంటింటా సినిమా కనిపిస్తోంది. సినిమాపాట వినిపిస్తోంది. చిత్ర పరిశ్రమ తెలుగు రాజధానికి తరలిరావడంతో సినిమాపాట రాయడానికి ఎగబడేవాళ్ల సంఖ్య ఎక్కువయింది.. ఇదీ ఈ పుష్కర కాల నేపథ్యం !

## 1. పాటలేని చోటు లేదు

ఉగాది, సంక్రాంతి, దీపావళి మొదలైన పండుగలకు, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం, స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవం మొదలైన సందర్భాలకు టి.వీ ఛానల్స్ పోటీపడి ప్రసారం చేసే ప్రత్యేక కార్యక్రమాలన్నీ సినిమాలకు, సినిమా పాటలకు సంబంధించినవే. టీ.వీ ఛానల్స్ నిర్వహిస్తున్న 'అంత్యాక్షరి' 'డాన్స్ బేబీ డాన్స్' వంటి శీర్షికలు సినిమాపాటల మీద మోజును పెంచుతున్నాయి. విద్యార్థులకే కాదు- శాసనసభ్యులకు కూడా ఆటల పోటీలతో పాటు సినిమా పాటల పోటీలను, అంత్యాక్షరి పోటీలను నిర్వహించేటంతగా ఈ వ్యామోహం పెరిగింది. భజన బృందాలకు దేవుడి మీద భక్తి కంటె సినిమా బాణీలమీద అనురక్తి పెరిగి భక్తి భావాల కొదగని 'ఫాస్ట్ ట్యూన్స్'లో పోటీపడి భజన గీతాలు పాడడం సర్వజన విదితం. ఇక బ్యాండు మేళాలు, 'ఆర్కెస్ట్రా టీమ్స్' సినిమా పాటను వృత్తిగా చేసుకొని బతుకుతున్నాయి. సంగీత విభావరుల్లో సంగీత దర్శకులు, గాయనీగాయకులు, నటీనటులు పాల్గొని సినిమాపాటలతో ప్రేక్షకుల నలరించడం ఖరీదైన వ్యాపారమైపోయింది. ప్రభుత్వ వాహనాలతో సహా వివిధ వాహనాలలో వద్దన్నా సినిమాపాటలు వినిపిస్తున్నాయి. సెల్ ఫోన్లలో మాట్లాడుకొనే ముందు 'రింగ్‌టోన్స్', 'డైలర్‌టోన్స్' పేరుతో సినిమాపాటలు వినిపించడం వేడుకగా మారింది. 24 గంటలూ సినిమాపాటలు వినిపించే 'మ్యూజిక్ ఛానల్స్' 'శాటిలైట్ రేడియో'లు వచ్చాయి. ఒక్కమాటలో చెపితే పూర్వం తల్లులు 'చందమామ రావే జాబిల్లిరావే..' అని పాడుతూ పసిపిల్లలకు గోరుముద్దలు తినిపిస్తే ప్రస్తుతం టీవీ ముందు పిల్లల్ని కూర్చోబెట్టి సినిమాపాటలు వినిపిస్తూ ముద్దలు తినిపించేటంతగా సినిమాపాట మన బతుకుతో ముడిపడిపోయింది.

**విశ్వవిద్యాలయాల్లో పాటల మీద పరిశోధనలు :**

సినిమాపాటల మీద సామాన్యులకే కాదు-ధీమాన్యులకూ ఆసక్తి పెరిగింది. 1990కి పూర్వం విశ్వవిద్యాలయాల్లో సినిమా సాహిత్యం మీద పరిమితంగా జరిగిన పరిశోధన ఈ పుష్కరకాలంలో పురులు విప్పింది. వివిధ విశ్వవిద్యాలయాల్లో కేవలం సినిమాపాటల కవుల మీద ఈ పన్నెండేళ్లలో జరిగిన పరిశోధనను ఈ కింద పొందుపరుస్తున్నాను -

1. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం
   - (అ) ఆత్రేయ సినీగీతాలు - ఒక పరిశీలన - (యం.ఫిల్ & పిహెచ్.డి.)
     పరిశోధన : కె.బి. శ్రీలక్ష్మి (1992 & 95)
     పర్యవేక్షణ : ఎం.కె. దేవకి.
   - (ఆ) శ్రీశ్రీ సినీ గేయాలు - పరిశీలన, (యం.ఫిల్)
     పరిశోధన : కె. రామకృష్ణ (1995)
     పర్యవేక్షణ : ఎం.కె. దేవకి.
   - (ఇ) తెలుగుచలన చిత్ర గీతాలలో సాహిత్యపు విలువలు, (పిహెచ్.డి.)
     పరిశోధన : టి. మౌలాలి
     పర్యవేక్షణ : హెచ్.యస్. బ్రహ్మానంద (1996)
   - (ఈ) ఘంటసాల గీతాలు - ఒక పరిశీలన, (యం.ఫిల్)
     పరిశోధన : ఎ. విజయభాస్కర్
     పర్యవేక్షణ : హెచ్.యస్. బ్రహ్మానంద (1996)
   - (ఉ) పగలే వెన్నెల - సౌందర్య దృష్టి, (యం.ఫిల్)
     పరిశోధన : కె. మురళి
     పర్యవేక్షణ : కొలకలూరి ఇనాక్ (1996)

2. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
   - (అ) సి.నా.రె. సినిమాపాట - సమగ్ర పరిశీలన - (పిహెచ్.డి.)
     పరిశోధన : వి. లక్ష్మీనరసింహారావు. (1996)
   - (ఆ) సినిమా గీతాలు - సాంస్కృతిక పరిశీలన (పిహెచ్.డి.)
     పరిశోధన : బి.యన్.శేఖర్
     పర్యవేక్షణ : బి. వెంకటేశ్వర్లు (2000)



   - (ఇ) వేటూరి సుందరరామమూర్తి పాటలు
     - సాహిత్యపు విలువలు (పిహెచ్.డి.)
     పరిశోధన : జయంతి చక్రవర్తి
     పర్యవేక్షణ : పొన్నా లీలావతి. (2001)

3. ఉస్మానియా విశ్వవిద్యాలయం - హైదరాబాద్
   - (ఉ) ఆత్రేయ రచనలు - సమగ్ర పరిశీలన (పిహెచ్.డి.)
     పరిశోధన : టి. కృష్ణయ్యగౌడ్
   - (ఊ) చందాల కేశవదాసు సాహిత్యం (పిహెచ్.డి.)
     - సమగ్ర పరిశీలనం
     పరిశోధన - యమ్. పురుషోత్తమాచార్య (1999)

4. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం - తిరుపతి
   - (అ) తెలుగు సినిమాపాటల్లో హైందవ భక్తి పాటలు (పిహెచ్.డి.)
     పరిశోధన : టి. మునుస్వామి
     పర్యవేక్షణ : వి. చంద్రశేఖరరెడ్డి
   - (ఆ) ఆరుద్ర సినిమాపాటల్లో సాహిత్యపు విలువలు
     (పిహెచ్.డి. కోసం పరిశోధన జరుగుతోంది)
     పరిశోధన : ఆర్. రాజేంద్ర
     పర్యవేక్షణ : వి. చంద్రశేఖరరెడ్డి
   - (ఇ) దాశరథి సినీసాహిత్యం - పరిశీలన (పిహెచ్.డి. కోసం తుది మెరుగుల్లో)
     పరిశోధన : యస్. చిన్న పీరయ్య
     పర్యవేక్షణ : వి. చంద్రశేఖరరెడ్డి
   - (ఈ) యువచిత్ర పాటలు - సాహిత్యపు విలువలు - యం.ఫిల్ 2004
     పరిశోధన : కె. రవిచంద్రన్
     పర్యవేక్షణ : దేవిరెడ్డి మహాలక్ష్మమ్మ

5. నాగార్జున విశ్వవిద్యాలయం - 1994
   కొసరాజు కవితా వైభవం (పిహెచ్.డి.)
   పరిశోధన : నల్లూరి రామారావు
   పర్యవేక్షణ : నేతి అనంతరామశాస్త్రి

6. ఆంధ్ర విశ్వవిద్యాలయం -
తెలుగు సినిమాపాటల్లో
జో 'లా'లి పాటల పరిశీలన (యం.ఫిల్) 2005
పరిశోధన : జె. విద్యుల్లత.
పర్యవేక్షణ : యోహాన్ బాబు

7. బరంపురం విశ్వవిద్యాలయం (ఒరిస్సా) 1998
సినిమాపాటల్లో దేశభక్తి గీతాలు (పిహెచ్.డి.)
పరిశోధన : యన్. భానుశ్రీ

ఇంకా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆంధ్రశాఖకు చెందిన ఆచార్య హెచ్.యస్. బ్రహ్మానంద ఘంటసాల పాటలమీద 'బహుదూరపు బాటసారి' 'తెలుగు చలన చిత్ర గేయ సౌందర్యం' పుస్తకాలను వెలువరించారు. అలాగే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆంధ్ర శాఖాధ్యక్షులు ఆచార్య వి. చంద్రశేఖరరెడ్డి ఆరుద్ర, ఆత్రేయ, దేవులపల్లి, సి.నా.రె, దాశరథి మొ॥ సినిమా కవులపై ఆంధ్రజ్యోతి దినపత్రిక, వాఙ్మయిలలో అనేక వ్యాసాలను ప్రచురించారు. ఈ పుస్తక రచయిత పైడిపాల 'తెలుగు సినిమాపాట' (1992)ను ప్రచురించిన తర్వాత శ్రీశ్రీ, ఆత్రేయ మొదలైన సినీకవుల మీద, ఆంధ్రోద్యమ జాతీయోద్యమ సినీగీతాల మీద, కృష్ణా గోదావరీ పరిసరాలలో చిత్రింపబడిన సినిమాపాటల మీద ఆంధ్రజ్యోతి (దిన వారపత్రికలు) ఆంధ్రప్రభ (దినపత్రిక), సితార, సప్తగిరి (పుష్కర ప్రత్యేక సంచికలు), తెలుగు జగతి (ప్రపంచ తెలుగు సమాఖ్య పంచమ మహాసభల విశేష సంచిక) మొదలైన పత్రికలలో అనేక వ్యాసాలను ప్రచురించి, ఆకాశవాణిలో 'ఆత్రేయ మనసు పాటలు' 'ఆత్రేయ అనంతరం తెలుగు సినిమాపాట'మొదలైన ప్రసంగ వ్యాసాలను వినిపించాడు.

**సినిమాకవులు, విమర్శకులు సైతం ...**

చలన చిత్ర గేయసాహిత్యం మీద విద్యాసంస్థల దృష్టి ప్రసరించి పరిశోధకుల సంఖ్య పెరగడంతో - ఈ మధ్య వివిధ కవుల సినిమాపాటల సంకలనాలు, సినిమా పాటలకు చెందిన విమర్శకుల వ్యాసాలు విరివిగానే వెలువడ్డాయి. వాటిలో కొన్ని

1. మల్లాది రామకృష్ణ శాస్త్రి సినిమాపాటలు
విన వేడుక (2005)
మల్లాదివారి శతజయంతి సందర్భంగా ఆర్.కె.బుక్స్ ప్రచురణ.



2. శ్రీశ్రీ సినిమాపాటలు
   1. తెలుగువీర లేవరా (1996)
   2. విశాలాంధ్రలో ప్రజారాజ్యం (1999)
   3. ఉక్కు పిడికిలి, అగ్నిజ్వాల (2001)
   4. ఖబడ్దార్! సంఘ శత్రువులారా !!
   అరుణ పతాకం (2001)
   (శ్రీమతి సరోజా శ్రీశ్రీ ప్రచురించారు)

2. డా. ఆరుద్ర సినిమాపాటలు -
   (అ) వలపుల కథకిది తొలిపలుకు
   (ఆ) తళతళా మిలమిలా - పగటిపూట వెన్నెలా
   (ఇ) నవ్వుల నదిలో పువ్వులపడవ
   (ఈ) సెలయేటి గల గలా - చిరుగాలి కిలకిలా
   (ఉ) కురిసే చిరుజల్లులో...

ఆరుద్ర పాటలన్నిటినీ పై అయిదు సంపుటాలుగా విభజించి శ్రీమతి కె. రామలక్ష్మి ప్రచురించారు.

3. డా. సి. నారాయణరెడ్డి స్వీయ సినీగీత చరిత్ర (1998)
పాటలో ఏముంది, నామాటలో ఏముంది ? (2 భాగాలు)
రచయిత మౌక్తిక ప్రచురణల పేర వెలువరించారు.

4. వేటూరి సుందరరామమూర్తి వ్యాస సంపుటి
కొమ్మకొమ్మకో సన్నాయి (2004)
సినీరంగంలో రచయిత అనుబంధాలకు, జ్ఞాపకాలకు చెందిన ఈ వ్యాస సంపుటిని 'వేటూరి సాహితీ సమితి' ప్రచురించింది.

5. సిరివెన్నెల సీతారామశాస్త్రి సినిమాపాటలు -
   1. సిరివెన్నెల తరంగాలు (2000)
   (వివిధ తరంగాలుగా విభజించిన పాటలు)
   2. 'నంది' వర్ధనాలు (2001)
   (నంది బహుమతులు పొందిన సిరివెన్నెల పాటలు)
   (సిరివెన్నెల క్రియేషన్స్ (ప్రై) లిమిటెడ్ వారి ప్రచురణలు)

6. సుద్దాల అశోక్ తేజ సినిమాపాటలు
ఆకుపచ్చ చందమామ (2002)
రచయిత స్వప్న ప్రచురణల పేరుతో ప్రచురించారు.

7. వి.ఎ.కె. రంగారావు వ్యాస సంపుటి
ఆలాపన (2004)
'వార్త'లో పైశీర్షికతో రాసిన వ్యాసాలు

8. ఘంటసాల గాన చరిత (2003)
సేకరణ - రూపకల్పన - సంపాదకత్వం
చల్లా సుబ్బారాయుడు (కనిగిరి)

9. మన ఘంటసాల (2003)
రచన : డా. పి.యస్. గోపాలకృష్ణ
సమర్పణ : స్నేహ ప్రచురణల తరపున
శ్రీ యస్. పి. బాలసుబ్రహ్మణ్యం

10. (1). 116 గొప్ప తెలుగు సినిమా పాటలు (2003)
(1942 - 1973)
(పాటల్ని రికార్డ్ చేసిన 8 కేసెట్లతో సహా పుస్తకం)
(2) మరో నూటపదహార్లు (1940-85)
(సి.డి.లతో సహా)
ఆలోచన - రచన - నిర్వహణ : భమిడిపాటి రామగోపాలం

11. కొమ్మా కొమ్మా కోకిలమ్మ (2003)
(తెలుగు సినిమా నేపథ్యగాయనుల జీవిత చిత్రాలు)
- ఇంద్రగంటి జానకీబాల

12. జ్ఞాపకాలు
(పాతికమంది సినీ నేపథ్య గాయనీ గాయకుల అనుభవాలు)
కంపెల్ల రవిచంద్రన్ (2005)

పై పుస్తకాలన్నీ సినిమాపాటల పట్ల అభిరుచి పెంచడానికి దోహదం చేశాయనడంలో సందేహం లేదు.



**మంచిపాటల కొలువు 'మనస్విని' ప్రోత్సాహం :**

ఈ దశలో తెలుగు సినిమాపాటల్ని పురస్కారాల ద్వారా ప్రోత్సహించిన సంస్థలలో ప్రత్యేకంగా పేర్కొనదగింది మనస్విని. ఆత్రేయ సంస్మరణ సభలో వచ్చిన స్పందనతో 1989 అక్టోబరు 17వ తేదీన చెన్నైలో 'మనస్విని' పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా ఆవిర్భవించింది. ఉత్తమ సాహిత్యాన్ని, సాహిత్య వేత్తలను ప్రోత్సహించడం, సాహిత్య గ్రంథాలను ప్రచురించడం, సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రతిభావంతులను పురస్కారాలతో గౌరవించడం... మొదలైన ఆశయాలతో ఆరంభమైన మనస్విని 1990లో 'ఆత్రేయ సాహితి' ని ఏడు సంపుటాలుగా వెలువరించింది. వీటిలో మొదటి మూడు సంపుటాలూ ఆత్రేయ నాటక సాహిత్యానికీ, తర్వాతి మూడు సంపుటాలూ ఆత్రేయ సినిమాపాటలకూ, ఆఖరి సంపుటం వివిధ రచనల కదంబానికీ కేటాయింపబడ్డాయి.

'మనస్విని'కి కొంగర జగ్గయ్య మేనేజింగ్ ట్రస్టీకాగా - చిత్రరంగానికి చెందిన మరో ఎనిమిది మంది ప్రముఖులు ఇతర ట్రస్టీలు. మనస్విని 1991 నుంచి ఏటా కేలండర్ సంవత్సరంలో వచ్చిన తెలుగు సినిమాల్లోని (డైరెక్ట్ టేక్) పాటల నుంచి ఒక ఉత్తమ గీతాన్ని ఎంపిక చేసి దానికి 'ఆత్రేయ - మనస్విని' పురస్కారాన్ని అందజేసే కార్యక్రమాన్ని 2001 వరకు పదకొండేళ్లపాటు నిర్వహించింది. సినిమా అవార్డుల ప్రదానం కోసం ఎన్నో సంస్థలు పుడుతూ గిడుతున్న కాలంలో కేవలం సినిమా పాటలకు మాత్రమే పరిమితమై నిర్దిష్ట ప్రమాణాల్ని పాటిస్తూ ఉత్తమ సాహిత్యపు విలువల్ని ప్రధానంగా పరిగణిస్తూ పాటల్ని ఎంపిక చేయడం వల్ల మనస్వినీ పురస్కారం ప్రతిష్ఠాత్మకమైన అవార్డుగా గుర్తింపు పొందింది. తెలుగు చిత్రసీమకు మంచిపాటల్ని అందించిన అభిరుచిగల నిర్మాతలలో ఒకరైన యువచిత్ర అధినేత కె. మురారి నాయకత్వంలోని న్యాయ నిర్ణాయకమండలి చిత్తశుద్ధితో ఉత్తమగీతాల్ని ఎంపిక చేసిందనడానికి ఈ కింది పాటలే ప్రత్యక్షసాక్ష్యాలు.

1. **శ్రీరస్తు, శుభమస్తు, శ్రీరస్తు శుభమస్తు (పెళ్లి పుస్తకం) (1991)**
రచన : ఆరుద్ర, సంగీతం : కె. వి. మహదేవన్

2. **ఆకాశాన సూర్యుడుండడు సందెవేళకే... (సుందరకాండ) (1992)**
రచన : వేటూరి సుందరరామమూర్తి, సంగీతం : కీరవాణి

3. **వేణువై వచ్చాను భువనానికి.. (మాతృదేవోభవ) (1993)**
రచన : వేటూరి సుందరరామమూర్తి, సంగీతం : కీరవాణి

**4. చిలకా, ఏతోడులేక ఎటేపమ్మ ఒంటరినడక ? (శుభలగ్నం) (1994)**
రచన : సిరివెన్నెల సీతారామశాస్త్రి, సంగీతం : యస్వీ. కృష్ణారెడ్డి

**5. మల్లెతీగకు పందిరివోలె -మస్కసీకటిలో వెన్నెలవోలె.. (ఒరేయ్ రిక్షా)(1995)**
రచన : గద్దర్, సంగీతం : వందేమాతరం శ్రీనివాస్

**6. హృదయమనే కోవెల తలుపులు తెరిచే తాళం ప్రేమా ప్రేమా ...**
**(పెళ్లి సందడి) (1996)**
రచన : సిరివెన్నెల సీతారామశాస్త్రి, సంగీతం : కీరవాణి

**7. రామసక్కని తల్లి రాములమ్మో - రాములమ్మ..**
**(ఒసేయ్ రాములమ్మ) (1997)**
రచన : సుద్దాల అశోక్‌తేజ, సంగీతం : వందేమాతరం శ్రీనివాస్

**8. బోడిచదువులు వేస్టు నీ బుర్రంతా భోంచేస్తూ.. (మనసిచ్చిచూడు) (1998)**
రచన : సిరివెన్నెల సీతారామశాస్త్రి, సంగీతం : మణిశర్మ

**9. నోరారా పిలిచినా పలకని వాడినా... (అల్లుడుగారొచ్చారు) (1999)**
రచన : సిరివెన్నెల సీతారామశాస్త్రి, సంగీతం : కీరవాణి

ప్రోత్సాహక పురస్కారం :
**తెంచుకొంటె తెగిపోతుందా దేవుడు వేసిన బంధం.. (ప్రేయసిరావే)**
రచన : వెనిగళ్ల రాంబాబు, సంగీతం : శ్రీలేఖ

**10. ఊహల పల్లకిలో ఊరేగించనా.. (చిత్రం) (2000)**
రచన : కులశేఖర్, సంగీతం : ఆర్.పి. పట్నాయక్

**11. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి యిక్కడే కలిశాము.(స్టూడెంట్ నెం.1) (2001)**
రచన : చంద్రబోస్, సంగీతం : కీరవాణి

'మనస్విని' పురస్కారం పొందిన పై పాటలలో వైవిధ్యముంది. ఉత్తమ సంగీత సాహిత్య ప్రమాణాలున్నాయి. నంది అవార్డుల నిర్ణేతలకు సైతం మనస్విని మార్గదర్శకమైన సందర్భాలున్నాయి గనుక - మంచిపాటల కోసం మనస్విని చేసిన కృషిని విశేషించి వివరించాను. నంది పురస్కారాలు కేవలం పాటకూ, ఈ దశకూ పరిమితమైనవి కావు గనుక వాటి గురించి ప్రత్యేకంగా చెప్పడం లేదు.



**'బాలు' బడిలో తీపి పాటలు :**

ఈ దశలో సినిమాపాట ప్రాధాన్యాన్ని పెంచడానికి ప్రముఖ నేపథ్యగాయకులు యస్.పి. బాలసుబ్రహ్మణ్యం చేసిన కృషి అభినందనీయం. బాలు 'ఈటీవీ' లో నిర్వహించిన 'పాడుతా తీయగా' కార్యక్రమానికి సంచలనాత్మకమైన స్పందన వచ్చింది. చిత్ర పరిశ్రమను ప్రజల దగ్గరకు తీసుకొచ్చిన ఈ వేదిక ఎందరో యువగాయనీ గాయకులను పరిశ్రమకు పరిచయం చేసింది. కె.వి.మహదేవన్, యస్. రాజేశ్వరరావు వంటి దిగ్గంతుల నుండి వర్తమాన సంగీత దర్శకుల వరకు ఎందరో సంగీత దర్శకులను ఈ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతలుగా ఆహ్వానించి యువ గాయనీగాయకులకు వారిని పరిచయం చేసి యువతకు అనూహ్యమైన అనుభవాన్నీ, అనుభూతినీ కలిగించి వారి ఉత్సాహాన్ని ఇనుమడింపచేసిన ఘనత బాలుదే. రాష్ట్రంలోని ప్రధాన నగరాలలోనే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా చలన చిత్ర సంగీత ప్రియుల సమక్షంలో 'పాడుతా తీయగా' కార్యక్రమాలను ఏర్పాటుచేసి ప్రవాసాంధ్రులు సైతం పాల్గొని తెలుగు సినిమాపాటల మాధుర్యాన్ని ఆస్వాదించే అవకాశాన్ని కలిగించారు. ముఖ్యంగా బాలు ఈ తరం గాయనీ గాయకులకు పాటల్లోని సంగీత సాహిత్యాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ పాడే మెలకువల్ని సున్నితంగా చెప్పడం ద్వారా ఎందరికో మార్గదర్శకులయ్యారు. ఈ శీర్షిక ద్వారా ఆపాతమధురాలైన పాతపాటల్ని శ్రోతలకు గుర్తుచేసి వాటి పట్ల మక్కువను పెంచారు. చలన చిత్రనేపథ్యగాయకునిగా కంటె ఈ శీర్షిక నిర్వాహకునిగా తన సంస్కారంతో ప్రజలకు చేరువైన బాలు, ఎందరో సంగీత దర్శకులు ప్రజల ముందు తమ మనోభావాలను వెల్లడించడానికి కూడా అవకాశాలను కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉష, కౌసల్య, గోపికా పూర్ణిమ, నిత్యసంతోషిణి, స్మిత (పాప్ సింగర్), మల్లికార్జున్, సందీప్ వంటి యువ గాయనీ గాయకులు వెండి తెరకు పరిచయమయ్యారు. 'పాడుతా తీయగా' తర్వాత వివిధ సంగీత దర్శకులను గుర్తు చేసుకొంటూ 'జెమినీ' టీవీలో బాలు 'ఎందరో మహానుభావులు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం 'మాటీవీలో 'పాడాలని వుంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలలో 14 సం. లోపు బాలబాలికల చేత కూడా సినిమా పాటలు పాడించి వారి భుజాల్ని తట్టడం బాలు 'పాట' కు చేస్తున్న మహోపకారం.

ఇలా సినిమాపాటలు ప్రాతిపదికగా 'ఈటీవీ' వచ్చిన కొత్తల్లో కళాశాల విద్యార్థినీ విద్యార్థుల కోసం మనో-శైలజ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమం అంత్యాక్షరి. రాగం, తానం, పల్లవి పేర్లతో మూడు జట్ల నేర్పాటుచేసి వారు సినిమా పాట పంక్తుల్ని

గుర్తు తెచ్చుకోవడానికి పోటీపడేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థినీ విద్యార్థులకు ఆసక్తిని కలిగించింది. అనంతరం 'ఈటీవీ'లో మనో-శైలజ నిర్వహించిన 'సరిగమలు', మనో-ఇంద్రజ నిర్వహించిన 'ప్రియా ప్రియతమా రాగాలు', జెమినీ టీవీలో సునీత-కుంచె రఘు నిర్వహించిన 'నవరాగం', ప్రస్తుతం 'జెమిని'లో ప్రసారమవుతున్న 'పాడమని నన్నడగవలెనా?' 'మాటీవీ'లో ప్రసారమవుతున్న' స్వరసాగరం' వంటి శీర్షికలన్నీ సినిమాపాటల మీద ఆసక్తి కలిగిన వారిని ప్రోత్సహించడానికి ఉద్దేశించినవే. 'బాణోచ్ఛిష్టమ్ జగత్ సర్వమ్' అన్నట్లు ఇవన్నీ బాలు కార్యక్రమాల స్ఫూర్తితో నిర్వహిస్తున్నవే. ఇంకా 'ఆణిముత్యాలు' 'మధురగీతాలు' 'మనోరంజని' వంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా బుల్లితెరమీద పాత పాటలు ప్రసారమై శ్రోతలనలరిస్తున్నాయి.

### పాటల పంక్తులే మకుటాలుగా ..

పై టీవీ కార్యక్రమాలకు సంబంధించిన శీర్షికలలో - పాడుతా తీయగా, పాడాలని వుంది, పాడమని నన్నడగవలెనా, ప్రియా ప్రియతమారాగాలు.. వంటివి సినిమాపాటల పంక్తులేనన్న విషయం సినిమా పరిజ్ఞానం కలిగిన వారికి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమాపాట ప్రభావం ఎంతగా పెరిగిందంటే ఇటీవల అవకాశం వచ్చినపుడల్లా పత్రికలలో ఛాయాచిత్రాలకు, కార్టూన్లకు, వార్తలకు సినిమాపాటల పంక్తులనే మకుటాలుగా వాడుతున్నారు. మచ్చుకు కొన్ని -

1. **ఎన్నాళ్లకు వచ్చావే వానా, వానా !**
2. **ఈ దాహం తీరనిది**
3. **నామనసంతా నువ్వే**
4. **ఈనాటి ఈ బంధమేనాటిదో**
5. **నువ్వాదరినీ, నేనీదరినీ**
6. **రాజశేఖరా, నీపై మోజు తీర లేదురా.**
7. **రా రమ్మని, రారా రమ్మని రామచిలక పిలిచింది**
8. **రామా చిలకమ్మా, ప్రేమా మొలకమ్మా**
9. **ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము..**

ఇక సినిమాపాటల పంక్తులే మకుటాలుగా పేర్లు వస్తున్న సినిమాల సంఖ్య ఈ మధ్య ఎక్కువైంది. అగ్రకథానాయకులకు సంబంధించిన భారీచిత్రాల పేర్ల విషయంలో



ఇప్పటికీ తెలుగులో పెద్ద మార్పు లేకపోయినా, యువ కథానాయకుల ప్రేమ చిత్రాలకు, కుటుంబ కథా చిత్రాలకూ సినిమా పంక్తులతోను, కవితాత్మక రీతిలోనూ పేర్లు పెడుతున్నారు. వీటికి కొంత వరకు మన పొరుగునున్న తమిళ, మలయాళ చిత్ర రంగాలు కారణం. తమిళంలోని 'అలైగళ్ ఓయ్‌వదిల్లయ్' (అలలు అలిసిపోవు), 'అల్లి తందవానమ్' (దోసిలి పట్టిన ఆకాశం), 'కుడైక్కుళ్ మళై' (గొడుగులోపల వాన) మలయాళంలోని 'ఒరు పాడమ్ ఒరు విలాపమ్' (ఒక పాఠం, ఒక విలాపం) వంటి పేర్లు పెట్టే ధోరణి తెలుగులో తక్కువైనా - కవితాత్మకమైన సినిమాపాటల పంక్తులు 'టైటిల్స్' గా వచ్చి ఆలోటును కొంత తీరుస్తున్నాయి.[1]

ఉదాహరణకు -

1. **శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండీ**
2. **సొగసు చూడతరమా**
3. **రావోయి చందమామా**
4. **చెలియ చెలియ చిరుకోపమా**
5. **కనులు మూసినా నీవాయె**
6. **మౌనమేలనోయి**
7. **నా హృదయంలో నిదురించే చెలీ**
8. **నువ్వులేక నేనులేను**
9. **లాహిరి లాహిరి లాహిరిలో**

వంటి పంక్తులనెన్నిటినో పేర్కొనవచ్చు. ఈ పాటలన్నీ 'హిట్' కావడం వల్ల ఆ ప్రభావంతో 'టైటిల్' జనంలోకి వెళుతుందనే ఆశ, కొంత అభిరుచి - ఇటు వంటి పేర్లతో సినిమాలు రావడానికి కారణాలు.

ఇంకా సినిమాపాట పంక్తులను తలపిస్తూ వ్యాపార ప్రకటనలను చేయడం కూడా సమాజం మీద సినిమా పాటలకున్న బలమైన ముద్రకు తార్కాణం.

ఉదాహరణ -

**చల్ల చల్లగా ఇల్లంతా కూల్‌గా.. (కూల్ హోమ్)**

---

1. 18.6.2005 ఈనాడు సినిమాపుటలోని వ్యాసం-క్యాచీయా?..కవితాత్మకమా?

మూలం -

మెల్ల మెల్ల మెల్లగా అణువణువూ నీదెగా (దాగుడు మూతలు)

**'రాశి' పెరిగిన చిత్రాలు :**

1992 నుండి 2004 వరకు తెలుగులో నేరుగా తీసిన చిత్రాల సంఖ్య 1090. అంటే సగటున ఏడాదికి 85 సినిమాలు విడుదలయ్యాయి. సినిమాకు సగటున తొమ్మిది పాటల చొప్పున ఈ పదమూడేళ్లలో సుమారు 10వేల పాటలు వచ్చాయి. వీటిలో కొన్ని హిట్ సినిమాల పాటలైనా కనీసం సినిమాలు ప్రదర్శింపబడుతున్న కాలంలోనైనా బుల్లితెర మీద ప్రకటనల రూపంలోనూ కేసెట్ల ద్వారానూ ప్రాచుర్యాన్ని పొందుతూ జనం నోళ్లలో నానడం వల్ల సినిమాపాటలు ఎదురెక్కి వర్ధన్నా వినబడుతున్నాయి. వీటికి తోడు అనువాద చిత్రాల (డబ్బింగ్) సంఖ్యకూడా పెరిగి ఆ పాటలు కూడా వీటితోపోటీ పడుతున్నాయి.

**ఏదేశమేగినా, ఎందుకాలిడినా...**

1995 నుండి కంప్యూటర్ ప్రభావం వల్ల తెలుగు సినిమాపాట ప్రపంచవ్యాప్తంగా ప్రచారాన్నందుకొంది. తెలుగువారు ఎక్కువగా స్థిరపడిన అమెరికా వంటి విదేశాలలో సంస్కృతి పేరుతో సినిమాలు, సినిమాపాటలు ప్రాధాన్యాన్ని పొందుతున్నాయి. 'తానా' 'ఆటా' వంటి సభలకు చలన చిత్రరంగానికి సంబంధించిన నటులతోపాటు గాయనీ గాయకులను, గేయరచయితలను ఆహ్వానించడం వల్ల ఆమెరికాలో కూడా తెలుగు సినిమా పాట మారుమ్రోగుతోంది. మన నేపథ్యగాయకులు వాద్యసహాయకుల బృందాలతో విదేశాల్లో పర్యటించడం వల్ల కూడా ప్రపంచవ్యాప్తంగా తెలుగుపాట వినిపిస్తోంది.

**ఆడియో ఆర్భాటం :**

ఈ యుగంలో ముఖ్యమైన పరిణామం అనూహ్యంగా పెరిగిపోతున్న ఆడియో కేసెట్ల వ్యాపారం. పూర్వం చిత్రం విడుదలయిన తర్వాత అర్ధశతదినోత్సవాలు, శతదినోత్సవాలు మాత్రమే జరిగేవి. ఇప్పుడు చాలాలికి సీమంతంలా చిత్ర నిర్మాణ సమయంలో ఆడియో విడుదల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆడియో హక్కుల ధరలు కనీవినీ ఎరుగనంతగా పెరుగుతున్నా, కొనుగోలుచేసే సంస్థలు



కూడా అంతగానూ పెరిగి వ్యాపారంగా పోటీపడుతున్నాయి. పాటల స్థాయిని బట్టి చిత్రాన్ని ముందుగానే అంచనా వేసేటంతగా ఆడియో కేసెట్ల ప్రాధాన్యం పెరిగింది. ఈ కేసెట్ల అమ్మకాన్ని బట్టి ప్లాటినమ్ డిస్క్, డబుల్ ప్లాటినమ్ డిస్క్, హెక్సా ప్లాటినమ్ డిస్క్, (ఆరు లక్షల కాపీల అమ్మకం) మొదలైన పురస్కార సభలను నిర్వహిస్తున్నారు.

కొత్తగా సి.డి. కేసెట్లు కూడా రావడంతో ఈ ఆడియో వ్యాపారం మూడు పువ్వులా ఆరుకాయలుగా వర్ధిల్లుతూ - చిత్రవిజయంలో ప్రధాన భూమికను నిర్వహిస్తోంది. ఇలా ఆడియో కేసెట్ల నిర్మాణంలో వచ్చిన వైజ్ఞానికాభివృద్ధి పాటను వ్యాపార సా'ధనం' గా మార్చింది.

## 2. ఈ దశ 'తమోమయం' !

పైన వివరించినంతగా సినిమాపాట ప్రాచుర్యాన్ని, ప్రాధాన్యాన్ని సంతరించుకొన్న ఈ దశను (1992-2004) తమోమయ మనడం సమంజసమా? ఇలా అనడం కేవలం ముందు పేర్కొన్న ఆరు దశలతో ఈ పదం అంత్యప్రాసతో సహా సరితూగడానికేనా ? - నిజానిజాలు వివేచిద్దాం.

'సినిమా-సాంస్కృతిక పరిశీలన' సిద్ధాంతవ్యాసాన్ని రాసిన బి.యన్.శేఖర్ సినీగీత పరిణామాన్ని నాలుగు దశలుగా విభజించి 1931-50ను 'తొలిదశ' గానూ, 1951-70 ను 'మహర్దశ' గానూ, 1971-95ను 'క్షీణదశ'గానూ పేర్కొని 1996 తర్వాత నడుస్తున్న ఈ కాలాన్ని 'పునరుజ్జీవదశ'గా పేర్కొన్నారు. అలా పేర్కొనడానికి ఉపోద్ఘాతంగా -

'హీరో ఇమేజ్‌కి కాలం చెల్లిపోయి కథ కథనాలకు ప్రాముఖ్యత పెరగడం, ఏ దేశ ఏ ప్రాంతానికి చెందిన సంగీత ధోరణులను అనుకరించినప్పటికీ 'మెలోడీ'కి భంగం కలగని రీతిగా బాణీలు రూపొందించడం, అధికశాతం రీమేక్ చిత్రాలు అయినప్పటికీ కథాత్మక స్పర్శలూ, పాత్ర గతమైన నేపథ్యం వంటి అంశాలు ప్రాతిపదికపై గీతాలు రచింపబడటం,

అన్నిటికంటే ముఖ్యం (అధిక చిత్రాల్లోని ప్రేమ కథాంశాల కారణంగా) శృంగార గీతాలు వెల్లువలా వెలువడుతున్నప్పటికీ వాటిలో అశ్లీలార్థ ప్రయోగాలు అంతరించి వాటి స్థానంలో హృద్యమైన కవితాచమత్కారాలు చోటుచేసుకోవడం

ఇతర గీతాలలో వినోద విజ్ఞానాలను పుష్కలంగా అందించే సునిశిత వ్యంగ్య వైభవం, హాస్యధోరణి సమృద్ధి అయిన కారణంగా ఈ దశను పునరుజ్జీవ దశగా పరిగణించాను' అన్నారు.

'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' అన్న సిరివెన్నెల సీతారామశాస్త్రి ఈ వ్యాస రచయితతో ముఖాముఖిలో ఈ దశలో సినిమాపాట జారుడుమెట్ల మీద వుందనడానికి సమ్మతించలేదు.

వేటూరి సుందరరామమూర్తి ఈ రచయితతో మాట్లాడుతూ - "పాత పాటలన్నీ అరిటాకులో వడ్డించిన షడ్రసోపేతమైన భోజనం లాంటివయితే ఇప్పటిపాటలు 'ఫాస్ట్‌ఫుడ్' లాంటివి. పాటల్లో మాటల్లో తెలుగుతనం లోపిస్తోంది. ప్రకృతిలో పచ్చదనం తగ్గుతున్నట్టే భాషలో పరిపూర్ణత కనిపించడం లేదు. తెలుగుతోటలో అసంస్కృతీ దవానలం వ్యాపిస్తోంది. తెలుగుశారిక అగ్నిపంజరంలో దగ్ధమవుతోంది..." అన్నారు నేటి పాటల దుస్థితిపై తన ఆవేదనను తెలియజేస్తూ..! ఆయన ఇటీవల అనేక ఇంటర్వ్యూలలో ఇలాంటి భావాలనే వ్యక్తీకరించడం గమనార్హం.

మరో జాతీయ బహుమతి గ్రహీత సుద్దాల అశోక్‌తేజ ఈ రచయితతో ముచ్చటిస్తూ...

'నాడు పాట వధువును నాటి సంగీతం పల్లకిలో మోసుకెళ్లేది; పాట కనిపించేది.

నేటి పాట వధువును సంగీతం 'జెట్ స్పీడ్'లో లాక్కొని వెళ్లడం వలన 'పాట' కనిపించడం లేదు !' అన్నారు పాటను వధువుతో రూపిస్తూ.

మరోయువ రచయిత భాస్కర భట్ల రవి కుమార్ ఈ రచయితతో మాట్లాడుతూ-

"నేటి తెలుగు సినిమా పాట 'బీట్'లు' వారుతోంది" అంటూ చమత్కరించారు.

ఆరుద్ర 1996లో ఆయన యింట్లో ఈ రచయితతో- "నేను రామలక్ష్మితో అంటుంటాను - టీవీలో ప్రసారమవుతున్న తెలుగుసినిమా పాటల్లో ఎన్ని తెలుగు పదాలను చెప్పగలిగితే అన్ని రూపాయలిస్తానని" అన్నారు నవ్వుతూ.

నేటి పాటను సమర్థించే మొదటి యిద్దరినీ మినహాయిస్తే - మిగిలిన వారందరి హృదయ వేదన ఒకటే - తెలుగు సినిమాపాట తెలుగుపాటలా అనిపించడం లేదని !



**1. మ్యూజిక్ మ్యాజిక్ :**

ఈ శకంలో అధికశాతం తెలుగు సినిమాపాటల్లో భాష తెలియని శబ్దాలు తప్ప అర్థం అన్వయం ఉండడం లేదు. ఒకవేళ వుంటే అవి యువతరాన్ని ఉద్రేకపరిచే మాదక ద్రవ్యాల్లాంటివే. ఈ దశలో సినిమా అభిమానులు స్వరకల్పన చేసిన వాళ్లను తప్ప రచయితలను పట్టించుకోవడం తగ్గింది. ఆ మాటకొస్తే పాటల పల్లవుల్లో అనేకం రచయితలు రాస్తున్నవి కావట-సంగీతదర్శకులు యిస్తున్నవట ! యువతరం సంగీత దర్శకుల 'ఫాస్ట్‌ట్యూన్స్' కు బ్రహ్మరథం పడుతున్నారు తప్ప-పాటలో ఏముందో ఆలోచించడం లేదు. ఉదాహరణకు ఇటీవల యువతరాన్ని వెర్రెత్తించి 'సూపర్ హిట్స్' గా పరిగణింపబబడిన రెండు పాటల్ని చూద్దాం -

1. **'అ' అంటే అమలాపురం**
**'ఆహ్' అంటే ఆహాపురం**
**'ఇ' అంటే ఇచ్ఛాపురం**
**ఈలపెట్టి లాగుతారు ఆంధ్రాజనం**
**'ఉ' అంటే ఉంగాపురం**
**'ఊ' అంటే ఊగేజనం**
**'ఎ' అంటే ఎత్తూ పల్లం**
**గేలమేస్తె వాలతారు కుర్రజనం**
**పాలకొల్లు చేరినప్పుడే**
**పైటజారు డెక్కువాయెనే**
**యానాము చేరినా ఈనాము మారినా**
**ఫ్రెంచి ఫిడేలు ఆగునా**
**... ... ...**
**గాజువాక చేరినాక**
**మోజుపడ్డ కుర్రమూక**
**నన్ను అడ్డకాసి చంపినారురో** **-వేటూరి, ఆర్య (2004)**

చిత్ర విజయానికి కారణమైన అంశాల్లో ఒకటిగా భావింపబడిన ఈ పాటలో కవ్వించే ధోరణి తప్ప, రచన పరంగా చూస్తే ఒక క్రమం అర్థం, అన్వయం - కనిపించవు.

**2.	గాజువాక పిల్లా, మేం గాజులోల్లం గాదా ?**
**నీ చెయ్యిచాపలేదా ? - మా గాజు తొడగలేదా ?**
**గాజువాకే పిల్లా మాది - గాజులోల్లమే పిల్లామేము**

**సబ్బవరం పిల్లా - మేం సబ్బులోల్లం గాదా ?**
**నీ వీపుచూపలేదా - మా సబ్బురుద్దలేదా ?**
**సబ్బవరమే పిల్లా మాది - సబ్బులోల్లమే పిల్లామేము**

**సిరిపురం పిల్లా - మేం సీరలోల్లం గాదా ?**
**నీ సీరయిప్పలేదా? - మా సీర చుట్టలేదా ?**
**సిరిపురమే పిల్లామాది - సీరలోల్లమే పిల్లా మేము.**
**- కులశేఖర్, నువ్వు-నేను(2001)**

విశాఖపట్నంలోని కొన్ని ప్రాంతాలను తీసుకొని శబ్దసామ్యంతో అల్లిన ఈ పాటకు మూలాన్ని కొన్నేళ్ల క్రితం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సరదాగా పాడుకొనేవారు. ఇందులో గాజువాకకీ గాజుకీ 'సబ్బవరానికీ సబ్బుకీ' సిరిపురానికీ సీరకీ శబ్దాల్లో చిరుపోలిక తప్ప అర్థం పర్థం లేదు. ఆయా ప్రాంతాలు ఆ వస్తువులకు ప్రసిద్ధాలు కూడా కాదు! పాటల్లో వున్నవల్లా కుర్రకారును రెచ్చగొట్టే 'వీపు చూపడం' 'సీరవిప్పడం' లాంటి అశ్లీల సూచకాలు మాత్రమే!

ఈ చిత్రాల విజయోత్సవ సభల్లో మాట్లాడుతూ ఓ అగ్రశ్రేణి కథానాయకుడు 'ఈ పాటలు నాకు పడితే యిరగదీసేవాణ్ణి' అన్నారు! బహుశా ఆయన వాఖ్య పాటల్లోని సంగీతపరమైన 'ఫాస్ట్‌బీట్' నుద్దేశించిందే అయ్యుండాలి! ఆడియో పరంగా సంచలనాన్ని సృష్టించి ఆంధ్రదేశమంతటా మారుమ్రోగిన ఈ పాటల్ని పరిశీలించినపుడు జనం శబ్దాలను తప్ప అర్థాలను పట్టించుకోవడం లేదనే విషయం స్పష్టమౌతోంది. ఈ విషయాన్ని అన్యభాషా పదాల ఆధిక్యం గల ఈ కింది పాటలు కూడా రుజువు చేస్తున్నాయి.

**(అ) ఫ్రంట్ చూస్తే పారిస్ ఇందువదనా**
**బ్యాక్ చూస్తే గోలచేయక ఉండగలనా ?**
**ఫేవరేట్ స్పాట్ చూసి పాస్‌పోర్ట్ ప్రింట్ తియ్యనా ?**
**కెన్‌యు లవ్ ? టెల్‌మి నౌ.		-సదవే దేవేంద్ర, ఆరోప్రాణం (1997)**

**(ఆ) డోంట్‌వర్రీ బీహాపీ డోంట్ వర్రీ**
**ఓంహరీ ఎంజాయ్ చెయ్ మరీ**



**చేసెయ్ ఏదో రాబరీ**
**తింటూ బతికెయ్ స్ట్రాబెరీ**
**ఓల్డేజ్ వచ్చేయదా కొన్నాళ్లుపోతే**
**ఓల్టేజ్ డౌనేగా టీనేజ్ పోతే		-భాస్కరభట్ల, ధనలక్ష్మి.. ఐలవ్ యు (2002)**

**(ఇ) స్టూడెంట్లు సూడెంట్లు తుమ్మెదా**
**యూత్ యూతంటారు తుమ్మెదా**
**...	...	...**
**హే ప్రెటీ గర్ల్స్ వుయ్ ఆల్‌నో వాట్‌టుడు - ఏ**
**ఫ్రమ్ బెడ్‌రూమ్ టు బస్‌స్టాప్ - వుయ్‌విల్ డ్రీమ్**
**లైక్ ఎ ఫుల్‌టైమ్ జాబ్.. యార్ - ఆల్ త్రుదిడే.. ఆహా**
**చెకప్‌ది గయ్స్.. యస్ - యు కమాన్ ఫీలిట్ ఆల్‌రైట్**
**ఓ క్రేజీక్రేజీ బట్‌నాట్ వెరీలేజీ - నౌయుఫీల్ ది ప్లే**
**దెన్ అండ్ టేక్‌యిట్ టు ఫీల్ దెమ్.		-కులశేఖర్. పిలిస్తే పలుకుతా. (2002)**

**(ఈ)ఐయామ్ యాన్ ఇండియన్**
**ఏదేశ్ కా ప్యారా ప్యారా**
**కిస్ కి నజర్ లగీ ఇసే**
**హే భారత్‌దేశ్ హమారా..		- బద్రి (2000)**

**(ఉ) ఏ మేరా జహా, ఏ గర్ మేరా ఆసియా**
**ఏ మేరీ దునియా, తేరీ కామ్ క్యాహై యహా ?..**
**(ఈ పాట పూర్తిగా హిందీలోనే వుంది)		-ఖుషి (2001)**

పై పాటల్లో మొదటి మూడు మన చిత్రపరిశ్రమకు చెందిన రచయితలూ, తర్వాతి రెండూ ఇతరులు రాసినవి. ఆయా సందర్భాలకు తప్పని సరయినప్పుడు అన్యభాషల జోలికి వెళ్లకూడదని కాదు, పైపాటలను ఉటంకించడం - మన జనం భాషాభేదం లేకుండా ' ఏమాటయితేనేం - చెవితుప్పు వదలడానికి' అన్నంత ఉదారంగా వింటున్నారని రుజువు చేయడానికి మాత్రమే !

**2.	అధోస్థాయి అశ్లీల గీతాలు :**

ఇంతకుముందు దశలోని పరిస్థితి మారి ఈ దశలో శృంగారం పరిణత స్థితికి చేరుకొందనే వారి వాదం ఎంత వరకు వాస్తవమో పరిశీలిద్దాం -

**(అ) అత్తరు బుడ్డికి అబ్బాయిగారు**
**సీలూడదీస్తారా శ్రీవారు మీరు ? - గురుచరణ్, మేజర్ చంద్రకాంత్ (1993)**

**(ఆ) బొడ్డులో రూపాయి బిళ్ల**
**అబ్బ! ఎన్నాళ్లు దాచావె పిల్లా ? - జాలాది, చిట్టెమ్మ మొగుడు (1993)**

**(ఇ) ఎక్కిందయ్యవేడి, కావాలయ్యజోడి...**
**కూతకొచ్చిందండి కోడి, మేతపెట్టేయ్‌మంది బాడీ -వెన్నెలకంటి, హలోబ్రదర్ (1994)**

**(ఈ)బాడీ హీటెక్కివుంది చూడూ**
**బేబీ, చన్నీళ్లు స్నానమాడూ**
**అలాగ ఈ వేడి చల్లారదులే -భాస్కరభట్ల, ధనలక్ష్మి.. ఐలవ్ యు (2002)**

**(ఉ) సున్నండ చూసుకో ఓ బావా**
**సిగ్గుపడకుండా తీసుకో ఓ బావా -చంద్రబోస్, ఆది (2002)**

చిత్రీకరణలో కొంత సమర్థించుకొని సెన్సార్ బారి నుండి బయటపడినా పై పాటల్లోని దిగజారుడుతనాన్ని ఎవరూ సమర్థించలేరు ! పరిణత శృంగారమంటే ఇదేనా? పూర్వ దశల్లోనూ ఇలాంటి పాటలు లేకపోలేదు. ఇంకా ఈ 'యావ' తగ్గుముఖం పట్టలేదని చెప్పడానికే పై ఉదాహరణలు. ప్రబంధాల్లోనూ, వాగ్గేయకారుల రచనల్లోనూ శృంగారం లేకపోలేదు - కాని ఇటువంటి శబ్దనైచ్యం లేదు !

### 3. ప్రేమతత్త్వం - వికటించిన కవిత్వం :

ప్రబంధ కవుల నుంచి సినీకవుల వరకు ప్రేమ గురించి రాయనివారు లేరు. భావకవుల్లో - అనేకులు ప్రేమతత్త్వాన్ని నిర్వచించారు -

ఉదాహరణలు -

**ప్రేమించు సుఖముకై ప్రేమించు ముక్తికై**
**ప్రేమించు ప్రేమకై 'ఏమింక వలెనురా' -బసవరాజు అప్పారావు**

**సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజమ్ము**
**చంద్రికల నేల వెదజల్లు చందమామ**
**ఏల సలిలంబు పారు గాడ్పేల విసరు**



**ఏల నా హృదయంబు ప్రేమించునిన్ను -దేవులపల్లి కృష్ణ శాస్త్రి**

సినిమాలకు, సినిమా పాటలకు ప్రధానాంశం ప్రేమే గనుక ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రేమగురించి రాయని సినిమాకవులు లేరు. ప్రేమగురించి చేసిన వ్యాఖ్యలకు సినిమాపాటల నుండి రెండు మచ్చుతునకలు -

**(అ) ప్రేమ ఎంత మధురం**
**ప్రియురాలు అంత కఠినం -ఆత్రేయ (అభినందన)**

**(ఆ) హృదయమనే కోవెల తలుపులు తెరిచేతాళం ప్రేమా ప్రేమా.**
**త్యాగమనే దేవతసన్నిధి వెలిగే దీపం ప్రేమా ప్రేమా -సిరివెన్నెల (పెళ్లిసందడి)**

కాని ఈ దశలో 'నువ్వే కావాలి' (2000) చిత్రవిజయంతో యువతరం ప్రేమ చిత్రాలు వెల్లువెత్తడంతో ప్రేమపేరుతో వేలం వెర్రి పాటలు ఎక్కువయ్యాయి. నిజానికి 'నువ్వేకావాలి'లో సీతారామశాస్త్రి - 'అనగనగా ఆకాశం వుంది' 'ఎక్కడవున్నా పక్కన నువ్వే ఉన్నట్టుంటోంది' 'కళ్లలోకి కళ్లుపెట్టి చూడవెందుకు' వంటి రసగుళికలను రాశారు. కాని అనంతరం 'ప్రేమ' ఇతివృత్తంగా పుంఖానుపుంఖాలుగా వచ్చిన చిత్రాల్లోని పాటల్లో యువకవులు ప్రేమను కొత్తగా చెప్పే ప్రయత్నంలో పక్కదారులు పట్టారు -

కొన్ని ఉదాహరణల్ని గమనించండి -

**(అ) బంగాళాఖాతంలో నీరంటే నువ్వేలే**
**రంగీలాపాతంలో రాగం నువ్వేలే**
**ఖండాలదారుల్లో మంచంటే నువ్వేలే**
**మండేలా చూపే నువ్వేలే ఓమిస్సమ్మా ... -చంద్రబోస్, బద్రి (2000)**

**(ఆ) దుమ్ములేపే దమ్మువుంది, చూపులోన సురుకువున్నది రోయ్...**
**ప్రేమలో పడితే కష్టాలుంటాయ్, కష్టాలున్నపుడు కన్నీళ్లొస్తాయ్**
**ఈ కష్టాలూ కన్నీళ్లూ మనకెందుకులే అనుకొని -**
**ప్రేమించడం మానేసే గొడ్డుకీ మనిషికీ తేడా ఏటుంటది రోయ్...**
**గుప్పెడు గుండెను తట్టిందా ఉప్పెనలాంటి ఈ ప్రేమ?**
**వెనకడుగేస్తే దక్కేనా వన్నెచిన్నెల ఈ భామ ?**
**తల్లిని పేమిస్తాడొకడు, పిల్లిని పేమిస్తాడొకడు**

అక్కను ప్రేమిస్తాడొకడు, కుక్కను ప్రేమిస్తాడొకడు
అలాంటప్పుడు నువ్వీ పిల్లను ప్రేమిస్తే తప్పేమిటి రోయ్
-భాస్కరభట్ల, ఇడియట్ (2002)

(ఈ పాట ఒగ్గుకథ ఒరవడిలో సాగి ప్రచారాన్ని పొందింది)

(ఇ) ప్రేయసి కావు, నేస్తం కావు, గుండెల్లో నిండున్నావు...

చరణం1: మోహమే మంటగా రగులుతున్నా, లోకమే నీవుగా మునిగివున్నా
గాలిలో ఈకలా తేలుతున్నా, నీటిలో రాతలా చెదిరివున్నా
నీ శ్వాసకోసం మానై వుంటా, నీ మాట కోసం మునినై పోతా
నీ చూపుకోసం శిలనై వుంటా, నీ నవ్వుకోసం అలుసై పోతా
జాబిలికే వెన్నెల నీవు, సూర్యునికే వేకువ నీవు
ఊపిరిలో ఉష్ణం నీవు, ఊరించే తృష్ణం నీవు
శూన్యం నీవు నా శోకం నీవు -దేవకాశిక్, 'వెన్నెల' (2005)

ఔచిత్యం లేని అలంకారాలు, అర్థంలేని తర్కం, భాషాభావాల్లో అపరిపక్వత - వరుసగా పై వుదాహరణాల్లో గమనిస్తాం. బంగాళాఖాతం - రంగీలాపాతం, ఉష్ణం-తృష్ణం వంటి ప్రాసల్ని, ఆ పంక్తుల్ని చూస్తే తిలక్ 'నవత-కవిత' (అమృతం కురిసిన రాత్రి)లో రాసిన-

ఇలా రాయడం కొత్తగా గమ్మత్తుగా ఉంటుంది కాని ఇది నాన్సెన్స్
ఇది పసితనం ప్లస్ వెర్రితనం యింటూ డికడెన్స్

అనే పంక్తులు గుర్తుకొస్తాయి.

**రీమిక్స్‌లూ - ఫ్రీమిక్స్‌లూ !**

ఈ దశలోని మరో చిత్రమైన ధోరణి - రీమిక్సింగ్. పాత పాటల సాహిత్యానికి, బాణీలకు 'కాపీరైట్'ను స్వేచ్ఛగా వినియోగించుకొని 'రీమిక్సింగ్' పేరుతో ఆ పాటలను యథాశక్తి 'ఖూనీ' చేస్తున్నారు. మొదటిలో 'రీమిక్సింగ్'కి వచ్చిన స్పందనను చూసి ఆ విధానం మీద రకరకాల ప్రయోగాలను చేసి చేతులను కాల్చుకొంటున్నారు.

వంశీ 'కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్' (1988)లో మూడు పాత చిత్రాలలోని పాటలను ఇళయరాజా 'బి.జి.యమ్స్'తో తిరిగి రికార్డ్ చేశారు.

1. తెలిసిందిలే తెలిసిందిలే
నెలరాజ నీరూపు తెలిసిందిలే (రాముడు-భీముడు)

2. సిగ్గేస్తుందా సిగ్గేస్తుందా
మొగ్గలాంటి చిన్నది బుగ్గమీద చిటికేస్తే (మనుషులు-మమతలు)

3. నువ్వు నా ముందుంటే
నిన్నిలా చూస్తుంటే (గూఢచారి 116)

ఆ తర్వాత 'జోకర్'లో 'మంచిచెడు'లోని ఆత్రేయ పాటను కొత్తట్యూన్‌లో రికార్డు చేసి వినియోగించారు.

'రేపంటి రూపం కంటి, పూవింటి దొరనే కంటి...'

అనంతరం 'డిటెక్టివ్ నారద' చిత్రంలో మరో ప్రయోగం చేశారు. 'గుండమ్మ కథ' లో పింగళి పాటను తీసుకొని, అదే రాగంలో కొత్తట్యూన్‌లో రూపొందించిన ప్రశ్నకు పాతపాటలోని పంక్తులను జవాబుగా ఉపయోగించి యుగళగీతాన్ని కూర్చారు.

ప్ర : యౌవనాల పువ్వులన్ని నవ్వుతున్న తోటలో
ప్రేమ యాత్ర చేద్దామా ?

జ : ప్రేమ యాత్రలకు బృందావనమూ
నందనవనమూ ఏలనో ?

'కొంచెం టచ్‌లో వుంటే చెపుతాను' (2004) లో 'కులగోత్రాలు'లోని సి.నా.రె. పాటను యథాతథంగా తీసుకొని బి.జి.యమ్స్ మాత్రం మార్చారు -

చిలిపి కనుల తీయని చెలికాడా

(ii) ఇలా యథాతథంగా పాత చిత్రాల నుండి కొత్త చిత్రాలలో గ్రహించిన మరికొన్ని పాటలు -

1. చిటపట చినుకులు పడుతూవుంటే (పెళ్ళిపీటలు-1998)
మూలం : ఆత్మబలం - రచన : ఆత్రేయ

2. ఆడువారి మాటలకు అర్థాలు వేరులే (ఖుషి-2001)
మూలం : మిస్సమ్మ - రచన : పింగళి

3. రావోయి చందమామా (విష్ణు-2003)
మూలం : మిస్సమ్మ - రచన : పింగళి

4. **ఆరేసుకోబోయి పారేసుకొన్నాను** **(అడవి రాముడు-2004)**
మూలం : అడవి రాముడు (1977) - రచన : వేటూరి

(iii) కొన్ని పాటలను పల్లవి వరకు మాత్రం గ్రహించి చరణాలను నేటి కవుల చేత రాయించారు.

1. **రాదే చెలీ, నమ్మరాదే చెలీ**
**మగవారినిలా నమ్మరాదే చెలీ...** **(మిస్టర్ పెళ్లాం - వేటూరి - 1993)**
మూలం : దేవత (1941) - రచన : సముద్రాల

2. **ఈ రేయి తీయనిది**
**ఈ చిరుగాలి మనసైనది** **(జానీ-సిరివెన్నెల - 2003)**
మూలం : చిట్టిచెల్లెలు (1970) - రచన : సి.నా.రె.

3. **అరెరెరెరె...**
**ఎట్టాగో వున్నాది ఓలమ్మీ..**
**ఏటేటో అవుతూంది చిన్నమ్మీ** **(నేనున్నాను - సిరివెన్నెల - 2004)**
మూలం : దసరాబుల్లోడు (1971) - రచన : ఆత్రేయ
ఈ పాట ముగింపులో కూడా మూలాన్ని అనుకరించారు.

**జడవూపి, నడువూపి**
**నిగనిగల నిధుల చూపి**
**నువ్వీరంగం వేస్తుంటే ఓలమ్మీ**
**ఊరంతా ఊగిందే చిన్నమ్మీ ... అంటూ !**

(IV) పాత సినిమాల్లోని బాణీలను యథాతథంగా ఉపయోగించుకొని పాటలను కొత్తగా రాయించిన సందర్భాలూ వున్నాయి.

ఉ: **రెండువేల రెండు వరకు**
**చూడలేదే ఇంత సరుకు** **(అల్లరి రాముడు - పోతుల రవికిరణ్)**
మూలం : **ఆకుచాటు పిందెతడిసె - కోకమాటు పిల్లతడిసె (వేటగాడు-1979)**
రచన : వేటూరి సంగీతం : చక్రవర్తి

(V) పాత పాటలకు పారడీల వంటి కొత్త పాటలు కూడా కొన్ని వచ్చాయి -



**రావోయి మాకంటికి**
**అరె రంజుగా లైపున్నది**
**బొంబడు లైపున్నది**
**తినటికి బ్రౌన్ షుగర్ మందున్నది - నల్లమందున్నది**
**నువ్వు తాగనీకి సర్కారు సారున్నది** **(జానీ-మాస్టర్ జీ)**
మూలం : **రారోయి మాయింటికి - (దొంగరాముడు-1955-సముద్రాల)**

ఇలా సంగీతాన్ని సాహిత్యాన్ని మార్చి రాయించిన పాటల్లో కొన్నిటిని తాత్కాలికంగా ఆదరించినా అధికశాతాన్ని జనం ఆమోదించలేదు. అనుకరణలు అసలు పాటల ముందు వెలవెలపోయి క్రమంగా చెవిమరుగవుతున్నాయి. అయితే 'స్మిత' రూపొందించిన' మసక మసక చీకటి'లో వంటి ప్రైవేట్ ఆల్బమ్స్' హిట్ కావడంతో శ్రావ్యమైన పాత సినిమాపాటలకు ఈ రీమిక్సింగ్ బెడద తప్పడం లేదు.

**విలవిలలాడుతున్న విలువలు :**

ఇది అంధానుకరణల కాలం. గుర్తింపువున్న కథానాయకుల చిత్రాలలో 'రాజు వెడలె రవితేజములలరగ' అన్నట్టుగా కథానాయకుణ్ణి బృందంతో పరిచయం చేసే గీతం తప్పని సరిగా వుంటోంది. ర్యాప్ సంగీతానికి, నృత్యానికి అనువుగా వుండడమే ఆ పాట అర్హత. పాటను తెరమీద చూస్తూ కుర్రకారు హీరో ఆటకు మురిసిపోతూ పాశ్చాత్య సంగీతానికనువైన శబ్దాలకు పరవశించిపోతున్నారు. ఈ బాణీకి పరాకాష్ఠగా-

**'హే! హీరాధి హీరుడా స్టారాతిస్టారుడా గ్రేటాతిగ్రేటుడా.. !**
**- చంద్రబోస్, అందరివాడు (2005)**

వంటి పాటలు వస్తున్నాయి. ఆ పైన అర్థం లేని పదప్రయోగాలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ దశలోని మరో ప్రత్యేకత కవిత్వం పాలుకాని, చమత్కారం కాని లేని - వచన ధోరణిలో (ప్రాజయిక్) సాగే సంవాదాలు యుగళగీతాలుగా రావడం. పాదాల చివర అంత్యప్రాసలు వుంటే చాలు - అది కవిత్వమని భ్రమపడ్డం కొందరు కొత్తరచయితల అపరిపక్వతకు నిదర్శనం.

ప్రతి చిత్రానికి నాలుగయిదు యుగళగీతాలు అవసరం కావడంతో ప్రతిపాదించవలసిన నూతనాంశం లేక, సందర్భం దొరకక - యుగళగీతాలు 'హిట్' కావడం లేదని వర్ధమాన రచయితలు వాపోతున్నారు. జానపదాల ఒడుపు తెలియక కృతకమైన బాణీలలో భాషావిన్యాసాలతో జానపద గీతాలకు రూపకల్పన చేస్తున్నారు.

ఒకపక్క ప్రభుత్వం నందీపురస్కారాలతో పద్యనాటకాలకు పెద్దపీట వేస్తుండగా, బుల్లితెర మీద' శ్రీ భాగవతం 'వంటి సీరియల్స్ అమోఘమైన ప్రజాదరణ పొందుతుండగా - వెండితెర మీద మాత్రం ఈ దశలో ఒక్కటి తప్ప ( శ్రీకృష్ణార్జున విజయం - 1996) పౌరాణిక చిత్రాలు రాలేదు. పౌరాణికాలను తీయగల దర్శకులు, సామర్థ్యం గల నటులు, సాహిత్యాన్ని సమకూర్చగల కవులు, ఆస్వాదించగల ప్రేక్షకులు కరువయ్యారనిపిస్తోంది.

ముఖ్యంగా తెలుగు సినిమాపాటలో లాలిత్యం మాధుర్యం కొరవడ్డాయి. భాష మీద అధికారం లేని రచన, భావ ప్రకటన కరువైన పరభాషాగాయకుల గానం వంటి వైకల్యాల వల్ల పాటలో తెలుగుతనం లోపిస్తోంది. పాట పాడడానికి సిద్ధమవుతూ 'జాబిల్లి' అనే పదంలో 'బిల్లి' అంటే ఏమిటని ప్రశ్నించే పరభాషాగాయకులకు యువతరం బ్రహ్మరథం పడుతున్న కాలంలో అర్థవంతమైన మధురగీతాలను ఎలా ఆశించగలం? తీపిపాటలను కాదని కర్ణకఠోరమైన శబ్దాలను, కంఠాలను యిష్టపడుతున్న కుర్రకారు రుచి 'కొయ్యబొమ్మల మెచ్చు కళ్లకు కోమలుల సౌరెక్కునా? అన్నట్టుగా వుంది ఒక్కమాటలో చెపితే తెలుగుతనం లోపిస్తున్న సాహిత్యాన్ని తెలుగు రాని వాళ్లు పాడుతుంటే తెలుగుతీపి తెలియని జనం వేలం వెర్రిగా వింటున్నారు - ఇదీ నేటి సినిమాపాట దుస్థితి !

**'కాలం అద్దం లాంటిది**
**అంధయుగమైనా స్వర్ణయుగమైనా అది మన ప్రతిబింబం**

అని తిలక్ చెప్పినట్టు అద్దం అబద్ధం చెప్పదు. అందం నిజానికి నప్పదు. సాహిత్య యుగంలో క్షీణయుగంలా - సినిమాపాటల చరిత్రలో ఈ దశను 'తమోమయం' అనక తప్పదు !

'తమస్సు' అంటే చీకటి, అవివేకం వంటి అర్థాలతో పాటు సత్త్వ రజస్తమోగుణాలలో చివరి గుణం కూడా ! తమోగుణం, తమోగణం సినిమాపాట నేలుతున్న కాలాన్ని తమోమయం అనడంలో తప్పులేదని నా భావన.

## 3. అయినా.. కొన్ని వెలుగులు !

కొన్ని అవాంఛనీయమైన అనారోగ్యకరమైన ధోరణులు ప్రబలడం వల్ల ఈ దశను తమోమయంగా పేర్కొన్నప్పటికీ, ఇది అధ్వాన్నంగా నిస్తేజంగా నిరాశాజనకంగా వుందనీ.. ఈ కాలంలో ప్రతిభావంతులైన కవులు లేరనీ - భావిస్తే మాత్రం పొరపాటు! సినిమా రచనను ప్రవృత్తిగా స్వీకరించినా నాలుగు దశాబ్దాలకు పైగా నిలిచి నాణ్య(న్య)



మైన గీతాలనందిస్తున్న సి. నారాయణరెడ్డి, గత దశలోనే తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకొన్న వేటూరి సుందరరామమూర్తి, సిరివెన్నెల సీతారామశాస్త్రి మొ॥ ప్రసిద్ధులతో పాటు మెరుపుల్లాంటి కొందరు యువకవులు కూడా - చీకట్లు ముసిరిన ఈ దశను జ్యోతిర్మయం చేశారు- చేస్తున్నారు. రెండుసార్లు తెలుగు సినిమాపాటకు జాతీయ బహుమతులు లభించడం, అభ్యుదయ దృక్పథంతో సామాజిక స్థితిగతుల మీద స్పందించిన పాటలు రావడం, సాహిత్యపరంగా అద్భుతమైన భావుకత వెల్లివిరియడం.. ఈ యుగం విశిష్టత !

**జాతీయ పురస్కారాలు :**

1974లో 'తెలుగువీర లేవరా' గీతంతో తెలుగు సినిమాపాటకి జాతీయ స్థాయి పురస్కారానికి శ్రీకారం చుట్టిన శ్రీశ్రీ తర్వాత సుమారు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత 'మాతృదేవోభవ'లోని పాటకు వేటూరి సుందరరామమూర్తి, మళ్లీ పదేళ్లకే 'ఠాగూర్' చిత్రం ద్వారా సుద్దాల అశోక్‌తేజ - ఈ గౌరవాన్నందుకోవడం ఈ దశకు గర్వకారణం.

'మాతృదేవోభవ'లో వేటూరి కలం నుంచి జాలువారిన పాటకు సంగీతం, గానం - కీరవాణి

పల్లవి: **రాలిపోయే పూవా నీకు రాగాలెందుకే**
**తోటమాలి నీతోడు లేడులే**
**వాలిపోయే పొద్దా నీకు వర్ణాలెందుకే**
**లోక మెన్నడో చీకటాయెలే**
**నీకిది తెలవారని రేయమ్మా**
**కలికి మా చిలక, పాడకు నిన్నటి నీరాగం** ॥రాలి॥

చరణం1 **చెదిరింది నీగూడు గాలిగా**
**చిలక గోరింకమ్మ గాథగా**
**చిన్నారిరూపాలు కన్నీటి దీపాలు కాదా**
**తనవాడు తారల్లో చేరగా**
**మనసుమాంగల్యాలు జారగా**
**సిందూరవర్ణాలు తెల్లారి చల్లారిపోగా**
**తిరిగే భూమాతవు నీవై, వేకువలో వెన్నెలవై**

కరిగే కర్పూరం నీవై ఆశలకే హారతివై ॥రాలి॥

చరణం 2 అనుబంధమంటేనే అప్పులే
కరిగే బంధాలన్నీ మబ్బులే
హేమంతరాగాల చేమంతులే వాడిపోయె
తన రంగు మార్చింది రక్తమే
తనతో రాలేనంది పాశమే
దీపాల పండక్కి దీపాలే కొండెక్కిపోయె
పగిలే ఆకాశం నీవై జారిపడే జాబిలివై
మిగిలే ఆలాపన నీవై, తీగతెగే వీణియవై... ॥రాలి॥

వైణికురాలైన కథానాయిక భర్తను పోగొట్టుకొన్న సందర్భంలో ఆమె నిస్సహాయ దయనీయ స్థితిని వర్ణించిన కరుణరస ప్లావితమైన నేపథ్యగీతం యిది. ఔచితీ వంతమైన పద ప్రయోగం, సున్నితమైన తాత్త్వికస్పర్శతో హృదయాన్ని తాకే గేయం యిది. పాట పొడవునా హృద్యమైన రూపకాలు, కవితాత్మకమైన వ్యక్తీకరణలు, ఆర్ద్రమైన అనుబంధాల ఆవిష్కరణలు.. గుండెను బరువెక్కించి, కళ్లను చెమరింపచేసి ఈ పాట అర్హతను నిరూపిస్తాయి.

2003వ సంవత్సరానికి జాతీయబహుమతి పొందిన 'ఠాగూర్' చిత్రంలోని పాటను సుద్దాల అశోక్‌తేజ రాయగా మణిశర్మ స్వర రచన చేశారు.

పల్లవి: నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను !
నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను !
నేను సైతం భువనఘోషకు వెర్రిగొంతుక విచ్చిమోశాను !

చరణం 1 అగ్నినేత్ర మహోగ్రజ్వాల దాచిన ఓ రుద్రుడా
అగ్నిశిఖలను గుండెలోతున అణచిన ఓ సూర్యుడా
పరశ్వధమును చేతబూనిన పరశురాముని అంశవా
హింసననణచగ ధ్వంసరచనను చేసిన ఆచార్యుడా
మన్నెం వీరుడు రామరాజు ధనుష్టంకారానివా ?
భగత్‌సింగ్ కడసారి పలికిన ఇంక్విలాబ్ శబ్దానివా ?

చరణం 2 అక్రమాలను కాలరాసిన ఉక్కుపాదం నీదిరా
లంచగొండుల గుండెలో నిదురించు సింహం నీవెరా
ధర్మదేవత నీడలో పయనించు యాత్రే నీదిరా
కనులు కప్పిన న్యాయదేవత కంటి చూపైనావురా
'సత్యమేవ జయతి'కె నిలువెత్తు సాక్ష్యం నీవెరా
లక్షలాది ప్రజల ఆశాజ్యోతివై నిలిచావురా ॥నేను॥

ఈ పాట పల్లవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో 'జయభేరి' ఖండికలోనిదని న్యాయ నిర్ణేతలకు తెలుసో లేదో కాని ఆధునిక కవిత్వం మీద ఏపాటి అభిమానమున్నవాడికైనా తెలుస్తుంది. చరణాల్లోని ధ్వంసరచన వంటి పదబంధాలు కూడా శ్రీశ్రీవే ! అందువల్ల ఈ గీత బహుమతి శ్రీశ్రీ అశోక్ తేజలకు సంయుక్తంగా ప్రకటించాలి. లేదా అశోక్ తేజయే ఇంతకంటె ఉత్తమంగా రాసిన గేయాలున్నాయి. వాటిలో దేనికైనా ఇవ్వవలసింది! ఇక 'జాతీయబహుమతి'కి సంబంధించినంతవరకు శ్రీశ్రీ పాటకు అశోక్ తేజ పాటకు 'పొరపాటు'లో యాదృచ్ఛికమైన సామ్యం వుంది. శ్రీశ్రీ 'ప్రతి మనిషి తొడలు గొట్టి సింహాలై గర్జించాలి' అంటూ 'వచనం' విషయంలో వ్యాకరణ దోషానికి పాల్పడినట్టే అశోక్‌తేజ 'లంచగొండుల గుండెలో నిదురించు సింహం నీవెరా' (లంచగొండుల గుండెల్లో అని వుండాలి) అని వచనం విషయంలోనే పొరబడ్డారు. ఈ పొరపాటు తెలుగు పాటకు అచ్చొచ్చిందనీ, ఇలాంటి అల్పదోషంవుంటే తప్ప అంత ఘనమైన పురస్కారం దక్కదనీ అనుకోవాలి! ఏమైనా శబ్దార్థపరమైన వీరరసస్ఫూర్తిగల గేయాన్ని రాసి తెలుగుపాటకు మూడవ సారి జాతీయబహుమతిని తెచ్చిన అశోక్‌తేజను అభినందించాలి !

**వాగ్గేయకారుల దారిలో..**

గత దశలో శంకరాభరణంలా ఈ దశలో సంగీత పరంగా సంచలనాన్ని సృష్టించిన చిత్రం అన్నమయ్య! వి.యం.సి. ప్రొడక్షన్స్ వారి ఈ చిత్రంలో 20 పాటలుండగా- వాటిలో పదిహేను అన్నమయ్య కీర్తనలను యథాతథంగా ఉపయోగించారు. మిగిలిన వాటిలో నాలుగింటిని రచించిన వేటూరి అన్నమయ్యను తలపింపచేశారు. ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన యం.యం. కీరవాణి, ఎక్కువ కీర్తనలను పాడిన బాలు - అన్నమయ్య కీర్తనలలోని పావిత్ర్యాన్ని, భక్తితత్త్వాన్ని, సాహిత్య సుగంధాలను పరిమళింపజేశారు.

1. వినరో భాగ్యము విష్ణు కథ...
2. అదివో అల్లదివో శ్రీహరి వాసము...
3. పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా..

4. విన్నపాలు వినవలె వింతవింతలు..
5. మూసిన ముత్యాలకేలే మొరగులు...
6. కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు..
7. నిగమ నిగమాంత వర్ణిత - మనోహర రూప..
8. బ్రహ్మ కడిగిన పాదము..

వంటి అన్నమయ్య ప్రసిద్ధ కీర్తనలన్నీ చల్లని పిల్లగాలుల్లా పాశ్చాత్య సంగీతపు దుమారంలో ఉక్కిరి బిక్కిరవుతున్న శ్రోతలకు సేదతీర్చాయి. ఈ చిత్రానికి వేటూరి సమకూర్చిన -

**ఏలే ఏలే మరదలా** పాట మొదటి పంక్తితో పాటు -

**గాటపు గుబ్బలు కదలగ కులికేవు**
**మాటల తేటల మరదలా**

అనే పంక్తులు యథాతథంగా అన్నమయ్య కీర్తన నుండి గ్రహించినవే. అయితే మిగతా పంక్తులలో అదే శైలిని స్ఫురింప చేయడం వేటూరి ప్రత్యేకత.

అలాగే -
**'అస్మదీయ మగటిమి - తస్మదీయ తకథిమి...'**
యుగళగీతంలో -
**'ఎపుడెపుడని ఎద ఎద కలిపే ఆ పని**
**రేపని మరిమాపని క్షణమాపని మాపని..'**
వంటి పంక్తులలో శైలి, శబ్దాలంకారాలు వేటూరి 'పని' తనాన్ని చాటతాయి.

ఈ చిత్రంలో జె.కె. భారవి
**పదహారు కళలకు ప్రాణాలైన - నా ప్రణవ**
**ప్రణయ దేవతలకు ఆవాహనం**
అనే పాటకు అన్నమయ్య 'షోడశ కళానిధికి షోడశోపచారములు' కీర్తన ఆధారం.

'మిస్టర్ పెళ్లాం' (1993) చిత్రంలో త్యాగరాజ కృతి పల్లవి ఆధారంగా కథానాయిక వంపుల సొంపులను వర్ణిస్తూ -

పల్లవి: **సొగసు చూడతరమా, నీ సొగసు చూడతరమా**
**నీ ఆపసోపాలు, నీ తీపిశాపాలు**
**ఎర్రన్నికోపాలు, ఎన్నెల్లో దీపాలు.. అందమేసుమా** ॥సొగ॥



**అరుగుమీద నిలబడి నీ కురులను దువ్వే వేళ**
**చేజారిన దువ్వెన్నకు బేజారుగ వంగినపుడు**
**చిరుకోపం చీరగట్టి సిగ్గును చెంగునదాచి**
**పక్కుమన్న చక్కదనం పరుగోపరుగెత్తినపుడు...**

అంటూ వేటూరి రాసిన గీతంలోని 'సొగసు' చూసినా చెప్పినా చాలదు - విని ఆస్వాదించవలసిందే !

'చూడాలనివుంది' (1998) లో వేటూరి రచించిన

**'యమహానగరి కలకత్తాపురి**
**నమహో హుగిలి హౌరావారధి**
**చిరుత్యాగరాజు నీ కృతినే పలికెను మరి..!**

పాట పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ 'రఘువంశ సుధాంబుధి చంద్ర..' అనే కీర్తన ద్వారా ప్రచారమైన కదన కుతూహల రాగంలో మనోహరంగా సాగి ఆబాల గోపాలాన్నీ అలరించింది. మహానగరికి ముందు 'య' చేర్చడం, త్యాగరాజుకు ముందు కథానాయకుణ్ణి స్ఫురింపజేస్తూ 'చిరు' చేర్చడం - వేటూరి శైలికి చెందిన ధ్వని రహస్యాలు. అయితే ఈ పాటలో శ్రోతలకు సందేహాన్ని కలిగించే త్యాగరాజ కృతి ప్రసక్తి అనుచితం.

త్యాగరాజు స్వామి పంచరత్నాలలో ఒకటైన 'సాధించెనే మనసా' అనే కృతిలోని 'సమయానికి తగు మాటలాడ..' అనే పంక్తిని తీసుకొని 'సీతారామయ్యగారి మనవరాలు' చిత్రంలో ఈ కృతిని ఉపయోగించారు.

'సీతయ్య' చిత్రంలో చంద్రబోస్ -

**సమయానికి తగుసేవలు సేయనీ... నీ శ్రీవారిని**
**ఇనాళ్లుగా శ్రమియించిన ఇల్లాలిని... యిక సేవించనీ ఈ శ్రీ వారిని...**

అనే పాటను రాసి ఆ దారిలో పయనించడానికి ప్రయత్నించడం హర్షణీయం!

**పరిమళించే భావుకత :**

సహృదయులను పరవశింపజేసే భావుకత, అలంకార పరిమళాలు గల పాటలెన్నో ఈ దశలో వచ్చాయి. మచ్చుకి కొన్ని -

1. **అనగనగా ఆకాశం వుంది, ఆకాశంలో మేఘం వుంది**

మేఘం వెనకా రాగం ఉంది, రాగం నింగిని కరిగించింది.
కరిగే నింగే చినుకయ్యింది, చినుకే చిటపట పాటయ్యింది
చిటపట పాట తాకిన్నేల చిలుకలు వాలే చెట్టయ్యింది
ఆ చిలుక నువ్వేకావాల, నా రాచిలుక నవ్వేకావాలి
రాగాల గువ్వైరావాలి - అనురాగాల ముమ్వై మోగాలి..
-నువ్వే కావాలి (2000), సిరివెన్నెల.

ఈ పాటలో 'కలికిచిలుక' ఆకాశం నుంచి దిగి వచ్చిన తీరు 'ఏకావళి' 'ముక్తపదగ్రస్త' అలంకార సమన్వితంగా అందంగా భావింపబడింది. భావానికనుగుణమైన శబ్దజాల ప్రవాహంతో పాట సంగీతామృతంగా జాలువారింది.

2. చినుకు చినుకు అందెలతో
చిటపట చిరుసవ్వడితో
నీలిమబ్బుకురుల ముడిని
జారవిడిచి ఒళ్ళుమరచి
వానజాణ ఆడింది వయ్యారంగా
నీళ్లపూలు జల్లింది సింగారంగా -మాయలోడు (1993) - జొన్నవిత్తుల

వానను జాణగా రూపించి, వానను నర్తిస్తున్న స్త్రీలా వూహిస్తూ రాసిన ఈ పాటను వింటుంటే, నృత్యానికి అత్యంతానుకూలంగా సాగిన పాటను తెరమీద చిత్రీకరణలో చూస్తుంటే చిరువానలో తడిసినంత అనుభూతి కలుగుతోంది.

3. ఆనందమానందమాయె మది ఆశలనందనమాయె
మాటలు చాలని హాయె ఒకపాటగ మారినమాయె
కాలమే పూలదారి సాగనీ, గానమే గాలి లాగ తాకనీ
నీ స్వరం నాదిగా ఈక్షణం పలుకనీ...

నువ్వు నడుచు దారుల్లో పూలు పరిచి నిలుచున్నా
అడుగుపడితే గుండెల్లో కొత్తసడిని వింటున్నా
నీలికళ్లముంగిట్లో నన్ను నేను కనుగొన్నా
నిండుగుండె గుమ్మంలో తోరణంగా నేనున్నా

రాగమాల రమ్మంటూ స్వాగతాలు పలికింది
ఆగలేని వేగంలో ఆశ అడుగు వేసింది



జతగ నీవు చేరాకే బ్రతుకు తీపి తెలిసింది
రెప్పపాటులోకంలో కలలకోన కదిలింది
-శుభాకాంక్షలు (1997) సామవేదం షణ్ముఖ శర్మ

అనుభూతిని అలంకారికంగా అత్యంత సుకుమారంగా అక్షరబద్ధం చేసిన ఈ ప్రణయగీతం సంగీత సాహిత్య ప్రియులను ఆనందంలో ఓలలాడించింది. ఇలాంటి అద్భుతమైన పాటల్ని రాసిన కవిని ఆధ్యాత్మికరంగం వైపు వెళ్లిపోనివ్వడం పరిశ్రమ అవివేకం !

4. కొమ్మా కొమ్మా విన్నావమ్మా కోయిలవస్తోంది
వస్తూ వస్తూ తనతో వెన్నెల వెలుగులు తెస్తోంది
ఏవమ్మా మరుమల్లీ, తోరణాలు కడతావా ?
చిలకమ్మా ఎదురేగి స్వాగతాలు చెపుతావా ?
పూల పొదరిల్లే రమ్మందనీ...
విన్నావమ్మా తీయని వేణువు రమ్మను పిలుపులని
చూశానమ్మా స్వాగతమంటూ తెరిచిన తలుపులని..
-నువ్వు వస్తావని (2000) ఇ. సత్యనారాయణమూర్తి

సి.నా.రె. రచనను తలపించే పదభావసౌకుమార్యంతో నడిచిన ఈ ప్రణయ యుగళగీతం పొడవునా రచయిత ఇ.యస్.మూర్తి భావుకత గుబాళించింది.

ఇంకా ఇలాంటి పరిమళభరితాలైన పాటలెన్నో ఈ కాలంలో వికసిస్తున్నా చిత్ర పరిశ్రమ ఈ రచయితలను సరిగా వినియోగించుకోవడం లేదనిపిస్తుంది.

**చైతన్య శంఖాలూ - సందేశాత్మకాలూ...**

సమకాలీన సమస్యలపై స్పందిస్తూ, సమాజాన్ని జాగృతం చేస్తూ కర్తవ్యాన్ని ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ప్రబోధించిన పాటలు, మంచి-చెడులను వివేచించే వ్యాఖ్యలతోను సందేశాలతోను ముడిపడిన పాటలు-ఈ శకంలో అసంఖ్యాకంగా వచ్చాయి. ఆర్. నారాయణమూర్తి వంటివారు పట్టు విడువకుండా విప్లవ చిత్రాలను నిర్మిస్తున్నప్పటికీ 'ఎర్రసైన్యం' వంటి కొన్ని సినిమాల్లో పాటలు తప్ప ఎర్రపాటలు గత దశల్లోలా జనం నోళ్లలో నానడం లేదు. అటువంటి ముద్రలేకుండా అభ్యుదయ దృక్పథంతో తీసిన సినిమాల్లోని పాటలు జనాన్ని ఆకట్టుకొన్నాయి, ఆలోచింపచేశాయి.

(1) స్వతంత్ర భారతదేశంలోని అరాచకాన్ని,ఈ అస్తవ్యస్త వ్యవస్థలోని అన్యాయాన్ని ఎండగడుతూ ఆవేదనతో రాసిన మూడుపాటలకు నందీపురస్కారాలు లభించాయి -

6. **సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని,**
**సుఖాన మనలేని వికాసమెందుకని,**
**సుమాల బలికోరే సమాజమెందుకని,**
**అడుగుతోంది అదిగో ఎగిరే భరతపతాకం**
**తెలుసుకోండి ఆ తల్లి తపనలో నేటి కన్నీటి కథనం**
**త్రిశంకు స్వర్గంలో తను త్రివర్ణస్వప్నమని**
**విషాదవర్షంలో తను వివర్ణ చిత్రమని..!**

**-చిత్రం : గాయం (1993)**
**రచన : సిరివెన్నెల సీతారామశాస్త్రి**

ఈ పాట రచయిత సినిమాకోసం రాసింది కాదు; ముందుగా రాసిపెట్టుకొన్నది. ఈ పాట నచ్చి, రామ్‌గోపాలవర్మ ఫోను చేసి 'మీ పాట కోసం నేనో సినిమా తీస్తున్నాను' అన్నారట! ఈ సందర్భంగా సీతారామశాస్త్రి 'పాటను ప్రేరణగా తీసుకొని ఓదర్శకుడు.. అదీ రామ్‌గోపాలవర్మలాంటి స్థాయిగల దర్శకుడు ఒక చిత్రాన్ని నిర్మించడానికి పూనుకోవడం అనేది నా చలనచిత్ర జీవితంలో జరిగిన గొప్ప సన్మానంగా భావిస్తాను' అని రాశారు[3]. అలా పాట కోసం సినిమా తీయడం సిరివెన్నెల' కు మాత్రమే కాదు; తెలుగు సినిమాపాటకే గర్వకారణం ! ఇలా సిరివెన్నెల రచించిన 'జగమంత కుటుంబం నాది' అనే మరోపాట కోసం కృష్ణవంశీ 'చక్రం' సినిమాను నిర్మించారట !

**(ఆ) అర్ధశతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్ర మందామా ?**
**స్వర్ణోత్సవాలు చేద్దామా ?**
**ఆత్మవినాశపు ఆరాచకాన్నే స్వరాజ్యమందామా ?**
**దానికే సలాము చేద్దామా ?**
**శాంతికపోతపు కుత్తుక తెంచి తెచ్చిన బహుమానం**
**రక్తపు సిందూరం !**

3. సిరివెన్నెల తరంగాలు - పుట 82



**నీ పాపిటలో భక్తిగ దిద్దిన ప్రజలను చూడమ్మా**
**ఓ పవిత్ర భారతమా ॥**
**చిత్రం : సిందూరం (1997) - రచన : సిరివెన్నెల**

భారతదేశ స్వర్ణోత్సవాలకు సందర్భ శుద్ధిగల గీతమిది. చక్కని సామాజిక స్పృహతో ధ్వనితో నడిచిన ఆలోచనాస్ఫోరకమైన గేయమిది.

**'అన్యాయాన్ని సహించని శౌర్యం**
**దౌర్జన్యాన్ని దహించే ధైర్యం**
**కారడవుల్లో క్రూరమృగంలా దాక్కొని వుండాలా**
**వెలుగుని తప్పుకు తిరగాలా...?**

అనే చివరి చరణం తీవ్రవాద ఉద్యమానికి సంబంధించింది. నక్సలైట్లకు పోలీసులకు మధ్య జరుగుతున్న సంఘర్షణను వాచ్యం చెయ్యకుండా చెప్పిన తీరు హృద్యంగావుంది.

**(ఇ) బుద్ధభూమి రుద్రభూమి అయ్యింది**
**వేదభూమిలో వేదన మిగిలింది**
**ధర్మభూమికే నేడు చెదపట్టింది**
**దాన్ని నిప్పులతో కడిగే ఆరోజు వచ్చింది...**
**చిత్రం : రాఘవయ్యగారి అబ్బాయి (2000) - రచన : వెన్నెలకంటి**

పల్లవి ప్రయోజనం తెలిసిన రచయిత పాటలోని ఆవేదన నంతటినీ పల్లవిలోనే ప్రకటించారు. సుధామధురమైన ప్రణయ గీతాలనెన్నిటినో రాసిన వెన్నెలకంటి కలం నుంచి వెలువడిన వైవిధ్య భరితమైన వేదనాగీతం యిది.

**(2) పల్లె తెల్ల వారుతున్నదా**
**పల్లె బతుకు తెల్లవారుతున్నదా**
**కోడికూతలతోని తెల్లవారె పల్లె**
**పాలధారలతోని తెల్లవారె పల్లె**
**జీపు చప్పుళ్లతో, బూట్ల తొక్కిళ్లతో**
**లాఠీల దెబ్బల్ల తుపాకీ మోతల్ల... ॥పల్లె॥**
**చిత్రం : ఎన్‌కౌంటర్ (1997) - రచన : సుద్దాల అశోక్ తేజ**

ఈ పాట కూడా ఈ కోవకు చెందిన పాటల్లో విశిష్టమైంది. ఇందులో 'ఎన్‌కౌంటర్'ల వల్ల పల్లెలోని అందాలు, ఆనందాలు, స్వచ్ఛత కరువవుతున్నాయనే ఆర్తి వుంది.

**ఏ యింట్లో చూసినా ఏ కంట్లో చూసినా**
**పాము పడగల కింద పక్షులు ఉన్నట్లు**
**మిన్నులున్న పిడుగు మీద పడుతున్నట్టు...**

వంటి పంక్తులు ఆలంకారికమైన కవిత్వస్పర్శతో పాటకు గుర్తింపును తీసుకొచ్చాయి.

ఇంకా ఇలాంటి భావతీవ్రతతో ఆవేశాన్ని రగిలించే పాటలను సిరివెన్నెల సీతారామశాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ ఈ దశలో ఎక్కువగా రాశారు.

## అనుబంధాలూ - కవితా సుగంధాలూ...

నానాటికీ అనుబంధాలు అపురూపమైపోతున్న ఈ యాంత్రికయుగంలో మండు టెండలో మంచిగంధంలా మానవీయ సంబంధాలను గురించి ఈ దశలో సినిమా రచయితలు రాసిన పాటలు అందర్నీ ఆనందింపజేస్తున్నాయి.

1. **కంటేనే అమ్మ అని అంటే ఎలా ?**
**కడుపు తీపి లేని అమ్మకూడ బొమ్మే కదా ?**

**- సి. నారాయణ రెడ్డి, ప్రేమించు**

అసలైన అమ్మతనం అంటే ఏమిటో నిర్వచించిన ఈ పాటకు 2001 సంవత్సరానికి నంది పురస్కారం కూడా లభించింది.

2. **ఒక్క క్షణం... ఒక్క క్షణం... గరిమల నీ మురిపెపు ముద్దుల**
**మొలకొచ్చేదిక ఒక్కక్షణం.. ఒక్కక్షణం...**
**... ... ... ...**
**తొమ్మిది మాసాలలో కెవ్వు కెవ్వున తొలికేక పెట్టగా**
**శోకంలో పుట్టెనంట రామాయణమూ**
**శ్లోకంగా పెరుగునంట జన్మల రుణమూ**
**ఆ రుణానుబంధమే ఈ శిశుజననం.. !**

**-వేటూరి, స్వరాభిషేకం**



జననం జననాంతర బంధమనే సృష్టిరహస్యాన్ని విప్పే పాట !

3. **నోరార పిలిచినా పలుకని వాడనా**
**మనసున మమతలున్న మనిషిని కానా...**

**-సిరివెన్నెల, అల్లుడుగారు వచ్చారు**

మనస్వినీ పురస్కారం పొందిన ఈ పాటలో -

**'అయినవాళ్లు వున్న లోగిళ్లలో**
**ఆయువాగిపోదు నూరేళ్లతో'**

అనే పంక్తులు కౌటుంబికమైన అనుబంధాలకు అద్దం పడతాయి.

4. **అపురూపమైన దమ్మ ఆడజన్మ**
**ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా**
**మగవాని బ్రతుకులో సగపాలు తనదిగా**
**జీవితం అంకితం చేయగా..**

**- సిరివెన్నెల, పవిత్రబంధం**

అర్ధాంగి అనే బంధానికి అందమైన నిర్వచనం ఈ పాట.

5. **చిలకా ఏ తోడులేక ఎటేపమ్మా ఒంటరినడక**
**తెలిసీ అడుగేసినావె ఎడారంటి ఆశల వెనక**
**మంగళసూత్రం అంగడిసరుకా కొనగలవా చేజారాక ?**
**లాభం ఎంతొచ్చిందమ్మా సౌభాగ్యం అమ్మేశాక ?**

**- సిరివెన్నెల, శుభలగ్నం**

మాంగల్యబంధం గొప్పతనాన్ని చెప్పే ఈపాటలో అనురాగానికి మించిన ధనం లేదని రచయిత సందేశం.

6. **చిరునవ్వుల వరమిస్తావా**
**చితినుంచి బ్రతికొస్తాను**
**మరుజన్మకు కరుణిస్తావా ?**
**ఈ క్షణమే మరణిస్తాను.**

వెన్నెలకంటి 'చిరునవ్వుల వరమిస్తావా?' చిత్రం కోసం రాసిన ఈపాట ప్రేమికులకు తారకమంత్రంలా ప్రచారాన్ని పొందింది.

7. **మల్లెతీగకు పందిరివోలె మస్కసీకటిలో వెన్నెలవోలె**
**నీపాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా**
**తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా**
**-గద్దర్, ఒరేయ్ రిక్షా**

1995 సంవత్సరానికి మనస్వినీ పురస్కారం పొందిన ఈ పాటలో గద్దర్ చెల్లెలిపై అన్న అనురాగాన్ని అపూర్వంగా చెప్పారు.

8. **లాలపోసి కాటుకపెట్టి అమ్మలా చూసి**
**వేలుపెట్టి నడకలు నేర్పి నాన్నగా మారి**
**అన్నంటేనే అన్నీ అని, నన్నంటే వుంటాడని**
**మా అన్నని యిచ్చి దేవుడు దేవుడు అయ్యాడు**
**- ఇ.యస్.మూర్తి, కలవారి చెల్లెలు కనక మహాలక్ష్మి**

ఇది అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని మళ్లీ చెప్పిన పాట.

9. **తెంచుకొంటె తెగిపోతుందా దేవుడు వేసిన బంధం**
**తెలుసుకో నీజీవితగమ్యం, పెంచుకోమ్మ అనుబంధం**
**ఏడు అడుగులూ నడిచినవాడె ఏడుజన్మలూ తోడుంటాడు**
**భర్తగా నిను భరించువాడె బ్రతుకు దీపం వెలిగిస్తాడు**
**అతని హృదయమె నాతిచరామి, అగ్నిహోత్రమె అందుకు హామీ**
**-వెనిగళ్ల రాంబాబు, ప్రేయసి రావే**

భార్యాభర్తల అనుబంధంలో గాయం ఏ ఒక్కరిదైనా కన్నీళ్లు ఇద్దరివీ అని చెప్పిన ఈ పాట మనస్విని ప్రత్యేక పురస్కారాన్ని అందుకొంది.

10. **ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము**
**చదువులమ్మ చెట్టునీడలో**
**వీడలేమంటు వీడుకోలంటు వెళ్లిపోతున్నాము**
**చిలిపితనపు చివరి మలుపులో**
**-చంద్రబోస్, స్టూడెంట్ నెం. 1**

విద్యార్థుల అనుబంధాన్ని వివరించే ఈ పాట మనస్విని పురస్కారాన్నందుకొంది; విద్యాసంస్థల వీడ్కోలు సభల్లో మారుమ్రోగుతోంది.

ఇలాంటి సువాసనలకు అవధులేమిటి?



'ఇలా యిన్ని సుగుణాలు కలిగిన పాటలుంటే ఈ శకాన్ని 'తమోమయం'గా పేర్కొనడం భావ్యమా?' అని మళ్లీ కొందరికి సందేహం రావచ్చు. పాశ్చాత్యప్రభావితమైన సంగీతపు హోరులో ఇలా వినిపించే పాటలు కొన్ని మాత్రమేననీ, ఇలాంటివి కూడా పదివేల పాటల్లో స్వల్ప శాతమనీ రచయిత మనవి.

## 4. 'గీత' లూ - రాతలూ !

ఈ సమీక్షను ముగించే ముందు ఈ దశలో (1992-2004) సినిమాపాటలు రాస్తున్న రచయితల గురించి ముచ్చటించుకోవాలి. ఈ దశలో వాసి గల గీతాల రాశిలో ముందున్న రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి. పురస్కారాల కర్హమైన పాటల పరిశీలనలో ఎక్కువ సంఖ్యలో నిలిచినవి సిరివెన్నెల పాటలే. వేటూరి అనన్య సాధ్యమైన వైవిధ్యం గల పాటలు రాసినప్పటికీ వ్యక్తిగత కారణాల వలన కొన్ని చిత్రాలకు మాత్రమే పరిమితమయ్యారు. కేవలం ఈ యిద్దరి పాటల వల్ల విజయవంతమైన చిత్రాలెన్నో ఈ దశలో వచ్చాయి. వాటికి పెళ్లి సందడి, నువ్వే కావాలి, నా మనసంతా నువ్వే, యమలీల, శుభసంకల్పం, పవిత్రబంధం, రాజా, వర్షం, అన్నమయ్య, చూడాలని వుంది, మనోహరం, ఆనంద్, మిస్టర్ పెళ్లాం మొదలైనవి ఉదాహరణలు మాత్రమే. ముందుదశలో కొద్దో గొప్పో గుర్తింపు పొందిన ఎందరో రచయితలు ఈ దశలో పరుగుపందెంలో వెనకబడిపోయారు.

### ఈ ఇద్దరూ ...

ఇరవయ్యేళ్లకు పైగా సినీరంగంలో నిలబడి తమదైన ఉనికిని నిరూపించు కుంటున్న ఇద్దరు ప్రతిభావంతులైన రచయితలు - వెన్నెలకంటి, భువనచంద్ర. ఇద్దరూ 'డైరెక్ట్ టేక్' తెలుగుచిత్రాలకే గాక అనువాద చిత్రాలకూ, బుల్లితెర ధారావాహికలకూ.. ఎడతెరిపి లేకుండా రచనలు చేస్తున్నారు.

పూర్వదశలో కూడా సినిమాపాటల్ని అలంకార సమన్వితంగా రాసిన వెన్నెలకంటి ఈ దశలోనూ తన ప్రయోగాలను కొనసాగిస్తున్నారు.

మచ్చుకి -

**సంగమంలో సంబరం**
**సంబరంలో స్వాగతం**
**స్వాగతం ఈ జీవితం**
**జీవితం నీకంకితం** **- తపస్సు (1994)**

అనే పాట పాడవునా ముక్తపదగ్రస్త అలంకారాన్ని నిర్వహించారు.

**ఒహో ఒహో ఒహో బుల్లి పావురమా**
**అయ్యో పాపం అంటే అది నేరమా**
**అతివల కింత పంతమా**
**అలకలు వారి సొంతమా** - **బృందావనం (1992)**

వంటి పాటలలో పాతతరం కవులను తలపింపజేయడమే కాక, అనేక పెద్ద చిత్రాలలో జనరంజకమైన పాటలను రాస్తున్నారు. సినీగేయ రచనలో పాత కొత్తల మేలు కలయిక వెన్నెలకంటి బాణీ.

గత దశల్లో స్పీడ్ ట్యూన్స్'కి పాటలు రాయడంలో పేరుపొందిన భువన చంద్ర ఈ దశలో తమదిశను మార్చుకొన్నారు -

**'జాజిమల్లె తెల్లచీర కట్టుకొంటె...**[1] పాటలోని -

**సందెపొద్దు ఓ మంచిమాట చెప్పిపోతే**
**సాగరాలె కౌగిట్లో వాలిసాక్షులైతే**
**నడిపించు నన్ను ఏడడుగులు**
**నీతో నేను నడిచి వచ్చేను ఏడేడు జన్మలు..** - **చిన్నబ్బాయి (1997)**

2. **ఊహల పల్లకిలోన ఊరేగుతున్నది వధువు**
**చిరుచిరు పెదవులపైన ఊరుతున్నది మధువు** -**ఆమె (1994)**

వంటి మధుర భావనలు ఈ మార్పుకు నిదర్శనాలు లయ జ్ఞానంతో బాణీలకు వేగంగా పాటలు రాసే సమర్థులలో భువన చంద్ర ఒకరు.

## ఆ నలుగురూ..

కేవలం ఈ దశలోనే రంగప్రవేశం చేసి విస్తృతంగా సినిమాపాటలు రాస్తూ తమునికిని రుజువు చేసుకొన్న నలుగురు రచయితలూ -

చంద్రబోస్, సుద్దాల అశోక్‌తేజ, కులశేఖర్, భాస్కరభట్ల రవికుమార్.

వీరిలో బాణీకి అలవోకగా పాటరాయగలిగిన నేర్పుతో సంఖ్యాపరంగా ఎక్కువ జనరంజకమైన పాటలు రాసిన యువకుడు చంద్రబోస్. **'మంచుకొండల్లోన చంద్రమా-చందనాలు చల్లిపో'** అనే పాటతో రంగ ప్రవేశం చేసిన చంద్రబోస్ నిత్య ప్రయోగశీలి. కొత్తదనం కోసం తపన, సరళమైన శైలి, వ్యక్తిత్వ వికాస ప్రబోధం చంద్రబోస్ పాటల్లోని ప్రత్యేకతలు.



'స్టూడెంట్ నెం. 1 చిత్రంలోని పాటకు మనస్వినీ పురస్కారాన్ని, 'ఆది' (2002) లోని **'నీ నవ్వుల తెల్లదనాన్ని నాగమల్లి అప్పుడిగింది..'** అనే పాటకు, 'నేనున్నాను' (2004) లోని **'చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని'** పాటకు నందీపురస్కారాలను అందుకున్నారు.

**తెలుగుజాతి తియ్యదనం**
**తెలుగుజాతి గొప్పతనం**
**తెలుసుకొన్న వాళ్లకి**
**తెలుగే ఒక మూలధనం** - **నువ్వులేక నేనులేను (2002)**

అనేపాటలోని భాషాభిమానం -

**మౌనంగానే ఎదగమని మొక్కనీకు చెబుతుంది**
**ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థమందులో వుంది**
**అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది**
**ఆకులన్ని రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది**
- **నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్ (2004)**

లోని ఆశావాద ప్రబోధం - చంద్రబోస్ పాటల్లోని వైవిధ్యానికి మచ్చుతునకలు.

సుద్దాల అశోక్‌తేజ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన సుద్దాల హనుమంతు వారసుడు కావడం వల్ల పాట రక్తగతమైంది; విప్లవభావాల వైపు చూపు ప్రసరించింది. ఈ దశాబ్దకాలంలో జాతీయపురస్కారం వరకు అన్ని బహుమతులనూ అందుకొన్న కవి. మనస్వినీ పురస్కారం పొందిన 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలోని-

**'రామచక్కని తల్లి రాములమ్మో - రాములమ్మో**
**రాయోలె కూచున్న వెందుకమ్మో - ఎందుకమ్మో'**

మద్రాసు కళాసాగర్ అవార్డు (1996) పొందిన 'దళం' చిత్రంలోని -

**అవ్వనీకు దండమె - అక్కవ్వ నీకు దండమె**
**ఆలునీకు దండమె - అర్ధాంగి నీకు దండమె**

వంటిపాటలు అశోక్‌తేజకు మంచి పేరును, ప్రచారాన్ని తెచ్చాయి. ప్రతిగేయం లోనూ కనీసం ఒక్క పంక్తయినా గుర్తుపెట్టుకొనేలా వుండాలని అశోక్‌తేజ తపన.

కులశేఖర్, భాస్కరభట్ల - ఇద్దరూ యువకులు, సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యాభిమానులు. ఇద్దరూ అనతికాలంలో అధిక సంఖ్యలో పాటలు రాసి గుర్తింపు పొందారు.

కులశేఖర్ తన మొట్టమొదటి చిత్రం, 'చిత్రం' (2000) లోని -

**'ఊహల పల్లకిలో ఊరేగించనా**
**ఆశలవెల్లువై రాగం పలికించనా**
**కలహంసై కబురులందివ్వనా**
**నాపెదవుల మధువులే యివ్వనా...!**

అనే పాటకు మనస్వినీ పురస్కారాన్ని అందుకొన్నారు. పద ప్రయోగ వైచిత్రి కులశేఖర్ ప్రత్యేకత.

భాస్కరభట్ల యువతరాన్ని ఉర్రూతలూగిస్తున్న జనరంజకమైన పాటలన్ని రాయడంలో దిట్ట.

ఆయన 'ధనలక్ష్మీ ఐ లవ్‌యు' చిత్రం కోసం రాసిన -

**ఓస్సామరీ ఓస్సామరీ పైసాలె మనిషి ఊపిరీ**
**అంతేమరీ వుంటే సిరీ జేజేలు కొట్టరా మరీ**
**ఎంత పెద్ద ప్రాబ్లమైన డబ్బుతో సరీ**
**ఆకాశవీధిలోని చందమామనీ**
**భూమ్మీద కొక్కసారి దించదా 'మనీ'..**

పాట మీద సీతారామశాస్త్రి 'మనీ' పాట ముద్ర వున్నట్టే కొన్ని ఇతరగీతాల మీద కూడా ఆయన ప్రభావం కనిపిస్తుంది.

'వీడే' చిత్రంలో

**'ఉప్పెనెప్పుడూ చెప్పిరాదురా ఇంటి చుట్టమల్లే**
**వచ్చినప్పుడే వెన్నుచూపక ఎదురుతిరుగు నువ్వే**
**ఊరికొక్కడో నూటికొక్కడో నిప్పులాగ వుంటే**
**దారుణాలకు అక్రమాలకు దారివుండదంతే..'**

వంటి సందేశాత్మకమైన పంక్తులను రాసిన భాస్కరభట్లకు ముందుగా వాలు గాలిలో ప్రయాణం చేసి స్థిరపడిన తర్వాత మంచిపాటలు రాయాలని కోరిక !



## ఏ వెలుగులకీ పరిశోధన ?

సినిమాపాట వ్యాపారంతో ముడిపడిన సాహిత్య ప్రక్రియ. అందువల్ల గీత రచనలో రచయితకు సంపూర్ణ స్వాతంత్ర్యం వుండదు. అతను దర్శకనిర్మాతల సూచన మేరకు పాట రాయవలసిన అగత్యముంది. వారు ఆదర్శాలకు పోయి చేతులు కాల్చుకోవడానికి సిద్ధంగా వుండరు గనుక అన్నీ కవితాత్మకమైన రసాత్మకమైన పాటలే రావడం, రాయడం సాధ్యం కాదు. ఎటొచ్చీ అవకాశం, సందర్భం వచ్చినపుడు వాటిని ఉపయోగించుకొని రచయితలు ఉత్తమసాహిత్యాన్ని వెలువరించడానికీ, కనీసం నీచమైన పాటలు రాయకుండా వుండడానికీ - ఈ సమీక్ష దోహదం చేస్తుందని ఈ ప్రయత్నం.

అనేక సాహిత్య ప్రక్రియల ప్రభావం పడిన తెలుగు సినిమాపాట సామాన్యుల కందుబాటులో లేని ఆ సాహిత్య సంపదను సరళమైన తన బాణీలో వారి కందిస్తోంది. వజ్రోత్సవానికిచేరువగా వున్న తెలుగుసినిమాపాట బాటలోని మలుపుల్నీ మెరుపుల్నీ అధ్యయనం చేసి తెలుగుసినిమాపాట చరిత్రను ప్రామాణికంగా రూపొందించడమే ఈ రచన లక్ష్యం. తీసుకొన్న పరిధి విస్తృతం కావడం వల్ల రాద్ధాంతాల కంటె సిద్ధాంత ప్రతిపాదనమే మేలనే దృష్టితో ఈ పుస్తకంలో సమాచారానికిచ్చిన ప్రాధాన్యం చర్చకివ్వలేదు.

ఈ వ్యాసాన్ని ముగించే ముందు ఓ విషయాన్ని స్పష్టం చెయ్యాలి. ఈ సిద్ధాంత వ్యాస పరిధికి లోబడి - అందుబాటులో వున్న పాటల్ని మాత్రమే ఉదాహరణలుగా స్వీకరించాను. ఈ పరిధిలోనికి రాని గొప్ప పాటలూ, చచ్చు పాటలూ చాలా వుండొచ్చు. వాటిని గ్రహించకపోవడంలో రచయితకు రాగద్వేషాలు లేవు. 'సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియమ్' అనే ఆర్యోక్తినను సరించి పాటలలోని దోషాల గురించి అతిగా స్పందించలేదు; సమకాలికుల రచనల గురించి చెప్పడం కత్తిమీద సాము. ఈ విషయంలో రచయిత చిత్తశుద్ధిని సహృదయులైన పాఠకులు గమనించే వుంటారు.

చివరిగా చిన్నమాట. సామాన్యుడి కందని ఏ కళయినా వ్యర్థం. ఈ శతాబ్దంలో సామాన్యుడు అమితంగా యిష్టపడుతున్న సినిమాపాట మీద చేసిన ఈ రచన అసామాన్యంగా కాదు - సామాన్యంగా వుండడమే రచయిత అభీష్టం - ఆశయం !

❖❖❖

## అనుబంధం : 1

# తెలుగు సినిమాలు (1931-2010)

**1931 (1)**
భక్త ప్రహ్లాద

**1932 (2)**
పాదుకాపట్టాభిషేకం
శకుంతల

**1933 (6)**
చింతామణి
పృథ్వీపుత్ర/నరకాసురవధ*
రామదాసు (ఇంపీరియల్)
రామదాసు (ఈస్టిండియా)
సావిత్రి (కృష్ణా ఫిలిమ్స్)
సావిత్రి (ఈస్టిండియా)

**1934 (3)**
అహల్య
లవకుశ
సీతాకల్యాణం

**1935 (6)**
అనసూయ
కుచేల
శ్రీకృష్ణలీలలు
శ్రీకృష్ణ తులాభారం
సక్కుబాయి
హరిశ్చంద్ర

**1936 (12)**
అనసూయ-ధ్రువ ❖
కబీరు
ద్రౌపదీమానసంరక్షణం
ద్రౌపదీ వస్త్రాపహరణం
ప్రమీలార్జునీయం
ప్రేమవిజయం
మాయాబజార్
లంకాదహనం
వీరాభిమన్యు
సంపూర్ణరామాయణం
సతీతులసి
సులోచన

**1937 (10)**
కనకతార
తుకారాం
దశావతారములు
నరనారాయణ
బాలయోగిని
మోహినీరుక్మాంగద
రుక్మిణీకల్యాణం
విజయదశమి
విప్రనారాయణ
సారంగధర

**1938 (10)**
కచదేవయాని
గులేబకావళి
గృహలక్ష్మి
చిత్రనళీయం
జరాసంధ
భక్త జయదేవ్
మార్కండేయ
మాలపిల్ల
మోహినీ భస్మాసుర
సత్యనారాయణ వ్రతం-
కాసులపేరు-చల్మోహనరంగా❖

**1939 (12)**
అమ్మ
ఉషాపరిణయం
జయప్రద
పాండురంగవిఠల్
పాశుపతాస్త్రం
మళ్లీపెళ్లి
మహానంద
రాధాకృష్ణ
రైతుబిడ్డ
వందేమాతరం
వరవిక్రయం
శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం (బాలాజీ)

**1940 (14)**
ఇల్లాలు
కాలచక్రం
చండిక
చదువుకున్న భార్య
జీవనజ్యోతి
బారిస్టర్ పార్వతీశం
బొండాం పెళ్లి
భూకైలాస్
భోజకాళిదాసు
మాలతీమాధవం
మీరాబాయి
మైరావణ
విశ్వమోహిని
సుమంగళి

**1941 (14)**
అపవాదు
చంద్రహాస

❖ ఒకే ఆటగా ప్రదర్శింపబడిన హ్రస్వ చిత్రాలు



చూడామణి
తల్లిప్రేమ
తారాశశాంకం
తారుమారు-భలే పెళ్లి ❖
తెనాలిరామకృష్ణ
దక్షయజ్ఞం
దేవత
ధర్మపత్ని
నాజీ భూతం
పార్వతీకల్యాణం
భక్తిమాల
మహాత్మాగాంధీ (డాక్యుమెంటరీ)

**1942 (11)**
ఘరానాదొంగ-సత్యమే జయం/హానెస్ట్ రోగ్*
జీవన్ముక్తి
దీనబంధు
పత్ని
బభ్రువాహన
బాలనాగమ్మ
భక్త పోతన
భక్త ప్రహ్లాద
శాంత బాలనాగమ్మ
సత్యభామ
సుమతి

**1943 (7)**
కృష్ణప్రేమ
గరుడ గర్వభంగం
చెంచులక్ష్మి
పంతులమ్మ
పతిభక్తి
భక్త కబీరు
భాగ్యలక్ష్మి

**1944 (6)**
ఒక రోజు రాజు
తాసీల్దార్
భీష్మ
శ్రీసీతారామ జననం
సంసారనారది
సర్కస్ కింగ్

**1945 (5)**
పాదుకా పట్టాభిషేకం
మాయలోకం
మాయామచ్ఛీంద్ర
వాల్మీకి
స్వర్గసీమ

**1946 (10)**
గృహప్రవేశం
త్యాగయ్య
నారద నారది
భక్త తులసీదాసు
మంగళసూత్రం/ఇదిమా కథ/ఎక్స్క్యూజ్ మి*
ముగ్గురు మరాఠీలు
రిటర్నింగ్ సోల్జర్
వనరాణి
వరూధిని
సేతుబంధనం

**1947 (6)**
గొల్లభామ
పల్నాటియుద్ధం
బ్రహ్మరథం
మోహినీ రుక్మాంగద
యోగి వేమన
రాధిక

**1948 (8)**
గీతాంజలి
ద్రోహి
బాలరాజు
భక్త సిరియాళ
మదాలస
రత్నమాల
వింధ్యరాణి
సువర్ణమాల

**1949 (6)**
కీలుగుర్రం
గుణసుందరి కథ
ధర్మాంగద
మనదేశం
రక్షరేఖ
లైలామజ్ను

**1950 (16)**
అదృష్టదీపుడు
అపూర్వసహోదరులు
జీవితం
తిరుగుబాటు
పరమానందయ్య శిష్యులు
పల్లెటూరిపిల్ల
బీదలపాట్లు
మాయారంభ
మొదటి రాత్రి
లక్ష్మమ్మ
వాలిసుగ్రీవ
శ్రీలక్ష్మమ్మకథ
శ్రీసాయి బాబా

* ఒకే సినిమాపేర్లు

షావుకారు
సంసారం
స్వప్న సుందరి

1951 (21)

అగ్ని పరీక్ష
ఆకాశరాజు
ఆడజన్మ
చంద్రవంక
తిలోత్తమ
దీక్ష
నవ్వితే నవరత్నాలు
నిర్దోషి
పాతాళభైరవి
పెంకిపిల్ల
పెళ్లికూతురు
పేరంటాలు
మంగళ
మంత్రదండం
మల్లీశ్వరి
మాయపిల్ల
మాయలమారి
రూపవతి
సర్వాధికారి
స్త్రీ సాహసం
సౌదామిని

1952 (23)

అత్తింటికాపురం
ఆడబ్రతుకు
ఆదర్శం
కాంచన
చిన్నకోడలు
చిన్నమ్మకథ
టింగురంగా
దాసి
ధర్మదేవత
పల్లెటూరు
పెళ్లిచేసి చూడు
పేదరైతు
ప్రజాసేవ
ప్రియురాలు
ప్రేమ
మరదలు పెళ్లి
మానవతి
ముగ్గురు కొడుకులు
రాజేశ్వరి
శాంతి
సంక్రాంతి
సవతిపోరు
సావాసం

1953 (23)

అమ్మలక్కలు
ఒకతల్లి పిల్లలు
కన్నతల్లి
కోడరికం
గుమస్తా
చండీరాణి
దేవదాసు
నా చెల్లెలు
నా యిల్లు
పక్కయింటి అమ్మాయి
పరదేశి
పరోపకారం
పిచ్చిపుల్లయ్య
పుట్టిల్లు
పెంపుడు కొడుకు
ప్రతిజ్ఞ
ప్రపంచం
ప్రేమలేఖలు
బ్రతుకుతెరువు
మంజరి
రోహిణి
లక్ష్మి
వయ్యారిభామ

1954 (29)

అంతా మనవాళ్లే
అగ్గిరాముడు
అన్నదాత
అమరసందేశం
ఇద్దరు పెళ్లాలు
కాళహస్తి మాహాత్మ్యం
చంద్రహారం
చక్రపాణి
జాతకఫలం
జ్యోతి
తోడుదొంగలు
నిరుపేదలు
పరివర్తన
పల్లె పడుచు
పెద్దమనుషులు
బంగారు పాప
బంగారు భూమి
బాలానందం
మనోహర
మా గోపి
మేనరికం
రాజగురువు
రాజీ నా ప్రాణం
రాజు-పేద
రేచుక్క
వద్దంటే డబ్బు
విప్రనారాయణ
సంఘం
సతీసక్కుబాయి



1955 (19)

అంతే కావాలి
అనార్కలి
అర్ధాంగి
ఆడబిడ్డ
కన్యాదానం
కన్యాశుల్కం
చెరపకురా చెడేవు
జయసింహ
దొంగరాముడు
పసుపు కుంకుమ
బీదల ఆస్తి
మిస్సమ్మ
రోజులు మారాయి
వదిన
వదినగారి గాజులు
విజయగౌరి
శ్రీకృష్ణతులాభారం
సంతానం
సంతోషం

1956 (20)

ఇలవేలుపు
ఉమాసుందరి
ఏది నిజం
కనకతార
చరణదాసి
చింతామణి
చిరంజీవులు
జయం మనదే
తెనాలి రామకృష్ణ
నాగులచవితి
పెంకి పెళ్లాం
బాలసన్యాసమ్మ కథ
భక్త మార్కండేయ
భలే రాముడు
ముద్దుబిడ్డ
మేలుకొలుపు
శ్రీ గౌరీ మాహాత్మ్యం
సదారమ
సొంతవూరు
హరిశ్చంద్ర

1957 (26)

అక్కాచెల్లెళ్లు
అల్లావుద్దీన్ అద్భుతదీపం
ఎం.ఎల్.ఏ
కుటుంబగౌరవం
తోడికోడళ్లు
దాంపత్యం
దొంగల్లోదొర
నలదమయంతి
పాండురంగమాహాత్మ్యం
పెద్దరికాలు
ప్రేమే దైవం
బలేబావ
భలే అమ్మాయిలు
భాగ్యరేఖ
మాయాబజార్
రేపు నీదే
వద్దంటే పెళ్లి
వరుడు కావాలి
వినాయకచవితి
వీరకంకణం
సంకల్పం
సతీ అనసూయ
సతీసావిత్రి
సారంగధర
సువర్ణ సుందరి
స్వయంప్రభ

1958 (21)

అత్తా ఒకింటి కోడలే
అన్న-తమ్ముడు
ఆడపెత్తనం
ఇంటిగుట్టు
ఎత్తుకు పైఎత్తు
కార్తవరాయని కథ
గంగాగౌరీ సంవాదం
చెంచులక్ష్మి
దొంగలున్నారు జాగ్రత్త
పార్వతీకల్యాణం
పెళ్లినాటి ప్రమాణాలు
బొమ్మల పెళ్లి
భూకైలాస్
మంచిమనసుకు మంచిరోజులు
ముందడుగు
రాజనందిని
శోభ
శ్రీకృష్ణగారడి
శ్రీ కృష్ణమాయ
శ్రీరామాంజనేయ యుద్ధం
సామ్రాట్ విక్రమార్క

1959 (25)

అప్పుచేసి పప్పుకూడు
ఆలుమగలు
ఇల్లరికం
కూతురు కాపురం
కృష్ణలీలలు
జయభేరి
జయ విజయ
దైవబలం
పెళ్లి మీద పెళ్లి
పెళ్లి సందడి
బండరాముడు
బాలనాగమ్మ

భక్త అంబరీష
భాగ్యదేవత
మనోరమ
మాంగల్యబలం
మా యింటి మహాలక్ష్మి
రాజా మలయసింహ
రేచుక్క పగటిచుక్క
వచ్చిన కోడలు నచ్చింది
వీరభాస్కరుడు
శభాష్ రాముడు
సతీసుకన్య
సతీతులసి
సిపాయి కూతురు

### 1960 (37)

అభిమానం
అన్నా-చెల్లెలు
అన్నపూర్ణ
కనకదుర్గ పూజామహిమ
కాడెద్దులు ఎకరంనేల
కుంకుమరేఖ
కులదైవం
చివరకు మిగిలేది
జగన్నాటకం
జల్సారాయుడు
దీపావళి
దేవాంతకుడు
ధర్మమే జయం
నమ్మినబంటు
నిత్యకల్యాణం-పచ్చతోరణం
పిల్లలు తెచ్చిన చల్లనిరాజ్యం
పెళ్లికానుక
భక్త రఘునాథ్
భక్త శబరి
భట్టి విక్రమార్క
మగవారి మాయలు
మహాకవి కాళిదాసు
మాంగల్యం
మా బాబు
మామకు తగ్గ అల్లుడు
ముగ్గురు వీరులు
రమాసుందరి
రాజమకుటం
రాణిరత్న ప్రభ
రుణానుబంధం
రేణుకాదేవి మాహాత్మ్యం
విమల
శాంతినివాసం
శ్రీకృష్ణరాయబారం
శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం
సమాజం
సహస్రశిరచ్ఛేద అపూర్వచింతామణి

### 1961 (26)

ఇంటికి దీపం ఇల్లాలే
ఇద్దరు మిత్రులు
ఉషాపరిణయం
ఋష్యశృంగ
కన్నకొడుకు
కలిసివుంటే కలదుసుఖం
కృష్ణకుచేల
కృష్ణప్రేమ
గుళ్లోపెళ్లి
జగదేకవీరుని కథ
టాక్సీరాముడు
తండ్రులు-కొడుకులు
పెండ్లిపిలుపు
పెళ్లి కాని పిల్లలు
బాటసారి
బావామరదళ్ళు
బికారి రాముడు
భక్త జయదేవ
భార్యాభర్తలు
వరలక్ష్మీవ్రతం
వాగ్దానం
వెలుగునీడలు
శభాష్ రాజా
శాంత
సతీసులోచన
సీతారామకల్యాణం

### 1962 (26)

అప్పగింతలు
ఆత్మబంధువు
ఆరాధన
ఆశాజీవులు
కలిమిలేములు
కులగోత్రాలు
ఖైదీ కన్నయ్య
గాలిమేడలు
గుండమ్మ కథ
గులేబకావళి కథ
చిట్టితమ్ముడు
టైగర్ రాముడు
దక్షయజ్ఞం
నాగార్జున
నువ్వా-నేనా?
పదండి ముందుకు
పెళ్లి తాంబూలం
భీష్మ
మంచి మనసులు
మదనకామరాజు కథ
మహామంత్రి తిమ్మరుసు
మోహినీ రుక్మాంగద
రక్తసంబంధం
సిరిసంపదలు
స్వర్ణగౌరి
స్వర్ణమంజరి



### 1963 (27)

అనుబంధాలు
అనురాగం
ఆప్తమిత్రులు
ఇరుగు పొరుగు
ఈడూ-జోడు
ఎదురీత
కానిస్టేబుల్ కూతురు
గురువును మించిన
శిష్యుడు
చదువుకున్న అమ్మాయిలు
తల్లి-బిడ్డ
తిరుపతమ్మ కథ
తోబుట్టువులు
దేవసుందరి
నర్తనశాల
పరువు ప్రతిష్ఠ
పునర్జన్మ
పెంపుడు కూతురు
బందిపోటు
మంచిరోజులొచ్చాయి
మంచీ-చెడు
లవకుశ
లక్షాధికారి
వాల్మీకి
విష్ణుమాయ
శ్రీకృష్ణార్జునయుద్ధం
సవతికొడుకు
సోమవార వ్రతమహాత్మ్యం

### 1964 (26)

అగ్గిపిడుగు
అమరశిల్పి జక్కన్న
ఆత్మబలం
కలవారి కోడలు
గుడిగంటలు
డాక్టర్ చక్రవర్తి
తోటలోపిల్ల-కోటలోరాణి
దాగుడుమూతలు
దేశద్రోహులు
నవగ్రహపూజామహిమ
పీటల మీద పెళ్లి
పూజాఫలం
బంగారు తిమ్మరాజు
బభ్రువాహన
బొబ్బిలి యుద్ధం
మంచి మనిషి
మర్మయోగి
మురళీకృష్ణ
మూగమనసులు
మైరావణ
రామదాసు
రాముడు - భీముడు
వారసత్వం
వివాహబంధం
శభాష్ సూరి
శ్రీ సత్యనారాయణ మాహాత్మ్యం

### 1965 (31)

అంతస్తులు
ఆకాశరామన్న
ఆడబ్రతుకు
ఇల్లాలు
ఉయ్యాల జంపాల
కీలుబొమ్మలు
చంద్రహాస
చదువుకున్న భార్య
జ్వాలాద్వీప రహస్యం
తేనె మనసులు
తోడూ-నీడా
దేవత
దొరికితే దొంగలు
నాదీ ఆడజన్మే
పక్కలోబల్లెం
పాండవ వనవాసం
ప్రచండభైరవి
ప్రతిజ్ఞాపాలన
ప్రమీలార్జునీయం
ప్రేమించి చూడు
మంగమ్మ శపథం
మనుషులు - మమతలు
విజయసింహ
విశాలహృదయాలు
వీరాభిమన్యు
వీలునామా
శ్రీ సింహాచల క్షేత్రమహిమ
సత్య హరిశ్చంద్ర
సతీసక్కుబాయి
సి.ఐ.డి.
సుమంగళి

### 1966 (34)

అగ్గిబరాటా
అడుగుజాడలు
ఆటబొమ్మలు
ఆత్మగౌరవం
ఆమె ఎవరు ?
ఆస్తిపరులు
కన్నె మనసులు
గూఢచారి 116
చిలకా - గోరింక
జమీందార్
డాక్టర్ ఆనంద్
నవరాత్రి
పరమానందయ్య
శిష్యులకథ
పల్నాటియుద్ధం
పాదుకాపట్టాభిషేకం

పిడుగురాముడు
పొట్టిప్లీడరు
భక్త పోతన
భీమాంజనేయ యుద్ధం
భూలోకంలో యమలోకం
మంగళసూత్రం
మనసే మందిరం
మొనగాళ్లకు మొనగాడు
మోహినీ భస్మాసుర
లేత మనసులు
లోగుట్టు పెరుమాళ్లకెరుక
విజయశంఖం
శకుంతల
శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు కథ
శ్రీ కృష్ణతులాభారం
శ్రీకృష్ణ పాండవీయం
శ్రీమతి
సంగీతలక్ష్మి
హంతకులొస్తున్నారు
జాగ్రత్త

**1967 (42)**

అగ్గిదొర
అవే కళ్లు
ఆడపడుచు
ఇద్దరు మొనగాళ్లు
ఉపాయంలో అపాయం
ఉమ్మడికుటుంబం
కంచుకోట
కాంభోజరాజు కథ
గృహలక్ష్మి
గొప్పవారి గోత్రాలు
గోపాలుడు-భూపాలుడు
చదరంగం
చిక్కడు దొరకడు
దేవుని గెలిచిన మానవుడు
నిండుమనసులు
నిర్దోషి
పట్టుకుంటే పదివేలు
పిన్ని
పుణ్యవతి
పూలరంగడు
పెద్దక్కయ్య
ప్రాణమిత్రులు
ప్రేమలో ప్రమాదం
ప్రైవేటు మాస్టారు
భక్త ప్రహ్లాద
భామావిజయం
భువనసుందరి కథ
మరపురాని కథ
మావదిన
రంగులరాట్నం
రక్తసిందూరం
రహస్యం
లక్ష్మీనివాసం
వసంతసేన
వీరపూజ
శ్రీకృష్ణావతారం
శ్రీశ్రీశ్రీమర్యాదరామన్న
సత్యమేజయం
సతీతులసి
సాక్షి
సుఖదుఃఖాలు
స్త్రీ జన్మ

**1968 (58)**

అగ్గిమీద గుగ్గిలం
అత్తగారు-కొత్తకోడలు
అమాయకుడు
అర్ధరాత్రి
అసాధ్యుడు
ఉండమ్మా బొట్టుపెడతా
ఉమాచండీగౌరీశంకరులకథ
ఎవరు మొనగాడు
కలసిన మనసులు
కలిసొచ్చిన అదృష్టం
కుంకుమ భరణి
గోవుల గోపన్న
గ్రామదేవతలు
చల్లని నీడ
చిన్నారి పాపలు
చుట్టరికాలు
చెల్లెలి కోసం
జీవితబంధం
జీవితాలు
తల్లిప్రేమ
తిక్కశంకరయ్య
దేవకన్య
దేవుడిచ్చిన భర్త
నడమంత్రపుసిరి
నిండుసంసారం
నిలువుదోపిడీ
నిన్నే పెళ్లాడుతా
నేనంటే నేనే
నేనే మొనగాణ్ణి
పంతాలు-పట్టింపులు
పాపకోసం
పాలమనసులు
పెళ్లిరోజు
పేదరాశిపెద్దమ్మకథ
బంగారు గాజులు
బంగారు పిచిక
బంగారు సంకెళ్ళు
బాంధవ్యాలు
బాగ్దాద్ గజదొంగ
భలేకోడళ్ళు
భలే మొనగాడు
భాగ్యచక్రం



భార్య
బ్రహ్మచారి
మంచికుటుంబం
మంచిమిత్రులు
మన సంసారం
మూగజీవులు
రణభేరి
రాజయోగం
రాము
వరకట్నం
వింతకాపురం
వీరాంజనేయ
శ్రీరామకథ
సతీ అరుంధతి
సర్కార్ ఎక్స్‌ప్రెస్
సుడిగుండాలు

**1969 (49)**

అగ్గివీరుడు
అన్నదమ్ములు
అదృష్టవంతులు
ఆత్మీయులు
ఆదర్శకుటుంబం
ఆస్తులు-అంతస్తులు
ఉక్కుపిడుగు
ఏకవీర
కదలడు-వదలకు
కథానాయకుడు
కన్నులపండుగ
కర్పూరహారతి
గండరగండడు
గండికోట రహస్యం
చిరంజీవి
జగత్ కిలాడీలు
జరిగిన కథ
టక్కరిదొంగ-చక్కనిచుక్క
తారాశశాంకం
ధర్మపత్ని
నాటకాలరాయుడు
నిండుహృదయాలు
పంచకల్యాణి-దొంగలరాణి
ప్రతీకారం
ప్రేమకానుక
బంగారుపంజరం
బందిపోటు దొంగలు
బందిపోటుభీమన్న
బుద్ధిమంతుడు
బొమ్మలు చెప్పిన కథ
భలే అబ్బాయిలు
భలే గూఢచారి
భలేతమ్ముడు
భలే మాస్టారు
భలేరంగడు
మనుషులు మారాలి
మహాబలుడు
మాతృదేవత
మామకు తగ్గకోడలు
ముహూర్తబలం
మూగనోము
రాజసింహ
లవ్ ఇన్ ఆంధ్ర
విచిత్రకుటుంబం
శభాష్ సత్యం
సత్తెకాలపు సత్తెయ్య
సప్తస్వరాలు
సిపాయి చిన్నయ్య

**1970 (51)**

అక్కా చెల్లెలు
అఖండుడు
అగ్ని పరీక్ష
అమ్మకోసం
అల్లుడే మేనల్లుడు
ఆడజన్మ
ఆలీబాబా 40 దొంగలు
ఇంటిగౌరవం
ఇద్దరు అమ్మాయిలు
ఎవరిని నమ్మాలి
ఒకే కుటుంబం
కథానాయిక మొల్ల
కోడలుదిద్దిన కాపురం
ఖడ్గవీర
చిట్టిచెల్లెలు
జగత్‌జెట్టీలు
జన్మభూమి
జైజవాన్
తల్లా-పెళ్లామా ?
తల్లిదండ్రులు
తాళిబొట్టు
దేశమంటే మనుషులోయ్
ద్రోహి
ధర్మదాత
పగసాధిస్తా
పచ్చనిసంసారం
పసిడిమనసులు
పెత్తందార్లు
పెళ్లికూతురు
పెళ్లిసంబంధం
బస్తీకిలాడీలు
బాలరాజుకథ
భలే ఎత్తు చివరికి చిత్తు
భలేగూఢచారి
మరో ప్రపంచం
మళ్లీపెళ్లి
మానాన్న నిర్దోషి
మా మంచి అక్కయ్య
మాయని మమత
మారిన మనిషి

మెరుపువీరుడు
యమలోకపు గూఢచారి
రెండు కుటుంబాల కథ
రైతేరాజు
రౌడీరాణి
లక్ష్మీకటాక్షం
విజయం మనదే
విధివిలాసం
శ్రీదేవి
సంబరాల రాంబాబు
సుగుణ సుందరి కథ

**1971 (66)**

అందంకోసం పందెం
అందరికి మొనగాడు
అడవి వీరులు
అత్తలూ-కోడళ్లు
అదృష్ట జాతకుడు
అనూరాధ
అమాయకురాలు
ఆనందనిలయం
కత్తికి కంకణం
కథానాయకురాలు
కల్యాణ మండపం
కిలాడిసింగన్న
కూతరు-కోడలు
చలాకిరాణి-కిలాడిరాజా
చిన్ననాటి స్నేహితులు
చెల్లెలికాపురం
జగత్ జెంత్రీలు
జాతకరత్న మిడతంబొట్లు
జీవితచక్రం
జేమ్స్‌బాండ్ 777
తల్లి-కూతురు
తాసిల్దారుగారి అమ్మాయి
దసరాబుల్లోడు
దెబ్బకుతా దొంగలముఠా
నమ్మకద్రోహులు
నా తమ్ముడు
నిండు దంపతులు
నేనూ మనిషినే
పగబట్టిన పడుచు
పట్టిందల్లా బంగారం
పట్టుకుంటే లక్ష
పవిత్ర బంధం
పవిత్ర హృదయాలు
ప్రేమజీవులు
ప్రేమనగర్
బంగారు కుటుంబం
బంగారు తల్లి
బస్తీ బుల్ బుల్
బొమ్మా బొరుసా
భలేపాప
భాగ్యవంతుడు
మట్టిలో మాణిక్యం
మనసూ - మాంగల్యం
మా ఇలవేల్పు
మాస్టర్ కిలాడి
మూగప్రేమ
మొనగాడొస్తున్నాడు జాగ్రత్త
మోసగాళ్లకు మోసగాడు
రంగేళీరాజా
రాజకోట రహస్యం
రామాలయం
రివాల్వర్ రాణి
రైతుబిడ్డ
రౌడీరంగడు
రౌడీలకు రౌడీలు
వింతసంసారం
విక్రమార్క విజయం
విచిత్ర దాంపత్యం
వేంకటేశ్వర వైభవం
శ్రీ కృష్ణ విజయం
శ్రీకృష్ణ సత్య
శ్రీమంతుడు
సతీ అనసూయ
సి.ఐ.డి.రాజు
సిసింద్రీ చిట్టిబాబు
సుపుత్రుడు

**1972 (56)**

అంతామనమంచికే
అత్తను దిద్దిన కోడలు
అదృష్టదేవత
అబ్బాయిగారు-అమ్మాయిగారు
అమ్మమాట
ఇన్‌స్పెక్టర్ భార్య
ఇల్లు-ఇల్లాలు
ఊరికి ఉపకారి
కత్తులరత్తయ్య
కన్నతల్లి
కలవారి కుటంబం
కలెక్టర్ జానకి
కాలంమారింది
కిలాడిబుల్లోడు
కులగౌరవం
కొడుకు - కోడలు
కొరడారాణి
కోడలు పిల్ల
గూడుపుఠాణి
చిట్టితల్లి
దత్తపుత్రుడు
నిజం నిరూపిస్తా
నీతీ-నిజాయితీ
పండంటికాపురం
పాపం పసివాడు
పిల్లా-పిడుగా ?
ప్రజానాయకుడు



బడిపంతులు
బాలభారతం
బీదలపాట్లు
బుల్లెమ్మ - బుల్లోడు
భలేమోసగాడు
భార్యాబిడ్డలు
మంచిరోజులొచ్చాయి
మరపురానితల్లి
మహ్మద్‌బిన్ తుగ్లక్
మాతృమూర్తి
మానవుడు-దానవుడు
మాయింటి కోడలు
మాయింటి వెలుగు
మావూరి మొనగాళ్లు
మేనకోడలు
మొనగాడొస్తున్నాడు జాగ్రత్త
రాజమహల్
రైతు కుటుంబం
వంశోద్ధారకుడు
వింత దంపతులు
విచిత్రబంధం
శభాష్ పాపన్న
శభాష్ బేబి
శభాష్ వదిన
శాంతినిలయం
శ్రీకృష్ణాంజనేయ యుద్ధం
సంపూర్ణ రామాయణం
సోమరిపోతు
హంతకులు-దేవాంతకులు

**1973 (62)**

అందాల రాముడు
అభిమానవంతుడు
ఆజన్మ బ్రహ్మచారి
ఇంటిదొంగలు
ఇదాలోకం
ఒకనారి-వంద తుపాకులు
కన్నకొడుకు
కన్నెవయసు
కనకదుర్గ మహిమ
గంగ-మంగ
గాంధీపుట్టిన దేశం
గీత
జగమేమాయ
జీవనతరంగాలు
జీవితం
జ్యోతిలక్ష్మి
డబ్బుకులోకం దాసోహం
డాక్టర్‌బాబు
తల్లీకొడుకులు
తాతా-మనవడు
దేవుడమ్మ
దేవుడుచేసిన మనుషులు
దేశద్రోహులు
దేశోద్ధారకులు
దేవీలలితాంబ
ధనమా దైవమా
నిండు కుటుంబం
నిజంచెపితే నమ్మరు
నేనూ నాదేశం
నేరమూ - శిక్ష
పంజరంలో పసిపాప
పద్మవ్యూహం
పల్లెటూరి బావ
పసిహృదయాలు
పసివాని పగ
పుట్టినిల్లు-మెట్టినిల్లు
పూలమాల
పెద్దకొడుకు
బంగారుబాబు
బంగారు మనసులు
బాలమిత్రుల కథ
భక్తతుకారాం
మంచివాళ్లకు మంచివాడు
మనువు-మనసు
మమత
మరపురాని మనిషి
మల్లమ్మకథ
మాయదారి మల్లిగాడు
మీనా
మేమూ మనుషులమే
మైనర్‌బాబు
రామరాజ్యం
రాముడే దేవుడు
వాడే వీడు
వారసురాలు
వింతకథ
విచిత్రవివాహం
విశాలి
శారద
శ్రీవారు - మావారు
స్నేహబంధం
స్త్రీ

**1974 (60)**

అందరూ దొంగలే
అనగనగా ఓతండ్రి
అమ్మమనసు
అమ్మాయిపెళ్లి
అల్లూరి సీతారామరాజు
ఆడపిల్లల తండ్రి
ఆడంబరాలు-అనుబంధాలు
ఇంటింటికథ
ఇంటికోడలు
ఉత్తమఇల్లాలు
ఊర్వశి
ఎవరికివారే యమునాతీరే
ఓ సీత కథ

కన్నవారి కలలు
కలిసొచ్చినకాలం
కృష్ణవేణి
కోడెనాగు
ఖైదీ బాబాయ్
గాలిపటాలు
గుండెలుతీసిన మొనగాడు
గౌరి
చందన
చక్రవాకం
ఛైర్మన్ చలమయ్య
జీవితరంగం
జీవితాశయం
తాతమ్మ కల
తిరుపతి
తులసి
తులాభారం
దీక్ష
దీర్ఘసుమంగళి
దేవదాసు
దొరబాబు
ధనవంతుడు-గుణవంతుడు
నిజరూపాలు
నిత్యసుమంగళి
నిప్పులాంటిమనిషి
నీడలేని ఆడది
నోము
పల్లెటూరి చిన్నోడు
పల్లె పడుచు
పెద్దలు మారాలి
ప్రేమలు-పెళ్ళిళ్ల
బంగారుకలలు
బంట్రోతు భార్య
భూమికోసం
మంచి మనుషులు
మంచివాడు
మనుషులూ-మట్టిబొమ్మలు
మనుషుల్లోదేవుడు
మాంగల్యభాగ్యం
ముగ్గురు అమ్మాయిలు
రాధమ్మపెళ్లి
రామ్-రహీం
విజయ రాముడు
సంసారం-సాగరం
సత్యానికి సంకెళ్లు
స్త్రీగౌరవం
హారతి

**1975 (63)**

అందరూ మంచివారే
అన్నదమ్ముల అనుబంధం
అన్నదమ్ముల కథ
అనురాగాలు
అభిమానవతి
అమ్మ
అమ్మాయిలూ జాగ్రత్త
అమ్మాయిల శపథం
ఆడదాని అదృష్టం
ఈకాలం దంపతులు
ఎదురులేని మనిషి
కథానాయకుని కథ
కొత్తకాపురం
గాజుల కిష్టయ్య
గుణవంతుడు
చదువూ - సంస్కారం
చల్లనితల్లి
చిట్టెమ్మ చిలకమ్మ
చిన్ననాటి కలలు
చీకటి వెలుగులు
జమీందారుగారి అమ్మాయి
జీవనజ్యోతి
జేబుదొంగ
తీర్పు
తోటరాముడు
దేవుడుచేసిన పెళ్లి
దేవుడే దిగివస్తే
దేవుడులాంటి మనిషి
నాకూ స్వతంత్రం వచ్చింది
పండంటి సంసారం
పచ్చని కాపురం
పరివర్తన
పిచ్చోడిపెళ్లి
పుట్టింటి గౌరవం
పూజ
బలిపీఠం
బాబు
బుల్లెమ్మ శపథం
భాగస్తులు
భారతి
భారతంలో ఒక అమ్మాయి
మంచికోసం
మల్లెలమనసులు
మా యింటిదేవుడు
మాయామశ్చీంద్ర
మావూరి గంగ
ముత్యాలముగ్గు
మొగుడా-పెళ్లామా ?
యశోదా కృష్ణ
రక్తసంబంధాలు
రాజ్యంలో రాబందులు
రామయ్యతండ్రి
రాముని మించిన రాముడు
లక్ష్మణరేఖ
వయసొచ్చిన పిల్ల
వైకుంఠపాళి
శ్రీ రామాంజనేయ యుద్ధం
సంతానం - సౌభాగ్యం
సంసారం



సినిమావైభవం
సోగ్గాడు
సౌభాగ్యవతి
స్వర్గం - నరకం

**1976 (65)**

అంతులేని కథ
అందరూ బాగుండాలి
అమెరికా అమ్మాయి
అమ్మానాన్న
అయినవాళ్లు
అల్లుడొచ్చాడు
ఆడవాళ్లు - అపనిందలు
ఆదిమానవులు
ఆరాధన
ఆస్తికోసం
ఇద్దరూ ఇద్దరే
ఈకాలపు పిల్లలు
ఒక దీపం వెలిగింది
ఒక అమ్మాయి కథ
కవిత
కొల్లేటికాపురం
కోటలోపాగా
జ్యోతి
తూర్పు-పడమర
దేవుడు చేసిన బొమ్మలు
దేవుడేగెలిచాడు
దొరలు-దొంగలు
నాడు-నేడు
నాపేరే భగవాన్
నిజం నిద్రపోదు
నేరంనాదికాదు - ఆకలిది
పాడవోయి భారతీయుడా
పాడిపంటలు
పిచ్చిమారాజు
పెద్దన్నయ్య
పెళ్లాడే బొమ్మ
పెళ్లికాని తండ్రి
పొగరుబోతు
పొరుగింటి పుల్లకూర
ప్రేమబంధం
ప్రేమాయణం
బంగారుమనిషి
భక్తకన్నప్ప
భలేదొంగలు
మంచికి మరోపేరు
మగాడు
మనవూరి కథ
మనిషి రోడ్డున పడ్డాడు
మనుషులంతా ఒక్కటే
మహాకవి క్షేత్రయ్య
మహాత్ముడు
మాంగల్యానికి మరోముడి
మా దైవం
ముగ్గురు మూర్ఖులు
ముద్దబంతి పువ్వు
మొనగాడు
యవ్వనం కాటేసింది
రాజా
రాజువెడలె
రామరాజ్యంలో రక్తపాతం
వనజ-గిరిజ
వధూవరులు
వింతయిల్లు సంతగోల
వేములవాడ భీమకవి
శీలానికి శిక్ష
శ్రీ రాజేశ్వరీవిలాస్ కాఫీక్లబ్
సిరిసిరి మువ్వ
సీతాకల్యాణం
సుప్రభాతం
సెక్రటరీ

**1977 (78)**

అందమే ఆనందం
అడవిరాముడు
అదృష్టవంతురాలు
అత్తవారిల్లు
అర్ధాంగి
అమరదీపం
ఆత్మీయులు
ఆమెకథ
ఆలుమగలు
ఇదెక్కడి న్యాయం
ఈతరం మనిషి
ఈనాటి బంధం ఏనాటిదో
ఊరుమ్మడి బతుకులు
ఎదురీత
ఒకేరక్తం
ఓమనిషీ తిరిగిచూడు
కన్యాకుమారి
కల్పన
కురుక్షేత్రం
కోయిలమ్మ కూసింది
ఖైదీకాళిదాసు
గంగ-యమున-సరస్వతి
గడుసు అమ్మాయి
గడుసు పిల్లోడు
గీత-సంగీత
చక్రధారి
చరిత్రహీనుడు
చాణక్యచంద్రగుప్త
చిలకమ్మ చెప్పింది
చిల్లరకొట్టు చిట్టెమ్మ
చిల్లరదేవుళ్లు
జడ్జిగారి కోడలు
జన్మజన్మల బంధం
జరుగుతున్నకథ
జీవనతీరాలు

జీవితనౌక
జీవితంలో వసంతం
జీవితమే ఒక నాటకరంగం
తరంమారింది
తిరుపతిక్షేత్ర మాహాత్మ్యం
తొలిరేయి గడిచింది
దాన వీర శూర కర్ణ
దేవతరాలా దీవించండి
దొంగలకు దొంగ
పంచాయితీ
పల్లెసీమ
పెళ్ళికాని పిల్లలు
పెళ్ళికాని పెళ్ళి
ప్రేమలేఖలు
ప్రేమించి పెళ్లిచేసుకో
బంగారు బొమ్మలు
బ్రతుకే ఒక పండుగ
భద్రకాళి
భలే అల్లుడు
భలేరాజా
మంచిరోజు
మనవడికోసం
మనస్సాక్షి
మహానుభావుడు
మనుషులు చేసిన దొంగలు
మాబంగారక్క
మాఇద్దరి కథ
ముత్యాలపల్లకి
మొరటోడు
యమగోల
రంభ-ఊర్వశి-మేనక
రాజారమేష్
లక్ష్మినిర్దోషి
వస్తాడేమాబావ
సంసారంలో సరిగమలు
సతీసావిత్రి
సావాసగాళ్లు
సీత గీత దాటితే
సీతమ్మ సంతానం
సీతారామ వనవాసం
స్నేహం
స్వర్గానికి నిచ్చెనలు

**1978 (82)**

అంగడిబొమ్మ
అక్బర్‌సలీం అనార్కలి
అడవి మనుషులు
అతనికంటే ఘనుడు
అనుకున్నది సాధిస్తా
అనుగ్రహం
అన్నదమ్ముల సవాల్
అల్లరి బుల్లోడు
ఇంద్రధనుస్సు
ఈతరం మనిషి
ఎంకి-నాయుడుబావ
ఏజంట్ గోపి
ఒక వూరికథ
కటకటాల రుద్రయ్య
కన్నవారి ఇల్లు
కరుణామయుడు
కలియుగస్త్రీ
కాలాంతకులు
కుమారరాజా
కేడీ నంబర్ 1
ఖైదీ నంబర్ 77
గమ్మత్తుగూఢచారులు
గోరంతదీపం
చలిచీమలు
చల్ మోహనరంగా
చిరంజీవిరాంబాబు
చిలిపికృష్ణుడు
చిలిపి చిట్టెమ్మ
చెప్పింది చేస్తా
జగన్మోహిని
డూడూబసవన్న
తల్లే చల్లనిదైవం
తుఫానుమెయిల్
దేవదాసు మళ్లీపుట్టాడు
దేవుడున్నాడు జాగ్రత్త
దొంగలదోపిడి
దొంగలవేట
నాలాగ ఎందరో
నాయుడుబావ
నిండుమనిషి
పంతులమ్మ
పట్నవాసం
పదహారేళ్ల వయసు
పొట్టేలుపున్నమ్మ
ప్రయాణంలో పదనిసలు
ప్రాణంఖరీదు
ప్రేమచేసిన పెళ్లి
ప్రేమ-పగ
బొమ్మరిల్లు
మంచిబాబాయి
మంచిమనుసులు
మనవూరి పాండవులు
మనిషిలోమనిషి
మరోచరిత్ర
మల్లెపువ్వు
మార్పు
ముగ్గురూ ముగ్గురే
ముగ్గురు మూర్ఖురాళ్లు
మేలుకొలుపు
యుగపురుషుడు
రాజపుత్ర రహస్యం
రాధాకృష్ణ
రామకృష్ణులు
రామచిలక



రాముడు-రంగడు
రిక్షారాజి
రౌడీరంగమ్మ
లాయర్ విశ్వనాథ్
వయసు పిలిచింది
విచిత్ర జీవితం
శభాష్ గోపి
శివరంజని
శ్రీరామ పట్టాభిషేకం
శ్రీరామరక్ష
సతీసావిత్రి
సాహసవంతుడు
సింహగర్జన
సింహబలుడు
సీతాపతి సంసారం
సీతామహాలక్ష్మి
సూర్యచంద్రులు
స్వర్గసీమ

**1979 (93)**

అండమాన్ అమ్మాయి
అంతులేని వింతకథ
అందమైన అనుభవం
అందడు-ఆగడు
అల్లరిపిల్లలు
అల్లరి వయసు
ఆడదంటే అలుసా
ఇంటింటి రామాయణం
ఇద్దరూ అసాధ్యులే
ఇది కథకాదు
ఇల్లాలి ముచ్చట్లు
ఊర్వశీ నీవే నా ప్రేయసి
ఎవడబ్బసొమ్ము
ఏడడుగుల బంధం
ఏదిపాపం-ఏది పుణ్యం
ఐ లవ్ యు
ఒక చల్లని రాత్రి
కంచికి చేరని కథ
కమలమ్మ కమతం
కలియుగ మహాభారతం
కళ్యాణి
కార్తీక దీపం
కుక్కకాటుకు చెప్పుదెబ్బ
కుడి ఎడమైతే
కెప్టెన్ కృష్ణ
కొత్తఅల్లుడు
కొత్తకోడలు
కోతలరాయుడు
కోరికలేగుర్రాలైతే
గంధర్వకన్య
గాలివాన
గుప్పెడుమనసు
గోరింటాకు
చెయ్యెత్తి జైకొట్టు
ఛాయ
జూదగాడు
టైగర్
డ్రైవర్ రాముడు
తాయారమ్మ-బంగారయ్య
తూర్పువెళ్లేరైలు
దశ తిరిగింది
దొంగలకు సవాల్
నగ్నసత్యం
నామాలతాతయ్య
నిండునూరేళ్లు
నీడ
పంచభూతాలు
పవిత్రప్రేమ
పునాదిరాళ్లు
పెద్దిల్లు -చిన్నిల్లు
ప్రియబాంధవి
ప్రెసిడెంట్ పేరమ్మ
బంగారు చెల్లెలు
బుర్రిపాలెం బుల్లోడు
బొట్టు-కాటుక
బొమ్మాబొరుసే జీవితం
భువనేశ్వరి
మంగళతోరణాలు
మంచికి స్థానంలేదు
మండేగుండెలు
మనవూరి మారుతి
మరోసీతకథ
మావూరి దేవత
మావూళ్లో మహాశివుడు
మావారి మంచితనం
ముత్తయిదువ
ముద్దుముచ్చట
ముద్దులకొడుకు
మూడుపువ్వులు ఆరుకాయలు
యుగంధర్
రంగూన్‌రౌడీ
రతీమన్మథ
రామబాణం
రారాకృష్ణయ్య
రావణుడే రాముడైతే
లక్ష్మీపూజ
లవ్‌మేరేజ్
విజయ
వియ్యాలవారి కయ్యాలు
వేటగాడు
శంఖుతీర్థం
శివకేశవులు
శృంగారరాముడు

శ్రీ తిరుపతి వెంకటేశ్వర కల్యాణం
శ్రీమద్విరాటపర్వం
శ్రీరామబంటు
శ్రీవినాయక విజయం
షోకిల్లారాయుడు
సమాజానికి సవాల్
సినిమాగోల
సీతే రాముడైతే
సొమ్మొకడది-సోకొకడది
హేమా హేమీలు

**1980 (116)**

అందాలరాశి
అగ్ని సంస్కారం
అదృష్టవంతుడు
అమ్మాయికి మొగుడు -
మామకి
యముడు
అల్లరిబావ
అల్లుడు పట్టిన భరతం
ఆటగాడు
ఆడది గడపదాటితే
ఆరని మంటలు
ఆలయం
ఏడంతస్తుల మేడ
ఒకనాటి రాత్రి
ఓయింటి భాగోతం
కక్ష
కలియుగ రావణాసురుడు
కళ్యాణచక్రవర్తి
కాళి
కిలాడి కృష్ణుడు
కుక్క
కేటుగాడు
కొంటెకుర్రాళ్లు
కొంటెమొగుడు పెంకిపెళ్లాం
కొత్తపేటరౌడీ
కోడళ్లొస్తున్నారు జాగ్రత్త
గందరగోళం
గయ్యాళి గంగమ్మ
గురు
గూటిలోని రామచిలక
గోపాలరావుగారి అమ్మాయి
ఘరానా దొంగ
చండీప్రియ
చుక్కల్లో చంద్రుడు
చుట్టాలున్నారు జాగ్రత్త
చేసిన బాసలు
ఛాలెంజ్ రాముడు
జాతర
డప్పు సాయిగాడు
తల్లిదీవెన
తాతయ్య ప్రేమలీలలు
త్రిలోక సుందరి
దేవుడిచ్చిన కొడుకు
ధర్మచక్రం
ధర్మం దారి తప్పితే
నకిలీ మనిషి
నాగమల్లి
నాయకుడు - వినాయకుడు
నిజం
నిప్పులాంటి నిజం
పంచకల్యాణి
పగడాల పడవ
పసిడిమొగ్గలు
పసుపు పారాణి
పారిజాతం
పిల్ల జమీందారు
పున్నమినాగు
పెళ్లిగోల
పొదరిల్లు
ప్రేమతరంగాలు
బంగారుబావ
బంగారులక్ష్మి
బండోడు-గుండమ్మ
బడాయి బసవయ్య
బుచ్చిబాబు
బెబ్బులి
బొమ్మల కొలువు
భలే కృష్ణుడు
మంగళగౌరి
మంచిని పెంచాలి
మదన మంజరి
మహాలక్ష్మి
మహాశక్తి
మానవుడు-మహనీయుడు
మా భూమి
మామా అల్లుళ్ల సవాల్
మాయదారి కృష్ణుడు
మాయింటి దేవత
మూడుముళ్ల బంధం
మూగకు మాటొస్తే
మేనత్త కూతురు
మొగుడుకావాలి
మోసగాడు
మోహనరాగం
యువతరం కదిలింది
రక్తబంధం
రగిలే హృదయాలు
రాం రాబర్ట్ రహీం
రాజాధిరాజు
రామాయణంలో పిడకలవేట
రాముడు పరశురాముడు
రౌడీరాముడు-కొంటెకృష్ణుడు
లవ్ ఇన్ సింగపూర్
వంశవృక్షం
వెంకటేశ్వర వ్రతమాహాత్మ్యం
శంకరాభరణం



శాంతి
శివమెత్తిన సత్యం
శుభోదయం
శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీ
మహాత్మ్యం
సంఘం చెక్కిన శిల్పాలు
సంధ్య
సంసార బంధం
సన్నాయిఅప్పన్న
సమాధికడుతున్నాం
చందాలివ్వండి
సరదా రాముడు
సర్కస్ రాముడు
సర్దార్ పాపారాయుడు
సినిమాపిచ్చోడు
సిరిమల్లెనవ్వింది
సీతారాములు
సుజాత
సుబ్బారాయుడు-సుబ్బలక్ష్మి
సూపర్‌మేన్
సృష్టి రహస్యాలు
స్నేహమేరా జీవితం
స్వప్న
హరేకృష్ణ హలోరాధ

**1981 (106)**

అంతంకాదిది ఆరంభం
అగ్గిరవ్వ
అగ్నిపూలు
అడుగుజాడలు
అత్తగారి పెత్తనం
అద్దాలమేడ
అమావాస్య చంద్రుడు
అమృత కలశం
అల్లుడుగారూ జిందాబాద్
ఆకలిరాజ్యం
ఆడవాళ్లూ మీకు జోహార్లు
ఆశాజ్యోతి
ఇల్లాలు
ఇల్లే స్వర్గం
ఊరికిచ్చిన మాట
ఊరికి మొనగాడు
ఎర్రమల్లెలు
ఎవరుదేవుడు
ఓ అమ్మకథ
ఓ యింటి కథ
కిరాయి రౌడీలు
కొండవీటి సింహం
కొత్తజీవితాలు
క్రాంతి
గజదొంగ
గడసరిఅత్త సొగసరి కోడలు
గిరిజా కల్యాణం
గురుశిష్యులు
గువ్వల జంట
గోల నాగమ్మ
ఘరానా గంగులు
చట్టానికి కళ్లులేవు
చిన్నారి చిట్టిబాబు
జగమొండి
జతగాడు
జీవితరథం
జేగంటలు
టాక్సీ డ్రైవర్
డబ్బు డబ్బు డబ్బు
తల్లి దండ్రులూ జాగ్రత్త
తిరుగులేని మనిషి
తొలికోడి కూసింది
తోడుదొంగలు
త్యాగయ్య
దారితప్పిన మనిషి
దీపారాధన
దేవుడు మావయ్య
47 రోజులు
నామొగుడు బ్రహ్మచారి
నాదేగెలుపు
నాయుడుగారి అబ్బాయి
నేనూ-మా ఆవిడ
నోముల పంట
న్యాయం కావాలి
పండంటి జీవితం
పక్కింటి అమ్మాయి
పటాలం పాండు
పార్వతీ పరమేశ్వరులు
పాలు-నీళ్లు
పులిబిడ్డ
పేదల బ్రతుకులు
ప్రణయగీతం
ప్రియ
ప్రేమ
ప్రేమకానుక
ప్రేమ నాటకం
ప్రేమ మందిరం
ప్రేమ సింహాసనం
ప్రేమాభిషేకం
భావిపౌరులు
భోగభాగ్యాలు
భోగిమంటలు
మరో కురుక్షేత్రం
మహాపురుషుడు
మాయదారి అల్లుడు
మావూరి పెద్దమనుషులు
మినిస్టర్ మహాలక్ష్మి

ముద్దమందారం
రగిలేజ్వాల
రహస్యగూఢచారి
రాణీకాసుల రంగమ్మ
రాధాకల్యాణం
రామదండు
రామలక్ష్మణులు
రామాపురంలో సీత
రుద్రతాండవం
లక్ష్మి
వాడని మల్లి
వారాలబ్బాయి
విప్లవజ్యోతి
విశ్వరూపం
శ్రీరస్తు - శుభమస్తు
శ్రీవారి ముచ్చట్లు
సంగీత
సంఘం మారాలి
సంధ్యారాగం
సంసారం సంతానం
సత్యం శివం
సత్యభామ
సప్తపది
సరదాబాబు
సావిత్రి
సింహస్వప్నం
సీతాకోకచిలుక
స్వర్గం
హరిశ్చంద్రుడు

**1982 (92)**

అందగాడు
అనంతరాగాలు
అనురాగదేవత
అనుబంధాలు
ఇంట్లోరామయ్య-వీధిలోకృష్ణయ్య
ఇది పెళ్ళంటారా?
ఇద్దరు కొడుకులు
ఇల్లంతా సందడి
ఇల్లాలి కోరికలు
ఈ చరిత్ర ఏసిరాతో
ఈనాడు
ఎంతఘాటు ప్రేమయో
ఏకలవ్య
ఏది ధర్మం-ఏది న్యాయం
ఏమండోయ్ శ్రీమతిగారు
ఓ ఆడది - ఓ మగాడు
కదలివచ్చిన కనకదుర్గ
కయ్యాల అమ్మాయి-కలవారి
అబ్బాయి
కలవారి సంసారం
కలహాల కాపురం
కలియుగరాముడు
కృష్ణార్జునులు
కృష్ణావతారం
కొత్తనీరు
కోరుకొన్నమొగుడు
గృహప్రవేశం
గోపాలకృష్ణుడు
చందమామ
చలాకీచెల్లెమ్మ
జగన్నాథ రథచక్రాలు
జగ్గు
జయసుధ
జస్టిస్ చౌదరి
టింగురంగడు
డాక్టర్ మాలతి
డాక్టర్ సినీయాక్టర్
తరంగిణి
తల్లీకొడుకుల అనుబంధం
తెలుగునాడు
త్రిశూలం
దేవత
ధర్మవడ్డీ
నాదేశం
నాలుగుస్తంభాలాట
నిప్పుతో చెలగాటం
నివురుగప్పిన నిప్పు
పగబట్టిన సింహం
పట్నంవచ్చిన పతివ్రతలు
పుణ్యభూమి కళ్లు తెరిచింది
పూలపల్లకి
పెళ్ళిళ్ల పేరయ్య
పెళ్ళీడు పిల్లలు
ప్రతిజ్ఞ
ప్రతీకారం
ప్రళయరుద్రుడు
ప్రేమనక్షత్రం
ప్రేమమూర్తులు
ప్రేమసంకెళ్లు
బంగారుకానుక
బంగారుకొడుకు
బంగారుభూమి
బందిపోటు సింహం
బంధాలు అనుబంధాలు
బొబ్బిలిపులి
భక్త ధ్రువమార్కండేయ
భలేకాపురం
భిల్లా-రంగా
మంత్రాలయరాఘవేంద్రస్వామి
మహాత్మ్యం
మంచుపల్లకి
మధురస్వప్నం
మరోమలుపు
మల్లెపందిరి
మహాప్రస్థానం
మేఘసందేశం
మొండిఘటం
యమకింకరుడు
యువరాజు
రాగదీపం
రాధమ్మమొగుడు
రాధామైడార్లింగ్
లక్ష్మీనిలయం
వందేమాతరం
వంశగౌరవం
వయ్యారిభామలు
వగలమారిభర్తలు
విప్లవశంఖం
శుభలేఖ
షంషేర్ శంకర్
సవాల్
సీతాదేవి
సుబ్బారావుకు
కోపంవచ్చింది
స్వయంవరం

**1983 (105)**

అక్కమొగుడు
చెల్లెలికాపురం
అగ్నిజ్వాల
అగ్ని సమాధి
అడవిసింహాలు
అభిలాష
అమరజీవి
అమాయక చక్రవర్తి
అమాయకుడుకాదు అసాధ్యుడు
ఆంధ్రకేసరి
ఆడవాళ్లే అలిగితే
ఆలయశిఖరం
ఇకనైనామారండి
ఇద్దరు కిలాడీలు
ఇదికాదు ముగింపు
ఈదేశంలో ఒకరోజు
ఈపిల్లకు పెళ్లవుతుందా
ఊరంతా సంక్రాంతి
ఎమ్మెల్యే ఏడుకొండలు
కల్యాణవీణ
కలియుగదైవం
కాంతయ్యకనకయ్య
కాలయముడు
కిరాయికోటిగాడు
కీర్తి-కాంత-కనకం
కుంకుమతిలకం
కొంటెకోడళ్లు
కోకిలమ్మ
కోటికొక్కడు
కోడలుకావాలి
ఖైదీ
గాజుబొమ్మలు
గూఢచారి నెం. 1
గ్రహణం విడిచింది
చండశాసనుడు
చండి-చాముండి
చండీరాణి
చట్టానికి వేయి కళ్లు
చిలక జోస్యం
తోడు-నీడ
త్రివేణీ సంగమం
దుర్గాదేవి
దేవి-శ్రీదేవి
ధర్మపోరాటం
ధర్మాత్ముడు
నవోదయం
నిజంచెబితే నేరమా ?
నెలవంక
నేటిభారతం
పండంటికాపురానికి 12సూత్రాలు
పల్లెటూరి పిడుగు
పల్లెటూరి మొనగాడు
పిచ్చిపంతులు
పులిదెబ్బ
పులి-బెబ్బులి
పెళ్లిచేసి చూపిస్తాం
పెళ్లిచూపులు
పోరాటం
పోలీస్ వెంకటస్వామి
ప్రజాశక్తి
ప్రజారాజ్యం
ప్రళయగర్జన
ప్రేమపిచ్చోళ్లు
బందిపోటురుద్రమ్మ
బలిదానం
బహుదూరపు బాటసారి
బెజవాడబెబ్బులి
భార్యాభర్తల సవాల్
మంత్రిగారివియ్యంకుడు
మగమహారాజు
మనిషికోచరిత్ర
మనిషికి మరోపేరు
మరోమాయాబజార్
మాయింటాయనకథ
మాయింటికిరండి
మాయింటిప్రేమాయణం
మాయగాడు
ముందడుగు
ముక్కుపుడక
ముగ్గురమ్మాయిల మొగుడు
ముగ్గురు మొనగాళ్లు
ముద్దులమొగుడు
మూగవాని పగ

మూడుముళ్లు
రంగులపులి
రఘురాముడు
రాకాసిలోయ
రాజు-రాణి-జాకి
రాజ్‌కుమార్
రామరాజ్యంలో భీమరాజు
రాముడుకాదు-కృష్ణుడు
రుద్రకాళి
రెండుజెళ్ళ సీత
రోషగాడు
లంకెబిందెలు
విముక్తికోసం
శక్తి
శివుడు శివుడు శివుడు
శుభముహూర్తం
శ్రీరంగనీతులు
సంఘర్షణ
సాగరసంగమం
సింహపురి సింహం
సింహంనవ్వింది
సిరిపురం మొనగాడు
స్వరాజ్యం

**1984 (119)**

అగ్నిగుండం
అదిగోఅల్లదిగో
అనుబంధం
అపరాధి
అభిమన్యుడు
అమ్మాయిలూ ప్రేమించండి
అల్లుళ్లొస్తున్నారు జాగ్రత్త
ఆడదాని సవాల్
ఆడపులి
ఆడవాళ్లూ జాగ్రత్త
ఆనందభైరవి
ఇంటిగుట్టు
ఇద్దరుదొంగలు
ఇది నాసవాల్
ఇల్లాలు ప్రియురాలు
ఈకాలంకథ
ఈ చదువులు మాకొద్దు
ఈ చరిత్ర ఇంకెన్నాళ్లు?
ఈ తీర్పు ఇల్లాలిది
ఉగ్రరూపం
ఉద్దండుడు
ఊహాసుందరి
ఎదురులేని మొనగాళ్లు
ఎస్పీ భయంకర్
కంచుకాగడా
కథానాయకుడు
కలలు కనే కళ్లు
కాంచనగంగ
కాయ్‌రాజాకాయ్
కిరాయి అల్లుడు
కుటుంబ గౌరవం
కురుక్షేత్రంలో సీత
కుర్రచేష్టలు
కొండవీటి నాగులు
కొత్తదంపతులు
కోటీశ్వరుడు
కోడెత్రాచు
గుడిగంటలు మ్రోగాయి
గూండా
గృహలక్ష్మి
ఘరానా రౌడీ
చదరంగం
చిటపట చినుకులు
ఛాలెంజ్
జగన్
జడగంటలు
జస్టిస్ చక్రవర్తి
జననీ జన్మభూమి
జేమ్స్‌బాండ్ 999
డిస్కోకింగ్
ఢాకూ
తాండవకృష్ణుడు
తెల్లగులాబీలు
దండయాత్ర
దానవుడు
దేవుని రూపాలు
దేవాంతకుడు
దొంగలు బాబోయ్
దొంగలు
దోపిడీ దొంగలు
నటన
నవమోహిని
నాగభైరవ
నాగు
నాయకులకు సవాల్
నిమజ్జనం
నిర్దోషి
పద్మవ్యూహం
పల్నాటిపులి
పుణ్యంకొద్దీ పురుషుడు
పులిజూదం
ప్రళయసింహం
బంగారు కాపురం
బాబులుగాడిదెబ్బ
బావామరదళ్లు
భలేరాముడు
భారతంలో శంఖారావం
భోళాశంకరుడు
బొబ్బిలిబ్రహ్మన్న
భాగ్యలక్ష్మి
భార్యామణి
మంగమ్మగారి మనుమడు
మరోదేవత



మహానగరంలో
మాయగాడు
మానసవీణ
మార్చండి మన చట్టాలు
మిస్టర్‌విజయ్
ముక్కోపి
ముఖ్యమంత్రి
మెరుపుదాడి
మేమూ మీలాంటి మనుషులమే
యమదూతలు
యుద్ధం
రంగులకల
రక్తసంబంధం
రచయిత్రి
రాజమండ్రి రోమియో
రామాయణంలో భాగవతం
రారాజు
రావు-గోపాలరావు
రెండు కుటుంబాల కథ
రుస్తుం
రోజులు మారాయి
రైలుదోపిడి
రౌడీ
వసంతగీతం
వీరభద్రుడు
శ్రీమతికావాలి
శ్రీవారికి ప్రేమలేఖ
శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిచరిత్ర
సంగీత సామ్రాట్
సంతానం
సంపూర్ణ ప్రేమాయణం
సర్దార్
సాహసమే జీవితం
సితార
సీతమ్మపెళ్లి
సీతాలు
సుందరి-సుబ్బారావు
స్వాతి
హీరో

**1985 (108)**

అందరికంటే మొనగాడు
అగ్గిరాజు
అగ్నిపర్వతం
అడవిదొంగ
అనురాగబంధం
అన్వేషణ
అపనిందలు ఆడవాళ్లకేనా
అమెరికా అల్లుడు
అసాధ్యుడు
ఆగ్రహం
ఆడపిల్లలే నయం
ఆత్మబలం
ఆలయదీపం
ఇంటికో రుద్రమ్మ
ఇల్లాలికో పరీక్ష
ఇల్లాలే దేవత
ఇల్లాలూ, వర్ధిల్లు
ఈ సమాజం మాకొద్దు
ఊరికి సోగ్గాడు
ఏడడుగుల బంధం
ఓటుకు విలువీయండి
ఓతండ్రి తీర్పు
కంచు కవచం
కత్తుల కొండయ్య
కల్యాణతిలకం
కళారంజని
కుటుంబ బంధం
కొంగుముడి
కొత్తపెళ్లికూతురు
ఖూనీ
గర్జన
చట్టంతో పోరాటం
చిరంజీవి
జాకీ
జై భేతాళ
జ్వాల
టెర్రర్
డేంజర్ లైట్
తిరుగుబాటు
దర్జాదొంగ
దాంపత్యం
దేవాలయం
దేశంలో దొంగలు పడ్డారు
దొంగ
దొంగల్లో దొర
నేరస్థుడు
న్యాయం మీరే చెప్పాలి
పచ్చని కాపురం
పట్టాభిషేకం
పదండి ముందుకు
పల్నాటి సింహం
పాతాళనాగు
పారిపోయిన ఖైదీలు
పుత్తడిబొమ్మ
పున్నమిరాత్రి
పులి
పెళ్లి నీకు అక్షింతలు నాకు
ప్రచండభైరవి
ప్రతిఘటన
ప్రేమించు-పెళ్లాడు
బంగారు చిలుక
బందీ
బాబాయ్ - అబ్బాయ్
బుల్లెట్
బెబ్బులి వేట
బ్రహ్మముడి
భలేతమ్ముడు

భార్యాభర్తల బంధం
మంత్రదండం
మయూరి
మరో మొనగాడు
మహారాజు
మహాసంగ్రామం
మహామనిషి
మాయదారి మరిది
మాయలాడి
మాయామోహిని
మాంగల్యబలం
మాంగల్యబంధం
మాపల్లెలో గోపాలుడు
ముగ్గురు మిత్రులు
ముచ్చటగా ముగ్గురు
ముద్దుల చెల్లెలు
ముద్దుల మనవరాలు
మునసబుగారి అల్లుడు
ముసుగుదొంగ
మూడిళ్లముచ్చట
మొగుడూ పెళ్లాలు
యముడు
రక్తసిందూరం
రగిలేగుండెలు
రణరంగం
రేచుక్క
లంచావతారం
వందేమాతరం
వజ్రాయుధం
వస్తాద్
విజేత
విషకన్య
శిక్ష
శ్రీకట్నలీలలు
శ్రీమతిగారు
శ్రీమతి శోభనం
శ్రీవారు
శ్రీ షిర్డిసాయిబాబా మహాత్మ్యం
సంచలనం
సజీవమూర్తులు
సూర్యచంద్ర

### 1986 (120)

అడవిరాజా
అత్తగారూ స్వాగతం
అనసూయమ్మగారి అల్లుడు
అనాదిగా ఆడది
అపూర్వ సహోదరులు
అర్ధరాత్రి స్వతంత్రం
అరుణకిరణం
అష్టలక్ష్మి వైభవం
ఆక్రందన
ఆడపడుచు
ఆదిదంపతులు
ఆలాపన
ఇద్దరు మిత్రులు
ఇదేనా న్యాయం
ఇదే నా సమాధానం
ఇల్లాలి ప్రతిజ్ఞ
ఈ ప్రశ్నకు బదులేది
ఉక్కుమనిషి
ఉగ్రనరసింహం
ఒకరాధ ఇద్దరు కృష్ణులు
కర్పూరదీపం
కలియుగ కృష్ణుడు
కలియుగ పాండవులు
కారుదిద్దిన కాపురం
కాష్మోరా
కిరాతకుడు
కిరాయి మొగుడు
కెప్టెన్ నాగార్జున
కుట్ర
కురిసింది వాన
కృష్ణగారడి
కృష్ణ పరమాత్మ
కొంటెకాపురం
కొండవీటి రాజా
కోటిగాడు
కోనసీమ కుర్రోడు
కౌబాయ్ నెంబర్ 107
ఖైదీరాణి
ఖైదీరుద్రయ్య
గురుబ్రహ్మ
చంటబ్బాయ్
చల్లనిరామయ్య చక్కనిసీతమ్మ
చాణక్య శపథం
చాదస్తపు మొగుడు
జయం మనదే
జీవనపోరాటం
జీవనరాగం
జైలుపక్షి
డాకూరాణి
డ్రైవర్‌బాబు
తలంబ్రాలు
తాండ్రపాపారాయుడు
దాగుడుమూతలు
దేశోద్ధారకుడు
దొరబిడ్డ
ధర్మపీఠం దద్దరిల్లింది
ధైర్యవంతుడు
నాంపల్లినాగు
నాగదేవత
నా పిలుపే ప్రభంజనం
నిప్పులాంటి మనిషి
నిరీక్షణ
నేటి యుగధర్మం
పట్నంపిల్ల-పల్లెటూరి చిన్నోడు
పదహారేళ్ల అమ్మాయి



పసుపుతాడు
పరశురాముడు
పరాజిత
పవిత్ర
పాపికొండలు
పుణ్యస్త్రీ
పూజకు పనికిరాని పువ్వు
పోలీస్ ఆఫీసర్
ప్రతిధ్వని
ప్రతిభావంతుడు
బంధం
బ్రహ్మరుద్రులు
బ్రహ్మాస్త్రం
భలేమిత్రులు
భయం భయం
మంచి మనసులు
మగధీరుడు
మన్నెంలో మొనగాడు
మల్లెమొగ్గలు
మహాలక్ష్మి
మాకూ స్వతంత్రం వచ్చింది
మానవుడు-దానవుడు
మామా కోడళ్ల సవాల్
మారుతి
మావారి గోల
మిస్టర్ భరత్
ముద్దులకృష్ణయ్య
మోహినీ శపథం
రాక్షసుడు
రావణబ్రహ్మ
రెండురెళ్ల ఆరు
రేపటిపౌరులు
లేడీస్ టైలర్
విక్రమ్
విజృంభణ
విషజ్వాల
వేట
వేటగాళ్లు
వివాహబంధం
వేమన చరిత్ర
శాంతినివాసం
శ్రావణమేఘాలు
శ్రావణ సంధ్య
శ్రీదత్త దర్శనం
శ్రీమతి కానుక
సంసారం ఓ సంగీతం
సక్కనోడు
సమాజంలో స్త్రీ
సింహాసనం
సిరివెన్నెల
సీతారామ కల్యాణం
స్రవంతి
స్వాతిముత్యం
హాస్యాభిషేకం
హెచ్చరిక

### 1987 (130)

అందరికంటె ఘనుడు
అక్షింతలు
అగ్నిపుత్రుడు
అగ్నిపుష్పం
అజేయుడు
అత్తగారూ జిందాబాద్
అమెరికా అబ్బాయి
అరణ్యకాండ
అర్జున్
అల్లరి కృష్ణయ్య
అల్లరి పాండవులు
అల్లుడికోసం
అహ! నా పెళ్లంట
ఆత్మబంధువు
ఆనందతాండవం
ఆరాధన
ఆహుతి
ఇంటిదొంగ
ఇదా ప్రపంచం
ఉదయం
ఉమ్మడిమొగుడు
ఓ ఇంటి కాపురం
ఓ ప్రేమకథ
కల్యాణతాంబూలం
కలెక్టర్‌గారి అబ్బాయి
కాబోయే అల్లుడు
కార్తీక పౌర్ణమి
కిరాయిదాదా
కులాల కురుక్షేత్రం
కృష్ణలీల
ఖైదీనాగమ్మ
గాంధీనగర్ రెండోవీధి
గుండమ్మగారి కృష్ణులు
గౌతమి
చందమామ రావే
చక్రవర్తి
చిన్నారిదేవత
చైతన్యం
చైతన్యరథం
జగన్మాత
జేబుదొంగ
డబ్బు ఎవరికి చేదు ?
డామిట్ కథ అడ్డం తిరిగింది
తండ్రీకొడుకుల ఛాలెంజ్
తల్లిగోదారి
తాయారమ్మ తాండవకృష్ణ
తేనెమనసులు
త్రిమూర్తులు
దయామయుడు
దాదా
ధర్మ

దొంగకాపురం
దొంగగారూ స్వాగతం
దొంగమొగుడు
దొంగోడొచ్చాడు
ధర్మపత్ని
నమ్మిన బంటు
నల్లత్రాచు
నాకూ పెళ్లాం కావాలి
నేనే రాజు నేనే మంత్రి
న్యాయానికి సంకెళ్లు
పగసాధిస్తా
పడమటి సంధ్యారాగం
పరాశక్తి
పసివాడి ప్రాణం
పుణ్యదంపతులు
పున్నమి చంద్రుడు
పుష్పక విమానం
పెళ్లికాని ఇల్లాలు
పెళ్లిళ్లోయ్ పెళ్లిళ్లు
ప్రజాస్వామ్యం
ప్రతి స్పందన
ప్రెసిడెంటుగారి అబ్బాయి
ప్రేమదీపాలు
ప్రేమసామ్రాట్
బ్రహ్మనాయుడు
భలే మొగుడు
భానుమతిగారి మొగుడు
భారతంలో అర్జునుడు
భార్గవరాముడు
మండలాధీశుడు
మకుటంలేని మహారాజు
మజ్ను
మదనగోపాలుడు
మనవడొస్తున్నాడు
మన్మథలీల కామరాజుగోల
మరణ శాసనం

మహర్షి
మాయింటి మహలక్ష్మి
మారణ హోమం
మావూరి మగాడు
ముద్దాయి
ముద్దుబిడ్డ
ముద్దుల మనవడు
మువ్వగోపాలుడు
మేనమామ
మొనగాడు
యుగకర్తలు
రాక్షససంహారం
రాగలీల
రాము
రుద్రరూపం
రేపటి స్వరాజ్యం
రొటేషన్ చక్రవర్తి
రౌడీపోలీసు
రౌడీబాబాయ్
లాయర్ సుహాసిని
లాయర్ భారతీదేవి
విశ్వనాథ నాయకుడు
విజేత విక్రమ్
వీరప్రతాప్
వీరవిహారం
శంఖారావం
శారదాంబ
శ్రీనివాస కల్యాణం
శ్రీమతి ఒక బహుమతి
శ్రుతిలయలు
సంకీర్తన
సంసారం ఒక చదరంగం
సత్యాగ్రహం
సర్దార్ కృష్ణమ నాయుడు
సర్దార్ ధర్మన్న
సామ్రాట్

సాహస సామ్రాట్
సింహస్వప్నం
సీతపుట్టిన దేశంలో
సూర్యనేత్రం
స్వతంత్రానికి ఊపిరి పోయండి
స్వయంకృషి
హంతకుడి వేట

**1988 (110)**

అంతిమ తీర్పు
అగ్నికెరటాలు
అన్నపూర్ణమ్మగారి అల్లుడు
అన్నాచెల్లెలు
అన్నా నీ అనురాగం
అమ్మకానికో అబ్బాయి
అభినందన
అర్చన
అశ్వత్థామ
ఆఖరిపోరాటం
ఆగస్టు 15 రాత్రి
ఆడబొమ్మ
ఆడదే ఆధారం
ఆణిముత్యం
ఆత్మకథ
ఆనంద తాండవం
ఆలోచించండి
ఆస్తులు-అంతస్తులు
ఇంటింటి భాగోతం
ఇంద్రధనస్సు
ఇద్దరు మిత్రులు
ఇన్‌స్పెక్టర్ ప్రతాప్
ఇల్లు ఇల్లాలు పిల్లలు
ఉక్కు సంకెళ్లు
ఉగ్రనేత్రుడు
ఊరేగింపు
ఓ భార్య కథ



కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్
కలక్టర్ విజయ
కలియుగ కర్ణుడు
కళ్లు
కాంచన సీత
కూలీ
ఖైదీ నెంబర్ 786
చట్టంతో చదరంగం
చిక్కడు-దొరకడు
చినబాబు
చిన్నికృష్ణుడు
చిన్నోడు-పెద్దోడు
చిలిపి దంపతులు
చుట్టాలబ్బాయి
చూపులు కలసిన శుభవేళ
జమదగ్ని
జానకిరాముడు
జీవనగంగ
జీవనజ్యోతి
ఝాన్సీరాణి
డాక్టర్‌గారి అబ్బాయి
తిరగబడ్డ తెలుగుబిడ్డ
తోడల్లుళ్లు
త్రినేత్రుడు
దొంగకోళ్లు
దొంగపెళ్లి
దొంగరాముడు
దొరగారింట్లో దొంగోడు
ధర్మతేజ
నవభారతం
నాలుగిళ్ల చావిడి
నిజం చెబితే నేరమా
నీకూ నాకూ పెళ్లంట
న్యాయంకోసం
న్యాయానికి శిక్ష
పృథ్వీరాజ్

పెళ్లిచేసిచూడు
పులి
ప్రచండభారతం
ప్రాణ స్నేహితులు
ప్రేమకిరీటం
ప్రేమాయణం
బందిపోటు
బడి
బజారురౌడీ
బాలమురళి ఎమ్.ఏ
బావామరుదుల సవాల్
బ్రహ్మపుత్రుడు
భామాకలాపం
భారతంలో బాలచంద్రుడు
భార్యా భర్తలు
భార్యాభర్తల భాగోతం
మంచిదొంగ
మన్మథ సామ్రాజ్యం
మరణమృదంగం
మహారాజశ్రీ మాయగాడు
మాయింటి మహారాజు
మాతెలుగుతల్లి
మిస్టర్ హీరో
ముగ్గురు కొడుకులు
మేనమామ
యముడికి మొగుడు
యుద్ధభూమి
రక్తతిలకం
రక్తాభిషేకం
రాకీ
రాముడు భీముడు
రావుగారిల్లు
రుద్రవీణ
రౌడీ నెంబర్ 1
వారసుడొచ్చాడు
వివాహ భోజనంబు

వేగుచుక్క-పగటిచుక్క
శ్రీ తాతావతారం
శ్రీదేవి కామాక్షి కటాక్షం
సంకెళ్లు
సంసారం
సగటుమనిషి
సత్యం శివం సుందరం
సాహసం సేయరా డింభకా
సిరిపురం చిన్నోడు
స్వర్ణకమలం
స్టేషన్ మాస్టర్

**1989 (93)**

అంకుశం
అగ్ని
అజాతశత్రువు
అడవిలో అభిమన్యుడు
అడవిలో అర్ధరాత్రి
అత్తమెచ్చిన అల్లుడు
అత్తయముడు-అమ్మాయికిమొగుడు
అమ్మాయి మనసు
అయ్యప్పస్వామి మహాత్మ్యం
అశోకచక్రవర్తి
ఆఖరిక్షణం
ఆదర్శవంతుడు
ఆర్తనాదం
ఇంద్రుడు చంద్రుడు
ఇల్లాలు-ప్రియురాలు
ఊరంతా గోలంట
ఎర్రమట్టి
ఒంటరిపోరాటం
కలియుగ విశ్వామిత్ర
కృష్ణగారబ్బాయి
కొడుకు దిద్దిన కాపురం
గండిపేట రహస్యం
గడుగ్గాయి

గర్జించిన గంగ
గీతాంజలి
గూండారాజ్యం
గూఢచారి 117
గోపాలరావుగారి అబ్బాయి
చలాకిమొగుడు చాదస్తపు పెళ్లాం
చిన్నారి స్నేహం
చిలిపిదొంగ
చెట్టుకింద ప్లీడరు
చెన్నపట్నం చిన్నోడు
జయమ్ము నిశ్చయమ్మురా
జాలకటక
టూటౌన్ రౌడీ
తాతయ్య పెళ్లి-మనవడి శోభనం
దొరికితే దొంగలు
ధర్మయుద్ధం
ధ్రువనక్షత్రం
నామొగుడు నాకే సొంతం
నీరాజనం
నేటి స్వతంత్రం
నేరం నాదికాదు
పల్నాటి రుద్రయ్య
పాపే మా ప్రాణం
పార్థుడు
పిన్ని
పూలరంగడు
పైలాపచ్చీసు
పోలీస్ రిపోర్ట్
ప్రజాతీర్పు
ప్రేమ
బంధువులొస్తున్నారు
జాగ్రత్త
బలిపీఠంపై భారతనారి
బామ్మబాట-బంగారుబాట
బాలగోపాలుడు
బాలనాగమ్మ

బ్లాక్ టైగర్
భగవాన్
భలేదంపతులు
భలేదొంగ
భారతనారి
భూపోరాటం
మంచి కుటుంబం
మంచివారు మావారు
మమతల కోవెల
ముత్యమంత ముద్దు
ముద్దుల మావయ్య
మౌనపోరాటం
యమపాశం
రక్తకన్నీరు
రాజకీయ చదరంగం
రిక్షావాలా
రుద్రనేత్ర
లంకేశ్వరుడు
లైలా
వింతదొంగలు
విక్కీదాదా
విజయ్
శివ
శ్రీరామచంద్రుడు
సాక్షి
సార్వభౌముడు
సాహసమే నా ఊపిరి
సింహస్వప్నం
సుమంగళి
సూత్రధారులు
సోగ్గాడి కాపురం
స్వరకల్పన
స్వాతిచినుకులు
స్టేట్‌రౌడీ
హైహైనాయకా

**1990 (83)**

అంకితం
అగ్గిరాముడు
అగ్ని ప్రవేశం
అగ్నిసాక్షి
అడవిదివిటీలు
అన్న-తమ్ముడు
అభిసారిక
అలజడి
అల్లుడుగారు
ఆడది
ఆయుధం
ఇంటింటి దీపావళి
ఇంద్రజిత్
ఇదేంపెళ్లాం బాబోయ్
ఇన్‌స్పెక్టర్ రుద్ర
ఇద్దరూ ఇద్దరే
20వ శతాబ్దం
ఇరుగిల్లు - పొరుగిల్లు
ఉద్యమం
కర్తవ్యం
కలియుగ అభిమన్యుడు
కొండవీటి దొంగ
కొండవీటి రౌడీ
కొత్తపెళ్లికూతురా ! రా! రా!
కోదమసింహం
కొమరం భీమ్
కోకిల
ఖైదీదాదా
గురుశిష్యులు
ఘటన
చిన్నకోడలు
చెవిలోపువ్వు
జగదేకవీరుడు-అతిలోకసుందరి
జడ్జిమెంట్
జయసింహ



జస్టిస్ రుద్రమదేవి
టీనేజ్
డాక్టర్ భవాని
దాగుడుమూతల దాంపత్యం
దోషి - నిర్దోషి
ధర్మా
నవయుగం
నాగాస్త్రం
నాయకురాలు
నారీ నారీ నడుమ మురారి
నేటి చరిత్ర
నేటి దౌర్జన్యం
పద్మావతీ కల్యాణం
పాపకోసం
పుట్టింటి పట్టుచీర
పోలీసు భార్య
ప్రజల మనిషి
ప్రాణానికి ప్రాణం
ప్రేమ ఘర్షణ
ప్రేమయుద్ధం
ప్రేమా, జిందాబాద్
బాలచంద్రుడు
బుజ్జిగాడి బాబాయ్
బొబ్బిలిరాజా
మగాడు
మట్టి మనుషులు
మనసు-మమత
మహాజనానికి మరదలుపిల్ల
మాయింటి కథ
మామ-అల్లుడు
మామాశ్రీ
మాస్టారి కాపురం
ముద్దుల మేనల్లుడు
యమధర్మరాజు
రంగవల్లి
రంభ-రాంబాబు

రక్తజ్వాల
రతిలయలు
రాజావిక్రమార్క
రాముడుకాదు - రాక్షసుడు
రావుగారింట్లో రౌడీ
రౌడీయిజం నశించాలి
లారీ డ్రైవర్
విష్ణు
శిలాశాసనం
సాహసపుత్రుడు
సిద్ధార్థ
సిరిమువ్వల సింహనాదం

**1991 (99)**

అగ్నినక్షత్రం
అతిరథుడు
అత్తింట్లో అద్దెమొగుడు
అమ్మ
అమ్మకడుపు చల్లగా
అమ్మరాజీనామా
అల్లుడుదిద్దిన కాపురం
అసెంబ్లీ రౌడీ
అస్త్రం
అశ్వని
ఆగ్రహం
ఆడపిల్ల
ఆత్మబంధం
ఆదిత్య 369
ఇంట్లోపిల్లి వీధిలోపులి
ఇంద్రభవనం
ఇద్దరుపెళ్లాల ముద్దుల పోలీసు
ఎదురింటి మొగుడు-
పక్కింటిపెళ్లాం
ఎర్రమందారం
ఏప్రిల్ 1 విడుదల
కడప రెడ్డెమ్మ

కలికాలం
కీచురాళ్లు
కులమా గుణమా ?
కూలీ నెంబర్ 1
కొబ్బరి బొండాం
క్షణ క్షణం
గంగ
గోదావరి పొంగింది
గ్యాంగ్‌లీడర్
చిత్రం భళారే విచిత్రం
చిన్నారి ముద్దులపాప
చెంగల్వపూదండ
చైతన్య
జగన్నాటకం
జీవన చదరంగం
జైత్రయాత్ర
తరంగాలు
తల్లిదండ్రులు
తేనెటీగ
తొలిపొద్దు
నాఇల్లే నాస్వర్గం
నాగమ్మ
నాపెళ్లాం నా యిష్టం
నియంత
నిర్ణయం
నేనేరా పోలీస్
పందిరిమంచం
పరమశివుడు
పరిష్కారం
పల్లెటూరి పెళ్లాం
పిచ్చిపుల్లయ్య
పీపుల్స్ ఎన్‌కౌంటర్
పెద్దింటల్లుడు
పెళ్లిపుస్తకం
ప్రయత్నం
ప్రార్థన

ప్రేమఖైదీ
ప్రేమ ఎంత మధురం
ప్రేమచిత్రం-పెళ్లివిచిత్రం
ప్రేమతపస్సు
ప్రేమపంజరం
ఫోర్ట్వంటీ
బావాబావా పన్నీరు
బ్రహ్మర్షి విశ్వామిత్ర
భారత్‌బంద్
భార్గవ్
మంచిరోజు
మధురానగరిలో
మహాయజ్ఞం
మామగారు
ముగ్గురు అత్తల ముద్దుల
అల్లుడు
మైనర్ రాజా
యుగళగీతం
రాక్షసరాజ్యం
రాముడుకాదు-రాక్షసుడు
రౌడీ అల్లుడు
రౌడీగారి పెళ్లాం
లంబాడోళ్ల రాందాసు
లేడీస్ స్పెషల్
వదినమాట
విచిత్ర ప్రేమ
విధాత
వియ్యాలవారి విందు
శత్రువు
శాంతి-క్రాంతి
శివశక్తి
శోభన రాత్రులు
శ్రీ ఏడుకొండలస్వామి
శ్రీవారి చిందులు
శ్రీశైల భ్రమరాంబికా కటాక్షం
సంసార వీణ
సర్పయాగం
సీతారామయ్యగారి మనవరాలు
సూపర్ ఎక్స్‌ప్రెస్
సూర్య ఐ.పి.యస్.
స్వతంత్ర భారతం
స్టువర్టుపురం దొంగలు
స్టువర్టుపురం పోలీస్‌స్టేషన్

**1992 (104)**

అంకురం
అంతం
అక్కమొగుడు
అగ్రిమెంటు
అత్తసొమ్ము-అల్లుడుదానం
అదృష్టం
అప్పుల అప్పారావు
అయ్యయ్యో బ్రహ్మయ్య
అలెగ్జాండర్
అల్లరిపిల్ల
అల్లరిమొగుడు
అసాధ్యుడు
అశ్వమేధం
అహంకారి
ఆఒక్కటీ అడక్కు
ఆదర్శం
ఆపద్బాంధవుడు
ఎంకన్నబాబు
ఎస్.పి. తేజ
ఏంటీబావా మరీనూ
కరుణించిన కనకదుర్గ
కలెక్టర్‌గారి అల్లుడు
కాలేజీ బుల్లోడు
కాళరాత్రిలో కన్నెపిల్ల
కిల్లర్
గోమాతవ్రతం
గోల్‌మాల్‌గోవిందం
గౌరమ్మ
గ్యాంగ్‌వార్
ఘరానామొగుడు
చంటి
చామంతి
చినరాయుడు
చిల్లరమొగుడు - అల్లరికొడుకు
ఛాంపియన్
జంబలకిడి పంబ
జగన్నాథం & సన్స్
జోకర్‌మామ సూపర్
అల్లుడు
డబ్బు బలే జబ్బు
డాక్టర్ అంబేద్కర్
డిటెక్టివ్ నారద
తారకప్రభుని
దీక్షామహిమలు
తేజ
దొంగ పోలీస్
దోషి
ధర్మక్షేత్రం
నాగకన్య
నాగబాల
నాని
పట్టుదల
పబ్లిక్‌రౌడి
పర్వతాలు పానకాలు
పెద్దరికం
పెళ్లాం చాటుమొగుడు
పెళ్లాం చెబితే వినాలి
పెళ్లంటే నూరేళ్లపంట
పెళ్లానికి ప్రేమలేఖ-
ప్రియురాలికి
శుభలేఖ
పెళ్లినీకు - శుభం నాకు
పోలీస్ బ్రదర్స్



ప్రాణదాత
ప్రియతమా
ప్రెసిడెంట్‌గారి పెళ్లాం
ప్రేమవిజేత
ప్రేమద్రోహి
ప్రేమశిఖరం
బంగారుమామ
బలరామ కృష్ణులు
బాబాయ్ హోటల్
బృందావనం
బ్రహ్మ
భద్రం కొడుకో
భలేఖైదీలు
భారతం
మదరిండియా
మాధవయ్యగారి మనువడు
మొండిమొగుడు-పెంకిపెళ్లాం
మొగుడూపెళ్లాల దొంగాట
మొరటోడు నా మొగుడు
యముడన్నకి మొగుడు
యుగాంతం
రక్తతర్పణం
రగులుతున్న భారతం
రాత్రి
రేపటికొడుకు
రౌడీఇన్‌స్పెక్టర్
లాఠీ
లాల్‌సలామ్
వదినగారి గాజులు
వసుంధర
వాలుజడ తోలుబెల్టు
వింతకోడలు
శుక్రవారం మహాలక్ష్మి
శౌర్యచక్ర
శ్రీమాన్ బ్రహ్మచారి
సంసారాల మెకానిక్
సమర్పణ
సామ్రాట్ అశోక్
సాహసం
సీతాపతి-ఛలోతిరుపతి
సీతారత్నంగారి అబ్బాయి
సుందరకాండ
సుబ్బారాయుడు పెళ్లి
సూరిగాడు
స్వాతికిరణం
హలోడార్లింగ్

**1993 (90)**

అక్కపెత్తనం -
చెల్లెలికాపురం
అక్కాచెల్లెలు
అత్తకొడుకు-మామకుఅల్లుడు
అన్నాచెల్లెలు
అన్నా వదిన
అబ్బాయిగారు
అమ్మకొడుకు
అల్లరి అల్లుడు
అల్లరిప్రియుడు
అసలే పెళ్లయినవాణ్ణి
ఆదివారం అమావాస్య
ఆరంభం
ఆలీబాబా అరడజను దొంగలు
ఆశయం
ఇన్‌స్పెక్టర్ అశ్విని
ఇన్‌స్పెక్టర్ ఝాన్సీ
ఇల్లూ పెళ్లి
ఊర్మిళ
ఏవండీ ఆవిడవచ్చింది
కన్నయ్య-కిట్టయ్య
కలియుగం
కాలచక్రం
కిరాయిగూండా
కుంతీపుత్రుడు
కొంగుచాటు కృష్ణుడు
కొండపల్లిరాజా
కొక్కొరొకో
గాయం
చిటికెల పందిరి
చిట్టెమ్మ మొగుడు
చిన్నల్లుడు
జీవితమే ఒక సినిమా
జీవన వేదం
జోకర్
తొలిముద్దు
తోడుదొంగలు
దండోరా
దాడి
దొంగలున్నారు జాగ్రత్త
దొంగల్లుడు
నక్షత్రపోరాటం
నాగజ్యోతి
నిప్పురవ్వ
పచ్చనిసంసారం
పరువు-ప్రతిష్ఠ
పిల్లలు దిద్దిన కాపురం
పెళ్లామా-మజాకా
పెళ్లిగోల
పోలీస్‌లాకప్
ప్రేమపుస్తకం
ప్రేమే నా ప్రాణం
బంగారుబుల్లోడు
బావా-బావమరిది
బ్రహ్మచారి మొగుడు
భగత్
భగవద్గీత
మనవరాలిపెళ్లి
మనీ
మాతృదేవోభవ

మామా-కోడలు
మాయదారి మోసగాడు
మాయలోడు
మావారికి పెళ్లి
మిస్టర్‌పెళ్లాం
ముఠామేస్త్రి
మెకానిక్ అల్లుడు
మేజర్ చంద్రకాంత్
మొగుడుగారు
యజ్ఞం
యూనియన్ లీడర్
రక్షణ
రథసారథి
రాజధాని
రాజేంద్రుడు-గజేంద్రుడు
రాజేశ్వరీ కళ్యాణం
రెండిళ్లపూజారి
రేపటిరౌడీ
రౌడీఅన్నయ్య
రౌడీగారి టీచర్
రౌడీమొగుడు
రౌడీరాజకీయం
వన్ బై టు
వారసుడు
వాస్తవం
శభాష్‌రాము
శాంభవి
శివరాత్రి
శ్రీనాథ కవిసార్వభౌముడు
సరసాలసోగ్గాడు
సరిగమలు

**1994 (82)**

అంగరక్షకుడు
అందరూఅందరే
అత్తాకోడళ్లు
అన్న
అల్లరిపోలీస్
అల్లరిప్రేమికుడు
అల్లరోడు
అల్లుడిపోరు-అమ్మాయిజోరు
ఆమె
ఆవేశం
ఎర్రసైన్యం
ఓతండ్రీ - ఓ కొడుకు
కలికాలం ఆడది
కిష్కింధకాండ
కుర్రది-కుర్రోడు
కెప్టెన్
క్రిమినల్
ఖైదీ నంబర్ 1
గాండీవం
గోవిందా గోవిందా
గ్యాంగ్‌మాస్టర్
ఘరానా అల్లుడు
జంతర్ మంతర్
జైలర్‌గారి అబ్బాయి
జీవిత ఖైదీ
టాప్‌హీరో
తీర్పు
తెగింపు
తోడికోడళ్లు
దొంగరాస్కెల్
దొంగలరాజ్యం
దొరగారికి దొంగపెళ్లాం
ధర్మవిజేత
నమస్తేఅన్న
నాన్నగారు
నీకు 16 , నాకు 18
నంబర్ వన్
నేరం
న్యాయరక్షణ
పచ్చతోరణం
పరుగోపరుగు
పల్నాటిపౌరుషం
పల్లెటూరి మొగుడు
పుట్టినిల్లా? మెట్టినిల్లా ?
పెళ్లికొడుకు
పేకాట పాపారావు
పోలీస్ అల్లుడు
ప్రెసిడెంట్‌గారి అల్లుడు
ప్రేమ అండ్ కో
బంగారు కుటుంబం
బంగారు మొగుడు
బాయ్‌ఫ్రెండ్
బొబ్బిలి సింహం
భలేపెళ్లాం
భలే మావయ్య
భైరవద్వీపం
మగరాయుడు
మనీ - మనీ
మరోక్విట్ ఇండియా
మావూరి మారాజు
ముగ్గురు మొనగాళ్లు
ముద్దుల ప్రియుడు
మేడం
యమ్.ధర్మరాజు. ఎమ్.ఏ.
యమలీల
యస్.. నేనంటే నేనే
యస్.పి. పరశురామ్
రిక్షారుద్రయ్య
రైతుభారతం
రౌడీ ఎమ్.ఎల్.ఏ.
లక్కీఛాన్స్
వింతమొగుడు
విశ్వనటచక్రవర్తి
శుభలగ్నం
శ్రీదేవి నర్సింగ్‌హోమ్



శ్రీవారి ప్రియురాలు
ష్.. గప్‌చిప్
సమరం - 1993
సుందరవదనా-
సుబ్బలక్ష్మి
మొగుడా
సూపర్‌పోలీస్
హలో, అల్లుడూ
హలో బ్రదర్

**1995 (78)**

అడవిదొర
అనగనగా ఒకరోజు
అమ్మదొంగ
అమ్మనాకోడలా
అమ్మలేని పుట్టిల్లు
అమ్మాయికాపురం
అమ్మోరు
అల్లుడా-మజాకా
ఆంటీ
ఆడాళ్లా-మజాకా
ఆయనకిద్దరు
ఆలీబాబా-అద్భుతదీపం
ఆలుమగలు
ఆస్తిమూరెడు-ఆశబారెడు
ఇదండీ మావారి వరస
ఊరికి మొనగాడు
ఎర్రసూరీడు
ఎర్రోడు
ఒరేయ్‌రిక్షా
కేటూ-డూప్లికేటు
కొండపల్లిరత్తయ్య
ఖైదీ ఇనస్పెక్టర్
గాడ్‌ఫాదర్
గుంటూరు గుండమ్మకథ
గులాబి
ఘటోత్కచుడు
ఘరానాబుల్లోడు
చిన్నబ్బులు
చిలకపచ్చకాపురం
చీమలదండు
టాప్‌లేచిపోద్ది
టోపీరాజా-స్వీటీరోజా
డియర్‌బ్రదర్
తపస్సు
తాజ్‌మహల్
తెలుగువీర లేవరా
దేశద్రోహులు
దొరబాబు
ద్రోహి
పల్లెటూరి మొనగాడు
పాతబస్తీ
పుణ్యభూమి నా దేశం
పెదరాయుడు
పోకిరిరాజా
బదిలీ
బాలరాజు బంగారుపెళ్లాం
బిగ్‌బాస్
భలేబుల్లోడు
మంత్రాల మర్రిచెట్టు
మధ్యతరగతి మహాభారతం
మర్డర్
మాతోపెట్టుకోకు
మాయదారి కుటుంబం
మాయాబజార్
మిస్టర్ మాయగాడు
మిస్ 420
ముద్దాయి-ముద్దుగుమ్మ
మౌనం
రాంబంటు
రాజసింహం
రిక్షావోడు
రియల్‌హీరో
రెండోకృష్ణుడు
లవ్‌గేమ్
లింగబాబు లవ్‌స్టోరీ
లీడర్
లేడీబాస్
వద్దుబావా తప్పు!
వేటగాడు
శుభమస్తు
శుభసంకల్పం
సంకల్పం
సర్వర్ సుందరంగారి అబ్బాయి
సింహగర్జన
సిసింద్రి
సూపర్‌మొగుడు
సొగసుచూడతరమా
స్ట్రీట్‌ఫైటర్

**1996 (64)**

అక్కా, బాగున్నావా
అక్కుంబక్కుం
అదిరింది అల్లుడూ
అక్కడ అమ్మాయి, ఇక్కడ అబ్బాయి
అమ్మా, అమ్మను చూడాలనివుంది
అమ్మా, నాన్నకావాలి
అమ్మా దుర్గమ్మా
అమ్మా నాగమ్మా
అమ్మో అల్లుడా !
అరణ్యం
అర్ధాంగి
ఇంట్లోఇల్లాలు -
వంటింట్లోప్రియురాలు
ఊహ
ఓహో! నా పెళ్లంట !
కల్యాణప్రాప్తిరస్తు
కాలేజీస్టూడెంట్

కూతురు
గన్‌షాట్
జగదేకవీరుడు
జాబిలమ్మపెళ్లి
తాత-మనవడు
దళం
దెయ్యం
ధర్మచక్రం
నల్లపూసలు
నాయుడుగారి కుటుంబం
నిన్నేపెళ్లాడుతా
పవిత్రబంధం
పిట్టలదొర
పుట్టింటిగౌరవం
పెళ్లిసందడి
పెళ్లాలరాజ్యం
ప్రతిజ్ఞ
ప్రేమప్రయాణం
ఫ్యామిలీ
బొంబాయిప్రియుడు
బొబ్బిలిబుల్లోడు
మమ్మీ-మీ ఆయనొచ్చాడు
మా ఆవిడ కలెక్టర్
మాయింటి ఆడపడుచు
మావిచిగురు
మృగం
మెరుపు
రాముడొచ్చాడు
రాయుడుగారు-నాయుడుగారు
రెండుకుటుంబాల కథ
లాఠీఛార్జీ
లిటిల్‌సోల్జర్స్
లేడీస్ డాక్టర్
వంశానికొక్కడు
వజ్రం
వన్స్‌మోర్
వార్నింగ్
వినోదం
వీరుడు
శ్రీకారం
శ్రీకృష్ణార్జున విజయం
సంప్రదాయం
సరదాబుల్లోడు
సహనం
సాహసవీరుడు-సాగరకన్య
సోగ్గాడిపెళ్లాం
హలోగురూ !
హలో, నాకూ, నీకు
పెళ్లంట!

### 1997 (78)

అడవిలో అన్న
అత్తా, నీకొడుకు జాగ్రత్త
అదిరింది గురూ
అన్నమయ్య
అబ్బాయిగారి పెళ్లి
అరుంధతి
అల్లరి పెళ్లికొడుకు
అహో బ్రహ్మ ఒహో శిష్యా
ఆరోప్రాణం
ఆషాఢం పెళ్లికొడుకు
ఆహ్వానం
ఇల్లాలు
ఉగాది
ఎగిరేపావురమా
ఎన్‌కౌంటర్
ఏవండీ పెళ్లిచేసుకోండి
ఏవండీ మనఅమ్మాయే
ఒక చిన్నమాట
ఒసేయ్ రాములమ్మ
ఓంకారం
ఓసినా మరదలా
కలెక్టర్‌గారు
కుటుంబగౌరవం
కుర్రాళ్లరాజ్యం
కోడలు దిద్దిన కాపురం
కోరుకున్న ప్రియుడు
గోకులంలో సీత
చిన్నబ్బాయి
చిలక్కొట్టుడు
చెలికాడు
జై భజరంగబళీ
తాంబూలం
తారకరాముడు
తాళి
తోకలేనిపిట్ట
దేవుడు
దొంగాట
నవ్వులాట
నాయనమ్మ
నేను ప్రేమిస్తున్నాను
నైస్‌రాజా
పంజరం
పట్టుకోండి చూద్దాం
పెద్దన్నయ్య
పెళ్లి
పెళ్లి చేసుకుందాం రా !
పెళ్లి పందిరి
ప్రియమైన శ్రీవారు
ప్రియరాగాలు
ప్రియా.. ఓ ప్రియా..
ప్రేమించుకుందాం రా !
బొబ్బిలిదొర
మా ఆయన బంగారం
మాతల్లి గంగమ్మ
మానాన్నకు పెళ్లి
మామా బాగున్నావా ?
మాష్టారు



ముద్దుల మొగుడు
రథయాత్ర
రామాయణం
రుక్మిణి
రౌడీదర్బార్
వామ్మో వాఅత్తో ఓ పెళ్లామో
వీడెవడండిబాబూ
వైఫ్ ఆఫ్ వి. వరప్రసాద్
శుభముహూర్తం
శుభాకాంక్షలు
సరదాల సంసారం
సర్కస్ సత్తిపండు
సింగన్న
సిందూరం
సీతక్క
సూపర్‌హీరోస్
సూర్యపుత్రులు
సైనికుడు
హలో, ఐ లవ్ యు
హిట్లర్
హైక్లాస్ అత్త-
లోక్లాస్ అల్లుడు

### 1998 (77)

అంతఃపురం
అందరూ హీరోలే
అభిషేకం
అల్లరిపెళ్లాం
ఆటోడ్రైవర్
ఆయనగారు
ఆల్‌రౌండర్
ఆవారాగాడు
ఆవిడా మాఆవిడే
ఆహా!
ఈశ్వర్ అల్లా
ఉల్టా పల్టా
ఊయల
ఓ పనైపోతుందిబాబూ
కంటే కూతురునే కనాలి
కన్యాదానం
కలవారి చెల్లెలు కనకమహాలక్ష్మి
కొడుకులు
ఖైదీ
గణేష్
గమ్యం
గిల్లికజ్జాలు
గ్రీకువీరుడు
చంద్రలేఖ
చీకటి సూర్యులు
చూడాలని వుంది
డాడీ డాడీ
తెలుగోడు
తొలిప్రేమ
దీర్ఘసుమంగళీభవ
నాగశక్తి
నిధి
నీలిమేఘాలు
పండగ
పరదేశి
పవిత్రప్రేమ
పాడుతా తీయగా
పాపే నాప్రాణం
పెళ్లాడి చూపిస్తా
పెళ్లికానుక
పెళ్లిపీటలు
పెళ్లివారమండీ
ప్రతిష్ఠ
ప్రేమంటే ఇదేరా
ప్రేమపల్లకి
ప్రేమించాను నిన్నే
బావగారూ బాగున్నారా
భలేపోలీస్
మనసిచ్చిచూడు
మాయామహల్ రహస్యం
'మా' విడాకులు
మీ ఆయన జాగ్రత్త
యువరత్న రాణా
రాజహంస
రాయుడు
లవ్‌స్టోరీ
లైఫ్‌లో వైఫ్
వసంత
వైభవం
శివయ్య
శుభలేఖలు
శుభవార్త
శ్రద్ధాంజలి
శ్రీమతీ, వెళ్లొస్తా
శ్రీరాములయ్య
శ్రీవారంటే మావారే
శ్రీసీతారాములకల్యాణము-
చూతమురారండి
సంభవం
సుప్రభాతం
సుబ్బరాజుగారి కుటుంబం
సుస్వాగతం
సూర్యవంశం
సూర్యుడు
స్నేహితులు
స్వర్ణక్క
స్వర్ణముఖి

### 1999 (63)

అనగనగా ఓ అమ్మాయి
అమ్మో పోలీసోళ్లు
అల్లుడుగారొచ్చారు
ఆవిడే శ్యామల
ఆశలసందడి

ఇంగ్లీషుపెళ్లాం ఈస్ట్‌గోదావరి
మొగుడు
ఇద్దరుమిత్రులు
ఓ స్త్రీ రేపురా
కూలన్న
క్రిష్ణబాబు
గుప్తశాస్త్రం
చిన్ని చిన్ని ఆశ
టైమ్
తమ్ముడు
తెలంగాణా
దేవా
దేవి
నాహృదయంలో నిదురించే
చెలీ
నీకోసం
నేటిగాంధీ
పంచదార చిలక
పిచ్చోడిచేతిలోరాయి
పిల్లనచ్చింది
పెద్దమనుషులు
పోలీస్
ప్రేమకథ
ప్రేమకోసం
ప్రేమకు వేళాయెరా
ప్రేమించే మనసు
ప్రేమించేది ఎందుకమ్మా
ప్రేయసిరావే
ఫిల్మ్‌నగర్
బొబ్బిలివంశం
భారతరత్న
మనసులో మాట
మాణిక్యం
మానవుడు-దానవుడు
మా బాలాజీ
మెకానిక్‌మావయ్య
యమజాతకుడు
రాజకుమారుడు
రాజా
రామసక్కనోడు
రావోయి చందమామ
రైతురాజ్యం
విచిత్రం
వెలుగునీడలు
వీడుసామాన్యుడు కాడు
శ్రీను
శృంగారపురుషుడు
సమరసింహారెడ్డి
సముద్రం
సాంబయ్య
సీతారామరాజు
సుల్తాన్
సూర్యపుత్రిక
స్నేహంకోసం
స్వప్నలోకం
స్వయంవరం
స్పీడ్‌డాన్సర్
హరిశ్చంద్ర (అన్నీ అబద్ధాలే)
హలో ఫ్రెండ్
హలో యమా

### 2000 (76)

అంకుల్
అంతా మనమంచికే
అడవిచుక్క
అన్నయ్య
అమ్మో ఒకటో తారీఖు
అయోధ్యరామయ్య
ఆజాద్
ఈతరం నెహ్రూ
ఉన్మాది
ఎన్.టి.ఆర్. నగర్
ఒకే మాట
ఒక్కడుచాలు
కలిసుందాం రా
కాలేజ్
కోదండరాముడు
కౌరవుడు
క్షేమంగావెళ్ళి లాభంగారండి
గణపతి
గొప్పింటి అల్లుడు
చాలాబాగుంది
చిత్రం
చిరునవ్వుతో
చూసొద్దాంరండి
ఛలో అసెంబ్లీ
జయం మనదేరా
టెన్షన్‌లో టెన్షన్
తిరుమల తిరుపతి
వెంకటేశా
9 నెలలు
దుర్గ
దేవుళ్లు
నాగులమ్మ
నిన్ను చూశాక
నిన్నే ప్రేమిస్తా
నిశ్శబ్దరాత్రి
నువ్వు వస్తావని
నువ్వేకావాలి
పసుపు కుంకుమ
పెళ్లాం వచ్చింది
పెళ్లిసంబంధం
పోస్టుమాన్
ఫిబ్రవరి 14 నెక్లెస్‌రోడ్
బద్రి
బలరామ్
బాగున్నారా
బాచి



బ్యాచిలర్స్
బ్యాడ్‌బాయస్
భవాని
మనసుపడ్డాను కాని
మనసున్న మారాజు
మనోహరం
మా అన్నయ్య
మాధురి
మా పెళ్లికి రండి
మూడుముక్కలాట
యువకుడు
యువరాజు
రవన్న
రాఘవయ్యగారి అబ్బాయి
రాయలసీమ రామన్నచౌదరి
రియల్‌స్టోరీ
వంశీ
వంశోద్ధారకుడు
వయసు కోరిక
విజయరామ రాజు
వైజయంతి
శివన్న
శివాజీ
శుభవేళ
శ్రీ శ్రీమతి సత్య భామ
శ్రీ సాయి మహిమ
సంచలనం
సకుటుంబ సపరివార సమేతం
సమ్మక్క సారక్క
సర్దుకుపోదాం రండి
హేండ్స్ అప్

### 2001 (89)

అందాల ఓ చిలకా
అఘోరా
అటు అమెరికా ఇటు ఇండియా
అతను
అధిపతి
అమ్మాయి కోసం
అమ్మాయి నవ్వితే
అమ్మోబొమ్మ
ఆకాశవీధిలో
అక్కా, బావ ఎక్కడ?
ఆనందం
ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం
ఇదేనా మొదటి ప్రేమలేఖ
ఇష్టం
ఎదురులేని మనిషి
ఎవడ్రా రౌడీ
ఒరేయ్ తమ్ముడు
కలసి నడుద్దాం
ఖాకీ చొక్కా
ఖుషి
చందు
చిన్నా
చిరంజీవులు
చిరుజల్లు
చెప్పాలని వుంది
చెప్పుకోండి చూద్దాం
జాక్‌పాట్
జాబిలి
టైం పాస్
డాడీ
డార్లింగ్ డార్లింగ్
తార
తొలివలపు
థాంక్యూ సుబ్బారావ్
దీవించండి
దేవీపుత్రుడు
నరసింహ నాయుడు
నవ్వుతూ బతకాలిరా
నా మనసిస్తారా
నాలో వున్న ప్రేమ
నిన్ను చూడాలని..
నువ్వు నాకు నచ్చావ్
నువ్వు-నేను
పండంటి సంసారం
పిల్లలు తెచ్చిన
అన్నలరాజ్యం
ప్రియమైన నీకు
ప్రేమతో రా
ప్రేమ సందడి
ప్రేమ సాక్షిగా
ప్రేమించు
ఫ్యామిలీ సర్కస్
బడ్జెట్ పద్మనాభం
బావ నచ్చాడు
భద్రాచలం
భలేవాడివి బాసూ
మధురక్షణం
మనసంతా నువ్వే
మళ్లీ ఇంకొకసారి
మా ఆయన సుందరయ్య
మా ఆవిడమీదొట్టు -
మీ ఆవిడ చాలా
మంచిది
ముత్యం
మురారి
మృగరాజు
రా
రామ్మా చిలకమ్మా
రావే నా చెలియా
రేపల్లెలో రాధ
రైల్వే కూలీ
లవ్
లిటిల్ హార్ట్స్
వయసు
వీడెక్కడి మొగుడండీ

వేచివుంటా
లైఫ్
శివుడు
శుభకార్యం
శుభాశీస్సులు
సంపంగి
సారీ ఆంటీ
సింహరాశి
6 టీన్స్
సుబ్బు
సూరి
స్నేహమంటే ఇదేరా
స్నేహితుడు
స్టూడెంట్ నెం. 1
స్వర్గం
హనుమాన్ జంక్షన్
హైదరాబాద్

**2002 (113)**

అదృష్టం
అన్వేషణ
అల్లరి
అల్లరిరాముడు
ఆడుతూపాడుతూ
ఆది
ఆహుతి
ఇంద్ర
ఇడియట్
ఇన్‌స్పెక్టర్ విక్రమ్
ఈశ్వర్
ఊరు మనదిరా
ఎంత బావుందో
ఎర్రదళం
ఒకటవ నెంబర్ కుర్రోడు
ఓ చినదాన
ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు
కనులుమూసినా నీవాయె
కలలు కందాంరా
కలుసుకోవాలని
కుచ్చి కుచ్చి కూనమ్మా
కుబుసం
కూలి
కొండవీటి సింహాసనం
క్యాష్
ఖడ్గం
ఖైదీబ్రదర్స్
గర్ల్‌ఫ్రెండ్
చంద్రవంశం
చెన్నకేశవరెడ్డి
చెలియా చెలియా చిరుకోపమా
జనం
జయం
జల్సా
జెండా
జెమిని
జోరుగా హుషారుగా
టక్కరిదొంగ
2 మచ్
డ్రీమ్స్
తప్పుచేసి పప్పుకూడు
తొట్టిగ్యాంగ్
త్రినేత్రం
దేవీనాగమ్మ
ధనలక్ష్మీ ఐ లవ్ యూ
నరహరి
నాగ ప్రతిష్ఠ
నిను చూడక నేనుండలేను
నిన్నే చేరుకొంటా
నీతో
నీతో చెప్పాలని
నీతోనే వుంటాను
నీతోడు కావాలి
నీ ప్రేమకై
నీ వెంటే నేనుంటా
నీ స్నేహం
నువ్వుంటే చాలు
నువ్వులేక నేను లేను
నువ్వే నువ్వే
నేను నిన్ను ప్రేమిస్తున్నాను
పట్టుకో
పరశురాం
పిక్నిక్
పిలిస్తే పలుకుతా
పీపుల్స్ భారతక్క
పృథ్వీనారాయణ
పోలీస్ సిస్టర్స్
ప్రత్యూష
ప్రియనేస్తమా
ప్రేమంటే
ప్రేమకు స్వాగతం
ప్రేమదొంగ
ప్రేమలో పావనీ కల్యాణ్
ప్రేమ సాక్షిగా
ఫ్రెండ్స్
బాబి
బెజవాడ పోలీస్ స్టేషన్
భరత సింహారెడ్డి
మధురం
మనసు తెలుసుకో
మనసుతో
మనమిద్దరం
మనసుంటే చాలు
మన్మథుడు
మళ్లీ మళ్లీ చూడాలి
మీ కోసం
మౌనమేలనోయి
యాక్షన్ నెం. 1
యువరత్న



రమణ
రాఘవ
రెండు గుండెల చప్పుడు
లగ్న పత్రిక
లాహిరి లాహిరి లాహిరిలో
లేడీ బ్యాచిలర్స్
వచ్చినవాడు సూర్యుడు
వన్‌టూత్రీ
వాసు
వెండి మబ్బులు
శివరామరాజు
శేషు
శ్రీరామ్
షో
సంతోషం
సందడే సందడి
సాహసబాలుడు విచిత్రకోతి
సీమ సింహం
సృష్టి
సొంతం
హాయ్
హృదయాంజలి
హోలీ

**2003 (81)**

అనగనగా ఓ కుర్రాడు
అప్పుడప్పుడు
అభిమన్యు
అమ్మ నాన్న ఓ తమిళ
అమ్మాయి
అమ్మాయిలు అబ్బాయిలు
అమ్ములు
ఆడంతే అదో టైపు
ఆయుధం
ఇందిరమ్మ
ఇది మా అశోగ్గాడి లవ్‌స్టోరి
ఇన్‌స్పెక్టర్
ఈ అబ్బాయి చాలా మంచోడు
ఉగ్రసింహాలు
ఎలా చెప్పను ?
ఎవరే అతగాడు
ఐతే
ఒకరాజు ఒకరాణి
ఒకరికి ఒకరు
ఒక్కడు
ఒట్టేసి చెపుతున్నా
ఓరాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి
ఓరి నీప్రేమ
బంగారంగానూ
కబడ్డీ కబడ్డీ
కబీర్‌దాస్
కళ్యాణరాముడు
కార్తీక్
గంగోత్రి
గోల్‌మాల్
గోవా
చంటిగాడు
చార్మినార్
జానకి వెడ్స్ శ్రీరామ్
జానీ
జిందాబాద్
జూనియర్స్
జోడీ నెం. 1
ఠాగూర్
తారక్
తొలిచూపులోనే
తొలిపరిచయం
దొంగరాముడు & పార్టీ
దొంగోడు
దిల్
ధనుష్
ధమ్
నాగ
నాగమనాయుడు
నిజం
నిన్నే ఇష్టపడ్డాను
నీకునేను - నాకు నువ్వు
నీతో వస్తా
నేను పెళ్లికి రెడీ
నేను-సీతామహాలక్ష్మి
పలనాటి బ్రహ్మనాయుడు
పెళ్లాం ఊరెళితే
పెళ్లాంతో పనేంటి ?
ప్రాణం
ప్రియదర్శిని
బస్తీమే సవాల్
బ్రహ్మచారి
బ్యాక్‌పాకెట్
మా బాపుబొమ్మకు పెళ్లంట
మిస్సమ్మ
రహస్యం
రాఘవేంద్ర
వసంతం
విజయం
విలన్
విష్ణు
వీడే
శంభు
శాంభవి
శివమణి
శ్రీరామచంద్రులు
సంబరం
సింహాచలం
సింహాద్రి
సిటీ
సీతయ్య
హరివిల్లు
హైటెక్ స్టూడెంట్స్

**2004 (109)**

అంజలి, ఐలవ్‌యు
అంజి
అందరూ దొంగలే
అడవి రాముడు
అతడే ఒక సైన్యం
అప్పారావ్ డ్రైవింగ్ స్కూల్
అబ్బాయి ప్రేమలో పడ్డాడు
అభి
అమ్మాయి బాగుంది
అవును నిజమే
ఆంధ్రావాలా
ఆదీ, కేరాఫ్ ఎ.బి.యస్ కాలేజ్
ఆనంద్
ఆనందమానందమాయె
ఆ నలుగురు
ఆప్తుడు
ఆర్య
ఆరుగురు పతివ్రతలు
ఇంట్లో శ్రీమతి, వీధిలో కుమారి
ఇక అంతా శుభమే
పెళ్లిజరిపించండి
ఎంజాయ్
ఎక్స్‌ట్రా
ఐతే ఏంటి ?
ఒక పెళ్లాం ముద్దు, రెండో పెళ్లాం వద్దు
కల
కానీ
కాశి
కొడుకు
కొంచెం టచ్‌లో వుంటే - చెపుతాను
కేడీ నెం. 1
ఖుషీఖుషీగా
గంగమ్మజాతర
గజ్జెలగుర్రం
గుడుంబా శంకర్
గురి
గౌరి
ఘర్షణ
చంటి
చెప్పవే చిరుగాలి
ఛాన్స్
జై
డిశంబర్ ఐదో తారీఖు
తపన
ది ఎండ్
ది గెస్ట్ హౌస్
దొంగ-దొంగది
దోస్త్
ధర్మ
నందిని
నాలో
నా ఆటోగ్రాఫ్
నాని
నిముషం
నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం
143
నేను
నేనున్నాను
నేను సైతం
నో
పల్లకిలో పెళ్లికూతురు
పుట్టింటికి రా చెల్లీ
పెదబాబు
ప్రేమంటే మాదే
ప్రేమించుకొన్నాం పెళ్లికిరండి
భద్రాద్రిరాముడు
మల్లీశ్వరి
మా ఇలవేల్పు
మాయింటికొస్తే ఏంతెస్తారు?- మీ యింటికొస్తే ఏమిస్తారు.
మాస్
మిస్టరీ
మిస్టర్ & మిసెస్
శైలజాకృష్ణమూర్తి
మేఘం
యజ్ఞం
యువసేన
లక్ష్మీనరసింహ
లవ్ టుడే
లీలామహల్ సెంటర్
లేతమనసులు
వరం
వర్షం
వర్షంలో ఓ రాత్రి
వాళ్లిద్దరూ ఒక్కటే
విఘ్నేష్
విజయేంద్ర వర్మ
విద్యార్థి
వెంకి
వేగుచుక్కలు
శంకర్‌దాదా, ఎం.బి.బి.యస్.
శంఖారావం
శత్రువు
శాంతి సందేశం
శివరాం
శివ్‌శంకర్
శీనువాసంతి లక్ష్మి
శేషాద్రి నాయుడు
శ్రీ ఆంజనేయం
శ్వేతనాగు
సఖియ
సత్తా
సర్దార్ చిన్నపరెడ్డి
సాంబ



సారీ, నాకు పెళ్లయింది
సి.బి.ఐ. ఆఫీసర్
సూర్యం
సై
సోగ్గాడి సరదాలు
స్వరాభిషేకం
స్వామి
హీరో

**2005 (131)**

అందగాడు
అందరివాడు
అతడు
అతను+ఆమె=9
అతనొక్కడే
అత్తా, నీ కూతురెక్కడ?
అదిరిందయ్యా చంద్రం
అనుకోకుండా ఒకరోజు
అనుక్షణం
అన్నసైన్యం
అమ్మ మీద ఒట్టు
అయోధ్య
అయ్యిందా లేదా?
అరె..!
అలెక్స్
అల్లరి పిడుగు
అల్లరి బుల్లోడు
ఆంధ్రుడు
ఆపిల్
ఎక్కడికెళ్తుందో మనసు
ఎ ఫిల్మ్ బై అరవింద్
ఎవడిగోల వాడిది
ఎవరు నేను
123 ఫ్రమ్ అమలాపురం
ఒక్కూరిలో..మొదలైనప్రేమకథ
ఒక్కడే
ఒక్కడే కానీ ఇద్దరు
ఒరేయ్.. పండు
ఓ చిరుగాలి
ఔనన్నా కాదన్నా
కన్నెవయసు
కాంచనమాల-కేబుల్ టీవీ
కాకి
కాదంటే ఔననిలే
కిలాడి కుర్రాళ్లు
కీలు గుర్రం
కుంకుమ
786 ఖైదీ ప్రేమకథ
గుడ్‌బోయ్
గురు
గులాబీలు
గూఢచారి-116
గోపాలం
గౌతమ్, యస్.యస్.సి
గ్రహణం
చక్రం
ఛత్రపతి
జగపతి
జై చిరంజీవ
10-ది స్ట్రేంజర్స్
డేంజర్
థ్యాంక్స్
దీక్ష
దేవీ అభయం
ధన-51
ధైర్యం
నరసింహుడు
నా అల్లుడు
నా ఊపిరి
నాకు పెళ్లయింది
నా ప్రాణం కంటె ఎక్కువ
నాయకుడు
నిక్కీస్ ఎంగేజ్‌మెంట్
నిరీక్షణ
నువ్వంటే నాకిష్టం
నువ్వొస్తానంటే వద్దంటానా?
పందెం
పాండు
పుణ్యభూమి
పెళ్లికానీ పెళ్లాం అవుతుంది
పొలిటికల్ రౌడీ
పౌరుషం
ప్రయత్నం
ప్రేమిక
ప్రేమికులు
బన్నీ
బాలు
బుచ్చిబాబు
బ్లూ
భగవాన్
భగీరథ
భద్ర
భామాకలాపం
మగసింహం
మదనిక
మనసు మాట వినదు
మహానంది
మన్మథరావుల కోసం
మానస
మాస్టర్ మైండ్స్
మిస్టర్ ఎర్రబాబు
మీనాక్షి
ముఖచిత్రం-లైఫ్‌స్టైల్
ముద్దులకొడుకు
ముద్దులమొగుడు-అల్లరిపెళ్లాం
మేఘమాల-ఓ పెళ్లాంగోల

మేస్త్రీ
మొగుడ్స్ పెళ్లామ్స్
మొగుడుపెళ్లాల దొంగాట
మొగుడు, పెళ్లాం, ఓ దొంగోడు
మొదటి సినిమా
యువకులు
యూత్
రంభ-ఊర్వశి
రంభ, ఐ లవ్ యు
రాధాగోపాళం
రిలాక్స్
రెండేళ్ల తర్వాత
రౌడీరాణి
వంశం
వలయం
విజిల్స్
వీరివీరి గుమ్మడిపండు
వెంకట్‌తో అలివేలు
వెన్నెల
శివ
శీనుగాడు-చిరంజీవిఫ్యాన్
శ్రావణమాసం
శ్రీ
శ్లోకం
శ్వేత, సెవెంత్ 'ఏ'
సంక్రాంతి
సదా మీ సేవలో
సాహసం
సారీ వెళ్లొస్తాను, ఇట్లుదెయ్యం
సుభాష్ చంద్రబోస్
సూపర్
సోగ్గాడు
స్వామిశంకర్
హంగామా
హనీమూన్

## 2006 (108)

అందాలరాముడు
అడవి బిడ్డలు
అన్నవరం
అపరాధి
అమ్మచెప్పింది
అయ్యప్పదీక్ష
అశోక్
అస్త్రం
అసాధ్యుడు
ఆగంతకుడు
ఆదిలక్ష్మి
ఇండియన్ బ్యూటీ
ఇద్దరు అత్తల ముద్దులఅల్లుడు
ఇల్లాలు-ప్రియురాలు
ఏమండోయ్ శ్రీవారు
ఒక 'వి'చిత్రం
కితకితలు
కుమార్ వర్సెస్ కుమారి
కొంటె కుర్రాళ్లు
కోకిల
ఖతర్నాక్
గంగ
గణ
గేమ్
గోదావరి
గోపి (గోడమీద పిల్లి)
గ్రీన్ సిగ్నల్
చంద్రిక
చక్రి
చినుకు
చిన్నోడు
చీకటిలో...
చుక్కల్లో చంద్రుడు
ఛాలెంజ్
జయదేవ్
టాటాబిర్లా మధ్యలో లైలా
టెన్త్ క్లాస్
థ్రిల్
దేవదాసు
దొంగోడిపెళ్లి
నందనవనం 120 కి.మీ.
నగ్నసత్యం
నాయుడు యల్.యల్.బి.
నాయుడమ్మ
నువ్వే
నో ఎంట్రీ
పార్టీ
పెళ్లికోసం
పెళ్లైన కొత్తలో
పోకిరి
పోతేపోనీ
పౌర్ణమి
ప్రామిస్
ప్రేమంటే ఇంతే
ప్రేమఖరీదు
ప్రేమించొద్దు ప్రేమించొద్దు
ఫోటో
ఫ్రెండ్‌షిప్
బంగారం
బాల
బాస్
బుల్లెబ్బాయ్
బొమ్మరిల్లు
బ్రహ్మాస్త్రం
భాగ్యలక్ష్మి బంపర్‌డ్రా
మకరజ్యోతి మహిమలు
మనసు పలికే మౌనరాగం
మనోడు
మాయాజాలం
మాయాబజార్
మా యిద్దరి మధ్య



ముళ్లకిరీటం
రణం
రాఖీ
రాజాబాబు
రామ్
రామాలయంవీధిలో
బాలు-
మధుమతి
రారాజు
రూమ్‌మేట్స్
లక్ష్మి
వాళ్లిద్దరి వయస్సు పదహారే
విక్రమార్కుడు
వీధి
వీరభద్ర
శంకర్
శబ్దం
శివకాశి
శ్రీకృష్ణ 2006
శ్రీ నిలయం
శ్రీను కేరాఫ్ అను
శ్రీరామదాసు
షాక్
సంభవామి యుగేయుగే
సక్సెస్
సమ్‌థింగ్ స్పెషల్
సరదా సరదాగా
సర్దార్ పాపన్న
సామాన్యుడు
సారీ...ప్లీజ్... థాంక్స్
సీతాకోక చిలుక
సీతారాముడు
సుందరానికి తొందరెక్కువ
సైనికుడు
స్టాలిన్
స్టైల్
హనుమంతుడు
హోప్
హ్యాపీ

## 2007 (82)

అతడెవరు?
అతిథి
అత్తిలి సత్తిబాబు ఎల్.కె.జి.
అనుమానాస్పదం
అల
అల్లరే అల్లరి
అల్లుళ్లు మజాకా
అశోక చక్రం
ఆట
ఆడవారిమాటలకు అర్థాలేవేరులే
ఆదివారం ఆడవాళ్లకు
సెలవు
ఆపరేషన్ దుర్యోధన
ఆరోజే.. (కథ మొదలైంది)
ఎంతవారలైనా
ఎవడైతే నాకేంటి
ఒక్కడున్నాడు
కొత్తకథ
క్లాస్‌మేట్స్
గుండమ్మగారి మనవడు
గొడవ
చందమామ
చంద్రహాస్
చిరుత
జగడం
జులాయి
జ్ఞాపకం
టక్కరి
టాస్
డి.టి.యస్.
ఢీ
తులసి
దుబాయ్ శీను
దేశముదురు
నవ వసంతం
నాకు కావలసింది
నిండు పౌర్ణమి
నిక్కీ & నీరజ్
నీ నవ్వేచాలు
నేటి మహాత్మ
నోట్‌బుక్
పగలే వెన్నెల
పెళ్లైంది కానీ
పోరంబోకు
ప్రేమ్
ప్రేమిస్తే ప్రాణమిస్తా
బహుమతి
4బాయ్స్
బాయ్స్ & గర్ల్స్
భజంత్రీలు
భూకైలాస్(ఎకరం యాభైకోట్లు)
బ్రహ్మ
మంత్ర
మధుమాసం
మహారథి
మున్నా
మైసమ్మ, ఐ.పి.యస్.
యమగోల
యమదొంగ
యోగి
రాంగోపాలవర్మ
రాజుబాయ్
రైల్వేగేట్
లక్ష్మి కళ్యాణం
లక్ష్యం
లైలామజ్ను
విజయదశమి

వియ్యాలవారి కయ్యాలు
విహారి
వేగం
వేడుక
శంకరదాదా జిందాబాద్
శ్రీమహాలక్ష్మి
శ్రీసత్యనారాయణస్వామి
షిర్డీ
సంధ్య
సత్యభామ
సన్నీ
సీమశాస్త్రి
స్టేట్‌రౌడీ
స్టుడెంట్
హలోప్రేమిస్తారా
హ్యాపీడేస్

**2008 (145)**

అంకిత్,పల్లవి అండ్ ఫ్రెండ్స్
అంకుశం
అందమైన అబద్ధం
అందమైన మనసులో
అదృశ్యం
అధ్యక్షా
అప్పుచేసి పప్పుకూడు
అబ్బో ఆడవాళ్లు
ఆంధ్రా అందగాడు
ఆఖరి యుద్ధం
ఆటాడిస్తా
ఆదివిష్ణు
అష్టాచెమ్మా
ఆపద మొక్కులవాడు
ఆమె చాలా హాట్ గురూ
ఆవకాయ బిర్యాని
ఆలయం
ఇంద్రజిత్
ఇంద్రాణి
ఇట్లు నీ వెన్నెల
ఇదీ సంగతి
ఉల్లాసంగా ఉత్సాహంగా
ఎ.బి.సి.డి.
ఎర్రగులాబీ
ఎర్ర సముద్రం
ఏక్ పోలీస్
ఏక లవ్యుడు
ఒంటరి
ఒక్క మగాడు
ఒన్
కంత్రి
కథానాయకుడు
కాలేజ్ డేస్
కాలేజ్ డేస్ టు మారేజ్ డేస్
కాశీపట్నం చూడరబాబూ
కాళిదాసు
కింగ్
కుబేరులు
కుర్‌కురే
కృషి
కృష్ణ
కృష్ణార్జున
కేక
కొంచెం కొత్తగా
కొత్త బంగారులోకం
కోరికలే గుర్రాలైతే
కౌసల్యాసుప్రజారామ
గజిబిజి
గజేంద్ర
గమ్యం
గిలిగింతలు
గీత
గుండె జల్లుమంది
గోరింటాకు
గౌతమబుద్ధ
ఘటోత్కచుడు
చింతకాయలరవి
చెడుగుడు
జల్సారాణి
జాన్ అప్పారావ్ 40ప్లస్
జాబిలమ్మ
జింబో-2
టెర్రర్
తమాషా (చూద్దాం రండి)
త్రీ
దశావతారం
దీపావళి
దేవరకొండ వీరయ్య
దొంగల బండి
ధ్యేయం
నగరం
నచ్చావులే
నా అనేవాడు
నా పంచప్రాణం
నిషా
నిన్న నేడు రేపు
నీ సుఖమే నే కోరుతున్నా
నెం :1 హీరో
నేను మీకు తెలుసా
నేనింతే
న్యాయం కావాలి
పరుగు
పాండురంగడు
పార్థు
పెళ్లికాని ప్రసాద్
పోలీస్ ఎంక్వయిరీ
పౌరుడు
ప్రేమ
ప్రేమాభిషేకం
ఫ్రెండ్స్ కాలనీ



బతుకమ్మ
బలాదూర్
బుజ్జిగాడు మేడిన్ చెన్నై
బొమ్మనబ్రదర్స్ చందన సిస్టర్స్
బ్రహ్మానందం డ్రామా కంపెనీ
బ్లాక్ అండ్ వైట్
బ్లేడ్ బాబ్జీ
భద్రాద్రి
భలే దొంగలు
భైరవి
మంగతాయారు టిఫిన్ సెంటర్
మంత్రకన్య
మల్లెపువ్వు
మహాయజ్ఞం
మా అల్లుడు లవంగమ్
మా ఆయన చంటి
పిల్లవాడు
మిస్టర్ మేధావి
ముద్దాయి
ముహూర్తం
మైకేల్ మదన కామరాజు
మ్యాన్
యువత
రక్ష
రాజా
రెడీ
రెయిన్‌బో
లక్ష్మీపుత్రుడు
వందకోట్లు
వాలంటైన్
వాన
విక్టరీ
విజయ, ఐ.పి.యస్.
వినాయకుడు
విశాఖ ఎక్స్‌ప్రెస్
వీడు మామూలోడుకాదు
శౌర్యం
శ్రీసమ్మక్కసారక్కమహాత్మ్యం
సంగమం
స.రో.జ
సవాల్
సింధూరి
సిటీ లైఫ్
సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం
సుందరకాండ
సూర్య సన్ఆఫ్ కృష్ణన్
సెల్
సెల్యూట్
సోంబేరి
స్వాగతం
స్వామి, ఐ.పి.యస్.
హరేరామ్
హైవే
క్షుద్ర

**2009 (128)**

అంజనీ పుత్రుడు
అందరూ బాగుండాలి
అ...ఆ...ఇ...ఈ
(అతను-ఆమె-ఇంతలో ఈమె)
అడుగు
అధినేత
అద్భుత వైద్యం-ఆయుర్వేదం
అమరావతి
అరుంధతి
ఆంజనేయులు
ఆ యింట్లో
ఆ ఒక్కడు
ఆకాశమంత
ఆర్య-2
ఇందుమతి
ఈనాడు
ఈ వయసులో
ఉద్రేకం
ఊహాచిత్రం
ఎవరైనా ఎప్పుడైనా ప్రేమలో పడొచ్చు
ఏక్ నిరంజన్
ఏడుకొండలవాడా వెంకటరమణా
ఒరిజినల్
ఓయ్
కథ
కరెంట్
కలవరమాయె మదిలో
కావ్యాస్ డైరీ
కాస్కో
కిక్
కితకిత+క్రికెట్=కిర్‌కిట్
కుర్రాడు
కూతురు కోసం
కొంచెం యిష్టం కొంచెం కష్టం
గణేష్
గోపి గోపిక గోదావరి
జంక్షన్
జగద్గురు శ్రీషిర్డిసాయిబాబా
జగన్మోహిని
జల్లు
జయీభవ
జాజిమల్లి
జెంటిల్‌మేన్
జోష్
టార్గెట్
డీ అంటే డీ
16 డేస్
డైరీ
తాళికడితే 90 కోట్లు
దాదాగిరి
దుర్గి

దోషి
ద్రోణ
నచ్చావ్ అల్లుడూ
నల్లబ్బాయి తెల్లమ్మాయి
నా గర్ల్‌ఫ్రెండ్ బాగారిచ్
నా స్టైలే వేరు
నిజంగా నువ్వే గుర్తుకొస్తున్నావు
నిన్ను కలిశాక
నిర్ణయం (ఓ యువతి ప్రేమకథ)
నీ మనస్సు నాది
నీలో నాలో
నేనే ముఖ్యమంత్రినైతే
నేరము-శిక్ష
పదహారేళ్ల వయసు
పిస్తా
పుత్రుడు
పున్నమినాగు
పోలీసు అధికారి
ప్రయాణం
ప్రవరాఖ్యుడు
ప్రేమించే రోజులలో
ఫిటింగ్ మాస్టర్
బంగారుబాబు
బంపర్ ఆఫర్
బాణం
బిల్లా
బీభత్సం
బొమ్మలాట
బోణి
బ్యాంక్
భారత్‌మహాన్.కామ్
మంజీర
మగధీర
మనసు పిలిచింది
మనోరమ
మలుపు
మల్లన్న
మహాత్మ
మహానగరంలో చందు, శివ
మళ్లీమళ్లీ
మస్త్
మస్కా
మిత్రుడు
మిస్టర్ గిరీశం
ముద్దబంతి
మెంటల్ కృష్ణ
మేస్త్రి
మొండిమొగుళ్ల-పెంకిపెళ్లాలు
రాజావారి చేపల చెరువు
రాజు - మహరాజు
రాత్రి
రెచ్చిపో
రైడ్
రూ. 999
18-20 లవ్ స్టోరీ
లైఫ్ స్టైల్
వాడే కావాలి
విలేజ్‌లో వినాయకుడు
వెంకటాద్రి
వెంగమాంబ
వేట
శంఖం
శశిరేఖా పరిణయం
శుభం
శ్రీశైలం
ష్... ఇది చాల మంచి ఊరు
సత్యమేవ జయతే
సమర్థుడు
సలీమ్
సర్కస్ సర్కస్
సామ్రాజ్యం
సారాయి వీర్రాజు
సిద్ధం
సునామి 7 ఎక్స్
సొంతవూరు
సోల్జర్
స్వీట్‌హార్ట్
స్నేహితుడా..
హాలిడేస్

**2010 (106)**

అందరి బంధువయ
అది నువ్వే
అదుర్స్
అనగనగా ఒక అరణ్యం
ఆంటీ అంకుల్
నందగోపాల్
ఆకాశరామన్న
ఆరెంజ్
ఆలస్యం అమృతం
ఇంకోసారి
ఉడతా ఉడతా ఊచ్
ఏంపిల్లో.. ఏం పిల్లడో
ఏమాయ చేశావె
ఏమైంది ఈవేళ
1940లో ఒక గ్రామం
ఒక్కక్షణం
ఓంశాంతి
కత్తి
కత్తికాంతారావు
కర్మ
కలలు కనకే చెలియా
కలువ
కలెక్టర్‌గారి భార్య
కళవర్ కింగ్
కామెడీ ఎక్స్‌ప్రెస్
కారా మజాకా
కొమరంపులి
కొమరం భీమ్
కోతిమూక
ఖలేజా
గజ దొంగలు
గాయం-2
గుడుగుడు గుంజమ్
గోలీమార్
చలాకి
చేతిలో చెయ్యేసి
ఛాప్టర్-6
జాయ్
జోరు
ఝుమ్మంది నాదం
టిక్.. టిక్.. టిక్
డాన్ శీను
డార్లింగ్
తకిట.. తకిట
తను
తాజ్‌మహల్
తెలియదు
తేజం
దమ్మున్నోడు
దాసన్న
నమో వెంకటేశా
నాగవల్లి
నాన్‌స్టాప్
నేను వేణు సూరి శీను
పంచాక్షరి
పప్పు (మిస్టర్ ఇంటెలిజెన్స్)
పోలీస్ పోలీస్
ప్రతిరోజు
ప్రస్థానం
ప్రియమైన అంజలి
ప్రేమించిన కొత్తలో
బద్మాష్
బావ
బిందాస్
బురిడి
బృందావనం
బెట్టింగ్ బంగార్రాజు
బ్రహ్మలోకం టు
యమలోకం వయా భూలోకం
బ్రోకర్
భగీరథుడు
భీమిలి కబడ్డీ జట్టు
భైరవ
మనసారా
మరోచరిత్ర
మర్యాదరామన్న
మహేష్ ఖలేజా
మా అన్నయ్య బంగారం
మానాన్న చిరంజీవి
మాయాబజార్
మైనావతి
మౌనరాగం
యంగ్ ఇండియా
యాగం
యు & ఐ
యుగళగీతం
రంగది దొంగ
రక్తచరిత్ర
రక్తచరిత్ర-2
రగడ
రామ్‌దేవ్
రామరామకృష్ణకృష్ణ
రాంబాబు గాడిపెళ్లాం
లీడర్
లెనిన్
వరుడు
వీర తెలంగాణా
వేదం
శంభో శివ శంభో
శుభప్రదం
శ్రీమతి కళ్యాణం
సరదాగా కాసేపు
సాధ్యం
సారీ..మా ఆయన ఇంట్లోవున్నాడు
సింహా
సీతారాముల కళ్యాణం లంకలో
సై ఆట
స్నేహ గీతం
హాసిని
హైస్కూల్
హ్యాపీ హ్యాపీగా

---

గమనిక :
బ్రాకెట్స్‌లో యిచ్చింది
మొదటి చిత్రం / గుర్తింపు
తెచ్చిన చిత్రం.

అనుబంధం : 2

# సినిమాపాటల రచయితలు

**1931-39**

1 చందాల కేశవదాసు (భక్త ప్రహ్లాద)
2 బలిజేపల్లి లక్ష్మీకాంతం (లవకుశ)
3 చిలకమర్తి లక్ష్మీ నరసింహం (సక్కుబాయి)
4 దైతా గోపాలం (వరవిక్రయం)
5 పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి (ద్రౌపదీ వస్త్రాపహరణం)
6 దువ్వూరి రామిరెడ్డి (సతీ తులసి)
7 సముద్రాల రాఘవాచార్య (కనకతార)
8 కొసరాజు రాఘవయ్యాచౌదరి (రైతుబిడ్డ)
9 తాపీ ధర్మారావు (మోహినీ రుక్మాంగద)
10 మల్లాది విశ్వనాథ కవిరాజు (భక్త మార్కండేయ)
11 వారణాసి సీతారామశాస్త్రి (సీతా కల్యాణం)
12 వేదుల సత్యనారాయణశాస్త్రి (ప్రేమవిజయం)
13 త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి (విప్రనారాయణ)
14 యస్.సి.హెచ్. కృష్ణమాచార్యులు (కచ-దేవయాని)
15 ప్రఫుల్ల చంద్ర (విప్రనారాయణ)
16 స్థానం నరసింహారావు (శ్రీకృష్ణ తులాభారం)
17 అయ్యగారి బాపిరాజు శర్మ (సంపూర్ణరామాయణం)
18 బి.టి. రాఘవాచారి (బాలయోగిని)
19 స్థానాపతి సత్యనారాయణ శాస్త్రి (దశావతారములు)
20 చిత్రపు హనుమంతరావు (జయప్రద)
21 బుచ్చన్నశాస్త్రి (వేంకటేశ్వర మహాత్మ్యం)
22 విశ్వనాథం (వేంకటేశ్వర మహాత్మ్యం)
23 వెంకట్రామానాయుడు (రైతుబిడ్డ) (జమీన్ రైతు సంపాదకులు)
24 తుమ్మల సీతారామమూర్తి (రైతుబిడ్డ)

**1940-49**

1 పింగళి నాగేంద్రరావు (బలే పెళ్లి )
2 వెంపటి సదాశివబ్రహ్మం (తెనాలి రామకృష్ణ )



3 బాలాంత్రపు రజనీకాంతారావు (స్వర్గసీమ )
4 కాటూరి (మీరాబాయి )
5 కొప్పరపు సుబ్బారావు (చండిక )
6 వేలూరి శివరామశాస్త్రి (భోజకాళిదాసు )
7 తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి (విశ్వమోహిని )
8 శంకరంబాడి సుందరాచారి (దీనబంధు)
9 శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి (భక్త కబీరు )
10 నరసింహమెహతా (మనదేశం)
11 ఊటుకూరి సత్యనారాయణ (మాయామచ్చీంద్ర)
12 దుర్భా (సువర్ణమాల)
13 ప్రయాగ (బాలరాజు )
14 ఆదుర్తి సుబ్బారావు (మంగళసూత్రం)

**1950-59**

1 దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి (మల్లీశ్వరి)
2 శ్రీశ్రీ (నిర్దోషి )
3 ఆరుద్ర (బీదలపాట్లు )
4 ఆచార్య ఆత్రేయ (దీక్ష )
5 తోలేటి వెంకటరెడ్డి (అదృష్టదీపుడు)
6 సముద్రాల రామానుజాచార్య (సముద్రాల (జూ)) (బ్రతుకుతెరువు)
7 అనిసెట్టి సుబ్బారావు (రాజేశ్వరి)
8 రాజశ్రీ (ఆడపెత్తనం)
9 పాలగుమ్మి పద్మరాజు (భక్త అంబరీష)
10 రావూరు వెంకట సత్యనారాయణరావు (చక్రపాణి )
11 సుంకర (పల్లెటూరు)
12 వాసిరెడ్డి (పల్లెటూరు)
13 కొండముది గోపాలరాయశర్మ (శ్రీ లక్ష్మమ్మ కథ) (కె.జి.శర్మ - గోరాశర్మ)
14 జంపన (పతిభక్తి)
15 జి.కె.మూర్తి (సదారమ)
16 చెఱువు అంజనేయశాస్త్రి ("కార్తీక్")
17 వడ్డాది (బీదలపాట్లు )
18 కోపల్లి వెంకటరమణారావు (చంద్రవంక)

19 విశ్వనాథ సత్యనారాయణ (ఆకాశరాజు)
20 వేదాంతం లక్ష్మీకాంతకవి (మాయలమారి )
21 సుదర్శనాచార్య ఎన్.టి. (పెంకిపిల్ల)
22 మల్లాది రామకృష్ణ శాస్త్రి (చిన్నకోడలు )
23 గిడుతూరి సూర్యం (రాజేశ్వరి )
24 మల్లాది వెంకట కృష్ణశర్మ (పరదేశి )
25 ముద్దుకృష్ణ (పక్కింటి అమ్మాయి )
26 అయ్యపు వెంకట కృష్ణయ్య (పుట్టిల్లు )
27 యండమూరి సత్యనారాయణరావు (రోహిణి)
28 యడవల్లి లక్ష్మీనారాయణ (నా యిల్లు )
29 సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీ (లక్ష్మి )
30 ఆదినారాయణరావు (పల్లెటూరి పిల్ల)
31 కొండేపూడి లక్ష్మీనారాయణ (జ్యోతి )
32 కొనకళ్ల వెంకటరత్నం (అంతా మనవాళ్లే )
33 న్యాపతి రాఘవరావు (బాలానందం )
34 న్యాపతి కామేశ్వరి (బాలానందం )
35 పినిశెట్టి (బీదల ఆస్తి )
36 పరశురామ్ (నాగులచవితి)
37 ఆచార్య బి.వి.యల్.యన్. (చరణదాసి )
38 ఎరమాకుల ఆదిశేషారెడ్డి (భాగ్యరేఖ )
39 రామచంద్ (వద్దంటే పెళ్లి )
40 ఎల్లోరా (శోభ )
41 పి. వసంతకుమార్‌రెడ్డి (శోభ )
42 బి.యన్.చారి (వీరభాస్కరుడు )
43 జాషువా (వచ్చిన కోడలు నచ్చింది )
44 తాండ్ర సుబ్రహ్మణ్యం (సతీతులసి )
45 మహారథి (బాధర్ ) - (కూతురు కాపురం)
46 కామరాజు
47 కోగంటి గోపాలకృష్ణయ్య
48 గబ్బిట వెంకటరావు
49 నారపరెడ్డి (జయభేరి)
50 బైరాగి



**1960-69**

1 సి. నారాయణరెడ్డి (గులేబకావళి కథ )
2 దాశరథి (వాగ్దానం )
3 వీటూరి (స్వర్ణగౌరి )
4 మల్లెమాల (భార్య)
5 మైలవరపు గోపి (చిరంజీవి)
6 నార్ల చిరంజీవి (ఆరాధన)
7 ముళ్లపూడి వెంకటరమణ (ప్రేమించిచూడు)
8 యస్వీ భుజంగరాయశర్మ (రంగులరాట్నం)
9 అప్పలాచార్య (పొట్టిప్లీడరు)
10 కొంగర జగ్గయ్య (పదండి ముందుకు )
11 వక్కలంక లక్ష్మీపతిరావు (గొప్పవారి గోత్రాలు)
12 మస్నూరి కృష్ణమూర్తి (రమాసుందరి )
13 కోట సత్యరంగయ్య శాస్త్రి (బావామరదళ్లు)
14 కనకమేడల (విజయశంఖం)
15 వసంతాదేవి కె.జి. (విజయశంఖం)
16 వడ్లమాని పార్థసారథి (వ.పా.సా.) (గ్రామదేవతలు)
17 విద్వాన్ రాజశేఖర్ (జీవిత బంధం)
18 సరోజిని వి. (చిన్నారి పాపలు )
19 సి.యస్.రావు (మామకు తగ్గ కోడలు )
20 విశ్వప్రసాద్ (జగత్ కిలాడీలు )
21 ఉషశ్రీ
22 కొండమాచార్య
23 బొల్లిముంత శివరామకృష్ణ
24 ములుకుట్ల సుబ్రహ్మణ్యం
25 యు. విశ్వేశ్వరరావు
26 విద్వాన్ కణ్వశ్రీ
27 వేణుగోపాల్
28 శివరామయ్య
29 ఎ. వేణుగోపాలచార్యులు (అమాయకుడు)

**1970-79**

1 వేటూరి సుందరరామమూర్తి (ఓ సీతకథ )
2 దాసరి నారాయణరావు (మనుషులంతా ఒక్కటే )
3 జాలాది (పల్లెసీమ )
4 దాసం గోపాలకృష్ణ (చిల్లరకొట్టు చిట్టెమ్మ )
5 ఉషశ్రీ (మానవుడు - దానవుడు )
6 మోదుకూరి జాన్సన్ (మానవుడు-దానవుడు)
7 గణేష్‌పాత్రో (అల్లుడొచ్చాడు )
8 నాగభైరవ కోటేశ్వరరావు (గడుసు అమ్మాయి)
9 గుంటూరు శేషేంద్ర శర్మ (ముత్యాలముగ్గు )
10 జి. విజయరత్నం (కథానాయకురాలు)
11 వడ్డేపల్లి కృష్ణ (రచయిత్రి)
12 గొల్లపూడి మారుతీరావు (చల్ మోహనరంగా)
13 ఎమ్వీయల్ (ఇంటింటి రామాయణం)
14 చక్రవర్తి (సంగీత దర్శకుడు) (మల్లీపెళ్లి )
15 నల్ల రామ్మూర్తి (మెరుపు వీరుడు )
16 సి.వి. రమణ (మూగప్రేమ)
17 జి. రామారావు (అత్తను దిద్దిన కోడలు)
18 అంకిశ్రీ (జై జవాన్ - జై కిసాన్)
19 కొండవీటి వెంకటకవి
20 చిల్లర భావనారాయణ
21 బాలమురళీకృష్ణ
22 బి.వి.నరసింహారావు
23 మాగాపు అమ్మిరాజు
24 సత్యవాది
25 సికరాజు
26 దుత్తలూరి రామారావు (జగన్మోహిని)
27 నార్ల రామిరెడ్డి (కార్తీక దీపం)
28 శివ సాగర్



**1980-89**

1 సిరివెన్నెల సీతారామశాస్త్రి (సిరివెన్నెల)
2 వెన్నెలకంటి (శ్రీరామచంద్రుడు)
3 భువనచంద్ర (నాకూ పెళ్లాం కావాలి)
4 జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు (రౌడీపోలీస్)
5 సాహితి (కిలాడి కృష్ణుడు )
6 అదృష్ట దీపక్ (యువతరం కదిలింది )
7 రసరాజు (అల్లుడుగారు)
8 గురుచరణ్ (మాయింటికథ)
9 ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ (కృష్ణావతారం )
10 గద్దర్ (రంగులకల )
11 సాయి శ్రీహర్ష (సిరిపురం చిన్నోడు)
12 శ్రీ వేదవ్యాస (రంగవల్లి)
13 సుదర్శన భట్టాచార్య (జె.కె. భారవి) ( రంగవల్లి )
14 ఇ. సత్యనారాయణమూర్తి (సూపర్ బాయ్)
15 తాతినేని చలపతిరావు (యువతరం కదిలింది)
16 ఆచార్య తిరుమల (డప్పు సాయిగాడు )
17 ధవళ సత్యం (ఎర్రమల్లెలు )
18 ప్రభు (ఎర్రమల్లెలు)
19 వంగపండు ప్రసాదరావు (విప్లవ శంఖం )
20 విజయలక్ష్మి (విప్లవ శంఖం)
21 ఉపద్రష్ట సాయి (ఆలయశిఖరం )
22 గజ్జెల మల్లారెడ్డి (ప్రజాశక్తి )
23 గుండవరపు సుబ్బారావు (స్వరాజ్యం )
24 జ్యోతిర్మయి (మూడు ముళ్లు )
25 బళ్ల కిష్టస్వామి (నేటి భారతం )
26 భానూరి సత్యనారాయణ (నవోదయం )
27 శ్రీకాంత్ (ప్రజాశక్తి )
28 సత్యనారాయణ యస్వీ (ప్రజాశక్తి )
29 అంజయ్య (రంగులకల )
30 లక్ష్మీనారాయణ కె. (దేశంలో దొంగలు పడ్డారు )

31 సత్యమూర్తి (శ్రీమతి కావాలి )
32 నవతా కృష్ణంరాజు (సంసారం ఓ సంగీతం )
33 కె. విశ్వనాథ్ (స్వాతిముత్యం )
34 నాయని కృష్ణమూర్తి (మహర్షి)
35 ముళ్ళపూడి శాస్త్రి (అహ! నా పెళ్లంట)
36 ముప్పలనేని శివప్రసాద్ (రేపటిస్వరాజ్యం)
37 యస్పీ బాలసుబ్రహ్మణ్యం (పడమటి సంధ్యారాగం)
38 దేవవ్రత్ (సగటు మనిషి)
39 వంశీ (కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్ )
40 డా. సీతాదేవి (మాతెలుగుతల్లి)
41 వెలిదండ్ల శ్రీరామమూర్తి (మా తెలుగుతల్లి)
42 ఓంకార్ (పోలీసు భార్య)
43 డి. నారాయణవర్మ (పోలీసుభార్య )
44 డి.వి.వి.ఎస్. వర్మ (ఎర్రమట్టి )
45 మాడుగుల నాగఫణిశర్మ (సూత్రధారులు )
46 కళ్యాణరావు (తొలిపొద్దు)
47 పిళ్లాశ్రీ (ఎదురింటిమొగుడు - పక్కింటి పెళ్లాం )
48 మిక్కిలినేని జగదీష్ బాబు (నా పెళ్లాం నా ఇష్టం )
49 అడబాల
50 కంచర్ల మోహనరావు
51 కోపెల్ల శివరాం (గాలివాన)
52 చిమ్మపూడి శ్రీరామమూర్తి
53 దేవీప్రియ
54 ధారా రామనాథశాస్త్రి
55 నందిగామ గని
56 ప్రజాగని
57 పప్పు వేణుగోపాలరావు (నాలుగిళ్ల చావిడి)
58 బి.కె. ఈశ్వర్ (హృదయాంజలి)
59 మల్లిక్ (జనం - మనం)
60 వసంతకుమార్
61 శ్రీనివాసగాంధి (జడగంటలు)
62 సాయికృష్ణ యాచేంద్ర



**1990-99**

1 సుద్దాల అశోక్ తేజ (నమస్తే అన్న)
2 చంద్రబోస్ (తాజ్‌మహల్)
3 సామవేదం షణ్ముఖ శర్మ (పెదరాయుడు)
4 డా. వెనిగళ్ల రాంబాబు (ప్రేయసి రావే)
5 గోరటి వెంకన్న (ఎన్‌కౌంటర్)
6 శివగణేష్ (పల్నాటి పౌరుషం)
7 ఎ.ఎం. రత్నం (పెద్దరికం)
8 సింగీతం శ్రీనివాసరావు
9 పైడిపాల (డిటెక్టివ్ నారద)
10 కీరవాణి (ఆత్మబంధం)
11 ఘంటాడి కృష్ణ
12 తైదల బాపు
13 పెద్దాడ మూర్తి (కూతురు)
14 యస్.వి. రామారావు (శుక్రవారం మహాలక్ష్మి)
15 చిర్రావూరి విజయకుమార్ (ఖడ్గం)
16 శివశక్తి దత్తా (అర్ధాంగి)

**2000-2010**

1 కులశేఖర్ (చిత్రం)
2 అందెశ్రీ (గంగ)
3 భాస్కరభట్ల రవికుమార్ (గొప్పింటి అల్లుడు)
4 రామజోగయ్య శాస్త్రి (యువసేన)
5 వనమాలి (టైమ్)
6 అనంత శ్రీరామ్ (ఒక ఊరిలో)
7 త్రివిక్రమ శ్రీనివాస్ (ఒకరాజు - ఒకరాణి)
8 కందికొండ (ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం)
9 గంగోత్రి విశ్వనాథ్ (శుభలగ్నం)
10 పోతుల రవికిరణ్ (వాసు)
11 వరికుప్పల యాదగిరి (బ్యాచిలర్స్)
12 చైతన్య ప్రసాద్ (అల్లరి రాముడు)
13 శ్రీనివాస్ (డాడి)

14 బండారు దానయ్య (నువ్వుంటే చాలు)
15 చిన్ని చరణ్ (డాన్)
16 మెహర్ రమేష్ (కంత్రి)
17 బొమ్మకంటి (దొంగరాముడు అండ్ పార్టీ)
18 రాణి పులో మజాదేవి (బుల్లెబ్బాయ్)
19 ఆర్డియస్ ప్రకాష్ (థమ్)
20 సురేంద్ర కృష్ణ (తమ్ముడు)
21 ఉమా మహేశ్వర (సారాయి వీర్రాజు)
22 విశ్వ (అతడు)
23 బి.వి. రమణారెడ్డి (హాసిని)
24 సునీల్ కుమార్‌రెడ్డి (సొంతవూరు)
25 కిరణ్మయి (మిస్సింగ్)
26 మంగు బాలాజీ (ప్రయత్నం)
27 సాయి మాధవ్ (హైటెక్ స్టూడెంట్స్)
28 చంద్రసిద్ధార్థ్ (సంతోషం)
29 శ్రీకాంత్ అడ్డాల (కొత్తబంగారులోకం)
30 బి. శివకుమార్ (ఏడుకొండలవాడ వెంకటరమణ)
31 సురేష్ రాచర్ల (ఏడుకొండలవాడ వెంకటరమణ)
32 సాగర్ (సారీ, మా ఆయన ఇంట్లోవున్నాడు)
33 బాలభాస్కర్ (సారీ, మా ఆయన ఇంట్లోవున్నాడు)
34 రోహిత్ (సారీ, మా ఆయన ఇంట్లోవున్నాడు)
35 కోన వెంకట్ (ప్రేమతో)
36 బాలాదిత్య (ప్రేమికులు)
37 వెన్నెల శ్యామ్ ప్రకాష్ (స్ట్రీట్ బాయ్స్)
38 పైడిశెట్టి రామ్
39 కాసర్ల శ్యామ్
40 భారతీ బాబు (బాబి)
41 జయసూర్య
42 భాషాశ్రీ
43 బైసా
44 డా. పరిమి రామనరసింహం



45 మౌనశ్రీ మల్లిక్ (చేతిలో చెయ్యేసి)
46 శక్తి (బాబి)
47 కలువ కృష్ణ సాయి (మా పెళ్లికి రండి)
48 సదవే దేవేంద్ర (ఆరోప్రాణం)
49 పొందూరి
50 సిరాశ్రీ (స్నేహగీతం)
51 రాంభట్ల నృసింహ శర్మ (శుభప్రదం)
52 పి. సూర్యకుమారి (తొలిచూపులోనే)
53 ఏ.వి.యస్. (అంకుల్)
54 కొండముది అనూరాధ (పవన్ సుబ్బలక్ష్మి ప్రేమించుకున్నారట!)
55 పావని (పెళ్లికాని ప్రసాద్)
56 దేవా కట్టా (వెన్నెల)
57 ప్రవీణ్ లక్మే (సరదాగా కాస్సేపు)
58 సత్తి చక్రవర్తి (రెండేళ్ల తర్వాత)
59 అవినాష్ (వినాయకుడు)
60 బాలాజీ (ఆర్య-2)
61 కేదారినాథ్ (ఆర్య-2)
62 లక్ష్మీభూపాల్ (చందమామ)
63 సదా (రాత్రి)
64 మధు ఫల (మావిడాకులు)
65 నాగాచారి (కూతురు)
66 బలభద్రపాత్రుని రమణి (అలెక్స్)
67 అభినయ శ్రీనివాస్ (మావూరి మహర్షి)
68 జిల్లేళ్ల (రెయిన్ బో)
69 భీమ్స్ (ఆయుధం)
70 వరంగల్ శ్రీనివాస్ (ఆయుధం)
71 చందు (అసాధ్యుడు)
72 మధు (స్టయిల్)
73 వేల్పుల వెంకటేష్ (కూలీ)
74 పైడిపల్లి శ్రీనివాస్ (ధూల్)
75 ఉషారాణి (1940లో ఒక గ్రామం)

అనుబంధం : 3

# అందరిలో కొందరు



## చందాల కేశవదాసు

(20.6.1876 - 14.6.1956)

జన్మస్థలం ఖమ్మం జిల్లా జక్కేపల్లి. 'కనకతార' నాటకకర్తగా ప్రసిద్ధులు. 'భక్త ప్రహ్లాద', 'సతీ అనసూయ', 'లంకా దహనం' మొ॥ చిత్రాలకు పాటలు రాశారు. 'శ్రీకృష్ణతులాభారం' నాటకానికి రాసిన కొన్ని పాటలు అదే పేరుతో మూడుసార్లు తీసిన సినిమాల్లోనూ ఉపయోగింపబడ్డాయి.

తొలి తెలుగుటాకీలో పాటలు రాసిన మొదటి సినీకవి.

## బలిజేపల్లి లక్ష్మీకాంతం

(23.12.1881 - 30.06.1953)

జన్మస్థలం గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకా, ఇటికంపాడు.

'సత్యహరిశ్చంద్ర' నాటకకర్తగా ప్రసిద్ధులు'. 'కవితాకళానిధి' బిరుదాంకితులు. 'లవకుశ' 'మళ్లీపెళ్లి', 'భూకైలాస్', 'బాలనాగమ్మ' మొ॥ చిత్రాలకు పాటలు రాశారు.

సాహిత్య పరిమళంగల సినిమా పాటలు రాయడంలో ప్రథములు.







## తాపీ ధర్మారావు

(19.9.1887 - 8.5.1973)

స్వస్థలం బరంపురం. 'తాతాజీ' పేరుతో ప్రసిద్ధులు. విఖ్యాత పత్రికా సంపాదకులు, విమర్శకులు. 'మోహినీ రుక్మాంగద', 'మాలపిల్ల', 'ద్రోహి', 'కృష్ణప్రేమ' 'కీలుగుర్రం' మొ॥ చిత్రాలకు రచన చేసిన తొలితరం కవి. సుమారు 250 పాటలు రాశారు.

భాషాపరంగా భావపరంగా తెలుగు సినిమాపాటలో కొత్తదనం తీసుకొచ్చిన అభ్యుదయవాది.

## దైతా గోపాలం

(1900-1958)

స్వస్థలం కృష్ణా జిల్లా శ్రీకాకుళం శివారు పాపవినాశనం. 'సతీసక్కుబాయి' నాటకానికి రాసిన పాటల ద్వారా ప్రసిద్ధులై 'వరవిక్రయం' తో చిత్రరంగ ప్రవేశం చేసి అనేక చిత్రాలకు పాటలు రాశారు. 'సుమతి'లో 'నిన్న సాయంత్రమున..' అనే పాట శాస్త్రీయ నాట్యాలలోని 'పదముల'తో తుల తూగేది.

సంగీత సాహిత్య ప్రమాణాలతో రచించి, పాటల మీద ప్రజలకు ఆసక్తి కలిగించిన తొలితరం సినీకవులలో ప్రముఖులు.





## సముద్రాల

**(19.07.1902 - 16.03.1968)**

పూర్తిపేరు సముద్రాల వేంకట రాఘవాచార్య. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెదపులివర్రులో జన్మించారు. మూడు దశాబ్దాలపాటు చిత్రరంగంలో నిలిచి, సంఖ్యాపరంగా ఎక్కువ పాటలు రాసిన మొదటి సినీకవి. 'షావుకారు', 'దేవదాసు' 'విప్రనారాయణ', 'బ్రతుకు తెరువు' మొ॥నవి పేరు తెచ్చిన చిత్రాలు. ఆఖరి చిత్రం 'శ్రీరామకథ'.

సినిమాపాట ఒడుపుతెలిసి, దానికి ఆదరణను కలిగించి, 40ల దశకాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన తెలుగు సినీగేయ కులపతి.

## మల్లాది రామకృష్ణశాస్త్రి

**(17.06.1905 - 12.9.65)**

జన్మస్థలం కృష్ణాజిల్లా, మచిలీపట్నం

కథకులుగా సుప్రసిద్ధులు, సినిమా కవిగా నిరంకుశులు. 40ల దశకం నుంచీ సినిమా రంగంతో పరోక్షసంబంధం వున్న రచయిత. 'చిన్నకోడలు'తో ప్రారంభించి సుమారు 200 పాటలు రాశారు. 'రేచుక్క', 'చిరంజీవులు', 'కలిమిలేములు' మొ॥ ప్రసిద్ధ చిత్రాలు. చివరి చిత్రం 'వీరాంజనేయ'. ఈయన సినిమాపాటలు 'వినవేడుక' పేరుతో పుస్తక రూపంలో వచ్చాయి.

తెలుగుదనం తొణికిసలాడే భాష, సంపెంగలూ సన్నజాజులూ పరిమళించే జానుతెనుగు శైలి- ఈయన పాటల్లోని ప్రత్యేకత. భాషా ప్రయోగాలను అలవోకగా చేసిన కవి.







## పింగళి

**(29.12.1901 - 06.05.1971)**

స్వస్థలం విజయనగరం జిల్లా (ప్రస్తుతం) రాజాం. పూర్తిపేరు పింగళి నాగేంద్రరావు. 'వింధ్యరాణి' నాటక రచయిత. 'బలేపెళ్లి'తో సినిమాల్లో ప్రవేశించినా, 'పాతాళభైరవి'తో ప్రసిద్ధులయ్యారు. వాహినీ విజయా సంస్థల ఆస్థాన సినిమాకవి. 'మిస్సమ్మ', 'గుండమ్మ కథ', 'మాయాబజార్' మొ॥ ప్రసిద్ధ చిత్రాలు.

సరికొత్త పదప్రయోగాలతో మధురమైన సినిమాపాటలతో జనాన్ని అలరించి, 'లాహిరి'లో వైమరపించిన కవి. సినిమాపాటను వినడానికే కాక తిరిగి పాడుకోవడానికి వీలుగా సరళశైలిలో రాసిన కవి.

## కొసరాజు

**(23.6.1905 - 27.10.86)**

జన్మస్థలం గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చింతాయపాళెం.

పూర్తిపేరు కొసరాజు రాఘవయ్య చౌదరి. 'రైతుబిడ్డ' నుంచి 'గురుబ్రహ్మ' వరకు సుమారు 4 దశాబ్దాలపాటు సుమారు 900 పాటలు రాశారు. 'రోజులు మారాయి', 'పెద్ద మనుషులు' 'తోడికోడళ్లు', 'ఇల్లరికం' మొ॥ ప్రసిద్ధ చిత్రాలు.

గ్రామీణ రాజకీయ వాతావరణాలను మేళవించి సున్నితమైన వ్యంగ్యంతో జానపద బాణీలో సినిమాపాటలు రాయడంలో ఆద్యులు, ఆఢ్యులు.





## దేవులపల్లి కృష్ణశాస్త్రి

**(1.11.1897 - 24.2.1980)**

భావకవిత్వానికి ప్రతినిధిగా, 'ఆంధ్రా షెల్లీ'గా ప్రసిద్ధులైన కృష్ణశాస్త్రి మొదటి చిత్రం 'మల్లీశ్వరి'తోనే సినిమాపాటకు కావ్యగౌరవం తెచ్చిన కవిగా పేరు పొందారు. రాసిన సినిమాపాటల సంఖ్య 170. సినిమాపాటల సంకలనం (మేఘమాల) వచ్చిన మొదటి కవి.

లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. మృదుమధురమైన పదాలతో మనసున మల్లెలనూ, కన్నుల్లో వెన్నెల డోలలనూ ఊగించిన రసాత్మక గీతాలను రాసిన కవి.

## శ్రీశ్రీ

**(30.04.1910 - 15.6.83)**

స్వస్థలం విశాఖపట్నం. పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 'మహా ప్రస్థానం' కవిగా సుప్రసిద్ధులు. సినిమాల్లో రెండు దశాబ్దాలకు పైగా సుమారు వెయ్యి పాటలూ, పద్యాలూ రాశారు. 'శ్రీశ్రీ ప్రస్థాన త్రయం'లో అనువాద గీతాలతో సహా ఈయన రాసిన అన్ని సినిమాపాటలు అచ్చయ్యాయి.

సినిమాపాటల్లో విప్లవాత్మక ధోరణికి మార్గదర్శకులు. తెలుగు సినిమాల్లో అనువాద గీతాలు రాసిన, సినిమాపాటకు జాతీయ బహుమతిని అందుకొన్న - మొదటి కవి.







## ఆరుద్ర

**(31.8.1925 - 4.6.1998)**

స్వస్థలం విశాఖపట్నం. అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. అభ్యుదయ కవిగా, సమగ్రాంధ్ర సాహిత్య పరిశోధక రచయితగా ప్రసిద్ధులు.

'బీదలపాట్లు'తో సినీరంగ ప్రవేశం చేసి సుమారు 2500 పాటలూ, పద్యాలూ రాశారు. ఎంపిక చేసిన పాటలు 'కొండగాలితిరిగింది' పేరుతో సంకలనంగా వచ్చాయి. మరణానంతరం సినిమాపాటలన్నీ 5 సంపుటాలుగా వచ్చాయి.

సంప్రదాయంపట్ల అవగాహన, పాత్రోచితమైన భాష - ఈయన పాటల్లోని ప్రత్యేకత. ఆరుద్ర ముద్ర అంత్య ప్రాసలు.

## ఆత్రేయ

**(5.7.1921 - 13.9.89)**

జన్మస్థలం నెల్లూరు జిల్లా, సూళ్లూరు పేట తాలూకా, మంగళం పాడు.

అసలుపేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. నాటక రచయితగా ప్రసిద్ధులైన ఆత్రేయ 'దీక్ష'తో సినీరంగ ప్రవేశం చేసి 'ప్రేమయుద్ధం' వరకు సుమారు 4 దశాబ్దాల పాటు రమారమి 1400 పాటలు రాశారు. మరణించిన ఏడాదిలోగా మొత్తం పాటలు 'ఆత్రేయ సాహితి'లో (మనస్విని ప్రచురణ) భాగంగా 3 సంపుటాలుగా వచ్చాయి.

ఎంత బరువైన భావాలనైనా తేలికైన మాటలలో పొదిగి సినిమాపాటలను జనసామాన్యానికి చేరువగా తీసుకెళ్లి, తన పాటల్ని ప్రజల నోళ్లలో పలికించిన 'మనసుకవి'.





## దాశరథి
(22.07.1925 - 05.11.87)

పూర్తిపేరు దాశరథి కృష్ణమాచార్య. పుట్టిన వూరు వరంగల్ జిల్లా చిన గూడూరు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని పాడిన అభ్యుదయకవి. ఆంధ్రప్రదేశ్ కడపటి ఆస్థానకవి. 1961 నుంచి సుమారు 600 సినిమాపాటలు రాశారు. 'ఇద్దరు మిత్రులు' 'చదువుకొన్న అమ్మాయిలు', 'మూగ మనసులు', 'రంగులరాట్నం', 'కన్నెవయసు' మొ॥ ప్రసిద్ధచిత్రాలు.

సినిమాపాట సంగీతసాహిత్య ప్రధాన మైనదనీ, విన్నపుడు ఆనందం కలిగించడమే దాని పరమ ప్రయోజనమనీ నమ్మి, సుతి మెత్తని పదబంధాలతో అలా గుర్తుండే పాటలు రాసిన కవి.

## డా. సి. నారాయణరెడ్డి
(29.7.1931)

స్వగ్రామం కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల తాలూకా హనుమాన్‌జీ పేట. విద్యారంగంలో ఉన్నతపదవులధిష్ఠించిన తొలిసినిమాకవి. జ్ఞానపీఠ, పద్మభూషణ్ పురస్కార గ్రహీత. సినిమారచన ప్రవృత్తిగానే కొనసాగిస్తూ సుమారు 3వేల పాటలు రాశారు. ఎంపిక చేసిన సినిమాపాటలు 'పగలే వెన్నెల' పేరుతో సంకలనంగా వచ్చాయి. ఇటీవల 'పాటలో ఏముంది, నామాటలో ఏముంది' పేరుతో స్వీయ సినీగీత చరిత్రను 2 భాగాలుగా ప్రచురించారు.

సినిమాపాటను శ్రుతిహితంగా అలంకార సమన్వితంగా రూపొందించిన రసరమ్యగీతకర్త. భాషాపరంగా సినిమాపాట స్థాయి పెంచిన మొదటి కవి.







## వేటూరి సుందరరామమూర్తి
(29.1.1936 - 22.05.2010)

జన్మస్థలం కృష్ణాజిల్లా, దివి తాలూకా, పెదకళ్లేపల్లి.'ఓ సీతకథ' (1974) తో సినిమాపాటల రచనకు శ్రీకారం చుట్టారు.

తెలుగు సినిమాపాటకు జాతీయ బహు మతి నందుకోవడంలో ద్వితీయులు, 'రాశి' లోను 'వాసి' లోను తెలుగు సినిమాపాటల రచనలో అద్వితీయులు.

పాండిత్య నేపథ్యం, సంగీత పరిజ్ఞానం, స్వర పదమైత్రిమీద అవగాహన-పుష్కలంగా వున్న కవి. ఏరకమైన సినిమాపాటనైనా అవలీలగా రాస్తూ సినిమాపాటల్లో వైవిధ్యాన్ని పెంచిన ప్రతిభామూర్తి - యువసినీకవులకు స్ఫూర్తి!

## సిరివెన్నెల సీతారామశాస్త్రి
(20.5.1955)

స్వస్థలం అనకాపల్లి, అసలుపేరు చేంబోలు సీతారామశాస్త్రి. పూర్వాశ్రమం టెలిఫోన్ శాఖ. సిరివెన్నెల చిత్రంతో సినీగేయ రచన ఆరంభించి, మొదటిపాటకే నంది అవార్డు నందుకొని, అటుపై హాట్రిక్‌ను సాధించి.. తన నంది అవార్డుల అంకెను 'సంఖ్య' చేసిన నిర్విరామ కృషీవలుడు. ఇటీవల కొన్ని పాటలను 'సిరివెన్నెల తరంగాలు' 'నంది వర్ధనాలు' సంకలనాలుగా ప్రచురించారు.

పాటకు కవిత్వం ప్రాణమనీ, గేయ లక్షణం దేహమనీ - నమ్మే పరమ భావుకులు. అశ్లీలం అంటు లేకుండా పాటను శుచిగా రుచిగా వండి వడ్డించాలనే తపన గల కవి.



# సమీక్షలు - మ(మె)చ్చుతునకలు

## I తెలుగు సినిమాపాట (ముద్రణ-1992)

**1.** 'శ్రమ, శ్రద్ధ వుంటే చాలు చిటారి కొమ్మన మిఠాయి పొట్లం చేతి కందుతుంది' అన్న మల్లాది రామకృష్ణ శాస్త్రి వాక్యానికి రుజువీ పుస్తకం. తెలివితేటల ప్రదర్శనలు, నేల విడిచిన సాములు, తర్కానికి నిలువని బురిడీలు ఇందులో లేవు. తాను తెలుసుకున్నది సాఫీగా నలుగురికీ తెలియ చెప్పాలనుకున్న తపన వుంది. అది చివరికంటా చదివిస్తుంది. తెలియని ఎన్నో విషయాలను చక్కని ప్రాతిపదికపై గుదిగుచ్చి వాటి పూర్వాపరాలు తెలిపి వాటి క్రమాన్నీ, పరిణామాన్నీ మనసుకు హత్తుకొనేలా చేస్తుంది. సునిశితమైన బుద్ధి, సాహిత్య




శాస్త్రావగాహన, సాహిత్య పరిచయమూ పైడిపాల చెప్పిన మాటలకూ, చేసిన సిద్ధాంతాలకూ పునాదిరాళ్లు. సినిమా సంగీత పరిశ్రమలో ప్రతి ఒక్కరూ చదవదగ్గ పుస్తకం. సినిమా పాటంటే యిష్టమున్న ప్రతి శ్రోతకూ ఇది సినీ గీతగోవిందం.

-వి.ఎ.కె. రంగారావు
ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 13-20, జనవరి 1993

**2.** పైడిపాలగారు ఈ కృషిని చాలా నిజాయితీగా చేశారని పుస్తకం మొత్తం చదివితే తెలుస్తుంది. అంతేకాదు, విమర్శకులు, పాఠక మహాశయులు, తనను ఏ విషయాలలో ఆక్షేపించే అవకాశం వుందో ముందే పసికట్టి చివరి ప్రకరణంలో తన పరిశోధనాపరిధిని, తన వివరణల పరిమితినీ, తనే స్పష్టంగా చెప్పేశారు. పైడిపాలగారు చేసిన 'దశా'విభజన, వాటిని వివరించి, స్వభావం విశదం చేసిన తీరు, చరిత్రకు విధేయంగా వున్నాయి.

- ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ
ఆంధ్రజ్యోతి డైలీ, 30-11-1992

**3.** మద్రాసు యూనివర్శిటీకి, పి.హెచ్.డి పట్టా కోసం, 'పైడిపాల' సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఈ తెలుగు సినిమాపాట అనేది. అయితే సాధారణ సిద్ధాంత వ్యాసాల కన్నా విభిన్నంగా, ఎంతో ఆసక్తికరమైన శైలితో ఒక నవలలాగా సాగే ఈ విలక్షణమైన పుస్తకం అక్షరాస్యుడైన ప్రతి సినీగోయర్ చదవదగింది.



సినిమాపాటమీద అపూర్వమైన కృషి చేసి రూపొందించిన ఈ పుస్తకం అరవయేళ్ల తెలుగు సినిమాపాటకు అక్షరదర్పణం.

- సిరివెన్నెల సీతారామశాస్త్రి
విజయచిత్ర, నవంబర్-1992

**4.** ఒకప్పుడు రాజాస్థానాలకు, దేవస్థానాలకు మాత్రమే పరిమితమైన సంగీత, నృత్య సాహిత్యాలు ఇప్పుడు సామాన్యుడి ముంగిట్లో కొచ్చాయంటే అది ప్రధానంగా సినీరంగం చలవేనని చెప్పాలి. 'సామాన్యుడికి అందని ఏ కళయినా వ్యర్థం' అంటూ పైడిపాల తన సిద్ధాంతవ్యాసం 'తెలుగు సినిమాపాట'లో నవీన యుగస్ఫూర్తిని ప్రతిఫలించారు. 1931 నుంచి 1991వ సంవత్సరం వరకు వివిధ సాహిత్య ప్రభావాలు తెలుగుపాటను ఏ రకంగా మలిచాయో ఆసక్తికరంగా వివరించారు.

- ఎ.ఎ.వి. ప్రసాద్ (ప్రస్తుత సంపాదకులు)
ఇండియా టుడే, 6-20, డిశంబర్ 1992

**5.** అరవయ్యేళ్ల సినిమాపాటలో భాష, అలంకారాలు, సంక్షిప్తత, ప్రసన్నత, శైలి, ఛందస్సు మొదలైన విలువలు ఎప్పుడెప్పుడు ఎలా చోటు చేసుకుని పరిణామం చెందాయో, పరిమితులూ ప్రయోజనాలూ సినిమాపాటను ఎలా ఎలా ప్రభావితం చేశాయో, వీటన్నింటికీ అతీతంగా సినిమాపాట ఎక్కడెక్కడ స్వతంత్రమై విజృంభించిందో శాస్త్రీయపద్ధతిలో విశ్లేషించిన గ్రంథం యిది. తానెన్నుకున్న వస్తువు తన డిగ్రీకాంక్ష కంటే విశాలమైనదనే స్పృహ వెనుకంజ వేయిస్తున్నా, అనల్పమైన విషయసేకరణతో సహా నిర్భీకమైన విమర్శనాచాతురి ఇందులో రచయిత కృషిగా సాక్షాత్కరిస్తుంది.

- సత్యాపతి (భ.రా.గో)
రచన సచిత్ర మాసపత్రిక, డిశంబరు 1992.

**6.** మద్రాసు విశ్వవిద్యాలయానికి పేరు తెచ్చే సిద్ధాంత వ్యాసం యిది. మాన్యులూ, సామాన్యులూ అందరూ చదివేలా వ్రాయబడిన ఈ పుస్తకం- చదివితే 'సినిమాపాటలపై పరిశోధనా?' అని పెదవి విరిచేవారిలో సదభిప్రాయం ఏర్పడుతుంది. ఒక సామాన్య అంశాన్ని తీసుకొని ప్రామాణికంగా ఎలా రచించవచ్చో ఈ పుస్తకం వల్ల తెలుసుకోవచ్చు.

-డాక్టర్ ద్వా.నా. శాస్త్రి
ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 16-4-1993

7. కథ, నవల, నాటకాది తెలుగు కావ్యాలమీద కవితల మీదనే కాక రచయితల సాహిత్యం వ్యక్తిత్వం మీద కూడా అనేకులు అనేక విధాలుగా పరిశోధనలు జరిపి పి.హెచ్.డి. పట్టాలు పొందుతున్న ఈ రోజుల్లో 'పైడిపాల'గారు తన పరిశోధనకు 'తెలుగు సినిమాపాట'ను ఎన్నుకోవడమేకాక ఎంతో నేర్పుతో, ఓర్పుతో నెగ్గుకురావడం అభినందనీయమనడంలో ఏమాత్రం సందేహం లేదు.

-డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, సితార, 24-1-1993

## II తెలుగు సినిమాపాట చరిత్ర (ముద్రణ-2005)




1. ఇవాళ సినిమాపాటకున్న వ్యాప్తి ఇక దేనికీ లేదన్న సంగతి సర్వవిదితం. సినిమాపాట మీద, అందునా తెలుగు సినిమాపాటల మీద పరిశోధనగ్రంథం అంటే ఎంతటి విషయపరిజ్ఞానం అవసరమో, ఎన్ని కోణాలలో అవలోకించవలసి వుంటుందో, కావలసిన సమాచారాన్ని సేకరించడానికి ఎంతగా శ్రమించాల్సి వుంటుందో, దానిని అందరికీ అర్థమయ్యే రీతిలో ఆవిష్కరించడానికి ఇంకెంత ఆలోచించవలసి ఉంటుందో, చిత్తశుద్ధి వుంటే అది యెంతటి ఉత్కృష్ట కార్యాలను చేయిస్తుందో మొదలైన విషయాలన్నింటినీ అనుభవంలోనికి తెచ్చే (ఏకైక అన్నా తప్పులేదేమో) పుస్తకం పైడిపాల రాసిన 'తెలుగు సినిమాపాట చరిత్ర'.

సమగ్ర ఆంధ్ర సాహిత్యం పేరిట ఆరుద్ర వెలువరించిన సంపుటాలు చూసి పది విశ్వవిద్యాలయాలు చేయవలసిన పనిని ఒక్క ఆరుద్రే చేశారని అంతా మెచ్చుకున్నారు. అలాగే ఈ పుస్తకం మొత్తం చదివితే చిత్తశుద్ధి, పరిశోధనాసక్తి, తులనాత్మక విచక్షణ కలిగిన పదిమంది సినీ సంగీతాభిమానులు చేస్తే తప్ప సాధ్యం కాని పనిని పైడిపాల ఒక్కరే చేశారనిపిస్తుంది.

- రాజా (మ్యూజికాలజిస్ట్)

ఆదివారం ఆంధ్రజ్యోతి. 18-6-2006



2. డాక్టర్ పైడిపాల ఆలోచన విలక్షణం. పరిశీలన బహుముఖం. అందించే సమాచారం ఉపయుక్తం. గతంలో ఆచార్య ఆత్రేయ సాహిత్యాన్ని సంపుటీకరించిన కృషిలో కీలక పాత్ర పోషించి శభాష్ అన్పించుకున్నారు. నేడు తెలుగు సినిమాపాట చరిత్రను వీలయినంత (గతంలో కొందరు ఈ అంశంపై కొంతమేరకు విలువైనదే అందించారు) సమగ్రంగా విశ్లేషణాత్మకంగా గ్రంథస్థం చేశారు. ఇందులో పరిశోధన, శాస్త్రీయత, విశ్వసనీయతలున్నాయి. పాఠకులకు సరళంగా ఎరుకపర్చే స్పష్టమైన అవగాహన కల్గించాలన్న తపనతో అందించిన రచన ఇది.

మేధావుల బృందం, హంగులున్న సంస్థ చేపట్టదగిన పరిశోధనా కృషిని ఒక్క చేత్తో నిర్వర్తించిన రచయిత అభినందనీయులు, కృతజ్ఞతాపాత్రులు. ప్రామాణికమైన తులనాత్మక పరిశోధనే నిస్సందేహంగా. చదివిన గ్రంథాలను, సమాచారం అందించిన వ్యక్తులను సవినయంగా దాపరికం లేకుండా పేర్కొన్నారు. సమకాలీనులకు భావితరాలకు ఉపయోగపడగల సినిమాపాటపై సమాచారాత్మక విజ్ఞాన పాఠ్యగ్రంథం యిది.

- కోటీశ్వరి

ఆంధ్రభూమి వెన్నెల, 28-10-2005

3. పైడిపాల లేవదీసిన ప్రశ్నలు, ఇచ్చిన వివరణలు సినిమాపాట మీద ఇంతకాలంగా వున్న అభిప్రాయాలకు చక్కని సమాధానాలుగానే కనిపిస్తాయి. సినిమా ఒక వ్యాపార కళ అయినపుడు అందులో వి(క)నిపించే పాట వ్యాపారేతరం అవుతుందని ఎవరూ వాదించడం లేదు. అలా అని జనాన్ని కదిలిస్తున్న సినిమాపాటను, దాని ప్రాధాన్యాన్ని అందులోని కవిత్వాన్ని, లయని టోకున కొట్టి పారేయడం పరిశోధకుడు చెప్పినట్టు సబబు కాదు... మూడు నిమిషాల్లో జరిగే ఒక సమగ్ర రసావిష్కారమది. అందుకే 'ఎందులో తీసికట్టు?' అంటూ పరిశోధకుడు ప్రశ్నిస్తే వ్యతిరేకులకు జవాబు అంత తేలికేం కాదు. కవితకు గీటురాళ్ళు భాష, భావుకత, రసం ధ్వని, అలంకారం, ఛందస్సు వంటి అన్ని లక్షణాలు సినిమా పాటలో పుష్టిగా కనిపిస్తాయి. ఈ విషయాన్ని పైడిపాల సాధికారికంగా వివరించారు. ఎన్నో రసరమ్య గీతాలను తన వాదనకు ఆధారంగా చూపగలిగారు.

-డాక్టర్ గోపరాజు నారాయణరావు

నవ్య, 18-1-2006

**4.** సినిమాపాట చరిత్రకు చక్కని చిరునామా ఈ పుస్తకం. 'కొండని అద్దంలో చూపినట్టు తేలిగ్గా ప్రజలకర్థమయ్యే రీతిలో చెప్పడం వేమన పద్యాల తర్వాత సినిమాపాటకే సాధ్యమైంది (12)' అని రచయితే అన్నట్లు.. సినిమాపాటల చరిత్రని కూడా అంతే తేలిగ్గా అక్షరబద్ధం చేయడం డాక్టర్ పైడిపాల రచనా పాటవాన్నీ, నిశిత పరిశీలననీ, విమర్శనాత్మక దృష్టినీ వెల్లడి చేస్తుంది.

-డాక్టర్ మణిగోపాల్ (వనమాలి)

ఈనాడు, 20-11-2005

**5.** 'అరవయ్యేళ్ళ తెలుగు సినిమాపాట-పరిణామాలు ప్రభావాలు' గురించి పరిశోధించి డాక్టరేట్ పట్టం పొందిన పైడిపాల, ఆ పరిశోధన విశేషాలకు తెలుగు సినిమా పాట పేరుతో పుస్తక రూపాన్నిచ్చారు. అది జరిగిన పుష్కరకాలం తరువాత మళ్లీ యిప్పుడు 1992 నుండి యిప్పటి వరకు నడిచిన చరిత్రగా కొత్త అధ్యాయాన్ని జోడించి తెలుగు సినిమాపాట పేరుతో వెలువరించారు.

పుస్తకం చివరిలో 'ఈ రచన అసామాన్యంగా కాదు, సామాన్యంగా వుండడమే రచయిత అభీష్టం, ఆశయం!' అని ముగించారు. వారు కోరుకున్నది అదే అయితే వారి ఆశయం సిద్ధించినట్టే !

- ఓంకార్ (సినీరచయిత, దర్శకులు)

స్వాతి సపరివారపత్రిక, 7-10-2005




పద్మభూషణ్ శ్రీ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం బోధి వృక్షంగానూ, సినిమాలో బ్రతికేవారు, సినిమాతో బ్రతికేవారు చదివి దాచుకొనవలసిన ప్రైజ్ కలెక్షన్ గ్రంథంగానూ అభివర్ణించిన డా॥ పైడిపాల కలం నుండి ఇటీవల వెలువడిన మరో పరిశోధనాత్మక గ్రంథం

**తెలుగు సినీగేయకవుల చరిత్ర**

(వెల : 225 రూ.)

ప్రతులకు :

1. డా॥ పి.యస్.రెడ్డి
11-13, కొంకాపల్లి,
అమలాపురం-533 201
సెల్ : 99891 06162

2. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
1-4-435, విజ్ఞాన భవన్
బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్ &
విశాలాంధ్రవారి అన్ని శాఖలు

3. అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

# యస్.పి. బాల సుబ్రహ్మణ్యం

'సినిమాపాట పుట్టుపూర్వోత్తరాల గురించి పెద్ద రీసెర్చి ఏమిటి ? అదంత కష్టమైన విషయమా ? అసలు సినిమాపాట రాయటం, పాడటం పెద్ద విద్యా?' అనే విద్యాధికులకు నేను ఈ పుస్తకం గురించి ఏమి చెప్పినా, ఎంత చెప్పినా సహించదు. ఎందుకంటే నేను ఆ 'లొల్లాయి పాటలు' పాడి పొట్టపోసుకొనే వాణ్ణి గనుక.

క్లుప్తంగా చెప్పాలంటే నా వృత్తి జీవనంలో నేను సగర్వంగా చెప్పుకొనేట్టు చేసిన కొన్ని పనులలో ఈ పుస్తకానికి కొద్దో గొప్పో సహకరించడమనేది అతి ముఖ్యమైనది. 'మామూలు భావుణ్ణి' (ముళ్లపూడి వారికి ధన్యవాదాలు) నాకు మాత్రమే కాదు, మా సినిమాకు సంబంధించిన మహానుభావులకూ తెలియని, తెలుసుకోవాల్సినవి చాలా విషయాలు ఈ పుస్తకంలో వున్నాయి. అక్కర వున్న ప్రతి సినిమా ప్రేక్షకుడు చదవాల్సిన పుస్తకం అంటే అతిశయోక్తి కాదు.

సినిమా బ్రతికినంత కాలం వెల కట్టలేని ఈ పుస్తకం, ఈ రచయిత శ్రమా-జీవిస్తాయి.

